# మార్క్స్ ఎంగెల్స్

## ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామం 1857-1859



954.0317
మార్క్స్-ప్రథ
20314
20314

కార్ల్ మార్క్స్

ఫ్రెడరిక్ ఎంగెల్స్

# ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామం 1857-1859

"ప్రగతి" ప్రచురణాలయం

మాస్కో

అనువాదం: వుప్పల లక్ష్మణరావు

సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీకి చెందిన మార్క్సిజం-లెనినిజం ఇన్స్టిట్యూట్ 1959లో ప్రచురించిన "ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామం 1857–1859" రష్యన్ మాతృకకు ఇది అనువాదం. "New-York Daily Tribune"లో ప్రచురించబడిన వ్యాసాలు యథాతథంగా అనువదించబడ్డాయి. "New-York Daily Tribune" సంపాదకులు చేర్చిన కొన్ని వాక్యాలు వదిలివేయడం, అచ్చుపొరపాట్లు సవరించడం జరిగింది.

ప్రచురణకర్తలు

C.17067

К. Маркс, Ф. Энгельс
О НАЦИОНАЛЬНО-ОСВОБОДИТЕЛЬНОМ ВОССТАНИИ 1857–1859 гг. В ИНДИИ
*на языке телугу*

-500 044

Marx, Engels
THE FIRST INDIAN WAR OF INDEPENDENCE 1857-1859
*in Telugu*

UNIVERSITY OF HYDERABAD
Acc. No. 6652
Date ... 23
LIBRARY

ప్రథమ ముద్రణ 1966
ద్వితీయ ముద్రణ 1983
సోవియట్ యూనియన్‌లో ముద్రింపబడింది

$\text{МЭ}\frac{0101010000-465}{014(01)-83}$ 706—82

# విషయసూచిక*


ఉపోద్ఘాతం . . . . . . 7
ఇండియాలో బ్రిటిష్ పరిపాలన — మార్క్స్ . . . . . . 14
ఈస్ట్ ఇండియా కంపెనీ — దాని చరిత్ర, ఫలితాలు — మార్క్స్ . . . . . . 23
ఇండియాలో బ్రిటిష్ పరిపాలన భావి ఫలితాలు — మార్క్స్ . . . . . . 34
ఇండియా సైన్యంలో తిరుగుబాటు — మార్క్స్ . . . . . . 42
ఇండియాలో తిరుగుబాటు — మార్క్స్ . . . . . . 47
ఇండియా సమస్య — మార్క్స్ . . . . . . 52
ఇండియానుండి సమాచార లేఖలు — మార్క్స్ . . . . . . 59
ఇండియా తిరుగుబాటు పరిస్థితి — మార్క్స్ . . . . . . 63
ఇండియా తిరుగుబాటు — మార్క్స్ . . . . . . 68
యూరప్‌లో రాజకీయ పరిస్థితి — మార్క్స్ . . . . . . 73
*ఇండియాలో జరిగిన చిత్రహింసలపై దర్యాప్తు — మార్క్స్ . . . . . . 78
*ఇండియాలో తిరుగుబాటు — మార్క్స్ . . . . . . 86
*ఇండియాలో బ్రిటిష్ రాబడులు — మార్క్స్ . . . . . . 95
ఇండియాదేశపు తిరుగుబాటు — మార్క్స్ . . . . . . 100
*ఇండియాలో తిరుగుబాటు — మార్క్స్ . . . . . . 105
*ఇండియాలో తిరుగుబాటు — మార్క్స్ . . . . . . 111
*ఇండియాలో తిరుగుబాటు — మార్క్స్ . . . . . . 116


---

* సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీకి చెందిన మార్క్సిజం-లెనినిజం ఇన్‌స్టిట్యూట్ ఇచ్చిన వ్యాసశీర్షికలు నక్షత్రం గుర్తుతో సూచించబడ్డాయి. — సం.

*ఇండియాలో తిరుగుబాటు — మార్క్స్ . . . . 123
*ఢిల్లీ ఆక్రమణ — ఎంగెల్స్ . . . . 132
ముంచుకొస్తున్న ఇండియన్ రుణం — మార్క్స్ . . . . 140
విండ్‌హామ్ ఓటమి — ఎంగెల్స్ . . . . 145
లక్నో ఆక్రమణ — ఎంగెల్స్ . . . . 153
*లక్నోపై జరిగిన దాడి వివరాలు — ఎంగెల్స్ . . . . 161
అయోధ్యను కలిపివేసుకోవడం — మార్క్స్ . . . . 169
*లార్డ్ కానింగ్ ప్రకటన, ఇండియాలో భూమి అనుభవం — మార్క్స్ . . . . 177
*ఇండియాలో తిరుగుబాటు — ఎంగెల్స్ . . . . 182
*ఇండియాలో బ్రిటిష్ సైన్యం — ఎంగెల్స్ . . . . 185
*ఇండియాలో పన్నులు — మార్క్స్ . . . . 191
ఇండియన్ సైన్యం — ఎంగెల్స్ . . . . 198
ఇండియా బిల్లు — మార్క్స్ . . . . 204
*ఇండియాలో తిరుగుబాటు — ఎంగెల్స్ . . . . 209
''ఇండియా చరిత్రపై వివరణలు''నుండి — మార్క్స్ . . . . 215
ఉత్తర ప్రత్యుత్తరాలు . . . . 225
ఎంగెల్స్‌కి మార్క్స్: ఆగస్టు 15, 1857 . . . . 225
మార్క్స్‌కి ఎంగెల్స్: సెప్టెంబరు 24, 1857 . . . . 226
మార్క్స్‌కి ఎంగెల్స్: అక్టోబరు 29, 1857 . . . . 230
మార్క్స్‌కి ఎంగెల్స్: డిసెంబరు 31, 1857 . . . . 231
ఎంగెల్స్‌కి మార్క్స్: జనవరి 14, 1858 . . . . 233
ఎంగెల్స్‌కి మార్క్స్: ఏప్రిల్ 9, 1859 . . . . 234
వివరణలు . . . . 236
పేర్లసూచి . . . . 267
భౌగోళిక పేర్లసూచి . . . . 289

# ఉపోద్ఘాతం

1857–59ల్లో జరిగిన ఇండియా జాతీయ విముక్తి తిరుగుబాటుపై కార్ల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఎంగెల్స్‌లు "New-York Daily Tribune" పత్రికకోసం రాసిన వ్యాసాలే ఈ సంకలనంలో ప్రధాన భాగాన్ని అలంకరిస్తున్నాయి. తిరుగుబాటు ఆరంభం ముందు 1853లో ఇండియాలో వున్న పరిస్థితిపై మార్క్స్ రాసిన పత్రికావ్యాసాలు, ఆయన రచించిన "ఇండియా చరిత్రపై వివరణలు" అనే గ్రంథంనుండి కొన్ని ఉల్లేఖనలు, తిరుగుబాటు గురించి మార్క్సిజం స్థాపకుల ఉత్తరప్రత్యుత్తరాలలోని ముఖ్యమైన ఖండాలు కూడా ఈ సంకలనంలో చేర్చబడ్డాయి.

పెట్టుబడిదారీ దేశాల వలసవిధానంపట్లనూ, పీడిత జాతుల విముక్తి పోరాటంపట్లనూ పద్దెనిమిది వందల ఏభైల ప్రారంభంనుండీ కూడా మార్క్స్, ఎంగెల్స్‌లు విశేషాసక్తిని కనబర్చారు. ప్రాచ్యదేశాల చరిత్రనూ, ముఖ్యంగా ఆసియాఖండపు వలస, పరాధీన దేశాల చరిత్రనూ, అందులోనూ ప్రత్యేకంగా ఇండియా చైనా దేశాల చరిత్రనూ వారు అధ్యయనం చేశారు.

పెట్టుబడిదారీ రాజ్యాల ఆక్రమణ వలసవిధానానికి గురి అయిన ఈ బృహత్తర ఆసియా దేశాల రెండింటి చారిత్రక భవితవ్యంపై, ప్రప్రధానంగా శ్రామికవర్గ విముక్తి పోరాట దృక్పథంనుండి మార్క్స్, ఎంగెల్స్‌లు తమ దృష్టి ని సారించారు. పితృస్వామిక, ఫ్యూడల్ సంబంధాల విచ్ఛిత్తితోనూ, పెట్టుబడిదారీ విధానాభివృద్ధిలోకి ఇండియా చైనాల క్రమక్రమ పరివర్తనతోనూ ఈ దేశాలలో పక్వానికి వస్తూన్నట్టి విస్తృతవ్యాప్తమగు మార్పుల యొక్క విప్లవ తాకిడిని, రానున్న యూరపియన్ విప్లవంయొక్క భావిగతిపై ప్రభావాన్ని అనివార్యంగా నెరపబోయే ఒక నూతన ప్రధానాంశంగా వారు భావించారు. 1857 వసంతంలో ప్రజ్వరిల్లిన భారత తిరుగుబాటును అంతటి ఏకాగ్ర చిత్తంతో వారు ఎందుకు గమనించారో ఇప్పుడు మనకి అర్థమవుతూంది. ఆ తిరుగుబాటుకు కారణాలనూ, దాని ఓటమికి హేతు

వులమూ, తిరుగుబాటులో జరిగిన సంఘర్షణలమూ, దాని చారిత్రక ప్రాముఖ్యతనూ తమ వ్యాసాల్లో అతి విపులంగా వివరించుతూ, తిరుగుబాటులో సంభవించిన ముఖ్య ఘటనలన్నిటిపట్లా మార్క్స్, ఎంగెల్స్‌లు ప్రతిస్పందించారు. పద్దెనిమిది వందల ఏభైలలో ఇంచుమించు ఆసియా అంతటా విజృంభించుతూన్నట్టి, పీడిత జాతుల సాధారణ వలసవాద వ్యతిరేక విముక్తి పోరాటంలోని అవిభాజ్యమైన భాగంగానే వారి తిరుగుబాటును పరిగణించారు. అదే సంవత్సరాలలో యూరపు దేశాలలోనూ, అమెరికా సంయుక్త రాష్ట్రాలలోనూ సంభవించిన ప్రథమ ప్రపంచ ఆర్థిక సంక్షోభం కారణంగా యూరపియన్ విప్లవం చెలరేగి ఉండవలసినదనీ, అలా చెలరేగిన పక్షంలో ఆ విప్లవానికి భారతదేశంలోని తిరుగుబాటు సహాయకారి కాగలదనీ మార్క్స్ ఎంగెల్స్‌లు భావించారు.

ఈస్ట్ ఇండియా కంపెనీకి జారీచేసిన అనుజ్ఞాపత్రాన్ని 1853లో బ్రిటిష్ పార్లమెంటు పునఃపరిశీలన చేసిన సందర్భంలో మార్క్స్ రచించిన "ఇండియాలో బ్రిటిష్ పరిపాలన," "ఈస్ట్ ఇండియా కంపెనీ – దాని చరిత్ర, ఫలితాలు," "ఇండియాలో బ్రిటిష్ పరిపాలన భావిఫలితాలు" అనే పత్రికావ్యాసాలతో ఈ సంకలనం ఆరంభమవుతూంది. భారతచరిత్రపై రాయబడిన అనేక ప్రామాణిక గ్రంథాలను కూలంకషంగా అధ్యయనం చేసిన పిమ్మట రచించబడినట్టి ఈ వ్యాసాలు, వలసవిధానానికి మార్క్స్ బద్ధవ్యతిరేకతను సుస్పష్టంగా చిత్రిస్తున్నాయి. జాతీయ వలసవిధాన సమస్యపై ఆయన రాసిన అన్ని రచనలలోనూ ఉత్తమోత్తమ స్థానాన్ని అలంకరించుతున్నాయి. వాస్తవానికి 1857 తిరుగుబాటును అనివార్యమొనర్చినట్టి ఆర్థిక రాజకీయ పూర్వ పరిస్థితులను ఈ వ్యాసాలు బట్టబయలు చేస్తున్నాయి.

ఇంగ్లీషు వలసవాదులు భారతదేశంపై సాధించిన విజయాన్నీ, భారతదేశంపై మోపిన దాసత్వాన్నీ మార్క్స్ ఈ వ్యాసాలలో ప్రగాఢమైన శాస్త్రీయ విశ్లేషణకు లోను గావించుతూ, బ్రిటిష్ వలస పాలన, వలస దోపిడీ ధరించిన రూపవిధాన వైవిధ్యాలను గమనించాడు. భారతదేశాన్ని జయించడానికై వినియోగించబడిన ఒక పనిముట్టుగా ఈస్ట్ ఇండియా కంపెనీ పాత్రను మార్క్స్ బయటపెట్టుతూ, స్థానిక సంస్థానాధీశ్వరుల నడుమ చెలరేగుతూన్న ఫ్యూడల్ కలహాలనూ, భారతప్రజలలోని జాతి, మత, తెగ, వర్ణ వైషమ్యాలనూ తన ప్రయోజనాలకై ఉపయోగించుకొని ప్రజలను కొల్లగొట్టే బందిపోటు యుద్ధాలను సాగించి, తత్ఫలితంగా భారతదేశ భూభాగాలను అది కాజేసిందని ఆయన ఉద్ఘాటించుతాడు.

భారతదేశ ఆర్థికవ్యవస్థలో శాఖలకు శాఖలే సాంతమూ నశించిపోవడానికీ, బ్రహ్మాండమైనట్టీ, భాగ్యవంతమైనట్టీ, పురాతనమైనట్టి భారతదేశ ప్రజల నికృష్ట దారిద్ర్యానికీ – బ్రిటన్‌లోని అల్పసంఖ్యాక పాలకవర్గపు భోగభాగ్యాలకు ప్రధాన మూలాధారాలలో ఒకటైనట్టి – భారత దేశంయొక్క వలసదోపిడీయే కారణమని మార్క్స్ సహేతుకంగా నిరూపించు

తాడు. బ్రిటిష్ దురాక్రమణదారులు పబ్లిక్ వర్క్సును నిర్లక్ష్యం చేసి, తన్మూలంగా నీటిపారుదల సౌకర్యాలపై ఆధారపడినట్టి భారత వ్యవసాయంయొక్క వినాశానికి కారకుల య్యారని ఆయన పేర్కొంటాడు స్థానిక పరిశ్రమలను — అందులోనూ ముఖ్యంగా ఇండియా మార్కెట్లను ముంచెత్తుతున్న బ్రిటిష్ మాలుగుడ్డలతో పోటీకి తట్టుకోలేని చేనేత, వడకు నూలు పరిశ్రమలను — సర్వనాశనం చేయడంద్వారా వారు కోట్లకొలది భారతీయులను పస్తులపాల్జేశారు. పితృస్వామిక ఉమ్మడి భూస్వామ్య వ్యవస్థను వలస వాదులు విచ్ఛిన్నం గావించారు. అదే సమయంలో ఒకదాని తరువాత ఒకటిగా రెండు రకాల భూమిపన్ను విధానాలను — జమీందారీ, రైతువారీ విధానాలను — ప్రవేశపెట్టారు, ఇదిలా వుండగా ఆ దేశపు ప్రగతిశీలమైన అభివృద్ధిని కుంటుపరచి, భారతీయ రైతాంగానికి గుది బండగా తయారైనట్టి, భారత సామాజిక వ్యవస్థలోని అనేక ఫ్యూడల్ అవశేషాలను వారు పదిలపరచారు.

ఇండియాలోని బ్రిటిష్ అధికారులు రైతుపై దుర్భరమైన పన్నుల భారాన్ని మోపి, ఈవిధంగా స్థానిక ఫ్యూడల్ ప్రభువులు, వలసపాలన అనే ద్వివిధ శృంఖలాలతో రైతును బంధించి వేశారు. అపరిమితమైన పన్నుల భారం, ఈ పన్నులు వసూలు చేయబడే సందర్భంలో సర్వత్రా జరపబడే దౌర్జన్యమూ, పైశాచిక చిత్రహింసలూ భారతీయ రైతాంగం జీవితంలో అతి సాధారణమైపోతున్నాయని, 1853లో తాను రాసిన వ్యాసాలలోనూ, ఇండియాలో తిరుగుబాటుపై ధారావాహికంగా రాసిన వ్యాసాలలోనూ మార్క్స్ పేర్కొంటాడు. ఇండియాలో బ్రిటన్ ఆర్థిక విధానంలో చిత్రహింస సేంద్రియ భాగమని అధికారయుతంగా గుర్తించబడుతూ వచ్చింది (''ఇండియాలో జరిగిన చిత్రహింసలపై దర్యాప్తు,'' ''ఇండియాలో తిరుగుబాటు,'' ''ఇండియాలో పన్నులు'' మొదలైన వ్యాసాలు). అయినప్పటికీ, వసూలుచేయబడిన పన్నులలో ఎంతటి కొద్దిభాగమైనా కూడా ప్రపంచంలో ఇతర దేశాల్లోకంటె ఆసియాదేశాల్లో మరింతగా అవశ్యకమైనట్టి ప్రజాహిత నిర్మాణాల రూపంగా, ప్రజలకు తిరిగి ముట్టడం లేదని మార్క్స్ ఉద్ఘోషిస్తున్నాడు.

ఇండియాలో అక్రమంగా చొరబడినట్టి బ్రిటిష్ దురాక్రమణదారుల బందిపోటు రాజనీతి, అమానుషమైన వలస దోపిడీ విధానాలూ — ఇవే భారతదేశపు తిరుగుబాటుకు దోహదం చేశాయనే నిర్ధారణను మార్క్స్ తెల్పుతాడు.

తిరుగుబాటు పెచ్చరిల్లడానికి గల ప్రత్యక్షకారణాలు పంథొమ్మిదవ శతాబ్ది మధ్య కాలం నాటికి బ్రిటిష్ పరిపాలనకింద ఇండియాలో రూపొందుతూన్న మార్పులతో, అందులోనూ ప్రత్యేకంగా దేశీయ సైన్యంయొక్క విధులలో రూపొందుతూన్న మార్పులతో, పెనవేసుకొని పోయాయని మార్క్స్, ఎంగెల్స్‌లు నిరూపించారు. ''విభజించి పాలించు'' అనే సూత్రం బ్రిటిష్‌వారు భారతదేశాన్ని జయించేందుకూ, దాదాపు పెద్ద

ఉపద్రవాలు ఏవీ లేకుండా ఒకటిన్నర శతాబ్దంపాటు భారతదేశాన్ని పరిపాలించేందుకూ తోడ్పడినప్పటికీ, పంథొమ్మిదవ శతాబ్ది మధ్యకాలానికి బ్రిటన్‌యొక్క పరిపాలనా ప్రాబల్య పరిస్థితులలో గణనీయమైన మార్పు సంభవించిందని మార్క్స్ రాశాడు. అప్పటికి ఈస్ట్ ఇండియా కంపెనీ భారతదేశ భూభాగ ఆక్రమణలను పూర్తిచేసుకొని, ఏకైక విజేతగా దేశమంతటిలోనూ దృఢంగా స్థిరపడిపోయింది. భారత ప్రజలను అణచివుంచేందుకుగాను కంపెనీ దేశీయ సైన్యంపై ఆధారపడింది. దానితో ఆ సైన్యపు ప్రధాన కర్తవ్యం సైనిక పరిధినుంచి ఆక్రమిత జనాభాను అణచివుంచే పోలీసు విధులకు మారింది. ఇరవైకోట్ల జనసంఖ్యను లొంగదీయడానికి ఇంగ్లీషు ఆఫీసర్లను గలిగినట్టి రెండులక్షల దేశీయ సైన్యం వినియోగించబడుతోందనీ, ఈ దేశీయ సైన్యాన్ని నలభైవేల ఇంగ్లీషు సైన్యం అదుపాజ్ఞల్లో ఉంచుతూందనీ మార్క్స్ గమనించాడు. కాని దేశీయ సైన్యాన్ని సృష్టించడంతోనే, ఇండియాలో బ్రిటిష్ అధికారులు, "భారతదేశ ప్రజకు ఎన్నడూ లేనట్టి దేశవ్యాప్తమైన ప్రథమ సాధారణ ప్రతిఘటన కేంద్రాన్ని సృష్టించారు." (మా. ఈ సంకలనంలో పుట 43.) ఆకలితో అలమటించుతూ దోపిడీకి గురికాబడినట్టి రైతులచే సర్వవ్యాప్త తిరుగుబాటు ప్రప్రథమంగా ప్రారంభించబడకుండా, భారతీయ అగ్రవర్ణాలనుండే అత్యధిక సంఖ్యలో రిక్రూట్ కాబడి, మంచి జీతాలే ముట్టుతూ ప్రత్యేక సౌకర్యాలు కలిగిన సిపాయిలచేతనే—ఆంగ్లో-ఇండియన్ సేనలోని దేశీయ రెజిమెంట్ల సైనికుల, ఆఫీసర్లచేతనే—ప్రారంభించబడడానికి ఇదే కారణమని మార్క్స్ నిర్ధారణ చేశాడు. భారతదేశంలో తమకున్న బలం అంతా సిపాయి సేనలోనే ఉందని రూఢిగా నమ్మారు ఇంగ్లీషువారు; అటువంటిది అచ్చంగా ఈ సేనే తమకీనాడు ప్రధాన ప్రమాదకారణంగా తయారైందనే విషయాన్ని వారిప్పుడు హఠాత్తుగా తెలుసుకోవలసి వచ్చింది ("ఇండియానుండి సమాచార లేఖలు").

అయినప్పటికీ, సిపాయిలు కేవలం ఒక పనిముట్టే తప్ప అంతకంటె మరేమీ కారు అని మార్క్స్ నిరూపించుతాడు ("ఇండియా సమస్య"). దుర్భరమైన వలసపీడనకు వ్యతిరేకంగా పోరాటానికి పూనుకున్న భారతప్రజయే ఈ తిరుగుబాటుకు ప్రధాన చోదక శక్తి. ఈ తిరుగుబాటు కేవలమూ ఒక సాయుధ సిపాయి పితూరీ అనీ, భారతప్రజానీకంలో విస్తృత విభాగాలు దానిలో పాల్గొన్నాయన్న విషయాన్ని కప్పిపుచ్చడానికి చిత్రించే ప్రయత్నంలో బ్రిటిష్ పాలకవర్గాలు చేసిన బూటకపు వాదనలను మార్క్స్ ఎంగెల్స్‌లు పూర్వపక్షం చేశారు. ఇది జాతీయ తిరుగుబాటనీ, బ్రిటిష్ పరిపాలనకు వ్యతిరేకంగా భారత ప్రజల విప్లవమనీ ఈ ఉద్యమాన్ని రచయితలు మొదటినుండీ వర్ణించుతూ వచ్చారు ("ఇండియా సైన్యంలో తిరుగుబాటు," "ఇండియాలో తిరుగుబాటు" మొదలైన వ్యాసాలూ, "ఇండియా చరిత్రపై వివరణలూ"). వివిధమతస్థులనే కాకుండా (హిందువులనూ, మహమ్మదీయులనూ), వివిధ వర్ణాలనే కాకుండా (బ్రాహ్మణులనూ, రాజపుత్రులనూ, కొన్ని సందర్భాల్లో

సిక్కులనూ), వివిధ సామాజిక శ్రేణులనూ ఈ తిరుగుబాటు సన్నిహితపరచిందనే విష యాన్ని మార్క్స్, ఎంగెల్స్‌లు ప్రత్యేకంగా ఉద్ఘోషించుతున్నారు. "తమ యూరపియన్ ఆఫీసర్లను సిపాయి రెజిమెంట్లు చంపివేయడం ప్రప్రథమంగా ఇప్పుడే జరిగింది; హిందువులూ మహమ్మదీయులూ, పరస్పర వైషమ్యాలను విసర్జించి, తమ ఉమ్మడి ప్రభువులపై సమి ష్టిగా తిరుగబడడమూ; 'హిందువులలో ఆరంభమైన అల్లర్లు, ఢిల్లీ సింహాసనంపై మహమ్మదీయ చక్రవర్తిని వాస్తవంగా అధిష్ఠింపజేయడంతో తుట్టతుదకు అంతమొంద డమూ;' తిరుగుబాటు ఏకొద్ది ప్రాంతాలకో పరిమితమై ఉండకపోవడమూ" ఇప్పుడే ప్రప్రథమం అని మార్క్స్ రాశాడు. (చూ. ఈ సంకలనంలో పుట 43.)

ఈ తిరుగుబాటులో ప్రజా బాహుళ్యం పాల్గొన్నారనే విషయాన్ని పైకి పొక్కనివ్వ కుండా బ్రిటిష్ పత్రికలు తమ శాయశక్తులా తంటాలుపడినప్పటికీ, తిరుగుబాటుపట్ల భారత ప్రజలు సానుభూతిని కలిగి వుండడమే కాకుండా, తిరుగుబాటును సర్వవిధాలా బల పర్చారని తన తొలి వ్యాసాల్లో మార్క్స్ ఘంటాపథంగా ఉద్ఘాటించాడు. ఈ తిరుగుబాటులో ప్రజలలోని విశాలభాగాలు — అందులోనూ ముఖ్యంగా రైతాంగం — ప్రత్యక్షంగానో పరోక్షం గానో పాల్గొన్నాయని ఎవ్విధమైన సందేహానికీ తావులేకుండా "ఇండియా దేశపు తిరుగు బాటు" అనే తన వ్యాసంలో మార్క్స్ రుజావుపరచాడు. ఇంతటి బ్రహ్మాండమైన స్థాయిలో ఈ తిరుగుబాటు జరగడమూ, తమ సైన్యానికి అవసరమైన సరఫరాలనూ, రవాణా సదు పాయాలనూ సమకూర్చుకోవడంలో ఇంగ్లీషువారు ఎదుర్కొనవలసిన విపరీత కష్టనష్టాలూ భారతీయ రైతాంగంయొక్క ద్వేషభావాన్ని వేనోళ్ల చాటుతున్నాయని మార్క్స్ రాశాడు.

అప్పటికింకా స్వతంత్రంగా మిగిలి వున్న హిందూదేశ భూభాగాలను తమ రాజ్యంలో కలిపివేసుకోవడం ద్వారానూ, స్వదేశ సంస్థానాలకు చెందిన భూములను జప్తుచేయడం ద్వారానూ బ్రిటిష్‌వారు అవలంబించిన బలాత్కార విస్తరణ రాజనీతే తిరుగుబాటుకు ఒక తక్షణకారణమని "అయోధ్యను కలిపివేసుకోవడం," "లార్డ్ కానింగ్ ప్రకటన, ఇండియాలో భూమి అనుభవం" అనే వ్యాసాలలోనూ, తదితర వ్యాసాలలోనూ మార్క్స్ వొక్కివక్కా ణించాడు. ఈవిధంగా కలిపివేసుకోబడిన ప్రాంతాలలోని ప్రజానీకం దారుణ బాధలు అనుభవించారు. ఇండియాలోని ధనికవర్గాలలో అధిక భాగం తీవ్రమైన అవమానాలకు గురి అయింది. స్థానిక సంస్థానాధీశ్వరులతో తమకున్న సంబంధాల విషయంలో దశా బ్దులుగా పాటింపబడుతూ వచ్చిన ఒప్పందాలను బ్రిటిష్‌వారు మన్నింప నిరాకరించారు. అధికారయుతంగా గుర్తించిన ఒడంబడికలను కాదని భారత స్వతంత్ర సంస్థానాల భూభా గాలను వారు తమ రాజ్యంలో కలిపేసుకుంటూ వచ్చారు. ఇదిన్నీ, దీనితోపాటుగా, ఏ సంస్థా నాధీశుడైనా సంతానంలేకుండా చనిపోయినయెడల ఆ సంస్థానాన్ని ఆక్రమించుకోవడమూ భారతదేశ ఫ్యూడల్ భూస్వాములను ఆగ్రహపూరితులను గావించాయి.

తిరుగుబాటు కాలంలో భారతదేశపు బూర్జువావర్గంలో కూడా బ్రిటిష్ వ్యతిరేకతా భావం తీవ్రంగా చెలరేగింది; ఇండియా యుద్ధ రుణంకోసం ఈస్ట్ ఇండియా కంపెనీ కలకత్తాలో చేసిన ప్రయత్నాలన్నీ విఫలం గావడమే ఇందుకు తార్కాణం.

భారత ప్రజల విముక్తి పోరాటంపట్ల పరిపూర్ణ సానుభూతిని ప్రదర్శించిన మార్క్స్, ఎంగెల్స్‌లు, భారతదేశీయులలో, అందులోనూ ముఖ్యంగా దక్షిణ, మధ్య భారతదేశంలో, అన్ని శ్రేణులూ దానికి సర్వతోముఖమైన సహాయం అందించుతేనే తిరుగుబాటు విజయవంత మవుతుందని ఆశించారు. కాని, అట్టి సార్వత్రిక కార్యాచరణ సంభవించలేదు; అందుకు చారిత్రక కారణాలు అనేకం ఉన్నాయి; వీటిలో కొన్ని: భారతదేశపు ఫ్యూడల్ విభజన; జన సంఖ్యలోని తెగల వైవిధ్యం; ప్రజానీకంలో వున్న కులమత వైషమ్యాలూ; తిరుగుబాటుకు నాయకత్వం వహించిన స్థానిక ఫ్యూడల్ ప్రభువులలో అత్యధికసంఖ్యాకుల విశ్వాసఘాతుకం.

తిరుగుబాటుకు ఏకైక కేంద్రీకృత నాయకత్వమూ, ఒకేఒక సైనికాధికార కేంద్రమూ లేకపోవడం తిరుగుబాటు ఓటమికి ప్రధాన కారణాల్లో ఒకటని మార్క్స్, ఎంగెల్స్‌లు అభిప్రాయపడ్డారు. తిరుగుబాటుదార్ల శిబిరంలో పొడచూపిన అంతఃకలహమూ, భిన్నాభిప్రాయమూ కూడా ఓటమికి ఒక ప్రధాన కారణమైంది. సైనిక దృష్ట్యా తక్కువ బలాన్ని కలిగివుండడమూ, ఆయుధ సాధనసామగ్రిని పుష్కలంగా కలిగినట్టి యూరపియన్ సైన్యంతో తలపడి యుద్ధం చేయడానికి తగిన అనుభవం లేకపోవడమూ కూడా తిరుగుబాటు ఫలితం పైన వినాశకరంగా పనిచేశాయి. తిరుగుబాటుయొక్క ప్రధానమైన పద్ధతిలో స్థిరత్వం లేకపోయింది; దానితో సైనిక చర్యల విజయావకాశాలు సన్నగిలాయి; ఫలితంగా తిరుగు బాటుదార్ల గుండెనిబ్బరానికే ప్రమాదకరమైన దెబ్బ తగిలింది. అది తిరుగుబాటుదార్లలో గందరగోళాన్ని సృష్టించి, చివరకు వారి ఓటమికి దారితీసింది ("ఢిల్లీ ఆక్రమణ," "లక్నో ఆక్రమణ," "లక్నోపై జరిగిన దాడి వివరాలు"). ఐనప్పటికీ, ఎట్టి కష్టనష్టాల నైనా లెక్కచేయక తిరుగుబాటుదార్లు సాహసోపేతమైన యుద్ధాన్నే, అందులోనూ ముఖ్యంగా తిరుగుబాటుకు ప్రధాన కేంద్రాలైన ఢిల్లీ లక్నోలలో, సాగించారని మార్క్స్, ఎంగెల్స్‌లు పేర్కొన్నారు. ఢిల్లీని రక్షించుకోవడంలో వారు అపజయం పొందినప్పటికీ, ఎంగెల్స్ గమనించినట్టు, గెరిల్లా యుద్ధంలో వ్యక్తమయినట్టుగా సరాసరి యుద్ధంలో వ్యక్తముగానట్టి జాతీయ విప్లవశక్తియొక్క సంపూర్ణ పటిమను వారు ప్రదర్శించారు.

"నాగరిక" బ్రిటిష్ వలససైన్యానికి తీరని అప్రతిష్ఠ వాటిల్లేటట్టుగా దానిని వర్ణించుతూ, ఓటమిగాంచిన తిరుగుబాటుదార్లపట్ల ఆ సైన్యం చూపిన పాశవికత్వాన్నీ, ఆ సైన్యానికి వశమైన తిరుగుబాటుదార్ల పట్టణాలనూ, గ్రామాలనూ అది కొల్లగొట్ట డాన్నీ, తాము రాసిన వ్యాసాలనేకములలో మార్క్స్, ఎంగెల్స్‌లు సోదాహరణంగా వివరించారు.

భారతదేశంలో జరిగిన తిరుగుబాటుయొక్క చారిత్రక ప్రాముఖ్యతను అంచనా వేస్తూ,

భారతదేశంలో సాగుతున్న వలసవిధానాన్ని చెప్పుకోదగినంతగా అది మార్చలేకపోయినప్పటికీ వలసబానిసత్వంపట్ల భారతీయులకున్న సర్వవ్యాప్తమైన ద్వేషాన్ని అది బహిరంగంగా వ్యక్త పరచిందని, విముక్తి సాధనకై దానికిగల సామర్థ్యాన్నీ పట్టుదలనూ అది బహిర్గతం చేసిందని మార్క్స్ చూపాడు తాము అవలంబించిన వలసపాలన రూపాలలోనూ, విధానాలలోనూ ఏవో కొన్ని అయినా మార్పులు తీసుకువస్తేనే కాని వీలుపడదని బ్రిటిష్ వలసవాదులకు అది బలాత్కారంగా ఒక గుణపాఠం నేర్పింది. తాము కావించిన యితర మార్పులతోపాటుగా, భారత ప్రజాభిప్రాయాన్ని అవమానపరచిన రాజకీయ విధానాన్ని అవలంబించినట్టి ఈస్ట్ ఇండియా కంపెనీని వారు రద్దుచేశారు.

వలసబానిసత్వాన్నుండి భారతప్రజ తప్పక విముక్తి చెందుతారని, వలసవిధానానికి గర్భ శత్రువులైనట్టి మార్క్స్, ఎంగెల్స్‌లకు ఎల్లప్పుడూ దృఢమైన విశ్వాసం ఉండేది. విదేశ వలసవిధానాన్ని భారతీయులు అంతమొందించి, తమ దేశానికి తాము అధిపతులు కానంత వరకూ, బ్రిటిష్ పరిపాలనా ఫలితంగా భారతదేశంయొక్క ఉత్పాదక శక్తులు ఎంత అభి వృద్ధి చెందినప్పటికీ అవి పరిస్థితిని మెరుగుపరచలేవని మార్క్స్ చెప్పాడు. ఈ గమ్యాన్ని చేరుకోవడానికి రెండు మార్గాలున్నాయని మార్క్స్ అభిప్రాయపడ్డాడు – బ్రిటన్‌లో శ్రామిక వర్గ విప్లవం సంభవించడం, లేదా విదేశ వలసవాదులకు వ్యతిరేకంగా భారతీయులే తమ విముక్తి పోరాటాన్ని సాగించడం "గ్రేట్ బ్రిటన్‌లోనే నేడున్న పాలకవర్గాల స్థానాన్ని పారిశ్రామిక శ్రామికవర్గం ఆక్రమించుకొనే సమయం వస్తేనే తప్ప, లేదా ఇంగ్లీషువారి దాస్యశృంఖలాలను హైందవులు తమంతటతామే తుత్తునియలుగా తెంచివేసుకునే శక్తిని అభివృద్ధిచేసుకోగలిగే సమయం వస్తేనే తప్ప, తమ మధ్య అక్కడక్కడ చెదురుబదురుగా బ్రిటిష్ బూర్జువావర్గం వెదచల్లిన నూతన సాంఘిక బీజాల ఫలితాలను ఇండియన్లు అంతవరకూ అనుభవించలేరు" అని మార్క్స్ రాశాడు. (చూ. ఈ సంకలనం పుట 39–40.)

వలసవిధానంనుండి భారతదేశం విముక్తి పొందే విషయమై మహనీయుడైన శ్రామిక వర్గ నాయకుడు చెప్పిన జోస్యం వాస్తవమైంది. వలసవిధాన పీడనకు వ్యతిరేకంగా వజ్రసంకల్పంతో సాగించిన సుదీర్ఘపోరాటంలో భారతదేశం తన జాతీయ స్వాతంత్ర్యాన్ని సాధించుకుని, నేడు స్వతంత్ర జాతీయాభివృద్ధి పథంలో దృఢంగా కాలూనింది.

సోవియట్ యూనియన్
కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీకి
చెందిన మార్క్సిజం-లెనినిజం ఇన్‌స్టిట్యూట్

# మార్క్స్

# ఇండియాలో బ్రిటిష్ పరిపాలన

లండన్, శుక్రవారం, జూన్ 10, 1853

టర్కీ, సార్డీనియా, స్విట్జర్లెండ్ సమస్యలు[2] శాంతియుతంగా పరిష్కరించబడడం తథ్యమని అక్కడ భావించబడుతూన్నట్లు వియన్నానుండి అందిన తంతివార్తలు తెలియ జేస్తున్నాయి.

ఇండియాపై హౌస్ ఆఫ్ కామన్స్‌లో నిన్నరాత్రి జరిగిన చర్చ[3] యథాప్రకారంగానే అతి రసవిహీనంగా కొనసాగింది. సర్ చార్లెస్ వుడ్, సర్ జె. హాగ్ చెప్పిన కథనాలు ఆశాపూరిత మైన అసత్యాల్లాగా కనబడుతున్నాయని మిస్టర్ బ్లాకెట్ నిందమోపాడు. మంత్రుల పక్షానా, డైరెక్టర్ల[4] పక్షానా వకాల్తా పుచ్చుకున్న సభ్యులు చాలామంది ఈ నిందను తృణీకరిస్తూ తమ శక్తికొద్దీ మాట్లాడారు; పోతే ఇక అన్ని సందర్భాల్లోనూ ప్రత్యక్షమయ్యే మిస్టర్ హ్యూమ్ బిల్లును ఉపసంహరించుకోవలసిందని మంత్రులను కోరుతూ చర్చను సమీక్ష చేశాడు. చర్చ వాయిదా పడింది.

ఆల్ప్సు పర్వతాల బదులు హిమాలయా పర్వతాలూ, లొంబార్డీ మైదానాల బదులు బెంగాల్ మైదానాలూ, అప్పినైన్ కొండల బదులు డక్కన్ కనుమలూ, సిసిలీ ద్వీపం బదులు లంకాద్వీపం — ఈ విధంగా ఆసియా ఖండపు పరిమాణాలను గలిగిన ఇటలీదేశం హిందూస్థానం. భూమినుండి పండే భాగ్యవంతమైన వస్తువైవిధ్యమూ, రాజకీయ స్వరూపంలో నెలకొనివున్న ఛిన్నాభిన్న స్థితీ — రెండు దేశాల్లోనూ ఒక్కటే. ఏవిధంగానైతే, అప్పటప్పట విజేత బూనిన ఖడ్గంవల్ల వేర్వేరు జాతీయ ప్రజలకింద ఇటలీ కుంచించబడిందో, ఆవిధంగానే మహమ్మదీయుల, లేదా మొగలుల, లేదా బ్రిటిష్‌వారి ఒత్తిడిలేనప్పుడు హిందూ స్థానంలో ఎన్ని పట్టణాలు, పట్టణాలే కాదు, ఎన్ని గ్రామాలున్నాయో అన్ని పరస్పర శత్రుభావంగల స్వతంత్ర రాజ్యాలకింద విడిపోయుండడం మనం చూస్తాం. అయిన ప్పటికీ, సామాజిక దృష్ట్యా హిందూస్థానం, ఇటలీగాక, ప్రాగ్దేశపు ఐర్లండే. కాగా, ఈ ఇటలీ ఐర్లండుల వింత కలయికయొక్క భోగలాలస శోకపూరిత ప్రపంచాల

సమ్మేళనయొక్క బీజాలు, పురాతన హిందూస్థాన మతసంప్రదాయాలలోనే ఇమిడివున్నాయి. ఒకవైపు ఇంద్రియలోలత్వాతిశయం, మరొకవైపు ఈ శరీరాన్ని కఠోర చిత్రహింసల పాల్జేసే సన్యాసత్వం – ఈ విధంగా ద్విముఖమైనదా మతం: లింగాన్ని పూజించే మతం, అదే సమయంలో జగన్నాథరథాన్ని కొలిచే మతం; బైరాగీ, అదే సమయంలో వేశ్యా ఆరాధించే మతం.

హిందూస్థానం స్వర్ణయుగం అనుభవించిందని నమ్మేవారితో నేను ఏకీభవించను; అందుకు, సర్ చార్లెస్ వుడ్ చేసినట్టుగా, కులీ ఖాన్ ప్రమాణాన్ని నేను ప్రస్తావించనవసరం లేదు.[5] అందుకు బదులు, ఔరంగజేబ్ కాలం ఉదాహరణగా తీసుకుందాం; లేదంటే ఉత్తరాన మొగలులు అగుపడిన కాలం, దక్షిణాన పోర్చుగీసులు అగుపడిన కాలం; లేదా దక్షిణ భారతంలో మహమ్మదీయ దండయాత్ర, సప్తరాజ్యకూట[6] కాలం తీసుకుందాం; లేదా ఇంకా పురాతన కాలానికే మీకు వెళ్లాలనివుంటే, క్రిస్టియను మతం చెప్పిన ప్రపంచ సృష్టి కాలంకంటెనూ ఇంకా అతి పురాతన యుగంలోనే ఇండియాలో దారిద్ర్యదైన్యాల ప్రారంభం సంభవించిందని నమ్మే బ్రాహ్మణునియొక్క పౌరాణిక కాల క్రమణికనే ఉదాహరణగా తీసుకుందాం.

ఏది తీసుకున్నప్పటికీ గతకాలం అంతటిలోనూ హిందూస్థానం అనుభవించిన బాధలన్నిటికంటెనూ, బ్రిటిష్‌వారి చేతుల్లో హిందూస్థానం అనుభవించిన దారిద్ర్యదైన్యాలు మౌలికంగా వేరైనట్టి, చెప్పనలవికానంతటి అపారమైన తీవ్రతను కలిగిన మాదిరివని చెప్పడానికి ఎట్టి సందేహమూ లేదు. సల్‌సెట్ దేవాలయంలో మనను బెదరగొట్టేటట్టి రాక్షసాకృతిలోనున్న భగవత్స్వరూపాలకంటెనూ రాక్షసత్వసమ్మిళితమైన ఆసియా ఖండపు నిరంకుశత్వక్షేత్రంపై బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీచే నాటబడి వృద్ధిచెందినట్టి యూరప్ ఖండపు నిరంకుశత్వాన్ని గురించి నేను చెప్పడంలేదు. ఇది బ్రిటిష్ వలసపాలనకున్న విశిష్టగుణమేమీకాదు, కేవలం డచ్ వలసపాలనయొక్క అనుకరణే; అది కూడా ఎంత దగ్గర అనుకరణ అంటే, బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీయొక్క కార్యకలాపాల స్వభావాన్ని నిర్ణయించడానికి, పాత డచ్ ఈస్ట్ ఇండియా కంపెనీ గురించి జావాద్వీపపు ఇంగ్లీషు గవర్నరు సర్ స్టామ్‌ఫర్డ్ రాఫిల్స్ చెప్పిన మాటలు యథాతథంగా పునశ్చరణచేస్తే సరిపోతుంది.

> "తన ఎస్టేటులో పనిచేస్తున్న కూలిజట్టుపట్ల, మనుష్యరూపంలోవున్న ఆస్తిని డబ్బు చెల్లించి తాను కొన్న కారణంగా, పాతకాలపు వెస్ట్ ఇండియన్ తోట యజమాని చూపిన గౌరవమర్యాదలకంటెనూ, సహృదయతకంటెనూ, తాను డబ్బు చెల్లించ నక్కరలేకుండానే దొరకిన కారణంగా తన ప్రజను కనాకష్టంగా చూస్తు

స్తున్నట్టే, కేవలం లాభాపేక్షతోనే ప్రేరేపితమైనట్టే డచ్ కంపెనీ, తన ప్రజనుండి గోళ్ళూడగొట్టి ఎంతవరకు డబ్బు వసూలుచెయ్యడానికి వీలవుతుందో అంతవరకు వసూలుచేసి, వారి కాయకష్టంలో ఆఖరి బొట్టు కూడా పిండడానికై ఇప్పుడు అమలులోవున్న నిరంకుశ ప్రభుత్వ యంత్రాంగాన్నంతటినీ ఉపయోగించి, రాజకీయవేత్తలకు పరిపాటైన చాతుర్యంతోనూ, వర్తకులకు స్వాభావికమైన గుత్తాధిపత్య స్వార్థంతోనూ నడిపించుతూన్నట్టే, తమ చిత్తం ప్రకారం వ్యవహరించుతూ అర్ధకిరాతక రూపంలో వున్నట్టి ప్రభుత్వంయొక్క ఘోరాలను డచ్ కంపెనీ మరింత ఉధృత పరుస్తూంది."

అంతర్యుద్ధాలు, దండయాత్రలు, విప్లవాలు, దిగ్విజయాలు, కరువుకాటకాలు, ఒకదాని వెన్నంటి ఒకటి వరుసగా సంభవించే వీటన్నిటి ఫలితాలు హిందూస్థానంలో అపరిమితమైన క్లిష్టతను అత్యంత త్వరితగతిని కలిగి సర్వవిధ్వంసకరంగా కనబడినప్పటికీ, దాని ఉపరితలంకంటె ఏమాత్రమూ లోపలికి చొచ్చుకొనిపోలేదు. భారత సమాజ చట్రాన్నంతటినీ ఇంగ్లండు విచ్ఛిన్నం చేసింది; కాని ఆ సమాజ పునర్నిర్మాణ చిహ్నాలు ఇంతవరకు ఏమీ కనపడడమే లేదు. తన పురాతన ప్రపంచాన్ని కోల్పోయి, దాని స్థానే తనకు నూతన ప్రపంచం లభించకపోవడం హిందువుడిప్పుడు అనుభవించుతూన్న దారిద్ర్య దౌర్భాగ్యానికి ఒక విశిష్టమైన మనోవ్యాకులతను సంధింపజేసి, బ్రిటన్‌చే పరిపాలించబడిన హిందూస్థానాన్ని దాని పురాతన సంప్రదాయ సర్వస్వంనుండీ, దాని పూర్వచరిత్ర అంతటినుండీ వేరుపడిపోయేటట్లు చేస్తుంది.

అనాదినుండీ ఆసియాలో సాధారణంగా పరిపాలన వ్యవస్థలో ముఖ్యమైన మూడు శాఖలు ఉంటూండేవి: ఆర్థికశాఖ, అనగా దేశాన్ని దోపిడీ చేయడమూ; యుద్ధశాఖ, అనగా విదేశాలను దోపిడీచేయడమూ; యిక కడపటిది, పబ్లిక్ వర్క్స్ శాఖ. శీతోష్ణస్థితులూ, ప్రాదేశిక పరిస్థితులూ, అందులోనూ ముఖ్యంగా సహారానుండి, అరేబియా, పర్షియా, ఇండియా, తార్తారు దేశాలగుండా అత్యున్నతములైన ఆసియా పర్వత భూముల వరకూ వ్యాపించి వున్నట్టి బ్రహ్మాండములైన ఎడారి ప్రదేశాలు — మానవ నిర్మితములైన కాల్వలూ జలాధారాలవల్ల జరిగే సేద్యాన్నే ప్రాచ్యవ్యవసాయ విధానానికి ప్రాతిపదికగా నిర్ధరచాయి. ఈజిప్టు ఇండియాలలో లాగావే మెసొపొటేమియా, పర్షియా వగైరా దేశాలలో వరద ముంపులవల్లనే భూమిని ఫలవంతం చేయడం జరుగుతూంది; ఎత్తుగా వున్న మట్టాన్ని వినియోగించుకొని తద్వారా పంటకాల్వలకు నీరు పెట్టుకుంటున్నారు. నీటిని పొదుపుగానూ, ఉమ్మడిగానూ వాడుకోవలసిన ప్రధానావసరం పశ్చిమ దేశాలలో వ్యక్తిగత కృషిని, ఫ్లాండర్స్ ఇటలీలలోలాగా, స్వచ్ఛంద సహకార మార్గాన్వేషణకు ప్రేరేపిం

చింది; కాని నాగరిక స్థాయి తక్కువగానూ, ప్రాదేశిక విస్తీర్ణం అపరిమితంగానూ ఉన్న కారణాన స్వచ్ఛంద సహకారం రూపొందడానికి అవకాశంలేని ప్రాగ్దేశాలలో ప్రభుత్వ కేంద్రీకృత శక్తియొక్క జోక్యం అవసరమయింది. ఈ కారణంవల్ల, ఆసియా ప్రభుత్వాలన్నిటిపైనా పబ్లిక్ వర్క్సును నిర్వహించడమనే ఆర్థిక విధి ఒకటి పడింది. పాల్మైరా, పెట్రా, యెమెన్‌లోని శిథిలాలు, ఈజిప్టు, పర్షియా, హిందూస్థానాల్లో పెద్దపెద్ద భూభాగాలు ఒకప్పుడు మహోజ్వలమైన సస్యశ్యామల ప్రాంతాలుగా ఉండి నేడు ఉసర క్షేత్రాలుగా మనకు అగపడుతూన్న చిత్రమైన వాస్తవానికి, కేంద్రప్రభుత్వంపైనే ఆధారపడినట్టి, పంటకాల్వల, మురుగునీటి వసరులపట్ల ఎట్టి అశ్రద్ధ జరిగినప్పటికీ తక్షణమే క్షీణించి పోయేటట్టి, భూమిని సారవంతంచేసే ఈ కృత్రిమ విధానమే కారణమని తెలియజేస్తుంది; ఒకే ఒక విధ్వంసక యుద్ధం శతాబ్దాల పాటుగా ఒక దేశాన్ని నిర్జనం చేసేసి, దాని నాగరికతనంతటినీ ఎలాగు తుడిచిపెట్టేయగలదో ఈ విషయానికి కూడా ఇదే కారణమని తెలియజేస్తుంది.

ఇట్టి పరిస్థితులలో, గత పరిపాలకులనుండి ఈస్ట్ ఇండియా కంపెనీలోని బ్రిటిష్ వారు ఆర్థిక, యుద్ధ శాఖలను స్వీకరించారు, గాని పబ్లిక్ వర్క్స్ శాఖను మాత్రం పూర్తిగా అశ్రద్ధచేశారు. తత్ఫలితంగా laissez faire, laissez a er[7] అనే బ్రిటిష్ స్వేచ్ఛాపోటీ సూత్రంపై నిర్వహింప వీలువడని వ్యవసాయం క్షీణించడం సంభవించింది. అయినప్పటికీ ఆసియా సామ్రాజ్యాలలో ఒక ప్రభుత్వంకింద క్షీణించిపోయిన వ్యవసాయం మరొక ప్రభుత్వంకింద బాగుపడడాన్ని చూడడానికి మనం పూర్తిగా అలవాటుపడ్డాం. యూరప్‌లో అనుకూల, అననుకూల రుతువులపై పంటలు ఎలా ఆధారపడుంటాయో, ఆసియాలో అనుకూల, అననుకూల ప్రభుత్వాలపై పంటలు అలా ఆధారపడుంటాయి. ఈవిధంగా, హింసా పరిపాలన, వ్యవసాయంపట్ల అశ్రద్ధ తమంతట తాము దుష్ఫలితాలకు దారితీసేవే అయినప్పటికీ, ఆసియా చరిత్ర ఘటనలన్నింటిలోనూ కనివిని ఎరుగనంతటి నూతన విషయమై, పూర్తిగా భిన్న ప్రాముఖ్యతను కలిగినట్టి నూతన పరిస్థితి వీటికి జతకాకుండా వుండినపక్షంలో, పిలువనిపేరంటంగా వచ్చిన బ్రిటిష్‌వాడు భారతీయ సమాజంపై తీసిన చిట్టచివరి దెబ్బగా వీటిని పరిగణింప వలసిన అవసరంలేకపోయేది. భారతదేశపు గతచరిత్రయొక్క రాజకీయస్వభావం ఎంతగా మార్పుచెందుతూ వచ్చినట్లు కనిపించినప్పటికీ, చరిత్రపూర్వ యుగాలనుండి 19వ శతాబ్ది ప్రథమ దశాబ్దివరకూ భారతదేశపు సామాజిక పరిస్థితి ఎట్టి మార్పూ చెందకుండా యథాతథంగానే ఉండిపోయింది. మాలువడికే వారినీ సాలెవారినీ అశేషసంఖ్యలో నిరవధికంగా తయారుచేయగలిగినట్టి చేమగ్గమూ, వడకు రాట్నమూ ఆ సమాజ నిర్మాణానికి వెన్నెముకగా ఏర్పడ్డాయి. అనాది నుంచీ ఇండియన్ శ్రామికులు తయారుచేసిన అద్భుతమైన వస్త్రాలను యూరప్

దిగుమతి చేసుకొని, వాటికి బదులుగా తన విలువైన లోహాలను ఎగుమతి చేసేది. తద్వారా భారతీయ సమాజంలో అపరిత్యాజ్య సభ్యుడైన కంసాలికి ముడిసరుకు అవసరాలను తీరుస్తూ వుండేది. నగిషీపట్ల ఇండియన్ సమాజపు మక్కువ ఎంత ఎక్కువంటే, ఆ సమాజంలో అట్టడుగు శ్రేణికి చెంది, యించుమించు దిగంబరులుగా మసులుతూండేవారికి సైతం సర్వసాధారణంగా చెవులకు బంగారపు పోగులూ, మెడల్లో ఏదో ఒకరకమైన బంగారపు ఆభరణమూ వుంటుంది. వేళ్లకి ఉంగరాలు, కాళ్లకు మట్టెలు సర్వసాధారణమే; స్త్రీలు, పిల్లలు తరుచుగా లావుపాటి బంగారపు, అథవా వెండి మురుగులు ధరించుతూండేవారు; వెండి బంగారాలతో చేయబడిన దేవతావిగ్రహాలు ఇళ్లలో కనబడుతూండేవి. భారతదేశపు చేమగ్గాన్ని నాశనం చేసినదీ, వడకురాట్నాన్ని ధ్వంసం చేసినదీ దేశంలో చొరబడిన బ్రిటిష్ వాడే. యూరపియన్ మార్కెట్లనుండి హిందూదేశపు నూలుబట్టలను తరిమివేయడంతో ఇంగ్లండు ప్రారంభించింది; ఇదైన తరువాత హిందూస్థానానికి నూలు ఎగుమతి ప్రారంభించి, చివరకు పత్తికి పుట్టినిల్లయిన దేశాన్నే నూలువస్త్రాలతో ముంచేసింది. 1818 నుండి 1836వరకు ఇండియాకు గ్రేట్ బ్రిటన్ ఎగుమతిచేసిన నూలువరకులు 1:5,200 నిష్పత్తిలో పెరిగిపోయాయి. ఇండియాకు బ్రిటిష్ సన్ననూలు వస్త్రం ఎగుమతి 1824లో 10 లక్షల గజాలుండగా, 1837లో 6 కోట్ల 40 లక్షలకు మించింది. కాని అదే సమయంలో ఢక్కా జనసంఖ్య 1,50,000నుండి 20,000వరకూ తగ్గిపోయింది. వస్త్రం ఉత్పత్తికి ప్రసిద్ధికెక్కిన ఇండియాదేశపు పట్టణాలు ఈ విధంగా క్షీణించి పోవడం ఒక్కటే దుష్ఫలితమైయుంటే ఒక విధంగా వుండేది; కాని అంతకంటే ఘోరమైన దేమంటే, వ్యవసాయానికీ, చేతివృత్తి పరిశ్రమకీ ఉండే ఐక్యతను బ్రిటిష్ ఆవిరియంత్రమూ, బ్రిటిష్ విజ్ఞానశాస్త్రమూ హిందూస్థానం యావత్తు భూభాగంపైనుండీ పూర్తిగా పెకలించివేశాయి.

ఈ రెండు పరిస్థితులూ — ఒకవైపున, ప్రాచ్యప్రజలందరిలాగానే హిందూదేశస్థుడు కూడా తన వ్యవసాయ వాణిజ్యాలకు మూలకందమైనట్టి మహత్తరమైన పబ్లిక్ వర్క్సుపై శ్రద్ధ వహించే కార్యాన్ని కేంద్ర ప్రభుత్వానికే వదిలిపెట్టేసి, మరొకవైపున దేశమందంతటా సర్వత్రా చెదిరిపోయి, వ్యవసాయ, చేతివృత్తి పరిశ్రమలను తన ఇంటిలోనే ఐక్యం చేసుకొన్నట్టి చిన్నచిన్న కేంద్రాలను ఏర్పరచుకోవడము — ఈ రెండు పరిస్థితుల ఫలితంగా అనాదినుండి విశిష్ట లక్షణాలను కల్గినట్టి ఒక సామాజిక వ్యవస్థ — ఈ చిన్నచిన్న సంఘాలలో ప్రతిదానికీ దాని స్వతంత్ర నిర్మాణాన్నీ ప్రత్యేక జీవితాన్నీ నిలబెట్టుకొగలిగే "గ్రామ సంఘం" — రూపొందింది. ఇండియన్ వ్యవహారాలపై బ్రిటిష్ హౌస్ ఆఫ్ కామన్స్‌యొక్క అధికారయుతమైన పురాతన నివేదిక ఒకదానిలో ఉన్న ఈ కింది వర్ణన వల్ల ఈ వ్యవస్థయొక్క ప్రత్యేక స్వభావాన్ని మనం గ్రహించగలుగుతాం:

''భౌగోళిక దృష్ట్యా, కొన్ని వందల ఎకరాలుగాని, వెయ్యి ఎకరాల విస్తీర్ణం కలిగిన సాగుబడి భూములూ, బీడుభూములూ కలిసిన ఒక భూఖండం ఒక గ్రామంగా ఏర్పడుతుంది; రాజకీయ దృష్ట్యా, అది ఒక నిర్మాణయుత సంస్థను గానీ, ఒక నగర సంఘాన్ని గానీ పోలివుంటుంది. దానికి సూటిగా చెందినట్టి ఉద్యోగ, నౌకరీ సిబ్బందిని ఈవిధంగా వివరించి చెప్పవచ్చు: పటేలు అని పిలువబడే గ్రామపెద్ద; గ్రామ వ్యవహారాలపై మొత్తంగా అజమాయిషీచేస్తూ, గ్రామస్థుల తగవులు తీరుస్తూ, పోలీసు విధులను నిర్వహించుతూ, తన గ్రామస్థులపై తనకు వ్యక్తిగతంగా గల పలుకుబడివల్లనూ, గ్రామస్థులలో ప్రతివారి స్థితిగతుల గురించీ, వారి వ్యష్టి వ్యవహారాలూ అవసరాల గురించీ అతి సూక్ష్మంగా ఎరిగివుండడంవల్లనూ, గ్రామాదాయాన్ని వసూలు చేయగలిగే శక్తిసామర్థ్యాలు ప్రత్యేకంగా కలిగిన కారణాన గ్రామాదాయం వసూలుచేయడమూ అతని విధులు. కరణం వ్యవసాయపు లెక్కలు కట్టి, అందుకు సంబంధించిన అన్ని రిజిష్టర్లనూ రాసుకుంటాడు. తలయార్, తోటీ: వీరిలో మొదటివాని విధి నేరాలను దోషాలను గురించిన భోగట్టా సంపాదించడమూ, ఒక గ్రామంనుండి మరొక గ్రామానికి వెళ్లే వారికి తోడుగా ఉండి వారికి రక్షణ ఇవ్వడమూ; రెండవవాని విధులు కేవలం గ్రామానికి పరిమితమైనవిగా, అనగా ఇతర పనుల తోపాటుగా పంటలు కాపలాకాయడం, పంటలను అంచనావెయ్యడంలో సహాయం చేయడమూ ఇత్యాదులుగా ఉన్నట్టు కనబడుతూంది. గ్రామం ఎల్లలను సరిగా చూసుకుంటూ, తగాదాలలో ఎల్లలను గురించి సాక్ష్యాన్నిచ్చే సరిహద్దుల మనిషి. చెరువులు, నీటి కాల్వలపై అజమాయిషీచేస్తూ వ్యవసాయపు పనులకు నీటిని పంపకంచేసే మనిషి. గ్రామంలో పూజా విధులను నిర్వహించే బ్రాహ్మణుడు. గ్రామంలో వున్న పిల్లలచేత ఇసుకలో అక్షరాలు దిద్దించుతూ, చదవడం నేర్పుతూండగా కనబడినట్టి బడిపంతులు. పంచాంగంచెప్పే బ్రాహ్మణుడు, లేక జ్యోతిష్కుడు, వగైరాలు. గ్రామసిబ్బందిలో సాధారణంగా ఈ ఉద్యోగులూ, నౌకర్లూ ఉంటారు; దేశంలో కొన్ని భాగాల్లో ఇంతకంటె తక్కువ సిబ్బందే ఉంటుంది; కొన్ని చోట్ల ఒక మనిషే ఒకటి రెండు విధులు కలిపి చేస్తుండడమూ, మరికొన్ని చోట్ల ఇంతకంటె హెచ్చుమందే సిబ్బందిలో ఉండడమూ కద్దు. ఈవిధంగా సరళరూపంలో వున్న పౌరప్రభుత్వంకింద దేశప్రజలు అనాదిగా జీవిస్తూ వచ్చారు. గ్రామాల సరిహద్దులు ఇంచుమించు ఎప్పుడోగాని మారకుండా స్థిరంగానే ఉంటున్నాయి; పోతే గ్రామానికి హాని సంభవించి, ఒక్కొక్కప్పుడు యుద్ధాలు, కరువుకాటకాలు, జబ్బుల వల్ల గ్రామం పాడైపోయినా, అదే పేరుతో అవే సరిహద్దులతో అవే ప్రయోజనాలతో, అంతేకాకుండా అవే కుటుంబాలతో యు॥యుగాలనుండీ అవి వాటి

మనుగడ సాగించుకుంటూనే వస్తున్నాయి. రాజ్యాలు ఎలా విచ్ఛిన్నమయినా, ఎలా విడిపోయినా గ్రామస్థులు ఏవిధంగానూ పట్టించుకునే వారేకారు; గ్రామం చెక్కు చెదరకుండా ఉన్నంతకాలం ఏ రాజ్యానికింద అది మారినా, ఏ రాజుకి అది చెందినా వారికొకటే; దాని ఆంతరంగిక ఆర్థికవ్యవస్థలో ఎట్టి మార్పూ లేకుండా స్థిరంగా ఉంటుంది. పటేలే గ్రామ పెద్దగా వుంటూ, చిన్న జడ్జీగా, లేక మేజిస్ట్రేటు గానూ, గ్రామంయొక్క ఆదాయాన్ని వసూలు చేసే కలెక్టరుగా, లేక ఇజారాదారుగా ఉంటాడు."[8]

అచ్చుగుద్దినట్టు ఒకదానితో ఒకటి పోలిన ఈ సామాజిక నిర్మాణరూపాలు చాలా మటుకు విచ్ఛిన్నమయిపోయి, అంతరించిపోతున్నాయి; అయితే ఇందుకు కారణం బ్రిటిష్ వాడు కర్కశంగా పన్నులు వసూలుచేస్తూ గ్రామవ్యవహారాల్లో కలుగజేసుకుంటూన్న జోక్యం అంతగా కావేకాదు; ఇందుకు ముఖ్యకారణం ఇంగ్లీషు ఆవిరియంత్రమూ, ఇంగ్లీషు స్వేచ్ఛా వ్యాపారమే. చేనేత, రాట్నపునూలు, చేతితో సేద్యం, ఇవన్నీ వింతగా మిళితమైన గృహపరిశ్రమ ప్రాతిపదికపైనే ఈ కుటుంబ సంఘాలు ఏర్పడి వారికి స్వయంపోషక శక్తి నిచ్చాయి. ఇంగ్లీషువాడి జోక్యం, నూలు తయారుచేసేవాడిని లాంకషైరులోనూ, సాలెవానిని బెంగాలులోనూ ఉంచడంవల్లనూ, లేదా హిందూదేశపు నూలువడికేవారినీ, సాలెవారినీ తుడిచిపెట్టేయడంవల్లనూ, ఈ చిన్నచిన్న అర్ధ అనాగరిక, అర్ధనాగరిక సంఘాల ఆర్థిక పునాదులను విధ్వంసం చేసి తత్ఫలితంగా వాటిని విచ్ఛిన్నం గావించి, ఈవిధంగా బృహత్తరమైనట్టి, నిజం చెప్పాల్సొస్తే ఆసియా ఖండం తన మనుగడ అంతటిలోనూ ఎరిగిన ఏకైక సామాజిక విప్లవాన్ని తీసుకొచ్చింది.

ఈ సమయంలో, అసంఖ్యాకములైనట్టి శ్రమశీలమైన యీ పితృస్వామిక నిరపరాధ సామాజిక వ్యవస్థలు వాటి వ్యక్తిసభ్యులకింద విడిపోయి విచ్ఛిన్నమయిపోయి, దుఃఖసముద్రంలో అల్లాడుతూ, వాటి విడి సభ్యులు ఏకకాలంలో తమ నాగరికతయొక్క పురాతన రూపాన్నీ, అనువంశికంగా వస్తూన్న జీవనోపాధినీ కోల్పోవడమును కళ్లారా చూడడం మానవచిత్తానికి ఎంత విషాదకరంగా వున్నప్పటికీ, శాంతిపూరితములైన ఈ నిసర్గ గ్రామసంఘాలు, ఎంత హానిరహితమైనవిగా కనబడుతూన్నప్పటికీ, ప్రాగ్దేశపు నిరంకుశత్వానికి ఇవే ఎల్లప్పుడూ గట్టిపునాదులుగా ఏర్పడి వుండేవనీ, మానవమేధస్సును ఎంత స్వల్ప పరిమితులలో ఇమిడ్చి వుంచడానికి వీలవుతుందో అంత స్వల్ప పరిమితులలో ఇమిడ్చి ఉంచి, తత్ఫలితంగా మూఢ విశ్వాసాలయొక్క ప్రతిఘటనారహితమైన పనిముట్టుగా దానిని చేసివేసి, సంప్రదాయిక నిబంధనా శృంఖలాలతో బానిసగా కట్టిపడేసి, దానికున్న వైభవాన్నీ, చారిత్రాత్మక శక్తులనూ పోగొట్టుతూందన్న సంగతిని మనం మరిచిపోకూడదు. ఏ గొప్పదనమంతటి దార్ఢ్యా

గ్యపు మడిచెక్కపైనే తన ధ్యానమంతటినీ కేంద్రీకరించి, మహారాజ్యాల వినాశాన్నీ, అనిర్వచనీయములైన క్రౌర్యాల కొనసాగింపునూ, పెద్దపెద్ద పట్నాల జనసంఖ్య ఊచకోతనూ, ప్రకృతిసిద్ధఘటనలే అన్నట్లుగా వాటినిగూర్చి పట్టించుకోకుండా ఉదాసీనతతో నిశ్చింతగా చూచి ఊరుకుని, ఆ విషయాన్ని చూడ తటస్థించిన ఏ దురాక్రమణదారుని చేతిలోనైనా సరే నిస్సహాయస్థితిలోవున్న ఎరగా తానే చిక్కుకొనే అనాగరికస్వార్థాన్ని మనం మర్చిపోగూడదు. ఆత్మగౌరవహీనమైనట్టి, జడత్వాన్ని కలిగినట్టి, స్తంభించిపోయినట్టి జీవితం, ఈ సాత్వికమైన మనుగడ, రెండవవైపున, తనకు కేవలం విరుద్ధమైనట్టి కిరాతక, లక్ష్య రహిత, అపరిమిత వినాశకర శక్తులను పురికొల్పి, కేవలం నరహత్యనే హిందూస్థానంలో ఒక మతకాండగా పరిగణింపబడేటట్లు చేసివేసిందని మనం మర్చిపోగూడదు. ఈ చిన్నచిన్న గ్రామసంఘాలు కుల వివక్షతలతోనూ, బానిసత్వంతోనూ కల్మషపూరితములయాయనీ, పరిస్థితులపై మానవుడు సార్వభౌమాధిపత్యాన్ని వహించేటట్టి ఉన్నతస్థానాన్ని అధిష్ఠింపజేసే బదులు, మానవుణ్ణి బాహ్యపరిస్థితులకు లొంగిపోయేటట్లు చేసివేస్తున్నాయనీ, స్వయం క్రమాభివృద్ధిని పొందే సామాజిక స్థితిని నిర్వికారమైనట్టి ప్రకృతిసిద్ధ ఘటనగా మార్చివేసి, ఈవిధంగా పశుప్రాయం కావించే ప్రకృతి ఆరాధనను, ప్రకృతిపైన సార్వభౌముడైన మానవుడు వానరుడైన హనుమంతుని ఎదుటనూ, గోవు శబలి ఎదుటనూ భక్తితో మోకాళ్ల మీదపడి పూజించేటంతటి నీచస్థితికి మానవుణ్ణి దిగజార్చేశాయనే విషయాన్ని మనం మర్చిపోగూడదు.

హిందూస్థానంలో సామాజిక విప్లవం సంభవించేటట్లు చేయడంలో ఇంగ్లండు కేవలం పరమనీచమైనట్టి స్వార్థప్రయోజనాలనే దృష్టిలో పెట్టుకుందనడమూ, వాటిని అమలు జరిపే విధానంలో బుద్ధిమాంద్యాన్ని బైటబెట్టుకుందనడమూ నిజమే, కాని అది కాదు సమస్య. సమస్య ఏమిటంటే: ఆసియా సామాజిక వ్యవస్థలో మౌలికమైన విప్లవం జరగకుండా మానవాళి తన భవితవ్యాన్ని ఫలింపజేసుకోగలుగుతుందా? లేకుంటే, ఇంగ్లండు చేసిన నేరాలు ఎట్టివైనప్పటికీ ఈ విప్లవాన్ని సఫలీకృతం గావించడంలో తాను ఎరగకుండానే అది చరిత్రచేతుల్లో ఒక పనిముట్టుగా పనిచేసింది.

అలాంటప్పుడు, పురాతన ప్రపంచం శిథిలమైపోయే దృశ్యం వ్యక్తిగతంగా మన మనస్సుకు ఎంత విషాదాన్ని కలుగజేసినప్పటికీ, చరిత్రదృష్ట్యా, గ్యోతెతో కలిసి ఈ కింది వాక్యాలను ఉద్ఘోషించడానికి మనకి అధికారం లేకపోలేదు:

"Sollte diese Qual uns quälen
Da sie unsre Lust vermehrt,

No. ... 500 044.

Hat n cht Myr aden See en
T mur s Herrschaft aufgezehrt? *

మార్క్సుచే 1853 జూన్ 10న
రచించబడింది

"New-York Da y Tr bune"
1853 జూన్ 25న తేదీన
3804వ సంచికలో
ప్రచురించబడింది
సంతకం. కార్ల్ మార్క్సు

---

* ఈ వేదన అధికానందమయుమని
ఈ బాధ మనము వేధించ తగునా?
లెక్కకుమించిన మానవ ప్రాణాలను
తైమూర్ పాలన బలిగొనలేదా?"

(గ్యేతె విరచితమైన "ప్రతిచ్ప్రాగ్ పద్యమంజరి" కావ్యంలో 'జులైకా పేర" అనే పద్యం). — సం.

# మార్క్స్

# ఈస్ట్ ఇండియా కంపెనీ — దాని చరిత్ర, ఫలితాలు

లండన్, శుక్రవారం, జూన్ 24, 1853

ఇండియాకొరకు చట్టనిర్మాణం చెయ్యాలనే విషయం వాయిదావెయ్యాలని లార్డ్ స్టాన్లీ చేసిన ప్రతిపాదనపై చర్చ నేటి సాయంకాలంవరకూ వాయిదావేయబడింది. ఇండియా సమస్య మంత్రిత్వ సమస్యగా రూపొందడం, 1783నుండి ఈనాటివరకూ ఇదే మొదటి సారి. దీనికి కారణమేమిటి?

ఈస్ట్ ఇండియా వర్తకంపై గుత్తాధిపత్యపు హక్కు తమకుండాలని తగవుతెచ్చిన కంపెనీలన్నీ 1702లో కలిసిపోయి ఒకే ఒక కంపెనీగా ఏర్పడడంతో ఈస్ట్ ఇండియా కంపెనీ వాస్తవంగా ప్రారంభమయింది. ఈస్ట్ ఇండియా కంపెనీ చరిత్ర అంతకుముందే ప్రారంభ మయిందని చెప్పడానికి వీలులేదు. ఆనాటివరకూ ఆదిలో స్థాపించబడిన ఈస్ట్ ఇండియా కంపెనీ అస్తిత్వానికి ఒకదానివెంట ఒకటిగా అనేకసార్లు గండాలు సంభవించి క్రామ్‌వెల్ రక్షిత పరిపాలన కాలంలో ఒకసారి కొన్ని సంవత్సరాలపాటు నిర్బంధంగా నిలిపివేయబడి, మూడవ విలియమ్ పరిపాలన కాలంలో ఒకసారి పార్లమెంటు జోక్యంకలుగజేసుకొని కంపెనీని రద్దుచేస్తామని భయపెట్టేటంత పని కూడా జరిగింది ఆ డచ్చి రాకొమారుని ప్రభుత్వ కాలంలోనే, బ్రిటిష్ సామ్రాజ్యంయొక్క ఆదాయపు వసూళ్లకు విగ్గులు ఇజారాదార్లు అయిన రోజుల్లో, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండు ఆవిర్భవించిన రోజుల్లో, ఇంగ్లండులో రక్షణ సుంకాల విధానం దృఢంగా వేరూనిన కాలంలో, యూరప్‌లో తుల్యప్రాబల్యం నికరంగా స్థిరమైన కాలంలో ఒక ఈస్ట్ ఇండియా కంపెనీ అస్తిత్వం పార్లమెంటుచే గుర్తింపబడింది. పైకి మాత్రం స్వేచ్ఛాయుగంవలె కనబడే ఆ కాలంలో, వెనుకటి ఎలిజబెత్ మొదటి చార్లెస్ కాలాల్లోలాగా గుత్తాధిపత్యాలు రాజాజ్ఞవల్ల ప్రసాదించబడకుండా, పార్లమెంటు అనుమతితో, అధికారయుతమూ జాతీయమూ చేయబడ్డాయి ఫ్రాన్సులో, లూయీ ఫిలిప్ శకంతో — పురాతన కాలపు భూస్వామ్య ప్రభువర్గం ఓటమిచెందింది, డబ్బుసంచుల పరిపాలన, లేక "haute

finance * ధ్వజంకిందనే తప్ప అన్యథా ఆ ఖాశీస్థానాన్ని బూర్జువావర్గం ఆక్రమింపజాలని శకంతో — ఇంగ్లండు చరిత్రలో ఈ శకం, వాస్తవంగా చాలా దగ్గిర పోలికలనే కలిగివుంది. ఏకాలంలో అయితే హౌస్ ఆఫ్ కామన్స్ సామాన్యప్రజలకు పార్లమెంటులో ప్రాతినిధ్యం నిరాకరించిందో ఆ కాలంలోనే ఈస్ట్ ఇండియా కంపెనీ-సామాన్య ప్రజలను ఇండియాతో వాణిజ్యంలో పాల్గొనకుండా చేసివేసింది ఫ్యూడల్ ప్రభువర్గంపై బూర్జువావర్గంయొక్క నిర్ణయాత్మకమైన ప్రథమ విజయం అత్యంత స్పష్టమైనట్టి ప్రజావ్యతిరేక అభివృద్ధినిరోధకత్వంతో మేళవించి ఉండడం ఈ దృష్టాంతంలోనూ ఇంకా ఇతర దృష్టాంతాల్లోనూ మనకి స్పష్టంగా వ్యక్తమవుతూంది ఈ విషయాన్ని చూచి కాబెట్ లాంటి ప్రజారచయితలు కొందరు నిరాశచెందిపోయి ప్రజాస్వేచ్ఛకోసం భవిష్యత్తులో అన్వేషించడానికి బదులు భూతకాలంలో అన్వేషించడం ప్రారంభించారు.

ఏ శక్తివల్లనైతే అన్నికాలాలలోనూ అన్నిదేశాలలోనూ అవినీతి ప్రయోగంవల్ల ఉదార భావ స్వప్రయోజనాలూ ఉదారభావ రాజవంశమూ రెండూ ఒకదానితో ఒకటి చెట్టాపట్టాలు వేసుకుని ఐక్యమవుతాయో ఏ శక్తి అయితే రాజ్యాంగబద్ధమైన రాజరిక వ్యవస్థయొక్క చోదకశక్తిగానూ మూడవ విలియమ్ ఇష్టదేవతగానూ లూయీ ఫిలిప్ యమ కింకరుడుగానూ పరిణమించిందో, ఆ శక్తే రాజ్యాంగబద్ధమైన రాజరిక వ్యవస్థకీ గుత్తాధిపత్యాన్ని కాంక్షించే ధనికవర్గాలకూ మధ్య, ఈస్ట్ ఇండియా కంపెనీకీ 'మహత్తరమైన" 1688 విప్లవానికీ మధ్య ఐక్యతకు దోహదం చేసింది. ఈస్ట్ ఇండియా కంపెనీ సాంవత్సరిక వ్యయంలో అధికారంలో ఉన్నవారికి ' కానుకలు ' పద్దుకింద, విప్లవానికి ముందు 1 200 పౌన్లకు ఎన్నడోగాని మించనిది 1693 నాటికే 90 000 పౌన్లు అయిందని పార్లమెంటు గావించిన విచారణలవల్లే తెలియవచ్చింది. 5 000 పౌన్లు లంచం పుచ్చుకొన్నందుకు డ్యూక్ ఆఫ్ లీడ్సుని పార్లమెంటులో బహిరంగంగా విచారణ చేసి శిక్షించారు; ఇకపోతే ధర్మమూర్తి అయిన రాజాగారే 10 000 పౌన్లు లంచం పుచ్చుకున్నట్టు ఆయనపై నేరం స్థిరపర్చారు ప్రత్యక్షంగా పుచ్చుకున్న ఈ లంచాలటుండగా, బ్రహ్మాండమైన మొత్తాలను ధర్మవడ్డీకి ఋణమిస్తామని ప్రభుత్వానికి ఆశచూపడమూ పోటీ కంపెనీల డైరెక్టర్లను కొనివేయడమూ ఫలితంగా పోటీ కంపెనీలను తోసివేయడం జరిగేది.

బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండు లాగానే ఈస్ట్ ఇండియా కంపెనీ కూడా ప్రభుత్వానికి లంచాలిచ్చి సంపాదించిన అధికారాన్ని నిలుపుకొనేందుకు, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండు లాగానే ఈస్ట్ ఇండియా కంపెనీకి కూడా మళ్లీ లంచాలివ్వక తప్పిందికాదు దాని గుత్తాధిపత్య కాలపరిమితి అంతమయే సమయం సమీపించినప్పుడల్లా, దాని అనుజ్ఞాపత్ర పునరుద్ధరణ ప్రభుత్వానికి

---

* బడా బ్యాంకి పెట్టుబడిదారీ ప్రభుత్వవర్గం. — సం.

తిరిగి కొత్త రుణాలు ఇవ్వజాలుతేనే, ప్రభుత్వానికి కొత్త కానుకలు ఆశజాపుతేనే వీలయేది.

సప్తవర్ష సంగ్రామం[10] ఫలితంగా, ఈస్ట్ ఇండియా కంపెనీ వాణిజ్య సంస్థనుండి సైనికంగానూ ప్రాదేశికంగానూ అధికారంగల శక్తిగా మార్పుచెందింది. ఆ సమయంలోనే ప్రాచ్యంలో నేటి బ్రిటిష్ సామ్రాజ్య శంకుస్థాపన జరిగింది. అప్పుడే ఈస్ట్ ఇండియా కంపెనీ స్టాక్ వాటాల ధర 263 పౌన్లకి పెరిగింది; అనాడే $12^1/_2$ శాతం చొప్పున లాభాలు కూడా పంచిపెట్టడం జరిగింది. కాని అదే సమయంలో, పోటీ కంపెనీల రూపంలో కాకుండా, పోటీ మంత్రులూ, పోటీ ప్రజ రూపంలో కంపెనీకి ఒక నూతన శత్రువు ప్రత్యక్షమయింది. బ్రిటిష్ యుద్ధనౌకా దళాల, బ్రిటిష్ సేనల సహాయంవల్లనే కంపెనీ భూభాగాలను జయించుకోగలిగిందనీ, బ్రిటిష్‌వారు ఎవ్వరూ రాజమకుటంతో ఎట్టిసంబంధం లేకుండా ప్రాదేశిక సార్వభౌమత్వాన్ని కలిగివుండడానికి వీలులేదనీ ఒక వాదన లేవదీయబడింది. ఇటీవల జరిగిన దిగ్విజయాల ఫలితంగా లభించాయని నమ్మిన "అద్భుత నిక్షేపాల"లో తమకు కూడా వంతు రావాలని అనాటి మంత్రులూ, ప్రజా కోరారు. జాతీయ ఖజానాకు ఏటా 4,00,000 పౌన్లు చెల్లించుతానని కంపెనీ 1767లో ఒప్పందం చేసుకొని బయటపడేసరికి దాని తల్ప్రాణంతోకకొచ్చింది.

కాని, తాను చేసుకొన్న ఒప్పందం అనుసరించి డబ్బుచెల్లించే బదులు ఈస్ట్ ఇండియా కంపెనీ డబ్బుచిక్కులలో తగులుకొని ఇంగ్లీషు ప్రజకు కప్పం చెల్లించడానికి మారుగా డబ్బు సహాయంకోసం పార్లమెంటునే అర్థించింది. ఈ చర్యకు అనుషంగికంగా కంపెనీకిచ్చిన అనుజ్ఞాపత్రంలో తీవ్రమైన మార్పులు చేయబడ్డాయి. ఈ కొత్త పరిస్థితులలో సహితమూ కంపెనీయొక్క వ్యవహారాలు మెరుగుపడకపోవడంవల్లనూ, ఇదే సమయంలో ఇంగ్లీషుజాతి ఉత్తర అమెరికాలోని తన వలసలు నష్టపోవడంవల్లనూ, ప్రపంచంలో మరొకచోట ఎక్కడైనా మహత్తరమైన వలస సామ్రాజ్యాన్ని స్థాపించుకొనవలసిన అవసరం సార్వజనికంగా వ్యక్తం కాజొచ్చింది. 1783లో సుప్రసిద్ధుడైన ఫాక్స్ సరైన తరుణం ఆసన్నమయిందని భావించి, కోర్ట్ ఆఫ్ డైరెక్టర్స్‌నూ, కోర్ట్ ఆఫ్ ప్రొప్రైటర్స్‌నూ రద్దు చేయాలనీ, ఇండియా ప్రభుత్వాన్నంతనీ పార్లమెంటుచే నియమించబడిన ఏడుగురు కమీషనర్లకు ఒప్పజెప్పాలనీ ప్రతిపాదించే ప్రసిద్ధిజెందిన తన ఇండియా బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టాడు. మందబుద్ధియైన రాజు* తనకు వ్యక్తిగతంగావున్న పలుకుబడిని హౌస్ ఆఫ్ లార్డ్స్‌పై ఉపయోగించిన ఫలితంగా మిస్టర్ ఫాక్స్ తెచ్చిన బిల్లు వీగిపోయింది; ఈ ఓటమి ఒక సాధనంగా వినియోగించబడడంవల్ల ఫాక్స్, లార్డు నార్త్‌ల అనాటి మిశ్రమప్రభుత్వం భగ్నమై సుప్రసిద్ధుడైన పిట్ నాయకత్వాన ప్రభుత్వం ఏర్ప

---

* మూడవ జార్జి. — సం.

డడానికి కారణభూతమయింది. 1784లో పిట్‌చే ప్రవేశపెట్టబడిన బిల్లు పార్లమెంటు రెండు సభలచేతనూ ఆమోదించబడింది. ప్రీవీ కౌన్సిల్ సభ్యులలో ఆర్గురితో ఏర్పడిన బోర్డ్ ఆఫ్ కంట్రోల్ స్థాపించబడాలనీ, వీరు

> "ఈస్ట్ ఇండియా కంపెనీకి గల భూభాగాల, దాని స్వాధీనంలో ఉన్న స్థిరాస్తుల ఆదాయాలను లేక సివిల్, మిలిటరీ ప్రభుత్వానికి ఏవిధంగానైనా సరే సంబంధాన్ని కలిగినట్టి అన్ని కార్యకలాపాలనూ, చర్యలనూ, వ్యవహారాలనూ పరిమాచి, అజ మాయిషీచేసి, ఖాయిదా పెట్టాలనీ"

ఈ బిల్లు ఆదేశించింది.

ఈ విషయమై చరిత్రకారుడు మిల్ ఇలా అంటాడు:

> "ఈ శాసనాన్ని గావించడంలో రెండు లక్ష్యాలు ఉద్దేశింపబడ్డాయి. మిస్టర్ ఫాక్స్ ప్రతిపాదించిన బిల్లుయొక్క అతిదుష్టమైనదిగా వర్ణించబడుతూన్న ఉద్దేశమే ఈ శాసనంయొక్క ఉద్దేశం కూడా అనే నిందను తప్పించుకొనేందుకు, అధికారంలో ప్రధానమైన భాగం డైరెక్టర్ల చేతులలోనే ఇంకా ఉన్నట్లు అగపడడం అవసరమైంది. కాని మంత్రిత్వ ప్రయోజనానికి మాత్రం డైరెక్టర్ల చేతులలో నుండి అధికారాన్ని వాస్తవంగా తీసివేయడమే అవసరమయింది. తన ప్రత్యర్థి ప్రతిపాదించిన బిల్లునుండి తన బిల్లు ప్రత్యేకించి ఈ విషయంలోనే విభేదించుతూందనీ, తన ప్రత్యర్థి బిల్లు డైరెక్టర్ల అధికారాన్ని నాశనం చేయగా, తన బిల్లు దానిని ఇంచుమించు సంపూర్ణంగా అట్టిపెట్టుతూందనే మిస్టర్ పిట్ నమ్మింపజూస్తున్నాడు. మిస్టర్ ఫాక్స్ శాసనంకింద మంత్రులు ఈ అధికారాన్ని బాహాటంగానే స్వీకరించగలిగే వారు. మిస్టర్ పిట్ శాసనంకింద ఈ అధికారాన్ని మంత్రులు రహస్యంగానూ, వంచనచేసీ స్వీకరించుతున్నారు. ఫాక్స్ బిల్లు కంపెనీ అధికారాన్ని పార్లమెంటుచే నియమింపబడే కమీషనర్లకు బదిలీచేసింది. మిస్టర్ పిట్ బిల్లు వాటిని రాజుచే నియమింపబడే కమీషనర్లకు బదిలీచేసింది."[11]

ఈవిధంగా, ఇండియా సమస్య మంత్రిత్వ సమస్యగా తయారవడం 1783, 1784 లలోనే మొదటిసారి; అప్పటినుండి ఇప్పటివరకూ ఆవిధంగా మరి తిరిగి సంభవించలేదు. మిస్టర్ పిట్ ప్రతిపాదించిన బిల్లు ఆమోదించబడిన ఫలితంగా ఈస్ట్ ఇండియా కంపెనీ అనుజ్ఞాపత్రం పునరుద్ధరించబడి, మరి ఇరవైయేళ్లవరకూ ఇండియా సమస్య మెక్కి

పడిపోయింది. కాని 1813లో జాకొబిన్ వ్యతిరేక యుద్ధమూ,[12] 1833లో కొత్తగా ప్రవేశపెట్టబడిన సంస్కరణ బిల్లూ[13] కడమ అన్ని రాజకీయ సమస్యలనూ వెనక్కి నెట్టి వేశాయి.

1784కు ముందూ, దాని తరువాత కూడా ఇండియా సమస్య బృహత్తరమైన రాజకీయ సమస్యగా రూపొందకపోవడానికి ప్రథమకారణం ఇది; 1784కు ముందు ఈస్ట్ ఇండియా కంపెనీ తన అస్తిత్వానికి ఆటంకం కలిగించే అవరోధాలను అధిగమించి, తన ప్రాముఖ్యతను ఉద్ఘోషించడం అవసరమైంది; ఆ సంవత్సరం తరువాత, తనకు ఎట్టి పూచీ లేకుండానే అది చలాయించగల్గిన అధికారాన్నంతటినీ అల్పసంఖ్యాక పాలకవర్గం హస్తగతం చేసుకుంది; ఇక ఆటుతరువాత అనుజ్ఞాపత్రం పునరుద్ధరించబడిన ఈ దశలలోనే, 1813, 1833 సంవత్సరాలలో సర్వసాధారణంగా ఇంగ్లీషు ప్రజలందరూ ఇంతకంటే మహత్తర ప్రాముఖ్యతను కలిగిన సమస్యలలో నిమగ్నులై ఉండిపోయారు.

ఇక మనం ఈ సమస్యను వేరే పార్శ్వంనుంచి పరిశీలిద్దాం. కేవలం తన ఏజెంట్లకు వ్యాపార స్థావాలు నిర్మించి, వారి సరకులు విల్వచేసుకోవడానికి స్థలాలు స్థాపించే ప్రయత్నాలతో ఈస్ట్ ఇండియా కంపెనీ తన కార్యకలాపం ప్రారంభించింది. వీటిని పరిరక్షించుకోడానికై కంపెనీవారు అనేక కోటలను నిర్మించుకున్నారు. ఎప్పుడో 1689లోనే ఇండియాలో రాజ్యాన్ని స్థాపించుకుని, ఈ భూభాగాలనుండి వచ్చే ఆదాయాన్ని తమ లాభాలకి ఒక మూలాధారంగా చేసుకుందామనే తలంపు వారికి కలిగినప్పటికీ, 1744వరకూ కూడా బొంబాయి, మద్రాసు, కలకత్తాల చుట్టుపక్కల ఏవో అప్రధానములైన కొద్దిపాటి జిల్లాలను తప్పితే మరివేటినీ వారు సంపాదించలేదు. తదుపరి కర్ణాటకములో ప్రజ్వరిల్లిన యుద్ధం ఫలితంగా, అనేక సంఘర్షణలు జరిగిన తరువాత, ఇండియాలోని ఆ భాగానికి వారు వాస్తవమైన అధిపతు లయారు. బెంగాలులో సంభవించిన యుద్ధం ఫలితంగానూ, క్లైవ్ సాధించిన విజయాల ఫలితంగానూ ఇంతకు బాగా మించినట్టి గణనీయములైన ఫలితాలు చేకూరాయి. బెంగాలు, బీహారు, ఒరిస్సాల వాస్తవ ఆక్రమణే ఈ ఫలితాలు. 18వ శతాబ్దాంతంలోనూ, ఈ శతాబ్ది మొదటి సంవత్సరాలలోనూ టిప్పు సాహెబుతో యుద్ధాలు సంభవించాయి; వీటికి అనుషంగికంగా గొప్ప అధికారవిస్తరణ, సైన్యసహకార విధానం విపరీతంగా విస్తరిల్లడమూ జరిగింది.[14] చిట్టచివరకు 19వ శతాబ్ది రెండవ దశాబ్దంలో ఇండియాలో అమవుగావున్న పరిహద్దు ఎడారి ప్రాంతం పూర్తిగా జయించబడింది. అన్ని కాలాలలోనూ ఇండియాలో రాజ్యం చేసిన ప్రతి కేంద్ర ప్రభుత్వంయొక్క ముఖ్యపీఠంగా పుండినట్టి ఆసియా భూభాగాలను ప్రాచ్యంలో బ్రిటిష్ సామ్రాజ్యం అప్పటికిగాని చేరుకోలేకపోయింది. కాని, సామ్రాజ్యమంతటి లోనూ భేద్యమైన ప్రాంతం, ఏ ప్రాంతంమండైతే కొత్త విజేతలు పాత విజేతలను తరిమికొట్టి దేశాన్ని కొల్లగొట్టారో, ఆ పశ్చిమ పరిహద్దు అవరోధాలు, ఇంకా బ్రిటిష్

వారి చేతిలోకి రాలేదు. 1838–1849 మధ్య సంవత్సరాలలో, సిక్కు, ఆఫ్ఘన్ యుద్ధాల కాలంలో, పంజాబు, సింధులను బలాత్కారంగా కలిపివేసుకున్న ఫలితంగా[15], ఈస్ట్ ఇండియా ఖండంయొక్క జాతీయ, రాజకీయ, సైనిక సరిహద్దు ప్రాంతాలను బ్రిటిష్ ప్రభుత్వం నికరంగా తన స్వాధీనంలోకి తెచ్చుకుంది. మధ్య ఆసియానుండి దండెత్తివచ్చే ఏ సైన్యాన్నయినా తిప్పికొట్టడానికీ, పర్షియా సరిహద్దులవరకూ పురోగమించుతూ వస్తూన్న రష్యాను ప్రతిఘటించడానికీ ఈ ప్రాంతాలు వారి స్వాధీనంలో ఉండితీరాలి. గత యీ దశాబ్దిలో 85,72,630 జనసంఖ్య గలిగిన 1,67,000 చదరపు మైళ్ల అదనపు భూభాగం బ్రిటిష్ ఇండియాకు చేర్చబడింది. ఇక దేశంలోని లోపలితట్టు భాగాల విషయంలో, స్వదేశ సంస్థానాలన్నిటి చుట్టూ బ్రిటిష్‌వారి ఆధీనంలోవున్న ప్రాంతాలే విస్తరించివుంటూ, బ్రిటిష్ suzera neté*యొక్క అనేక రూపాలకు అవి లోనుచేయబడి, కేవలం గుజరాత్, సింధు మినహా కడమ అన్నీ కూడా సముద్రతీరాన్నుండి వేరు చేయబడ్డాయి. బాహ్యంగా, ఇండియా అనేది ఇక లేనేలేకుండా పోయింది. 1849నుండి మాత్రమే బ్రహ్మాండమైన ఒకేఒక ఆంగ్లో-ఇండియన్ సామ్రాజ్యం అక్కడ మనుతూ వుంది.

ఈవిధంగా ఇండియాయొక్క నైసర్గికమైన సరిహద్దులను తుట్టతుదకు చేరుకొనే వరకూ కంపెనీ పేరుమీదుగానే రెండు శతాబ్దాలుగా బ్రిటిష్ ప్రభుత్వం సంఘర్షణను సాగించింది. బూటకపు శాంతివచనాలను అందరికంటెనూ మించి గొంతు చించుకొని అరవడానికి నిశ్చయించుకున్న వారితోసహా ఇంగ్లండులోవున్న అన్ని పక్షాలూ, ఒకేఒక బృహత్ ఇండియన్ సామ్రాజ్యంయొక్క arrondissement** పూర్తిగా స్థిరపడేవరకూ, ఇది జరుగుతూన్న కాలమంతటిలోనూ, ఈ క్రియను చూచీచూడకుండా నోరుమెదపకుండా గప్‌చుప్‌గా ఎందుకు ఊరుకున్నారో మనకిప్పుడు అర్థమౌతుంది. తమ నిశితమైన లోకోపకారానికి ఆ సామ్రాజ్యం గురి చేసేటట్లు సహజంగా అది మొదట వారి స్వాధీనం కావాలి కదా. ఈ దృక్పథంనుండి చూస్తే, గతకాలంలో అనుజ్ఞాపత్రాన్ని పునఃప్రారంభంచేసే సమయాలన్నిటితో పోల్చిచూస్తే, నేడు 1853లో ఇండియా సమస్యలో సంభవించిన పరిస్థితుల మార్పును మనం గ్రహించగలుగుతాం.

సరే, ఈ విషయాన్ని మరొక పార్శ్వంనుంచి పరిశీలిద్దాం. ఇండియాతో బ్రిటిష్ వాణిజ్య సంబంధంయొక్క చరిత్రను, ఈ సంబంధపు వివిధ దశల సహితంగా

* సార్వభౌమత్వం. — సం.

** సరిహద్దులు సాఫుగా ఏర్పడుట. — సం.

మనం సమీక్ష చేసినట్లయితే, ఇండియా విషయమై కావించబడిన శాసననిర్మాణంలోని విచిత్ర సంక్షోభాన్ని మనం మరింత సులువుగా ఆకళింపు చేసుకోగలుగుతాం.

ఈస్ట్ ఇండియా కంపెనీ తన వ్యవహారాలను ప్రారంభించిన మొదట్లో, ఎలిజబెత్ రాణి రాజ్యకాలంలో, ఇండియాతో కంపెనీ తన వర్తకవ్యాపారాన్ని లాభసాటిగా కొనసాగించుకొనేందుకై ఏటా 30,000 పౌన్ల విలువగల వెండి, బంగారాలనూ, విదేశనాణేలనూ ఎగుమతిచేసుకోడానికి దానికి అనుమతినిచ్చారు. ఆ కాలపు మూఢనమ్మకాలన్నిటినీ ఇది సుతరామూ ఉల్లంఘించుతూంది; తదనుగుణంగా, ఏ దేశానికైనా సరే దానికున్న యథార్థమైన ధనసంపత్తి అంతా దాని స్వాధీనంలోవున్న వెండి బంగారాలలోనే ఉంటుందని ఒప్పుకుంటూనే, చెల్లింపుల సమతూకం గనుక ఎగుమతిదారీ దేశానికి అనుకూలంగా ఉండిన పక్షంలో, మరేమీ ప్రమాదం లేకుండానే వీటి ఎగుమతిని అంగీకరించవచ్చునని వాదించుతూ, "ఇంగ్లండు ఈస్ట్ ఇండియాల మధ్య జరుగుతూన్న వర్తకంపై ఒక ప్రసంగం"[16] అనే తన పుస్తకంలో "వాణిజ్య వ్యవస్థ"యొక్క పునాదులను ఉద్ఘోషించుతూ థామస్ మన్ అనే గ్రంథకర్తకు రాయక తప్పిందికాదు. ఈ అర్థంలో, ఈస్ట్ ఇండియానుండి దిగుమతి చేసుకున్న సరకులు ఇతర దేశాలకే ప్రధానంగా పునః ఎగుమతి కాబడుతూండటంవల్ల, వీటికోసం ఇండియాలో చెల్లించవలసి వచ్చిన వెండిబంగారాలకంటె, దీనివల్ల లభించే ముద్ద వెండిబంగారాల పరిమాణం చాలా అధికంగా ఉంటుందని అతడు వాదించాడు. ఇదే భావంతో "విదేశ వర్తకాలన్నిటికంటె ఈస్ట్ ఇండియా వర్తకమే అత్యంత జాతీయమైనదనే విషయాన్ని నిరూపించుతూన్న ఒక గ్రంథాన్ని"[17] సర్ జోసియా చైల్డ్ రాశాడు. ఈస్ట్ ఇండియా కంపెనీ పత్తాసుదారులు రానురాను మరింతగా సిగ్గువిడియాలను వదిలేసి, దుస్సాహసంతో ప్రవర్తించసాగారు; పోతే, ఇంగ్లండులో స్వేచ్ఛావ్యాపారాన్ని బోధించడంలో ఈ ఇండియా గుత్తాధిపత్య వ్యాపారులే ప్రప్రథములనే విషయం ఈ వింతైన ఇండియా చరిత్రలో విచిత్రమైన విషయంగా ప్రదర్శితమవుతూంది.

17వ శతాబ్ది అంత్యంలోనూ 18వ శతాబ్ది అధిక భాగంలోనూ, ఈస్ట్ ఇండియా కంపెనీ వ్యవహారాల్లో పార్లమెంటు జోక్యం కలుగజేసుకోవాలన్న ఒక కోరిక వెల్లడైంది; ఐతే ఈమారు ఇది వాణిజ్యవర్గాలనుండిగాక పారిశ్రామిక వర్గాలనుండే బయలుదేరింది; అప్పుడే ఈస్ట్ ఇండియానుండి నూలు, సిల్కువస్త్రాల దిగుమతి దురదృష్టవంతులైన బ్రిటిష్ పారిశ్రామికులను నాశనం చేస్తూందని ప్రకటించారు; "ఇంగ్లండు ఇండియాల పరిశ్రమలలో ఉన్న అసంగతం" లండన్, 1697,[18] అనే పుస్తకంలో జాన్ పోల్లెక్స్‌ఫెన్ ఈ అభిప్రాయాన్ని వ్యక్తంచేశాడు; ఒకటిన్నర శతాబ్దం తరువాత ఈ పుస్తకంయొక్క శీర్షిక, ఈ అర్థంలోకాక, కేవలం వేరు అర్థంలో, ఎంతో చిత్రమైన విధంగా సత్యమని రుజువైంది. అప్పుడు పార్లమెంటు నిజంగానే జోక్యంకలుగజేసుకుంది. మూడవ విలియమ్

11, 12వ సంవత్సరాల పరిపాలన శాసనంలోని, 10వ అధ్యాయం ప్రకారం ఇండియా, పర్షియా, చైనాలనుండి ఎగుమతి చేయబడిన చేనేత పట్టువస్త్రాలనూ, అద్దకం చేయబడి నట్టిగానీ రంగు వేయబడినట్టిగానీ మాలుగుడ్డలనూ ధరించడం నిషేధించబడి, అవి తమ దగ్గిర ఉన్న వారికీ, లేక అమ్మేవారికీ 200 పౌన్లు అపరాధం విధించబడింది. తరువాత కాలంలో "జ్ఞానం"మని చెప్పుకున్న బ్రిటిష్ పారిశ్రామికులు నెత్తీనోరూ మొత్తుకుని ఏడ్చిన ఫలితంగా, మొదటి, రెండవ, మూడవ జార్జి రాజుల కాలంలో ఇటువంటి శాసనాలే మరికొన్ని చేయబడ్డాయి. ఈవిధంగా 18వ శతాబ్ది అధిక భాగంలో ఇండియాలో తయారైన కార్ఖానా సరకులు యూరప్ భూభాగదేశాలలో అమ్మకంచేయడానికి మాత్రమే ఇంగ్లండుకు సాధారణంగా ఎగుమతి చేయబడి, ఇంగ్లీషు మార్కెట్టునుండి మాత్రం నిషేధించబడడం జరిగింది.

అత్యధిక లాభాలు కాంక్షించిన ఇంగ్లండుదేశపు పారిశ్రామికుని కోర్కెననుసరించి ఈస్ట్ ఇండియా వ్యవహారాల్లో జరిగిన పార్లమెంటు జోక్యం అటుండగా, కంపెనీ అనుభవించు తూండిన వ్యాపార గుత్తాధిపత్యాన్ని భగ్నంచేయడానికీ, యథార్థమైన బంగారపుగని అని అందరూ నమ్మినట్టి ఆ వ్యాపారంలో తాము కూడా పాల్గొనడానికీ, కంపెనీ అనుజ్ఞా పత్రం పునఃప్రారంభం చేయవలసిన సమయం ఆసన్నమైనప్పుడల్లా లండన్, లివర్‌పూల్, బ్రిస్టల్ వర్తకులు ప్రయత్నాలుచేశారు. ఈ ప్రయత్నాల పర్యవసానంగా, అన్నిరకాల సర కులనూ బ్రిటిష్ ప్రైవేటు వ్యక్తులకు ఇంగ్లండుమండి ఎగుమతిచేయడానికీ, ఇండియాలో ఉద్యోగంచేస్తూన్న కంపెనీ ఇంగ్లీషు నౌకర్లకు ఇంగ్లండుకు దిగుమతి చేయడానికీ అధికారం కలుగజేస్తూ, కంపెనీ అనుజ్ఞాపత్ర కాలాన్ని 1814 మార్చి 1 వరకూ పొడిగించుతూ 1773లో చేసిన శాసనంలో ఒక అవకాశాన్ని కల్పించారు. కాని ప్రైవేటు వర్తకులు బ్రిటిష్ ఇండియాకు ఎగుమతులు చేయడం సందర్భంలో ఈ రాయితీకి అనేక షరతులను విధించడం కారణంగా దాని ఫలితాలు నాశనమయిపోయాయి. సాధారణ వాణిజ్యంయొక్క ఒత్తిడిని కంపెనీ ఇక తట్టుకోలేకపోవడంచేత, 1813లో, చైనా వర్తకంలో దానికున్న గుత్తాధి పత్యాన్ని మాత్రమే ఉంచి, ఇండియాతో వర్తకాన్ని కొన్ని షరతులకింద ప్రైవేటు పోటీకి వదిలిపెట్టేయడం జరిగింది. 1833లో కంపెనీ అనుజ్ఞాపత్రం పునఃప్రారంభం చేసే సమయం వచ్చినప్పుడు, ఈ ఆఖరి నిర్బంధాలు కూడా రద్దుచేయబడి, ఏవిధమైన వర్తకం సహితమూ చేయకూడదని కంపెనీపై నిషేధం విధించబడింది; ఈవిధంగా కంపెనీయొక్క వాణిజ్య స్వభావం నాశనం గావించబడి, ఇండియాదేశపు భూభాగాల్లోకి బ్రిటిష్ పౌరులకు ప్రవేశంలేకుండా చేస్తూ వెనుక కంపెనీకుండిన విశేషాధికారం కూడా రద్దుచేయబడింది.

ఇదంతా జరుగుతూండిన కాలంలో, ఈస్ట్ ఇండియా వర్తకంపట్ల ఇంగ్లండులో వున్న వివిధ వర్గాల ప్రయోజనాలు తీసుకున్న వైఖరిని సంపూర్ణంగా మార్చివేసినట్టి అతిముఖ్య

మైన మార్పులు ఈస్ట్ ఇండియా వర్తకంలో సంభవించాయి. 18వ శతాబ్దకాలమంతటి లోనూ, ఇండియానుండి ఇంగ్లండుకు రవాణాచేయబడిన ధనరాసులన్నీ, సాపేక్షంగా అత్యంత స్వల్పమయిన వాణిజ్యవ్యాపారంలో సంపాదితమైనవి కాకుండా, సరాసరి ఆ దేశాన్ని ప్రత్యక్షంగా దోపిడీచేయడంవల్ల సంపాదితమై, ఆ దేశంలో బలాత్కారంగా గుంజిపోసుచేసుకుని, ఇంగ్లండుకు తరలించి వేయబడినట్టి అపారములైన నిధులే. 1813లో ఎట్టి నిర్బంధాలూ లేకుండా వర్తకం ఆరంభమవడంతో, ఇండియాతో వర్తకవ్యాపారం అతిస్వల్పకాలంలో మూడింతలకుపైగా పెరిగింది. ఇంతేకాదు, వర్తకంయొక్క స్వభావమే పూర్తిగా మారి పోయింది. 1813వరకూ ప్రధానంగా ఎగుమతిచేసే దేశంగా వుండినట్టి ఇండియా, ఇప్పుడు దిగుమతి చేసుకునే దేశమయిపోయింది; ఇది కూడా ఎంత త్వరితగతిని జరిగిందంటే, అంత వరకూ రూపాయికి 2 షిల్లింగుల 6 పెన్నీలుండిన మారకపు రేటు, 1823 నాటికి 2 షిల్లింగులకి పడిపోయింది. అనాదినుండి ప్రపంచానికంతటికీ నూలువస్త్రాలను తయారు చేసిపెట్టే బృహత్తర కర్మాగారమైన ఇండియా, యిప్పుడు ఇంగ్లీషు నూలుకట్టలు, నూలు వస్త్రాలతో ముంచెత్తబడింది. తన సరకులు ఇంగ్లండునుండి బహిష్కరించబడడమూ, అథవా అత్యంత క్రూరమైన షరతులకు లోబడి ఇంగ్లండులో ప్రవేశానికి అనుమతించ బడడమూ జరిగిన తరువాత, అతిస్వల్పమైనట్టి, కేవలం నామమాత్రమైనట్టి సుంకాలతో బ్రిటిష్ ఫ్యాక్టరీలలో తయారైన సరకులు ధారాపాతంగా ఇండియాలో కుమ్మరించబడ్డాయి. ఫలితంగా ఒకనాడు ప్రపంచప్రఖ్యాతి గాంచిన దేశవాళీ నూలు వస్త్రం ఉత్పత్తి సర్వనాశనమై పోయింది. 1780లో ఇండియాకు 3,86,152 పౌన్ల విలువగల బ్రిటిష్ దినుసులూ పారిశ్రామిక సరకులూ మాత్రమే ఎగుమతి చేయబడి, 15,041 పౌన్ల విలువగల ముద్ద వెండిబంగారాలు ఎగుమతి చేయబడగా, 1780లో 1,26,48,616 పౌన్ల విలువగల మొత్తం సరకులు ఎగుమతి చేయబడ్డాయి; అనగా విదేశ వ్యాపారమంతటిలోనూ ఇండియా వ్యాపారం 32 పాళ్లలో 1 పాలు మాత్రమే ఉందన్నమాట. 1850లో గ్రేట్ బ్రిటన్, ఐర్లండులనుండి ఇండియాకు మొత్తపు ఎగుమతుల విలువ 80,24,000 పౌన్లు; వీటిలో ఒక్క నూలువస్త్రం విలువే 52,20,000 పౌన్లు; అనగా ఎగుమతి అంతటిలోనూ ఇది ఒక్కటే 8 పాళ్లలో 1 పాలుకంటెనూ, మొత్తం విదేశ నూలువ్యాపార మంతటిలోనూ 4 పాళ్లలో 1 పాలు కంటెనూ మించివుందన్నమాట. కాని బ్రిటన్ జనసంఖ్యలో 8 పాళ్లలో 1 పాలు నూలు తయారీలోనే జీవనభృతిని సంపాదించుకుంటూ, నూలు తయారీయే మొత్తం జాతీయాదాయం అంతటిలో 12 పాళ్లలో 1 పాలును చేకూర్చుతూంది. ప్రతి వాణిజ్య సంక్షోభానంతరమూ, బ్రిటిష్ నూలు పరిశ్రమ యజమానులకు ఈస్ట్ ఇండియా వ్యాపారమే అంతకంతకు అధికతర ప్రాముఖ్యతను వహించి, అన్నిటికంటెనూ ఈస్ట్ ఇండియా ఖండమే వాస్తవంగా వారికి మంచి మార్కెట్టుగా తయారయింది. ఎంత త్వరిత

గతిలోనైతే గ్రేట్ బ్రిటన్‌యొక్క యావత్తు సామాజిక వ్యవస్థ నిర్మాణానికీ నూలునరకుల పరిశ్రమ ప్రాముఖ్యమైందో, అంతటి త్వరితగతినే బ్రిటిష్ నూలునరకుల పరిశ్రమకి ఈస్ట్ ఇండియా అంతటి ప్రాముఖ్యమూ కావొచ్చింది.

ఇండియాను తమ సొంత ఎస్టేట్లుగా మార్చివేసినట్టి డబ్బుసంచులవర్గంయొక్క ప్రయోజనాలూ, ఆ దేశాన్ని తమ సేనలతో జయించినట్టి అల్పసంఖ్యాక పాలకవర్గంయొక్క ప్రయోజనాలూ, ఆ దేశాన్ని తమ జవుళి సరకులతో ముంచివేసిన మిల్లుయజమానివర్గం యొక్క ప్రయోజనాలూ ఆనాటివరకూ చెట్టాపట్టాలు వేసుకొనే పురోగమించాయి. కాని ఇండియన్ మార్కెట్లుపైనే పారిశ్రామికుల ప్రయోజనాల ఆధారం అధికంకావొచ్చిన కొద్దీ, ఇండియాలోవున్న దేశీయ పరిశ్రమను నాశనం గావించిన తరువాత, ఇక ఆ దేశంలో ఉత్పాదక శక్తులను సరికొత్తగా సృష్టింపజేసే ఆవశ్యకతను ఇంగ్లీషు పారిశ్రామికులు మరింతగా గుర్తింపనారంభించారు. ఒక దేశాన్ని మీరు మీ ఫ్యాక్టరీ సరకులతో ఎల్లకాలం ముంచి వేస్తూనే ఉండాలంటే, మీ సరకులకు ప్రతిఫలంగా ఆ దేశం ఏదో ఒక దినుసును మీకు పంపించగలిగే సామర్థ్యాన్ని మీరు దానికి కలుగజేస్తేనే గాని వీలుండదు. తమ వాణిజ్యం అధికమవడంబదులు క్షీణించి పోతూండడం ఇంగ్లీషు పారిశ్రామికులు గమనించారు. 1846తో అంతమైన నాలుగేళ్లలోనూ గ్రేట్ బ్రిటన్‌నుండి ఇండియాకు దిగుమతుల విలువ 26 కోట్ల 10 లక్షల రూపాయిలుండగా, 1850తో అంతమైన నాలుగేళ్లలో 25 కోట్ల 30 లక్షలు మాత్రమే ఉండి, మొదట పేర్కొనబడిన కాలపరిమితిలో ఇండియా నుండి ఎగుమతులు 27 కోట్ల 40 లక్షలూ, రెండవ కాలపరిమితిలో 25 కోట్ల 40 లక్షలు మాత్రమే ఉంది. తమ సరకులను వినిమయం చేసుకునే శక్తి ఇండియాలో ఎంత తక్కువ పరిమాణానికి కుదించుకుపోవడానికి వీలుంటుందో అంత తక్కువ పరిమాణానికి కుదించుకుపోయిందనీ, తమ ఫ్యాక్టరీ సరకుల వినిమయం బ్రిటిష్ వెస్ట్ ఇండీస్‌లో ఏటా తలసరికి 14 షిల్లింగులూ, చిలీలో 9 షిల్లింగుల 3 పెన్నీలూ, బ్రజీల్‌లో 6 షిల్లింగుల 5 పెన్నీలూ, క్యూబాలో 6 షిల్లింగుల 2 పెన్నీలూ, పెరూలో 5 షిల్లింగుల 7 పెన్నీలూ, సెంట్రల్ అమెరికాలో 10 పెన్నీలూ ఉండగా, ఇండియాలో సుమారు 9 పెన్నీలు మాత్రమే ఉందనీ వారు తెలుసుకున్నారు. తదుపరి అమెరికా సంయుక్త రాష్ట్రాలలో పత్తిపంట పడి పోవడం తటస్థించి, ఫలితంగా వారికి 1850లో 1,10,00,000 పౌన్ల నష్టం సంభ వించింది; తమకు కావలసిన ముడిపత్తినంతనూ ఈస్ట్ ఇండీస్‌నుండి తెప్పించుకోవడం బదులు అమెరికామీద ఆధారపడివుండడం వారికి విసుగును కలిగించింది. అంతేకాకుండా, తమ పెట్టుబడిని ఇండియాలో వినియోగించేందుకు తాము చేసిన ప్రయత్నాలన్నిటిపట్లా ఇండియాలో వున్న అధికారులు అవరోధాలను కల్గించి కల్లబొల్లి వాదనలతో నాటకమాడడమూ వారు కనిపెట్టారు. ఈవిధంగా ఇటు పరిశ్రమాధిపతివర్గానికీ, అటు డబ్బుసంచుల

వర్గానికీ, అల్పసంఖ్యాక పాలకవర్గానికీ జరిగిన సంఘర్షణలో ఇండియా యుద్ధభూమిగా పరిణమించింది. ఇంగ్లండులో తమ ప్రాబల్యాన్ని తెలుసుకున్న పరిశ్రమాధిపతివర్గం, తనకు వ్యతిరేకంగావున్న ఈ శక్తుల విధ్వంసాన్ని, పురాతనంనుండీ వస్తూన్న భారతీయ పరిపాలనా యంత్రాంగవ్యవస్థ యావత్తు వినాశాన్ని, ఈస్ట్ ఇండియా కంపెనీయొక్క అంతిమ అస్తమయాన్ని ఇప్పుడు కోరుతూంది.

ఇక ఇండియా సమస్యను పరిశీలించవలసిన నాల్గవ, చిట్టచివరి దృక్పథం. ఇండియా ఆర్థికపరిస్థితి 1784నుండీ అంతకంతకు మరింత చిక్కులలో పడిపోతూ వచ్చింది. ఈనాడు 5 కోట్ల సౌన్ల జాతీయ ఋణమూ, ఆదాయవనరులలో తెగతెంపులేని తగ్గుదలా, అందుకు అనుగుణ్యంగా ఉన్నట్టే, నల్లమందు పన్నువల్లవచ్చే జూదరి ఆదాయంతో అస్తవిస్తగా పరిపడుతూన్నట్టే, గసగసాల పంటను చైనావారు కూడా పండించడం ప్రారంభించడంతో ఈ ఆదాయం అదృశ్యమయే ప్రమాదం ఏర్పడుతూన్నట్టే, తెలివిమాలిన బర్మా యుద్ధం[19] ఫలితంగా సంభవించకతప్పదని అంచనా వేసిన ఖర్చులవల్ల మరింత ప్రమాదకర స్థితిలో పడినట్టే వ్యయంలో పెరుగుదలా ఇప్పుడు వాస్తవంగా సంభవించాయి.

> "ఇప్పుడున్న పరిస్థితి ఎలావుందంటే, ఇండియాలో వున్న సామ్రాజ్యాన్ని పోగొట్టుకుంటే ఇంగ్లండుకు నాశనం తథ్యమవడం వల్ల, దానిని నిలబెట్టుకోవాలంటే మన ఆర్థికవనరులను తెగినంతవరకూ బిగించి నాశనం చేసుకోవడమే అవుతూంది" అని మిస్టర్ డికిన్‌సన్ అంటాడు.[20]

ఇండియా సమస్య ఇంగ్లీషు జాతీయసమస్యగా, ప్రభుత్వ సమస్యగా 1783నుండి మొట్టమొదటి సారిగా ఎలా తయారయిందో పైన చూపించాము.

మార్క్సుచే 1853 జూన్ 24న
రచించబడింది
"New-York Daily Tribune"
1853 జూలై 11వ తేదీన
3816వ సంచికలో
ప్రచురించబడింది
సంతకం: కార్ల్ మార్క్సు

# మార్క్స్

# ఇండియాలో బ్రిటిష్ పరిపాలన భావి ఫలితాలు

లండన్, శుక్రవారం, జూలై 22, 1853

ఇండియాపై నా అభిప్రాయాల వివరణను ఈ లేఖలో పూర్తిచేయనుద్దేశిస్తున్నాను.

ఇండియాలో ఇంగ్లీషు సార్వత్రిక పెత్తన స్థాపన ఎలా సంభవించింది? మొగల్ పాదుషా యొక్క సర్వాధికారాన్ని మొగల్ వైస్రాయిలు భగ్నంచేశారు. ఈ వైస్రాయిల అధికారాన్ని మహారాష్ట్రులు భగ్నంచేశారు.[31] మహారాష్ట్రుల అధికారాన్ని ఆఫ్ఘనులు భగ్నంచేశారు; ఇక వీరందరూ ఒకరితో ఒకరు పోరాడుకుంటూన్న సమయంలో బ్రిటిష్‌వాడు వీరిమధ్య చొరబడి వీరినందరినీ అణచివేయగలిగాడు. మహమ్మదీయుడూ హిందువుడూ అనే వ్యత్యాసంవల్లనే కాకుండా, తెగకీ తెగకీ, కులానికీ కులానికీ ఉన్న వ్యత్యాసంతో చీలిపోయిన దేశం; సమాజసభ్యులందరిమధ్య సాధారణమైన అనిష్టమూ స్వాభావికంగానే ఉన్నట్టి ఒంటెత్తుతనమూ ఫలితంగా ఏర్పడిన ఒక విధమైన సమతాస్థితి ప్రాతిపదికపైన రూపొందిన నిర్మాణం గలిగిన సమాజం — ఇటువంటి దేశం, ఇటువంటి సమాజం విజేతల పాల పడితీరడమే దాని నిర్ణీత ఘటనగాక మరేమిటవుతుంది? హిందూస్థానంయొక్క భూతకాల చరిత్ర ఒకవేళ మనకేమీ తెలియదనే అనుకున్నప్పటికీ, ఇండియా ఖర్చుపైనే ఇండియన్ సైనికులతో కూడిన ఇండియన్ సైన్యమే ఈనాడు కూడా ఇండియాను ఇంగ్లీషు బానిసత్వంకింద అణచిపెట్టి ఉంచుతూందనే బృహత్తరమైనట్టి నిర్వివాదమైనట్టి వాస్తవ విషయం ఎక్కడికి పోతుంది? ఈవిధంగా వున్నప్పుడు విజేతల స్వాధీనంలో ఉండవలసిన గతిని ఇండియా తప్పించుకోలేకపోయింది; పోతే ఇక ఇండియా చరిత్ర అంతా కూడా దానిని జయించిన దిగ్విజయాల చరిత్రే తప్ప మరొకటి కానేకాదు. హిందూదేశపు సమాజానికి చరిత్ర అంటూ, అధమం చరిత్రకు తెలిసినవరకూ, లేనేలేదు. హిందూదేశపు చరిత్ర అని మనం అంటూన్నది, ప్రతిఘటన లేనట్టి మార్పు లేనట్టి సమాజంయొక్క

జడమైన ప్రాతిపదికపై సామ్రాజ్యాలను స్థాపించినట్టి ఒకరివెంట ఒకరు వరుసగా చొరబడినవారి చరిత్రే తప్ప మరేమీకాదు. అందుచేత, ఇండియాను జయించడానికి ఇంగ్లీషువారికి అధికారం ఉందా లేదా అనే ప్రశ్న కాకుండా, టర్కీవాడిచేత, పర్షియావాడిచేత, రష్యనువాడిచేత జయించబడడం ఇండియాకు మంచిదని మనం అనుకుంటామా, లేక బ్రిటిష్‌వాడిచే జయించబడడం ఇండియాకు మంచిదనుకుంటామా అన్నదే ప్రశ్న.

ఇండియాలో ఇంగ్లండు నిర్వహించవలసిన కర్తవ్యాలు రెండున్నాయి: ఒకటి విధ్వంసన కర్తవ్యం, రెండవది పునరుద్ధరణ కర్తవ్యం — పాతబడిపోయిన ఆసియాఖండపు సమాజాన్ని నాశనంజేయడమూ, ఆసియాలో పాశ్చాత్య సమాజంయొక్క పాదార్థిక పునాదులకు శంకుస్థాపన చేయడమూ.

ఇండియాపై వరుసగా దండెత్తి వచ్చిన అరబ్బులూ, తురుష్కులూ, తార్తారులూ, మొగలులూ అనతికాలంలో హిందూ దేశస్థులై పోయారు. నిర్వివాదమైన చారిత్రక నియమాన్ని అనుసరించి, అనాగరికులైన విజేతలు తమ పాలితుల ఉన్నత నాగరికతచేత జయించబడ్డారు. బ్రిటిష్‌వారు ఉన్నత నాగరికత కలిగిన తొలి విజేతలైనందున హిందూ నాగరికత ప్రభావానికి అతీతులుగా ఉండిపోయారు. దేశీయమైన సమాజాలను భగ్నంచేసివేసి, దేశీయ పరిశ్రమను సమూలంగా పెల్లగించివేసి, దేశీయ సమాజంలోని ఉదాత్తోన్నతములైనవాటినన్నింటినీ భూమట్టము గావించుటతో ఆ నాగరికతను వారు ధ్వంసంచేసివేశారు. ఆ విధ్వంసకార్యమే తప్ప వారి పరిపాలనా చరిత్ర పుటలలో మరేమీ లిఖితంకాలేదు. శిథిలాల నడిమధ్యనుండి పునరుద్ధరణ కార్యం కానరావడం దుస్సాధ్యమే. ఐనప్పటికీ అది ప్రారంభమయింది.

ఈ పునరుద్ధరణకు, మొగల్ పాదుషాలకింద దృఢపడిన దానికంటెనూ, విస్తరిల్లి నంతటికంటెనూ అపరిమితంగా దృఢపడిట్టన్నీ విస్తరిల్లినట్టన్నీ భారత రాజకీయ ఐక్యత ప్రథమ షరతుగా పరిణమించింది. బ్రిటిష్ ఖడ్గంచే బలాత్కారంగా ఇండియా నెత్తినిరుద్ద బడిన ఈ ఐక్యత, ఇప్పుడు ఎలెక్ట్రిక్ టెలిగ్రాఫ్ మూలంగా బలపడి శాశ్వతమవుతుంది. హిందూదేశపు స్వయం విముక్తికీ, దారంటపోయే ప్రతి విదేశీయ దురాక్రమణదారుని వాత బడకుండా రక్షించుకోవడానికీ, బ్రిటిష్ డ్రిల్ సార్జెంటుచే నిర్మితమై, తర్ఫీదుపొందిన దేశీయ సైన్యమే sine qua non* అయింది. మొట్టమొదటి సారిగా ఆసియా ఖండపు సమాజంలో ప్రవేశపెట్టబడినట్టి, హైందవ యూరపియను జనవీజనకుల సంతానమైన వారిచే ప్రధానంగా నిర్వహింపబడుతూవున్నట్టి స్వేచ్ఛాయుతమైన వార్తాపత్రికలు ఈ పునర్నిర్మాణానికి నూతనమూ శక్తివంతమూ అయిన సాధనం. ఏహ్యములే అయినట్టి జమీందారీ, రైత్వారీ పద్ధతులు[22] రెండూ, ఆసియా ఖండపు సమాజానికి అత్యంతావశ్యక

---

* తప్పనిసరి షరతు. — సం.

మైన భూమిరూపంలో వుండే ప్రైవేటు ఆస్తియొక్క ప్రత్యేకములైనట్టి వివిధములైన రెండు రూపాలు. ఇంగ్లీషువారి అజమాయిషీకింద అనిష్టతతోనూ అతిస్వల్పంగానూ కలకత్తాలో విద్యాబోధ గరపబడుతూన్న ఇండియా వాసులలోనే, పరిపాలనా విధులను నెరవేర్చే సామర్థ్యాలనూ, యూరపియన్ విజ్ఞాన శాస్త్రీయ భావాలనూ అవగాహన చేసుకున్నట్టి ఒక నూతన వర్గం ప్రాదుర్భవించుతూంది. యూరప్‌తో ఇండియాకు క్రమమైనట్టీ త్వరితమైనట్టీ రవాణా అవకాశాలను ఆవిరిశక్తి ఏర్పరచి, ఆగ్నేయ సముద్రప్రాంతమందలి రేవుపట్టణాలన్నిటితోనూ ఇండియాలోని రేవుపట్టణాలకు సంబంధాన్ని స్థాపించి, దాని జడత్వానికి ప్రధాన కారణమైన ఏకాంత జీవిత స్థితినుండి దానిని పునరుద్ధరించింది. ఇంగ్లండుకూ ఇండియాకూ ఉన్న దూరాన్ని కాలాన్ని బట్టి గనుక కొలిచినట్టయితే, రైల్వేలూ స్టీమర్ల కలయిక ఫలితంగా, ఈ దూరం ఎనిమిది దినాలకు తగ్గించబడి, అద్భుతమైన ఆ దేశాన్ని ఈలాగున పాశ్చాత్యప్రపంచం తనతో వాస్తవంగా కలిపివేసుకొనే రోజులు ఎంతో దూరంలోలేవు.

ఇండియా ప్రగతిపట్ల గ్రేట్ బ్రిటన్‌లోని పాలకవర్గాలకు ఇంతవరకూ కేవలం యాదృచ్ఛికమైనట్టీ, తాత్కాలికమైనట్టీ, అసాధారణమైనట్టీ ఆసక్తే ఉంటూవచ్చింది. దానిని జయించాలనే ఆసక్తి ప్రభువర్గానికుండేది; దానిని కొల్లగొట్టి దోపిడిచెయ్యాలనే ఆసక్తి డబ్బుసంచులవర్గానికుండేది; దాని సరకులకంటె తమ సరకులను కారుచవకగా అమ్మాలని పరిశ్రమాధిపతివర్గాని కుండేది. కాని ఇప్పుడిదంతా అసంభవ్యమయింది. సరకులను ఉత్పత్తిచేసే దేశంగా ఇండియా మార్పుచెందడమే తమకు ప్రాణతుల్యమైన విషయమనీ, ఇందుకుగాను అన్నిటికంటె ముఖ్యంగా నీటివసరులనూ, దేశంలో రవాణా సదుపాయాలనూ ఆ దేశానికి ప్రసాదించడం అత్యవసరమనీ పరిశ్రమాధిపతివర్గం కనిపెట్టింది. ఇండియా అంతటా రైలు మార్గాలు అల్లివేయాలని ఇప్పుడు వారి ఉద్దేశ్యం. కాగా తమ ఉద్దేశ్యాన్ని వారు నెరవేర్చుకుంటారు కూడా. దాని ఫలితాలు అమూహ్యమే అయి తీరుతాయి.

ఉత్పత్తిచేయబడే వివిధ రకాల సరుకులను రవాణాచేసేందుకూ, వాటిని మార్పిడి చేసుకునేందుకూ ఏవిధమైన అవకాశాలూ బొత్తిగా లేకపోవడం కారణంగానే ఇండియాయొక్క ఉత్పాదక శక్తులు కుంటుపడిపోయాయన్న విషయం జగత్ప్రసిద్ధమే. మార్పిడి సాధనాలు లేకపోవడంవల్ల ప్రకృతి ప్రసాదించిన సమృద్ధి నడిమధ్య సమాజంలో లేమి ఇండియాలో కనబడేటంతగా మరెక్కడా కూడా మనకు కనబడదు. 1848లో విచారణ జరిపిన ఒక హౌస్ ఆఫ్ కామన్స్ కమిటీ ఎదుట ఈవిధంగా రుజువైంది:

> "ఖాందేష్‌లో పావుటన్ను ధాన్యం 6 షిల్లింగులనుండి 8 షిల్లింగులవరకూ అమ్ముతూండిన సమయంలో, మట్టిరోడ్లమీద బళ్ళు నడవడం దుస్సాధ్యమయిన

కారణంగా ఖాందేష్‌నుండి దినుసు వచ్చే అవకాశంలేక పూనాపట్టణంలో పావుటన్ను ధాన్యం 64 షిల్లింగులనుండి 70 షిల్లింగులవరకూ అమ్ముతూ, కరువు మూలంగా ఆ పట్టణ వీధుల్లో జనం చచ్చిపోతున్నారు."

రైల్వే మార్గాలు వేయడానికి అవసరమైన కట్టలను నిర్మించేందుకు మట్టిని తీసేస్థలాలలో చెరువులను తవ్వించిన పక్షంలోనూ, వివిధ రైల్వే మార్గాల ప్రక్కనే పంట కాల్వలను తీయించిన పక్షంలోనూ, రైల్వేనిర్మాణం వ్యవసాయానికి సులువుగా తోడ్పడగలుగుతుంది. ఈలాగున ప్రాచ్యంలో వ్యవసాయానికి sine qua non అయిన పంటకాల్వలను విరివిగా విస్తరించడానికి వీలుండి, తద్వారా నీరులేకపోవడంవల్ల అతితరుచుగా సంభవించే స్థానికమైన కరువుకాటకాలను నివారించడానికి వీలవుతుంది. ఈ విషయం దృష్టిలో పెట్టుకుని చూచినట్టయితే, తూర్పు పడమటి కనుమలకు చేరువనున్న జిల్లాలలో కాల్వ నీరు ఆధారంగల భూములు సహితము, అదే విస్తీర్ణంగల కాల్వనీరు ఆధారంలేని భూములకంటె మూడు రెట్లు అధికమైన పన్నులు చెల్లించుతూ, పది రెట్లనుండి పన్నెండు రెట్లవరకూ జీవనోపాధి కల్పించుతూ, పన్నెండునుండి పదిహేను రెట్లవరకూ అధికమైన లాభాలిస్తున్నాయన్న సంగతి మనం జ్ఞప్తికితెచ్చుకుంటే రైల్వేలయొక్క సాధారణ ప్రాముఖ్యత ఎంతగా ఉంటుందో మనకు స్పష్టమై తీరుతుంది.

పైనిక స్థావరాల సిబ్బందినీ ఖర్చులనూ తగ్గించడానికి రైల్వేలు తోడ్పడతాయి. ఫోర్ట్ సెయింట్ విలియమ్‌లో టౌన్‌మేజరైన కర్నల్ వారెన్, హౌస్ ఆఫ్ కామన్స్ సెలెక్ట్ కమిటీ ఎదుట ఈవిధంగా చెప్పాడు:

"దేశంలో దూరస్థలాలనుండి సమాచారం అందడానికి ఇప్పుడు ఎన్ని దినాలేమిటి, ఎన్ని వారాలు పడుతుందో అన్ని గంటలలోనే సమాచారం అందే సాధ్యతా, ఈ కొద్ది కాలపరిమితిలోనే సేనలనూ సామాన్లనూ ఉత్తరువులనిచ్చి పంపించే సాధ్యతా దృష్ట్యా ఈ విషయాలయొక్క ప్రాముఖ్యతను ఎంత అధికంగా చెప్పినప్పటికీ అతిశయోక్తి కానేరదు. మన సేనలను ఇప్పటికంటె ఇంకా మారుమూల వున్నట్టీ, ఆరోగ్యప్రదములైనట్టీ స్థావరాల్లో ఉంచడానికి వీలవుతుంది; వీటి కారణంగా జబ్బులవల్ల మరణాలను విశేషంగా తగ్గించడానికి అవకాశం ఏర్పడుతుంది. అనేక గిడ్డంగులలో ఇప్పుడు సామానులను నిల్వచేసే స్థాయిలో అప్పుడిక నిల్వచేయ వవసర ముండదు; కాగా శీతోష్ణస్థితి కారణంగా సామానులు చెడిపోవడమువల్ల, ధ్వంస మవడమువల్ల కలిగే నష్టం కూడా అప్పుడు కలుగదు. సేనల సార్థకత హెచ్చయిన కొద్దీ అదే నిష్పత్తిలో వాటి సంఖ్యను కూడా తగ్గించివేయడానికి వీలుకలుగుతుంది."

గ్రామ సంఘాల స్వయంపరిపాలనా నిర్మాణ, ఆర్థిక ప్రాతిపదికలు ధ్వంసంచేయబడ్డాయని మనకు తెలుసు; కాని వాటికున్న లక్షణాలన్నిటిలోనూ అత్యంత దుష్టలక్షణం, అచ్చు గుద్దినట్టు ఒకదానివి ఒకటి పోలివట్టి, ఒకదానితో ఒకదానికి సంబంధంలేకుండా వేర్వేరు అణువులకింద విడిపోవడమనే లక్షణం మాత్రం ఇంకా అలాగే ఉండిపోయింది. ఈ గ్రామాల ఏకాంత జీవితస్థితి ఫలితంగానే ఇండియాలో రోడ్లులేకపోవడం ఉత్పన్నంచింది; రోడ్లు లేకపోవడం ఫలితంగా గ్రామాల ఏకాంత జీవితస్థితి మరింతగా శాశ్వతమయిపోయింది. ఈ పరిస్థితి ననుసరించి, ఒక నిర్దిష్టమైన హీనస్థాయినే వున్న సదుపాయాలతోనూ, కడమ గ్రామాలతో ఇంచుమించు సంబంధంలేకుండానూ, సాంఘిక ప్రగతికి అవశ్యమైన వాంఛలూ ప్రయత్నాలూ లేకుండానూ వున్నసంఘం తన మనుగడ సాగించుకుంటూ వచ్చింది. ఈ గ్రామాల స్వయంసమృద్ధ జడత్వాన్ని బ్రిటిష్‌వారు భగ్నంచేసివేసిన తరువాత, రవాణా అవకాశాలను, ఇతర గ్రామాలతో పరస్పర సంబంధాలను పెంపొందించుకోవాలనే నూతన వాంఛను రైల్వేలు ఇక కలిగించుతాయి. అంతేకాకుండా

> "ఇతర దేశాలలోవున్న సాధనాలూ పనిముట్లను గూర్చిన జ్ఞానాన్ని, రైల్వేల ప్రభావానికి లోనైన ప్రతి గ్రామానికీ అందించి, వాటిని సంపాదించుకునే అవకాశం కలుగజేసి, కులవృత్తులను ఆనువంశికంగా అవలంబించుతూ జీతాలు పుచ్చుకుని పనిచేస్తూన్న గ్రామీణ చేతిపనివాళ్ల నైపుణ్యాన్ని దీని ఫలితంగా సంపూర్ణంగా వికసింపజేసి, ఆటుతరువాత దాని లోపాలను తీర్చుతుంది." (చాప్‌మన్, "ఇండియా పత్తి, వాణిజ్యం.")[23]

తమ ఉత్పత్తులకు అవసరమయే పత్తి మొదలైన ముడిసరకులను చౌకగా గుంజుకొనే ఏకైక లక్ష్యంతోనే ఇండియాకు రైల్వేలను సమకూర్చే అభిప్రాయం ఇంగ్లీషు పరిశ్రమాధిపతివర్గానికి ఉందని నాకు తెలుసు. కాని, ఒక దేశంలో వున్న రవాణా వ్యవస్థలో ఒక సారి గనుక మీరు యంత్రాలు ప్రవేశపెట్టారంటే, ఆ దేశంలో ముడి ఇనుమూ రాక్షసిబొగ్గూ ఉన్నపక్షంలో, యంత్రోత్పత్తి చేయకుండా ఆ దేశాన్ని ఆపడం ఇక మీ తరంగాదు. రైల్వే రవాణాయొక్క తక్షణ, వర్తమాన అవసరాలను తీర్చగలిగే పారిశ్రామిక విధానాలను ఆ దేశంలో ప్రవేశపెట్టనిదే, ఒక బ్రహ్మాండమైన దేశంలో విస్తృతమైన రైల్వే మార్గాల అల్లికను మీరు కొనసాగించి దానిని సరైన స్థితిలో ఉంచలేరు; అంతేకాదు, రవాణా వ్యవస్థలో యంత్ర వినియోగాన్ని ప్రవేశపెట్టడం, రైల్వేలతో తక్షణసంబంధంలేనట్టి ఇతర పారిశ్రామిక రంగాలలో కూడా యంత్ర వినియోగానికి తప్పక దారితీసి తీరుతుంది. ఇందుచేత ఇండియాలో ఆధునిక పరిశ్రమకు రైల్వేవ్యవస్థ నిజమైన అంకురార్పణే అవుతుంది. నూతన

శ్రమకు అలవాటుపడగలిగే ప్రత్యేక బుద్ధికుశలతను అలవర్చుకొనేటట్లూ, అందుకు అవసరమయిన సాంకేతిక పరిజ్ఞానాన్ని నేర్చుకొనేటట్లూ హిందూదేశస్థులకు బ్రిటిష్ వారివల్లనే అవకాశాలు లభించుతాయి కాబట్టి ఇది జరగడం మరింత తథ్యం. కలకత్తా టంకశాలలో కొన్ని సంవత్సరాలుగా ఆవిరియంత్రాలను పనిచేయించుతూన్నట్టి దేశీయ ఇంజనీర్లూ, హరిద్వార్ రాక్షసిబొగ్గు జిల్లాలలో ఉన్న అనేక ఆవిరియంత్రాలు నడపడంలో నిమగ్నమైనట్టి ఇంకా ఇతరత్రానూ దేశీయ కార్మికులు ప్రదర్శించుతూన్నట్టి శక్తిసామర్థ్యాలూ, నైపుణ్యకుశలతలూ ఇందుకు ప్రబల నిదర్శనాలు. ఈస్ట్ ఇండియా కంపెనీ యొక్క రాగద్వేషాల ప్రభావాలు పూర్తిగా సోకినట్టి మిస్టర్ కాంబెల్ లాంటివాడికే ఈవిధంగా ఒప్పుకోక తప్పిందికాదు:

> "ఇండియా ప్రజానీకంలో అశేషజనానికి గొప్ప పారిశ్రామికశీలమైన శక్తి వుంది; పెట్టుబడిని సంచయం చేసుకోవడానికి తగిన సామర్థ్యం వుంది; గణిత శాస్త్రాలను గ్రహించగలిగే స్ఫుటమైన మేధాశక్తి వుంది; లెక్కలు కట్టడానికీ, భౌతికశాస్త్రాలు ఆకళింపుచేసుకోవడానికీ చక్కని ప్రజ్ఞ వుంది." "వారి బుద్ధి కుశలతలు అత్యంత శ్రేష్ఠమైనవి" అంటాడతడు.[24]

హిందూ వర్ణవ్యవస్థకు పునాదులైనట్టీ, హిందూదేశ ప్రగతికీ, హిందూదేశశక్తికీ అంతిమ అవరోధాలైనట్టీ అనువంశికములైన శ్రమ విభజనలను, రైల్వేవ్యవస్థ ఫలితంగా ఏర్పడే ఆధునిక పరిశ్రమ తుడిచిపెట్టేస్తుంది.

ఇండియాలో బ్రిటిష్ బూర్జువావర్గం నిర్బంధంగా చేయవలసి వచ్చే కార్యాలేవీ కూడా ప్రజా బాహుళ్యాన్ని విముక్తి చేయనూ లేవు, దాని సాంఘిక స్థితిని భౌతికంగా మెరుగు పర్చనూ లేవు. కేవలం ఉత్పాదక శక్తుల అభివృద్ధిపైనే కాకుండా, ప్రధానంగా వాటిని ప్రజలు భుక్తంజేసుకోవడం పైనే ఇది ఆధారపడి వుంటుంది. ఈ రెండింటికీ తప్పనిసరిగా ఆవశ్యకములైనట్టి భౌతిక పరిస్థితులను మాత్రం అవి తప్పకుండా స్థాపించి తీరుతాయి. బూర్జువావర్గం ఎప్పుడైనా ఇంతకు మించి చేసిందా? రక్తమలినాలలోనుండీ, దారిద్ర్యంలోనుండీ, అవమానంలోనుండీ వ్యక్తులనూ ప్రజలనూ ఈడ్వనిదే బూర్జువావర్గం ఎన్నడైనా ప్రగతిశీలమైన కార్యాన్నొక్కదానినైనా అమలుజరిపిందా?

గ్రేట్ బ్రిటన్‌లోనే నేడున్న పాలకవర్గాల స్థానాన్ని పారిశ్రామిక శ్రామికవర్గం ఆక్రమించుకొనే సమయం వస్తేనే తప్ప, లేదా ఇంగ్లీషువారి దాస్యశృంఖలాలను హైందవులు తమంతటతామే తుత్తునియలుగా తెంచివేసుకునే శక్తిని అభివృద్ధిచేసుకోగలిగే సమయం వస్తేనే తప్ప, తమమధ్య అక్కడక్కడ చెదురుబదురుగా బ్రిటిష్ బూర్జువావర్గం వెద

చల్లిన నూతన సాంఘిక బీజాల ఫలితాలను ఇండియన్లు అంతవరకూ అనుభవించలేరు. ఏది ఏలా ఉన్నప్పటికీ, శాంతిస్వభావులైన దేశీయులలో అట్టడుగు వర్గాలవారు సహితమూ, ప్రిన్స్ సల్తికోవ్ చెప్పినట్టు "sont p us fins et plus adroits que les Ita iens,"* అయినట్టీ విదేశీయులకింద అణగివుండవలసి వచ్చినప్పటికీ, ఆ అణగివుండడానికి సరియైత్తుగా ఒక విధమైన నిశ్చలమైన ఉదాత్తతను ప్రదర్శిస్తూన్నట్టీ, స్వాభావికంగా వారు సుళువుగా అలసటను చెందేవారే అయినప్పటికీ బ్రిటిష్ సైనిక ఆఫీసర్లకు భయసంభ్రమాలను కొలిపినట్టి ధైర్యసాహసాలను ప్రదర్శించినట్టీ, మన భాషలకూ మన మతాలకూ పుట్టినిల్లయినట్టీ, జాట్ రూపంలో పురాతన జర్మన్ జాతి ప్రతినిధినీ, బ్రాహ్మణుని రూపంలో పురాతన గ్రీసు జాతి ప్రతినిధినీ మూర్తీభవింపజేస్తూందో, మహత్తరమైనట్టీ ఆసక్తిదాయకమైనట్టీ ఆ దేశంయొక్క పునరుద్ధరణ అద్యతనభావిలో కాకపోతే సుదూర భవిష్యత్తులోనైనా సరే తప్పక సంభవించి తీరుతుందనే మనం నిస్సందేహంగా ఆశించవచ్చు.

కొన్ని ముగింపు మాటలను చెప్పనిదే ఇండియా విషయాన్ని పూర్తిచేయడం భావ్యం గాదు.

తన స్వదేశంలో మర్యాద అయిన రూపాలను ధరించుతూ, తన స్వదేశాన్ని వదలివెళ్లి వలసదేశాల్లో మాత్రం తన నగ్నస్వరూపంలో స్వైరవిహారం చేస్తూన్నట్టి బూర్జువా నాగరికతయొక్క ప్రగాఢమైన కపటస్వభావమూ, స్వతస్సిద్ధమైన దాని బర్బరత్వమూ మనకళ్ల ముందు బట్టబయలుగా కనబడుతూనేవుంది. ఈ వర్గంవారు ఆస్తిహక్కులను సమర్థించుతారు; కాని బెంగాల్‌లోనూ, మద్రాసులోనూ, బొంబాయిలోనూ వచ్చినలాంటి వ్యావసాయిక విప్లవాలను ఏ విప్లవాత్మక పార్టీ అయినా, ఎన్నడైనా లేవదీసిందా? దొంగలలో గజదొంగ అయినట్టి లార్డ్ క్లైవ్ స్వయంగానే అన్నట్టు, ఇండియాలో మామూలు అవినీతివల్ల వారి డబ్బుదాహం తీరనప్పుడు దుర్మార్గమైన బలాత్కారచౌర్యానికి వారు ఒడిగట్టలేదా? జాతీయరుణంయొక్క అనుల్లంఘనీయమైన పవిత్రతను గూర్చి వారు యూరప్‌లో ప్రేలాపనలు గావించుతూ, అదే సమయంలో ఇండియాలో కంపెనీ నిధులకోసం తమ ప్రైవేటు నిల్వధనాన్ని పెట్టుబడిపెట్టిన రాజులకు లాభాలు పంచిపెట్టకుండా వాటిని వీరు జప్తుచేయలేదా? "పవిత్రమైన మన మతాన్ని" పరిరక్షించాలన్న సాకుతో ఫ్రెంచి విప్లవంపై వీరు యుద్ధం సాగించి, అదే సమయంలో ఇండియాలో క్రిస్టియన్ మతప్రచారం చేయకూడదంటూ వీరు నిషేధించలేదా? ఒరిస్సా, బెంగాల్‌లలో వున్న దేవాలయాల యాత్రార్థం

---

* "ఇటాలియన్లకంటె వీరు సున్నిత స్వభావులు, మరింత నేర్పరులు" అని అర్థం Saltykov's "Lettres sur l'Inde," Paris, 1848, p. 61–80 (సల్తికోవ్ రచించిన "ఇండియాను గురించిన లేఖలు," పారిస్, 1848, పుటలు 61–80). – సం.

ప్రవాహాలుగా వచ్చే తీర్థప్రజలనుండి డబ్బుచేసుకోడానికై, జగన్నాథ దేవాలయంలో జరిగే హత్య, వ్యభిచారాల వర్తకవ్యాపారాన్ని వీరు కూడా సాగించలేదా? వీరూ "ఆస్తి, శాంతిభద్రతలు, కుటుంబం, మతం" అంటూ బోధించేవారు.

యూరప్ అంతటి బ్రహ్మాండమైన, 15 కోట్ల ఎకరాల విస్తీర్ణం కలిగిన ఇండియాకు సంబంధించి మనం పరిశీలించినట్టయితే, ఇంగ్లీషు పరిశ్రమయొక్క వినాశకర ఫలితాలు ప్రస్ఫుటంగానూ, మనస్సును వ్యాకులపరచేవిగానూ ప్రత్యక్షమవుతున్నాయి. కాని, అవి నేడు అమలులో వున్నట్టి యావత్తు ఉత్పత్తి విధానంయొక్క కేవల స్వాభావిక ఫలితాలే అని మాత్రం మనం మర్చిపోగూడదు. పెట్టుబడియొక్క సార్వభౌమాధిపత్య పాలనపైనే ఈ ఉత్పత్తి ఆధారపడుంది. ఒక స్వతంత్రమైన శక్తిగా పెట్టుబడి మనగల్గడానికి పెట్టుబడి కేంద్రీకరణ అనివార్యం. ప్రపంచమార్కెట్టులపైన ఆ కేంద్రీకరణయొక్క విధ్వంసకర ప్రభావం, నేడు నాగరికతచెందిన ప్రతి పట్టణంలోనూ పనిచేస్తూన్నట్టి అర్థశాస్త్ర అంతర్గత సజీవ నియమాలనే బృహత్తర పరిమాణాలలో బహిరంగపరుస్తున్నాయి. నూతన ప్రపంచంయొక్క భౌతిక ప్రాతిపదికను – ఇటు మానవాళియొక్క పరస్పరాధారంపైనా, పరస్పర సాంగత్యానికి అవసరమైన సాధనాలపైనా ఆధారపడినట్టి విశ్వమానవ సాంగత్యమూ, అటు మానవుని ఉత్పాదక శక్తుల అభివృద్ధి, ప్రకృతిశక్తులయొక్క విజ్ఞానశాస్త్ర ప్రాబల్య స్వరూపంగా వస్తూత్పత్తిని రూపొందించడమూ – బూర్జువా చారిత్రకయుగం సృష్టించాల్సి ఉంది. భూగర్భశక్తి జనితమైన విప్లవాలు ఏలాగైతే భూమి ఉపరితలాన్ని సృష్టించాయో, ఆవిధంగానే బూర్జువా పరిశ్రమా, వాణిజ్యమూ నూతన ప్రపంచంయొక్క ఈ భౌతిక పరిస్థితులను సృష్టించుతాయి. బూర్జువా శక ఫలితాలపై – ప్రపంచ మార్కెట్టుపైనా, ఆధునిక ఉత్పాదక శక్తులపైనా – బృహత్తరమైన ఒక సామాజిక విప్లవం ఎప్పుడైతే తన ఆధిపత్యాన్ని స్థాపించుకుని, ప్రజలందరిలోనూ ప్రగతిశీలురైనవారి సమిష్టి అదుపాజ్ఞలకు వాటిని లోనుచేస్తుందో, అప్పుడు మాత్రమే, తాను సంహరించినవారి పుర్రెలనుండే తప్ప వేరొక పాత్రనుండి అమృతాన్ని పానంచేయని భయానక స్వరూపి అయిన ఆ పూజా విగ్రహ మూర్తిని మానవ ప్రగతి పోలడం మానుతుంది.

మార్క్సుచే 1853 జూలై 22న
రచించబడింది
"New-York Daily Tribune"
1853 ఆగస్టు 8వ తేదీన
3840వ సంచికలో ప్రచురించడింది
సంతకం: కార్ల్ మార్క్సు

# మార్క్స్

# ఇండియా సైన్యంలో తిరుగుబాటు[25]

"Divide et impera"* అనే మహా రోమన్ సూత్రాన్ని గ్రేట్ బ్రిటన్ అవలంబించడంవల్లనే, సుమారు నూటయాభై ఏళ్లపాటు ఇండియన్ సామ్రాజ్యాన్ని తన స్వాధీనంలో ఉంచుకోగలిగింది. వివిధ జాతుల, తెగల, కులాల, మతాల, సంస్థానాల పరస్పర వైరమే — వీటన్నింటి మొత్తమే ఇండియా అనబడే భౌగోళిక భాగం — బ్రిటిష్ పరిపాలన మౌలిక సూత్రంగా ఉండేది. తదుపరి కాలంలో మాత్రం ఆ సార్వభౌమాధికార పరిస్థితులలో ఒక మార్పు సంభవించింది. సింధు, పంజాబులను జయించడంతో ఆంగ్లో-ఇండియన్ సామ్రాజ్యం తన నైసర్గిక పరిమితులను అందుకోవడమే కాకుండా, భారతీయ స్వతంత్ర సంస్థానాల చిట్టచివరి అవశేషాలను సహితమూ అది కాలరాసేసింది. పరాక్రమముగల దేశీయ తెగలన్నీ లొంగదీసుకోబడ్డాయి, తీవ్రమైన దేశీయ అంతరంగిక కలహాలన్నీ తుదముట్టాయి; ఇక ఇంకా మిగిలి నామమాత్ర స్వాతంత్ర్యాన్ని అనుభవించుతూన్న స్వదేశ సంస్థానాలు తమ మనుగడను కేవలం బ్రిటిష్‌వారి దయాధర్మభిక్షంపైనే సాగించగల్గుతాయని దరిమిలా అయోధ్య విలీనీకరణం[26] సంతృప్తికరంగా రుజువుచేసింది. వీటన్నిటి ఫలితంగా ఈస్ట్ ఇండియా కంపెనీయొక్క పరిస్థితిలో పెద్ద మార్పు సంభవించింది. ఇదివరకటిలాగున ఇండియాలో ఒక ప్రాంతం సహాయంతో ఇంకొక ప్రాంతంపై దండెత్తడం ఇక దానికి అవసరమేలేకపోగా, ఇండియా అంతా దానికి పాదాక్రాంతమయిపోయి ఇండియా కంతటికీ తను ఆధిపత్యాన్ని వహించే అగ్రస్థానం ఆక్రమించుకున్నట్లు అది తెలుసుకుంది. ఇకనుండి యుద్ధాల్లోకి దిగనవసరం లేకుండా తానే ఏకైక విజేతగా మారిపోయింది. దాని అధీనంలో ఉన్నట్టి సేనలకు ఇక తన రాజ్యాన్ని విస్తరించడం బదులు దానిని పరిరక్షించడమే కర్తవ్యమయింది. తన సైనికులనది యుద్ధభటులు బదులు పోలీసులుగా మార్చివేసింది; ఇంగ్లీషు ఆఫీసర్లను

* "విభజించి పాలించు." — సం.

కలిగినట్టి 2,00,000 దేశీయ సైన్యానిచే 20,00,00,000 జనసంఖ్య లొంగదీయబడి, ఇక దేశీయ సైన్యం వంతు వచ్చేసరికి, దీనిని 40,000 ఇంగ్లీషు సైన్యం అదుపాజ్ఞలలో ఉంచుతూంది. పైచూపులకు దేని సృష్టిలోనైతే భారతదేశ ప్రజకు ఎన్నడూ లేనట్టి దేశవ్యాప్తమైన ప్రథమ సాధారణ ప్రతిఘటన కేంద్రాన్ని బ్రిటిష్‌వారే సృష్టించారో, అట్టి దేశీయ సైన్యంయొక్క భక్తివిశ్వాసాలపైనే భారతీయుల రాజభక్తి అంతా ఆధారపడి ఉందన్నట్టే అగుపడుతుంది. ఇట్టి దేశీయ సైన్యంపైన ఎంతవరకు ఆధారపడవచ్చునో, పర్షియా యుద్ధం[27] ప్రజ్వరిల్లి నఫలితంగా, బెంగాల్ రాష్ట్రంలోవున్న యూరపియన్ సైనికులందరూ అక్కడనుండి వెళ్లిపోయిన తక్షణమే భారతీయ సైన్యంలో ఇటీవల జరిగిన తిరుగుబాట్ల వల్లనే తేటతెల్లమవుతూంది. ఇంతకు ముందుకాలంలోనూ భారత సైన్యంలో తిరుగుబాట్లు జరిగాయి; కాని ఇప్పుడు జరుగుతూన్న తిరుగుబాటుకి[28] స్వభావసిద్ధమైనట్టి, వినాశకరమైనట్టి లక్షణాలు ఉన్నాయి. తమ యూరపియన్ ఆఫీసర్లను సిపాయి రెజిమెంట్లు చంపివేయడం ప్రప్రథమంగా ఇప్పుడే జరిగింది; హిందువులూ మహమ్మదీయులూ, పరస్పర వైషమ్యాలను విసర్జించి, తమ ఉమ్మడి ప్రభువులపై సమిష్టిగా తిరుగబడడమూ, "హిందువులలో ఆరంభమైన అల్లర్లు, ఢిల్లీ సింహాసనంపై మహమ్మదీయ చక్రవర్తిని* వాస్తవంగా అధిష్ఠింపజేయడంతో తుట్టతుదకు అంతమొందడమూ;" తిరుగుబాటు ఏకొద్ది ప్రాంతాలకో పరిమితమై ఉండకపోవడమూ ఇప్పుడే ప్రప్రథమం; ఆఖరి విషయం, పర్షియా, చైనా యుద్ధాలతో[29] బెంగాల్ తిరుగుబాటుకి నిస్సంశయంగా అవినాభావసంబంధముండి, ఇంగ్లీషు సార్వభౌమాధికారంపట్ల ఆసియా ఖండపు మహత్తర జాతులు ప్రదర్శించిన సర్వసాధారణ ద్వేషభావాన్నే ఆంగ్లో-ఇండియన్ సైన్యంలో తిరుగుబాటు కూడా ప్రతిబింబించడమూ, ఇదే ప్రథమ పర్యాయం.

బెంగాల్ సేనలో నాలుగునెలల క్రితం ఆరంభమైన అసంతృప్తికి తమ మతంలో ప్రభుత్వం జోక్యం కలుగజేసుకుంటుందనే అనుమానం దేశీయులలో కలగడమే కారణమని తలచబడుతోంది. ఎద్దుకొవ్వుతోనూ, పందికొవ్వుతోనూ పూతపూయబడిన కాగితంతో చుట్టి వున్నట్టు చెబుతూన్న తూటాలను దేశీయులకు ఇవ్వడమూ, అందువల్ల ఈ కాగితాన్ని తప్పనిసరిగా వారు పంటితో కరకవలసి వుండడంవల్ల తమ మతాలు ఆదేశించిన నియమాలను ఉల్లంఘించడమే కాగలదని దేశీయులు భావించడమూ, స్థానికంగా జరిగిన అల్లర్లకి సంకేతంగా ఏర్పడింది. జనవరి 22న కలకత్తాకి కొద్ది దూరంలో వున్న కంటోన్మెంట్లలో గృహదహనాలు జరిగాయి. ఫిబ్రవరి 25న, తమకు ఇచ్చిన తూటాలకు అభ్యంతరం చెబుతూ బర్హంపూర్‌లో వున్న 19వ దేశీయ రెజిమెంటు తిరుగుబాటుచేసింది. మార్చి 31న ఆ

---

* రెండవ బహదూర్ షా. — సం.

రెజిమెంటును ఎత్తివేసేశారు; మార్చి ఆఖరిరోజుల్లో బారక్‌పూర్‌లో మకాంచేస్తూన్న 34వ సిపాయి రెజిమెంటు, కవాతుమైదానంమీద వరుసలుతీర్చి నిలబడి వుండగా తమలోనుండే ఒక సిపాయి తూటా దట్టించిన తుపాకి ధరించి రెజిమెంటు పంక్తి ఎదుటకు వెళ్లినిలబడినా అలా ఉండనిచ్చి, తన తోడివారిని తిరగబడమని ఇతడు పిలుపునిచ్చి, తన రెజిమెంటు అజ టెంటుపైనా, సార్జెంటుమేజరుపైనా తిరగబడి వారిని గాయపర్చినా ఆ సిపాయిని ఏమీ చేయకుండా ఊరుకుంది. దీనితో చెలరేగిన బాహాబాహీ ఘర్షణలో వందలాది సిపాయిలు తమకేమీ పట్టనట్టు చూస్తూ ఊరకుని వుండగా, మిగిలినవారు పోరాటంలో పాల్గొని తమ తుపాకుల మడమలతో ఆ రెజిమెంటు ఆఫీసర్లపై దాడిచేశారు. దరిమిలా ఆ రెజి మెంటు కూడా ఎత్తివేయబడింది. ఏప్రిల్‌నెలంతా కూడా అలహాబాదు, ఆగ్రా, అంబా లాలలో బెంగాల్ సేనయొక్క అనేక కంటోన్మెంట్లలో అగ్ని ప్రమాదాలు జరగడమూ, మీరట్‌లో వున్న 3వ లైట్ కేవెల్‌రీ రెజిమెంటు తిరుగుబాటుచేయడమూ, మద్రాసు, బొంబాయి సేనలలో కూడా ఈవిధమైన అధికారధిక్కరణ సూచనలు కనబడడమూ సంభవించాయి. మేనెల ఆరంభంలో అయోధ్యకి ముఖ్యపట్నమైన లక్నోలో తిరుగుబాటుకి సన్నాహాలు ప్రారంభమయాయి; కాని సర్ హెచ్. లారెన్స్ సకాలంలో చర్యలను తీసుకొని ఇది జరగకుండా చేశాడు. మీరట్‌లో 3వ లైట్ కేవెల్‌రీ రెజిమెంటుకు చెందిన తిరుగు బాటుదార్లను, వారిపై విధించిన ఖైదుశిక్షలు అమలుజరపడానికని మే 9వ జైలుకు నడిపించి తీసుకువెళ్లారు. ఆ మరుచటివాడు సాయంకాలం 11వ, 20వ దేశీయ రెజిమెం ట్లతో కలసి 3వ కేవెల్‌రీ రెజిమెంటు తాలూకు కొంతమంది అశ్వికులు కవాతుమైదానం మీద గుమికూడి, తమను సముదాయింప ప్రయత్నిస్తూన్న ఆఫీసర్లపై తిరగబడి వారిని చంపేసి, కంటోన్మెంట్లకి నిప్పంటించి, తమకు దొరికిన ఇంగ్లీషువారినందరినీ నరికేశారు. ఆ బ్రిగేడ్‌లోని బ్రిటిష్ విభాగం మరొక పదాతి, అశ్విక రెజిమెంటునూ, అత్యధిక సంఖ్యలోవున్న అశ్విక, పదాతి ఫిరంగిదళాన్నీ సమీకరించినప్పటికీ, వీరిని చీకటిపడేలోపున తిరుగుబాటుదార్ల మీదికి నడిపించడానికి వీలైందికాదు. తిరుగుబాటుదార్లకు వీరేమీ నష్టం కలిగించకుండానే, వారిని వెళ్లడిగా వున్న ప్రదేశంగుండా వెళ్లనివ్వడంచేత, మీరట్‌నుండి సుమారు నలభై మైళ్ల దూరంలో వున్న ఢిల్లీదిశగా తిరుగుబాటుదార్లు బయల్దేరారు. అక్కడ రక్షణార్థం కోటలో దండువిడిసివున్న 38వ, 54వ, 74వ పదాతి రెజిమెంట్లూ, ఒక దేశీయ ఫిరంగి కంపెనీ వీరితో చేరాయి. అక్కడున్న బ్రిటిష్ ఆఫీసర్లని వీరు అటకాయించి, ఆ చుట్టు పట్లలో తమకు చిక్కిన ఇంగ్లీషువారి నందరినీ హత్యచేసి, గతించిన ఢిల్లీ మొగల్ పాదుషా*

* రెండవ అక్బర్. — సం.

వారసుడిని* ఇండియా చక్రవర్తిగా ప్రకటించారు. ఈలోపున మీరట్‌లో శాంతి భద్రతలు తిరిగి నెలకొల్పబడి, తరువాత అక్కడకు సహాయార్థం పంపబడిన ఆరు దేశీయ సాపర్స్ అండ్ మైనర్స్ కంపెనీలు అక్కడకు మే 15న చేరుకొని, వారి కమాండింగ్ ఆఫీసరైన మేజర్ ఫ్రేజర్‌ను హత్యచేసి, వెల్లడిగా వున్న మైదాన ప్రదేశంలోకి ప్రవేశించారు. వీరిని తరుముతూ అశ్విక ఫిరంగి దళపు సైనికులూ, 6వ డ్రగూన్ గార్డ్స్‌కు చెందిన చాలా మంది సైనికులూ వీరివెంటబడ్డారు. ఏభై అరవైమంది తిరుగుబాటుదార్లను వీరు తుపాకులతో కాల్చి చంపేయగలిగారు; కాని కడమ తిరుగుబాటుదార్లందరూ తప్పించుకుని ఢిల్లీ చేరుకున్నారు. పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్‌లో వున్న 57వ, 45వ దేశీయ ఇన్‌ఫెంట్రీ రెజిమెంట్లు తిరుగుబాటు చేశాయి, గాని బలప్రయోగంచేసి ఆ తిరుగుబాటును అణచివేశారు. లాహోర్‌లోవున్న దేశీయ పటాలాలన్నీ కూడా బాహాటంగా తిరుగుబాటులో వున్నాయని ఆ పట్నంనుంచి అందిన ప్రైవేటు ఉత్తరాలవల్ల తెలుస్తూంది. కలకత్తాలో మకాం చేస్తూన్న సిపాయిలు సెయింట్ విలియమ్ కోటను[30] స్వాధీనంచేసుకోవడానికి మే 19న ప్రయత్నించేశారు గాని, ఆ ప్రయత్నం విఫలమైంది. బుషైర్‌నుండి బొంబాయికి మూడు రెజిమెంట్లు చేరగానే, వాటిని తక్షణమే కలకత్తాకు పంపారు.

ఈ ఘటనలవన్నింటినీ సమీక్షచేయగా, మీరట్‌లో వున్న బ్రిటిష్ సేనానియొక్క** ప్రవర్తన — తిరుగుబాటుదార్లను వెంబడించడంలో అతడు కనబర్చిన దుర్బలత అలా వుండగా, యుద్ధరంగంపై హాజరవడంలో అతడు చూపినట్టి అంతకంటెనూ అమాహ్యమైన జాప్యం — అత్యాశ్చర్యకరంగా కనబడక మానదు. యమునానదికి ఎడమ ఒడ్డున మీరట్టూ, కుడి ఒడ్డున ఢిల్లీ ఉండడంవల్లనూ, ఈ ఒడ్డునుంచి ఆ ఒడ్డుకు ఒకేఒక వంతెన ఢిల్లీలో ఉండడంవల్లనూ, పలాయితులను అడ్డంకొట్టడం కన్న సులభతరమైన పని మరొకటి వుండేది కాదు.

ఈలోపల తిరుగుబాటు సూచనలు ప్రదర్శించిన జిల్లాలన్నింటిలోనూ సైనిక శాసనం ప్రకటించారు; ప్రధానంగా దేశీయ పటాలాలతో ఏర్పడిన సైన్యాలు ఉత్తరంనుండీ, తూర్పునుండీ, దక్షిణంనుండీ ఢిల్లీకి వ్యతిరేకంగా కేంద్రీకృతమవుతున్నాయి; ఢిల్లీ చుట్టుపట్ల వున్న సంస్థానాధీశులు ఇంగ్లీషువారి పక్షం వహిస్తామని మాటయిచ్చినట్లు తలచబడింది; చైనాకు సేనలతో బయలుదేరిన లార్డ్ ఎల్జిన్‌నూ, జనరల్ ఏష్‌బర్న్‌హామ్‌నూ వెనక్కి రావలసినదిగా సింహళానికి ఉత్తరాలు వెళ్లాయి; ఇక కడపటి విషయం, సుమారు ఒక పక్షందినాలలో ఇంగ్లండునుండి 14,000 బ్రిటిష్ సైనికులు ఇండియాకు పంపబడ

* రెండవ బహదూర్ షా. — సం.

** జనరల్ హెవిట్. — సం.

పోతున్నారు. ఇప్పుడు ఇండియాలో కాలమానమూ, రవాణా సాధనాలు పూర్తిగా లేకపోవడమూ బ్రిటిష్ సేనల గమనానికి ఎట్టి అవరోధాలను కల్గించినప్పటికీ, ఢిల్లీలో వున్న తిరుగుబాటుదార్లు సుదీర్ఘమైన ప్రతిఘటనను కొనసాగించకుండానే లొంగిపోవడమే అత్యంత సంభవం. అలాగే జరిగినప్పటికీ, అనివార్యంగా సంభవించితీరవలసినట్టి భయోత్పాదకమైన విషాదాంత నాటకానికి ఇది కేవలం నాంద్రిప్రస్తావనే కాగలదు.

మార్క్స్‌చే 1857 జూన్ 30న
రచించబడింది

"New-York Daily Tribune"
1857 జూలై 15వ తేదీన
5065వ సంచికలో
ఒక సంపాదకీయ వ్యాసంగా
ప్రచురించబడింది

# మార్క్స

# ఇండియాలో తిరుగుబాటు

లండన్, జూలై 17, 1857

జూన్ 8వ తేదీనాటికి, ఢిల్లీ పట్నం సిపాయి తిరుగుబాటుదార్ల వశమై, అక్కడ మొగల్ పాదుషాను* చక్రవర్తిగా ప్రకటించి సరిగ్గా నెలరోజులైంది. అయితే, బ్రిటిష్ సైన్యాలను ఎదుర్కొని పురాతన ఢిల్లీని వారు తమ స్వాధీనంలోనే నిలబెట్టుకోగలుగుతారని అనుకోవడం కేవలం అసంబద్ధమైన భ్రమ తప్ప మరేమీకాదు. ఢిల్లీచుట్టూ ఒకేఒక కోటగోడ, ఒక సామాన్యమైన కందకమూ వున్నాయి; ఆ నగరంచుట్టూ వున్న కొండలు అప్పుడే ఇంగ్లీషువారి చేతుల్లోకి రానేవచ్చేశాయి; ఇక ఇంగ్లీషువారు కోటగోడపై ఫిరంగి గుళ్ల వర్షం కురిపించకుండానే, నగరానికి మంచినీటి సరఫరాను బంద్ చేయడమనే అత్యంత సులభమైన మార్గాన్ని అవలంబించి అనతికాలంలో నగరం లొంగిపోయేటట్లు చేయగలరు. అంతేకాకుండా, తమ సొంత ఆఫీసర్లనే చంపేసి, క్రమశిక్షణా బంధాలను తెంచుకొని, తమకు సర్వసేనానిగా ఉండేవానిగా ఎవ్వరినీ నియమించుకొనలేకపోయినట్టి నానాగోత్రీకులైన చీకిరీ బాకిరి తిరుగుబాటు సిపాయిలకి దృఢసంకల్పంతో కూడిన సుదీర్ఘ ప్రతిఘటనను పకడ్బందీగా ఆర్గనైజుచేసుకోగలగడం ఎప్పటికీ ఏమాత్రమూ సాధ్యం కాదు. అసలే గందరగోళంగా వున్న పరిస్థితిని మరింత తక్కిడిబిక్కిడి తారుమారుచెయ్యడానికై ముందుగానే ఒక పథకాన్ని తయారుచేసుకున్నాయా అన్నట్లు, బెంగాల్ రాష్ట్రం నాలుగు చెరగుల నుండీ తిరుగుబాటుదార్ల కొత్తజట్లు దినమూ ఢిల్లీలోకి మూగుతూ తన భావి దుర్ఘటన స్థిరపడిపోయినట్టి ఆ నగరంలో పోగై చెల్లాచెదరుగా వున్న శ్రేణులతో ప్రవాహంలా ఏకమై మరింత చిందరవందర చేసేస్తున్నాయి. మే 30వ, 31వ తేదీలలో తిరుగుబాటుదార్లు కోటగోడలనుండి బైటికివచ్చి సాహసించి చేసిన ఉధృతగతిదాడులు రెండింటిలోనూ కూడా వారు విపరీతమైన నష్టాలు పొంది వెనక్కి తరిమివేయబడడం చూస్తే, ఇవి స్వశక్తి

---

* రెండవ బహదూర్ షా. — సం.

విశ్వాసంతోనూ, బలంవుందనే భరవసాతోనూ చేసినట్టివిగా కాకుండా, కేవలం నిరాశా నిస్పృహ జనితములైనవిగావే కనబడుతున్నాయి. యుద్ధచర్యలను కొనసాగించడంలో బ్రిటిష్ వారు తీసుకుంటున్న అలసత్వమే ఆశ్చర్యాన్ని కలిగిస్తూంది; అయితే ఘోరంగా వున్న ఈ కాలమాన పరిస్థితులూ, రవాణా సాధనాల లేమీ ఇందుకు కారణాలు కావచ్చు. బ్రిటిష్ సర్వ సేనాని జనరల్ ఏన్సన్ చనిపోవడం అటుండగా, ఇప్పటికప్పుడే ఇంచుమించు 4,000 యూరపియన్ సైనికులు ప్రాణంతాకమైన తాపానికి తాళలేక చనిపోయారని ఫ్రెంచివారు రాసిన ఉత్తరాలవల్ల తెలుస్తూంది; ఢిల్లీకోట ముందు జరిగిన సంఘర్షణలలో శత్రువు తుపాకి గుండ్లకంటె వడ తగిలే హెచ్చుమంది సైనికులు దెబ్బతిన్నారని ఇంగ్లీషు వార్తాపత్రికలే ఒప్పుకుంటున్నాయి. అంబాలాలో విడిసిన ప్రధాన బ్రిటిష్ సైన్యానికి రవాణాసాధనాల కొరతకారణంగా, ఢిల్లీకి నడచుకొని రావడానికి ఇంచుమించు ఇరవైయ్యేదు రోజులు పట్టింది; అంటే రోజుకు గంటన్నర చొప్పున తరలిరాగలిగిందన్నమాట. అంబాలాలో భారీ ఫిరంగులు లేకపోవడంవల్ల, అక్కడకు అన్నిటికంటే సమీపంలోవున్న ఆయుధశాల సట్లెజ్ నదికి ఆవతలి ఒడ్డున ఎంతో దూరంలో వున్న ఫిల్లవుర్‌లో వుండడం వల్లనూ, అక్కడ నుండి ముట్టడి ఫిరంగుల శ్రేణిని తీసుకురావలసి ఉండడంచేతనూ మరికొంత ఆలస్యానికి కారణమైంది.

ఇన్ని యిబ్బందులున్నా, ఢిల్లీ పడిపోయిందనే ఖబురు ఏరోజనైనా అందవచ్చు; కాని దానితరువాత ఏమిటి? బెంగాల్ సైన్యాన్ని సాంతంగా విచ్ఛిన్నం చేయడానికీ, కలకత్తాలో ప్రారంభమయిన తిరుగుబాటూ, పటాలాలనుండి పరారీ ఉత్తరాన వున్న పంజాబుకూ, పశ్చిమాన వున్న రాజపుత్రస్థానానికీ పాకిపోయి విస్తరించడానికీ, ఇండియాలో ఈ మూల నుండి ఆ మూలకు బ్రిటిష్ అధికారాన్ని గడగడ వణకించివేయడానికీ, భారత సామ్రాజ్యానికి సాంప్రదాయసిద్ధమైన కేంద్రస్థానం తిరుగుబాటుదార్ల చేతుల్లో ఒక్క నెలరోజులపాటు విరామటంగా స్వాధీనమయివుండడమే మహోద్భుతమైన ఉల్పోటన శక్తిగా బహుశా పనిచేసిన పక్షంలో, ఢిల్లీ పతనమే, సిపాయిల శ్రేణులలో అది ఎంత భయోత్పాతాల్ని కల్గించినప్పటికీ, తిరుగుబాటుకి స్వస్తిచెబుతుందనీ, బ్రిటిష్ పరిపాలనను పునరుద్ధరించడానికి సరిపోతుందనీ అనుకోవడమంత పొరపాటు అదేకాని మరొకటుండదు. 28,000 రాజపుత్రులూ 23,000 బ్రాహ్మణులూ, 13,000 మహమ్మదీయులూ, 5,000 నిమ్న కులాలకు చెందిన హిందువులూ, కడమవారు యూరపియన్లూ ఉన్నట్టి 80,000 సైనికులు గల బెంగాల్ సైన్య మంతటిలోనూ, తిరుగుబాటు వల్లనైతేనేమి, పరారీ వల్లనైతేనేమి, పటాలంనుండి బర్తరఫు వల్లనైతేనేమి 30,000 ఇప్పుడు కనబడ్డంలేదు. ఇక మిగిలిన సైన్యం విషయంలో, చాలా రెజిమెంట్లు బ్రిటిష్ అధికారంపట్ల ఎప్పటివలెనే తాము విశ్వాసంగానే ఉండి దానిని బలపరుస్తామని బహిరంగంగానే ప్రకటించినప్పటికీ,

దేశీయ సైనికులు ఇప్పుడు విముగ్నులై యున్న విషయంలో మాత్రం, దేశీయ రెజిమెంట్లలోని, తిరుగుబాటుచేసినవారికి వ్యతిరేకంగా మాత్రం తాము అధికార్లకి సహాయపడమనీ, అందుకు భిన్నంగా తమ "భాయీలకే" (సోదరులకే) తాము సహాయంచేస్తామనీ, మినహాయింపుగా ఒక షరతును పెట్టాయి. దీనిలో ఎంత నిజముందో కలకత్తాలోవున్న ఇంచుమించు ప్రతి సైనికస్థావరంలో జరిగిన ఉదంతాలవల్లనే తెలిసిపోతూంది. కొద్దికాలంవరకూ దేశీయ పటాలాలు స్తబ్ధుగానే ఉన్నాయి; కాని ఇక బలంగా ఉన్నాం మరేమీ ఫరవాలేదని వారికి ధీమా తోచినవెంటనే వారు తిరుగుబాటు గావించారు. ఇంతవరకూ తమ భావాలను ఎటూ ప్రకటించని రెజిమెంట్లయొక్క, తిరుగుబాటుదార్లతో ఇంతవరకూ చేరనట్టి దేశీయ ప్రజలయొక్క "రాజభక్తి"ని గూర్చి లండన్ "Times"[31] పత్రికకు ఇండియానుండి ఒక విలేకరి రాసినదాన్నిబట్టి ఎట్టిసందేహానికీ తావులేకుండా స్పష్టంగా తెలుస్తూంది.

> "అంతా ప్రశాంతంగా వుంది అని మీరు పత్రికల్లో చదివితే, దేశీయ సైనికులు ఇంకా బాహాటంగా తిరుగుబాటులోకి దిగలేదనీ, ప్రజలలో అసంతృప్తితో మణిగివున్న భాగాలు ఇంకా బాహాటంగా తిరగబడడంలేదనీ; తాము ఇంకా బలహీనులుగా ఉన్నామనో, లేక బలహీనులుగా ఉన్నామని అనుకోవడం కారణంగానో, లేక ఇంతకంటె అనుకూలమైన తరుణానికోసమే వేచివున్నారనో, మీరు అర్థంచేసుకోండి. బెంగాల్ దేశీయ రెజిమెంట్లలో ఏదైనా కాల్బల రెజిమెంటుకాని, అశ్విక రెజిమెంటుకాని 'రాజభక్తి ప్రదర్శన గావించింది' అని మీరు చదివినట్టయితే, ఈవిధంగా అనుకూలమైనదిగా పేర్కొనబడిన రెజిమెంటులో సగం భాగమే నిజంగా విశ్వసనీయులైనవారనీ, కడం భాగం యూరపియన్లని నమ్మించి గోతులో తొయ్యడానికని మంచి అదనుకోసం వేచివుంటూ ఒక నాటకం మాత్రమే ఆడుతున్నారనీ, లేదా తమమీద అనుమాన పడకుండా తప్పించుకుని, తత్ఫలితంగా తిరుగుబాటులో పాల్గొనే తమ సహచరులకు మరింతగా సహాయపడగలిగే శక్తి సంపాదించడానికే ఈవిధంగా నటిస్తున్నారనీ మీరు అర్థంచేసుకోండి" అని రాశాడు.

దేశీయ పటాలాలను ఎత్తివేయడంవల్ల మాత్రమే పంజాబ్‌లో బహిరంగ తిరుగుబాటును నివారించడానికి వీలయింది. అయోధ్య అంతటిలోనూ ఒక్క లక్నో మాత్రమే, అందులోనూ ఒక్క రెసిడెన్సీ మాత్రమే బ్రిటిష్‌వారి చేతుల్లో ఇంకా మిగిలి వుందని చెప్పవచ్చు; తక్కిన అన్నిచోట్లా దేశీయా పటాలాలు తిరగబడి, మందుగుండు సామగ్రితో తప్పించుకునిపోయి, బంగాళాలన్నింటినీ నేలమట్టంగా తగలబెట్టేసి, సాయుధులై తిరుగుబాటులేవదీసిన వారితో ఏకమయిపోయారు. రాజపుత్రస్థానంలో లాగే పంజాబులో

కూడా, శీఘ్రగమన దళాలను స్థాపించవలసిన అవసరం ఏర్పడిందని భావించడాన్నిబట్టే ఇంగ్లీషు సేనయొక్క వాస్తవపరిస్థితి స్పష్టంగా బయటపడుతూంది. వివిధ స్థలాల్లో చెదురు మదురుగా ఉన్న తమ సైన్యాల మధ్య రాకపోకల మార్గాలను వెల్లడిగా వుంచే విషయంలో తమ సిపాయి పటాలాలపైనగాని దేశప్రజలపైనగాని వారు ఆధారపడడంలేదనే దీనివల్ల అర్థమవుతూంది. ద్వీపకల్ప యుద్ధంలో[32] ఫ్రెంచివారిలాగున తమ సైనికులు ఆక్రమించుకొన్న ఆ రవంత స్థలమూ, ఆ రవంత ఉన్నతస్థలంనుండి దాడిచేసి స్వాధీనంచేసుకోగలిగిన చుట్టుపక్కల ప్రదేశమూ తప్ప మరేదీ వీరి స్వాధీనంకింద లేదు; ఇక పోతే ఒకదానినుండి ఒకటి వేరువేరుగా విడిపోయివున్న వారి సైనికస్థావరాల మధ్య రాకపోకల మార్గాలను కట్టుదిట్టం చేసుకోవడంకోసం శీఘ్రగమన దళాలపైనే వీరు ఆధారపడుతున్నారు; అయితే ఈ దళాల సైనికచర్య ఫలితం స్వతహాగా ఎల్లప్పుడూ అనిశ్చితంగానే ఉండడమేకాకుండా, దానికి తోడు అవి గస్తీతిరిగే ప్రదేశం విస్తృతమైనకొద్దీ వాటి చర్యయొక్క ఉధృతం కూడా సహజంగానే తగ్గిపోతూంటుంది. తిరుగుబాటు చిహ్నలను ప్రదర్శించిన నగరరక్షక దళాలనుండి అక్కడున్న ఖజానాలను తరలించి వేయడానికని సిపాయిలనే వినియోగించక బ్రిటిష్‌వారికి మరి గత్యంతరంలేకపోగా, ఇలాగు తరలించిన ప్రతిసారీ మార్గమధ్యంలో సిపాయిలు తిరుగబడి తమకి ఒప్పజెప్పిన ఖజానాతోసహా పరారైపోవడమునుబట్టి బ్రిటిష్ పటాలాల కొరత ఎంతగా వుందో ప్రత్యక్షంగా రుజువవుతూంది. ఇంగ్లండునుండి పంపించిన సైన్యాలు, ఎంత త్వరగా వచ్చినా నవంబరు ముందు రాలేవు కాబట్టీ, మద్రాసు, బొంబాయి రాష్ట్రాలనుండి యూరపియన్ సేనలను తరలించడం మరింత ప్రమాదకరమే అవుతుంది కాబట్టీ — మద్రాసు సిపాయిల 10వ రెజిమెంటులో ఇదివరకే ఆందోళన చిహ్నలు కనబడ్డాయి — బెంగాల్ రాష్ట్రం అంతటిలోనూ మామూలు పన్నులు వసూలుచేయడమనే ఆశ ఇక వదులుకోవలసి వస్తుంది; ఇక ఆ విచ్ఛిత్తి క్రమాన్ని కొనసాగివ్వవలసినదే. బర్మాదేశస్థులు ఈ తరుణం వినియోగించుకుని తమ పరిస్థితులను మెరుగు పరచుకోరనీ, గ్వాలియర్ మహారాజా* బ్రిటిష్ వారినే ఇంకా బలపరుస్తూ ఉంటాడనీ, ఇండియా దేశపు సేనలన్నింటిలోనూ అతి చక్కని సేనపై సర్వాధికారాన్ని కలిగినట్టి నేపాల్ రాజా** నెమ్మదిగానే ఉంటాడనీ, అమిత్ర వైఖరిని ప్రదర్శించిన పెషావర్ నగరం ఆందోళనతో నిండివున్న కొండతెగలతో చేరకుండా ఉంటుందనీ, పర్షియాదేశపు షా*** హీరట్ పట్నంనుండి ఖాళీచేసి వెళ్లిపోయేటంతటి తెలివి తక్కువ పని చెయ్యడనీ మనం అనుకున్నప్పటికీ కూడా బెంగాల్ రాష్ట్రమంతటినీ తప్పకుండా

---

* సింధ్యా. — సం.

** జంగ్ బహదూర్. — సం.

*** నసర్-ఎ-ద్దీన్. — సం.

తిరిగి జయించాల్సి వుంటుంది, ఆంగ్లో-ఇండియన్ సైన్యాన్ని తిరిగి నిర్మించాల్సి వుంటుంది. ఈ బ్రహ్మాండమైన పనికి అయ్యే ఖర్చు అంతా పూర్తిగా బ్రిటిష్ ప్రజలే భరించాల్సి వుంటుంది. ఈ ఖర్చు అంతా ఈస్ట్ ఇండియా కంపెనీయే ఇండియా అప్పులద్వారా సేకరించగలుగుతుందని హౌస్ ఆఫ్ లార్డ్స్‌లో లార్డ్ గ్రన్‌విల్ చేసిన సూచన విషయంలో, పశ్చిమోత్తర రాష్ట్రాలలో అశాంతి పరిస్థితులు బొంబాయి డబ్బు మార్కెట్టుపై ఎట్టి ప్రభావాన్ని కలిగించాయో గమనించినట్లయితే ఈ సూచనలో వుండే సంబద్ధాసంబద్ధతలు తేటతెల్లమవుతాయి. దేశీయ పెట్టుబడిదారులు క్షణమే హడలెత్తిపోయి, బ్యాంకులనుండి బ్రహ్మాండమైన మొత్తాలను వాపసుతీసుకున్నారు, ప్రభుత్వరుణపత్రాలను అమ్మజూపుతే కొనే వారే ఇంచుమించు లేకపోయారు. బొంబాయి నగరంలోనే కాకుండా చుట్టుపక్కల శివార్లలో సహితం పెద్దయెత్తున దొంగ విల్వం కార్యక్రమం ప్రారంభమయింది.

మార్క్స్‌చే 1857 జూలై 17న
రచించబడింది

"New-York Daily Tribune"
1857 ఆగస్టు 4వ తేదీన
5082వ సంచికలో
ప్రచురించబడింది

500 044.

# మార్క్స్

## ఇండియా సమస్య

లండన్, జూలై 28, 1857

"మృత మందిరం"[33]లో నిన్నరాత్రి మిస్టర్ డిజ్రేలీ చేసిన మూడుగంటల ఉపన్యాసం వినడంకంటె చదువుకోవడంవల్లనే నష్టంకన్న ప్రయోజనం ఎక్కువ వుండవచ్చు. కొద్దిరోజులుగా మిస్టర్ డిజ్రేలీ తన ఉపన్యాసాలనివ్వడంలో భయావహమైన గంభీర వైఖరినీ, మాట్లాడడంలో నటనతో కూడినట్టి నెమ్మదైన ఉచ్చారణనూ, రసహీనములైన పొడిమాటల కూర్పుతో లాంఛనప్రాయమైన ధోరణినీ తెచ్చిపెట్టుకుంటున్నాడు; మంత్రి పదవిమీద ఆశపెట్టుకొనే వ్యక్తికుండవలసిన హుందాతనాన్ని గూర్చి ఆయనకుండే విచిత్ర భావాలకు ఈ ఉపన్యాసశైలి అనుగుణంగా ఉంటే ఉండవచ్చునేమో, కాని చిత్రహింసల పాలవుతూన్న ఆయన శ్రోతలకు మాత్రం ఇది నిజంగా బాధాకరంగానే ఉంటూంది. ఒకప్పుడు ఈయన మాట్లాడుతూండేటప్పుడు చప్పచప్పని భావాలకే పదునైన నీతివాక్య స్వరూపాలను ఇవ్వగలిగేవాడు. ఈనాడు ఈయన నీతివాక్యాలను సహితమూ సాంప్రదాయసిద్ధమైన మర్యాదాపూర్వక మాంద్యంలో కప్పిపెట్టేస్తున్నాడు. "Tous les genres sont bons excepté le genre ennuyeux"* అని వోల్టేర్ గావించిన హెచ్చరికను ఎవరైనా విస్మరించవచ్చునేమోగాని, ఖడ్గాన్ని గాక బాకును ప్రయోగించడంలో తన నైపుణ్యపటిమను ప్రదర్శించగలిగే డిజ్రేలీ మాదిరి వక్త మాత్రం విస్మరించతగదు.

ఈనాడు మిస్టర్ డిజ్రేలీ వక్తృత్వపరలికున్న స్వాభావికమైన సాంకేతిక విశేషాలకుతోడు, పామర్‌స్టన్ అధికారానికి వచ్చినప్పటినుండి పార్లమెంటులో తాను చేసిన ఉపన్యాసాలలో వాస్తవికతకు సంబంధించిన ఆసక్తి సాధ్యమైనంత తగ్గించేందుకుగాను ఈయన తన సర్వశక్తులూ వినియోగించి అత్యంత జాగ్రత తీసుకుంటున్నాడు. తన ప్రతిపాదనలను అమో

---

* "విసుగుపుట్టించే శైలి మినహా అన్ని శైలులూ మంచివే." "పారిపోయిన బిడ్డ" అనే నాటకానికి పీఠికలో వోల్టేర్. — సం.

దింపజెయ్యడానికై ఈయన ఉపన్యాసాలు చేయడంలేదు; తన ఉపన్యాసాలను తయారు చేయడాని కోసమే ఉంటాయి ఈయన ప్రతిపాదనలు. ఈ ప్రతిపాదనలకు స్వయంవిఘాతకములైన ప్రతిపాదనలని నామకరణం చేసినా చేయవచ్చు; ఎందుకంటే అవి గెలిస్తే ప్రత్యర్థికి నష్టంకలగకుండా వుండే విధంగానూ, ఓడిపోతే ప్రతిపాదించినవాడి ప్రతిష్ఠకు భంగం కలుగకుండే విధంగానూ వుంటుంది వాటి రచన. గెలవడమూ కాదు, ఓడిపోవడమూ కాదు, చల్లగా జారవిడవడమే వాటి ఉద్దేశ్యం. అవి ఆమ్లములూ కావు, క్షారములూ కావు, అవి పుట్టుకతోనే తటస్థములు. ఆ ఉపన్యాసం క్రియకు వాహికకాదు; క్రియలో వుండే బూటకమే ఉపన్యాసానికి అవకాశాన్ని కల్పిస్తుంది. పార్లమెంటరీ వక్తృత్వానికి సాంప్రదాయిక రూపమూ, అంతిమ రూపమూ కూడా ఇదే కావచ్చునేమో; కాని ఏది ఏలావున్నప్పటికీ, పార్లమెంటరీ విధానంయొక్క అన్ని అంతిమరూపాలకూ పట్టే గతే – ప్రజాకంటకంకింద జమకావడమే – పార్లమెంటరీ వక్తృత్వానికి కూడా దాపురించితే, దానికి ఎట్టి అభ్యంతరమూ చెప్పకూడదు. అరిస్టాటిల్ చెప్పినట్టు, నాటకానికి క్రియే మూలసూత్రం.* రాజకీయ వక్తృత్వానికీ అంతే. మిస్టర్ డిజ్రేలీ ఇండియా తిరుగుబాటుపై చేసిన ఉపన్యాసం, ఉపయోగకర విజ్ఞాన ప్రచారసంఘంవారి గ్రంథాలలో ప్రచురణకు తగివుంది; లేదా మెకానిక్కుల విద్యాసంస్థలో ఉపన్యాసంగా పనికొస్తుంది; లేదా అంటే వ్యాసపోటీకిగాను బెర్లిన్ ఎకాడెమీకి పంపించవచ్చు. ఎక్కడ, ఏ సమయంలో, ఏ సందర్భంలో ఆయన ఈ ఉపన్యాసం ఇవ్వబడిందన్న దృష్ట్యా ఈ ఉపన్యాసం ప్రదర్శిస్తూన్న వింత విష్వ్రక్షికాన్ని చూస్తే, అది చేయబడిన స్థలానికిగాని, సమయానికిగాని, సందర్భానికిగాని అది సమంజసంగా లేదనే చాలావరకూ ధ్రువపడుతూంది. మంటెస్క్యూ, గిబ్బన్[34] రచించిన గ్రంథాల్లో రోమను సామ్రాజ్య పతనాన్ని గూర్చి రాసిన ఒక ప్రకరణం చదువుతే ఎంతో ఇంపుగా ఉంటుంది; ఆ మాటలనే, సరిగ్గా ఆ పతనాన్ని అరికట్టడమే తన ప్రత్యేక కర్తవ్యమైన ఒక రోమను సెనేటరు నోట అనిపిస్తే ఘోరమైన పొరపాటే అవుతుంది. ఘటనం యథార్థగమనాన్ని ప్రభావితంచెయ్యగల శక్తిలేక, తత్కారణంగా నిరాశానిస్పృహ చెందిన ఫలితంగా, హుందాతనమూ ఆసక్తి రెండుగుణాలూ లోపించినట్టి ఒక పాత్రను ధరించి, వ్యంగ్యమైన తాటస్థ్యస్థానాన్ని నటించుతూ, దానితో తృప్తి చెందినట్టి ఏ పక్షానికీ చెందని ఒక స్వతంత్ర వక్తను నేటి ఆధునిక పార్లమెంటులలో మనం ఊహించుకోగలుగుతామన్నమాట వాస్తవం. ఇటువంటి పాత్రనే దివంగతుడైన గర్న్యే-పాజేస్ – లూయీ ఫిలిప్ నియమించిన ప్రతినిధుల సభలో స్మరణీయమైన తాత్కాలిక ప్రభుత్వ మంత్రిగా ఉండిన గర్న్యే-పాజేస్ కాదు సుమండీ – కొద్దో గొప్పో విజయవంతంగానే నటించాడు; కాని కాలంచెల్లిన

* Aristotle, "Poetics," ప్రకరణం VI. – సం.

ఒక రాజకీయ పక్షానికి బాహాటంగా నాయకత్వం వహించుతూన్న మిస్టర్ డిజ్రేలీ ఇట్టి పాత్రను నటించడంలో తాను సాధించిన విజయం సహితమూ ఒక గొప్ప ఓటమిగానే భావించుతాడు.[35] వక్తృత్వ ప్రదర్శనానికి ఇండియా సేన తిరుగుబాటు ఆయనకి దివ్యమైన అవకాశం ప్రసాదించింది. కాని ఈ విషయాన్ని గూర్చి మాట్లాడడంలో ఆయన అవలంబించిన విసుగుపుట్టించే శైలి అటుండనివ్వి, ఆయన తన ఉపన్యాసానికి సాకుగా వినియోగించుకున్న ప్రతిపాదనయొక్క సారాంశమేమిటి? అదొక ప్రతిపాదనే కాదు. అధికార పత్రాలు రెండింటిలో ఏమిటుందో తెలుసుకోవడానికి ఆయన విశేష ఆదుర్దా కనబర్చాడు. అటువంటి ఆ రెండు పత్రాల్లోనూ ఒకటి ఉన్నట్టు తనకు నిక్కచ్చిగా తెలుసునని ఆయన నిర్ధారణగా చెప్పలేదు; ఇక రెండవది ప్రస్తుత చర్చనీయాంశానికి తక్షణమే సంబంధించినది కాదని ఆయనకి నిశ్చయంగా తెల్సు. దీనివల్ల, ఎట్టి ధ్యేయమూ లేని ఒక ఉపన్యాసానికి ఆ ప్రతిపాదన ఒక మిషగా ఏర్పడడమూ, ధ్యేయమని చెప్పుకున్న దానికి ఉపన్యాసం ఇతివృత్తంగా ఉండదగిన అర్హత లేకపోవడమూ మినహా, ఆయన ఉపన్యాసమూ ఆయన ప్రతిపాదనా రెండిటికీ అసలు విషయంతో ఎట్టి సంబంధమూ లేకుండా పోయింది. అయినప్పటికీ ప్రభుత్వంలో చేరని ఇంగ్లీషు రాజ్యనీతిజ్ఞులలో అగ్రగణ్యుడైన డిజ్రేలీ, తాను అత్యంత శ్రమకు లోనై విపులీకరించిన అభిప్రాయం వెలిబుచ్చుతున్న ఉపన్యాసం విదేశాల దృష్టిని తప్పక ఆకర్షించాల్సిందే. అందుచేత, ఆయన "ఆంగ్లో-ఇండియన్ సామ్రాజ్య పతనం గూర్చి కొన్ని ఆలోచనల"ను ఆయన ipsissima verba* సంగ్రహంగా విశ్లేషణచేయడంతో తృప్తిపొందుతాను.

> "ఇండియాలో జరుగుతూన్న అల్లరి, సైనిక పితూరీని సూచించుతూందా, లేక అది ఒక జాతీయ తిరుగుబాటా? సైనికుల ప్రవర్తన హఠాత్తుగా గల్గిన ఆవేశం కారణంగా సంభవించిందా, లేక సంఘటితంగా సాగించిన కుట్ర ఫలితమా?"

అసలు సమస్య అంతటికీ ఈ ప్రశ్నలే కీలకమని మిస్టర్ డిజ్రేలీ నొక్కి చెబుతున్నాడు. "Divide et impera"** అనే పురాతన సూత్ర ప్రాతిపదికపైనే గత పదేళ్లవరకూ ఇండియాలో బ్రిటిష్ సామ్రాజ్యం స్థాపింపబడిందని — అయితే, ఇండియాలో వున్న వివిధ జాతులపట్ల గౌరవాన్ని చూపడంద్వారానే, వారి మతాలతో ఏవిధంగానూ జోక్యం కలుగచేసుకోకుండా ఉండేటట్టు జాగ్రత్త వహించడంవల్లనే, వారి భూ ఆస్తిని పరిరక్షించడం

* సొంత పదాలలో. — సం.

** విభజించి పాలించు. — సం.

వల్లనే ఈ సూత్రం అమలుజరపబడిందనీ ఈయన ఉద్ఘాటించాడు. దేశంలో వున్న అల్లరి చిల్లర జనానికి ఉపాధి కల్పించి, తనలోకి ఆకర్షించే రక్షకకవాటంగా సిపాయి సేన ఉపయోగపడింది. అయితే ఇటీవలి సంవత్సరాలలో, జాతీయతను నాశనంచేసే సూత్రం ఒకటి ఇండియా పరిపాలనలో అవలంబించబడుతూ వచ్చింది. బలప్రయోగంచేసి దేశీయ సంస్థానాధీశులను సర్వనాశనం చేయడమూ, ఆస్తి అనుభవానికి అవరోధాలు కల్గించడమూ, ప్రజల మతంలో జోక్యం కలుగజేసుకోవడమూ — ఇట్టి రూపాలలో ఈ సూత్రం అమలు పరచబడింది. 1848లో ఈస్ట్ ఇండియా కంపెనీ ఆర్థికస్థితి ఎంతగా చెడిపోయిందంటే, ఏదో ఒక విధంగా కంపెనీ ఆదాయాన్ని పెంచుతేనేగాని గత్యంతరం లేకపోయింది. అప్పుడు కౌన్సిల్ ప్రకటించిన ఒక తీర్మానంలో** ఆదాయం పెంచడానికి దేశీయ సంస్థానాధీశులకు నష్టంసంభవించే విధంగా బ్రిటిష్ భూభాగాలను విస్తరింపజేయడం ఒక్కటే పద్ధతి అనే సూత్రం ఇంచుమించు ఎట్టి దాపరికమూ లేకుండానే నిర్వచించబడింది. తరువాత, సతారా రాజా* చనిపోవడం సంభవించగా, ఈ సూత్రాన్ని అనుసరించి ఈస్ట్ ఇండియా కంపెనీ వారు అతని పెంపకపు కొడుకుని వారసునిగా గుర్తింప నిరాకరించి, ఆ సంస్థానాన్ని తమ రాజ్యంలో కలిపేసుకున్నారు. ఆ క్షణంనుండి, ఏ దేశీయ సంస్థానాధీశుడైనా సరే నిస్సంతుగా చనిపోయాడనే సరికి ఈ బలాత్కార ఆక్రమణ పద్ధతి వినియోగించబడుతూండేది. హిందూ దేశ సమాజానికి మూలస్తంభమైనట్టి దత్తత సూత్రాన్నే ప్రభుత్వం ఒక క్రమ పద్ధతిలో రద్దుచేయసాగింది. ఈవిధంగా 1848–1854 మధ్యకాలంలో ఒక డజనుకు పైగా స్వతంత్ర సంస్థానాధీశుల రాజ్యాలు బ్రిటిష్ సామ్రాజ్యంలోకి బలాత్కారంగా కలిపేసుకోవడం జరిగింది. 80,000 చదరపు మైళ్ల విస్తీర్ణం గలిగి, 40 లక్షలనుండి 50 లక్షలవరకూ జనసంఖ్య, బ్రహ్మాండమైన ఐశ్వర్యమూ కలిగిన బేరార్ సంస్థానం 1854లో బలప్రయోగంచేసి కాజేశారు. హిందువులే కాకుండా మహమ్మదీయులు కూడా ఈస్ట్ ఇండియా కంపెనీతో తలపడడానికి దారితీసినట్టి అయోధ్య ఆక్రమణను పేర్కొంటూ, ఈ ఆక్రమణల జాబితాను పూర్తిచేశాడు మిస్టర్ డిజ్రేలీ. గత పదేళ్లుగా ప్రభుత్వంచే అవలంబింపబడిన నూతనవిధానం ఇండియాలో వున్న ఆస్తి అనుభవ పద్ధతిని ఎలా గందరగోళ పరచిందో మిస్టర్ డిజ్రేలీ వివరించాడు.

> "దత్తత న్యాయసూత్రం హిందూదేశంలో వున్న సంస్థానాధీశులకే, రాజ్యాంకే ఉన్న ప్రత్యేక హక్కేమీగాదు; హిందూమతం అవలంబించుతూ భూ ఆస్తిగల ప్రతి హిందూ పౌరునికీ ఇది వర్తిస్తుంది" అన్నాడాయన.

---

* అప్పా సాహెబ్. — సం.

ఆయన ఉపన్యాసంలోనుండి ఒక ఖండాన్ని ఈ దిగువ ఉల్లేఖిస్తున్నాను:

''తన ప్రభువుకి సేవనొనరించి తత్ఫలితంగా భూములు అనుభవించుతూన్న పెద్దసామంతుడు, లేక జాగీర్దారూ; మన దేశంలో వున్న మాన్యందారులతో అచ్చంగా కాకపోయినా సాధారణ అర్థంలో సరిపోలి ఏవిధమైన భూమిపన్నూ చెల్లించనవసరం లేని ఇనాందారూ – ఇండియాలో అత్యధిక సంఖ్యలో వున్నట్టి ఈ రెండు వర్గాల వారూ – తమకు జన్మించిన వారసులు లేనప్పుడు, ఈ సూత్రం అనుసరించి తమ ఆస్తులకు వారసులను నియమించుకొనే హక్కును పొందుతున్నారు. సతారా రాజ్యాన్ని కలిపేసుకోవడం కారణంగా వీరందరికీ చాలా కష్టమనిపించింది; చిన్నవైనప్పటికీ నేనిదివరకు పేర్కొన్న పది స్వతంత్ర సంస్థానాధీశుల రాజ్యాలనూ కలిపేసుకోవడం వీరికి చాలా కష్టంతోచింది; ఇక బేరార్‌ను కూడా కలిపేసుకోవడంతో వీరికి కష్టం తోచడమేకాకుండా, వీరి మిడిప్రాణాలు మీదకే ఎగిరిపోయాయి. ఇక ఎవడికైనా దిక్కూమొక్కూ అంటూ వుందా? యావత్తు ఇండియాలోనూ విస్తృతంగా వున్న ఏ సామంతుడికి, ఏ మాన్యందారునికి ఇక రక్షణ వుంది? (హర్షధ్వనులు.) ఇది ఉత్తుత్త భయంకాదు; ఈ సూత్రం విరివిగా అమలుపర్చి దీనిని ఒక రివాజుగా నిర్పరచారు. ఒకసారి మంజూరయిన జాగీర్లనూ, ఇనాములనూ రద్దుచేయడం తొలిసారిగా ఇండియాలో ప్రారంభమయింది. ఆస్తిహక్కు పట్టాలను గురించి దర్యాప్తులు జరిపించాలంటూ కొన్ని ప్రయత్నాలు కొన్ని అనాలోచిత తరుణాలలో జరిగివుండడం వాస్తవమే; కాని దత్తత పద్ధతిని రద్దుపరచాల్సిందనే ఉద్దేశమే ఇదివరకెన్నడూ ఎవడికీ కలలోనైనా కలగలేదు; అందుచేత న్యాయమైన వారసులులేని జాగీర్లనూ, ఇనాములనూ అనుభవించుతూన్న వారి ఆస్తులను రద్దుచేసి స్వాధీనంచేసుకోడానికి ఏ అధికారానికీ, ఏ ప్రభుత్వానికీ దమ్ములు లేకపోయాయి. ఆదాయం పెంచుకొనేందుకు ఒక కొత్త ఆధారం ఇక్కడ అగుపడింది; ఈ విషయాలన్నిటి గురించి హిందూదేశస్థులు అమితంగా కలవరపడుతూండగా, ఆస్తి అనుభవ పద్ధతులలో కొన్ని కొత్త చిక్కులు తెచ్చిపెడుతూ ప్రభుత్వం మరొక చర్య తీసుకుంది; దీనిని నేను సభవారి దృష్టికి తీసుకురాదల్చుకున్నాను. 1853 కమిటీముందు ఇవ్వబడిన సాక్ష్యాన్ని పఠించడం వల్ల భూమిపన్ను చెల్లించనవసరంలేని భూఖండాలు ఇండియాలో విస్తారంగా ఉన్న సంగతి ఈ సభవారికి విశదమున్న విషయం నిస్సందేహమే. హిందూదేశంలో భూమిపన్ను చెల్లించనవసరం లేకపోవడం మన దేశంలో భూమిపన్ను చెల్లించనవసరం లేకపోవడంతో సమానమవడమేకాకుండా, ఇంతకు మించిన విలువ ఉంది ఆ దేశంలో; ఎందు

చేతంటే, సాధారణంగానూ జనసామాన్యానికి సుబోధకంగానూ ఉండేటట్టు చెప్పాల్సొస్తే, ఇండియాలో ప్రభుత్వం విధించే పన్ను అంతా ఒక్క భూమిపన్నే.

"ఈ పట్టాలయొక్క పుట్టుపూర్వోత్తరాలు తెలుసుకోవడం అమిత ప్రయాసతో కూడుకున్న పనే, కాని అవి బహు పురాతనములైనవన్న విషయం మాత్రం నిర్వివాదం. ఇవి అనేక విధాలుగా ఉన్నాయి. అధికవిస్తీర్ణాన్ని కల్గినట్టి వ్యక్తిగతములైన ఇనాములేకాకుండా, మసీదులకూ, దేవాలయాలకూ భూమిపన్నులేకుండా ఇచ్చిన పెద్దపెద్ద విస్తీర్ణాలుగల భూములు కూడా ఉన్నాయి."

అక్రమంగా కొందరు పన్నుమాఫీని కోరుతున్నారనే సాకుతో బ్రిటిష్ గవర్నర్ జనరల్* తనంతటతానుగా చొరవతీసుకుని ఇండియాలో వున్న ఎస్టేట్ల సన్నదులను తనిఖీ చేయడానికి నిశ్చయించాడు. 1848లో స్థాపించిన కొత్తపద్ధతి ననుసరించి,

"ప్రభుత్వం శక్తివంతమైనదనీ, కార్యనిర్వాహకాధికారం మిక్కిలి చురుకైనదనీ, ఈ కొత్త ప్రభుత్వ ఆదాయపు వనరు మంచి ఫలప్రదమైనదనీ రుజావుచెయ్యడానికని, ఈ సన్నదులు తనిఖీచేసే పథకం వెంటనే అవలంబించారు. దీనిననుసరించి బెంగాల్ రాష్ట్రంలోనూ, ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లోనూ వున్న ఎస్టేట్ల సన్నదులను తనిఖీ చేయడానికై దర్యాప్తు కమీషన్లు మంజూరయాయి. బొంబాయి రాష్ట్రంలో కూడా దర్యాప్తు కమీషన్లు మంజూరుచేశారు; సర్వే కార్యక్రమాలు ముందుగా పూర్తిచేయబడినయెడల ఈ దర్యాప్తులు పకడ్బందీగా జరగడానికి వీలుంటుందనే ఉద్దేశ్యంతో కొత్తగా భూమిపన్ను నిర్ణయం చేయబడిన రాష్ట్రాల్లో సర్వేలు జరగాల్సిందని ఉత్తరవులు జారీ అయాయి. ఇండియాలో వున్న ఈ ఎస్టేట్ల యొక్క సర్వదుంబాలా భూములను గురించి గత తొమ్మిదేళ్లనుండీ దర్యాప్తు కమీషన్లు జోరుగా పనిచేస్తున్నాయనీ, బ్రహ్మాండమైన ఫలితాలు చేకూరాయనీ భావించడానికి ఎట్టి సందేహమూలేదు."

భూస్వాములనుండి ఎస్టేట్ల స్వాధీనం పాలీనా బెంగాల్ రాష్ట్రంలో 5,00,000 పౌన్లకు మించివుంటుందనీ, బొంబాయి రాష్ట్రంలో 3,70,000 పౌన్లకు మించివుంటుందనీ, పంజాబులో 2,00,000 పౌన్లకు మించివుంటుందనీ, ఈవిధంగానే ఇతర రాష్ట్రాల్లో కూడా వుంటుందనీ మిస్టర్ డ్రిజేలీ అంచనా వేశాడు. దేశీయుల ఆస్తులు కాజేయడానికి

* డల్‌హౌసీ. — సం.

ఈ పద్ధతితో సంతృప్తిచెందకుండా, ఒడంబడికల మూలంగా దేశీయ ప్రభువులకూ, ఉన్నత వంశజులకూ ఇస్తామని ఖరారుచేసిన పెన్షన్లను కూడా బ్రిటిష్ ప్రభుత్వం ఇప్పుడు నిలుపు చేసింది.

> "ఆస్తులను జప్తు చేయడంలో ఇదొక కొత్త విధానమేకాకుండా, విస్తృతమైనట్టీ, విభ్రాంతికరమైనట్టీ, విస్మయాన్ని కలిగించేటట్టి స్థాయిలో జరుగుతూన్న విధానం ఇది" అని మిస్టర్ డిజ్రేలీ అన్నాడు.

దేశీయుల మతవిషయాలలో ఎలా జోక్యం కలుగజేసుకుంటున్నారో, దానిని గూర్చి మిస్టర్ డిజ్రేలీ తరువాత ప్రస్తావించాడు; ఆ విషయమై మనమిక్కడ వివరించాల్సిన అగత్యం లేదు. తాను చెప్పినదానినంతనూ ఆధారంచేసుకుని, ఇండియాలో ఇప్పుడు జరుగుతూన్న కల్లోలం కేవలం సైనిక తిరుగుబాటే కాదనీ, సైనికులు ఒక పనిముట్టుగా ఉన్న జాతీయ తిరుగుబాటనీ నిర్ధారణ తేల్చాడు మిస్టర్ డిజ్రేలీ. తాము ఇప్పుడు తీసుకుంటూన్న దురాక్రమణ పథాన్ని అవలంబించడం మాని, అందుకు బదులు ఇండియా ఆంతరంగిక పరిస్థితిని మెరుగుపరచేందుకుగాను తమ దృష్టిని మళ్లించవలసిందని ప్రభుత్వానికి సలహానిస్తూ మిస్టర్ డిజ్రేలీ తన ఉపన్యాసం ముగించాడు.

మార్క్స్ చే 1857 జూలై 28న
రచించబడింది

"New-York Daily Tribune"
1857 ఆగస్టు 14వ తేదీన
5091వ సంచికలో
ప్రచురించబడింది

# మార్క్స్

# ఇండియానుండి సమాచార లేఖలు[37]

లండన్, జూలై 31, 1857

ఇండియానుండి అందిన ఆఖరి టపానుబట్టి జూన్ 17వరకూ ఢిల్లీ సమాచారాలూ, జూలై 1వరకూ బొంబాయి సమాచారాలూ పరిస్థితులు ఎంత అంధకారంగా ఉంటాయని అనుకున్నారో అంత అంధకారంగానూ పరిణమించాయి అని తెలుస్తున్నాయి. బోర్డ్ ఆఫ్ కంట్రోల్[38] అధ్యక్షుడయిన మిస్టర్ వెర్నన్ స్మిత్ ఇండియాలో తిరుగుబాటును గురించి కామన్స్ సభకు మొట్టమొదటి సారిగా తెలిపినప్పుడు, ఢిల్లీని భూమట్టం చేసేశామనే ఖబురు ఇక వచ్చే టపాలో తప్పకుండా వస్తుందని నమ్మకంగా చెప్పాడు. టపా అందడమేమో అందింది కాని, ఢిల్లీ మాత్రం ఇంకా "చరిత్ర పుటలనుండి చెరిపివేయబడ"లేదు. శతఘ్ని దళాన్ని జూన్ 9కి ముందు తీసుకొచ్చే అవకాశం ఉండదనీ, అందుచేత ఆ తేదీవరకూ వినాశం మూడిన ఆ పట్నంపై దాడి ఆపుచేయవలసి వచ్చిందనీ అప్పట్లో చెప్పారు. అద్భుతమైన విశేషమేదీ సంభవించకుండానే జూన్ 9 కూడా జరిగిపోయింది. జూన్ 12న, 15న కొన్ని విశేషాలు జరగకపోలేదు, అయితే అవి ఇట్నుంచి అటు జరిగాయి; ఢిల్లీపై ఇంగ్లీషువాళ్ళు దాడి చేసేందుకు బదులు తిరుగుబాటుదార్లే ఇంగ్లీషువాళ్ళపై దాడి చేశారు; అయితే ఈ ఉధృతగతిదాడులు అనేకసార్లు జరిగినప్పటికీ వాటినన్నిటినీ ఇంగ్లీషువాళ్ళు తిప్పికొట్టారనుకోండి. ఈవిధంగా ఢిల్లీ పతనాన్ని మళ్ళీ వాయిదావేయవలసి వచ్చింది; ముట్టడి ఫిరంగులు తనవద్ద లేకపోవడం ఒక్కటే ఇందుకు కారణమని ఇంతవరకూ చెబుతూవచ్చినట్లు కాకుండా, మిలిటరీ సరంజామూ సరఫరాలన్నిటినీ తమ అధీనంలో ఉంచుకొన్న 30,000 సిపాయిలచే పరిరక్షింపబడుతూన్న పురాతన రాజధానిని తిరిగి తమ వశంచేసుకోవడానికి తన చేతికింద వున్న సుమారు 3,000 పైనిక బలం ఏమాత్రమూ సరిపోదనీ, అందుచేత అదనపు బలాలకోసం వేచివుండేందుకు జనరల్ బార్నార్డ్ నిశ్చయించుకోవడమే ఇందుకు కారణమనీ ఇప్పుడు అంటున్నారు. అజ్మీర్ గేటు బయట తిరుగుబాటుదార్లు ఒక స్థావరాన్ని కూడా ఏర్పరచారు. ముప్పై, నలభైవేల సిపాయిసేనను తుడిచిపెట్టి దుంపనాశనం చేసేయడానికి మూడువేల ఇంగ్లీషు

సైనికుల బలగం ఎక్కితొక్కి పరిపడుతుందని ఈ నాటివరకూ యుద్ధరచయితలందరూ ఏకగ్రీవంగా అభిప్రాయపడ్డారు; ఇదే గనుక నిజంకానిపక్షంలో, లండన్ "Times" చెప్పినట్టు, ఇండియాను ''పునఃజయించడానికి'' ఇంగ్లండుకు ఎప్పటికైనా వీలవుతుందా?

ప్రస్తుతం ఇండియాలో వున్న బ్రిటిష్ సేన అంతా కలిపి 30 వేలు ఉంది. వచ్చే ఆరునెల్లలోనూ ఇంగ్లండునుంచి ఎంతపంపించినా 20 వేలు, 25 వేల సైనికుల కంటె హెచ్చు పంపించలేరు; ఇండియాలో వున్న యూరపియన్ సేన శ్రేణులలో ఉన్న ఖాళీలను భర్తీచేయడానికి వీరిలో 6 వేల మందిని అట్టేపెట్టెయ్యాల్సి ఉంటుంది; ఇక మిగిలిన అద నపు బలగాలు 18 వేల, లేక 19 వేల మందిలోనూ, ప్రయాణంలోనూ, శీతోష్ణ పరి స్థితుల మూలంగానూ కలిగే నష్టాలు పోను, యుద్ధరంగంలోకి ప్రవేశించగలిగే బలగం సుమారు 14 వేలవరకూ తగ్గిపోతుంది. బాగా తక్కువ నిష్పత్తిలో వున్న సంఖ్యా బలంతో తిరుగుబాటుదార్లను ఎదుర్కోడానికైనా బ్రిటిష్ సైన్యం నిశ్చయించుకోవాలి, లేదా వారితో అసలు తలపడే ఉద్దేశ్యమే వదలుకోవాలి. అయినప్పటికీ ఢిల్లీని చుట్టుముట్ట డానికై సేనల సాంద్రీకరణలో ఇంత జాప్యం ఎందుకు జరగాలో మాత్రం మనకేమీ అర్థం కావడంలేదు. సర్ చార్లెస్ నేపియర్ రోజుల్లో అవరోధంగా ఏర్పడని ఈ ఋతుపరిస్థితుల ఉష్ణత ఈనాడు అజేయమైన అవరోధంగా ఏర్పడిన పక్షంలో, మరికొద్ది నెలల్లో యూర పియన్ సేనలు దిగిన తరువాత పడే వర్షాలు ఈ సైనిక ప్రతిష్టంభనకి మరింత నిస్సంశయ మైన మిషగా తయారవుతాయి. ప్రస్తుతపు తిరుగుబాటు వాస్తవానికి అప్పుడే జనవరి నెలలోనే ఆరంభమయిందనీ, తన సేనలను సర్వసిద్ధంగా ఉంచుకోవాలని బ్రిటిష్ ప్రభు త్వానికి కావలసినంత ముందుగానే హెచ్చరిక లభించిందన్న సంగతి మనం గుర్తుంచుకోవాలి.

ఇంగ్లీషు సైన్యంచే ముట్టడించబడినప్పటికీ ఆ ముట్టడినేమీ ఖాతరుచేయకుండానే సిపాయిలు దీర్ఘకాలంనుండీ ఢిల్లీని ఇంకా తమ స్వాధీనంలో ఉంచుకోగల్గడం సహజంగానే అనేక ఫలితాలకు దారితీసింది. కలకత్తా సింహద్వారంవరకూ తిరుగుబాటు వ్యాపించింది; ఏభై బెంగాల్ రెజిమెంట్లు అదృశ్యమైపోయాయి, బెంగాల్ సైన్యం పురాతనకాలపు గాథ కింద మారిపోయింది; బ్రహ్మాండమైన దేశంలో అక్కడా అక్కడా చెదిరిపోయి ఒకదానితో ఒకటి సంబంధంలేకుండా వేరుపడిపోయిన స్థలాల్లో చక్రబంధంలో చిక్కుకున్న యూరపియన్లు తిరుగుబాటుదార్ల కసాయికోత పాలయ్యారు, లేదా నిరాశాజనితమైన ఆత్మరక్షణచర్యలకు వారు దిగవలసివచ్చింది. కలకత్తాలోనే, ఇంతవరకు వస్సిన పన్నాగాలన్నిటిలోనూ అన్ని తప్పిళ్లతోనూ అత్యంత సంపూర్ణంగా కట్టుదిట్టంచేయబడిందని చెప్పబడుతూన్న పన్నుగడ మూలంగా ప్రభుత్వ పీఠస్థానాన్నే హఠాత్తుగా పట్టుకోవడానికై సర్వసన్నద్ధం చేయ బడిన కుట్ర బయలుపడ్డ ఫలితంగా, అక్కడ వున్న దేశీయ దళాలు రద్దుచేయబడిన పిమ్మట, పట్నంలో వున్న క్రైస్తవులు స్వచ్ఛంద రక్షకదళాన్ని నిర్మించుకున్నారు. బెనారెస్‌లో దేశీయ

రెజిమెంటు ఒకదానిని నిరాయుధపరచడానికి ప్రయత్నించగా, ఒక సిక్కు సైనికదళమూ, 13వ ఇర్రెగ్యులర్ అశ్విక దళమూ ఆ ప్రయత్నాన్ని ప్రతిఘటించాయి. మహమ్మదీయుల వలెనే, సిక్కులు కూడా తమ ఉమ్మడి ఆశయానికై బ్రాహ్మణులతో కలియడాన్నీ, వివిధ తెగలన్నీ కలిసి బ్రిటిష్ పరిపాలనకి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా సంఘటితపడి ఈ ఉద్యమం త్వరితగతిని పురోగమించుతూండటాన్ని ఈ వాస్తవాంశం నిరూపించుతూండడంవల్ల, ఇది అత్యంత ప్రాధాన్యతను వహించుతూంది. ఇండియాలో తమకున్న యావత్తు బలమూ సిపాయి సైన్యంలోనే ఉందని ఇంగ్లీషువారు వేద్రపాయంగా నమ్మేవారు; అటువంటి ఆ సైన్యమే తమకిపాడు ఏకమాత్ర ప్రమాదంగా తయారైందని వారిప్పుడు ఒక్కుమ్మడిని నిశ్చయంగా నమ్ముతున్నారు. "తిరుగుబాటుకీ స్వదేశ సంస్థానాధీశులకూ ఏమాత్రపు సంబంధమూ లేదనే విషయం గురించి మితిమీరి ఉద్ఘాటించకూడదు" అని ఇండియా సమస్యపై లోగడ జరిగిన చర్చలలో బోర్డ్ ఆఫ్ కంట్రోల్ అధ్యక్షుడయిన, మిస్టర్ వెర్నన్ స్మిత్ నొక్కిచెబుతూనే ఉన్నాడు. ఈలా చెప్పిన రెండురోజులకే ఈ దిగువ పేర్కొన్న అపశకునపు వాక్యాలు కల్గిన సమాచార లేఖను అతనికి ప్రకటించక తప్పింది కాదు:

> "మన చేతిలో పడిన రహస్యపు పత్రాల మూలంగా, కుట్రలో పాల్గొంటూ న్నట్టు తెలిసిపోయిన మాజీ అయోధ్య రాజును* జూన్ 14న ఫోర్ట్ విలియమ్‌లో నిర్బంధించి, అతని పరివారాన్ని నిరాయుధులను చేయడమయింది."

సైనిక పితూరీయేనని తానింతవరకూ భావించుతూన్నది వాస్తవానికి జాతీయ తిరుగు బాటేనని జాన్ బుల్‌ని సహితమూ నమ్మింపజేయగల ఇతర వివరాలన్నీ ముందుముందు చల్లచల్లగా బయటకు పొక్కుతాయి.

ఇప్పటివరకూ తిరుగుబాటు బెంగాల్ రాష్ట్ర సరిహద్దులు దాటి విస్తరించలేదనీ, బొంబాయి, మద్రాసు సైన్యాల రాజభక్తి విశ్వాసాల విషయంలో ఎట్టి అనుమానానికీ ఈషణ్మాత్రమూ తావులేదనీ, ఈ విషయాలు తథ్యమనీ నమ్ముతూ, దీనితో గొప్పగా సంతృప్తి పొందుతూన్నట్టు ఇంగ్లీషు పత్రికలు వటిస్తున్నాయి. అసలు విషయంపట్ల ఇట్టి దృక్పథం ఎంతో ఉల్లాసజనకమైనదే అయినప్పటికీ, ఔరంగాబాద్‌లోని నైజామ్** అశ్విక దళం తిరుగుబాటు ప్రజ్వరిల్లిందని దరిమిలా టపాలో అందిన వార్త ఈ వైఖరికి భిన్నంగా కనబడుతూంది. ఔరంగాబాద్ బొంబాయి రాష్ట్రంలోవున్న అదేపేరుగలిగినట్టి జిల్లాకు ముఖ్యపట్నం అవడంవల్ల, బొంబాయి సైన్యంలో తిరుగుబాటు ఆరంభాన్ని దరిమిలా

* వజీద్ అలీ షా. — సం.

** హైదరాబాద్ సంస్థాన సార్వభౌముడు. — సం.

వార్తలు ప్రకటిస్తూన్నాయన్నదే సత్యం. జనరల్ వుడ్‌బర్న్ ఔరంగాబాద్ తిరుగుబాటును వెంటనే అణచివేశాడని అంటున్నారు. అయితే మీరట్ తిరుగుబాటు వెంటనే అణచివేయ బడిందని అప్పట్లో చెప్పలేదా? సర్ హెచ్. లారెన్స్‌చే అర్పివేయబడిన తర్వాత లక్నో తిరుగు బాటు జ్వాలలు పక్షందినాలలో మరింత భయంకరరూపంలో తిరిగి ప్రజ్వరిల్లలేదా? ఇండియా సైన్యంలో తిరుగుబాటు సంభవించిందని తెలిపిన మొట్టమొదటి ప్రకటనలోనే, శాంతి భద్రతలు పునస్థాపితమయాయని తెలిపినట్టు మనకిప్పుడు జ్ఞప్తికి రావడంలేదా? బొంబాయి మద్రాసు సైన్యాలలో అత్యధికభాగం అట్టడుగు కులాలవారే అయినప్పటికీ, బెంగాల్ సైన్యంలో వున్న అగ్రకులాలకు చెందిన తిరుగుబాటుదార్లతో లంకెలుగా ఏర్పడడానికి ప్రతి రెజిమెంటు లోనూ వందమందివరకూ ఉంటూన్న రాజపుత్రులు సరిపోతారు. పంజాబు శాంతంగానే వుందంటూ ప్రకటిస్తున్నారు; అదే సమయంలో "జూన్ 13వ ఫెరోజ్‌పూర్‌లో సైనిక ఉరిశిక్షలు జరిగాయి"ని మనతో ఇప్పుడు చెబుతున్నారు; ఇలా చెబుతూనే, "55వ దేశీయ కాల్బల రెజిమెంటును వెంబడించడంలో ప్రదర్శించిన అద్భుతప్రవర్తనకు" వాన్ వాయ కత్యాన ఉన్న దళాన్ని – 5వ పంజాబ్ కాల్బల రెజిమెంటును – బాగా మెచ్చుకున్నారు. ఇది చాలా విచిత్రమయిన "శాంతి" అని మాత్రం ఒప్పుకోకతప్పదు.

మార్క్స్‌చే 1857 జూలై 31వ
రచించబడింది

"New-York Daily Tribune"
1857 ఆగష్టు 14వ తేదీన
5091వ సంచికలో
ప్రచురించబడింది

# మార్క్స్

# ఇండియా తిరుగుబాటు పరిస్థితి

లండన్, ఆగస్టు 4, 1857

అంతకుముందే టెలిగ్రాఫుద్వారా టూకీగా తెలిసి ఇప్పుడు సుదీర్ఘమైన నివేదికలతో ఇండియానుండి వచ్చిన టపా లండన్ చేరగానే, ఢిల్లీ పట్టుబడిపోయిందనే పుకారు ఎంత త్వరగా వ్యాపించి, అది రూఢి అయిన వార్త అనే నమ్మకాన్ని ఎంతగా దృఢపరచిందంటే, దాని ప్రభావం షేరుమార్కెట్టు లావాదేవీలమీద కూడా కనబడింది. వెనుక జరిగిన సెబాస్టోపోల్ ఆక్రమణ బుకాయింపుకి[39] ఇది తగ్గుస్థాయిలో ఈనాటి పునశ్చరణ. అనుకూలమైన ఈ వార్తకు ఆధారమని చెప్పబడిన మద్రాసు వార్తాపత్రికల తేదీలనూ, వాటిలో ప్రచురించబడిన విషయాలనూ ఏమాత్రం జాగ్రత్తగా పరిశీలించినా ఇది ఉత్త భ్రమే అని తేలిపోయుండేది. జూన్ 17వ తేదీతో ఆగ్రానుండి వచ్చిన ప్రైవేటు ఉత్తరాలు ఆధారం చేసుకుని ఈ వార్తను ప్రకటించినట్టు మద్రాసు ఫోగట్టా; కాని 16వ తేదీ మధ్యాహ్నం 4 గంటలవరకూ ఢిల్లీ ఎదుట అంతా ప్రశాంతంగానే ఉందని జూన్ 17వ లాహోర్నుండి వెలువడిన అధికారవార్త తెలుపుతూంది; కాగా, ''ఉధృతగతిదాడులు చాలావాటిని తిప్పికొట్టిన తరువాత, 17వ తేదీ ఉదయాన జనరల్ బార్నార్డ్ అదనపు బలాలకోసం నిరీక్షిస్తున్నాడ''ని జూలై 1వ తేదీన వెలువడిన "Bombay Times"[40] ప్రకటించింది. మద్రాసు ఫోగట్టా తేదీని గురించి ఈ మాత్రం చాలు. ఇక ఆ వార్తలో ఉన్న విషయం గురించి: ఢిల్లీ సమీపంలో వున్న ఉన్నత ప్రదేశాలనుండి శత్రువులను తరిమి, తాము వాటిని ఆక్రమించుకొన్నట్టు జూన్ 8వ జనరల్ బార్నార్డ్ విడుదలచేసిన ప్రకటనా, ముట్టడిలో వున్నవారు జూన్ 12న, 14న గావించిన ఉధృతగతి దాడులకు సంబంధించిన ప్రైవేటు నివేదికలూ ఈ వార్తలోవున్న విషయాలకు ఆధారాలని స్పష్టంగా తెలిసిపోతూంది.

ఈస్ట్ ఇండియా కంపెనీవారి వద్ద అముద్రితంగా వున్న ప్లాన్లను ఆధారం చేసుకుని ఢిల్లీయొక్క, దాని రక్షక దళంయొక్క మిలిటరీ ప్లానును తుట్టతుదకు కెప్టెన్ లారెన్స్ తయారుచేశాడు. ఢిల్లీ నగరపు దుర్గనిర్మాణాలు మొదట రూఢిగా వక్కాణించినంతగా

ఏమంత దుర్బలమైనవికావనీ, ఇప్పుడు ప్రజలను నమ్మమంటూన్నంత బలమైనవి కూడా కావనీ, ఇప్పుడు ఈ ప్లానువల్ల తెలుస్తూంది. నగరంచుట్టూ కోటగోడలున్నాయి; నగరంలో ప్రవేశించాలంటే ఈ గోడలను లగ్గపట్టుచేసి నిచ్చెనలను ఉపయోగించైనా ఎక్కాలి, లేదా సింహద్వారాలనైనా స్వాధీనం చేసుకోవాలి. నిద్దగా రాతితో కట్టిన దుర్గప్రాకారం ఏడు మైళ్లకు మించి వుంది, కాని ఏమంత ఎత్తైన గోడలు కావు. కందకం వెడల్పు తక్కువ, లోతు కూడా లేదు. పార్శ్వపు దుర్గనిర్మాణాలనుండి వచ్చే గుండ్లవర్షం శత్రుశ్రేణీ ముఖానికి సరిగా తగలదు. గోడల పొడుగునా మధ్యమధ్య మార్టెల్లో బురుజాలున్నాయి; వీటినుండి తుపాకులు పేల్చడానికి నిలువుబీటలున్నాయి; గోడలనుండి బురుజాలలోకీ, అక్కడనుండి కందకపు మట్టంవరకు గదులలోకీ తిరుగుడుమెట్ల స్తంభాలున్నాయి; ఈ స్తంభాలకి నిలువు బీటలుండడంవల్ల వీటినుండి వచ్చే కాల్పులపు గుళ్లవర్షం, కోటగోడలను ఎగ్రబాకడానికిగాని నిచ్చెనలతో ఎక్కడానికిగాని ప్రయత్నించేందుకై కందకాన్ని దాటుతూ వచ్చే శత్రుసేనలకి చాలా ప్రమాదకరంగానే ఉంటుంది. కోటగోడలను రక్షించే బురుజాలకు మిద్దెలున్నాయి; ఈ మిద్దెలపై నిలబడినవారు కిందనున్న శత్రుసైన్యంపై తుపాకులు పేల్చడానికి వీలుంటుంది; కాని వీరి గుండ్లవర్షాన్ని ఫిరంగి కాల్పులవల్ల ఆపివేయడానికి వీలవుతుంది. తిరుగుబాటు ఆరంభమయే సరికి నగరంలో వున్న ఆయుధశాలలో 9 లక్షల తూటాలూ, అన్ని సరంజాములతోనూ సంపూర్ణంగా వున్న రెండు ముట్టడి శతఘ్ని దళాలూ, పెద్ద సంఖ్యలోనే వున్న సేనా ఫిరంగులూ, 10 వేల తుపాకులూ ఉన్నాయి. మొదట నగరంలోనే వుండినట్టే, నగరవాసుల కోరికపై ఆటుతరువాత నగరపు వెలుపలనున్న కంటోన్మెంటులలో నిర్మించబడినట్టే మందు గుండుకొట్టులో ఎంతలేదన్నా 10 వేల పీపాల మందుగుండు ఉంది. జూన్ 8న జనరల్ బార్‌వార్డ్ ఆక్రమించుకున్న ఉన్నత ప్రదేశాలు ఢిల్లీకి పశ్చిమోత్తరదిక్కున ఉన్నాయి; ఢిల్లీ నగరపు ప్రాకారానికి బైటనున్న కంటోన్మెంట్లు కూడా ఇక్కడే వున్నాయి.

ఈనాడు ఢిల్లీ ఎదుట విడిసివున్న బ్రిటిష్ సైన్యాలు మే 26 నాటికే అక్కడుండినట్టయితే, అవసరమైన రవాణా ఏర్పాట్లన్నీ సిద్ధంగా ఉండివుంటే ఈ సైన్యాలన్నీ అక్కడకి వచ్చి వుండగల్గేవి కూడా, ఒకే coup de main* ముందు తిరుగుబాటుకు ఆయువుపట్టయిన ఈ దుర్గం వెంటనే కుంగిపోయుండేదన్న విషయం, ప్రామాణికమైన ప్లానుపై ఆధారపడిన ఈ వర్ణనుండి స్పష్టంగా తెలుస్తూంది. జూన్ ఆఖరివరకూ తేదీలవారీగా తిరుగుబాటుచేసిన రెజిమెంట్ల జాబితాను "Bombay Times" ప్రచురించింది, దీనిని లండన్ పత్రికలు పునః ప్రచురించాయి; ఈ జాబితాను పరిశీలించినట్టయితే మే 26 నాటికి ఢిల్లీలో వున్న తిరుగుబాటుదార్ల సంఖ్య నాలుగైదువేలకంటె ఎంత మాత్రమూ

* శక్తివంతమైన ఆకస్మిక దాడి. — సం.

మించివుండదనే తెలుస్తూంది. ఏడుమైళ్ల విస్తీర్ణంగల గోడను ఇంత కొద్దిపాటి సంఖ్యతో రక్షించుకోగలుగుతామని వారెంతమాత్రమూ ఆశించివుండేవారుకారు. 1853నుండి బెంగాల్ ఆర్టిలరీ దళాలకి హెడ్‌క్వార్టర్సుగా వుంటూ, మిలిటరీ విజ్ఞానశాస్త్రీయ ప్రధాన పరిశోధనశాలను కలిగి, సేనాఫిరంగులనూ ముట్టడి శతఘ్నులనూ ఉపయోగించేందుకుగాను కవాతుమైదానంగా ఉపకరించినట్టి మీరట్‌పట్నం ఢిల్లీనుండి నలభైమైళ్లలోనే ఉందన్న సంగతి గుర్తుంచుకుంటే, దేశీయసైన్యాలపై పైచేయి సాధించడానికిగాను వినియోగించబడాల్సినట్టీ, వాటిని ఎలాగు వినియోగించాలో బ్రిటిష్ సైనికబలాలు ఎల్లప్పుడూ ఎరిగివున్నట్టీ ఆ coups de mainలో ఒక దానిని జరిపివుండేందుకు బ్రిటిష్ సేనానికి అవసరమైన ఏర్పాట్లు ఏల కొరవడ్డాయో అర్థంకాకుండావుంది. ముట్టడిఫిరంగి దళంకోసం నిరీక్షించవలసి వచ్చిందని మొదట అన్నారు;* తరువాత అదనపుబలాలకోసం నిరీక్షించవలసి వచ్చిందన్నారు; ఇప్పుడేమో నమ్మకమైన వార్తలను అందిచ్చే లండన్ పత్రికల్లో ఒకటైన "Press"[41] పత్రిక ఇలా అంటూంది:

> “జనరల్ బార్నార్డ్ చేతిలో పరిపడినంత వస్తుసామగ్రిగాని, మందుగుండు సామానుగాని లేదన్న విషయమూ, అతని మనుష్యులలో ఒక్కొక్కరి వద్దనూ 24 తూటాలకంటె హెచ్చులేవన్న విషయమూ వాస్తవమేనని మన ప్రభుత్వానికి తెలుసును.”

ఢిల్లీకి చేరువనున్న ఉన్నతప్రదేశాలను ఆక్రమించుకొన్న తరువాత జూన్ 8న జనరల్ బార్నార్డ్ జారీచేసిన ప్రకటనలో, ఆ మరుసటి దినమే ఢిల్లీపై దాడిసలిపే ఉద్దేశ్యం అతనికి ఉన్నట్లుగా అర్థమవుతూంది. ఈ ఉద్దేశ్యాన్ని అమలుజరుపకుండా అందుకు బదులు, ఏదో ఒక యాదృచ్ఛిక ఘటనవల్ల ముట్టడించబడిన సేనలనుండి తానే రక్షణచర్యలు అవలంబించవలసిన అగత్యం అతనికి ఏర్పడింది.

ఇరుపక్షాలలో ఒక్కొక్కదాని బలాబలాలను అచ్చంగా ఈ సమయంలో లెక్కకట్టి తెలుసుకోవడం చాలా కష్టమే. ఇండియాలోని పత్రికల ప్రకటనలు, వార్తలు, భోగట్టాలు పూర్తి పరస్పర విరుద్ధంగా ఉన్నాయి; కాని కలకత్తాలో వున్న ఫ్రెంచి కాన్సల్‌నుండి వెలువడినదిగా కనబడుతూన్న భోగట్టాను ఆధారంచేసుకొని, బోనపార్ట్ పక్షపు పత్రిక "Pays"[42]లో ప్రచురింపబడిన ఇండియా లేఖ ఒకదానిని మనం కొంతవరకూ నమ్మవచ్చుననే తోస్తూంది. ఇతని ప్రకటనలో, జూన్ 14 నాటికి జనరల్ బార్నార్డ్ చేతిలో 5,700ల సైన్యం వుందనీ,

* ఈ సంకలనంలో 59వ పుట చూడండి. — సం.

అదే నెల 20వ తేదీ నాటికి అతనికి చేరవలసి వున్న అదనపు బలాలు అందగానే అతని సేన రెట్టింపు (?) కాగలదనీ అంచనా వేయబడింది. అతని చేతిలో వున్న ముట్టడి ఫిరంగి దళంలో 30 భారీముట్టడి ఫిరంగులున్నాయి, అదేసమయంలో, తిరుగుబాటుదార్ల బలగం 40,000 సైనికులవరకూ వుండవచ్చుననీ, నిర్మాణరీత్యా ఈ సేన చాలా కొరవడి ఉందనీ, అయినప్పటికీ ఎదురుదెబ్బ తీయడానికైతేనేమి, రక్షించుకోడానికైతేనేమి కావలసినంత సాధన సామగ్రి ఈ సేన చేతిలో ఉందనీ అంచనా వేయబడింది.

అజ్మీర్ గేటు వెలుపల, బహుశా ఘాజీ ఖాన్ గోరీలలో విడిసివున్న 3,000 తిరుగుబాటుదార్లు, కొన్ని లండన్ పత్రికలు భావించినట్టు, ఇంగ్లీషు బలాలకి ఎదురుగా కాకుండా, తద్భిన్నంగా ఢిల్లీ పట్నానికి ఇంకొక చివరనున్నారనీ, పురాతన ఢిల్లీ శిథిలాలకు ఉత్తరంగా వున్న ఆధునిక ఢిల్లీయొక్క నైరుతి భాగపు కొట్టకొన వాకదానిని ఆనుకొని అజ్మీర్ గేటు వుండటమే యిందుకు కారణమనీ మనం en passant* వివరించవచ్చు. ఇలాంటి మకాములనే ఇంకా మరికొన్నింటిని పట్నం ఈ వైపున స్థాపించుకోవడానికి తిరుగుబాటుదార్లకు ఎవ్వరూ ఎట్టి ప్రతిబంధకాన్నీ కలిగించలేరు. పట్టణానికి పూర్వోత్తరపు దిక్కున, అనగా నదివైపున వున్న పడవల వంతెన వారి చేతిలోనే ఉండడంవల్ల తమ దేశీయులనుండి మనుషులూ సరుకులూ నిరాఘాటంగా వారికి అందే అవకాశం ఏర్పడుతూంది. తనకు వెనుకపార్శ్వాన వున్న తన స్వదేశంలోని రవాణామార్గాలను వెల్లడిగా ఉంచుకోగల్గిన (సెవస్తోపొల్ వంటి) దుర్గంతో ఢిల్లీకి చిన్న ఎత్తున పోలిక వుంది.

బ్రిటిష్‌వారి సైనికచర్యలలో కల్గిన జాప్యం ఫలితంగా, రక్షణార్థమై అధిక సంఖ్యా బలాన్ని సాంద్రీకరించుకొనగల్గడానికీ, అనేక వారాలుగా ఢిల్లీని తమ స్వాధీనంలో ఉంచుకోగలుగుతున్నామన్న ఉత్సాహంతో తరుచుగా ఉధృతగతి దాడులను జరిపి యూరపియన్ బలాలను బాధించడానికీ అవకాశం ఇవ్వడమేకాకుండా, సైన్యమంతా కూడా సరికొత్త తిరుగుబాట్లు చేస్తూందనే తాజావార్తలు రోజుకురోజూ ధారాపాతంగా వచ్చిపడుతూండడంవల్ల సిపాయిల మనోనిబ్బరం మరింతగా పెంపొందే అవకాశం కూడా కలుగజేసింది. తమకున్న కొద్దిపాటి బలాలతోనూ పట్టణాన్ని చుట్టుముట్టి దిగ్బంధనం చేయడానికి ఇంగ్లీషు వారికేలాగూ వీలులేదు కాబట్టి, తుపాముదాడి చేసి మరీ పట్టణాన్ని వారు తమ వశం చేసుకొని తీరాలి. తరువాత రానున్న మామూలు టపాలో, బ్రిటిష్‌వారు ఢిల్లీని పట్టుకున్నారనే వార్త గనుక అందని పక్షమందు, మరికొన్ని నెలలవరకూ భారీయెత్తున సైనికచర్యలనన్నిటినీ వారు నిలిపివేయక తప్పదనే మనం నిశ్చయించేసుకోవాల్సి ఉంటుంది. అప్పటికి భారీవర్షాలు పడడం ఆరంభించి, పట్టణానికి ఈశాన్యంగా వున్న కందకం "లోతుగానూ ఉరవడితోనూ ప్రవహించు

* ప్రసంగవశాత్తూ. — సం.

యూన్న యమునానదీ జల(ప్రవాహంతో'' నిండిపోయి పట్టణాన్ని పరిరక్షించడమేకాకుండా, 75 డి(గీలనుండి 102 డి(గీలవరకూ ఉండే తాప(క్రమము పగటున కురిసే 9 అంగుళాల వర్షంతో ఏకమై, తత్ఫలితంగా సంభవించే అసలైన ఆసియా ఖండపు కలరా యూరపియ న్లను తుడిచి పెట్టుతుంది. లార్డ్ ఎల్లెన్‌బరో చెప్పిన మాటలు ఇకప్పుడు నిజమని రుజు వవుతాయి:

> ''ఇప్పుడు తానున్న చోటును అంటిపెట్టుకుని ఉండడం సర్ హెచ్. బార్ నార్డ్‌కు వీలుండదనే నా అభి(ప్రాయం – అందుకు శీతోష్ణస్థితి వ్యతిరేకం. భారీ వర్షాలు ఆరంభమవడంతో మీరట్‌తో, అంబాలాతో, పంజాబ్‌తో అతనికి సంబంధాలు తెగిపోతాయి. కాసింత వేలను అతడు అంటిపెట్టుకొనవలసివచ్చి ఇరకాటంలో పడ తాడు. (ప్రమాదకరమైన స్థితిలో అతను చిక్కుకుంటాడని నేను అననుగాని, ఆ స్థితి తప్పకుండా వినాశానికీ విధ్వంసానికీ దారితీస్తుందని మా(త్రం నేను చెప్ప గలను. కాలం మించకుండానే అతడు తిరోగమించుతాడని నా విశ్వాసం.''

ఢిల్లీకి సంబంధించినంతవరకూ, జూన్ ఆఖరి వారాల్లో ఢిల్లీమీద పడడానికై జనరల్ బార్‌నార్డ్‌కి తగినంతగా అంగబలమూ సాధనసంపత్తీ చేకూరిందా లేదా అనే సమస్యపైనే సర్వమూ ఆధారపడి ఉంటుందన్న సంగతి మనకి ఇప్పుడు స్పష్టంగానే తెలుస్తోంది. అందుకు భిన్నంగా అతని తిరోగమనం తిరుగుబాటుయొక్క నైతికబలాన్ని మరింత పటిష్ఠమొన రించి, బొంబాయి, మ(ద్రాసు సైన్యాలు దీనిలో బాహాటంగా చేరే విషయాన్ని కూడా బహుశా నిశ్చయపరుస్తుంది.

మార్క్సుచే 1857 ఆగస్టు 4వ
రచించబడింది

"New-York Daily Tribune"
1857 ఆగస్టు 18 తేదీన
5094వ సంచికలో
ప్రచురించబడింది

## మార్క్స్

# ఇండియా తిరుగుబాటు

లండన్, ఆగస్టు 14, 1857

ట్రియెస్ట్‌నుండి టెలిగ్రాఫ్‌ద్వారా జూలై 30న, ఇండియానుండి టపాద్వారా ఆగస్టు 1న వచ్చిన ఇండియావార్తలు అందినవెంటనే,* వాటి విశేషాలూ తేదీలూ సరిపోల్చిచూపి, దానినిబట్టి ఢిల్లీ పట్టుబడిందనే వార్త కేవలం నిరాధారమైన పచ్చిపుకారనీ, ఎప్పటికీ మరుపురాని సెవస్తొపోల్ పతనపు మిథ్యావార్తవంటిదేకాని, అంతకంటె ఒకమెట్టు తక్కువలో లేవదీసిన పిలివార్త అని మేము తక్షణమే రుజువుపరచి చూపించాం. అయినప్పటికీ జాన్ బుల్ యొక్క వెర్రివెంగళాయితనం ఎంతవరకూ వెళ్లిందంటే, జనరల్ బార్నార్డ్ తీసుకున్నట్టి కేవలం రక్షణస్థానాన్నే బట్టబయలు చేస్తూవచ్చిన వార్తలలోనే, జనరల్ బార్నార్ తన శత్రువులను దుంపనాశనం చేసినట్టు సంపూర్ణంగా రుజువవుతూందన్నట్టుగా తన మంత్రులూ, తన షేర్‌మార్కెట్టు దళారీలూ, తన వార్తాపత్రికలూ చిత్రించి తిమ్మిని బమ్మినిగాచేసి చూపించేసరికి, అతడు నిజమేననుకుని నమ్మేశాడు. ఈ పిచ్చిభ్రమ రోజుకురోజూ బలపడి చివరకి ఎంతవరకూ దృఢపడిందంటే, ఇట్టి విషయాల్లో మంచి అనుభవాన్ని గడించినట్టి జనరల్ సర్ డి లాసీ ఇవన్స్ సహితమూ ఢిల్లీ పట్టుబడిపోయిందన్న పుకారు సత్యమనే తాను నమ్ముతున్నానని ఆగస్టు 12 రాత్రి హౌస్ ఆఫ్ కామన్స్‌లో కరతాళధ్వనులు మిన్నుముట్టగా ఉద్ఘాటించాడు. ఇంతటితో ఈ పిచ్చినాటకం పూర్తిఅయేసరికి, ఇక ఈ గాలిబుడగ పేలిపోయే తరుణం ఆసన్నమయింది. మరునాడు ఆగస్టు 13న, క్రమంవెంట వచ్చిన ఇండియా టపాలో వున్న సమాచారాలను సంగ్రహంగా తెలియజేస్తూ ట్రియెస్ట్, మార్సేల్స్‌లనుండి వచ్చిన టెలిగ్రాపు వార్తలు వరుసగా అందడంతో, జూన్ 27 నాటికి ఎక్కడున్న ఢిల్లీ అక్కడే

---

* ఢిల్లీ పట్టుబడిపోయిందనే అసత్యవార్తను ఉద్దేశించిన వాక్యం ఇది (ఈ సంకలనంలో 63వ పుట చూడండి). — సం.

ఉందనీ, ముట్టడించబడినవారు తరుచుగా చేసిన భయంకరమైన ఉధృతగతిదాడులను భరించుతూ, అంతవరకూ రక్షణ చర్యలకే నిర్బంధించబడి తన స్థలంలోనే ఆ నిమిషంవరకూ నిలదొక్కుకోగల్గి వుండినందుకే, జనరల్ బార్‌వార్డ్ సంతోషించుతున్నాడనే విషయంలో ఎట్టి సంశయమూ లేదనీ తేలిపోయింది.

ఇంగ్లీషు సేన తిరోగమించిందన్న వార్తనో, అథమం అట్టి తిరోగమనాన్ని ముందుగానే సూచించే వాస్తవవిషయాలనో, వచ్చేటపా బహుశా అందిస్తుందనే మా అభిప్రాయం. ఢిల్లీ ప్రాకారపు గోడల విస్తీర్ణం ఎంతవరకూ ఉందంటే, దాని పొడుగునా మనుషులను పెట్టి, దానిని పరిరక్షించుకోవడం కేవలం దుస్సాధ్యమైన కార్యమని నమ్మడంలో ఎట్టి సంశయమూ లేకపోవడమే కాకుండా, తద్భిన్నంగా సాంద్రీకరణమూ విస్మయపరచే coups de main*నే ఈ ప్రాకారవిస్తరణ కోరి తెచ్చుకుంటూంది. ఆసియావాసుల గుండెలను చిచ్చరపిడుగులతో ఝల్లుమనిపించడం ఎలాగో ఎరిగినట్టి సర్ చార్లెస్ నేపియర్‌యొక్క సాహసోపేత విపరీతచర్యలను అనుకరించడం బదులు, దుర్గరక్షితములైన నగరాలు, ముట్టడులు, శతఘ్ని గుండ్ల వర్షాలు, వీటికి సంబంధించిన యూరపియన్ భావాలతోనే జనరల్ బార్‌వార్డ్ నిండివున్నట్టు కనబడుతూంది. ఇప్పుడతని సేన 7,000 యూరపియన్లనూ, 5,000 "నమ్మకస్థులైన దేశీయులనూ" కలిగి, మొత్తం 12,000వరకూ హెచ్చిందని చెబుతూన్న సంగతి నిజమేకావచ్చు; కాని అదే సమయంలో తిరుగుబాటుదార్లకు ప్రతిరోజూ అదనపు బలాలు అందుతూనే ఉన్నాయన్న సంగతి కూడా ఖండింపబడడంలేదు; అందుచేత ముట్టడించేవారికీ ముట్టడించబడినవారికీ మధ్యనున్న అసమాన సంఖ్యావ్యత్యాసం ఎట్టి మార్పులేకుండా వెనకటిలాగే ఉండిపోయిందన్న విషయం వాస్తవమేనని మనం నమ్మవచ్చు. అంతేకాకుండా, హఠాత్తు దాడిచేసి తత్ఫలితంగా నిశ్చయమైన విజయాన్ని సాధించగల్గేటట్టే, కాని ఈపాటికల్లా వర్షాకాలం ఆరంభించి ఉండడం కారణంగా నదీముఖంనుండి సమీపించడం ఆచరణసాధ్యంగానట్టి కీలకస్థానంలో వున్న స్థావరమల్లా మొగల్ పాదుషా రాజప్రాసాదం ఒక్కటే కాగా, ఇక నదికీ కాశ్మీర్ దర్వాజాకూ మధ్యనున్న ప్రదేశంనుండి రాజప్రాసాదంపై దాడిసలిపినయెడల, ఒకవేళ ఈ దాడి విఫలమైన పక్షంలో, అన్నిచర్యలకంటె ఈ చర్యే దాడిసలిపేవారికి అత్యంత వినాశకరంగా పరిణమించి తీరుతుంది. ఇక చిట్టచివరి విషయమేమంటే, వర్షాలు ఆరంభించడంతో తన రవాణా, తిరోగమన మార్గాలను వెల్లడిగా ఉంచుకోవడమే తన యుద్ధచర్యల ప్రధాన ధ్యేయమౌతుంది జనరల్ బార్‌వార్డ్‌కి. ఒక్కమాటలో చెప్పాలంటే, ఇప్పటికింకా తనకు ఏమాత్రమూ చాలని సైనిక బలాలతో, ఇంత కంటె అనుకూలమైన రుతువులో సాహసించ వెనుదీసిన సంశయాత్మకకార్యాన్ని సంవత్స

* శక్తివంతమైన ఆకస్మిక దాడి. — సం.

రమంతటిలోనూ దుస్సాధ్యమైనట్టి రుతువులో సాధించడానికి అతడు తెగించి పూనుకోవ డానికి తగిన కారణాలు మనకేమీ కనబడడంలేదు. యథార్థాన్ని ముఖాముఖీ చూడక తమను తాము మభ్యపరచుకుంటున్న లండన్ పత్రికలు వేర్పుగా నటిస్తూన్న గుడ్డితనం ఎలాగున్న ప్పటికీ, అత్యున్నత వర్గాల్లో మాత్రం తీవ్రమైన అనుమానాలు తలలెత్తుతూన్న సంగతి లార్డ్ పామర్స్టన్ పత్రిక "Morning Post"[43] రాతలవల్లనే తెలుస్తూంది. ఆ పత్రి కలో డబ్బుకోసం పనిచేస్తూన్న కిరాయి పెద్దమనుషులు ఈకింది విషయాలను మనకు తెలియజేస్తున్నారు:

> "ఈ టపా తరువాత వచ్చే టపాలోనైనా ఢిల్లీ పట్టుపడిందనే వార్తను మనం వింటామని మాకేమీ నమ్మకం తోచడంలేదు; కాని ముట్టడించేవారి సహాయార్థం వారికింతవరకూ కూడా లోపించినట్టు చెప్పబడుతూన్న పెద్ద ఫిరంగులను తగి నంత సంఖ్యలో వెంటబెట్టుకుని ఇప్పుడు నడిచివెళ్లుతూ మార్గమధ్యమందున్న సైనిక బలాలు వారిని కలుసుకున్న వెంటనే, తిరుగుబాటుదార్ల రక్షకస్థానం పతన మైందనే వార్త మనకు తప్పక చేరితీరుతుంది."

కేవలం తమ బలహీనత, ఊగిసలాట, బండపొరపాట్లు, వీటి మూలంగానే బ్రిటిష్ సేనాధిపతులు, ఇండియా తిరుగుబాటుకు రాజకీయ, సైనిక కేంద్ర హోదాను ఢిల్లీకి కల్పించ డంలో కృతార్థులయారనే విషయం స్పష్టం. సుదీర్ఘమైన ముట్టడి సాగించిన తరువాత కూడా ఇంగ్లీషు సేన తిరోగమించవలసిన పక్షంలోనూ, కేవలం రక్షణచర్యలు చేసుకుంటూనే ఉండిపోవలసిన పక్షంలోనూ, అదొక నిస్సందేహమైన ఓటమిగానే పరిగణించబడి, దేశవ్యాప్త మైన తిరుగుబాటుకే రణభేరిగా భావించబడుతుంది. దాడులతోనూ, ఉధృతగతిదాడులతోనూ, శత్రువులపై అనతికాలంలో రక్తసిక్తమైన పగసాధించుకోగల్గుతామనే ఆశతోనూ స్వభావ సిద్ధంగా నిండినట్టి ఉధృతమైన ముట్టడి ఉద్రేకమే బ్రిటిష్ సేనలనింతవరకూ భయా నకమైన మృత్యువునుండి కాపాడింది. హిందూదేశస్థుల ఉదాసీనత గురించీ, అంతేకాకుండా బ్రిటిష్ పరిపాలనయెడల సానుభూతి గురించీ చెప్పబడుతూన్న మాటలన్నీ కేవలం అసంబ ద్ధం తప్ప మరేమీకాదు. యథార్థమైన ఆసియావాసులందరిలాగానే స్వదేశ సంస్థానాధీ శులు కూడా అనుకూలమైన తరుణంకోసం కాచుకొనున్నారు. పన్నెండుమంది యూరపి యన్లనే అదుపాజ్ఞలలో ఇంతవరకూ ఉంచబడిన యావత్తు బెంగాల్ రాష్ట్రంలోవున్న ప్రజలూ హాయిగా అరాచకంలో మునిగితేలుతూ ఆనందభరితులై ఉన్నారు; కాగా ఇక అక్కడ ఎవరిమీద తిరుగుబడుతారు వారు? ఎవరిమీదనైతే తిరుగబడాలో అట్టి

వారు లేనేలేరాయె. యూరప్ విప్లవ లక్షణాలనే ఇండియా తిరుగుబాటు కూడా ప్రదర్శించా లని ఆశించడం చోద్యమైన quid pro quo* అవుతుంది.

మద్రాసు, బొంబాయి రాష్ట్రాలలో సైన్యం ఇటో అటో ఇంకా నిశ్చయించుకోకపోవ డంవల్లనే, అక్కడి ప్రజలు కదలడంలేదు. పంజాబ్‌లో వున్న దేశీయ సైన్యం నిరాయుధము గావించబడి చిట్టచివరకు, పంజాబే ఈ నిమిషంవరకూ యూరపియన్ సేనలకి ప్రధాన కేంద్రస్థానంగా ఉంది. పంజాబ్‌ను మేలుకొల్పాలంటే ఇరుగుపొరుగు సామంత సంస్థా నాధిపతులు తిరుగుబాటువైపు మొగ్గుచూపాలి. కాని సామగ్రినీ, రవాణాసాధనలనూ సంపాదించు కోవడంలో ఇంగ్లీషువారు అనుభవించుతూన్నట్టే, సైనిక బలాల కేంద్రీకరణలో కలుగు తూన్న జాప్యానికి ప్రధాన కారణమైనట్టే ఇబ్బందులు రైతాంగంయొక్క సద్భావ రాహి త్యం ఏలాగైతే స్పష్టంగా రుజువుపరుస్తూందో, దేశీయుల రహస్యపు కుమ్మక్కూ మద్దతూ లేనిదే బెంగాల్ సేన ప్రదర్శించినట్టి కుట్ర శాఖోపశాఖలుగా విస్తరించడం ఇంత బ్రహ్మాండ మైన స్థాయిలో జరిగివుండనేరదనే విషయం కూడా అంత స్పష్టంగానే వున్నట్టు కనబడు తూంది.

టెలిగ్రాఫుద్వారా అందిన కడమవార్తలకు, ఇటు పంజాబ్ కొట్టకొనను సరిహద్దు ప్రాంతంలో వున్న పెషావర్‌లో తిరుగుబాటు లేచి, అటు ఢిల్లీనుండి దక్షిణదిశగా ఝాన్సీ, సాగర్, ఇందూర్, మహౌ సైనికస్థావరాలగుండా అంగలేసుకుంటూ చివరకు బొంబాయికి పూర్వోత్తరదిశగా 180 మైళ్ల దూరంలో మాత్రమే వున్న ఔరంగాబాద్‌ను చేరుకున్నట్టు మనకు విరూపించుతూన్న మేరకు, ప్రాముఖ్యత వుంది. బుందేల్‌ఖండ్‌లో వున్న ఝాన్సీ విషయంలో, ఇది దుర్గరక్షితమైన స్థలమనీ, తత్కారణంగా ఇది సాయుధ తిరుగుబాటుకు మరొక కేంద్రస్థానంగా రూపొందగలిగే అవకాశం ఉందనీ మనం చెప్పవచ్చు. అయితే, ఢిల్లీ ఎదుట విడిసివున్న జనరల్ బార్‌నార్డ్‌ను కలుసుకొనే నిమిత్తం పశ్చిమోత్తర దిశగా బయలుదేరి ఇప్పుడింకా ఢిల్లీకి 170 మైళ్ల దూరంలో వున్న జనరల్ వాన్ కోర్ట్‌లాండ్ తన దారిలో తిరుగుబాటుదార్లను సిర్సా నగరంవద్ద ఓడించాడని తెలియజేయబడుతూంది. అతడు ఝాన్సీగుండా వెళ్లాలి; అందుచేత మళ్లీ మరొకసారి తిరుగుబాటుదార్లను అతడు ఈ నగరంలో తారసిల్లవలసి ఉంటుంది. బ్రిటిష్ ప్రభుత్వం చేస్తూన్న సన్నాహాలను గూర్చి చెప్పవలసివస్తే మిక్కిలి చుట్టుతిరిగిన గీతే అతికురుచైన గీత అని లార్డ్ పామర్‌స్టన్ భావించుతూన్నట్టుంది. ఫలితంగా తన సేనలను సరాసరి ఈజిప్టుగుండా పంపించడం బదులు కేప్ చుట్టూ తిప్పి పంపిస్తున్నాడు. చైనాకి వెళ్లడానికిగాను పంపబడిన సుమారు వెయ్యిమంది సింహళం చేరగానే అక్కడనుండి తిరుగుముఖంగా కలకత్తావైపు మళ్లించబడి,

* పొరపాటు. — సం.

5వ ఫ్యుసిలీయర్ రెజిమెంటు యథార్థంగా జూలై 2న కలకత్తా చేరుకున్న సంగతిని లార్డ్ పామర్‌స్టన్ అవకాశంగా తీసుకుని, తాను ప్రజ్వలింపజేసిన చైనాయుద్ధం "పేదకు దొరికిన పెన్నిధి" అని ఇంకా నమ్మకుండా తటపటాయింప సాహసిస్తూ తనకు విధేయతగా వున్న కామన్స్ సభలో ఇంకా మిగిలివున్న సభ్యులపై అసందర్భమైన పరిహాసం ప్రయోగించాడు.

మార్క్స్‌చే 1857 ఆగస్టు 14న
రచించబడింది

"New-York Daily Tribune"
1857 ఆగస్టు 29 తేదీన
5104వ సంచికలో
ప్రచురించబడింది

# మార్క్స

# యూరప్‌లో రాజకీయ పరిస్థితి

వాయిదా పడిన కామన్స్ సభకీ రానున్న సమావేశానికీ మధ్యనున్నకాలంలో ఇంగ్లీషు ప్రజలకోసం తాను సిద్ధంగా వుంచిన వినోదాలను కామన్స్ సభ్యులకి కాస్త లీలా మాత్రంగానే తెలుసుకోడానికి వీలుగా వుండేందుకై సభ వాయిదా పడుతుందనగా అందుకు ముందురోజు సమావేశాన్ని ఒక అవకాశంగా లార్డ్ పామర్‌స్టన్ వినియోగించుకున్నాడు. మార్చి 4న చేసుకున్న శాంతి సంధివల్ల వికరంగా అంతమొందించబడిందని కొన్ని నెలలకిందట తాను చెప్పినట్టి పర్షియా యుద్ధం పునః ప్రారంభమయిందన్న ప్రకటన అతని కార్యక్రమంలో మొదటి అంశం. పర్షియా అఖాతంలో ఇప్పుడు జనరల్ జాకబ్ నాయకత్వాన ఉంచబడిన సేనలను తీసుకుని అతనిని తిరిగి ఇండియాకు వెళ్లిపోవలసినదిగా ఆజ్ఞాపించినట్లు ఆశించవచ్చునుకదా అని జనరల్ సర్ డి లాసీ ఇవన్స్ వక్కాణించగా, అందుకు బదులు చెబుతూ సంధిప్రకారం పర్షియా తాను నెరవేర్చేందుకు అంగీకరించిన షరతులను నెరవేర్చేవరకూ కర్నల్ జాకబ్ కిందవున్న సైనికబలాలను అక్కడనుండి సైదొలగించడానికి వీలుపడదని లార్డ్ పామర్‌స్టన్ ఖచ్చితంగా తెలియజేశాడు. హీరట్ పట్నాన్ని మాత్రం ఇంతవరకూ ఖాళీచేయక పోవడమేకాకుండా, పైపెచ్చు పర్షియావారు ఆ పట్నానికి అదనపు బలాలు పంపించారని వదంతులున్నాయి. ఈ వదంతులలో నిజంలేదని పారిస్‌లోవున్న పర్షియా రాయబారి ఉద్ఘాటించాడు; కాని పర్షియా నిజాయితీని సకారణంగానే శంకించవలసివస్తూంది; తత్ఫలితంగా కర్నల్ జాకబ్ నాయకత్వాన వున్న సైనికబలాలు బుష్హైర్‌ను ఆక్రమించుకునే ఉంటాయి. లార్డ్ పామర్‌స్టన్ ప్రకటన జరిగిన మరుచటిదినం, హీరట్‌ను తప్పక ఖాళీచేసి తీరాల్సిందని ఖచ్చితంగా కోరుతూ పర్షియా ప్రభుత్వంపై మిస్టర్ ముర్రే ఒత్తిడి చేసినట్లు టెలిగ్రాఫు వార్తాలేఖలు తెలుపుతూన్నాయి. పునః యుద్ధప్రకటనకు ఈ కోరిక నాందిప్రస్తావనే అవుతుందనేది ఇంచుమించు నిశ్చయమనే భావించవచ్చు. ఇండియాలోని తిరుగుబాటుయొక్క అంతర్జాతీయ ఫలితాలలో ఇది మొదటిది.

ఇక లార్డ్ పామర్‌స్టన్ కార్యక్రమంలో రెండవ అంశం. ఇది ఆవిష్కరించుతూన్న విస్తృత పర్యవసాన పరిధి, దీనిలో వివరాలేవీ లేని లోపాన్ని తీర్చేస్తూంది. ఇండియాకు పంపించడానికై ఇంగ్లండునుండి హెచ్చుసంఖ్యలో సైనికబలాలను తొలగించివేస్తూన్నట్టు అతడు మొదటలో ప్రకటించినప్పుడు, గ్రేట్ బ్రిటన్ రక్షణశక్తిని ఈ చర్య కుంటు పరుస్తూందనీ, ఈవిధంగా దేశంయొక్క బలహీనస్థితిని అదనుగా తీసుకోడానికి పరాయి దేశాలకు అవకాశం కలుగజేస్తూందనీ అతని ప్రత్యర్థులు మోపిన నిందకు సమాధానం చెబుతూ అతడిలా అన్నాడు:

"గ్రేట్ బ్రిటన్ ప్రజలు ఇటువంటి చర్యను ఏనాడూ సహించరు, ఎట్టి ఘటన సంభవించినప్పటికీ, అందుకు సరిపడినట్టు మనుషులను హుటాహుటిని సత్వరంగా యుద్ధసన్నద్ధులనుగా చేయడం జరుగగలదు."

ఇప్పుడు పార్లమెంటు వాయిదాపడనున్న సమయంలో, ఇందుకు కేవలం భిన్నమైన ధోరణిలో అతడు మాట్లాడుతున్నాడు. ఇండియాకు పంపే సైనికబలాలను తరలించేందుకు రక్షణశ్రేణిలోని ప్రముఖయుద్ధనౌకలను ఉపయోగించవలసిందని జనరల్ డి లాసీ ఇవన్స్ చెప్పిన సలహాకు, స్క్రూప్రొపెల్లర్ కంటె తెరచాపే శ్రేష్ఠమని తానిదివరలో ఉద్ఘాటించినట్టు ఇప్పుడు ఉద్ఘాటించకుండా, జనరల్ ఇవన్స్ సూచించిన పథకం హెచ్చు ప్రయోజన కారిగా ఉండేటట్టే మొదట చూడడానికి కనబడుతూందని అంగీకరిస్తూ, వెనుక తాను చెప్పిన దానికి విరుద్ధంగా ఇప్పుడు జవాబిచ్చాడు. ఐనప్పటికీ సభవారు ఒక విషయాన్ని విస్మరింప తగదని చెబుతూనే అతడీలాగన్నాడు:

"తగినన్ని సైనిక నౌకాబలాలను స్వదేశంలోనే ఉంచడంలోగల ఔచిత్యాన్ని గూర్చి ఆలోచించినప్పుడు, ఇతర విషయాలను కొన్నింటిని దృష్టిలో పెట్టుకోవాల్సి ఉంటుంది.... కేవలం అవసరమైన మేరకు మించిన నౌకాబలాలను దేశంనుండి పంపించివేయడం తగనిపని అని కొన్ని సందర్భాలను పురస్కరించుకుని నిశ్చయించవలసివచ్చింది. రక్షణశ్రేణికి చెందిన ఆవిరి యుద్ధ నౌకలు ప్రస్తుతం పనిలేకుండా ఊరకే ఉంటున్నాయనీ, వాటిని వినియోగించవలసిన అవసరం ఇప్పుడేమంతగా లేదనీ అనడంలో సందేహమేమీలేదు; కాని వెనుక సూచించబడిన ఘటనలే గనుక సంభవించిన పక్షంలో, మన నౌకా బలాలను సముద్రంపైకి పంపాలని మనం నిశ్చయించుకొని, మన రక్షణశ్రేణీ నౌకలను ఇండియాకు రవాణా నౌకలుగా ఇప్పుడు ఉపయోగించడానికి అంగీకరించినట్టయితే, అప్పుడు సంభవించే ప్రమాదాన్ని ఎలాగు ఎదుర్కోగల్గుతాం? యూరప్‌లో ఉండే

పరిస్థితుల కారణంగా, అత్యంత స్వల్పవ్యవధిలో మన రక్షణకై మనం సాయుధులమై ఉండవలసిన అవసరం కలిగేటప్పుడు, ఈ యుద్ధ నౌకా సమూహాన్ని మనం ఇండియాకు పంపించినయెడల ప్రమాదకరమైన పొరపాటును చేసినవారమౌతాం."

జాన్ బుల్‌ని లార్డ్ పామర్‌స్టన్ గట్టి చిక్కులోనే పడేశాడన్నది నిర్వివాదమే. ఇండియాలో తిరుగుబాటును నిర్ణయాత్మకంగా అణచివేయడానికి అవసరమైన సాధనాలన్నిటినీ అతడు వినియోగించినట్టయితే స్వదేశంలో అతనిపై దాడి జరుగుతుంది; ఇండియాలో తిరుగుబాటును అతడు దృఢపడనిస్తే, మిస్టర్ డిజ్రేలీ చెప్పినట్టుగా, "ఇండియాలోని సంస్థానాధీశులనే కాకుండా, ఇంకా అదనంగా పోరాడవలసిన ఇతర పాత్రలను కూడా రంగం మీద చూస్తాడతడు."

"యూరప్‌లో ఉండే పరిస్థితులు" అని నిగూఢంగా చెప్పబడిన విషయాలపై మన దృష్టిని సారించేముందు, ఇండియాలో వున్న బ్రిటిష్ సైనికబలాల యథార్థపరిస్థితిని గూర్చి కామన్స్ సభయొక్క అదే సమావేశంలో చేయబడిన ఒప్పుకోళ్లన్నింటినీ జతచేయడం సమంజసం కాకపోదు. అట్టిసందర్భంలో, హుటాహుటిని ఢిల్లీని వశపరచేసుకుంటామని ఇదివరలో ఘంటాపథంగా చాటిన ఆశలను, పరస్పరం ఒప్పందం జరిగిందేమోనన్నట్టుగా, ఇప్పుడు ఇరుపక్షాలవారూ చల్లచల్లగా జార్చేశారు. జార్చేసి, వెనుకటిరోజుల్లో ఆకాశాన్నందుకునేట్టు గంభీరంగా చాటిన పెద్దకబుర్లన్నీ వేలకూలి, నవంబరులో స్వదేశంనుండి పంపించే అదనపు సేనలు రంగంలోకి ప్రవేశించేంతవరకూ ఇంగ్లీషువారిప్పుడు ఆక్రమించుకొనున్న స్థావరాలలోనే నిలదొక్కుకుని ఉండగలిగితే అదే పదివేలుగా తమ్ముతాము అభినందించుకొని సంతోషించాల్సి వుంటుందనేటట్టి మరింత సహేతుకమైన అభిప్రాయంతో తృప్తిచెందుతూండడం మొదటి విషయం. మిస్టర్ డిజ్రేలీ చెప్పినట్టుగా, ముఖ్యస్థావరాల్లో ఒకటైనట్టే భవిష్యత్ ఘటనంతా ఆధారపడవలసినట్టి, ఢిల్లీని స్వాధీనపరచుకోవడంకంటెనూ తన అభిప్రాయంలో అత్యంత ప్రాముఖ్యతను వహించుతూన్నట్టి కాన్పూర్‌ను ముట్టడినుండి విడిపించడం అతిదుస్సాధ్యమైన కార్యమనీ, కాన్పూర్‌ను పోగొట్టుకోవడం బహుశా సంభవమేననే అనుమానాలు మెల్లమెల్లగా బయటికి పొక్కడం రెండవ విషయం. కాన్పూర్ గంగానదిపై కేంద్రస్థానంలో ఉండడంవల్ల అయోధ్య, రోహిల్‌ఖండ్, గ్వాలియర్, బుందేల్‌ఖండ్‌లపై భౌగోళికంగా దానికుండే ప్రాముఖ్యాన్నిబట్టీ, ఢిల్లీకి అగ్రగామిదుర్గంగా నిర్వడాన్నిబట్టీ, ఇప్పటి సందర్భాల్లో కాన్పూర్ వాస్తవంగా అతిముఖ్యమైన స్థావరమవుతూంది. ఇక ఆఖరి విషయం: తమ ఇండియా సైన్యంలో ఇంతవరకూ వున్న ఇంజనీరూ, సాప్పర్లూ సైన్యాన్ని వదిలేసి వెళ్లిపోవడంచేత, ఇప్పుడు అక్కడి సేనలో ఇంజనీర్లూ, సాప్పర్లూ లేరనే విషయాన్నీ, తత్కారణంగా "ఢిల్లీని రెండవ సారాసాను చేసే"[44] ప్రమాదం వుందన్న

UNIVERSITY OF HYDERABAD
Acc. No. ... 6652
Date ...

విషయాన్ని, మిలిటరీ సభ్యులలో ఒకడైన సర్ ఎఫ్. స్మిత్ కామన్స్ సభ దృష్టికి తీసుకొచ్చాడు. ఈ పరిస్థితిని తప్పించే బదులు, ఇంజనీరింగు సైనికవిభాగానికి చెందిన ఆఫీసర్లను గాని, సైనికులనుగాని ఇంగ్లండునుండి పంపించడం విషయంలో లార్డ్ పామర్‌స్టన్ అశ్రద్ధచేశాడు.

"భవిష్యత్తులో ముంచుకొస్తున్నాయ"ని చెప్పబడిన యూరప్ ఘటనలను గూర్చి మనమిక ప్రస్తావించుదాం. ఈ సందర్భంలో లార్డ్ పామర్‌స్టన్ సూచాయాగా ఎత్తుకొన్న విషయాలనుగూర్చి లండన్ "Times" చేసిన వ్యాఖ్యానం మాకు అమిత ఆశ్చర్యాన్ని కలిగించిందనే చెప్పాలి. ఫ్రెంచి రాజ్య వ్యవస్థ కూలదోయబడడమో, లేక జీవితరంగంనుండి నెపోలియన్ అంతర్థానమవడమో సంభవమనీ, అట్టిదేదైనా సంభవించిన పక్షంలో ప్రస్తుత భద్రతా స్థితిపై ఆధారపడుతూన్న ఫ్రెంచి మైత్రి అంతమొందుతుందనీ ఆ పత్రిక అంటూంది. అదే మరొక మాటలో చెప్పాలంటే, ఏరోజునైనా ఫ్రాన్సులో విప్లవం సంభవింపవచ్చునని చెబుతూనే, అదే నిమిషంలో ప్రస్తుత మైత్రి ఫ్రెంచి ప్రజల సామభూతిపైన గాకుండా కేవలం ఫ్రెంచి రాజ్యాధికారాపహర్తతో కలిసి చేసుకున్న కుట్రపైన స్థాపించబడిందని బ్రిటిష్ మంత్రి మండలియొక్క ప్రముఖ పత్రిక అయిన "Times" ఉద్ఘాటించుతూంది. ఫ్రాన్సులో విప్లవం మాట అటుండగా, డాన్యూబ్ తగాదా[45] కూడా ఉంది. మోల్దావియ ఎన్నికలను రద్దుచేయడం ఫలితంగా, ఈ తగాదా అంతమొందించబడడం బదులు అది మరొక నూతన స్వరూపాన్ని మాత్రమే తీసుకుంది. వీటన్నిటినీ తలదన్నుతూంది ఉత్తరాన వున్న స్కాండినేవియా సమస్య; అట్టి సుదూరముకాని భవిష్యత్తులో ఇదొక బ్రహ్మాండమైన ఆందోళనా రంగంగా పరిణమించి, యూరప్‌లో అంతర్జాతీయ సంఘర్షణకు తప్పక రణభేరీని మ్రోగించగలదనే సూచనలున్నాయి దీనికి. స్వీడన్‌రాజు* మరణం, ప్రస్తుతపు డెన్మార్క్ రాజు రాజ్యవిసర్జన, ఈ రెండు ఉదంతాలకోసమూ అతి ఆత్రంతో వేచివుండడం కారణంగా ఇంతవరకూ ఉత్తరాదిని శాంతికేమీ భంగం కలగడంలేదు. ఇటీవల క్రిస్టియానియాలో జరిగిన ప్రకృతి అధ్యయనవేత్తల సమావేశంలో మాట్లాడుతూ రాజ్యవారసుడైన స్వీడన్ యువరాజు** స్కాండినేవియా దేశాల ఐక్యతకు తాను సుముఖుడనని నొక్కి వక్కాణించాడు. అతడు నడివయస్సు మనిషీ, దృఢసంకల్పుడూ, శక్తిసామర్థ్యాలున్నవాడూ అవడంచేత స్వీడన్, నార్వే, డెన్మార్క్ దేశాలలో వున్న ఉత్సాహవంతులైన యువకులందరూ అధికసంఖ్యలో సభ్యులుగా చేరినట్టి స్కాండినేవియన్ పార్టీ, ఇతడు సింహాసనాన్ని అధిష్ఠించడమే యుద్ధప్రకటనకు తగిన అదనుగా ఎంచుతుంది. మరొకవైపున బలహీనుడూ బుద్ధిమాం

* మొదటి ఓస్కార్. — సం.

** చార్లెస్ లుడ్విగ్ ఒయ్‌గెన్. — సం.

ద్యుడూ అయిన డెన్మార్క్ రాజు ఏడవ ఫ్రెడరిక్ ఇదివరకే రాజ్యాన్ని పరిత్యజించి అంతరంగిక జీవనంలో కాలం గడుపుకోవాలనుకున్నాడు; కాని అతని అనులోమవివాహపు భార్య, కౌంటెస్ డాన్నర్ అందుకు అనుమతించ నిరాకరించింది తుట్టతుదకిప్పుడు ఆమె అందుకు అంగీకరించిందని అందరూ చెప్పుకుంటున్నారు. ఆమె కారణంగానే రాజు పినతండ్రీ, రాజ్యానికి వారసుడూ అయిన ప్రిన్స్ ఫెర్డినాండ్‌ను రాచకార్యాలనుండి విరమించుకొనేదిగా ఒప్పించారు; కాని ఇప్పుడు మళ్లీ రాజకుటుంబంవారు చేసిన ఏర్పాటుననుసరించి అతడు తిరిగి రాచకార్యాలలో ప్రవేశించడం జరిగింది. కౌంటెస్ డాన్నర్ కోపెన్‌హాగెన్‌లో నివసించడం మానుకుని పారిస్‌కు తన నివాసం మార్చుకొన నిశ్చయించిందనీ, ప్రిన్స్ ఫెర్డినాండ్‌ను రాజుగా చేసి రాజకీయజీవిత ఝంఝూమారుతాలకు వీడ్కోలుచెప్పేటట్లు రాజుచేత ఒప్పించిందని కూడా అనుకుంటున్నారు. తుయిలెరీ రాజదర్బారుపట్ల తరువాత పదవ చార్లెస్ నామం ధరించి రాజైనట్టి కౌంట్ ఆఫ్ అర్టోయ్ ఎట్టి వైఖరి తీసుకున్నాడో, సుమారు 65 ఏళ్లవయస్సు గల ఈ ప్రిన్స్ ఫెర్డినాండ్ కోపెన్‌హాగెన్ రాజదర్బారుపట్ల అట్టి వైఖరి తీసుకున్నాడు. సనాతన విధానంపట్ల మూర్ఖమూ, కఠినమూ, తీవ్రమూ ఐన నమ్మకాన్ని కలిగిన ఇతడు, రాజ్యాంగచట్టబద్ధమైన రాచరికవిధానంపట్ల తనకు గల విముఖతను ఎప్పుడూ ఏవిధంగానూ కప్పిపుచ్చడానికి ప్రయత్నించనైనా ప్రయత్నించలేదు. తాను బహిరంగంగా అసహ్యించుకుంటూన్న రాజ్యాంగచట్టంపైన ప్రమాణం చేయడమే సింహాసనాన్ని అధిష్ఠించేందుకు మొదటి షరతు. ఈ కారణంగా అంతర్జాతీయ చిక్కులు ఏర్పడడం సంభవం; కాగా ఈ పరిస్థితిని స్వీడన్ డెన్మార్క్‌లలోవున్న స్కాండినేవియన్ పార్టీ తన సొంత లాభానికి వినియోగించుకోడానికే దృఢంగా నిశ్చయించుకుంది. ఇది ఇలావుండగా, అటు డెన్మార్క్‌తో తమకుగల కొర్కెలపట్ల ప్రష్యా ఆస్ట్రియాల సహాయాన్ని పొందుతూన్న జర్మన్ డచేస్‌కి చెందిన ష్లెస్‌విగ్, హోల్‌స్టయిన్‌ల తగాదా,[46] ఇప్పటికే వున్న విషమపరిస్థితులను మరింత కలుషితపరచి, ఉత్తరాన వున్న ఆందోళనలో జర్మనీ చిక్కుకొనడానికి దారితీయవచ్చు; ఇదే సమయంలో డెన్మార్క్ సింహాసనాన్ని ప్రిన్స్ ఫెర్డినాండ్‌కు స్థిరపరుస్తూ హామీలనిచ్చిన 1852 లండన్ సంధి రష్యా, ఫ్రాన్సు, ఇంగ్లండులను ఈ తగాదాలోకి దింపే అవకాశం కూడా ఉంది.

మార్క్స్‌చే 1857 ఆగస్టు 21న
రచించబడింది

"New-York Daily Tribune"
1857 సెప్టెంబరు 5వ తేదీన
5110వ సంచికలో
ఒక సంపాదకీయ వ్యాసంగా
ప్రచురించబడింది

## మార్క్స్

# *ఇండియాలో జరిగిన చిత్రహింసలపై దర్యాప్తు[47]

ఇండియాలో జరుగుతూన్న తిరుగుబాటును గూర్చి మేము నిన్న ప్రచురించిన మన లండన్ విలేకరి లేఖలో ఈ తీవ్రమైన ప్రతీకారానికి దారితీసినట్టి పూర్వఘటనలు కొన్నింటిని అత్యంత సముచితంగా పేర్కొన్నాడు. నేటి సంచికలో ఈ పరిశీలనా ధోరణినే మరి కొంత వరకూ సాగించాలనీ, ఇండియా దేశస్థులపట్ల ఇండియాలో వున్న బ్రిటిష్ పరిపాలకులు ప్రపంచాన్ని నమ్మమని తాము చెబుతూన్నంతటి సాధుసంపన్నులూ నిష్కళంకులూ అయిన ఉపకారస్థులు ఎంతమాత్రమూ కారని చూపడమే మా ఉద్దేశ్యం. ఇందుకుగాను, ఈస్ట్ ఇండియాలో చిత్రహింసల గురించి 1856, 1857లలో చేసిన కామన్స్ సభా సమావేశాల ముందుంచబడిన అధికారయుతములైన "బ్లూ బుక్సు"నే[48] వినియోగించుతాము. ఇది తిరుగులేని సాక్ష్యమని వేరే చెప్పనక్కర్లేదు.

మద్రాసులో విచారణ జరిపిన చిత్రహింస దర్యాప్తు కమీషనుయొక్క ప్రథమ నివేదికను[49] మనం మొదట పరిశీలించుదాం; ఈ నివేదికలో "రెవిన్యూ శిస్తు వసూళ్లకోసం చిత్రహింసలు విధించడం సర్వసాధారణంగా అమలులోవున్న విషయమే"నన్న నమ్మకానికే కమీషను వచ్చిందని చెప్పబడింది.

> "శిస్తులను చెల్లించని నేరానికిగాను ఏటా దౌర్జన్యం పాలుగాబడిన ప్రజల సంఖ్య క్రిమినలు నేరాలకింద శిక్షగా దౌర్జన్యానికి పాలుగాబడినవారి సంఖ్యతో కొంచెం యించుమించులో సమానమేమో" అని

నివేదిక సందేహం వెలిబుచ్చుతూంది.

> "చిత్రహింస అమలులో వుందనేటట్టి నమ్మకానికి రాకతప్పనందున కమీషను వారికి కలిగిన బాధకంటె మరొక విషయం వారి మనసులో స్థిరంగా నాటుకోవడం

> వల్ల వారికింకా ఎక్కువ బాధ కలుగజేసింది. అదేమిటంటే పరిహారం పొందడంలో బాధలకుగురైన వ్యక్తులు ఎదుర్కోవలసిన కష్టాలు" అని

నివేదిక ఉద్ఘాటించింది.

ఈ కష్టాలకు గల కారణాలను కమీషనువారు ఈవిధంగా పేర్కొన్నారు: 1) ఫిర్యాదు చేయదల్చుకొనేవారు స్వయంగా కలెక్టరు[50] ఎదుట కచేరీలో హాజరుకావలసిన కారణంగా వారికి డబ్బునష్టమూ వృధాకాలహరణమూ సంభవించుతూంది; 2) ఉత్తరంద్వారా అర్జీ పెట్టుకున్నయెడల, జిల్లా పోలీసూ రెవిన్యూ ఉద్యోగీ రెండూ అయిన "తాశీల్దారుకు" — అనగా ఏ ఉద్యోగైతే స్వయంగానో, లేక అతని చేతికింద వున్న చిన్న పోలీసు ఉద్యోగులచేతనో తనకు హాని కలుగజేశాడో ఆ తాశీల్దారుకే — "దర్యాప్తు నిమిత్తం పంపించడమైంది" అనే సూచనను పేరిన రాసి, అర్జీని వాపసు చేస్తారనే భయం; 3) ఈ దుర్నయాలను గావించినట్లు యథావిధిగా చట్టములలో నిర్ణయించబడిన విధాన్ని అనుసరించి నేరము మోపబడినట్టిగాని, చట్టములను అనుసరించి శిక్ష విధింపబడినట్టిగాని ప్రభుత్వోద్యోగులపై సహితమూ శిక్ష అమలు జరిపేందుకు తగిన సక్రమపద్ధతులుగాని, శిక్షించడమునకుగాని ఎట్టి బందోబస్తులూ సమర్థవంతంగా జరగకపోవడం. ఇటువంటి నిందారోపణ మేజిస్ట్రేటు యెదుట రుజువైన పక్షంలో, కేవలం యాభై రూపాయల జుల్మానాగాని, ఒక నెల ఖైదుగాని మించని శిక్ష విధించడానికే మేజిస్ట్రేటుకు అధికారం ఉన్నట్లు, గాని అంతకు మించి శిక్ష విధించడానికి అతనికి అధికారంలేనట్లు కనిపిస్తోంది. అందుకు ప్రత్యామ్నాయంగా "శిక్ష విధించేందుకై క్రిమినల్ జడ్జీకిగాని, సర్క్యూట్ కోర్టు ఎదుట విచారణకై హాజరుపెట్టడానికిగాని" నేరస్థుడిని ఒప్పగించివేయవచ్చు.

నివేదికలో అదనంగా ఇలా వుంది:

> "ఇదంతా మిక్కిలి విసుగుపుట్టించేటట్టి కాలహరణపు వ్యవహారకాండగామా, అధికారదుర్వినియోగమనే ఒకేఒక నేరానికే — అనగా పోలీసువారిపై తేబడిన అభియోగాలలోనే తప్ప — ప్రస్తుతపు సందర్భంలో ఎంతమాత్రమూ తగివుండని వ్యవహారకాండగామా కనబడుతూంది."

పోలీసు ఉద్యోగిపైనగాని, లేదా రెవిన్యూ ఉద్యోగిపైనగాని — పోలీసువారే రెవిన్యూ శిస్తులు వసూలుచేయడంచేత ఈ రెండు కార్యాలూ ఒక ఉద్యోగే నిర్వహిస్తున్నాడు — బలాత్కారంగా డబ్బు వసూలుచేసినట్లు నేరంమోపబడినప్పుడు, ఆ ఉద్యోగిని మొదట అసిస్టెంటు కలెక్టరు విచారణచేస్తాడు; ఈ తీర్పుపై ఆ ఉద్యోగి కలెక్టరుకూ, కలెక్టరు తీర్పుపైన

రెవిన్యూ బోర్డుకూ అప్పీలు చేసుకోవచ్చు. తదుపరి ఈ బోర్డు అతన్ని ప్రభుత్వ కోర్టుకు గాని, లేదా సివిల్ కోర్టుకుగాని పంపించవచ్చు.

> "పద్ధతి ఈవిధంగా ఉన్నప్పుడు, పేదరికంతో బాధపడుతూన్న ఏ రైతు కూడా ధనవంతుడైన రెవిన్యూ ఉద్యోగస్తునితో కలహం పెట్టుకొనజాలడు. ఈ రెండు (1822, 1828 సంవత్సరాల) శాసనవిధులకిందనూ ఫిర్యాదులేవీ చేయబడినట్టు కూడా మా దృష్టికి రాలేదు."

పైగా ప్రభుత్వం తరపున వసూలుచేయబడవలసిన మొత్తానికి బదులు అధికంగా వసూలు చేసినప్పడే, లేదా ఉద్యోగి తన జేబులో వేసుకొనే ఉద్దేశంతోనే దౌర్జన్యంగా రైతునుండి అదనంగా డబ్బు వసూలు చేసినప్పుడే బలాత్కార చౌర్యమనే నేరం వర్తించుతుంది. దీన్నిబట్టి అసలు రెవిన్యూ వసూలు చెయ్యడంలో దౌర్జన్యం ఉపయోగించినప్పుడు శిక్షించేందుకు చట్టబద్ధమైన పద్ధతులేవీ లేవనేది స్పష్టంగానే తెలుస్తూంది.

పైన ఉదహరించిన వాక్యాలు కలిగిన నివేదిక మద్రాసు రాష్ట్రానికే వర్తించుతూంది; కాని లార్డ్ డల్‌హౌసీ 1855 సెప్టెంబరులో డైరెక్టర్లకు* రాసిన లేఖలో, తానే ఇలా రాశాడు:

> "బ్రిటిష్ రాష్ట్రాలలో ప్రతిదానిలోనూ కింది ఉద్యోగులు ఏదో ఒక రూపంలో చిత్రహింస ఉపయోగించుతున్నారన్న విషయంలో చాలా కాలంనుండి నాకెట్టి సందేహమూ కలగడంలేదు."

ఈవిధంగా బ్రిటిష్ ఇండియా ఆర్థిక వ్యవస్థలో చిత్రహింస అంతర్భాగంగా దేశమంతటా పాతుకుపోయిందనే విషయం అధికారయుతంగానే ఒప్పుకుంటున్నారు. అయితే ఈ ఒప్పుకోలు ఏవిధంగా ఉందంటే, బ్రిటిష్ ప్రభుత్వానికి ఇందులో ఏవిధంగానూ సంబంధం లేదని తప్పించుకోడానికి వీలుండేటట్టుగా ఉంది. ఇందుకు తగినట్టుగానే చిత్రహింసలు జరపడంలో నేరమంతా దేశీయులైన కింది ఉద్యోగులదేననీ, ప్రభుత్వంయొక్క యూరపియన్ ఉద్యోగస్థులు కేవలం విఫలులైనప్పటికీ కూడా, అవి జరగకుండా శాయశక్తులా తంటాలుపడుతూనే వున్నారనీ, మద్రాసు కమీషను నిర్ధారణకు వచ్చింది. ఈ నిర్ధారణకు వచ్చినందుకు చిత్రహింసల విచారణపట్ల ఫిర్యాదుచేస్తూ; "మద్రాసు నేటివ్ ఎసోసియేషన్" వారు 1856 జనవరిలో పార్లమెంటుకు ఒక అర్జీ పంపించి అందులో ఈకింది ఆధారాలు

---

* ఈస్ట్ ఇండియా కంపెనీ వారి బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్. — సం.

పేర్కొన్నారు: 1) కమీషను తన విచారణను కేవలం చెన్నపట్నంలోనే జరపడంచేతనూ, అదైనా ఏ మూడు నెలలపాటో జరగడంచేతనూ, తత్కారణంగా బహుకొద్ది సందర్భాలలో తప్ప దేశీయులకు తమ గ్రామాలనుండి వచ్చి ఫిర్యాదుచేయడానికి దుస్సాధ్యమవడం చేతనూ వాస్తవమైన విచారణ అంటూ ఏదీ జరగలేదు; 2) ఈ ఘోరకలికి మూలకారణమేమిటో మొదలంటా తరచిచూడడానికి కమీషను సభ్యులు ప్రయత్నించనేలేదు; ఆవిధంగా వారు చేసివుండిన పక్షంలో, ఈ ఘోరకలి అంతా అసలు రెవిన్యూ వసూలుచేసే పద్ధతిలోనే ఉందన్న విషయం బయటపడి ఉండేది; 3) ఈ దురలవాటును గూర్చి తమ పైఅధికారులకు ఎంతవరకు తెలిసివుండెనో నిర్ధారణచేయడానికై దోషులైన దేశీయోద్యోగులను ఎవ్వరినీ విచారణ చేయలేదు.

అర్జీదార్లు ఇలా అంటున్నారు:

> “ఈ దౌర్జన్యాలకు అసలు మూలం, వాటిని వాస్తవంలో జరిపినవారుకాక, వరావరి వారిపైన అధికారంచేస్తూ అంచనాచేయబడిన వసూళ్ల మొత్తమంతా వసూలు చేయడానికి తమ యూరపియన్ పెద్ద అధికార్లకు బాధ్యులైనట్టి ఉద్యోగులనుండీ, ఈ ఉద్యోగులకు పైనుంటూ పూర్తివసూళ్లకు అందరి పైనా అధికారాన్ని వహిస్తూ ప్రభుత్వానికి జవాబుదారులైనట్టి యూరపియన్ అధికార్లనుండీ, కిందకు వ్యాపించుకుంటూ వస్తోంది.”

“ఇందులో ఇంగ్లీషువారిని ఏవిధంగానూ తప్పుపట్టడానికి వీలులేద”ని ఘంటాపథంగా వక్కాణించుతూన్న కథనాన్ని ఖండించడానికై, చెన్నపట్నం దర్యాప్తు కమీషనర్ల నివేదిక తాను ఆధారపడినట్లు చెప్పుకుంటూన్న సాక్ష్యంనుండే కొద్ది ఉదాహరణలు ఉల్లేఖించుతే సరిపోతుంది. మిస్టర్ డబ్లియు. డి. కోక్స్‌హోఫ్ అనే ఒక వర్తకుడు ఈవిధంగా చెప్పాడు:

> “మామూలుగా అమలులోవున్న చిత్రహింసలు రకరకాలుగా ఉంటాయి; ఏ రకం చిత్రహింసను ఉపయోగించాలో కేవలం తాశీల్దారుని చిత్తంపైనే, అతని చేతికింది ఉద్యోగుల చిత్తంపైనే పూర్తిగా ఆధారపడి ఉంటుంది; కాని ఎవరైనా ఫిర్యాదు చేసిన పక్షంలో దర్యాప్తు చేసి, ఖోగట్టా పంపవలసినదిగా ఆ ఫిర్యాదును సర్వసాధారణంగా తాశీల్దార్లకే పంపించడం కారణంగా, పై అధికార్లనుండి ఈ బాధలు పడ్డవారికి ఏమైనా పరిహారం కలుగుతుందేమో నేను చెప్పలేకుండా వున్నాను.”

దేశీయులు చేసిన ఫిర్యాదులలో ఒకటి ఈవిధంగా వుంది:

"కిందటేడు వర్షాభావంవల్ల మా పిషాణం పంట (ముఖ్యమైన ధాన్యపు, లేక వరి పంట) నాశనం అయిపోవడం కారణంగా, మామూలుగా మేము ఎల్లప్పుడూ చెల్లించివేస్తూన్న శిస్తు చెల్లించలేకపోయాం. జమాబందీ జరిగినప్పుడు, 1837లో ఈడెన్ దొరగారు మా కలెక్టరుగా ఉన్నప్పుడు మేము చేసుకున్న ఒప్పందం ప్రకారం, మాకు సంభవించిన పంటనష్టాలను దృష్టిలో పెట్టుకొని శిస్తు తగ్గించవలసిందని మేము కోరాం. కాని ఈ శిస్తు తగ్గింపు అంగీకరించకపోవడంవల్ల మేము మా పట్టాలు తీసుకో నిరాకరించాం. ఆటుతరువాత జూనునుండి ఆగస్టువరకూ తాశీల్దారు మాదగ్గరనుండి అత్యంత కఠినంగా శిస్తులు వసూలుచేయడం ఆరంభించాడు. నన్నూ మరికొందరినీ కొందరి అదుపాజ్ఞల్లో పెట్టాడు. వీరు మమ్మల్ని రోజూ ఎండలోకి తీసుకెళ్లి వంగోబెట్టి మా వీపులమీద బండలు పెట్టి, మండుతూన్న ఇసుకలో నిలబెట్టించేవారు. రాత్రి ఎనిమిది గంటలైన తరువాత కూడు తినడానికి మమ్మల్ని వదిలి పెట్టేవారు. అలాంటి దుర్వ్యవహారం మూడు నెలలపాటు సాగింది. ఈ మూడునెలలలోనూ మా అర్జీలు దాఖలుచేసుకోవడానికి అప్పుడప్పుడు కలెక్టరుగారి వద్దకు వెళ్లేవారం; కాని ఆయన మా అర్జీలు తీసుకో నిరాకరించాడు. మా అర్జీలను సెషన్సు కోర్టుకు తీసుకువెళ్లి అక్కడ దాఖలుచేసుకోగా, మా అర్జీలు కోర్టువారు కలెక్టరుగారికి పంపించేశారు. అయినప్పటికీ మాకు న్యాయం దొరకలేదు. సెప్టెంబరు నెలలో మామీద నోటీసులు జారీచేశారు; ఇరవయ్యైదురోజుల తదుపరి మా ఆస్తులు జప్తుచేసి, తరువాత వాటిని అమ్మేశారు. మేము ఇప్పుడు మనవిచేసినదానికి తోడు, మా ఆడంగులను కూడా క్రూరంగా హింసించారు; వారి స్తనాలకు 'కిట్టి' తగిలించారు."

కమీషనర్లు అడిగిన ప్రశ్నలకు ఒక దేశీయ క్రైస్తవుడు ప్రత్యుత్తరాలిస్తూ ఈవిధంగా చెప్పాడు:

"యూరపియన్ రెజిమెంటుగాని, దేశీయ రెజిమెంటుగాని గ్రామంగుండా వెళ్లిందంటే, రైతులందరి వద్దనుండి ఉచితంగా బలవంతాన తిండిసామగ్రిని తెప్పించుకునేవారు; రైతులలో ఎవరైనా సరుకులకు వెల ఇవ్వమని అడిగితే వారిని క్రూరమైన చిత్రహింసలకు గురిచేసేవారు."

దీనితరువాత ఒక బ్రాహ్మణుని దృష్టాంతం వుంది; కొలెరూన్ నదిపైన కడుతూన్న వంతెన నిమలకోసమని చెక్కపలకలు, బొగ్గు, వంటచెరకు వగైరా వస్తువులను ఉచితంగా

ఇవ్వమని తాశీల్దారు ఆ బ్రాహ్మణుని, అతడితో సహా అతడి గ్రామంలోని వారినీ, పొరుగు గ్రామాలవారినీ ఆదేశించాడు. ఆ బ్రాహ్మణుడు అందుకు నిరాకరించగా పన్నెండుగురు మనుష్యులు అతనిమీద పడి, అతన్ని నానావిధాలా హింసించారు. అతడిలా అంటాడు:

"అసిస్టెంటు కలెక్టరుగారైన మిస్టర్ కాడెల్‌కి ఫిర్యాదు దాఖలుచేసుకున్నాను, గాని ఆయన విచారణచేయడానికి నిరాకరించి, నా ఫిర్యాదు అర్జీని చించి వేశాడు. పేద వారు నష్టాన్ని భరించగా కొలెరూన్ సంతెనసనిని పాకగా పూర్తిచేసి ప్రభుత్వంవారి నుండి మెహర్బానీ సంపాదించడమే ఆయన ఉద్దేశ్యమైనందున, తాశీల్దారు ఎటు వంటి ఖాసీలు చేసినప్పటికీ, వాటిని గూర్చి ఈయన ఏమీ దఖలు పుచ్చుకోవ డంలేదు."

బలాత్కార ప్రయోగంలోనూ దౌర్జన్యంలో సహితమూ చిట్టచివరి హద్దులను అతి క్రమించుతూన్నట్టి చట్టవ్యతిరేక చర్యలపట్ల, ఉన్నతాధికారులు ఎట్టి వైఖరి అవలంబించి నదీ, 1855లో పంజాబ్‌లో లూధియానా జిల్లాకు కమీషనరుగా వున్న మిస్టర్ బ్రెరెటన్ ఉదాహరణవల్ల చక్కగా తెలుస్తూంది. ఈకింది సంగతులన్నీ రుజువైనట్టు పంజాబ్ చీఫ్ కమీషనరు* నివేదికవల్ల తెలుస్తూంది.

"డిప్యూటీ కమీషనర్ మిస్టర్ బ్రెరెటన్‌యొక్క సరాసరి అధికారంకింద వున్న వ్యవహారాలలోనూ, అతడి అజమాయిషీలో వున్న వ్యవహారాలలోనూ, ఎట్టి కారణమూ లేకుండానే భాగ్యవంతుల ఇళ్ళు సోదాచేయబడ్డాయి; సోదాచేయబడ్డ సమయాల్లో వారి ఇళ్ళనుండి స్వాధీనంచేసుకున్న ఆస్తిని వారికి ఇచ్చివేయకుండా చాలాకాలం అట్టేపెట్టుకోవడం జరిగింది; అనేకమంది వ్యక్తులను జైలులో నిర్బంధించి, వారిపైన మోపబడిన నేరాలు బహిరంగంగా తెలియజేయబడకుండానే కొన్ని వారాలు వారిని జైలులోనే ఉంచేశారు; చెడుప్రవర్తన కలిగిన వ్యక్తుల విష యంలో పూచీకత్తులు తీసుకొనేందుకు ఉద్దేశించబడిన చట్టాలు విచక్షణారహిత మైన కాఠిన్యంతో అందరిపైనా అమలుజరుపబడ్డాయి. డిప్యూటీ కమీషనరు జిల్లానుండి జిల్లాకు పర్యాటనకు వెళ్ళుతూన్నప్పుడు పోలీసు ఉద్యోగులూ, పోలీసువారికి భోగట్టాలను జేరవేసే వేగుల వాళ్ళూ అతనివెంటే ఉంటూండేవారు; ఈ అల్లరిపనులన్నిం టికీ వీరే కారకులు."

---

* జాన్ లారెన్స్. — సం.

ఈ విషయంపై లార్డ్ డల్‌హౌసీ తన నివేదికలో ఈవిధంగా రాశాడు:

"ఈ అధికారిపై చీఫ్ కమీషనరు అభియోగాలు మోపుతూ వివరించిన నిబంధనాతిక్రమణ, చట్టవ్యతిరేకచర్యల సుదీర్ఘమైన జాబితాలో ప్రతి అంశము గురించీ అభేద్యమైనట్టి – మిస్టర్ బ్రెరెటన్ సహితమూ నిరాకరించనటువంటి – విదర్శనం వుంది; బ్రిటిష్ పరిపాలన ప్రతినిధులలో ఒక భాగానికి అపఖ్యాతిని తెచ్చి పెట్టి, బ్రిటిష్ పాలితులలో అనేకులను ఎనలేని అన్యాయానికీ, అకారణమైన జైలు నిర్బంధానికీ, క్రూరమైన చిత్రహింసలకూ గురిచేసింది."

"ఈ విషయాన్ని ఒక బహిరంగ దృష్టాంతంగా చెయ్యాలని" లార్డ్ డల్‌హౌసీ ప్రతిపాదించి, తదనుసారం ఇలా అభిప్రాయపడుతున్నాడు:

"డిప్యూటీ కమీషనరు అధికారాలను నిర్వహించడానికి, ప్రస్తుతానికి మిస్టర్ బ్రెరెటన్ తగినవాడు కాడని, ఆ హోదానుండి తొలగించి మొదటితరగతి అసిస్టెంటు హోదాకు అతన్ని దింపివేయాలి."

మలబారు కోస్తానున్న కనరా తాలూకా ప్రజలు పంపిన మహజరును ఉదహరించి, అధికారయుతములైన "బ్లూ బుక్సు"లోనుండి ఉల్లేఖనలను ఇంతటితో మనం ముగించవచ్చు. ఇదివరలో తాము ప్రభుత్వానికి చాలాసార్లు అర్జీలు పెట్టుకున్నామనీ, అవన్నీ నిష్ఫలమే అయాయనీ విన్నవించుకుంటూ, తమ వెనుకటి స్థితికీ ఇప్పటి స్థితికీ గల వ్యత్యాసాన్ని ఈవిధంగా వారు తెలియజేశారు:

"వంజ పుంజ భూములనూ, వల్లవు భూములనూ, కొండభూములనూ, అడవులనూ సాగుచేసుకుంటూ, మాపై విధించబడిన తక్కువ శిస్తులు చెల్లించుకుంటూ 'రాణీ,' బహదూర్, టిప్పుగార్ల పరిపాలనకింద శాంతిసౌఖ్యాన్ని మేము అనుభవించి ఉండగా, తదుపరి ఆనాటి సర్కారు నౌకర్లు అదనపు శిస్తు విధించారు; కాని మేమీ అదనపు శిస్తు ఎన్నడూ చెల్లించలేదు. శిస్తు వసూలు చెయ్యడంలో మాపై ఎట్టి ఇబ్బంది బాధలనుగానీ, అత్యాచారాలనుగానీ, హింసలనుగానీ జరిపించలేదు. ఈ దేశం గౌరవనీయులైన కంపెనీవారికి* స్వాధీనం చేసిన తరువాత,

---

* ఈస్ట్ ఇండియా కంపెనీ. – సం.

మా వద్దనుండి డబ్బు పిండడానికి వారు అన్నిరకాల మాయోపాయాలనూ పన్ను తున్నారు. ఇట్టి వికృతమగు ఉద్దేశ్యం దృష్టిలో పెట్టుకుని కొత్త నిబంధనలు సృష్టించి, కొత్త చట్టాలు తయారుచేసి, వాటిని అమలు పరచవలసిందిగా తమ కలెక్టర్లకూ, సివిల్ జడ్జీలకూ తాఖీదులు పంపించారు. కాని అప్పట్లో వున్న కలెక్టర్లూ, వారి చేతికింద వుండిన దేశీయ ఉద్యోగులూ కొంతకాలంవరకూ మా కష్టనిష్ఠురా లను గమనించి మా కోర్కెలను అనుసరించి వ్యవహరించుతూ వచ్చారు. కాని ఇందుకు భిన్నంగా ఇప్పుడున్న కలెక్టర్లూ, వారి తాబేదార్లూ, ఏవిధంగానైనాసరే తమ ఉద్యోగాలలో వేతనాభివృద్ధి సంపాదించుకుందామనే ఉద్దేశ్యంతో, ప్రజల శ్రేయస్సునూ, ప్రయోజనాలనూ నిర్లక్ష్యం చేస్తూ, మా మొరలు పెడచెవిని బెట్టి మమ్మల్ని సర్వవిధాలా హింసలపాల్జేస్తున్నారు."

ఇండియాలో బ్రిటిష్ పరిపాలనయొక్క యథార్థ చరిత్రనుండి ఒక ప్రకరణం మాత్రమే కేవలం సంగ్రహంగానూ, ఎట్టి అతిశయోక్తులూ లేకుండానూ పైన పొందు పరచాం. ఇట్టి వాస్తవాంశాల దృష్ట్యా, తమ ప్రజలను ఇంతగా దురన్యాయాల పాల్జేసిన విదే శీయ విజేతలను దేశంనుండి పారదోలడానికై ఒక జాతి ప్రజ ప్రయత్నించడం సమర్థించ దగినదా కాదా అని నిష్పక్షపాతులైన విజ్ఞులందరూ బహుశా తప్పక ప్రశ్నించుతారు. ఇకపోతే ఇంగ్లీషువారే ఇట్టి దుష్కార్యాలను బుద్ధిపూర్వకంగా చేయగల్గగా, హిందూదేశీయులచే గావించబడినట్లు చెప్పబడుతూ, వారిపైన మోపబడుతూన్న నేరాలనూ క్రౌర్యాలనూ తిరుగుబాటు ఘర్షణల ఆగ్రహంలో హిందూదేశస్థులు చేసివుండడంలో ఆశ్చర్యపడాల్సిన దేముంది?

మార్క్స్‌చే 1857 ఆగస్టు 28న
రచించబడింది

"New-York Daily Tribune"
1857 సెప్టెంబరు 17వ తేదీన
5120వ సంచికలో
ఒక సంపాదకీయ వ్యాసంగా
ప్రచురించబడింది

# మార్క్స్

## *ఇండియాలో తిరుగుబాటు

"బాల్టిక్" స్టీమరు తీసుకొచ్చిన టపా ఇండియాలో కొత్త ఘటనలు జరిగినట్లు వార్తలను నివేదించనప్పటికీ, అత్యంతాసక్తిజనకమైన వివరాలను అందించింది, మా పాఠకులు తెలుసుకొనేందుకు వాటిని క్లుప్తంగా ఇక్కడ పొందుపరుస్తున్నాం. జూలై 15వరకూ కూడా ఇంగ్లీషువారు ఢిల్లీలోకి ప్రవేశించలేక ఇంకా పట్నం వెలుపలనే ఉన్నారన్న విషయం మనం మొట్టమొదట గమనించాలి. అదే సమయంలో ఇంగ్లీషువారి శిబిరంలో కలరాజాడ్యం కనబడిందనీ, భారీవర్షాలు ఆరంభమయాయనీ, ముట్టడి సేనలు ఇక ముట్టడికి స్వస్తిచెప్పి తిరోగమించడం ఈరోజు కాకపోతే రేపైనా జరిగితీరుతుందనీ తెలుస్తోంది. ఈ జాడ్యం జనరల్ సర్ హెచ్. బార్నార్డ్‌ను ఒక్కడిని మాత్రమే పొట్టబెట్టుకుని, అతను భుజించిన ఆహారంకంటె తక్కువరకం ఆహారం తింటూ, అతను చేసే పనులకంటె ప్రయాసకరమైన పనులను చేస్తున్న సామాన్యసైనికులను వదిలిపెట్టిందని, మనని నమ్మమని ఇంగ్లండు వార్తాపత్రికలు చెబుతున్నాయి. కాగా, ముట్టడిసైన్యపు శ్రేణులలో ఎందరిని ఈ జాడ్యం తుడిచిపెట్టేసిందో మనం తెలుసుకోవాలంటే, ప్రజలకు బహిరంగంగా తెలియజేస్తున్న విషయాలపైగాక, అంగీకృత వాస్తవాంశాలనుండే మనం గ్రహించాల్సి ఉంటుంది. ఢిల్లీ ఎదుట విడిసి వున్న శిబిరంలోని ఒక ఆఫీసరు జూలై 14న ఇలా రాస్తున్నాడు:

> "శత్రు ఉధృతగతిదాడులనుండి కేవలం రక్షించుకోవడం మినహా, ఢిల్లీని వశపర్చుకోడానికై మేమే చర్యలూ తీసుకోవడంలేదు. మా సైన్యంలో వున్న ఐదు యూరపియన్ రెజిమెంట్లు కొన్ని డిటాచ్‌మెంట్లు ఉన్నప్పటికీ, ఏమాత్రపు గట్టి ఎదురుదెబ్బ తీయడానికైనా మాకు 2,000 యూరపియన్ సైనికులు మాత్రం ఉన్నారు. జలంధర్, లూధియానా, సబాతూ, డగ్‌షెల్, కసౌలీ, అంబాలా, మీరట్, ఫిల్లవుర్‌ల రక్షణకోసం ప్రతి రెజిమెంటులోనూ పెద్దపెద్ద దళాలనే ఒక్కొక్క

నగరంలోనూ ఉంచివేయవలసి వచ్చింది. వాస్తవంగా ప్రతి రెజిమెంటునుండీ వచ్చి మాతో చేరినవల్లా చిన్నచిన్న దళాలే. ఫిరంగిబలంలో మాకంటె శత్రువులే ఎంతో మిన్న."

ఉత్తరాన వున్న ప్రధాన రాజమార్గం జలంధర్‌నుండి మీరట్‌వరకూ తిరుగుబాటు స్థితిలో ఉందని పంజాబ్‌నుండి వచ్చిచేరిన సైన్యాలు తెలుసుకున్నాయని, ఈ రెజిమెంట్లలోని సైనికుల సంఖ్య తగ్గిపోతూన్నప్పటికీ, ఈ రాజమార్గంలో వున్న ముఖ్యస్థానాల్లో కొన్ని దళాలను ఈ రెజిమెంట్లకు ఉంచేయక తప్పిందికాదని దీనివల్ల రుజువవుతూంది. పంజాబ్ నుండి వచ్చిన ఈ రెజిమెంట్లు వాటి పూర్తిబలాలతో వచ్చిచేరుతాయని మొదట ఆశించి నట్టుగాక, తక్కువ బలాలతో వచ్చిచేరడానికి ఇదే కారణమని తెలుస్తూన్నప్పటికీ, యూరపియన్ సైనికులు 2,000 మందికే తగ్గిపోవడానికి ఇదే కారణ మయివుంటుందని మాత్రం విశదంకావడంలేదు. లండన్ "Times" బొంబాయి విలేకరి జూలై 30న తన పత్రికకు రాస్తూ, ముట్టడిసైన్యంయొక్క ఉదాసీన వైఖరికి ఇదికాక మరొక కారణం ఉన్నట్లు చెప్ప ప్రయత్నిస్తున్నాడు. అతడీవిధంగా రాస్తున్నాడు:

"మన శిబిరానికి యధార్థంగానే అదనపు బలాలు – 8వ (రాజుగారి) రెజిమెంటు తాలూకు ఒక పక్షమూ, 61వ రెజిమెంటు తాలూకు ఒక పక్షమూ, పదాతి ఆర్టిలరీ కంపెనీ ఒకటీ, ఒక దేశీయ దళానికి చెందిన రెండు ఫిరంగులూ, (మందుగుండు సామగ్రిని తీసుకువస్తూన్న పెద్ద శ్రేణికి రక్షణ ఇస్తూ వెంట వచ్చిన) 14వ ఇర్రెగ్యులర్ అశ్విక రెజిమెంటూ, 2వ పంజాబ్ అశ్విక రెజిమెంటూ, 1వ పంజాబ్ పదాతిదళం, 4వ సిక్కు పదాతిదళం – వచ్చిచేరాయి; అయితే ఈవిధంగా ముట్టడిసైన్యంతో చేరిన దేశీయబలాలు యూరపియన్లు కూడా ఉన్న పటాలాల్లో సర్దబడినప్పటికీ, వీటన్నిటిపైనా ఒకేరకమయినట్టీ సంపూర్ణమయినట్టీ విశ్వాసాన్ని ఉంచడానికి ఎంతమాత్రమూ వీల్లేదు. పంజాబ్ బలగాలలోని అశ్విక రెజిమెంట్లలో అచ్చంగా హిందూస్థానానికీ, రోహిల్‌ఖండ్‌కీ చెందినట్టి మహమ్మదీయులూ అగ్రవర్ణాలకుచెందిన హిందువులూ అనేకులున్నారు. కాని బెంగాల్ ఇర్రెగ్యులర్ అశ్విక దళంలో ఇంచుమించు అందరూ వీరే. ఈ తరగతికి చెందిన సైనికులను నమ్మడానికి ఎంతమాత్రమూ వీల్లేదు; వీరు ఇంత హెచ్చుసంఖ్యలో ఇక్కడుండడం గొప్ప ఇబ్బందికి కారణం కాకమానదు – చివరకు అలాగే తేలింది కూడా. 2వ పంజాబ్ అశ్విక రెజిమెంటులో 70 మంది హిందూస్థానీయులను నిరాయుధులను చేయవలసి, పెద్దహోదాలో వున్న దేశీయ ఆఫీసరుతోసహా మరి ఇద్దరిని

ఉరితీయవలసివచ్చింది. కొంతకాలంగా పటాలాలతో కలిసే ఉంటూన్న 9వ ఇర్రెగ్యులర్లలో చాలామంది అశ్వసైనికులు పరారయారు; ఇక 4వ ఇర్రెగ్యులర్ రెజిమెంటు సైనికులను గస్తీమీద పంపించగా, డ్యూటీలో వున్న తమ అజుటెంట్‌నే వారు హత్యచేశారని నాకు భోగట్టా అందింది."

పై కథనంలో ఇంకొక సంగతి బయటపడుతూంది. ఢిల్లీ ఎదుట విడిసివున్న శిబిరానికీ అగ్రాముంటె శిబిరానికీ[50] కొంతవరకూ పోలిక వున్నట్టు కనబడుతూంది. పోతే తమకెదురుగా వున్న శత్రువుతోనే కాకుండా, తమ శ్రేణులలో వున్న మిత్రులతో కూడా ఇంగ్లీషు వారికి పోరాడవలసివస్తూంది. ఈ విషయాన్ని లెక్కలోకి తీసుకున్నప్పటికీ, ఎదురుదెబ్బలను తీసేందుకై కేవలం ఇంతకొద్ది సంఖ్యలో 2,000 మంది యూరపియన్లు మాత్రమే ఎందుకున్నారు అనే ప్రశ్నకు ఇది తగిన సమాధానం కాజాలదు. బార్నార్డ్ తరువాత ఆ స్థానంలో ఇప్పుడున్న జనరల్ రీడ్‌కింద సమీకరించబడిన బలాలను, ఇక మూడవ రచయిత, "Daily News"[51] బొంబాయి విలేకరి, సేనలవారీగా పేర్కొంటున్నాడు; ప్రతి సేనలోనూ వున్న వివిధ అంగబలాలను వివరించుతూ ఇతడు లెక్కచెబుతూండడంవల్ల ఇతడిస్తూన్న జాబితా నమ్మదగినదిగానే కనబడుతూంది. ఇతడి కథనాన్నిబట్టి, సుమారు 1,200 యూరపియన్లూ, 1,600 సిక్కులూ, ఇర్రెగ్యులర్ అశ్విక దళమూ వగైరాలంతా కలిపి మొత్తం సుమారు 3,000 మంది అని చెప్పవచ్చు; వీరందరూ బ్రిగేడియర్-జనరల్ చాంబర్లైన్ నాయకత్వాన పంజాబ్‌నుండి బయలుదేరి జూన్ 23, జులై 3 తేదీల మధ్య ఢిల్లీ ఎదుటనున్న శిబిరానికి చేరుకున్నారు మరొక వైపున, ఆర్టిలరీ, ముట్టడి ఫిరంగుల శ్రేణీ అంతా కలిపి 7,000 సైనికబలం జనరల్ రీడ్ చేతికింద సమీకరించబడి ఉన్నట్టు ఇతడు అంచనా కడుతున్నాడు; దీన్నిబట్టి పంజాబ్‌నుండి అదనపుబలాలు వచ్చి చేరకముందు ఢిల్లీదగ్గర ఉన్న సైన్యంలో 4,000 కంటె అధికం ఉండివుండదన్నమాట. 7,000 బ్రిటిష్‌వారితోనూ, 5,000 దేశీయులతోనూ కూడిన సైన్యాన్ని తన చేతికింద సర్ హెచ్. బార్నార్డ్ పోగుచేసినట్టు ఆగస్టు 13వ తేదీ లండన్ "Times" చెబుతూంది. ఇది కేవలం అతిశయోక్తి అయినప్పటికీ, అప్పటి యూరపియన్ సేనల బలం 4,000 అని, ఇంతకు కాస్త తక్కువగా వున్న దేశీయ సైనికబలం సహాయంగా ఉందని నమ్మడానికి మనకి తగిన కారణం వుంది. జనరల్ రీడ్ నాయకత్వాన ఇప్పుడు ఎంత సైన్యమైతే పోగుచేయబడిందో అప్పట్లో జనరల్ బార్నార్డ్ నాయకత్వాన కూడా ఇంతకు సమాన సంఖ్యలో వున్న సైన్యమూ ఉందనే దీనివల్ల మనకి తెలుస్తూంది. కాబట్టి, కొంతవరకూ తిరుగుబాటుదార్లు విధివిరామంలేకుండా సాగించుతూన్న ఉధృతగతిదాడుల ఫలితంగానూ, కొంతవరకూ కలరా జాడ్యం సోకిన ఫలితంగానూ కలిగిన అరుగుదల తరుగుదల వల్లనూ, అసలు

ముట్టడిసైన్యాన్ని నగావికినగంగా తగ్గించివేసిన నష్టాలను — ఇంతా అంతా కాదు, అపార నష్టాలను — భర్తీచేయడానికి మాత్రమే పంజాబ్‌నుండి వచ్చిన అదనపుసైన్యం సరిపడింది. "కాస్త ఏమాత్రపు గట్టి ఎదురుదెబ్బ తీయడానికైనా" కేవలం 2,000 మంది యూరపియన్ల కంటె హెచ్చుమందిని ఎందుకు బ్రిటిష్‌వారు జమ చెయ్యలేకుండా వున్నారో ఇప్పుడు మనకి బోధపడుతూంది.

ఢిల్లీ ఎదుటనున్న బ్రిటిష్ సైనికబలాల సంఖ్యను గూర్చి ఈ మాత్రం చాలు. ఇక వీటి యుద్ధచర్యలను పరిశీలించుదాం. ఢిల్లీకి ఎదురుగా వున్న కొండగుట్టలను ఆక్రమించి నట్టు జూన్ 8వ జనరల్ బార్‌నార్డ్ పంపిన నివేదిక తరువాత, దరిమిలా మరొక సమాచార పత్రం ఏదీ కూడా సైనిక హెడ్‌క్వార్టర్స్‌నుంచి వెలువడకపోవడాన్నిబట్టి ఈ యుద్ధ చర్యలేవీ అంత ప్రతిభావంతములైనవి కావని మనం ఊహించుకోవచ్చు. ముట్టడిలోవున్నవారు జరిపిన ఉధృతగతిదాడులను ముట్టడించినవారు తిప్పికొట్టడమునకే ఈ యుద్ధచర్యలన్నీ, కేవలం ఒక్కటి మినహా, పరిమితమయాయి. ఒక్కొక్కప్పుడు ముఖాముఖీని, ఒక్కొక్కప్పుడు పార్శ్వాలపైనా, అందులోనూ అతితరుచుగా వెనుకతట్టు కుడి పార్శ్వంపైనా ముట్టడిదార్లు అటకాయించబడ్డారు. ఈ ఉధృతగతిదాడులు జూన్ 27, 30 తేదీలలోనూ, జూలై 3, 4, 9, 14 తేదీలలోనూ జరిగాయి. జూన్ 27వ జరిగిన పోరాటం ఇరుపక్షాల పురోగామిచౌకీల స్వల్పసంఘర్షణలకే పరిమితమై కొద్దిగంటలసేపు మాత్రమే జరిగింది; కాని వర్షరుతువు మొట్టమొదటి వాన భారీగా కురిసిన కారణంగా మధ్యాహ్నానికి పోరాటం ఆగిపోయింది. జూన్ 30వ, ముట్టడి సైన్యాలు తమ కుడివైపున నిర్మించుకున్న అడ్డగోడల ఆవరణలోకి తిరుగుబాటుదార్లు బలమైన దళంతో వచ్చి, గస్తీదళాలనూ వాటి సహాయదళాలనూ చికాకు పరచారు. జూలై 3వ తెల్లవారకముందే ముట్టడిలో వున్నవారు ఇంగ్లీషువారి స్థావరంయొక్క వెనుకతట్టు కుడి పార్శ్వంపైన కపటదాడి ప్రారంభించి, తరువాత వెనుకతట్టుదిశనే కర్నాల్ రోడ్డుమీదుగా ఆలీపూర్‌వరకూ ఇంగ్లీషువారి శిబిరానికి సైనికదళ రక్షణలో సామగ్రినీ, ఖజానానీ తీసుకొనిపస్తూన్న బళ్ల శ్రేణిని అడ్డం కొట్టడానికిగాను పురోగమించారు. దారిలో 2వ పంజాబ్ ఇర్రెగ్యులర్ అశ్వికపటాలంయొక్క చౌకీదళం ఒకటి వారికి ఎదురుపడగా, ఈ అశ్వికదళం వెంటనే తిరోగమించింది. తిరుగుబాటుదార్లు 4వ తేదీన ఢిల్లీని తిరిగి చేరుకోబోతూండగా, వారిని అడ్డంకొట్టడానికై ఇంగ్లీషు శిబిరంనుండి పంపబడిన 1,000 పదాతిసైన్యంతోనూ, రెండు అశ్వికదళపు స్క్వాడ్రన్లతోనూ వారు తలపడ్డారు. అయి నప్పటికీ తిరుగుబాటుదార్లు ఎలాగో తప్పించుకుని ఇంచుమించు తమకెట్టి నష్టమూ కలగకుండానే తమ ఫిరంగులన్నిటితోనూ తిరోగమించగల్గారు. జూలై 8వ, ఢిల్లీనుండి సుమారు 6 మైళ్లదూరంలో బస్సీ గ్రామం సమీపంలో వున్న కాలువ వంతెనను నాశనం చేయడానికి బ్రిటిష్ శిబిరంనుండి ఒక దళాన్ని పంపించారు; ఇదివరలో తిరుగుబాటుదార్లు

బ్రిటిష్ శిబిరం వెనుకతట్టు చివరికొనపై జరిపిన ఉధృతగతిదాడులకు ఈ వంతెన అనుకూలంగా వుండి, బ్రిటిష్ శిబిరానికి కర్నాల్ మీరట్‌లతోవున్న రవాణామార్గాలను దెబ్బతియ్యడానికి అనువుగా ఉండేది. బ్రిటిష్ సేనలు ఈ వంతెన నాశనంచేశాయి. జూలై 9న తిరుగుబాటుదార్లు బలమైన సేనలతో మళ్లీ మరొక సారి బ్రిటిష్ స్థానం వెనుకతట్టు కుడి పార్శ్వంపై దాడి చేశారు. ఈ చర్యలో తిరుగుబాటుదార్లకు కలిగిన నష్టాలను అంచనాకట్టుతూ, సుమారు వెయ్యిమంది హతులైనట్టుగా ఆ రోజునే లాహోర్‌కు టెలిగ్రాఫుద్వారా అధికారయుతమైన కథనాలు పంపారు; కాని శిబిరంనుండి జూలై 13న రాసిన ఒక జాబులో:

> "మన సైనికులు రెండువందలయాభై వరకూ శత్రు శవాలను పూడ్చిపెట్టడమో దహనమో చేశారు; చాలా శవాలను శత్రువులే నగరంలోకి తీసుకుపోగలిగారు" అని ఉండడంవల్ల పై కథనం కేవలం అతిశయోక్తిగానే కనబడుతూంది.

"Daily News"లో ప్రచురించబడిన అదే ఉత్తరం బ్రిటిష్‌వారు సిపాయిలను తరిమికొట్టారని చెప్పడంలేదు సరికదా, తద్భిన్నంగా "మన కర్తవ్యనిర్వహణ దళాలనన్నింటినీ సిపాయిలు తిప్పికొట్టి వెనక్కి నెట్టివేశారనీ, తరువాత వారు వెనక్కి మళ్లిపోయారనీ" చెబుతూంది. ముట్టడిదార్లలో రెండువందల పన్నెండుగురు హతమవడమో, క్షతగాత్రులవడమో సంభవించడంవల్ల, వారికి తీవ్రనష్టమే కలిగింది. జూలై 14న జరిగిన మరొక ఉధృతగతిదాడి ఫలితంగా, మరొక భయంకర హోరాహోరీ యుద్ధం జరిగింది; దీని వివరాలు మనకింత వరకూ అందలేదు.

ఈలోపున ముట్టడిలో వున్నవారికి బలమైన అదనపు బలాలు అందాయి. జూలై 1న నాలుగు ఇన్‌ఫెంట్రీ రెజిమెంట్లూ, ఒక ఇర్రెగ్యులర్ అశ్విక రెజిమెంటూ, ఒక ఆర్టిలరీ రెజిమెంటూ ఢిల్లీకి వచ్చాయి. బరేలీ, మురాదాబాద్, షాజహాన్‌పూర్‌లనుండి వచ్చిన ఈ రోహిల్‌ఖండ్ తిరుగుబాటుదార్లు యుక్తిగా ఢిల్లీ చేరుకుని అక్కడున్న తమ సహచరులను కలుసుకున్నారు.

> "గంగానదిని దాటడానికి వీరికి వీలుపడదనే ఇక్కడ ఆశపడ్డారు; గాని అనుకున్నట్టూ నది పొంగనందున గుర్ముక్తేశ్వర్ దగ్గర నదిని దాటడానికి వీరికి వీలై దోఆబ్ దాటి ఢిల్లీ చేరుకోగల్గారు. సైనికులూ, ఫిరంగులూ, గుర్రాలూ బరువులను మోసే అన్నిరకాల జంతువులూ (రమారమీ 50,000 పౌన్ల విలువగల ఖజానాను తిరుగుబాటుదార్లు తమతో కూడా తెస్తూండడంచేత బరువులు మోసే జంతువులు అవసరమయాయి), వరుసలు వరుసలుగా ఎడతెరిపిలేకుండా పడవల వంతెనమీద

మండి తిరుగుబాటుదార్లు నదిని దాటుతూవుంటే, వారిని అడ్డగించడానికిగాని, చికాకుపరచడానికిగాని ఎట్టి అవకాశమూలేకుండా వూరకే చూస్తూ కూచోవడమంటే మన సైన్యానికి ఎంతో తలవంపులనిపించింది"

అని లండన్ "Times" బొంబాయి విలేకరి రాశాడు.

రోహిల్‌ఖండ్ ఈవలినుండి ఆవలికి తిరుగుబాటుదార్లు జయప్రదంగా తరలిరాగల్గారంటే యమునానదికి తూర్పునుండి రోహిల్‌ఖండ్ కొండలవరకూ వున్న యావత్తు ప్రదేశమూ ఇంగ్లీషు సేనలకు దేవిడీమన్నా అనీ, నీమచ్‌నుండి ఆగ్రావరకూ తిరుగుబాటుదార్లు నిరాఘాటంగా తిరుగగల్గారంటే, ఇందూర్‌లోనూ మహౌలోనూ జరిగిన తిరుగుబాటులతో నీటిని కలిపి చూసినప్పుడు యమునానదికి నైరుతినుండి వింధ్యపర్వతాలవరకూ వున్న యావత్తు ప్రదేశమూ కూడా అంతేనని ధ్రువపడుతూంది. ఢిల్లీ విషయంలో ఇంగ్లీషువారు జయప్రదంగా నెరవేర్చగల్గిన యుద్ధచర్యల్లా — నిజానికి ఏకైకయుద్ధచర్యల్లా — ఆ నగరానికి ఉత్తరాన, పశ్చిమోత్తరాన వున్న ప్రదేశంలో జనరల్ వాన్ కోర్ట్‌లాండ్ పంజాబు సిక్కు బలాలు శాంతిని స్థాపించడమే. లూధియానానుండి సిర్సావరకూ వున్న జిల్లా అంతటా, ఇసుక ఎడారిలో చెదురుచెదురుగావున్న గ్రామాలలో నివసిస్తూన్న బందిపోటుదొంగల తెగలను అతడు ముఖ్యంగా ఎదుర్కొనవలసి వచ్చింది. జూలై 11న అతడు సిర్సానుండి ఫతేహాబాద్‌కు బయలుదేరి ఉండాలనీ, అక్కడనుండి హిస్సార్‌కు తరలివస్తాడనీ ఇందువల్ల ముట్టడిసైన్యాలకు వెనకనున్న ప్రదేశమంతా శత్రురహితమై ఇక భద్రంగా వుంటుందనీ చెప్పబడుతోంది.

దేశీయులకూ ఆంగ్లేయులకీ మధ్య జరిగే పోరాటంలో ఢిల్లీ ఒక్కటే కాకుండా పశ్చిమోత్తర రాష్ట్రాలలో మరి మూడు పట్టణాలు — ఆగ్రా, కాన్పూర్, లక్నో — కూడా పోరాట కేంద్రాలుగా పరిణమించాయి. ఆగ్రా యుద్ధ చర్యకు ఒక విశిష్ట లక్షణముంది. అదేమిటంటే, 300 మైళ్ల దూరంలో వున్న ఇంగ్లీషు సైనికస్థావంపై దాడిచేద్దామనే లక్ష్యంతో దండయాత్ర సైన్యాన్ని బందోబస్తు చేసుకొని బయలుదేరడం తిరుగుబాటుదార్లకిదే మొదటి సారి. నసీరాబాద్, నీమచ్ నగరాలలో వున్న సుమారు 10,000 సిపాయిలుగల (7,000 పదాతిసైనికులూ, 1,500 అశ్వికులూ, 8 ఫిరంగులూ ఉండవచ్చునుకొండి) దేశీయ పటాలాలు జూన్ చివరిరోజుల్లో ఆగ్రాను సమీపించి, జూలై మొదటిరోజుల్లో ఆగ్రాకు సుమారు 20 మైళ్లలో వున్న ముస్సియా గ్రామానికి వెనుకనున్న మైదానంలో దండువిడిశాయనీ, జూలై 4న ఆగ్రామీద దాడిజరపడానికి సన్నద్ధులవుతూన్నట్టు అవుపడుతూందనీ ఆగ్రాలో వెలువడుతూన్న "Mofussilite"[52] వార్తాపత్రిక కథనం. ఆగ్రాకి ఈ ఖబురు అందగానే, ఆగ్రా ఎదుటవున్న కంటోన్మెంటులో నివసించుతూన్న యూరపియన్‌లు అందరూ తలదాచుకోడానికని కోటలోకి పారిపోయారు. శత్రువుతో ముందుగా

తలపడడానికై ఆగ్రగామిదళంగా వుండేందుకోసమని పదాతిబలమూ, అశ్వసైనికులూ, శతఘ్నులూ కలిగిన కోటా పటాలాన్ని ఆగ్రా సేనాధిపతి* ముందుగా పంపాడు; కాని వీరు తమ గమ్యాన్ని చేరుకున్న ఉత్తరక్షణంలో ఒక్కమనిషైనా మిగలకుండా యావన్మందీ పరారై తిరుగుబాటుదార్లతో మిలాఖత్తు అయిపోయారు. జూలై 5న, తిరుగుబాటుదార్లపై దాడి చేయడానికి 3వ బెంగాల్ యూరపియన్ రెజిమెంటూ, ఒక శతఘ్ని విభాగమూ ఒక యూరపియన్ వాలంటీరు దళమూ, వీటన్నిటితోనూ ఆగ్రాకోటలో రక్షణార్థమై వున్న సైన్యం బయలు వెడలింది; వీరు తిరుగుబాటుదార్లను గ్రామంలోనుండి వెళ్లగొట్టి, గ్రామం వెనుక తట్టు నున్న మైదానంలోకి తరిమేశారటగాని, తిరుగుబాటుదార్లే మళ్లీ వీరిపైబడి వీరిని మర్దించి తిరోముఖం పట్టించారనీ, మొత్తం 500 మందితో కోటనుండి దండువెడలిన సైన్యంలో 49 మంది హతులై, 92 మంది క్షతగాత్రులైన తరువాత, వీరు పలాయితులైనారనీ, శత్రుసైన్యపు అశ్వికదళం వీరిని అతిభయంకరంగా తరుముకొనివచ్చి చికాకు పరచిందనీ, ''శత్రువుపైన ఒక్క గుండైనా పేల్చడానికి'' వీరికి అవకాశం చిక్కలేదనీ “Mofussilite” పత్రిక అంది. ఇదే వేరే మాటల్లో చెప్పాలంటే, సిపాయిలు ఆగ్రామీద పడి, కంటోన్మెంటులో వున్న ఇళ్లనన్నింటినీ పరశురామప్రీతి గావించుతూంటే, ఇంగ్లీషువారు కేవలం కాళ్లకు బుద్ధిచెప్పి, కోటలోకి దూరిపోయి కోటతలుపులు బిడాయించేసుక్కూచున్నారన్నమాట. మరుచటి దినం, జూలై 6న సిపాయిపటాలాలు ఢిల్లీదిశగా పురోగమించుతూ భరత్‌పూర్ చేరుకున్నాయి. ఆగ్రాకీ ఢిల్లీకీ మధ్యనున్న రవాణామార్గానికి అంతరాయం కలిగించడమూ, మొగలుల పురాతన రాజధానీనగరం ఎదుట వీరు ప్రత్యక్షమయే సంభవమూ ఈ చర్యయొక్క ముఖ్య ఫలితం.

కాన్పూర్‌లో జనరల్ వీలర్ నాయకత్వాన సుమారు 200 యూరపియన్లూ, వారితో కూడా వున్న 32వ పదాతి రెజిమెంటు వారి భార్యలూ పిల్లలూ ఒక దుర్గంలో నిర్బంధించబడ్డారనీ, బిఠూర్ రాజైన నానా సాహెబ్ నాయకత్వాన అత్యధికసంఖ్యలో వున్న తిరుగుబాటుదార్లు వీరిని చుట్టుముట్టారనీ, కిందటి టపాలో అందిన వార్తలవల్లే తెలిసింది. జూన్ 17నా, 24–28 తేదీలమధ్యనూ ఈ కోటపై అనేక దాడులు జరిగాయి; చివర పేర్కొన్న దాడిలో జనరల్ వీలర్ కాలులో గుండు దూసుకుపోయి, ఆ గాయానికి అతడు చనిపోయాడు. దుర్గంలో ఉన్నవారందరూ దుర్గాన్నివదలి, పడవలమీద గంగానది దిగువగానున్న అలహాబాదుకు వెళ్లిపోవాలనే షరతును వారు అంగీకరించిన పక్షంలో వారు తనకి లొంగిపోవచ్చునని అభయమిస్తూ నానా సాహెబ్ వారికి జూన్ 28న తెలియపర్చాడు. ఈ షరతుకు ఇంగ్లీషువాళ్లు అంగీకరించి, పడవలలో ఎక్కగా, పడవలు నదిమధ్యకు వచ్చాయో

* జాన్ కాలిన్. — సం.

ఇంకా లేవేలేదో, గంగ కుడిఒడ్డునున్న ఫిరంగులు పడవలమీద గుండ్లవర్షం కురిపించాయి. పడవలలో వున్నవారు కొందరు అవతలి ఒడ్డుకు చేరుకొని, తప్పించుకోడానికి ప్రయత్నించగా, అక్కడున్న అశ్వికదళం వారిని నరికి పారేసింది. స్త్రీలను, పిల్లలను ఖైదీలుగా పట్టుకున్నారు. తమను విముక్తి చేయడానికై తక్షణమే బలాలను పంపించవలసిందని కోరుతూ ఇంతకు ముందే అనేకసార్లు కాన్పూరునుండి అలహాబాదుకు వార్తాహరులను పంపించారు. ఈ కోర్కెలకు ప్రత్యుత్తరంగా, మేజర్ రెనాడ్ నాయకత్వాన మద్రాసు ఫ్యుసిలియర్లనూ, సిక్కులనూ కల్గిన ఒక దళం జూలై 1వ తేదీన కాన్పూర్‌కు బయలుదేరింది. ఫతేపూర్ ఇంకా నాల్గుమైళ్ల దూరంలో ఉందనగా 84వ, 64వ రెజిమెంట్లకూ, 13వ ఇర్రెగ్యులర్ అశ్విక రెజిమెంటుకూ సంబంధించిన 1,300 యూరపియన్ సైనికులనూ, అయోధ్య ఇర్రెగ్యులర్ రెజిమెంటులో ఇంకా మిగిలినవారినీ వెంటబెట్టుకుని అలహాబాద్‌నుండి బయలుదేరి, జూలై 3వ బెనారెస్ చేరుకుని, మేజర్ రెనాడ్‌తో కలుసుకోడానికై బెనారెస్‌నుండి విశ్రాంతి ఎరగకుండా అతిత్వరితగతిని వచ్చిన బ్రిగేడియర్-జనరల్ హావ్‌లక్‌ను జూలై 13 తెల్లవారున ఈ దళం కలుసుకుంది. ఏ రోజైతే ఇతను రెనాడ్‌ను కలుసుకున్నాడో ఆ రోజే ఫతేపూర్‌కు ఎదురుగా నానా సాహెబ్ నాయకత్వాన వున్న దేశీయసైనిక బలాలతో తలపడక ఇతనికి తప్పిందికాదు. అతి భయంకరమైన ముఖాముఖీ యుద్ధం జరిగిన తరువాత, జనరల్ హావ్‌లక్ తన శత్రుసైన్యపు పార్శ్వంమీదపడి యుద్ధం చేసి శత్రువును ఫతేపూర్‌నుండి పారదోలి కాన్పూర్‌ముఖంగా తిరోగమించేటట్టు చేయగల్గాడు; ఇక్కడ జూలై 15వ, 16వ అతను శత్రుసైన్యంతో తిరిగి తలపడవల్సి వచ్చింది. చివర పేర్కొన్న యుద్ధంలో ఇంగ్లీషు వారు కాన్పూరును తిరిగి పట్టుకోగల్గారు; తత్ఫలితంగా కాన్పూర్‌కు పన్నెండుమైళ్లలో గంగాతీరాన వున్నట్టీ, బలమైన దుర్గంచే రక్షించబడుతూందని చెప్పబడుతూన్నట్టీ బిథూర్‌కి నానా సాహెబ్ తిరోగమించవలసివచ్చింది. ఫతేపూర్‌మీదకి దండయాత్ర నడిపించడానికి ముందు, ఖైదీలుగా చేయబడిన ఇంగ్లీషు స్త్రీలనూ పిల్లలనూ అందరినీ నానా సాహెబ్ చంపించేశాడు. గంగానదీ జలమార్గం ఈవిధంగా తమ వశమవడం ఫలితంగా కాన్పూర్ పునరాక్రమణ ఇంగ్లీషువారికి అత్యంత ప్రాముఖ్యమైన ఘటనగా పరిణమించింది.

తమ సహచరులకు కాన్పూర్ ఎట్టి మృత్యుసదృశమైన దుస్థితిలో — కోటలో నిర్బంధించబడి, అత్యధికసంఖ్యాకులైన శత్రువులచే ముట్టడించబడి, భోజనసామగ్రి కొరవడి, తమ నాయకుని కోల్పోయిన దుస్థితిలో — చిక్కుకున్నారో, అయోధ్య రాజధానీనగరమైన లక్నోలో కూడా సరిగ్గా అట్టి విషమపరిస్థితిలోనే ఇంగ్లీషువారు చిక్కుకున్నారు. వారి నాయకుడు, సర్ హెచ్. లారెన్స్‌కి జూలై 2వ శత్రువులు జరిపిన ఒక ఉధృతగతిదాడిలో కాలికి తగిలిన గాయం ఫలితంగా ధనుర్వాతంవచ్చి జూలై 4వ చనిపోయాడు. జూలై 18 నాటికీ, 19 నాటికీ కూడా లక్నో ఇంకా ప్రతిఘటన సలుపుతూనే వుంది. లక్నో విముక్తి

చేయబడుతుందనే ఆశలన్నీ కాన్పూర్‌నుండి జనరల్ హావ్‌లక్ తన బలాలతో సత్వరంగా పురోగమించి అక్కడకు చేరుకోవడంపైన ఆధారపడి ఉన్నాయి. తన వెనుకతట్టున నానా సాహెబ్ పొంచివుండగా అతను ఈ సాహసచర్యకు పూనుకుంటాడా అనేదే ప్రశ్న, ఏమాత్రం జాప్యంచేసినా అది లక్నోకు ప్రాణాంతకంగానే పరిణమించుతుంది; ఏమంటే వర్షాలొకసారి ఆరంభించాయంటే ఇక యుద్ధ చర్యలన్నీ దుస్సాధ్యమే అవుతాయి.

ఈ ఉదంతాలనన్నింటినీ పరిశీలించడం ఫలితంగా, బెంగాల్ రాష్ట్ర పశ్చిమోత్తర ప్రాంతాల్లో వున్న బ్రిటిష్ సైన్యాలు విప్లవసముద్రం నడిమధ్య అక్కడక్కడ ద్వీపాల మాదిరి చెదిరివున్న కొండల స్థితిలోకి క్రమేణా దిగజారిపోతున్నాయన్న పర్యవసానానికి రాక మనకి తప్పడంలేదు. దక్షిణబెంగాల్‌లో ఒక్క మీర్జాపూర్, దీనాపూర్, పాట్నాలలో మాత్రం కేవలమూ ఒకదానితో ఒకటి సంబంధంలేని స్థానికమైన అవిధేయతా చర్యలూ, పవిత్రమైన బెనారెస్ పట్టణాన్ని వశపర్చుకోడానికై ఆ పట్టణ సమీపంలో తిరుగుతూవున్న కొందరు బ్రాహ్మణులు లేవదీసిన నిరర్థక ప్రయత్నాలూ మాత్రమే జరిగాయి. పంజాబ్‌లో కేవలం బలప్రయోగంవల్లనే తిరుగుబాటు భావాన్ని అణగదొక్కేశారు; సియాల్‌కోట్, జీలమ్‌లలో పితూరీలూ పెషావర్‌లో ఒక అధికారధిక్కరణ ప్రయత్నమూ మొగ్గలోనే జయప్రదంగా తుంచివేయబడ్డాయి. గుజరాత్‌లోనూ పండర్‌పూర్‌లోనూ సతారాలోనూ, నాగపూర్‌లోనూ, నాగపూర్ ప్రాంతంలో వున్న సాగర్‌లోనూ, నైజామ్ ప్రాంతంలో హైదరాబాదులోనూ, చివరకి అట్టడుగున దక్షిణాదినున్న మైసూర్‌లోనూ ప్రజలలో తిరుగుబాటు ప్రయత్నాలు ఇదివరకే జరిగి వుండడంచేత, బొంబాయి మద్రాసు రాష్ట్రాలలో పైకి అంతా ప్రశాంతంగా ఉన్నట్లు కనబడుతూన్నప్పటికీ ఇది పూర్తిగా స్థిరమని మాత్రం నమ్మడానికి వీల్లేదు.

మార్క్స్‌చే 1857 సెప్టెంబరు 1న
రచించబడింది

"New-York Daily Tribune"
1857 సెప్టెంబరు 15వ తేదీన
5118వ సంచికలో
ఒక సంపాదకీయ వ్యాసంగా
ప్రచురించబడింది

# మార్క్స్

## *ఇండియాలో ? బ్రిటిష్ రాబడులు

ఆసియాలో నేటి పరిస్థితులను గమనించుతూంటే బ్రిటిష్‌వారు ఇండియాలో తమ రాజ్యం స్థాపించడంవల్ల బ్రిటిష్ జాతికీ, బ్రిటిష్ ప్రజలకీ కలుగుతున్న యథార్థమైన లాభం ఏమిటి? — అనే ప్రశ్న తప్పకుండా తట్టుతుంది. సరాసరి కప్పం రూపంలో, అనగా ఇండియానుండి వచ్చిన ఆదాయంనుండి ఇండియావల్ల తగిలిన ఖర్చులను తీసివేయగా మిగిలే ఆదాయం రూపంలో బ్రిటిష్ ప్రభుత్వపు ఖజానాకు ఏమీ కూడా ముట్టడంలేదు. అందుకు భిన్నంగా బ్రిటిష్ ఖజానానుండే ఖర్చుల నిమిత్తం ఏటా పెద్దమొత్తం వ్యయమవుతూంది. ఈస్ట్ ఇండియా కంపెనీ దిగ్విజయయాత్రను మొదలుపెట్టిన ఉత్తరక్షణంనుండి — ఇప్పటికి సరిగ్గా దాదాపు ఒక శతాబ్దినుండి — వారి ఆర్థిక పరిస్థితులు చాలా చిక్కుల్లో పడిపోయాయి; తత్ఫలితంగా దిగ్విజయం గావించి సంపాదించిన భూభాగాలు నిలబెట్టుకొనేందుకు సైనికసహాయంకోసమే కాకుండా, దివాలాతీయకుండా తమ్ము రక్షించేందుకై ధనసహాయం కోసం కూడా పదేపదే పార్లమెంటును అర్థించితేనేగాని దానికి గత్యంతరం లేకపోయింది. ఈవిధంగా పరిస్థితి రానురాను విషమించుతూ వచ్చి, సైన్యాలను భారీస్థాయిలో పంపుతేనేగాని వీల్లేదని బ్రిటిష్ జాతిని కోరడమూ, అందుకు కావలసివచ్చే డబ్బుకోసం కూడా రేపో మాపో విప్పందేహంగా అడిగితీరడమూ, ఈ స్థితికి దిగజారింది ఈనాటికి. దిగ్విజయాలు సాధించేందుకైతేనేమి, పరిపాలనా సంస్థలు నిర్మించేందుకైతేనేమి ఈస్ట్ ఇండియా కంపెనీ 5 కోట్ల సీమలవరకూ రుణాలు చేయగా, నేటికి అనేక సంవత్సరాలుగా ఇండియాలో కంపెనీకున్న దేశీయ సైన్యాలమా, యూరపియన్ సైన్యాలమా నిలువుజీతమిచ్చి పోషించడమే కాకుండా, ముప్పైవేల స్థాయీ సైన్యాన్ని ఆ దేశంలో ఉంచి, పోషించి, వాటికి రామాపోనూ అయే రవాణా ఖర్చుల సహితమూ బ్రిటిష్ ప్రభుత్వమే భరించవలసి వస్తూంది. సంగతి సందర్భాలు ఈవిధంగా ఉంటూవున్నప్పుడు ఇండియా సామ్రాజ్యంవల్ల గ్రేట్ బ్రిటన్‌కు

కలిగే ఉపయోగం విడిగా బ్రిటిష్ పౌరులకు చేకూరే లాభాలూ, వారికి సంభవించే ఉపకారాలకే పరిమితమౌతుందనే విషయం స్పష్టంగానే కనబడుతూంది. ఈ లాభాలూ, ఉపకారాలూ బ్రహ్మాండమైనవేనని ఒప్పుకోక తప్పదు.

మొట్టమొదట మనం ఈస్ట్ ఇండియా కంపెనీ స్టాకు వాటాదార్లను తీసుకుందాం. వీరు సుమారు 3 వేలమందివరకూ ఉంటారు; దరిమిలా మంజూరు చేయబడిన అనుజ్ఞాపత్రం[63] అనుసరించి, పూర్తిగా చెల్లించబడిన అరవై లక్షల పౌన్ల మూలధనంపైనా సాలుసరి లాభం పదిన్నర శాతం చొప్పున ఏటా 6,30,000 పౌన్లనూ వీరికి చెల్లించేందుకు ప్రభుత్వం పూచీపడుతూంది. ఈస్ట్ ఇండియా స్టాకు పత్రాలు అన్యాక్రాంతం చేయదగిన వాటాలవడంచేత, ఇప్పటి అనుజ్ఞాపత్రాన్ననుసరించి వీటికి నిర్ణయించిన 125నుండి 150 శాతం హెచ్చుధర చెల్లించి డబ్బున్నవారెవరైనా సరే ఆ స్టాకువాటా కొనుక్కొని స్టాకు వాటాదార్లు కావచ్చు. 500 పౌన్ల స్టాకువాటాలు (అనగా సుమారు 6,000 డాలర్లు ఖరీదుగలవి) ఉన్న స్టాకు వాటాదారు మాత్రమే వాటాదార్ల సమావేశాల్లో మాట్లాడవచ్చు; కాని సమావేశాల్లో వోటుచేయగలిగే అర్హత ఉండాలంటే, వాటాదారుడికి 1,000 పౌన్ల స్టాకువాటాలుండాలి. 3,000 పౌన్ల స్టాకువాటాలున్నవారికి రెండు వోట్లూ, 6,000 పౌన్ల స్టాకువాటాలున్నవారికి మూడు వోట్లూ, 10,000 పౌన్ల స్టాకువాటాలుగాని, అంతకుమించిన స్టాకువాటాలు ఉన్నవారికి నాల్గు వోట్లూ ఉంటాయి. బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్‌కు సభ్యులను ఎన్నుకోవడం తప్పితే స్టాకువాటాదార్లకు మరే అధికారాలూ లేవనే చెప్పవచ్చు; ఈ పాలకవర్గానికి పన్నెండుగురు డైరెక్టర్లను వాటాదార్లు ఎన్నుకుంటే, ఆర్గురు డైరెక్టర్లను రాజమకుటం నియమించుతుంది; కాని రాజమకుటం నియమించే డైరెక్టర్లు మాత్రం పదేళ్లూ, అంతకు పైబడిన కాలమూ ఇండియాలో నివసించివుండాలనే అర్హత కలిగివుండాలి. ఏటా డైరెక్టర్లలో మూడవవంతు పదవి విరమించుకుంటారు; కాని వారిని తిరిగి ఎన్నుకోవచ్చు, లేదా నియమించవచ్చు. ఎవరైనా డైరెక్టరుగా వుండాలంటే అతనికి 2,000 పౌన్ల స్టాకువాటాలుండాలి. ఒక్కొక్క డైరెక్టరుకి సంవత్సరానికి 500 పౌన్లు జీతం; అధ్యక్షుడికీ, ఉపాధ్యక్షుడికీ ఇంతకు రెండింతలు జీతం; అయితే ఈ ఉద్యోగాలను అపేక్షించడానికి వాటికుండే జీతాలు కాకుండా, ఇండియాలో వున్న అన్ని సివిల్, సైనిక ఉద్యోగాలకూ మనుషులను నియామకం చేయడంలో వీరికుండే ప్రాపకమే ప్రధాన కారణం; అయితే ఈ ఉద్యోగాలు వేయించడంలో, డైరెక్టర్లతోపాటు బోర్డ్ ఆఫ్ కంట్రోల్‌కి కూడా భాగం ఉండడమే కాకుండా, ముఖ్యమైన ఉన్నతోద్యోగాలకు బోర్డ్ ఆఫ్ కంట్రోల్‌కే వాస్తవమైన గుత్తాధికారం వుంది. ఈ బోర్డ్‌లో ఆరుగురు సభ్యులుంటారు. వీరందరూ ప్రీవీ కౌన్సిల్‌లో సభ్యులై ఉంటారు, సాధారణంగా వీరిలో ఇద్దరో ముగ్గురో కేబినెట్ మంత్రులయే వుంటారు; వాస్తవానికి బోర్డు ప్రెసిడెంటే సెక్రెటరీ ఆఫ్ స్టేట్ ఫర్

ఇండియాగా వుంటాడు. బోర్డ్ ఆఫ్ కంట్రోల్‌కు కేబినెట్ మంత్రే విధిగా ప్రెసిడెంట్‌గా ఉంటాడు.

ఈ ప్రాపకాన్ని పొందేవారిని గూర్చి ఇక ఇప్పుడు ప్రస్తావించుదాం. వీరిలో ఐదు తరగతులకు చెందినవారున్నారు: సివిల్, మత, వైద్య, సైనిక, నౌకాశాఖలు. ఇండియాలో ఉద్యోగానికి అర్హత సంపాదించాలంటే, అన్ని శాఖలలో కాకపోయినా సివిల్ శాఖలో తప్పకుండా, ఆ దేశభాషల్లో కొంతవరకైనా ప్రవేశం వుండాలి; ఈస్ట్ ఇండియా కంపెనీ సివిల్ శాఖలోని ఉద్యోగాలలో ప్రవేశించేందుకు తర్ఫీదివ్వడానికని కంపెనీవారు హెయిలీబరీలో ఒక కాలేజీ స్థాపించారు. సైనిక శాఖలో ఉద్యోగాలకోసం ఇలాంటి కాలేజీనే మరొకదానిని కంపెనీవారు లండన్ సమీపంలోవున్న ఎడ్డిస్‌కోంబ్‌లో స్థాపించారు; ఈ కాలేజీ చెప్పే చదువులో సైనికశాస్త్రంలో ప్రాథమిక పాఠాలే ముఖ్యంగా బోధించుతారు. వెనుకటి సంవత్సరాల్లో ఈ కాలేజీలలో ప్రవేశం దొరకడం కేవలం కంపెనీ డైరెక్టర్ల ప్రాపకంపైనే ఆధారపడి ఉండేది; కాని యిటీవలి అనుజ్ఞాపత్రంలో ప్రవేశపెట్టబడిన మార్పులననుసరించి, ఈ కాలేజీలలో ప్రవేశార్హత, అభ్యర్థులు కృతార్థులుకావలసిన బహిరంగ పోటీపరీక్షల ఫలితాలవల్ల నిర్ణయించబడుతుంది. ఇండియా చేరుకోగానే సివిల్ శాఖోద్యోగికి నెలకు సుమారు 150 డాలర్ల జీతం ఇస్తారు; తరువాత ఒకటిగాని అంతకుమించిగాని దేశభాషల్లో జరిగిన పరీక్షలలో నెగ్గినట్టయితే (ఇండియాకు చేరిన పన్నెండునెలల గడువులోగా ఈ పరీక్షలో నెగ్గాలి), అప్పుడు సివిల్ సర్వీస్ ఉద్యోగంలో అతన్ని ఖాయపరచి, సంవత్సరానికి ఉద్యోగాన్ని బట్టి 2,500నుండి 50,000 డాలర్లవరకూ జీతమిస్తారు. ఆఖరున పేర్కొన్న జీతం బెంగాల్ కౌన్సిల్ సభ్యులకూ, బొంబాయి మద్రాసు కౌన్సిళ్ల సభ్యులకూ సంవత్సరానికి సుమారు 30,000 డాలర్ల జీతం యిస్తారు. కౌన్సిల్ సభ్యుడుగాని వ్యక్తికెవ్వరికీ సంవత్సరానికి 25,000 డాలర్లకు మించిన జీతం ఉండడానికి వీల్లేదు; కాగా 20,000 డాలర్లుగాని అంతకు పైబడిన జీతంగాని ముట్టాలంటే, ఆ వ్యక్తి అధమం పన్నెండేళ్లయినా ఇండియాలో నివసించి వుండాలి. తొమ్మిదేళ్లు నివసించి వుంటే 15,000నుండి 20,000 డాలర్లవరకూ జీతానికి అర్హత, మూడేళ్లు నివసించి వుంటే 7,000నుండి 15,000 డాలర్ల జీతానికి అర్హత కలుగుతుంది. సివిల్ శాఖలో ఉద్యోగాలు పేరుకు మాత్రం వయస్సుపైనా, యోగ్యతపైనా ఆధారపడి ఉండాలనే చెప్పబడినప్పటికీ, వాస్తవానికి చాలామటుకు ప్రాపకంపైనే ఆధారపడుతున్నాయి. ఈ శాఖలోనే హెచ్చు జీతాలుండడంచేత వీటికోసం తీవ్రమైన పోటీ జరుగుతూ వుంటుంది; వీటికోసమని ఏమాత్రం అవకాశం దొరికినా సైనికోద్యోగులు తమ రెజిమెంట్లను వదిలిపెట్టి సివిల్ శాఖలో ఉద్యోగంకోసం ప్రయత్నిస్తారు; సివిల్ శాఖలో ఉద్యోగాలకి సగటున 8,000 డాలర్ల జీతం వుంటుందని అంటారు; అయితే ఈ జీతంలో మామూళ్లు రూపేణా, ఎలవెన్సుల

రూపేణా ముట్టే అదనపు మొత్తాలు – సర్వసాధారణంగా ఇవి బాగా హెచ్చుగానే ఉంటూం టాయి – కలవలేదు. గవర్నర్లు, కౌన్సిలర్లు, జడ్జీలు, రాయబారులు, సెక్రెటరీలు, శిస్తులు వసూలుచేసే కలెక్టర్లు ఇటువంటి ఇతర ఉద్యోగాలకు ఈ సివిల్ శాఖోద్యోగులనే నియమి స్తారు; వీరి మొత్తం సంఖ్య సాధారణంగా 800. ఇండియా గవర్నర్ జనరల్ జీతం 1,25,000 డాలర్లు; అయితే అదనపు ఎలవెన్సులు వగైరాల రూపేణా ముట్టే అదనపువేతనం తరచుగా ఇంతకంటే బాగా అధికంగానే ఉంటుంది. మతశాఖకు చెందిన ఉద్యోగులలో ముగ్గురు బిషప్‌లూ, సుమారు నూట అరవై చాప్లెన్‌లూ ఉంటారు. కలకత్తా బిషప్‌కు సంవ త్సరానికి 25,000 డాలర్ల జీతం, మద్రాసు, బొంబాయి బిషప్‌లకు ఇందులో సగం జీతం; చాప్లెన్‌లకు – రుసుములు రూపేణా ముట్టే డబ్బుగాక 2,500నుండి 7,000 డాలర్ల జీతం వుంటుంది. వైద్య శాఖలో సుమారు 800 మంది వైద్యులూ, సర్జన్లూ ఉంటారు; వీరి జీతాలు 1,500నుండి 10,000 డాలర్లవరకూ ఉంటాయి.

ఇండియాలో యూరపియన్ సైనిక ఆఫీసర్ల సంఖ్య – సామంత సంస్థానాధీశులు విధిగా పంపించవలసిన పటాలాలలోని సైనిక ఆఫీసర్ల సంఖ్యతోసహా – సుమారు 8,000 మంది ఉంటుంది. పదాతి పటాలాల్లో వున్న ఆఫీసర్ల నికరజీతాలు ఈవిధంగా ఉంటాయి: ఎన్‌సైన్‌కు 1,080 డాలర్లు; లెఫ్టినెంట్‌కు 1,344 డాలర్లు; కెప్టెన్‌కు 2,226 డాలర్లు; మేజర్‌కు 3,810 డాలర్లు; లెఫ్టినెంట్-కల్నల్‌కు 5,520 డాలర్లు; కల్నల్‌కు 7,680 డాలర్లు. కంటోన్మెంటులో ఉన్నప్పుడు ఈ జీతాలు ముట్టుతాయి; యుద్ధసమయము ప్పుడు జీతాలు ఇంతకంటె హెచ్చుగా వుంటాయి. కేవల్‌రీ, ఆర్టిలరీ, ఇంజనీరింగు శాఖలలో జీతాలు ఇంతకంటె అధికంగా ఉంటాయి. స్టాఫ్ పదవులుగాని, సివిల్ శాఖలో ఉద్యోగంగాని సంపాదించుకొనగలిగిన చాలామంది సైనిక ఆఫీసర్లకు ఇంతకు రెండింతలు జీతం ముట్టుతుంది.

ఈ ప్రకారంగా ఇండియాలో వివిధ లాభదాయక ఉద్యోగశాఖలలో పనిచేస్తూ ఇండి యన్ సర్వీసునుండి జీతాలు సంపాదించుతూన్న బ్రిటిష్ పౌరుల సంఖ్య సుమారు పది వేలుంటుంది. దీనికి అదనంగా, కొన్ని నియమిత సంవత్సరాలపాటు ఇండియాలో ఉద్యోగం చేసిన తరువాత ఉద్యోగులందరూ వారి వారికి అర్హతవున్న ఉపకారవేతనాలు పొంది, నౌకరీ తరువాత ఇంగ్లండుకు తిరిగివచ్చేసి ఇంగ్లండులోనే ఇప్పుడు నివసించుతూన్న పెన్షనుదార్ల సంఖ్య కూడా పైసంఖ్యతో చేర్చాల్సి వుంటుంది. వీరి సంఖ్య అధికంగానే ఉంటుంది కూడా. ఇంగ్లండులో చెల్లించవలసిన ఈ పెన్షన్లూ, డివిడెండ్లూ, రుణాలపై వడ్డీలూ – ఈ మొత్తాలన్నీ ఇండియా చెల్లించాల్సినవే కాబట్టే, వీటికిగాను ఇండియానుండి ఏటా కోటీ, ఎనభై లక్షల డాలర్లనుండి రెండు కోట్ల డాలర్లవరకూ ఇంగ్లండుకు ముడుతూండడంచేత, ఇంగ్లీషు పౌరుల పరంగా ఇంగ్లీషు ప్రభుత్వానికి పరోక్షంగా ఇండియా యధార్థంగా చెల్లించు తూన్న కప్పంగానే దీనిని పరిగణించాల్సి వస్తుంది. వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు పెన్షను

మీద తమ నౌకరీ చాలించుకుని ఇంగ్లండుకు వెళ్ళిపోయేటప్పుడు తమ జీతాలనుండి మిగుల్చుకుని తమవెంట తరలించుకుపోయే అపారమైన విల్వధనాలను కూడా పై మొత్తాలతో కలిపితే, ప్రతిసంవత్సరం ఇండియానుండి కాలువలుకట్టి పారుతూన్న ధనప్రవాహం మరింత ఉధృతమవుతూంది.

ప్రభుత్వపు కొలువుచేస్తూన్న యూరపియనులే కాకుండా, వాణిజ్యవర్తకాలు చేసుకుంటూన్నవారైతేనేమి, ప్రైవేటు చట్టావ్యాపారం చేసుకుంటూన్న వారైతేనేమి 6,000 మందో, అంతకు పైచిలుకో ఇండియాలో ఉన్నారు. వ్యవసాయ జిల్లాలలో నివసిస్తూన్న — కొద్దిమంది నీలిమందు, చెరుకు, కాఫీతోటల యజమానులు మినహా — వీరందరూ ప్రధానంగా వర్తకులుగానూ, ఏజెంట్లు, ఫ్యాక్టరీ యజమానులుగానూ వుంటూ, కలకత్తా, బొంబాయి, మద్రాసు నగరాలలోనో, లేక నగర సమీపప్రాంతాల్లోనో నివసిస్తూంటారు. ఐదుకోట్ల డాలర్ల విలువ గల ఎగుమతి వర్తకమూ, ఇంకో ఐదుకోట్ల డాలర్ల విలువగల దిగుమతి వర్తకమూ ఇండియా విదేశ వాణిజ్యం ఇంచుమించుగా వీరి గుప్పిట్లోనే వుంది; తత్ఫలితంగా వీరి లాభాలు నిస్సంశయంగా విపరీతంగా ఉంటాయి.

ఇండియాతో ఇంగ్లండుకుగల సంబంధంవల్ల వ్యక్తులు అపారమైన లాభాలను గడించుతూన్నట్లు స్పష్టంగానే తెలుస్తూంది; పోతే వీరికి సంక్రమించే లాభం ఫలితంగా జాతీయ సంపద కూడా సహజంగానే ఇనుమడించుతూంది. అయితే దీనికంతకూ ప్రత్యామ్నాయంగా పెద్ద ఖర్చుపద్దు ఒకటి లెక్కలోకి తీసుకోవాల్సి వుంటుంది. ఇండియా రాజ్యంయొక్క విస్తీర్ణం పెరుగుతూన్నకొద్దీ, ఇండియా విషయమై ఇంగ్లీషుప్రజలు తమ జేబుల్లోనుంచి చెల్లించుతూన్నట్టి సైనిక, నౌకాశాఖల ఖర్చులు కూడా నిరంతరాయంగా పెరుగుతున్నాయి. ఈ ఖర్చులకు బర్మా, ఆఫ్ఘనిస్థాన్, చైనా, పర్షియా యుద్ధాల ఖర్చులు కూడా కలపాలి. ఇండియాపట్ల రష్యాకి ఏదో దురుద్దేశముందనే ఈర్ష్యాభావమే రష్యాపట్ల ఉన్న భయభీతులకు కారణం కాబట్టి, దరిమిలా రష్యన్ యుద్ధపు ఖర్చంతా నిజానికి ఇండియా పద్దులోనే చేర్చడం న్యాయం. ఇండియాను తమ వశం చేసుకున్న ఫలితంగా ఇంగ్లీషువారు అవలంబించవలసి వస్తూన్నట్టి దిగ్విజయయాత్రా చర్యలూ, నిరంతరమూ సాగించుతూన్న దురాక్రమణ చర్యలూ దీనికి జోడించినట్లయితే, మొత్తంమీద ఈ రాజ్యాన్ని భరించవలసిన కారణంగా తగిలిన ఖర్చులను ఇప్పటికి కలిగిన లాభం కాదుకదా, ఉత్తరోత్తరా కలుగబోయే లాభం ఎప్పుడైనా సరే భర్తీచేయగలుగుతుందా అనే అనుమానం నిస్సందేహంగా కలిగితీరుతుంది.

మార్క్సు చే 1857 సెప్టెంబరు
ప్రారంభంలో రచించబడింది

"New-York Daily Tribune"
1857 సెప్టెంబరు 21వ తేదీన
5123వ సంచికలో
ప్రచురించబడింది

# మార్క్స

# ఇండియాదేశపు తిరుగుబాటు

లండన్, సెప్టెంబరు 4, 1857

తిరుగుబాటుచేసిన సిపాయిలు ఇండియాలో జరిపిన అత్యాచారాలు భయంకరంగానూ బీభత్సంగానూ అసహ్యంగానూ ఉన్నాయనే చెప్పాలి; ఇవి సాధారణంగా తిరుగుబాటు యుద్ధాల్లో, జాతుల మధ్య, తెగల మధ్య జరిగే యుద్ధాల్లో, అన్నిటికంటే ఎక్కువగా మతయుద్ధాల్లో మాత్రమే జరుగుతూ ఉంటాయి. ఒక్కమాటలో చెప్పాలంటే వెండేయన్‌లు "నీలిరంగు యూనిఫారాల" సైనికులమీదా, స్పానిష్ గెరిల్లాలు ఫ్రెంచి మతాంతరులమీదా, సెర్బియన్‌లు తమ పొరుగు జర్మన్‌లమీదా హంగేరియన్‌లమీదా, క్రోఅట్‌లు వియన్నా తిరుగుబాటుదార్లమీదా, కవేన్యాక్ నాయకత్వాన వున్న "గార్డ్ మొబిల్" దళాలు, బోనపార్ట్ డిసెంబ్రిస్టులూ[64] ఫ్రెంచి శ్రామికవర్గపు పుత్రికా పుత్రుల మీదా ఇలాంటి అత్యాచారాలనే జరిపినప్పుడు మర్యాదస్థులమని చెప్పుకున్న ఇంగ్లీషువారే హర్షధ్వానాలు చేస్తూండేవారు. సిపాయిల ప్రవర్తన ఎంత దుష్టమే అయినప్పటికీ, తన ప్రాచ్యసామ్రాజ్య పునాదులను నిర్మించుకుంటూన్న కాలంలోనే కాదుకదా, స్థిరపరిపాలన ఏర్పరచిన తరువాత గత పదేళ్లలో సహితమూ ఇండియాలో ఇంగ్లండు అవలంబించిన ప్రవర్తనకు ఇది కేంద్రీకృత సహజ ప్రతీకార ప్రక్రియే తప్ప మరొకటేమీకాదు. ఆ పరిపాలన లక్షణాలను చెప్పాలంటే, ఆ పరిపాలనా ఆర్థిక విధానంలో చిత్రహింస ఒక అంతర్భాగమై పోయిందని చెబితే సరిపోతుంది, అంతకంటే మరేమీ చెప్పనక్కరలేదు.* మానవజాతి చరిత్రలో ప్రతిక్రియ అంటూ ఒకటుంది; అట్టి ప్రతిక్రియా సాధనాన్ని తయారుచేసేవారు పీడితులుకాక పీడకులే అని చారిత్రక ప్రతిక్రియా సూత్రం చాటుతూంది.

ఫ్రెంచి రాజరికంమీద మొదటి దెబ్బతీసినది రైతులుకాదు, కులీనప్రభువులే. ఇండియాలో తిరుగుబాటు ప్రారంభించినది బ్రిటిష్‌వాళ్ల చేతిలో చిత్రహింసలకు పాల్పడి,

---

* ఈ సంకలనంలో 78–85వ పుటలు చూడండి. – సం.

అవమానింపబడి, నిలువునా వొల్చివేయబడ్డ రైతులు గాదు, బ్రిటిష్‌వాళ్లిచ్చిన తిండి తిని, వాళ్ళిచ్చిన గుడ్డకట్టి, వాళ్ల లాలనపాలనలో పెరిగి, వాళ్ళ ముద్దులు కుడిచి, వాళ్ళ చేసుకున్న సిపాయిలే ఈ తిరుగుబాటు ప్రారంభించారు. సిపాయిలు చేసిన అత్యాచారాలకు పోలికలు వెతకాలంటే, కొన్ని లండన్ పత్రికలు వాదిస్తూన్నట్టుగా, మధ్యయుగాల గాథలమీద ఆధారపడనక్కరలేదు సరేకదా, సమకాలిక ఇంగ్లీషు చరిత్ర పరిధులు సహితమూ దాటి వెళ్లనక్కరలేదు. ఇప్పుడో, ఏ పురాతన కాలంలోనో కాకుండా, ఒకవిధంగా చెప్పాలంటే నిన్న మొన్నే జరిగినట్టే మొదటి చైనా యుద్ధం** గురించి మనం తెలుసుకుంటే చాలు. ఈ యుద్ధంలో ఇంగ్లీషు సైనికులు కేవలం తమ వినోదార్థం ఎంతటి ఘాతుకాలనో కావించారు. మతోన్మాదంతో వారి కోపాగ్ని రగిలి పవిత్రమైందా అంటే అదీకాదు; పోనీ తమరిని జయించి స్వజాత్యహంకారంతో పీడించుకు తింటూన్న జాతిమీద కల్గిన ద్వేషకారణంగా వారి కోపాగ్ని ద్విగుణీకృతమైందా అంటే అదీ కాదు; పోనీ మొండి ఆవేశంతో వీరోచితంగా పోరాడుతూన్న శత్రుప్రతిఘటన కారణంగా రెచ్చిపోవడంవల్ల వారి కోపాగ్ని రగిలిందా అంటే అదీకాదు. స్త్రీలను మానభంగంచేశారు; మాంసపు ముక్కలు కబాబుపుల్లలకు గుచ్చినట్టు చిన్నపిల్లలను సన్నీంమొనకు గుచ్చేశారు; గ్రామాలకు గ్రామాలూ దగ్ధంచేశారు. ఇవన్నీ కేవలం తమాషాకే ఉబుసుపోవడానికే చేసిన పనులు; ఏ చైనా ఉద్యోగులో తమ కచేరీలలో కూచుని రాసిన రాతలు కావివి, బ్రిటిష్ ఆఫీసర్లు స్వయంగా రాసిన ప్రత్యక్షవిషయాలే.

ఘోరకృత్యాలు చేసినది ఒక్క సిపాయిలేననీ, మానవకారుణ్యానికి ఇంగ్లీషువాళ్ల హృదయాలే పుట్టిల్లనీ నేటి విపత్సమయంలో సహితమూ భావించడం క్షమింపరాని పొరపాటే అవుతుంది. బ్రిటిష్ ఆఫీసర్ల ఉత్తరాల్లో ప్రతి అక్షరంనుండీ ద్వేషం ఉట్టిపడుతూంది. 55వ దేశీయ ఇన్‌ఫెంట్రీ రెజిమెంటుపై దాడిచేయవలసిందని 10వ ఇర్రెగ్యులర్ కేవలీరికి ఆజ్ఞలివ్వగా వారు అందుకు నిరాకరించారనీ, ఆ కారణాన వారిని నిరాయుధులను చేశారనీ, ఈ సైనం పెషావర్‌నుండి ఆఫీసరొకడు ఉత్తరం రాస్తూ అందులో ఈ ఘటనను వర్ణించాడు. వాళ్లనుండి ఆయుధాలు లాక్కోవడమే కాకుండా, వాళ్లచేత చొక్కాలనూ బూడ్సులనూ విప్పించేశారనీ, ఒక్కొక్కరికి పన్నెండేసి పెన్నీలను ఇచ్చారనీ చెబుతూ, వాళ్లకి తగినశాస్తి అయిందని సంతోషంలో ఓలలాడుతూ వాళ్లని కవాతుచేయించుతూ నదివొడ్డుకు తీసుకెళ్లి అక్కడ పడవల్లో కెక్కించి సింధునదిలో వాళ్లని వదిలిపెట్టేశారనీ, ముండాకొడుకులందరూ ఒక్కడైనా మిగలకుండా నది ఉరవళ్లలో చచ్చితీరుతారనీ పరమానందంతో చంకలు గుద్దుకుంటూ రాశాడు. మరొకతను జాబు రాస్తూ, పెషావర్‌లో ఒకరింట్లో పెళ్లిసంబరం జరుగుతూంటే, ఆ దేశాచారం ప్రకారం వారు పెళ్లినాడురాత్రి బాణాసంచా పేల్చగా, దానిని రాత్రి పూట ప్రమాదసూచక సాంకేతికంగా ఇంగ్లీషువాళ్లు భావించి గాభరాపడిపోయి, తమరి వాలాగు బెదరగొట్ట[illegible]సంచా కాల్చినవారిని మరుచటి

AC No. ........

ఉదయం కాళ్లూచేతులూ కలియగట్టి ''జన్మజన్మాలకూ మరచిపోకుండా వాళ్ళ చీరేశాం'' అని రాశాడు. రావల్‌పిండిలో ముగ్గురు దేశీయ నాయకులు కుట్ర చేస్తున్నారని అక్కడనుండి ఖబురొచ్చింది. సర్ జాన్ లారెన్స్ ఈ ఖబురు అందుకోగానే, తన గూఢచారినొకడిని అక్కడకు పంపించి వాళ్ళు జరుపుతూన్న సమావేశానికి హాజరుకావలసిందని ఆజ్ఞాపిస్తూ జవాబు పంపాడు. ఆ ప్రకారం గూఢచారి కుట్రదార్ల సమావేశంపై తన నివేదిక పంపగా, ఆ నివేదిక అందుకుని ''వాళ్లని ఉరితీసేయండి'' అని సర్ జాన్ తిరుగుఖబురు పంపాడు. ఆ ఆజ్ఞననుసరించి వాళ్లని ఉరితీసేశారు. సివిల్ శాఖలో పనిచేస్తూన్న ఉద్యోగి ఒకడు అలహాబాదునుండి ఇలా రాశాడు: ''ప్రాణాలివ్వడానికీ ప్రాణాలు తీయడానికీ మా చేతుల్లో అధికారం వుంది; ఆ అధికారాన్ని మేము పూర్తిగా చలాయిస్తున్నామనే నమ్మండి.'' ఆ పట్నంనుండి మరొకతడు రాస్తూ: ''ఒకరోజైనా నాగాలేకుండా ప్రతిరోజూ పది పదిహేను గురికి తక్కువలేకుండా వీళ్లని (యుద్ధంలో స్వయంగా పాల్గొనని వారిని) పీకకి ఉరేసి వేళ్లాడదీస్తున్నాం'' అని తెలియజేశాడు. మరొక ఆఫీసరు తన సంతోషం పట్టలేక '' 'కరుణామయుడు' హోమ్స్ పదులూ పాతికలూ లెక్కని వీళ్లని ఉరితీసి పారేస్తున్నాడు'' అని రాశాడు. యథావిధిగా విచారణ చెయ్యాలనే బెడద పెట్టుకోకుండా టూకీగా తతంగాన్ని నడిపించేసి దేశీయుల పెద్ద బృందం ఒకదానిని ఉరితీసిన ఘటన పురస్కరించుకుని మరొకతడు: ''మా తమాషా అంత అప్పుడు ప్రారంభమైంది'' అంటూ రాశాడు. మూడో మనిషి ''గుర్రంనుండి మేము దిగకుండానే ఆపాళంగానే పైనికవారణ చేసి కనబడిన నల్లవెధవనల్లా తాడుకుకట్టి వేలాడదీయడమో గుండేసి పేల్చేయడమో కానిస్తున్నాం'' అని రాశాడు. తమ స్వదేశీయులపట్ల సానుభూతి చూపారనే అనుమానంతో ముప్పైమంది జమీందార్లను ఉరితీశారనీ, అదే నేరంమోపి గ్రామాలకు గ్రామాలే తగలబెట్టారనీ బెనారెస్‌నుండి వచ్చిన వార్తలవల్ల మనకి తెలుస్తూంది. బెనారెస్‌నుండి ఒక ఆఫీసరు రాసిన ఉత్తరం లండన్ "Times"లో అచ్చుపడింది. అందులో, ''యుద్ధంలో దేశీయులను ఎదుర్కొన్నప్పుడు యూరపియన్ సైనికులు రాక్షసుల్లా ప్రవర్తిస్తున్నారు'' అని అతడు రాశాడు.

ఇంగ్లీషువాళ్లు చేసిన క్రౌర్యాలన్నింటినీ రోతపుట్టించే వివరాలనేవీ ఇవ్వకుండా దాటవేసి సూక్ష్మంగా హడావిడిగా చెప్పేసి వాటిని వీరకృత్యాలుగా వర్ణిస్తూ, అదేసమయంలో దేశీయులు చేసిన అత్యాచారాలను, అవి నిజంగా ఘోరంగా వున్నాయనుకున్నప్పటికీ, బుద్ధిపూర్వకంగానే మరింత హెచ్చవేసి చెబుతున్నారన్న సంగతి మనం మర్చిపోకూడదు. ఉదాహరణకు, ఢిల్లీలోనూ, మీరట్‌లోనూ జరిగిన ఘోరాలంటూ సవివరంగా మొదట "Times" లోనూ, తరువాత లండన్ పత్రికలన్నిటిలోనూ పడిన కథనం ఎవరు సృష్టించినదనుకున్నారు? ఘటనలు జరిగిన స్థలానికి సరళరేఖలో వెయ్యిమైళ్లకుపైగా మైసూరు రాష్ట్రంలోని బెంగుళూరు నగరంలో కూచున్న ఒక పిరికిసంద మతగురువు. అసలు యథార్థంగా

ఢిల్లీలో జరిగిన ఘటనలనుబట్టి చూస్తే, కలలో సహితమూ ఏ హైందవ పితూరీదారుడి ఊహలకూ అందనట్టి దారుణ చర్యలను ఊహించుకుని సృష్టించగలిగే శక్తిసామర్థ్యం ఒక ఇంగ్లీషు మతగురువుకి ఉందన్న సంగతి దీనివల్ల చక్కగా రుజువవుతూంది. మాంచెస్టర్ శాంతి సంఘం కార్యదర్శి* కాన్‌టన్ ప్రజల కొంపలమీద అగ్నిగుళ్లవర్షం కురిపించడంకంటెనూ, ఒక ఫ్రెంచి మార్షల్[56] ఒక గుహలో తలదాచుకున్న అరబ్బులను పొగపెట్టి మాడ్చేయడం కంటెనూ, బ్రిటిష్ సైనికులను యుద్ధశాసన శిక్షకింద తక్షణవిచారణచేసి తొమ్మిది జాటీల కొరడాతో గాని, శిక్షార్థం బ్రిటిష్ ఖైదీలను పంపించిన బందిఖానా వలసదేశాల్లో అవలంబింపబడుతూన్న కరుణారసపూరితమైన మరే ఇతర సాధనం ఉపయోగించిగాని, చర్మంవొలిచేసేటట్టుగా బ్రిటిష్ సైనికులను బాదడంకంటెనూ, ముక్కులనూ రొమ్ములనూ సిపాయిలు కోసేస్తూన్నారనీ, ఒకటేమిటి ఇంకా వగైరా వగైరా ఇటువంటి అంగవైకల్య ఘాతుకాలు సిపాయిలు జరుపుతున్నారన్న ఉదంతాలే యూరపియన్ల మనసుకు సహజంగానే అమిత అసహ్యకరంగా ఉంటాయి. అన్నింటిలోలాగానే క్రౌర్యంలో కూడా దేశకాలపాత్రల ననుసరించి ఫేషన్‌లు మారుతూంటాయి. మహాపండితుడైన సీజర్ కొన్నివేలమంది గాల్లియా యోధుల కుడిచేతులను నరికించేయమని ఏవిధంగా ఆజ్ఞాపించినదీ విస్పష్టంగా తానే తన గ్రంథాల్లో చెప్పుకున్నాడు.[57] ఈ పనిని చెయ్యడానికి నెపోలియన్ సిగ్గుపడి ఉండేవాడు. తన సొంత ఫ్రెంచి రెజిమెంట్లు రిపబ్లిక్‌ను వాంఛిస్తున్నాయని తనకు అనుమానం తగలగానే నెపోలియన్ వాటిని సాంటో డొమింగోకు పంపేసి ఆటవికులమధ్యా, ప్లేగురోగంమధ్యా చావమని వాటిని అక్కడ వదిలేయడమే ధర్మంగా ఉంటుందని భావించి అలా చేశాడు.

సిపాయిలు చేసినట్టి అప్రతిష్ఠాకరములైన అంగవైకల్య ఘాతుకాల గురించి చెప్తూంటూంటే క్రైస్తవ బైజాంటైన్ సామ్రాజ్యంలో ఒక నిత్యకృత్యమో, లేక ఐదవ చార్లెస్ సృష్టించినట్టి క్రిమినల్ లాలోని సూత్రాల్లో,[58] లేక జడ్జి బ్లాక్‌స్టన్ దరిమిలాను వివరించుతూ రాసినట్టూ రాజ్యద్రోహనేరంకింద ఇంగ్లండులో విధించిన శిక్షలో,[59] మనకు గుర్తుకొస్తాయి. తమ శరీరంపై తాము చిత్రహింసలను చేసుకోవడంలో హిందూమతంచే కళాప్రపూర్ణులుగా తయారుచేయబడిన హిందువుల దృష్టిలో, తమ జాతికీ, తమ మతానికీ శత్రువులైన వారి మీద వీటిని ప్రయోగించడం సహజంగా వున్నట్టు కనబడడమే కాకుండా జగన్నాథ రథోత్సవాల్లో రక్తపాతపూరితమైన క్రూర మతాచారాలకు రక్షణ ఇచ్చి వాటికి సహాయంచేస్తూ ఇటీవలి సంవత్సరాలవరకూ ఆదాయం గడించిన ఇంగ్లీషువారికి అది మరింత సహజంగా కనబడాలి.

మోత్సార్ట్ సంగీతనాటకం ఒకదాంట్లో, శత్రువును మొదట ఉరితీసినట్టూ, తరువాత

---

* జాన్ బౌరింగ్. — సం.

మంటల్లో మాడ్చినట్టూ, అటుతరువాత వాల్చుముక్కలుగా కోసినట్టూ, తదుపరి ఖడ్గం మొనను గుచ్చినట్టూ, తరువాత చర్మాన్ని వొలిచినట్టూ ఊహించుకుని తన ఆనందాన్ని మధురాతి మధురమైన సంగీతంతో ఆలపించే ఒక భయంకర పాత్రను[60] అభినయిస్తూన్న "Times" పత్రిక — "రక్తాలు వోడుతూన్న ముసలి 'Times'" అనేవాడు కాబెట్ — ఉన్మాద గర్జనలూ, కసి తీర్చుకోవాలనే కోపంతో జుత్తు పీక్కొని ఒంటిమీద గుడ్డలను చించుకోవడమూ — ఈ విషాదనాటక శోకరసం అట్టడుగున హాస్యరసకల్పితములైన మాయల మారి జిత్తులే గనుక ప్రత్యక్షంగా బయటబడకుండా ఉండని పక్షంలో ఇదంతా కేవలం వెంగలితనంగానే కనిపించుతూండవచ్చు: లండన్ "Times" పత్రిక తన పాత్రను కేవలం భయంవల్లనే అతిశయోక్తితో అభినయించడంలేదు. పగతీర్చుకోవడంలో ఆషాఢభూతిస్వాములవారి టార్టూఫ్ పాత్రను సృష్టించిన మొల్యేర్‌కు కూడా సాధ్యంకానంతటి హాస్యరస ప్రధాన నాటకానికి వన్నెతెచ్చే ఇతివృత్తాన్ని స్ఫురింపచేస్తుంది. "Times" పత్రికకు కావలసినదల్లా ప్రభుత్వ పత్రాల ధర పడిపోకుండా నిలబడేటట్టు పత్రికాప్రచారం చేయడమూ, ప్రభుత్వచర్యలు బయటికి పొక్కకుండా చూడడమూ. బుగ్గలుపూరించి హుష్ అని ఊదినంత మాత్రాన జెరికో పట్నపు గోడలు[61] కూలిపోయినట్టు కాకుండా ఢిల్లీగోడలు ఇంకా కూలిపోనందున, ఈ అల్లరిని లేవదీయడానికీ, ఈ అల్లరి ఇంత బ్రహ్మాండమైన పరిమాణం ధరించ నిచ్చినందుకూ బాధ్యతంతా తన ప్రభుత్వానిదేనన్న విషయం జాన్ బుల్‌చేత మరపింపజేసేందుకు, ప్రత్యపకారంకోసం పాలిబొబ్బలతో అతగాడి చెవులు చిల్లులు పడేటట్టు చేయాలి.

మార్క్సుచే 1857 సెప్టెంబరు 4న
రచించబడింది

"New-York Daily Tribune"
1857 సెప్టెంబరు 16వ తేదీన
5119వ సంచికలో
ప్రచురించబడింది

# మార్క్స్

# *ఇండియాలో తిరుగుబాటు

ఇండియానుండి నిన్న మాకు చేరిన వార్తలు ఇంగ్లీషువారికి అత్యంత వినాశకరమూ విపత్కరమూ అయిన లక్షణాన్ని ప్రదర్శించుతున్నాయి, ఐనప్పటికీ ఈ పత్రికలోనే ఇంకొక చోట ప్రచురించినదాని ప్రకారం అభిజ్ఞుడైన మన లండన్ విలేకరి పేటెవట్ల భిన్నాభిప్రాయం వ్యక్తపరచుతున్నాడు.[62] జూలై 29వరకూ జరిగిన ఘటనల వివరాలూ, కలరావల్ల సంభవించిన నష్టాల ఫలితంగా ఢిల్లీ ఎదుటనుండి ముట్టడిసేనలు వైదొలగవలసి వచ్చి ఆగ్రాలో తమ శిబిరాలను ఏర్పరచుకున్నట్టు తెలియజేస్తూ దరిమిలా వచ్చిన మరొక నివేదికా ఢిల్లీనుండి అందాయి. లండన్ పత్రికలు వేటిలోనూ ఈ నివేదిక ధృవీకరించబడలేదన్న విషయం నిజమే; అయినప్పటికీ ఇది అసత్యంకాదనీ, మహాఅయితే అకాలమైన నివేదిక అని మాత్రమే మేమంటాం. ఇదివరలో మేము ప్రచురించిన మా విలేకరి జాబులన్నిటినిబట్టీ మా చదువరులు ఎరిగినట్టు జూలై 14, 18, 23న ముట్టడిసేనలు జరిపిన ఉధృతగతిదాడులలో అవి చాలా జోరుగానే దెబ్బతిన్నాయి. ఆ సందర్భాలలో, ఇదివరకెన్నడూ చూపనంత మొండి ఉద్రేకంతోనూ, శతఘ్నిబలంలో తమకున్న ఆధిక్యతను మంచి అనుకూలంగానూ వినియోగించుతూ తిరుగుబాటుదార్లు యుద్ధంచేశారు.

"మేము 18 పౌన్ల గుండ్ల ఫిరంగులనూ 8 అంగుళాల పొట్టి ఫిరంగులనూ ప్రయోగించుతూండగా, మాకు ప్రతిగా 24, 32 పౌన్ల గుండ్ల ఫిరంగులను తిరుగుబాటుదార్లు ప్రయోగిస్తున్నారు" అని ఒక బ్రిటిష్ ఆఫీసరు రాస్తున్నాడు. "మేము ఎదుర్కొనవలసి వచ్చిన పద్దెనిమిది ఉధృతగతిదాడులలోనూ, మరణాల వల్లనయితేనేమి గాయాలవల్లనయితేనేమి మాలో మూడోవంతు మందిని నష్టపోయాం" అని మరొక ఉత్తరంలో వుంది.

అదనపు సేనలు అందుతాయని ఆశపెట్టుకుని వుండగా జనరల్ వాన్ కోర్ట్‌లాండ్ నాయకత్వంకింద వున్న సిక్కు పటాలం ఒక్కటి మాత్రమే అందే అవకాశం ఉన్నట్టుగా ఇప్పుడు కనబడుతూంది. జయప్రదమైన అనేక యుద్ధాలు చేసిన తరువాత, ఇక లక్నోని విముక్తిచేదామనే ఉద్దేశ్యం తాత్కాలికంగా వదలుకొని జనరల్ హావ్‌లక్ తిరిగి కాన్పూరుకే తిరోగమించాల్సివచ్చింది. అదే సమయంలో, "ఢిల్లీ ప్రాంతంలో వర్షాలు కుంభవృష్టిగా కురవడం ప్రారంభించాయి;" దీనితో విధిగానే కలరా మరింత ఉధృతమైంది. ఆగ్రాకు తిరోగమించారనీ, మొగల్ పాదుషా ముఖ్యపట్టణాన్ని ధ్వంసంచేసే ప్రయత్నం — అధమం ప్రస్తుతానికైనా — వదలుకున్నట్టూ తెలిపిన సమాచారలేఖలోని వార్త నిజమైనట్టు ఇదివరకే రూఢికాకుండా వుంటే, నేడో రేపో రూఢి అయితీరుతుంది.

గంగానదీశ్రేణిలో జరుగుతూన్న వాటన్నిటిలోనూ జనరల్ హావ్‌లక్ యుద్ధచర్యలే ప్రధానాసక్తిని కలిగిస్తున్నాయి; ఫతేపూర్, కాన్పూర్, బిఠూర్ నగరాలలో ఇతను జరిపిన సాహసకృత్యాలను లండన్ పత్రికలన్నీ సహజంగానే కొద్దో గొప్పో అతిశయోక్తులతో శ్లాఘించాయి. మేము పైనచెప్పినట్టు కాన్పూర్‌నుండి ఇతడు ఇరవైయ్యైదుమైళ్ల పురోగమించిన తరువాత తన సైన్యంలో జబ్బుపడినవారిని చికిత్సకోసం ఆస్పత్రిలో చేర్చడానికే కాకుండా, అదనపు బలాలకని వేచివుండడానికోసం కూడా ఆ పట్టణానికే తిరిగి రావలసి వచ్చింది. ఇందువల్ల లక్నో విముక్తి యత్నానికి భంగం కలుగుతూండడంవల్ల ఇది చాలా విచారకరమైన విషయం. లక్నోకోటలో వున్న బ్రిటిష్ రక్షణసైన్యాన్ని విముక్తిచేయడానికై నేపాల్ నుండి జంగ్ బహదూర్ పంపిన 3,000ల గూర్ఖా సైన్యంమీదే వారు తమ ఆశలన్నిటినీ పెట్టుకున్నారు. ఈ గూర్ఖాలు గనుక ముట్టడిని అంతంచేయలేకపోతే, కాన్పూర్‌లో జరిగిన ఊచకోతే మళ్లీ ఇక్కడ కూడా సంభవించుతుంది. ఇంతేకాదు; లక్నో కోట తిరుగుబాటుదార్ల వశంకావడమూ, తత్ఫలితంగా అయోధ్యలో వారి బలం దృఢపడడమూ కారణంగా, ఢిల్లీని స్వాధీనంచేసుకొనేందుకై బ్రిటిష్‌వారు ఎట్టి యుద్ధచర్యలు జరిపినప్పటికీ, వాటన్నిటిలోనూ కూడా వారి సైర్యానికి గొప్ప ప్రమాదం ఏర్పడి, ఇప్పుడు బెనారెస్‌లోనూ, బీహార్ జిల్లా అంతటిలోనూ వున్న బలాబలాల తూకం ఇక అటో ఇటో నిశ్చయమైపోతుంది. దాంతో కాన్పూర్‌కు ఇప్పుడున్న ప్రాధాన్యత సగానికిసగం తగ్గిపోయి, తిరుగుబాటుదార్లు లక్నో కోటను వశంచేసుకోవడంవల్ల ఒకవైపున ఢిల్లీతోనూ, రెండోవైపున బెనారెస్‌తోనూ ఈ పట్టణానికున్న రవాణామార్గాలకు ప్రమాదం తటస్థిస్తుంది. ఇది సంభవమేకావడంవల్ల, విషాదభరితమైన ఆత్రతతో ఆ స్థలంనుండి వార్తలకోసం నిరీక్షిస్తున్నారు. వారిదగ్గర వున్న భోజనసామగ్రులను కరువుభత్యాల లెక్కనే గనుక వాడుకున్నట్టయితే ఆరు వారాలవరకూ కాలక్షేపం చేయగలమని లక్నో నగరరక్షక సైనికులు జూన్ 16న అంచనావేశారు. ఇక్కడ అందిన ఆఖరిసమాచారలేఖల తేదీనాటికి ఐదువారాలప్పుడే గడచిపోయాయి. ఇక నేపాలునుండి అందబోయే అదనపు

బలాలపైనే సర్వమూ ఆధారపడుతుందన్నమాట; ఇవి బయలుదేరాయనే అంటున్నారుగాని, వాస్తవంగా బయలుదేరినట్టు మాత్రం రూఢీవార్తలు ఇంతవరకూ అందలేదు.

కాన్పూర్‌నుండి గంగకు దిగువముఖంగా వున్న బెనారెస్ పట్నాన్నీ, బీహార్ జిల్లానూ పరిశీలించినట్టయితే బ్రిటిష్‌వారి అవకాశం ఇంతకంటే మరింత అధ్వాన్నంగా వున్నట్టు కనబడుతూంది. ఆగస్టు 3వ తేదీతో బెనారెస్‌నుండి రాసిన ఉత్తరం ఒకటి "Bengal Gazette"[63]లో పడింది. ఆ ఉత్తరంలో ఇలా వుంది:

> "దీనాపూర్‌లో వున్న తిరుగుబాటుదార్లు సోన్‌నది దాటి ఆరానగరంమీదికి వెళ్తున్నారు. ఆరాలో వున్న యూరపియన్లు తమ క్షేమంపట్ల సకారణంగానే భయాందోళనలు చెంది, అదనపు బలాలను పంపవలసిందని దీనాపూర్‌కు రాశారు. ఆప్రకారం రాణీగారి 5వ, 10వ, 37వ రెజిమెంట్ల విభాగాలను ఎక్కించుకుని రెండు స్టీమర్లు దీనాపూర్‌నుండి బయలుదేరాయి. రెండింటిలోనూ ఒక స్టీమరు అర్ధరాత్రప్పుడు నదిలో ఇసుకలో కూరుకుపోయి ఇటూ అటూ కదల్లేకపోయింది. అందులో వున్న సైనికులను ఆదరాబాదరా ఒడ్డుకు చేర్చగా, తగిన జాగ్రత్తలు తీసుకోకుండా ముందుకు నడపబడ్డారు. హఠాత్తుగా రెండువైపులనుండీ బలమైన గుళ్ళవర్షం మూటిగా వారిమీద కురువవారంభించింది. ఆ కొద్ది మంది సైనికులు, ఆఫీసర్లు కూడా కలుపుకొని 150 మంది hors de combat* తయారయారు. ఆరాలో వున్న అందరు యూరపియన్లూ, దాదాపు 47 మంది, ఊచకోత కొయ్యబడ్డారనే ఇక్కడనుకుంటున్నారు."

ఆరా నగరం బెంగాల్ రాష్ట్రంలో బ్రిటిష్‌వారికింద వున్న షహాబాద్ జిల్లాలో వుంది; దీనాపూర్‌కు ఇరవైయ్యైదు మైళ్ళ పశ్చిమంగానూ, ఘాజీపూర్‌కు డెబ్బైయ్యైదు మైళ్ళ తూర్పుగానూ, రెండు వూళ్ళకూ వెళ్లే రోడ్డుమీద ఉంది. బెనారెస్‌కే ప్రమాదం ఏర్పడింది. బెనారెస్ పట్నంలో కోట వుంది. ఈ కోటను యూరపియన్ నియమాలననుసరించి కట్టారు. ఇది గనుక తిరుగుబాటుదార్ల వశమైందంటే, మళ్లీ రెండో ఢిల్లీలాగానే తయారవుతుంది. బెనారెస్‌కి దక్షిణంగానూ, గంగ అవతలి వొడ్డునా వున్న మీర్జాపూర్‌లో మహమ్మదీయులు కుట్ర పన్నుతూన్నట్టు బ్రిటిష్‌వాళ్లకి ఆచూకీ తెలిసింది; ఇదిలా వుండగా కలకత్తాకి ఎనభైకి పైగా మైళ్లలో గంగానదీతీరాన వున్న బర్హంపూర్‌లో 63వ దేశీయ ఇన్‌ఫెంట్రీ పటాలం నిరాయుధం చేయబడింది. ఒక్కమాటలో చెప్పాలంటే, ఒకవైపున అధికారధిక్క

---

* పోరాడు స్థితిలో లేకుండుట. — సం.

రణ, రెండవవైపున భయాందోళన, ఈవిధంగా బెంగాల్ రాష్ట్రమంతటా కంకత్తా పొలిమేరవరకూ కూడా వ్యాపించిపోతూంది. ఇక కంకత్తాలో చూడబోతే ఒళ్లు తెలియని మతోద్రేకంతో విచ్చుకత్తులు పట్టుకుని తిరుగుతూ పిసరంత కవ్వింపుచర్య జరిగేటప్పటి కల్లా పీకలుపీకలు ఎగిరే పోట్లాటగా మొదట తయారై, తరువాత ఇంగ్లీషువాళ్లమీదనే హోరాహోరీ యుద్ధంగా పరిణమించగలిగే మొహరం ఉపవాసపండగ ఎలాగు గడుస్తుందో అని భయపడిపోతున్నారు. ఈ భయం ఎంతవరకూ వెళ్లిందంటే, తన సొంత అంగరక్షక దళాన్నే నిరాయుధం చేయక గవర్నర్ జనరల్‌కే* తప్పిందికాదు. దీన్నిబట్టి బ్రిటిష్‌వారి ప్రధాన రహదారీ అయిన గంగానదీ జలమార్గం ఎక్కడికక్కడ తెగగొట్టివేయబడి ఛిన్నాభిన్నమయే ప్రమాదంలో పడిందని చదువరికి ఇప్పుడు వెంటనే అర్థమవుతుంది. నవంబరులో చేరవలసిన అదనపు బలాల పురోగమనంపై దీని ప్రభావం పడి, యమునానదిమీద బ్రిటిష్ యుద్ధచర్యల శ్రేణిని ఏకాకి చేసివేస్తుంది.

బొంబాయి రాష్ట్రంలో పరిస్థితులు కూడా విషమరూపమే ధరిస్తున్నాయి. కొల్హాపూర్‌లో 27వ బొంబాయి దేశీయ ఇన్‌ఫెంట్రీ పితూరీచేసిందన్న ఖబురు యధార్థమేకాగా, బ్రిటిష్ సైనికబలాలు ఆ పితూరీని ఓడించేశాయన్న ఖబురు పుకారుమాత్రమే. బొంబాయి దేశీయ సైన్యం వరుసగా నాగపూర్, ఔరంగాబాద్, హైదరాబాద్ నగరాలలోనూ, చిట్టచివరకి కొల్హాపూర్‌లోనూ పితూరీచేసింది. బొంబాయి దేశీయ సైన్యంలో వాస్తవంగా 43,048 మంది సైనికులుండగా, ఆ రాష్ట్రమంతటిలోనూ యధార్థంగా కేవలం రెండేరెండు యూరపియన్ రెజిమెంట్లున్నాయి. బొంబాయి రాష్ట్ర పరిహద్దులలో శాంతిభద్రతలు కాపాడడం కోసమే కాకుండా, ఈ సైన్యంలోనుండే, పంజాబ్‌లో సింధువరకు సహితమూ అదనపు బలాలను పంపించడానికి వీలవుతుందనీ, మహౌ ఇందూర్లమీదకి సైనికశ్రేణులను నడిపించి ఈ రెండు నగరాలనూ వశపర్చుకొని, ఆగ్రానగరంతో రాకపోకలు ఏర్పరచుకొని, అక్కడ చిక్కుకున్న నగరరక్షక దళాలను విముక్తిచేయడానికి వీలవుతుందనీ ఆశపడ్డారు. ఈ కర్తవ్యసాధనకై బ్రిగేడియర్ స్టూవర్ట్‌ను నియమించి, 3వ బొంబాయి యూరపియన్ రెజిమెంటు తాలూకు 300ల సైనికులనూ, 5వ బొంబాయి దేశీయ ఇన్‌ఫెంట్రీ పటాలం తాలూకు 250 సైనికులనూ, 25వ బొంబాయి దేశీయ ఇన్‌ఫెంట్రీ రెజిమెంటు తాలూకు 1,000 సైనికులనూ, 19వ బొంబాయి దేశీయ ఇన్‌ఫెంట్రీ రెజిమెంటు తాలూకు 200ల సైనికులనూ, హైద్రాబాద్ సంస్థానపు సైనిక దళానికి చెందిన 3వ కేవెల్రీ రెజిమెంటు తాలూకు 800ల సైనికులనూ ఒక పటాలంగా ఏర్పరచి అతనికిచ్చారు. మొత్తం 2,250 మంది దేశీయ సైనికులున్న ఈ సైన్యంలో, ప్రధానంగా రాణీగారి 86వ పదాతి పటాలానికీ,

---

* చార్లెస్ జాన్ కానింగ్. — సం.

రాజేగారి 14వ లైట్ డ్రాగూన్ పటాలానికి చెందిన సుమారు 700ల యూరపియన్లు ఉన్నారు. ఇంతేకాకుండా, అధికారధిక్కారణలు జరిగిన ఖాన్‌దేష్, నాగపూర్ ప్రాంతాలను బెదరగొట్టడానికీ, అదే సమయంలో మధ్య ఇండియాలో ఒక చోటనుండి మరొక చోటకు త్వరితగతిని తిరుగుతూన్న అశ్విక గస్తీ శ్రేణులకు సహాయంగా వుండేందుకనీ ఔరంగాబాద్‌లో ఒక దేశీయ సైనికశ్రేణిని ఇంగ్లీషువారు సమీకరించి ఉంచారు.

ఈ మధ్య ఇండియా భూభాగంలో "ప్రశాంత పరిస్థితులు తిరిగి నెలకొల్పబడ్డాయి"ని మనతో అంటూన్నారు; కాని ఈ సమాచారంపై మనం పూర్తిగా ఆధారపడలేము. ఈ సమస్యా పరిష్కారం మహౌను స్వాధీనపరచుకోవడంపైనగాక, మహారాష్ట్ర సంస్థానాధీశులు హోల్కార్, సింధ్యాలు అవలంబించే వైఖరిపైనే ఆధారపడివుంది. స్ట్యువర్ట్ మహౌ చేరుకున్నాడని ఏ సమాచార లేఖైతే తెలియజేస్తూందో అందులోనే హోల్కార్ బ్రిటిష్‌పక్షాన్నే దృఢంగా ఇంతవరకూ నిలబడివున్నప్పటికీ, అతని సైనికులను సంబాళించడానికి అతనికి ఏమాత్రమూ శక్యం కాకుండా వుందని కూడా వుంది. ఇక సింధ్యా అవలంబించుతూన్న వైఖరి గురించి ఒక్కముక్క అయినా బయటికి తెలియడంలేదు. ఇతడు యువకుడు, ప్రజలకు అభిమానపాత్రుడు, అత్యంత ఉత్సాహవంతుడు; ఇతడే మహారాష్ట్ర జాతికంతటికీ సహజమైన నాయకుడుగానూ, మహారాష్ట్ర ప్రజలందరినీ తనచుట్టూ సమీకృతపరచుకోకలిగిన వ్యక్తిగానూ ఉన్నాడు. ఇతనికి సొంతంగా మంచి క్రమశిక్షణ కలిగినట్టి 10,000ల సైనిక బలం ఉంది. ఇతడు బ్రిటిష్‌వారి పక్షంనుండి విడిపోయి ఎదురుతిరిగాడంటే, మధ్య ఇండియాను వారు పోగొట్టుకోవడమే కాకుండా, విప్లవ సమితి విశేషంగా బలపడి, స్థాయిని చేకూర్చుకుంటుంది. ఢిల్లీకి ఎదురుగా నిలబడిన సేన తిరోగమించడమూ, తిరుగుబాటుదార్ల బెదరింపులూ అభ్యర్థనలూ, రెంటి ఫలితంగా చివరికి అతడు తన స్వదేశస్థుల పక్షమే చేరవచ్చు. ఏమైనప్పటికీ హోల్కార్ సింధ్యాలపై డక్కన్‌లోని మహారాష్ట్రుల ప్రభావమే అన్నిటికంటె హెచ్చుగా వుండి తీరుతుంది. మేమింతకు ముందే తెలియజేసినట్లు, కట్టకడపటికి డక్కన్‌లో తిరుగుబాటు నిశ్చయంగా తలయెత్తింది.* ఇక్కడ కూడా మొహరం పండుగ ప్రత్యేకంగా అత్యంత ప్రమాదభరితంగానే పరిణమించవచ్చు. ఈ కారణాలన్నింటిని బట్టి బొంబాయి సేనలో సర్వవ్యాప్తమైన తిరుగుబాటు జరిగే అవకాశం ఉందనే మనం అనుకోవచ్చు. ఇదే గనుక జరిగిందంటే మహమ్మదీయులందరిలోనూ అత్యంత మూఢవిశ్వాసం గలిగినవారి నివాసమైన హైదరాబాద్, నాగపూర్, మాల్వా జిల్లాలప్రజలనుండే ముఖ్యంగా ఏర్పడినట్టి 60,555 దేశీయ సైనికులుగల మద్రాసు సేన కూడా ఈ రోజు కాకపోతే రేపైనా ఆ మార్గాన్నే తొక్కడం తథ్యం. ఈవిధంగా

---

* ఈ సంకలనంలో 93–94వ పుటలు చూడండి. – సం.

ఆగస్టు, సెప్టెంబరు వర్షాలవల్ల బ్రిటిష్ సైనికబలాల చలనం కుంటుపడి వాటి రవాణా మార్గాలకు అంతరాయం కలిగితీరుతుందనే నిర్ణయానికి మనం వచ్చిన పక్షంలో, యూరప్ నుండి పంపించిన అదనపు సేనల సంఖ్య ఎంత హెచ్చుగా ఉన్నట్టు కనబడినప్పటికీ, అవి ఆలస్యంగానూ, అప్పటప్పట స్వల్పసంఖ్యల్లోనే అందడంవల్ల వాటికి ఒప్పగించిన కార్యాన్ని నిర్వహించగలిగే స్థితిలో అవి ఉండజాలవేమో అనే సబబైన పర్యవసానానికి రావడంలో పొరపాటేమీ కనపడడంలేదు. కాగా, దీని తరువాత జరిగే యుద్ధంలో ఆఫ్ఘనిస్థాన్‌లో జరిగిన విపత్తులే[64] ఇక్కడ కూడా పునరుక్తమవడం సంభవమేనని మనం అనుకోవచ్చు.

మార్క్స్‌చే 1857 సెప్టెంబరు 18న
రచించబడింది

"New-York Daily Tribune"
1857 అక్టోబరు 3వ తేదీన
5134వ సంచికలో
ఒక సంపాదకీయ వ్యాసంగా
ప్రచురించబడింది

# మార్క్స్

## *ఇండియాలో తిరుగుబాటు

స్టీమరు "అట్లాంటిక్" విన్న తీసుకొచ్చిన వార్తలలో ముఖ్యమైన విషయాలు రెండు న్నాయి; ఒకటి లక్నో విముక్తిచేయడానికై జనరల్ హావ్‌లక్ పురోగమించలేకపోవడమూ, రెండవది ఢిల్లీ ఎదుటనే ఇంగ్లీషువారు పట్టుదలతో నిలబడ్డమూ. ఈ రెండో విషయాన్ని పోలిన ఘటన ఒక్క బ్రిటిష్ చరిత్రలోనూ, వాల్‌ఖెరెన్ దండయాత్రలోనూ** మాత్రమే కన బడుతూంది. 1809 ఆగస్టు మధ్య రోజులనాటికల్లా ఆ దండయాత్ర నిరర్థకమైందని తేలిపోయేటప్పటికి, వెంటనే అక్కడనుండి వారు నౌకలమీద తిరిగివచ్చేయడం బదులు నవంబరు వరకూ అక్కడే జాగుచేశారు. ఇంగ్లీషు సేన ఆ చోట దిగిందని నెపోలియన్‌కి తెలియగానే, ఆ స్థలంపై దాడిచేయవద్దనీ, ఫిరంగులవల్ల కలిగే నష్టంకంటె రోగంవల్లే హెచ్చునష్టాలు కల్గి ఫ్రాన్సుకి ఒక్క చిల్లిగవ్వ అయినా ఖర్చుకాకుండా ఇంగ్లీషు సైన్యం నాశనమైపోతుందనీ సలహా యిచ్చాడు. ఇప్పుడున్న మొగల్ పాదుషా, నెపోలియన్‌కంటె అనుకూలమైన పరిస్థి తులలో ఉండడంవల్ల, అతని దాడులు రోగానికి సహాయంచేస్తున్నాయి, అతడు జరిపే దాడు లకు రోగం సహాయంచేస్తూంది.

గ్వాలియారీనుండి సెప్టెంబరు 27వ తేదీన వెలువడిన ఒక బ్రిటిష్ ప్రభుత్వ సమా చారలేఖ ఈలా తెలియజేస్తూంది:

> "ఢిల్లీనుండి ఆగస్టు 12వ తేదీన వచ్చిన ఆఖరి సమాచారాలనాటికి ఆ పట్నం ఇంకా తిరుగుబాటుదార్ల స్వాధీనంలోనే ఉన్నట్టూ, అయినప్పటికీ జనరల్ నికల్సన్ గణనీయమైన అదనపుబలంతో వస్తున్నాడనీ, ఇంకొక్క రోజులో ఢిల్లీ సమీపించవచ్చునాడనీ, అందుచేత త్వరలో దాడి జరుగుతుందనే అనుకోవచ్చును."

విల్సన్, నికల్సన్‌లు తమకున్న ప్రస్తుత బలంతో ఢిల్లీపై దాడిచేసేవరకూ ఢిల్లీని స్వాధీనపరచుకోకుండా వుంటే, వాటంతటవే శిథిలమయేవరకూ ఢిల్లీగోడలు అలాగే నిల

బడుంటాయి. నికల్సన్‌కున్న గణనీయమైన సైనికబలమంతా కలిపితే 4,000ల సిక్కులు — ఇది ఢిల్లీపై దాడిచేయడానికి ఏమూలకీ చాలని అదనపు బలమే అయినప్పటికీ, పట్టణానికి ఎదురుగా నిర్మించుకున్న సైనికస్థావరాన్ని ఎత్తివేసుకోకుండా అంటిపెట్టుకునేందుకు ఆత్మ వినాశసదృశమైన మిషగా ఏర్పడడానికి చాలినంత పెద్దదిగానే ఉంది ఈ బలం.

మీరట్ తిరుగుబాటుదార్లను ఢిల్లీని చేరుకోనివ్వడమనే తప్పిదాన్ని — మిలిటరీ దృక్పథంనుండి చూస్తే, ఇదొక నేరమనే చెప్పవచ్చు — జనరల్ హెవిట్ చేసిన తరువాతనూ, మొదటి రెండువారాలు వ్యర్థంచేసి, తిరుగుబాటుదార్లు చెదురుచెదురుగా జరిపిన ఆకస్మాత్తు దాడులద్వారా వారు ఆ పట్టణాన్ని పట్టుకుందుకు అవకాశం కల్గించిన తరువాతనూ, ఢిల్లీని ముట్టడించడానికి వేసుకున్న పథకం ఇంచుమించు ఏవిధంగానూ అర్థంచేసుకోవడానికి వీలు లేనట్టి శుద్ధ పొరపాటుగానే కనబడుతూంది. లండన్ "Times" సైనిక సొదెగాళ్ల కంటెనూ కాస్త ఉన్నత ప్రామాణికుడుగానే మేము సాహసింపనెంచిన నెపోలియన్, యుద్ధ చర్యలను గురించి సర్వసాధారణమైన రెండు సూత్రాలు నిర్వచించాడు; ఇవి చాలా చప్ప చప్పగానే కనబడవచ్చు; ఇవేమిటంటే: మొదటిది, ''ఎట్టి చర్య అయితే మన శక్తులకు సాధ్యమో దేనికి మద్దతువివ్వగలమో, ఎట్టి చర్యకైతే జయప్రదంకావడానికి అన్నిటి కంటె హెచ్చు అవకాశాలున్నాయో అట్టి చర్యకే పూనుకోవాలి;'' రెండవది, ''యుద్ధంయొక్క ప్రధాన లక్ష్యమైనట్టి శత్రువినాశానికి ఏ ప్రదేశమైతే అనువుగా వుంటుందో, అక్కడే ప్రధాన సైనికబలాలను ఉపయోగించాలి.'' ఢిల్లీ ముట్టడికై వేసుకున్న పథకంలో ఈ రెండు ప్రాథమిక సూత్రాల ఉల్లంఘనా జరిగింది. ఇండియా ప్రభుత్వమే ఢిల్లీ దుర్గ నిర్మాణాలను ఇటీవలనే మరమ్మతు చేయించిందనీ, అథమం 15 వేల, 20 వేల సైనికులను కలిగిన సైన్యంచేత పకడ్బందీగానూ, లేదంటే మామూలు పద్ధతిలోనే ముట్టడి జరిగినట్ట యితే ఇంకా హెచ్చు సంఖ్యలో వున్న సైన్యంచేతనూ, నిర్వహించబడిన ముట్టడివల్లనే గాని ఇతరత్రా పట్నం శత్రు స్వాధీనంగానట్టి విధంగా ఈ మరమ్మతులు చేయబడ్డాయనీ, ఇంగ్లండులో వున్న అధికార్లకు తెలిసేవుండాలి. కాగా, ఏ 15 వేల సైన్యమో, 20 వేల సైన్యమో అవసరమైన యీ పనిని 6 వేలు, 7 వేలమందితో సాధించాలనే ప్రయత్నం శుద్ధ తెలివితక్కువే. తమ సంఖ్యాబలం తక్కువగా ఉండడం ఫలితంగా ముట్టడి కూడా అవశ్యం సుదీర్ఘకాలమే జరగవలసి ఉంటుందనీ, తత్ఫలితంగా తమ శ్రేణులలో వినాశకర బీజాలను విస్తరింపజేస్తూన్నట్టి వ్రజదేహి అయినట్టి కంటికి కనబడనట్టి శత్రువుయొక్క దాడికి, ఆ ప్రాంతమూ ఆ శీతోష్ణస్థితీ ఆ ఋతువూయొక్క ధాకమ భరించుతూన్న తమ సైనిక బలాలు గురికావలసివుంటుందనీ ఇంగ్లీషువారికి నిస్సందేహంగా తెలిసిన విషయమే. ఈ కారణాలనుబట్టి ఢిల్లీ ముట్టడి జయప్రదంగా పరిణమించేందుకుగల అవకాశాలు బహు స్వల్పం.

ఇండియాలో ఇంగ్లీషు పరిపాలనను కొనసాగించడమే ఈ యుద్ధంయొక్క లక్ష్యమన్నది నిర్వివాదం. ఈ లక్ష్యసాధనకు, వ్యూహరచన దృష్ట్యా ఢిల్లీకి గల ప్రాముఖ్యత కేవలం శూన్యం. దాని నిజప్రభావంతో ఎట్టి పోలికా లేనట్టి చారిత్రక సంప్రదాయమే కేవలం మూఢవిశ్వాస జనితమైన ఒక గొప్ప ప్రాముఖ్యతను దేశీయుల దృష్టిలో ఢిల్లీ పట్టణానికి తెచ్చి పెట్టింది: కడమ అన్ని పట్టణాల్లోనూ ఈ పట్టణాన్నే తమ ఏకైక సమీకరణ స్థానంగా ఎంచుకోడానికి తిరుగుబాటు గావించిన సిపాయిలకు ఈ కారణం సరిగ్గా సరిపోయింది. దేశీయుల మూఢ నమ్మకాల ననుసరించి ఇంగ్లీషువారు తమ యుద్ధపథకాలను తయారుచేసుకునే బదులు, వారు ఢిల్లీ జోలికిపోకుండా, దానికీ ఇతర ప్రాంతాలకూ ఎట్టి సంబంధంలేకుండా చేసివుండి నట్టయితే, ఆ పట్నంమీద వున్న మోజుకొద్దీ దానికి ఆపాదించబడిన ప్రభావాన్ని లేకుండా చేసి ఉండేవారు; అందుకు బదులు, ఢిల్లీకి ఎదురుగా తమ మకాం ఏర్పరచుకొని, మొండిగా తమ బుర్రలను ఢిల్లీగోడలకేసి బద్దలుకొట్టుకుంటూ, తమ ప్రధాన బలాంనూ, యావత్ ప్రపంచదృష్టినీ ఆ పట్నంపైనే కేంద్రీకరింపజేయడంవల్ల, తిరోగమనావకాశాలకు సహి తమూ తిలోదకాలిచ్చుకోవడం అలావుండగా, ఘోరపరాజయానికుండే ఫలితాలే తిరోగమనా నికి సహితమూ ఉండేటట్లు చేసుకున్నారు. ఢిల్లీనే తమ యుద్ధలక్ష్యంగా పెట్టుకున్న తిరుగు బాటుదార్ల అభీష్టాన్ని బ్రిటిష్‌వారే తమ చేతులారా నెరవేర్చిపెట్టారు. ఇంతటితో సరిపో లేదు. అధికారధిక్కరణ సూచనలు పొడచూపిన చోటల్లా వాటిని మొగ్గలోనే తుంచి వేసే చర్యలు సలుపగలిగినట్టే, తమ సొంత సైనికస్థావరాల మధ్యనున్న రవాణామార్గాలను వెల్లడిగా ఉంచగలిగినట్టే, శత్రువులను వెన్నాడి వారిని ఏ కొద్దిపాటి కేంద్రస్థానాలలోనో కేంద్రీకరింప బడేలా చేయగలిగేటట్టే, క్రియాశీలమైన యుద్ధరంగ సైన్యాన్ని నిర్మించుకోవడమే అన్నిటి కంటె ప్రధానమైన కర్తవ్యమని ఇంగ్లీషువారికి నచ్చచెప్పడానికి గొప్ప తెలివితేటలేవీ అవసరం లేదు. సరళంగానూ స్వయంవ్యక్తంగానూ ఉన్నట్టి ఈ పథకాన్ని అనుసరించడం మాని, దాని బదులు తమ చేతిలో వున్న ఒక్కగానొక్క క్రియాశీలమైన సైన్యాన్ని ఢిల్లీకెదురుగా కేంద్రీ కరించడంవల్ల దానిని మరెక్కడకీ కదలకుండా అక్కడే కట్టిపడేసి యుద్ధరంగాన్ని తిరుగు బాటుదార్లకు అప్పగించేసి, అదేసమయంలో తమ సొంత నగరరక్షణబలాలు చెదురుచెదురుగా వున్న వూళ్లలో వుండిపోయి, వాటిని కాపాడుకుంటూ, ఒకదానితో ఒకటి సంబంధం లేకుండా ఒకదానినుండి ఒకటి అతిదూరంగా వున్న వూళ్లలో ఉండిపోయిన వాటిని రక్షించుకుంటూ ఇరుకున పడిపోయి, వాటికంటె ఎన్నోరెట్లు అధికసంఖ్యగల శత్రుబలాల చక్రబంధంలో చిక్కుకుని వాటి దారి అవే చూసుకొనేటట్టుగా చేసేశారు.

చలనశక్తి కల్గిన తమ ప్రధాన శ్రేణిని ఢిల్లీకి ఎదురుగా నిలబెట్టి ఉంచేసుకోవడం ఫలితంగా ఇంగ్లీషువారు తిరుగుబాటుదార్లకు ఊపిరాడకుండా చేయడంలో విఫలులవడమే కాకుండా, తమ నగరరక్షణబలాలు కదలడానికి వీల్లేకుండా ఎక్కడవక్కడే చతికిలబడేలా

చేసుకున్నారు. ఢిల్లీవద్ద చేసిన మౌలికమైన ఈ పొరపాటు అటుండగా, స్వతంత్రమైనట్టే, ఒండొరుల ప్రసక్తి లేనట్టే, ఎట్టి సార్వభౌమ నాయకత్వమూ సహితమూ లోపించినట్టే, ఒక సైన్యానికి చెందిన సైనికుల మాదిరిగా కాక, వివిధ పరాయి దేశాలకూ, ఆ మాటకొస్తే ఒకదానితో ఒకటి యుద్ధంచేస్తూన్న దేశాలకూ చెందినట్టే సైన్యాలవలె వ్యవహరించేటట్టు గామా ఈ నగరరక్షక దళం యుద్ధచర్యలను నడిపించిన బుద్ధిమాంద్యత యుద్ధచరిత్ర లోనే సాటిలేనిది. ఉదాహరణకు కాన్పూర్ లక్నోలనే తీసుకుందాం. ఈ రెండూ ఇరుగు పొరుగు నగరాలు; రెండింటిలోనూ ఒకదానికొకటి సంబంధంలేని వేర్వేరు సైన్యాలు రెండు న్నాయి; రెండు సైన్యాలూ తమ కర్తవ్యనిర్వహణకు ఏ మాత్రమూ చాలని అతిస్వల్పసంఖ్య లోనే ఉన్నాయి; రెండు సైన్యాలూ ఒకదాని పక్కనే ఒకటి నలభై మైళ్ల దూరంలో మాత్రమే ఉండగా, రెండు సైన్యాలూ వేర్వేరు నాయకత్వాలకింద వున్నాయి; ఒకటి ఈ ధ్రువంలోనూ రెండోది ఆ ధ్రువంలోనూ ఒకదానితో రెండవ దానికి ఏవిధంగానూ సంబంధంలేనట్టే సైన్యాల్లాగున కార్యాచరణలో అవంతైనా ఐక్యత లేకుండా వ్యవహరించాయి. అత్యంత ప్రాథమిక యుద్ధవ్యూహరచనా మాత్రాలను ఏమాత్రం పాటించినప్పటికీ, తన సేనాబలాలను వెంట బెట్టుకుని కాన్పూర్‌కే వచ్చివేయవలసిందని అయోధ్య చీఫ్ కమీషనరైన సర్ హెచ్. లారెన్స్‌ను ఆజ్ఞాపించడానికి కాన్పూర్‌లో సేనానిగా వున్నట్టి సర్ హ్యూ వీలర్‌కి అధికారం ఇచ్చివుండ వలసింది; ఇలా చేసివుండినట్లయితే లక్నోనుండి తాత్కాలికంగా వైదొలగవలసి వుండినప్పటికీ, తన స్థానం పటిష్ఠంచేసుకోవడానికి అతనికి వీలుగా వుండేది. ఈ చర్య ఫలితంగా ఆ నగరంలోనూ ఈ నగరంలోనూ వున్న రక్షణసైన్యాలు రెండూ రక్షించబడి వుండేవి; హావ్‌లక్ సైనికబలాలు వీటితో తరువాత కలిశాయి కాబట్టి, వీటినన్నిటినీ కలిపి, అయోధ్యను అదుపాజ్ఞలలో ఉంచు కోడానికీ ఆగ్రాను విముక్తి చేయడానికీ సామర్థ్యం కలిగిన చిన్న సైన్యాన్నొకదానిని నిర్మించు కోడానికీ అవకాశం చిక్కేది. ఇలాచేయడం బదులు, రెండు చోట్లా ఎవరికివారు స్వతంత్రంగా చర్యలు జరపడంవల్ల కాన్పూర్‌లో నగరరక్షణబలం కసాయికత్తికి బలిఅయిపోయింది; దుర్గ సహితంగా లక్నో నగరరక్షక దళం తప్పకుండా పతనమైతీరుతుంది, హావ్‌లక్ అద్భుత వీరోచిత కృత్యాలు — 126 మైళ్ళ ఎనిమిది రోజుల్లో నడచుకొనివచ్చి, ఎన్ని రోజులు పట్టిందో అన్ని యుద్ధాలను జయప్రదంగా తిప్పికొట్టి, ఇదంతా కూడా ఉధృతమైన హిందూ దేశపు మండుటెండల్లో అద్భుతంగా నెరవేర్చినట్టి హావ్‌లక్ వీరోచిత కృత్యాలన్నీ — నిరర్థకమై పోయాయి. అసలే డస్సి నిస్త్రాణచెందివున్న తన సైనికబలాలను లక్నోను విముక్తిచేయ డానికై వృధాగా ప్రయత్నించి తత్ఫలితంగా వాటిని మరింత అలసట పెట్టి వుండడమే కాకుండా, అంతకంతకు మరింత తగ్గిపోతూన్న వ్యాసార్థంలోనే కాన్పూర్‌నుండి పదేపదే నిర్వహించవల సిన దండయాత్రలలో తన సేనలను ఇరికించి తద్వారా తప్పనిసరిగా వాటిని నిష్ఫలితములైన కొత్త కష్టాలకు పాల్జేయడం అనివార్యమని తెలుసుకొని, ఇంచుమించు తన మనుష్యుల

సందరిని కోల్పోయి అతను అలహాబాదుకు తిరోగమించి తీరడమే మూడువంతులు సంభవం. విలువైన ప్రాణాలు వదులుకోవలసి వస్తున్నట్టి రోగపీడితమైన శిబిరంలో చిక్కుకొని ఉండడం బదులు,* చిన్నదే అయినప్పటికీ ఇంగ్లీషు సైన్యం ఒకటి ఢిల్లీకి ఎదురుగా యుద్ధభూమిపై కేంద్రీకరించబడిన పక్షంలో ఏవిధంగా పోరాడివుండేదో ఇతని సేనల యుద్ధచర్యలు మరిదేని కన్న ఎక్కువగా రుజువుపరుస్తున్నాయి. యుద్ధవ్యూహరచనలో వున్న రహస్యమంతా సైన్యాలను కేంద్రీకరించడంలోనే ఉంది. వికేంద్రీకరణ పథకాన్ని అవలంబించారు ఇండియాలో వున్న ఇంగ్లీషువారు. తమకున్న నగరరక్షక దళాల సంఖ్యను ఎంతవరకూ తగ్గించేసుకోవడానికి వీలుంటుందో అంతవరకూ తగ్గించేసుకోవడమూ, వాటిలో వున్న స్త్రీలనూ పిల్లలనూ వెంటనే ఇతర చోట్లకు పంపించివేసి ఆ బెడదలేకుండా చేసుకోవడమూ, యుద్ధవ్యూహరచనలో ప్రాముఖ్యతలేనట్టి స్థావరాలన్నింటినీ ఖాళీచేయడమూ, ఈవిధంగా యుద్ధభూమిమీద ఎంతపెద్ద సేనను సమీకరించేందుకు వీలుపడుతుందో అంతపెద్దసేనను సమీకరించడమూ, ఇదీ వారు చేసివుండవలసిన పని. ఇప్పుడు జరిగినదేమిటంటే, కలకత్తానుండి గంగానది ఎగువకు చిల్లరచిల్లరగా అరా పాతికలలో అడపాదడపా పంపించుతూన్న అదనపు బలాలను, చెదురుచెదురుగా ఏకాకిగా లెక్కకుమించివున్న నగరరక్షక దళాలకు పంపిణీచేసేటప్పటికల్లా, చివరకు ఒక్క దళమైనా అలహాబాదుకు చేరకుండాపోయింది.

ఇక దరిమిలా టపాలో లక్నోగురించి అందిన వార్తలు* ఎంతటి నిరాశాజనకమైన జోస్యాలను పురికొల్పాయో, ఆ జోస్యాలన్నీ ఇప్పుడు ధ్రువపడ్డాయి. హావ్‌లక్ మళ్ళీ మరొకసారి కాన్పూర్‌కే తిరోగమించవలసివచ్చింది. నేపాల్ మిత్రసేనలనుండి లభిస్తుందని ఆశపడిన సాయానికి ఎట్టి అవకాశమూలేదని తేలిపోయింది; ఆకలిబాధ సహించలేక ఆ పట్టణం శత్రువశమైపోయిందనీ, ఆ పట్టణాన్ని వీరోచితంగా కాపాడప్రయత్నించిన సాహసులు దారాపుత్రాదుల సమేతంగా ఊచకోత పాలయారన్న వార్త ఏ ఘడియలోనైనా వినడానికి మనమిక సిద్ధపడాలి.

మార్క్స్‌చే 1857 సెప్టెంబరు 29న
రచించబడింది

"New-York Daily Tribune"
1857 అక్టోబరు 13వ తేదీన
5142వ సంచికలో
ఒక సంపాదకీయ వ్యాసంగా
ప్రచురించబడింది

---

* ఈ సంకలనంలో 106వ పుట చూడండి. — సం.

# మార్క్స్

## *ఇండియాలో తిరుగుబాటు

ఇండియాలో తిరుగుబాటు పరిస్థితులను చర్చించడంలో, మొదటినుండీ లండన్ పత్రికలు అలవరచుకున్న ఆశావాదాన్నే ఇప్పుడు కూడా ప్రదర్శిస్తున్నాయి. ఢిల్లీమీద జయ ప్రదమైన దాడి జరుగుతుందనే కాకుండా, ఆగస్టు 20వ జరిగి వుంటుందని కూడా అవి తెలుపుతున్నాయి. ముట్టడిసైన్యానికి యిప్పుడు ఎంత సంఖ్య వుందో మనం సహజంగానే మొట్టమొదట తెలుసుకోవాల్సి వుంది. ఢిల్లీ శిబిరంనుండి ఆర్టిలరీ ఆఫీసరు ఒకతను ఆగస్టు 13వ జాబురాస్తూ, ఆ నెల 10వ తేదీన యధార్థంగా యుద్ధరంగంలో పాల్గొన గల్గిన బ్రిటిష్ సేనల సవిస్తరమైన వివరాలను ఈ కిందివిధంగా ఇస్తున్నాడు:

| | బ్రిటిష్ ఆఫీసర్లు | బ్రిటిష్ సైనికులు | దేశీయ ఆఫీసర్లు | దేశీయ సైనికులు | గుర్రాలు |
|---|---|---|---|---|---|
| స్టాఫ్ | 30 | – | – | – | – |
| ఆర్టిలరీ | 39 | 598 | – | – | – |
| ఇంజనీర్లు | 26 | 39 | – | – | – |
| కేవెల్‌రీ | 18 | 570 | – | – | 520 |
| 1వ బ్రిగేడ్ | | | | | |
| రాణీగారి 75వ రెజిమెంటు | 16 | 502 | – | – | – |
| ఆనరీరీ కంపెనీవారి 2వ | | | | | |
| ఫ్యుసిలీయర్లు | 17 | 487 | – | – | – |
| కూమాన్ బటాలియన్ | 4 | – | 13 | 435 | |

| | బ్రిటిష్ ఆఫీసర్లు | బ్రిటిష్ సైనికులు | దేశీయ ఆఫీసర్లు | దేశీయ సైనికులు | గుర్రాలు |
|---|---|---|---|---|---|
| 2వ బ్రిగేడ్ | | | | | |
| రాణీగారి 60వ రైఫిల్స్ | 15 | 251 | – | – | – |
| ఆనరిరీ కంపెనీవారి 2వ ఫ్యుసిలీయర్లు | 20 | 493 | – | – | – |
| సైమూర్ బటాలియన్ | 4 | – | 9 | 319 | – |
| 3వ బ్రిగేడ్ | | | | | |
| రాణీగారి 8వ రెజిమెంటు | 15 | 153 | – | – | – |
| రాణీగారి 61వ రెజిమెంటు | 12 | 249 | – | – | – |
| 4వ సిక్కు రెజిమెంటు | 4 | – | 4 | 365 | – |
| గైడ్స్ కోర్ | 4 | – | 4 | 196 | – |
| కోక్‌యొక్క కోర్ | 5 | – | 16 | 709 | – |
| వెరశి | 229 | 3,342 | 46 | 2,024 | 520 |

ఈవిధంగా ఆగస్టు 10వ తేదీనాటికి ఢిల్లీ ఎదుట యుద్ధరంగంలో యథార్థంగా పాల్గొనగల్గిన బ్రిటిష్ సైనికబలాంలో పరిగ్గా 5,641 మందున్నారు. వీరి సంఖ్యనుండి ఇంగ్లీషువారి ఎడమవైపునున్న కోటగోడలకు వెలుపల తిరుగుబాటుదార్లు నిర్మించిన కొత్త బాటరీపై ఆగస్టు 12న జరిగిన దాడిలో, ఇంగ్లీషువారి నివేదికల ప్రకారమూ చని పోయిన 120 మందినీ (112 సైనికులూ, 8 ఆఫీసర్లూ) తీసివెయ్యాల్సి వుంటుంది. బ్రిగేడీయర్ నికల్సన్ ముట్టడిసేనతో కల్సుకున్ననాటికి ఆ సేనలో 5,521 యుద్ధ సైనికులున్నారన్నమాట. రెండవ తరగతి ముట్టడి ఫిరంగుల శ్రేణిని వెంటతీసుకొని ఫెరోజ్ పూర్‌నుండి వచ్చిన బ్రిగేడీయర్ నికల్సన్ సైనికబలాల సంఖ్య ఈ కిందివిధంగా ఉంది: 52వ లైట్ ఇన్‌ఫెంట్రీ రెజిమెంటు (సుమారు 900ం మంది); 61వ రెజిమెంటులో ఒక విభాగం (సుమారు 4 కంపెనీలు; 360 మంది); డార్‌షీయర్ సేనా ఫిరంగి బాటరీ, 6వ పంజాబ్ రెజిమెంటులో ఒక విభాగం (సుమారు 540 మంది); కొంతమంది ముల్తాన్ అశ్వికులూ, పదాతిసైనికులూ; అంతా కలిపి సుమారు 2,000 మంది; వీరిలో 1,200 సైనికులు యూరపియన్లు. నికల్సన్ వచ్చినప్పుడు మకాంలో విడిసివున్న 5,521 యుద్ధసైనికుల సంఖ్యకు ఈ సంఖ్యను కలిపితే, మొత్తంగా 7,521 సైనికులు

న్నారన్నమాట. పంజాబ్ గవర్నరు సర్ జాన్ లారెన్స్ పంపించాడన్న అదనపు సైన్యం ఈకింది విధంగావుంది: 8వ కాల్బల రెజిమెంటులో కడమ విభాగం, 24వ రెజిమెంటులో మూడు కంపెనీలు, వీటితో పెషావర్‌నుండి వచ్చిన కెప్టెన్ పేటన్ సైనికదళానికి చెందిన మూడు అశ్విక ఫిరంగులు, 2వ, 4వ పంజాబ్ కాల్బల రెజిమెంటులు, 6వ పంజాబ్ రెజిమెంటులో కడమ విభాగం. ఈ సైనికబలంలో మహావుంటే 3,000 మంది (వీరిలో అత్యధికభాగం సిక్కులే) ఉంటారని మనం అంచనా వెయ్యవచ్చు. ఈ సేన ఇంకా ఢిల్లీ చేరుకోలేదు. ఇంతకు ముందు సుమారు నెలరోజుల్రకితం చాంబర్లెన్* నాయకత్వాన పంజాబ్ అదనపుబలాలు వచ్చి చేరాయని చదువరి గుర్తుతెచ్చుకోగలుగుతే, ఆ అదనపుబలాలు రావడంవల్ల జనరల్ రీడ్ చేతికింద వున్న బలాలు సర్ హెచ్. బార్‌నార్డ్ నాయకత్వాన ఉన్నప్పటి తొలిసంఖ్యనే అప్పుడెలా అందుకున్నాయో, ఇప్పుడు కూడా అదనపుబలాలు అందుకోవడంవల్ల బ్రిగేడియర్ విల్సన్ బలాలు జనరల్ రీడ్‌కింద ఉన్నప్పటి తొలిసంఖ్యనే ఇప్పుడు అందుకున్నాయి; దీనివల్ల ఇంగ్లీషువారికి అనుకూలంగా వున్నట్టి నిజమైన వాస్తవవిషయం ఏమిటంటే, చివరికి ముట్టడి ఫిరంగుల శ్రేణి వారికి అందిందన్నమాట. అయినప్పటికీ, అనుకున్న 3,000 మందీ శిబిరానికి వచ్చిచేరుకుని, తత్ఫలితంగా మొత్తం ఇంగ్లీషు సైనికబలాలు 10,000 సంఖ్యను — ఈ సంఖ్యలో మూడోవంతుయొక్క భక్తివిశ్వాసాలను ఎప్పుడూ శంకించవలసే ఉంటుంది — అందుకున్నాయనే అనుకున్నా, అప్పుడు వారు చెయ్యవలసిందేమిటి? ఢిల్లీని చుట్టుముట్టుతారని మనతో చెబుతున్నారు. ఏడుమైళ్ల పైచిలుకు కైవారంతో మంచి బలమైన దుర్గప్రాకారమున్న పట్టణాన్ని 10,000 మందితో ముట్టడించడం హాస్యాస్పదమన్న విషయం అటుండగా, ఢిల్లీని ముట్టడించడం గురించి వారు తలపెట్టగల్గే ముందు యమునా నది ప్రస్తుత ప్రవాహ మార్గాన్ని మొదట ఇంగ్లీషువాళ్లు మార్చాల్సివుంటుంది. ఇంగ్లీషువాళ్లు ఢిల్లీలో ఉదయం కాలుపెడితే సాయంకాలానికల్లా తిరుగుబాటుదార్లు యమునని దాటి రోహిల్‌ఖండ్ అయోధ్యలను చేరుకునేందుకో, లేదా యమున ఒడ్డునే మధురా ఆగ్రాలవైపు నడచివెళ్లడానికో, ఢిల్లీని ఖాళీచేసేయగలుగుతారు. ఏది ఏమైనప్పటికీ ముట్టడింపబడేవారి రవాణా తిరోగమన మార్గాలకు అవకాశం లభింపజేసే ఒక భుజం ముట్టడిబలాలకు అందుబాటులో లేనట్టి చతుర్రసాన్ని ముట్టడించడమనే సమస్యను తేల్చడం ఇంతవరకూ ఎవ్వరికీ చేతకాలేదు.

పైన ఉదాహరించిన పత్రికను తెలిపిన బ్రిటిష్ ఆఫీసరు ఇలా రాస్తున్నాడు:

> "సరాసరి ఎదురుదెబ్బతీసి ఢిల్లీని పట్టుకోవడం అసాధ్యమైన కార్యమని అందరూ ఒప్పుకుంటున్నారు."

---

* ఈ సంకలనంలో 88వ పుట చూడండి. — సం.

అదే సమయంలో, శిబిరంలోనివారందరూ ఏది సాధ్యమనుకుంటున్నారో ఆ ఆఫీసరే పేర్కొంటున్నాడు: "చాలా రోజులపాటుగా పట్టణాన్ని ఫిరంగులతో ముట్టడించి, కోట గోడను పగులగొట్టి అందులో ఆ మాత్రం ఈ మాత్రం వెడల్పు గండి కొట్టడం." కాగా, ఆ ఆఫీసరే ఇంకా అంటున్నాడు:

"ఎంత తగ్గించి లెక్కకట్టినా శత్రువులు సుమారు నలభై వేల సైన్యాన్ని సమీకరించగలుగుతారు; ఇక వారికున్న ఫిరంగుల సంఖ్యకు అంతులేదు; వాటిని మంచి తెలివితేటలతో ఉపయోగిస్తున్నారు; వారి పదాతి సైన్యం కూడా బాగా యుద్ధం చేస్తూంది."

కోటగోడల దాపున వున్నప్పుడు మహమ్మదీయులు ఎంత మొండిధైర్యంతో యుద్ధం చేస్తారో లెక్కలోకి తీసుకుంటే, "ఆ మాత్రం ఈ మాత్రం వెడల్పు గండి కొట్టే" లోపలికి చొరబడిన చిన్న బ్రిటిష్ సైన్యాన్ని మళ్లీ వెలుపలికి పారిపోనిస్తారా వారు అన్నదే ప్రశ్న.

వాస్తవానికి, ఇప్పుడున్న బ్రిటిష్! బలాలే ఢిల్లీపై విజయవంతంగా దాడిచేయడానికి ఒకేఒక అవకాశం వుంది; అదేమిటంటే, తిరుగుబాటుదార్లలో అంతఃకలహాలు పొటమరించడమూ, వారి మందుగుండు సామగ్రి అంతా ఖర్చు అయిపోవడమూ, వారి సేన అధైర్యపడిపోయి గుండెచెదిరిపోవడమూ, ఆత్మవిశ్వాసం సడలిపోవడమూ. కాని జూలై 31నుండి ఆగస్టు 12వరకూ పట్టు విడుపులేకుండా ఒక్కబిగిని వారు యుద్ధం చేయడం చూస్తే ఈ ఆశకు లేశమూ అవకాశం కనపడడంలేదు. అదే సమయంలో మిలిటరీ సూత్రాలన్నిటినీ ఉల్లంఘించి ఢిల్లీకి ఎదురుగా ఇంగ్లీషు జనరల్‌లు ఇంత మొండిగా నిలదొక్కుకున్నందుకు కారణం ఏమై వుంటుందో కలకత్తానుండి వచ్చిన ఒక జాబులో మనకి సూచన ప్రాయంగా తెలుస్తూంది. ఆ ఉత్తరంలో ఇలా వుంది:

"ప్రతిరోజూ యుద్ధంచేయవలసి వస్తూండడంవల్ల కలుగుతూన్న బెడద మూలంగా ఇప్పటికే అపరిమితంగా విస్త్రాణచెందిన సేనలకు ఇంకా ఇటుపైన కూడా యుద్ధాన్ని తట్టుకోవడం శక్తికి మించినదవడంచేత, ఢిల్లీకి ఎదురుగా నిలబడున్న సేనలు తిరోగమించడమే మంచిదేమోనన్న ప్రశ్న కొద్దివారాలకింద ఉదయించగా సర్ జాన్ లారెన్స్ ఆ ఉద్దేశ్యాన్ని తీవ్రంగా ప్రతిఘటించాడు. అది ఎంతమాత్రమూ వీలులేదనీ, తమ చుట్టూ వున్న ప్రజ ఒక్కుమ్మడిగా తిరగబడడానికి తమ తిరోగమనమే సంజ్ఞ కాగలదనీ, అందువల్ల తమ సేనలు తక్షణ ప్రమాద స్థితిలో చిక్కుకుంటాయనీ సర్ జాన్ లారెన్స్ జనరల్‌లతో నిర్మొహమాటంగా చెప్పాడు. ఈ అభిప్రాయమే

చివరకి నెగ్గింది; తను సమీకరింపగలిగిన అదనపు బలాలన్నింటినీ తాను పంపుతానని సర్ జాన్ లారెన్స్ వాగ్దానంచేశాడు."

పంజాబ్‌నుండి సేనలను తరలించి వేయడం ఫలితంగా ఇప్పుడు పంజాబే తిరుగబడవచ్చు; ఈ లోపున వర్షాకాలం అంతమైన తరువాత భూమిలోనుండి పైకిలేచే రోగసంకిలమైన విషవాయువుల కారణంగా ఢిల్లీ ఎదుట కంటోన్మెంటులలో వున్న సేనలు రోగాలతో మంచంపట్టి మృత్యువాతపడి నాశమైపోవచ్చునేమో కూడా. నాలుగు వారాలకిందటే హిస్సార్ చేరుకుని ఢిల్లీ ముఖంగా తోసుకొస్తున్నాయని నివేదించబడిన జనరల్ వాన్ కోర్ట్‌లాండ్ సైనికబలాలను గురించి* మరి ఖబురే లేదు. గొప్ప అడ్డంకులను ఎదుర్కొనైనా ఉండాలి, లేదా సేనలను తోవలో ఎత్తివేసైనా ఉండాలి.

ఎగువగంగానదీ ప్రాంతంలో ఇంగ్లీషువారి స్థితి వాస్తవానికి నిరాశాజనకంగా ఉంది. అయోధ్యలో వున్న తిరుగుబాటుదార్లు లక్నోనుండి బిథూర్‌మీదుగా సాగిపోతూ కాన్పూర్‌కు దక్షిణాన వున్న ఫతేపూర్‌వద్ద, జనరల్ హావ్‌లక్ తిరోగమనాన్ని అడ్డం కొట్టడానికి ప్రయత్నించుతూండడంవల్ల, అతనికి ప్రమాదం ఏర్పడుతూంది; అదే సమయంలో గ్వాలియర్ సంస్థాన దళం యమున కుడివొడ్డునున్న కాల్పీ పట్టణంనుండి కాన్పూర్‌మీదకి తరలివస్తూంది; లక్నోలో సర్వసేనాధిపత్యం వహించుతూన్నట్టుగా తెలియవస్తూన్న నానా సాహెబే బహుశ ఈ ఏకకేంద్రీయచర్యను నడిపిస్తూన్నట్టు తోస్తూంది. తిరుగుబాటుదార్లకు యుద్ధవ్యూహరచనాజ్ఞానం అంటూ ఒకటుందని తెలియజేయడానికి ఇదే మొట్టమొదటి సూచనైవుండగా, మరింత కేంద్రాపసార యుద్ధచర్యలను తెలివితక్కువగా అవలంబింప నుబలాటపడుతున్నట్టున్నారు ఇంగ్లీషువారు. జనరల్ హావ్‌లక్‌కు అదనపుబలంగా ఉండేందుకై కలకత్తానుండి పంపబడిన 90వ కాల్బలం, 5వ ఫ్యుసిలీయర్ పటాలాలను మార్గమధ్యంలో దీనాపూర్‌వద్ద సర్ జేమ్స్ ఔట్రామ్ కలుసుకుని, మరేకారణం అతనికి తోచిందోకాని, వాటిని ఫైజాబాద్‌మీదుగా లక్నోకి నడిపించ నిశ్చయించుకున్నాడు. ఇది ఎవడో ప్రతిభాశాలే, సర్వజ్ఞుడే వేయవలసిన పథకమని లండన్ "Morning Advertiser"* శ్లాఘించుతూ, ఈ పథకం ఫలితంగా లక్నో దక్షిణపార్శ్వం కాన్పూర్‌నుండీ వామపార్శ్వం ఫైజాబాద్‌నుండీ, ఈ విధంగా ఇరుపార్శ్వాలనుండీ చెలరేగే అగ్నిజ్వాలల నడుమ చిక్కుకుంటుందని ఇందుకు కారణం చెబుతూంది. సాధారణ మిలిటరీ సూత్రాల ననుసరించి, అతిస్వల్ప సంఖ్యలో వున్నట్టి సేన, చెదిరిపోయున్న తన అంగబలాలను కూడదీసుకోవడం బదులు, శత్రుసేనలయొక్క సంపూర్ణ వైశాల్యానికి ఇటువైపునా అటువైపునా తనంతటతానుగా రెండుభాగాలుగా చీలినట్టయితే,

* ఈ సంకలనంలో 91వ పుట చూడండి. — సం.

ఇక దానిని తుడిచిపెట్టేయడానికి శత్రుసేనలు ఏమాత్రమూ శ్రమపడనక్కరలేకుండా అదే చూస్తుంది. ఇప్పుడు జనరల్ హేవ్‌లక్ ముందున్నది లక్నోని రక్షించడమనే ప్రశ్నకాదు, దాని బదులు తనకింద వున్న సేనలలోనూ, జనరల్ నీల్ కిందవున్న చిన్న సేనలోనూ ఇంకా మిగిలివున్న వారిని ఎలా రక్షించడమనేదే అతని ముందున్న ప్రశ్న. మూడువంతులు అతను అలహాబాద్‌కు తిరోగమించడమే బహుశా సంభవం. గంగాయమునా సంగమంలో ఉండడమూ, ఈ రెండు నదుల మధ్యనూ వున్న దోఆబ్ ప్రాంతానికి కీలకస్థానమవడమూ కారణంగా వాస్తవంగా అలహాబాద్‌కు అమీతుమీ తేల్చే ప్రాముఖ్యత ఉంది.

పశ్చిమోత్తర రాష్ట్రాలను పునఃజయించ దల్చుకుని, అందుకు యత్నించే ఇంగ్లీషు సైన్యం నిర్మించుకునేటట్టి ప్రధాన యుద్ధచర్యశ్రేణి దిగువగంగా నదీ లోయగుండానే ఉంటుందన్న విషయం దేశపటాన్ని చూసీచూడ్డంతోనే తెలుస్తుంది. దీనాపూర్, బెనారెస్, మీర్జాపూర్‌లనూ, అన్నిటికంటే ముఖ్యంగా నిజమైన యుద్ధచర్యలు ఆరంభించడానికి కీలక స్థానం అయిన అలహాబాద్‌నూ, పటిష్ఠంచెయ్యవలసి ఉంటుంది. అసలు బెంగాల్ రాష్ట్రంలోనే చిన్నచిన్నవైనట్టి, యుద్ధవ్యూహరచన దృష్ట్యా ఏమంత ప్రాధాన్యత వహించనట్టి స్థావరాలనుండి అక్కడున్నట్టి రక్షణసేనలను తీసివేసి వాటిని ఈ నగరాలకు తరలించుతే వీటికి బలం చేకూరుతుంది. ఈ క్షణంలో ఈ ప్రధాన యుద్ధచర్యశ్రేణే గొప్ప ప్రమాదస్థితిలో పడిందనే విషయం లండన్ "Daily News" పత్రికలో బొంబాయినుండి పంపబడిన ఒక ఉత్తరంనుండి ఈ దిగువ ఉల్లేఖించిన ఖండం తెలియజేస్తూంది:

> "దీనాపూర్‌లో యిటీవల జరిగిన మూడు రెజిమెంట్ల తిరుగుబాటు ఫలితంగా, అలహాబాద్‌కీ కలకత్తాకీ వున్న రాకపోకలు (నదిమీద స్టీమర్లద్వారా తప్ప) కట్టుబడిపోయాయి. ఇటీవల జరిగిన ఘటనలన్నింటిలోనూ దీనాపూర్ తిరుగుబాటే అత్యంత ప్రమాదభరితమైనది; దీని ఫలితంగానే కలకత్తాకు 200ల మైళ్ల చుట్టుపక్కలవున్న బీహార్ జిల్లా యావత్తూ ఇప్పుడు కుతకుత మండిపోతూంది. సంథాలులు మళ్లీ మరొకసారి తిరుగబడుతున్నారని ఇవేళ వార్తలు అందేయి; రక్తం ఒలికించడమన్నా, కొల్లగొట్టడమన్నా, ఇళ్లు తగలబెట్టడమన్నా మహదానందం పొందే 1,50,000 ఆటవికుల పాలబడిన బెంగాల్ పరిస్థితి నిజంగా భయోత్పాతజనకంగా ఉంటుంది."

ఆగ్రా పట్నం శత్రువశం కాకుండా నిలబడినంతవరకూ, బొంబాయి సైన్యానికి ఇందూర్, గ్వాలియర్ నగరాలనుండి ఆగ్రాకున్న రవాణామార్గాలూ, మద్రాసు సైన్యానికీ పంజాబ్ సైన్యానికీ గ్వాలియర్ సాగర్ నగరాలనుండి ఆగ్రాకున్న రవాణామార్గాలూ వున్నకారు

యుద్ధచర్యశ్రేణులుగా ఏర్పడుతాయి; అలహాబాద్‌లో వుండి పోరాడుతూన్న సైనిక విభాగానికీ పంజాబ్ సేనకీ ఈ నగరంతో వున్న రవాణా మార్గాలను తిరిగి నెలకొల్పడం కూడా అవసరమౌతుంది. అయితే మధ్య ఇండియాలో ఇంతవరకూ ఊగిసలాడుతూన్న సంస్థానాధీశులు ఇంగ్లీషువారికి ఎదురుతిరిగినట్టు బాహాటంగా ప్రకటించుతేనూ, బొంబాయి సైన్యంలో కనబడిన తిరుగుబాటు ప్రమాదభరితమైన రూపాన్ని ధరించిన పక్షంలోనూ, సైనికచర్యలను గురించి వేస్తూన్న లెక్కలన్నీ తల్లకిందులై తీరగా, కాశ్మీర్‌నుండి కన్యాకుమారివరకూ బ్రహ్మాండమైన జనసంహారం నిశ్చయంగా జరిగితీరుతుందని మాత్రం చెప్పడానికి వీలుంది. మహా అయితే, నవంబరులో చేరవలసి వున్న యూరపియన్ సేనలు చేరేవరకూ అంతిమ ఘటనలకోసం కాలహరణం చేస్తూండడం ఒక్కటే అన్నిటికంటె ఉత్తమ మార్గం. దీనికైనా అవకాశం ఉంటుందో ఉండదో సర్ కోలిన్ కాంబెల్ ఉపజ్ఞపై ఆధారపడి వుంటుంది; ఇతని వ్యష్టి పరాక్రమం తప్ప ఇతని గురించి యింతవరకు మరేదీ మనకు తెలియదు. తాను ఆక్రమించుతూన్న స్థానానికి గనుక ఇతను తగినవాడే అయితే, పరిస్థితులు ఎంత విషమంగా పరిణమించినప్పటికీ, ఢిల్లీ పతనమైనా సరే కాకపోయినా సరే, యుద్ధభూమిమీద దిగడానికి వీలు పడేందుకుగాను ఎంత చిన్నదైనా సరే, పోరాట దళాన్నొకదాన్ని ఇతడు సృష్టించి తీరుతాడు. ఐనప్పటికీ అంతిమనిర్ణాయక శక్తి బొంబాయి సేన చేతిలోనే ఉందని మాత్రం మరొకసారి మేము చెప్పితీరాలి.

మార్క్స్‌చే 1857 అక్టోబరు 6న
రచించబడింది

"New-York Daily Tribune"
1857 అక్టోబరు 23వ తేదీన
5151వ సంచికలో
ఒక సంపాదకీయ వ్యాసంగా
ప్రచురించబడింది

# మార్క్స్

## *ఇండియాలో తిరుగుబాటు

ఢిల్లీ పతనమైందనే ముఖ్యమైన వార్తను స్టీమరు "అరేబియా" తీసుకొచ్చిన టపా అందించింది. మనకందిన కొద్దిపాటి వివరాలనుబట్టి యోచించి చూడగా, తిరుగుబాటుదార్లలో లేచిన తీవ్రమైన అంతఃకలహాలూ, ప్రత్యర్థిపక్షాల సంఖ్యానిష్పత్తుల్లో కలిగిన మార్పూ, జూన్ 8 నాటికే వచ్చిచేరుతుందని నిరీక్షించబడిన ముట్టడి ఫిరంగి శ్రేణి సెప్టెంబరు 8న అందడమూ, ఇవన్నీ ఏకసమయంలో సంభవించడమే ఈ ఘటనకు కారణమైనట్టుగా కనబడుతూంది.

నికల్సన్‌కింద వున్న అదనపుబలం వచ్చిచేరుకున్న తర్వాత ఢిల్లీ ఎదుట మోహరించి వున్న సైన్యంలో మొత్తం 7,521 మంది వుంటారని మనం అంచనావేశాం;* ఈ అంచనా సరిగానే ఉన్నట్టు దరిమిలాను పూర్తిగా ధ్రువపడింది. రాజా రణ్‌బీర్ సింగ్ బ్రిటిష్‌వారి సహాయార్థం పంపిన 3,000ల కాశ్మీర్ సైనికబలమూ వారికి అందిన తరువాత బ్రిటిష్ సైన్యంలో ఉన్నవారి సంఖ్య మొత్తం సుమారు 11,000లకు పెరిగిందని "Friend of India"[67] వార్తాపత్రిక రాస్తూంది. రెండోపక్క, తిరుగుబాటుదార్ల సంఖ్య 17,000ల వరకూ పడిపోయిందనీ, ఇందులో 5,000 అశ్వసైనికులనీ లండన్ పత్రిక "Military Spectator"[68] తెలియజేస్తూండగా, "Friend of India" వార్తాపత్రిక తిరుగుబాటుదార్ల సైనిక సంఖ్య అంచనావేస్తూ, 1,000 ఇర్రెగ్యులర్ అశ్వికులతోసహా వీరి సంఖ్య 13,000లవరకూ ఉంటుందని లెక్కచెబుతూంది. కోటగోడలలో ఒకసారి ఎప్పుడైతే గండి కొట్టగల్గారో ఆ మరుక్షణంనుండి గుర్రాల ఉపయోగం శూన్యమైపోయింది; ఇక నగరంలోనే యుద్ధం ప్రారంభమైన ఫలితంగా, ఇంగ్లీషువారు నగరంలో అడుగుపెట్టీ పెట్టడంతో అశ్వసైనికులు తప్పించుకుని పారిపోయారు; ఇందువల్ల "Military

---

* ఈ సంకలనంలో 118వ పుట చూడండి. — సం.

Spectator" చేసిన అంచనా ఒప్పుకొన్నా, లేక "Friend of India" చేసిన అంచనా ఒప్పుకొన్నా సిపాయిల మొత్తం సంఖ్యాబలం 11,000కుగాని 12,000కుగాని మించి వుండదని మాత్రం మనం చెప్పవచ్చు. తమ సంఖ్య పెరగడంవల్ల కాకపోయినా, ఎదుటివారి సంఖ్య తరిగిపోవడంవల్ల తిరుగుబాటుదార్ల సంఖ్యతో ఇంగ్లీషువారి సంఖ్య సమానమైంది; తమ సంఖ్యే కొద్దిగా తక్కువగా ఉన్నప్పటికీ, జయప్రదంగా జరిపిన ఫిరంగిదాడివల్ల చేకూరిన మానసిక ఫలితాలవల్లనూ, ప్రమాదంలోపడిన దుర్గకైవార మంతటిపైనా నగర పరిరక్షకులు తమకున్న చాలీచాలని బలాలను సర్దవలసిన చిక్కుస్థితిలో ఉండగా, తమ ప్రధాన బలాలను ఒక్కుమ్మడి ఉపయోగించడానికి వీలైన స్థానాలు ఎంచుకొని వాటిపై ఎదురు దెబ్బ తీయగలిగే శక్తి కారణంగా చేకూరిన అనుకూల పరిస్థితులవల్లనూ, ఈ లోటు పూర్తిగా భర్తీ అయిపోయింది.

విధివిరామంలేకుండా తిరుగుబాటుదార్లు పదిరోజులపాటు చేసిన ఉధృతగతిదాడులవల్ల వారికి సంభవించిన అపారమైన జననష్టంకంటెనూ, అంతఃకలహాలవల్ల సైనిక విభాగాలకు సైనిక విభాగాలే కోటనుండి వైదొలగడంవల్లనే వారి సైనికసంఖ్య పడిపోవడానికి కారణమైంది. తాము గడించిన ధనంలో ఆఖరి రూపాయను కూడా పిండేయడం కారణంగా మనస్సు విరిగిపోయిన ఢిల్లీ వర్తకులలాగానే, ముసలిముద్ద అయి జీవచ్ఛవంలాగున వున్న ఢిల్లీ పాదుషాకి కూడా సిపాయిల పరిపాలనంటే విముఖత ఏర్పడగా, సిపాయిలలో హిందూ మహమ్మదీయ వైమనస్యాలు ప్రజ్వరిల్లడంవల్లనూ, ఆదివరకు కోటను రక్షిస్తూన్న సైనికబలాలకూ, కొత్తగా వచ్చిచేరిన అదనపుబలాల సైనికులకూ మధ్య వైషమ్యాలు పొడసూపడంవల్లనూ, పైపైనే ఏర్పడిన నిర్మాణైక్యత విచ్ఛిన్నమై, వారి పతనం తప్పని సరైంది. అయినప్పటికీ, సంఖ్యలో కొద్దిగా ఆధిక్యత కల్గినప్పటికీ, ఇంగ్లీషువారితో సమాన సంఖ్యలోనే ఇంగ్లీషువారితో పోరాడుతూవుండి, ఏకీకృతనాయకత్వం లేకపోవడం కారణంగానూ, బలహీనపడి నిస్పృహచెందినప్పటికీ ఏకధాటిని జరిగిన 84 గంటల ఫిరంగిగుళ్ల వర్షానికీ, ఆరురోజులపాటు దుర్గప్రాకారంలోపున నగరవీధుల్లో జరిగిన యుద్ధానికీ నిలబడి, ఆ తరువాత చడీ చప్పుడూ లేకుండా తిరుగుబాటుదారులు చల్లగా పడవలవంతెనపై యమున దాటడం చూస్తే, ఎంత ఇరకాటంలో పడినప్పటికీ తమ ప్రధాన సేనలతో చిట్టచివరకి కీడులో మేలన్నట్లు తప్పించుకు బైటపడ్డారని మాత్రం ఒప్పుకుతీరాల్సిందే.

నగరం పట్టుబడడం ఈవిధంగా జరిగినట్టు కనబడుతూంది: సెప్టెంబరు 8న, తమ మొదటి సైనిక స్థావరాలకంటెనూ ముందుకు పురోగమించిన స్థావరాలనుండిన్నీ, కోట గోడలకు 700ల గజాలకు ఎదుటనుండిన్నీ, ఇంగ్లీషువారి ఫిరంగులు ముట్టడి ప్రారంభించాయి. 8వ తేదీ, 11వ తేదీలమధ్య, బ్రిటిష్‌వారి భారీఫిరంగులూ, మోర్టారులూ మరింత దగ్గరగా తోసుకెళ్లి దుర్గప్రాకార రక్షకనిర్మాణాలలో చొచ్చుకుపోయి అక్కడ నిల

దొక్కుకుని, ఫిరంగిస్థానాలను నిర్మించుకున్నాయి; 10వ తేదీనా, 11వ తేదీనా ఢిల్లీ నగరరక్షక దళం రెండుసార్లు ఉధృతగమనదాడులు జరిపి, కొత్త ఫిరంగులను అమర్చుకోడానికై పదేపదే ప్రయత్నించుతూ, రైఫిల్ కందకాలనుండి తూటాలు పేల్చుతూ ఇంగ్లీషువారిని గొప్పగా చికాకుపరచినప్పటికీ, ఇంగ్లీషువారికి కొద్దిపాటి నష్టమే కల్గింది. 12వ తేదీన ఇంగ్లీషువారు మరణాలవల్ల గాయాలవల్ల 56 మంది సైనికులను నష్టపోయారు. 13వ తేదీ ఉదయాన కోటబురుజుపై తాత్కాలికావసరాలకై శత్రువు నిర్మించుకున్న ఒక మందు గుండుకొట్టునూ, తర్వారా శిబిరాలనుండి బ్రిటిష్ ఫిరంగుల గుళ్లవర్షం కురిసి మ్యాన్న ఫిరంగి శకటాన్ని ఇంగ్లీషువారు తమ ఫిరంగులతో పేల్చేశారు; అంతేకాకుండా బ్రిటిష్ ఫిరంగులు ఆ రోజున కాశ్మీర్ దర్వాజా సమీపంలో దుర్గకుడ్యాలను ఛేదించి, సైనికులు లోపలకు ప్రవేశించడానికి వీలైన గండి కొట్టగల్గాయి. 14వ తేదీని నగరంమీద సైనికదాడి ప్రారంభమైంది. కాశ్మీర్ దర్వాజాకు దగ్గరగా కొట్టగల్గిన గండి గుండా, ఏమంత తీవ్రమైన శత్రుప్రతిఘటనలేకుండానే నగరంలోకి సేనలు ప్రవేశించి, సమీపంలో వున్న పెద్దభవనాలు స్వాధీనపర్చుకుని, దుర్గప్రాకారాలను అంటిపెట్టుకుంటూనే మోరీబురుజు దగ్గరకూ, కాబూల్ దర్వాజా దగ్గరకూ పురోగమించాయి. ఇక్కడ తీవ్రమైన ప్రతిఘటనను ఎదుర్కోవలసి వచ్చింది, తత్కారణంగా నష్టాలు కూడా హెచ్చుగానే సంభవించాయి. తమ వశమైన కోట బురుజులపైనున్న ఫిరంగులను నగరముఖంగా తిప్పి ప్రయోగించడానికీ, ఇంకా ఇతర ఫిరంగులనూ మోర్టారులనూ కోటలోకి తీసుకొచ్చి ఉన్నత స్థానాలలో పెంకొల్పడానికి తగిన సన్నాహాలు ఇంగ్లీషువారు చేయసాగారు. 15వ తేదీన బర్న్, లాహోర్ బురుజులపై, మోరీ, కాశ్మీర్ బురుజులపైన వశపరచుకున్న ఫిరంగులను పేల్చడం ప్రారంభించారు. ఇది జరుగుతూండగానే మందుగుండుకొట్టు గోడల్లో గండికొట్టి, రాజమందిరంపై ఫిరంగులను పేల్చడం ప్రారంభమైంది. సెప్టెంబరు 16 పగటిపూట మందుగండుకొట్టుపై దాడిచేసి దానిని వశపర్చుకుని, దాని ఆవరణలోనుండి 17వ తేదీన రాజమందిరంపై మోర్టారు గుళ్లు ప్రయోగించడం మొదలుపెట్టారు.

ఈ తేదీన దాడి సంబంధమైన ఘటనలను గురించి అధికారయుతమైన వార్తలు హఠాత్తుగా ఆగిపోతున్నాయి; సింధుర్యాష్ట్రపు పొలిమేరలో పంజాబ్, లాహోర్ టపాలను దోచుకోవడమే దీనికి కారణమని "Bombay Courier"** పత్రిక కథనం. యావత్తు ఢిల్లీ నగరాన్ని 20వ తేదీ ఆదివారంనాడు స్వాధీనంచేసుకున్నట్టూ, ఆ రోజే తెల్లవారుజాము 3 గంటలకు తిరుగుబాటుదార్ల ప్రధాన సేనలన్నీ నగరంనుండి వైదొలగి పడవలవంతెనపై రోహిల్ఖండ్ దిశగా తప్పించుకొనిపోయినట్టూ, బొంబాయి గవర్నరుపేర అంతరంగికంగా రాసిన ఒక ఉత్తరాన్నిబట్టి తెలుస్తూంది. పదీతిరామ్మన్న సలీమ్ఘర్ను వశపర్చుకుంటేనేగాని శత్రువును వెంబడించడానికి బ్రిటిష్వారికి వీలుపడకపోవడంచేత, తమ తిరోగమనాన్ని రక్షిం

## ఇండియాకు పంపిన సైనిక బలాలు

1857 జూన్ 18 లగాయతు ఇంగ్లండుమండి ఇండియాకు పంపిన సైనిక బలాల జాబితా:

| చేరుకున్న తేదీలు | సైనికుల మొత్తం సంఖ్య | కలకత్తాకు | సింహళానికి | బొంబాయికి | కరాచీకి | మద్రాసుకి |
|---|---|---|---|---|---|---|
| సెప్టెంబరు 20 | 214 | 214 | – | – | | – |
| అక్టోబరు 1 | 300 | 300 | – | | – | – |
| అక్టోబరు 15 | 1,906 | 124 | 1,782 | – | | – |
| అక్టోబరు 17 | 288 | 288 | – | – | – | – |
| అక్టోబరు 20 | 4,235 | 3,845 | 390 | – | – | – |
| అక్టోబరు 30 | 2,028 | 479 | 1,544 | | – | – |
| అక్టోబరుకు వెరశి | 8,757 | 5,036 | 3,721 | – | | – |
| నవంబరు 1 | 3,495 | 1,234 | 1,629 | – | 632 | – |
| నవంబరు 5 | 879 | 879 | – | – | – | – |

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| నవంబరు 10 | 2,700 | 904 | 340 | 400 | 1,056 | |
| నవంబరు 12 | 1,633 | 1,633 | – | | – | |
| నవంబరు 15 | 2,610 | 2,132 | 478 | | | – |
| నవంబరు 19 | 234 | – | | – | 234 | |
| నవంబరు 20 | 1,216 | – | 278 | 938 | | |
| నవంబరు 24 | 406 | | 406 | – | – | – |
| నవంబరు 25 | 1,276 | – | – | – | | 1,276 |
| నవంబరు 30 | 666 | – | 462 | 204 | – | – |
| నవంబరుకు వెరశి | 15,115 | 6,782 | 3,593 | 1,542 | 1,922 | 1,276 |
| డిసెంబరు 1 | 354 | – | – | 354 | | – |
| డిసెంబరు 5 | 459 | – | – | 201 | | 258 |
| డిసెంబరు 10 | 1,758 | – | 607 | | 1,151 | |
| డిసెంబరు 14 | 1,057 | | – | 1,057 | | |
| డిసెంబరు 15 | 948 | | – | 647 | 301 | |
| డిసెంబరు 20 | 693 | 185 | | 300 | 208 | – |
| డిసెంబరు 25 | 624 | – | | | 624 | |
| డిసెంబరుకు వెరశి | 5,893 | 1,851 | 607 | 2,359 | 2,284 | 258 |

| చేరుకున్న తేదీలు | సైనికుల మొత్తం సంఖ్య | కలకత్తాకు | సింహళానికి | బొంబాయికి | కరాచీకి | మద్రాసుకి |
|---|---|---|---|---|---|---|
| జనవరి 1 | 340 | – | – | 340 | – | – |
| జనవరి 5 | 220 | – | – | – | – | 220 |
| జనవరి 15 | 140 | – | – | – | – | 140 |
| జనవరి 20 | 220 | – | – | – | – | 220 |
| జనవరికి వెరశి | 920 | – | – | 340 | – | 580 |
| సెప్టెంబరునుండి జనవరి 20వరకు | 30,899 | 12,217 | 7,921 | 4,431 | 4,206 | 2,114 |

<u>మెట్టమార్గాన పంపిన సైనిక బలాలు:</u>

| చేరుకున్న తేదీలు | సైనికుల మొత్తం సంఖ్య | కలకత్తాకు | సింహళానికి | బొంబాయికి | కరాచీకి | మద్రాసుకి |
|---|---|---|---|---|---|---|
| అక్టోబరు 2 | 235<br>ఆర్. ఇ.* | 117 | – | – | 118 | – |

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| అక్టోబరు 12 | 221 | 221 | – | – | – | – |
| అక్టోబరు 14 | ఆర్టి.** 224 ఆర్. ఇ. | 122 | – | – | 122 | – |
| అక్టోబరుకు వెరశి | 700 | 460 | – | – | 240 | – |

| | |
|---|---|
| వెరశి . . . . . . . . . . | 31,599 |
| కేవ్‌నుండి బయల్దేరిన వారిలో ఇండియాకు చేరినవారు . . . . . | 4,000 |
| వెరశి మొత్తం . . . . . . . | 35,599 |

* రాయల్ ఇంజనీర్లు. — వం.

** ఆర్టిలరీకి చెందినవారు. — వం.

ముకొనేందుకు అనువైన పరిస్థితులను కల్పించుకోడానికై, నగరం ఉత్తరపు చిట్టచివరనుండి ఆగ్నేయదిశగా 20వ తేదీవరకూ తిరుగుబాటుదార్లు తాపీగా యుద్ధంచేసుకుంటూనే వచ్చారన్న విషయం స్పష్టం.

ఢిల్లీ స్వాధీనమవడంవల్ల సంభవమయే ఫలితాలను గురించి, ప్రామాణికంగా ఎంచ దగిన "Friend of India" వార్తాపత్రిక ఇలా అభిప్రాయపడుతూంది:

> "ఢిల్లీ స్థితిగతులపైనగాక, బెంగాల్ పరిస్థితిపైనే ఈ సమయంలో ఇంగ్లీషు వారు తమ దృష్టిని కేంద్రీకరించాల్సి ఉంటుంది. ఆ నగరాన్ని ఇంతకంటె త్వరగా పట్టుకొని వుంటే అందువల్ల చేకూరి వుండే రవంతా ఇంత ఆలస్యం చేయడం వల్ల భ్రష్టమైపోయింది; పోతే నగర ముట్టడి ఇంకా జరుగుతూండడం ఫలితంగా శత్రుసంఖ్యా, వారిలో యుద్ధసమర్థులైనవారి సంఖ్యా ఎంతవరకూ తగ్గిపోయిందో, నగరం పట్టుకోవడం ఫలితంగా వారి సంఖ్య అంతవరకే తగ్గిపోయుండేది."

ఈ లోపున, కలకత్తానుండి ఈశాన్యదిశగా మధ్య ఇండియాగుండా పశ్చిమోత్తరందాకా తిరుగుబాటు వ్యాపించుతూందని వార్తలొస్తున్నాయి; ఇక అటు మాజీ రాజా పురందర్ సింగ్‌కు తిరిగి రాజ్యం ఇచ్చెయ్యాలని బాహాటంగా ప్రతిపాదించుతూ బలమైన పూర్బియుల[70] రెజిమెంట్లు రెండు తిరుగుబాటు చేశాయి; కువర్ సింగ్ నాయకత్వాన దీనాపూర్, రంగ్‌పూర్ తిరుగుబాటుదార్లు బాందా, నాగోడ్ వూళ్లమీదుగా జబ్బల్‌పూర్ దిశగా సాగిపోతూ, తన సొంత సైన్యాల బలవంతంవల్లనే రేవా రాజాను కూడా తమతో చేరేటట్టుగా చేశాయి. ఇక జబ్బల్‌పూర్‌లోనే 52వ బెంగాల్ దేశీయ రెజిమెంటు తమ కంటోన్మెంట్లను వదిలిపెట్టేసి, ఇంకా అక్కడే వుండిపోయిన తమ సహచరులకు హాని సంభవించకుండా ఉండేందుకని ఒక బ్రిటిష్ ఆఫీసరును హామీబందీగా తమతో తీసుకుపోయింది. గ్వాలియర్ తిరుగుబాటు దార్లు చంబల్‌నది దాటి, నదికీ ధోల్‌పూర్‌కూ మధ్యగా ఎక్కడో దండువిడిశారని అంటున్నారు. వార్తలలో ముఖ్యమైన వాటిని గమనించుదాం. జోధ్‌పూర్ దండు బేవార్‌కి నైరుతిదిశగా 90 మైళ్ల దూరంలో వున్న ఆర్వా రాజాకింద కొలువు కుదురుకున్నారనీ, వీరిపై జోధ్‌పూర్ రాజా పంపిన సైనికబలాలను వీరు ఓడించేశారనీ, ఆ యుద్ధంలో జనరలూ, కెప్టెన్ మంక్ మేసనూ మరణించారనీ, మూడు ఫిరంగులు పట్టుబడ్డాయనీ వార్తలు. నసీరాబాద్ బలా లలో కొందరిని తీసుకొని జనరల్ జి. సెంట్ పి. లారెన్స్ వీరిమీదకు పురోగమించి ఒక పట్ట ణంవరకూ వీరిని తిరోగమింపజేశాడనీ, కాని ఆ పట్టణాన్ని వశపర్చుకోవడంలో మాత్రం అతను విఫలుడయాడనీ వార్తలు తెలియజేస్తున్నాయి. సింధుర్యాష్ట్రంనుండి యూరపియన్ సేనలన్నింటినీ తరలించివేయడం ఫలితంగా విస్తృతమైన కుట్ర ఒకటి వ్యాపించి, ఒక

దానికొకటి ఎంతో దూరంలో వున్న హైదరాబాద్, కరాచీ, షికార్‌పూర్‌లతోబాటు ఐదు చోట్ల తిరుగుబాటు సంభవించింది. పంజాబ్‌లో కూడ ఆందోళన సూచనలున్నాయి, అక్కడ ముల్తాన్‌నుండి లాహోర్‌కు వెళ్లే రహదారీమార్గం ఎనిమిది రోజులపాటు తెగిపోయింది.

జూన్ 18 లగాయతు ఇంగ్లండునుండి పంపించిన సైనికబలాలను తెలుపుతూన్న ఒక పట్టికను వేరొకచోట ఇస్తున్నాం; ఇందులో చూపిన ఆయా స్టీమర్లు చేరే తేదీలు అధికార యుత ప్రకటనల ఆధారంపైనే మేము లెక్కకట్టాం కాబట్టి అవి బ్రిటిష్ ప్రభుత్వానికే అనుకూలంగా ఉంటాయి.[71] మెట్టమార్గంమీదుగా పంపించినట్టి చిన్న ఆర్టిలరీ ఇంజనీరు దళాలమాట అటుంచి, స్టీమర్లమీద పంపిన సైనికుల మొత్తంసంఖ్య 30,899 అనీ, ఇందులో 24,884 ఇన్‌ఫెంట్రీ, 3,826 కేవల్‌రీ, 2,334 ఆర్టిలరీలకు చెందినవారనీ తెలుస్తూంది. అక్టోబరు ఆఖరుముందు పెద్ద సంఖ్యలో అదనపుబలాలు అక్కడకు చేరే అవకాశంలేదని కూడా ఈ పట్టికనుండి తెలుస్తూంది. (126–127 పుటల్లో పట్టిక చూడండి.)

మార్క్స్‌చే 1857 అక్టోబరు 30న
రచించబడింది

"New-York Daily Tribune"
1857 నవంబరు 14వ తేదీన
5170వ సంచికలో
ఒక సంపాదకీయ వ్యాసంగా
ప్రచురించబడింది

# ఎంగెల్స్

## *ఢిల్లీ ఆక్రమణ

ఢిల్లీని తుపానుదాడిచేసి పట్టుకున్న సైనికుల ధైర్యసాహసాలను నేడు గ్రేట్ బ్రిటన్‌లో ఆకాశానికి ఎత్తేస్తూ, అదేపనిగా గొంతుకచించుకుని పొగడుతూన్న భట్రాజుమేళంలో మేము పాల్గొనదల్చుకోలేదు. ఆత్మస్తుతి చేసుకోవడం విషయంలో, అందులోనూ ముఖ్యంగా ధైర్య సాహసాలను గురించి చెప్పుకొనేటప్పుడు, ఇంగ్లీషువాళ్లముందు ఎవ్వరూ, కొసకి ఫ్రెంచి వాళ్ళు సహితమూ, పోటీకి నిలబడలేరు. అసలు వాస్తవవిషయాలను పరిశీలించినట్లయితే, మాటకి తొంభైతొమ్మిది సందర్భాల్లో, ఈ సాహసకృత్యాల్లో వున్న మహత్తు అంతా మామూలు కాడికే దిగజారిపోతుంది; కడుపులో చల్ల కదలకుండా తన పెళ్లాంబిడ్డలతో ఇంట్లో కూచుని, యుద్ధంలో కీర్తిగడించుకునే అవకాశం పేరుచెబితేనే ఆమడదూరంలో నిలబడి చెవులు మూసు కొనే ఇంగ్లీషు pater familias,* ఢిల్లీమీద జరిగిన దాడిలో ప్రదర్శించబడినట్లే, అప మానమైనది కాకపోయినా, నిస్సంశయమైన పరాక్రమంలో తాను కూడా స్వయంగా భాగస్వామి అయినట్టుగానే పటిస్తూ, ఈవిధంగా ఇతరులు చూపిన ధైర్యాన్ని తన సొంతసరకుగానే భావించి అమ్మజావడాన్ని ఇంగితజ్ఞానంవున్న ప్రతివారూ చూసి అసహ్యపడకమానరు.

ఢిల్లీని సెవస్తొపోల్‌తో పోల్చిచూస్తే, సిపాయిలకీ రష్యన్లకీ ఎక్కడా పోలికేలేదనీ; బ్రిటిష్ కంటోన్మెంట్లపై వారు చేసిన ఉధృతగతి దాడులలో ఒకటైనా ఇంకెర్‌మన్‌తో[79] ఏమూలా సాటిరాదనీ; టోట్‌లేబెన్‌తో సమానుడైన వాడెవ్వడూ ఢిల్లీలో అసలు కానరానే లేదనీ అనీ; ఇంచుమించు ప్రతి సందర్భంలోనూ సిపాయిలలో ప్రతి సైనికుడూ, ప్రతి దళమూ ధైర్యమే ప్రదర్శించినప్పటికీ, బ్రిగేడ్లు, డివిజన్లకేకాదుకదా ఇంచుమించు బటాలియన్లకి సహితమూ నాయకత్వమన్నది లవలేశమూ లేకపోయిందనీ; వారికున్న ఐక్యతంతా కంపెనీలకే పరిమితమై దానిని దాటి మించలేదనీ; నేడు ఏది కొరవడితే ప్రతి సేనా కూడా నిరాధారమైన

---

* గృహయజమాని. — సం.

స్థితిలోనూ, నగరరక్షణ కేవలం నిరాశాజనకంగానూ ఉంటుందో అట్టి శాస్త్రీయ అంశం వారిలో బొత్తిగా లోపించిందనీ మనం సహజంగానే అంగీకరించుతాం. అయినప్పటికీ సంఖ్యలోనూ యుద్ధసాధనాల్లోనూ వ్యత్యాసమూ, శీతోష్ణస్థితికి తట్టుకోవడంలో యూరపియన్లకంటె సిపాయిల అధిక్యతా, ఢిల్లీకి ఎదురుగా విడిసివున్న సైనికబలం ఒక్కొక్క సమయమప్పుడు అత్యంత బలహీన స్థితివరకు తగ్గించివేయబడడమూ, ఈ తేడాలలో చాలా వాటిని భర్తీ చేయడంవల్ల ముట్టడులను రెండింటినీ (ఈ యుద్ధచర్యలను ముట్టడులు అని భావించినయెడల) ఒకదానితో ఒకటి సరిపోల్చడానికి వీలు కల్గుతూంది. అన్ని యుద్ధాల్లో లాగానే ఈ యుద్ధంలో కూడా ఇరుపక్షాలలోనూ వ్యక్తి సాహసకృత్యాలు నిస్సందేహంగా ప్రదర్శించబడినప్పటికీ, ఢిల్లీపై తుపానుదాడిచేసి పట్టుకోవడం అపూర్వమైన కార్యమనిగాని, అసమాన వీరోచిత పరాక్రమ కృత్యమనిగాని మేము భావించడంలేదు. సెవస్తొపోల్, బాలక్లావా[73]ల మధ్య పరీక్షలో ఇంగ్లీషు సైన్యంకంటెనూ ఢిల్లీముందు నిలబడిన ఆంగ్లో-ఇండియన్ సైన్యమే హెచ్చు పట్టుదలనూ మనోబలాన్నీ ప్రదర్శించిందనే మేము గట్టిగా చెప్పగలం. ఇంకెర్మన్ యుద్ధం జరిగినవెంటనే ఇంగ్లీషు సైన్యం నావలెక్కి వెళ్లిపోవడానికి సిద్ధమై అందుకు ఎట్టి అభ్యంతరమూ తెలపలేదు; ఫ్రెంచివారు ఇష్టపడక పోవడంవల్లగాని, లేకుంటే ఇంగ్లీషువారు తప్పకుండా వెళ్లిపోయే ఉండేవారు కూడాను. ఋతుపరిస్థితులూ, వాటిఫలితంగా సంభవించే జాడ్యాలూ, రవాణా మార్గాలు ఛిన్నాభిన్నమైపోవడమూ, అదనపు బలాలు త్వరగా అందే అవకాశాలు శూన్యమైపోవడమూ, ఉత్తర హిందూస్థానంలోని పరిస్థితులూ, ఇవన్నీ తమ సైన్యం వైదొలగడానికే అనుకూలంగా వుండి, నిజానికి కూడా ఈ చర్యే సముచితంగా ఉన్నట్టు ఇంగ్లీషువారికి కనబడినప్పటికీ, తమ స్థానాలలో వారు నిలదొక్కుకునే ఉండిపోయారు.

తిరుగుబాటు అత్యుచ్ఛదశలో ఉన్నప్పుడు ఉత్తర హిందూస్థానంలో అన్నిటికంటె ప్రధానంగా చలనసామర్థ్యాన్ని కలిగిన సైనిక దళాలు అత్యవసరమయ్యాయి. ఈవిధంగా ఉపయోగింప వీలువడే సైనిక దళాలు అప్పట్లో రెండే రెండున్నాయి — హావ్‌లక్‌కింద వున్నట్టీ, ఈ కర్తవ్యనిర్వహణకు ఏమూలా చాలదని త్వరలోనే తేలిపోయినట్టీ, స్వల్పసంఖ్యాబలమూ, రెండవది ఢిల్లీకి ఎదురుగా నిలబడివున్న సైనికబలమూ. ఇలాంటి పరిస్థితులలో, ఎదుర్కొన వీలులేని శత్రువుతో యుద్ధంలోకి నిరర్థకంగా దిగుతూ బలాన్నంతనీ ఈ రీతిగా వ్యర్థం చేసుకోవడం మిలిటరీ శాస్త్రదృష్ట్యా పొరపాటే అన్న విషయమూ; చలనరహితంగా వున్న సైన్యంకంటె, ఆ సైన్యమే చలనశక్తిని కల్గివుంటే దానికి వార్లంతలు విలువ ఉంటుందన్న విషయమూ; ఢిల్లీ మినహా ఉత్తర హిందూస్థానమంతా శత్రురహితం చేయడమూ, రవాణా మార్గాలు పునఃస్థాపించడమూ, తమ సైనికబలం కేంద్రీకరించుకోవడానికై తిరుగుబాటుదార్లు పదేపదే కావించిన ప్రతి ప్రయత్నాన్నీ వమ్ముచేయడమూ సాధించబడి ఉండే

వని, వీటితోపాటు వీటి స్వభావసిద్ధమూ సులభమూ అయిన ఫలితంగానే ఢిల్లీ పతనం కూడా సంభవించి ఉండేదనీ నిర్వివాదములైన విషయాలే. అయినప్పటికీ ఢిల్లీ ముట్టడిని ఎత్తివేయజాలని రాజకీయ కారణాలు ఏర్పడ్డాయి. ఒకసారి ఢిల్లీకి ఎదురుగా చేరుకున్న తరువాత, పట్టినపట్టు వదలకుండా అక్కడే నిలదొక్కుకుని ఉండిపోయినందుకు తప్పుపట్టవలసింది సైన్యాన్నికాదు, సైన్యాన్ని ఢిల్లీకి పంపించిన సైనిక హెడ్క్వార్టర్సులోని పండితమ్మన్యులనే. అయితే ఈ సైన్యానికి వర్షాకాలంవల్ల కలిగిన నష్టాలు మొదట అనుకున్నకంటె చాలా తక్కువగానే ఉన్నాయనీ, ఈ కాలమాన పరిస్థితులలో యుద్ధచర్యలు అవలంబించడం ఫలితంగా మామూలుగా సంభవించే జబ్బులు ఏ మాత్రం సంభవించివుండినా, సైన్యం వైదొలగడమో, లేదా ఏకంగా సైన్యాన్నే ఎత్తివేయడమో అనివార్యమయే ఉండేదని మాత్రం ఇదే సమయంలో చెప్పితీరాలి. ఆగస్టు చివరివరకూ ఈ గడ్డు పరిస్థితులనే సైన్యం ఎదుర్కోవాల్సి వచ్చింది. అంతః కలహాలు తిరుగుబాటుదార్ల శిబిరాన్ని బలహీనపరచడం సాగుతూన్న వేళకు ఇంగ్లీషు సైన్యానికి అదనపుబలాలు చేరడం ప్రారంభమైంది. సెప్టెంబరు మొదటలో ముట్టడి ఫిరంగి దళం అందింది; తత్ఫలితంగా అంతవరకూ దెబ్బకాచుకోవలసిన పరిస్థితల్లా దెబ్బతీయగలిగే పరిస్థితిలోకి మారింది. సెప్టెంబరు 7న మొదటి బేటరీ ఫిరంగులు పేల్చడం మొదలుపెట్టింది; 13వ తేదీ సాయంకాలానికి, మనుష్యులు చొరబడ్డానికి వీలుగావుండే గండ్లు రెండింటిని చేయడానికి వీలైంది. ఈ వ్యవధిలో ఏంజరిగిందో మనమిప్పుడు పరిశీలించుదాం.

జనరల్ విల్సన్ అధికారయుతంగా పంపిన సమాచారలేఖపైనే ఇందుకు మనం ఆధారపడవలసివస్తే మనపని అధ్వానంగానే వుండేది. క్రైమియాలో ఇంగ్లీషు సైనిక హెడ్క్వార్టర్స్ నుండి వెలువడిన అధికారయుతమైన నివేదికలు ఎంత అయోమయంగా ఉండినవో, ఈ నివేదిక కూడా అంత అయోమయంగానే ఉంది. కోటగోడల్లో చేసిన గండ్లు రెండూ సరిగ్గా ఎక్కడున్నాయో ఆ విషయంగాని, తుపాసుదాడిచేయడానికి నియమించబడిన శ్రేణులు ఏయే స్థానాలనుండి బయలుదేరాయో, ఏ వరుసక్రమంలో వాటిని ఏర్పాటుచేశారో ఆ విషయంగాని ఈ నివేదికనుండి తెలుసుకోవడం మనుష్యమాత్రుడికి ఎవ్వడికీ సాధ్యంగాదు. ఇక సహజంగానే అయోమయంగా వున్నాయి ప్రైవేటు నివేదికలు. అదృష్టవశాత్తూ, నైపుణ్యమూ, శాస్త్రజ్ఞానమూ కల్గినట్టీ, ఇంచుమించు ఈ జయమంతకూ శ్లాఘనీయుడని చెప్పదగినట్టి బెంగాల్ ఇంజనీర్లూ, ఆర్టిలరీకి చెందిన ఆఫీసరు ఒకడు, జరిగిన కార్యకలాపం అంతటి గురించీ ఒక నివేదికను "Bombay Gazette"[74] పత్రికలో ప్రచురించాడు. ఈ నివేదిక ఎంత స్పష్టంగానూ, ఎంత వ్యవహార సరళిలోనూ ఉందో అంత సుబోధకంగానూ, నిరాడంబరంగానూ ఉంది. క్రైమియా యుద్ధమంతటిలోనూ ఈ మాత్రం అర్థవంతమైన నివేదిక తయారుచేయగల్గే ఇంగ్లీషు ఆఫీసరు ఒక్కడైనా కనబడలేదు. దురదృష్టవశాత్తూ

దాడి మొదటి రోజునే ఈ ఆఫీసరుకు గాయాలు తగలడంచేత ఇతని నివేదిక అంతటితో ఆగిపోయింది. ఇందుచేత ఆ తరువాత జరిగిన విషయాలను గురించి మనకింకా అంధకారంగానే ఉంది.

ఆసియా సైన్యం ఏదైనా సరే చేసే ముట్టడిని ప్రతిఘటించడానికి వీలయేమేరకు ఢిల్లీ నగరరక్షణలను పటిష్ఠంచేశారు ఇంగ్లీషువారు. మన ఆధునిక భావాలనుబట్టి ఢిల్లీ ఒక దుర్గమని చెప్పడానికి వీల్లేదు; అది కేవలం రణరంగంలో యుద్ధసైన్యంయొక్క సరాసరి శక్తివంతమైన దాడికి నిలబడేటట్లుగా రక్షించబడిన స్థలమని మాత్రమే చెప్పాలి. దాని రాతికట్టు ప్రాకారపుగోడ 16 అడుగుల ఎత్తూ, 12 అడుగుల మందమూ కలిగివుంది; గోడకి మకుటంగా 3 అడుగుల మందమూ, 8 అడుగుల ఎత్తూ గల అడ్డగోడ ఒకటుంది. దాడిచేస్తూన్న శత్రువుయొక్క ఫిరంగికాల్పులకు అనువుగా ఈ అడ్డగోడ ఒక్కటేకాకుండా, కోటగోడకి ముందుండే ఏటవాలు రక్షణప్రదేశంచే కాపాడబడనట్టే, దాడిచేసేవారి సరాసరి కాల్పులను తట్టుకోవలసి వున్నట్టి 6 అడుగుల రాతికట్టు కూడా కోటగోడముందుంది. ఈ రాతికట్టు రక్షణదిబ్బ ఇంత సన్నంగా ఉండడంచేత ఒక్క కోటబురుజులలోనూ, మార్టెల్లో గోపురాల్లోనూ తప్ప మరెక్కడా ఫిరంగులు ఉంచడానికి వీలుగాలేదు. ఇవి కర్టెన్ (అడ్డగోడ)కు పూర్తిగా పార్శ్వన వుండకపోవడంవల్ల ఏమంత సంపూర్ణ రక్షణను ఇవ్వడంలేదు; 3 అడుగుల మందంగల రాతికట్టు అడ్డగోడను ముట్టడిఫిరంగులు దెబ్బమీద దెబ్బకొట్టి సులభంగా పడగొట్టగలవు కాబట్టి (సేనా ఫిరంగులే ఈ పని చేయగలుగుతాయి), దుర్గంలో వున్న రక్షకసైన్యంయొక్క ఫిరంగి కాల్పులను, అందులోనూ ముఖ్యంగా కందక పార్శ్వం నుండి వచ్చే ఫిరంగికాల్పులను, కట్టించివేయడం అతిసులభమైన పని. దుర్గప్రాకారానికీ కందకానికీ మధ్య, వెడల్పు తినె, లేక చదునైన రోడ్డు ఒకటుండడంవల్ల, కోట ప్రాకారంలో అనువైన గండి కొట్టడానికి సులువు దొరుకుతూంది; ఈ పరిస్థితులలో ఈ కందకం, దానిలో చిక్కుకున్న దాడిసేనకు coupe-gorge*గా ఉండడం బదులు, కోటగోడముందుండే ఏటవాలు ప్రదేశంమీదుగా పురోగమించుతూ చిందరవందరగా చెదిరిపోయిన తన శ్రేణులను పునర్నిర్మించుకోవడానికి వీలుగా వుండే విశ్రాంతి ప్రదేశంగా ఏర్పడింది.

ముట్టడిసూత్రాల ప్రకారం విధిగా వుండవలసినట్టి మొట్టమొదటి షరతు, అనగా అన్నివైపులనుండీ ముట్టడి చేయడానికి అవసరమైన సేనాబలం ఉన్నప్పటికీ కూడా యథావిధిగా ఏర్పాటుచేసుకున్న కందకాలు నిర్మించుకొని ఇటువంటి దుర్గంమీదకి పురోగమించడము కేవలం పిచ్చిపనే అయి వుండేది. దుర్గరక్షణ పరిస్థితులు, దుర్గరక్షక సైన్యాల నిర్మాణ రాహిత్యమూ, వాటి మనోదౌర్బల్యస్థితి, వీటన్నిటిదృష్ట్యా ముట్టడిదార్లు వాస్తవంగా అవ

* దోమ. — సం.

లంబించిన దాడివిధానంతప్ప మరేవిధానాన్ని వారు అవలంబించి ఉండినా అది కేవలం శుద్ధ తప్పిదమే అయివుండేది. బలోపేతమైన దాడి (attaque de vive force) అనే పారిభాషిక పదంకింద సైనికశాస్త్రవేత్తలకు ఈ విధానం సుపరిచితమే. భారీఫిరంగుల సహాయంలేనిదే బహిరంగదాడి చేయడం దుస్సాధ్యమయేటట్టి రక్షణ పరిస్థితులు మాత్రమే వుండడంవల్ల దుర్గరక్షక నిర్మాణాలపై మరే బెడదాలేకుండా ఆర్టిలరీయే తగినచర్య తీసుకుంది; ఇలాంటి పరిస్థితులలో, దుర్గంలోపలి ప్రదేశంపై నిరంతరమూ గుళ్లవర్షం కురిపించుతూ, దుర్గ ప్రాకారంలో అనువైన గండి కొట్టగల్గిన వెంటనే దాడిచేయడానికై సేనలు ముందుకు పురోగమించుతాయి.

ఇంగ్లీషు శిబిరానికి సరాసరి ఎదురుగావున్న ఉత్తరశ్రేణిపై దాడి ప్రారంభమైంది. ఈ శ్రేణిలో మూడు బురుజాలూ, వాటి మధ్య ఇటూ అటూ వున్న రెండు కర్టెన్‌లూ (అర్ధ గోడలూ) ఉన్నాయి; మధ్యబురుజా (కాశ్మీర్ బురుజా) దగ్గర కొద్దిగా లఘుకోణ రూపంలో ఉంది ఈ శ్రేణి. ఈ శ్రేణియొక్క తూర్పుస్థానం, అనగా కాశ్మీర్ బురుజానుండి నదీద్వారపు బురుజావరకూ వున్న భాగం, పొడుగులో కొంచెం చిన్నది; కాశ్మీర్, మోరీ బురుజాల మధ్యనున్న పశ్చిమస్థానానికి ఇది కాస్త ముందుకుంది. కాశ్మీర్ బురుజాకీ నదీద్వారపు బురుజాకీ ఎదురుగా వున్న స్థలంలో పలచగా వున్న కొద్దిపాటి చిట్టడవీ, తోటలూ, ఇళ్లూ వగైరాలున్నాయి; సిపాయిలు వీటిని నేలమట్టంచేయకుండా ఉంచేయడంవల్ల దాడిచేసే వారికి చక్కని మరుగు లభించింది. (కోటలో వున్న ఫిరంగులు పేలుతూనే ఉన్నప్పటికీ కూడా సిపాయిలను తరుము తరిమికొట్టడానికి ఇంగ్లీషువారికి ఏవిధంగా వీలయిందో ఈ సంగతి తెలియజేస్తుంది; అప్పట్లో ఇది అసమాన వీరోచితకృత్యంగా పరిగణించబడింది, కాని ఈ మరుగు స్థలాలు లభించినంత వరకూ ఏమాత్రం ప్రమాదములేని కార్యమిది.) ఇందుకుతోడు ఈ శ్రేణికి సుమారు 400 లేక 500 గజాల దూరంలో, కోటగోడ దిశలోనే లోతైన లోవ ఒకటుంది; ఇందుచేత దాడి దిశకు ఇది నైసర్గికమైన సమాంతరంగా ఉంది. ఇంగ్లీషు శ్రేణికి ఎడమవైపున నది వుండడంవల్ల, వారికిది మూల ప్రాతిపదికస్థానంగా ఏర్పడింది; ఈ కారణంగా కాశ్మీర్ బురుజా నదీద్వారపు బురుజాలవల్ల ఏర్పడిన చిన్న కోణపుమొనను దాడికి ప్రధానలక్ష్యంగా పెట్టుకున్నారు, ఇది అత్యంత సమంజసంగా ఉంది. పశ్చిమ కర్టెన్ (అర్ధగోడ) పైనా, బురుజాలపైనా ఏకసమయంలో కపటదాడి ప్రారంభించారు; ఈ ఎత్తుగడ ఎంత ఉమ్మ్రవదంగా కొనసాగిందంటే, దీనిని తిప్పికొట్టడానికే సిపాయిలు తమ ప్రధాన సైనికబలాన్ని వినియోగించారు. ఇంగ్లీషువారి కుడి పార్శ్వానికి ప్రమాదం కలిగించడానికని కాబూల్ దర్వాజా వెలుపలి శివార్లలో సిపాయిలు బలమైన దళాన్ని సమీకరించారు. మోరీ, కాశ్మీర్ బురుజాల మధ్య పశ్చిమంగావున్న కర్టెన్ (అర్ధగోడ) గనుక ప్రహరీభాగాలన్నిటికంటెనూ ప్రమాద స్థితిలో ఉండిన పక్షంలో సిపాయిల ఈ ఎత్తుగడ సరిగ్గానే ఉండి సత్ఫలితాలనే ఇచ్చివుండేది.

ముందుగానే ఈ దళం, దాడిజరిపే శ్రేణులలో ప్రతి శ్రేణి పార్శ్వంపైనా దెబ్బతీయగల్గి ఉండేది కాబట్టి, సిపాయిలు అవలంబించిన ఈ పార్శ్వపు స్థానం రక్షకసాధనంగా భేషుగ్గా వుండేది. కాని దీని ఫలితం తూర్పుదిశగా కాశ్మీర్, నదీద్వారపు బురుజుల మధ్యనున్న కర్టెన్ (అడ్డగోడ)వరకూ వ్యాపించి ఉండగలిగేదికాదు; తత్కారణంగా ఈ ప్రదేశాన్ని తమ విన్యాస స్థానంగా ఎంచుకోవడం మూలంగా తమ రక్షకబలాలలో శ్రేష్ఠమైన దళాలను కీలక స్థానంనుండి తీసివేసి ఇతరస్థలంలో మోహరించడమే అయింది.

ఫిరంగి స్థానాల ఎంపిక, వాటి నిర్మాణమూ, వాటిలో ఫిరంగులను నెలకొల్పిన విధానమూ, వాటిని ప్రయోగించిన విధమూ అత్యంత శ్లాఘనీయం. ఇంగ్లీషువారికి సుమారు 50 ఫిరంగులూ మోర్టారులూ ఉన్నాయి; వీటిని శక్తివంతములైన బేటరీలకింద వారు విభజించి, రాతికట్టుతో నిర్మించిన మంచి దృఢమైన అడ్డగోడలవెనుక నెలకొల్పారు. దాడి జరిగిన ఈ యుద్ధశ్రేణి విభాగంలో అధికారయుతములైన వార్తలనుబట్టి సిపాయిలకు 55 ఫిరంగులున్నట్లు తెలియవస్తోంది; కాని ఇవి చిన్న బురుజాల్లోనూ, మార్టెల్లో గోపురాల్లోనూ విడివిడిగా ఉండడం కారణంగా వీటిని సమన్వితచర్యకు వినియోగించడానికి ఏమాత్రమూ అవకాశంలేకపోయింది; అంతేకాకుండా మూడడుగుల చచ్చు అడ్డగోడ వాటికే మాత్రపు రక్షణమూ కలుగజేయలేకపోయింది. కొన్ని గంటల్లోనే రక్షకసైన్యాల ఫిరంగి కాల్పులు మూతబడిపోయి ఉండాలనేది నిస్సందేహమే; ఇక దీని తరువాత చేసేది మరేమీలేదు.

8వ తేదీనాడు నెం. 1 బేటరీలోవున్న 10 ఫిరంగులు గుళ్ళు పేల్చడం ప్రారంభించాయి; కోటగోడకి ఈ బేటరీ 700 గజాలదూరంలో ఉంది. పైన పేర్కొన్న లోయను ఆ రాత్రే ఒక తరహా సైనికకందకంగా నిర్మించుకున్నారు. 9వ తేదీన ఈ లోయకు ఎదురుగావున్న ఎగుడు దిగుడు ప్రదేశాన్నీ ఇళ్లనూ ఎట్టి ప్రతిఘటనా లేకుండానే స్వాధీనంచేసుకున్నారు; ఇక 10వ తేదీన నెం. 2 బేటరీలో వున్న 8 ఫిరంగులూ కార్యరంగంలోకి దిగాయి. ఈ బేటరీకీ కోటగోడకీ వున్న దూరం 500 లేక 600 గజాలే. నదీద్వారపు బురుజుకు ఎదురుగా 200 గజాలలోనే, చక్కని తెలివితేటలు ఉపయోగించి మంచి ధైర్యసాహసాలతో మిట్ట పల్లపు ప్రదేశంలో నిర్మించిన నెం. 3 బేటరీ, 11వ తేదీన ఆరు ఫిరంగులతో ముట్టడిని సాగించగా, పది భారీమోర్టారులు నగరంపై గుళ్లవర్షం కురిపించాయి. 13వ తేదీ సాయంకాలానికి, లగ్గపట్టుకు వీలుగావుండే రెండు గండ్లు — ఒకటి కాశ్మీర్ బురుజు సమీపంలోవున్న కర్టెన్ (అడ్డగోడ) కుడి పార్శ్వంలోను, రెండవది నదీద్వారపు బురుజు దక్షిణ ముఖమూ పార్శ్వంలోనూ — ఏర్పడ్డాయని నివేదించబడగా, దాడి ప్రారంభించవలసిందని ఆజ్ఞాపించారు. ప్రమాద స్థితిలో వున్న రెండు బురుజాల మధ్యనూ వున్న ఏటవాలు ప్రదేశంలో ప్రతిఘటనా నిర్మాణాన్నొకదాన్ని సిపాయిలు 11వ తేదీన నిర్మించి, ఇంగ్లీషు బేటరీలకు ఎదురుగా సుమారు మూడువందల యాభై గజాల దూరంలో సంకులసమరానికి వీలుగా వుండేందుకై ఒక

కందకాన్ని నిర్మించారు. శత్రుసేనల పార్శ్వంపై దెబ్బకొట్టడానికి వీలుగా వుండేందుకుగాను కాబూల్ దర్వాజా వెలుపల నిర్మించుకున్న ఈ స్థానాన్నుండి సిపాయిలు ముందుకు కూడా పురోగమించారు. కాని క్రియాశీలమైన ఈ రక్షణచర్యల నవలంబించడంలో ఎట్టి ఐక్యత గాని, పరస్పర సంబంధంగాని, దృఢసంకల్పంగాని లేకపోవడంచేత ఇవి పూర్తిగా నిష్ప్రయో జనములుగానే పరిణమించాయి.

14వ తేదీ తెల్లవారేటప్పటికల్లా ఐదు బ్రిటిష్ శ్రేణులు దాడిచేయడానికి పురో గమించాయి. ఒకటి కుడివైపునుండి — కాబూల్ దర్వాజాకి ఎదురుగా శత్రుసైన్యం నిల బడివున్న స్థానంనుండి — దాడిచేసింది. ఈ దాడి జయప్రదంగా కొనసాగిన పక్షంలో లాహోర్ దర్వాజాపై దాడిజరపవచ్చు. కోటగోడలో కొట్టిన రెండు గండ్లలో చెరి ఒక గండికి ఎదురుగా చెరి ఒక్క శ్రేణీ; కాశ్మీర్ దర్వాజా ద్వారాన్ని పేల్చివేసి దానిపై దాడి జరపడానికి ఒక శ్రేణీ పురోగమించాయి. మిగిలిన శ్రేణి నిల్వశ్రేణిగా ఉండిపోయింది. మొదటిది మినహా కడమ శ్రేణులన్నీ తమ కర్తవ్యాన్ని జయప్రదంగానే నిర్వహించాయి. గోడలలో చేయబడిన గండ్ల రక్షణ ఏమంత పట్టుదలతో జరగలేదు; కాని కోటగోడ సమీపంలో వున్న ఇళ్లదగ్గర మాత్రం అతి తీవ్రమైన ప్రతిఘటననే ఎదుర్కొనవలసి వచ్చింది. ఇంజనీర్ల దళంలో ఒక ఆఫీసరూ ముగ్గురు సార్జెంట్లూ ప్రదర్శించిన పరాక్రమం (ఇది మాత్రం యథార్థమైన పరాక్ర మమే) ఫలితంగా కాశ్మీర్ దర్వాజా తలుపులను పేల్చివేసి ఈ శ్రేణి కూడా నగరంలోనికి ప్రవేశించింది. సాయంకాలమయేసరికి ఉత్తర యుద్ధరంగం యావత్తూ ఇంగ్లీషువారి స్వాధీ నంలోకి వచ్చేసింది. ఇక్కడ మాత్రం జనరల్ విల్సన్ ఆగాడు. విచక్షణారహితమైన సంకులసమర రూపంలో జరుగుతూన్న దాడులు నిలిపివేసి, నగరంలో కట్టుదిట్టమైన ప్రతి స్థానం ఎదుటా ఫిరంగులు మోహరింపబడ్డాయి. మందుగుండుకొట్టుపై జరిగిన తుపానుదాడి మినహా మరెక్కడా కూడా చెప్పదగిన పోరాటమేమీ జరిగినట్టు కనబడదు. తిరుగుబాటుదార్లు నిరు త్సాహపడి, తండోపతండాలుగా నగరం వదిలివెళ్లిపోయారు. విల్సన్ జాగత్తగా నగరంలోపలికి ప్రవేశించాడు; కాని 17వ తేదీ తర్వాత చెప్పకోదగ్గ ప్రతిఘటనే లేకపోగా, 20వ తేదీకల్లా నగరాన్ని పూర్తిగా ఆక్రమించేసుకున్నాడు.

దాడిపై మా అభిప్రాయాన్ని ఇదివరకే తెలియజేశాం. ఒక నగర రక్షకసైన్యాల ప్రవర్తన గురించి: ఎదురుదాడి ప్రతిచర్యలు జరపడమూ, కాబూల్ దర్వాజా దగ్గర పార్శ్వపు స్థానం నిర్మరమకోవడమూ, ఎదురుప్రతిఘటనకై నిర్మాణాలు కట్టడమూ, రైఫిల్ కందకాలు ఏర్పాటు చేయడమూ, ఇవన్నీ కూడా సిపాయిలలో యుద్ధశాస్త్రీయ భావాలు ప్రవేశించాయన డానికి నిదర్శనాలే; కాని ఈ భావాలు వారికి స్పష్టంగా లేకపోవడంవల్లనో, వారి మనస్సు లలో అవి శక్తివంతంగా నాటుకోకపోవడంవల్లనో ఈ చర్యలను వేటినీ ఫలవంతంగా ఉం డేందుకై చివరకంటా వారు సాగించారుకారు. ఈ చర్యలు భారతీయుల ఊహల్లోనే పుట్టాయో,

లేదా వారితో వున్న యూరపియన్లే ఈ చర్యలనవలంబించవలసినదిగా వారికి సలహానిచ్చారో చెప్పడం సహజంగా కష్టమే; కాని ఒక్క విషయం మటుకు స్పష్టం: ఈ చర్యలు అసంపూర్తిగానే ఉన్నప్పటికీ, వాటి స్థలనిర్మాణ రచనలో మాత్రం సెవస్తోపోల్ క్రియాశీల రక్షణతో చాలా దగ్గరపోలికలనే ప్రదర్శిస్తున్నాయనీ, వీటి నిర్మాణవిధానాన్నిబట్టి యూరపియన్ ఆఫీసరెవడో సరైన పథకాన్ని తయారుచేసి సిపాయిలకు ఇచ్చివుంటాడనీ, కాని దాని భావం వారు సరిగా అర్థంచేసుకోలేకపోవడంవల్లనో, లేదా నిర్మాణ రాహిత్యం కారణంగానో, నాయకత్వం లోపించడంవల్లనో, ఆచరణయోగ్యమైన ఈ పథకాలు బలహీనములైనట్టే శక్తిహీనములైనట్టే ప్రయత్నాలుగానే ఉండిపోయాయి.

ఎంగెల్స్‌చే 1857 నవంబరు 16న
రచించబడింది

"New-York Daily Tribune"
1857 డిసెంబరు 5వ తేదీన
5188వ సంచికలో
ఒక సంపాదకీయ వ్యాసంగా
ప్రచురించబడింది

# మార్క్స్

# ముంచుకువస్తూన్న ఇండియన్ రుణం

లండన్, జనవరి 22, 1858

సాధారణ ఉత్పాదక మూలధనాలనుండి బ్రహ్మాండమైన పెట్టుబడి రాశిని వాపసు తీసుకుని, తదానుషంగికంగా వాటిని హామీ పత్రాల మార్కెట్లకి బదిలీ చేయడం ఫలితంగా లండన్ డబ్బు మార్కెట్టులో ఇంతవరకూ వున్న హుషారు, రాబోతూన్న సుమారు ఎనభై లక్షలా, లేదా కోటి పౌన్ల ఇండియన్ రుణం సంభావ్యత కారణంగా పక్షందివాలై కొద్దిగా మందగించింది. ఈస్ట్ ఇండియా కంపెనీ తన స్వదేశంలో వున్న రుణదాతలకు ఇవ్వవలసిన వాయిదా మొత్తాలు చెల్లించడంకోసమూ, ఇండియాలో జరిగిన తిరుగుబాటు మూలంగా యుద్ధసామగ్రులూ, ఇతర యుద్ధ సరుకులూ, సైన్యాల రవాణా వగైరా ఖర్చులు తీర్చడంకోసమూ ఈ రుణం ఇంగ్లండులో తెచ్చుకొనేందుకు, పార్లమెంటు ఫిబ్రవరిలో సమావేశమైన తక్షణమే తన అంగీకారం మంజూరుచెయ్యవలసివుంటుంది. 1857 ఆగస్టులో, పార్లమెంటు సమావేశం వాయిదా పడినప్పుడు, కంపెనీ ప్రస్తుతం ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభాన్ని తట్టుకోడానికై కంపెనీయొక్క ఆర్థిక వనరులకు ఏవిధమైన లోటూ లేదనీ, అందువల్ల ఇటువంటి రుణం తెచ్చుకునే ఉద్దేశ్యమే లేదనీ కామన్స్ సభలో బ్రిటిష్ ప్రభుత్వం గంభీరంగా ప్రకటించింది. ఇండియాలో రైల్వే మార్గాలు నిర్మించేందుకై వివిధ కంపెనీలు ఈస్ట్ ఇండియా కంపెనీకి ఒప్పజెప్పిన సుమారు 35 లక్షల పౌన్ల మొత్తాన్ని కంపెనీ మిక్కిలి అభ్యంతరకరమైన పద్ధతుల నవలంబించి కాజేసినట్టూ, ఇంతేకాకుండా బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్నుండి 10 లక్షల పౌన్లూ, లండన్ జాయింటుస్టాక్ బ్యాంకుల నుండి మరొక 10 లక్షల పౌన్లూ రహస్యంగా అప్పుతెచ్చినట్టూ బైటకి పొక్కగానే, ఇంతవరకూ జాన్ బుల్ను మభ్యపరచడం ఫలితంగా అతను అనుభవించుతూన్న సుఖమయమైన భ్రమంతా పటాపంచలైపోయింది. ఈవిధంగా అశుభవార్తను చల్లగా ప్రజలచెవిని పడేసి, వారినందుకు తాపీగా అలవాటుపడేటట్టు తయారుచేసిన తరువాత, ఇంతవరకూ తాము కప్పుకున్న ముసుగు ఇక అవసరం లేదని తలచి జంకూగొంకూ లేకుండా ప్రభుత్వం ఆ ముసుగు

టిపిహారేసి, "Times," "G obe"[75] పత్రికల్లోనూ, ఇతర ప్రభుత్వ పత్రికల్లోనూ అర్ధాధికార వ్యాసాలద్వారా ఈ ఋణం అవసరమేనని ఇప్పుడు ఒప్పుకుంటోంది.

ఇటువంటి ఋణం అర్జించేందుకై శాసనసభ ఒక ప్రత్యేక చట్టం చేయవలసిన అవసరమేమిటనీ, అవసరమే అయిన పక్షంలో, తమకు నేడు లాభసాటి అవకాశాలు దొరకక, అట్టి అవకాశాలకోసం వృధాగా వెతుకుతున్న బ్రిటిష్ పెట్టుబడికి ఇప్పుడు లభించిన ఈ అవకాశం ఒక అనిరీక్షితమైన లాభమనీ, పెట్టుబడులు శీఘ్రంగా మురిగిపోకుండా అరికట్టేందుకై ఇది అమోఘమైన సాధనమనీ భావించడం బదులు, తల్వ్యతిరేకంగా ఈ ఘటన ఈషణ్మాత్రపు భయమైనా ఎందుకు కలిగించాలి అని ఎవరైనా ప్రశ్నించవచ్చు.

ఈస్ట్ ఇండియా కంపెనీకి వర్తకవ్యాపారాలన్నీ పోయి, వాణిజ్యలాభాలకు ప్రధాన మూలాధారమైన చైనా వర్తక గుత్తాధిపత్యం ఒక్కటీ కూడా బందైపోయేసరికి, వ్యాపార సంస్థగా ఈస్ట్ ఇండియా కంపెనీయొక్క అస్తిత్వం 1834లో[76] ఇక చెల్లిపోయిందన్న విషయం అందరికీ తెలిసినదే. తదానుషంగికంగా ఈస్ట్ ఇండియా కంపెనీ స్టాకువాటాదార్లకు పంచిపెట్టవలసిన లాభాలు నామకః వ్యాపారలాభాలనుండే పంచిపెట్టినట్లూ ఇంతవరకూ పైకి చెప్పబడినప్పటికీ, వాటాలపై లాభాలు పంచి ఇవ్వడానికి కొత్త ఆర్థిక ఏర్పాటు ఒకటి అవసరమయింది. వర్తకపు ఆదాయం ఖాతాకు ఖర్చురాసి ఆ సంవత్సరంవరకూ చెల్లించిన వాటాలపై లాభాలు, ఆ సంవత్సరం తరువాతనుండి రాజకీయ ఆదాయం ఖాతాకు మార్చబడ్డాయి. ప్రభుత్వ హోదాలో ఈస్ట్ ఇండియా కంపెనీకి సంక్రమించే రెవిన్యూనుండి కంపెనీ స్టాకు వాటాదార్లకు లాభాలు చెల్లించే ఏర్పాటుచేయబడింది; ఇకపోతే పది శాతం చొప్పున వడ్డీగల 60 లక్షల పౌన్ల ఇండియా స్టాకువాటా పత్రాలను రెండంతలు విలువ గలిగిన మూలధనంగానూ, ఈ మూలధనంలో ఒక్కొక్క 100 పౌన్ల స్టాకువాటా పత్రమూ 200 పౌన్లకే తప్ప వేరొక ధరకు అమ్మి మూలధనం తీర్మానించకూడదని పార్లమెంటు శాసించింది. ఇదే వేరేమాటల్లో చెప్పాలంటే, ప్రథమంలో 60 లక్షల పౌన్ల విలువచేసిన ఈస్ట్ ఇండియా కంపెనీ వాటాపత్రాలూ ఇప్పుడు 5 శాతం వడ్డీని కలిగిన కోటి 20 లక్షల పౌన్ల మూలధనంగానూ, ఇండియా ప్రజలు చెల్లించే పన్నులనుండి సంక్రమించే రెవిన్యూ ఖాతాకు ఈ వడ్డీని ఖర్చు రాసి చెల్లించబడుతూందన్నమాట. ఈవిధంగా పార్లమెంటరీ హస్తలాఘవంవల్ల ఈస్ట్ ఇండియా కంపెనీ చేసిన ఋణమే భారతదేశస్థులు చేసిన ఋణంగా తారుమారుచేశారు. ఈ ఋణమే కాకుండా, ఈస్ట్ ఇండియా కంపెనీ ఇండియాలో, ప్రత్యేకమూ ఆ దేశపు ప్రభుత్వ రెవిన్యూనుండే తీర్చే షరతుపై తెచ్చిన 5 కోట్ల పౌన్లకుమించిన ఋణం ఒకటుంది; ఇటువంటి ఋణాలు పార్లమెంటు అధికార పరిధులకు బాహ్యమైన ఋణాలనీ, ఉదాహరణకు కెనడా, ఆస్ట్రేలియా వలసరాజ్య ప్రభుత్వాలు చేసిన ఋణాలలాంటివేననీ భావించబడుతూంది.

ఇదిలా వుండగా పార్లమెంటు ప్రత్యేక అనుమతిలేనిదే ఈస్ట్ ఇండియా కంపెనీ వడ్డీచెల్లించవలసిన అప్పులు ఇంగ్లండులో చేయకూడదని, ఆ కంపెనీమీద ఒక ఆంక్ష కూడా విధించబడింది. కొన్ని సంవత్సరాలక్రితం ఇండియాలో రైల్వేలూ, టెలిగ్రాఫులూ నిర్మించ డానికిగాను కంపెనీ ఉద్యమించినప్పుడు, 4 శాతం వడ్డీగల 70 లక్షల పౌన్ల విలువగల ఇండియా అప్పుపత్రాలను, ఇండియా ప్రభుత్వపు రెవిన్యూ హామీపైనే తీర్చే షరతుతో లండన్ మార్కెట్‌లో అప్పుచేయడానికి అనుమతికోసం పార్లమెంటును అర్థించగా పార్లమెంటు అందుకు అంగీకరించింది. ఇండియాలో తిరుగుబాటు ప్రారంభమైనప్పుడు ఈ అప్పు పత్రాల రుణం పౌ. 38,94,400 ఉంది; కాగా ఇంత శీఘ్రంగానే అప్పుచేయడానికి అనుమతికోసం కంపెనీ పార్లమెంటును అర్థించవలసివచ్చిందంటే, దానికి ఇంగ్లండులో అప్పుచేయడానికి చట్టబద్ధంగా వున్న అధికారాన్నంతా ఇండియాలో తిరుగుబాటు కాలంలో కంపెనీ పూర్తిగా వినియోగించేసుకుందనే అర్థమౌతూంది.

ఈ చర్య తీసుకోడానికి ఈస్ట్ ఇండియా కంపెనీ కలకత్తాలో రుణం అర్థించిందనీ, ఈ అభ్యర్థనకు సంపూర్ణమైన భంగపాటు సంభవించిందనీ ఇందులో రహస్యమేమీ లేదనీ అందరికీ తెలుసు. ఇండియాలో బ్రిటిష్‌వారి సార్వభౌమాధిపత్య భవితవ్యంపట్ల తమకు గల విశ్వాసవిశ్వస్తతను లండన్ పత్రికలు ప్రదర్శించుతూండగా ఇండియా దేశపు పెట్టు బడిదార్లు అట్టి విశ్వాసం ఏమాత్రమూ ప్రదర్శించడంలేదనే ఇందువల్ల ఒకవైపున రుజువు పుతూండగా, రెండవవైపున హాగ్గర్డ్ అండ్ పిక్సలీ కంపెనీవారు ఇటీవల ప్రచురించిన ప్రకటన ప్రకారం 1856, 1857 సంవత్సరాలలోనే ఒక్క లండన్ రేవునుండే ఇండియాకు 2 కోట్ల 10 లక్షల పౌన్ల విలువగల ముద్ద వెండి బంగారాలు ఎగుమతయాయని తెలిసిన ప్పుడు, ఇంతకుమించి ఎంత విలువగల పెట్టుబడిధనాన్ని గత ఏడేళ్లలోనూ ఇండియాలో విల్వచేసుకుంటున్నారో కదా అని జాన్ బుల్‌కి తెలిసినప్పుడు అతనికి కలిగే ఆగ్రహం మరింత ఉధృతమవడానికి ఎంతైనా కారణమవుతుందనీ తెలియజేస్తూంది. లండన్ "Times" పత్రిక తన పాఠకులకు చక్కగా నచ్చచెబుతూ ఈ కింది విధంగా బోధచేసింది:

> "దేశీయులు భక్తివిశ్వాసాలు కలిగివుండేందుకు మనం వారికి చూపెట్టిన ఆశ లన్నిటిలోకీ, మనకి వారు రుణదాతలుగా వుండేందుకు మనమిచ్చిన అవకాశం అత్యంత తక్కువ అనుమానాస్పదంగా తయారైంది; అటు విదేశాల్లో వున్న ధనికులైన హక్కుదార్లకు లాభాలు పంచిపెట్టడానికని తమనుండి ఏటా సొమ్ములు వసూలు చేస్తున్నారనే భావం వారి మనస్సులో కలిగించడంవల్ల, తొందరపాటూ, గూడుపు ఠాణీ, దురాశాస్వభావాలను కలిగినట్టి ప్రజలలో అసంతృప్తి, లేదా విశ్వాసఘాతుకమూ ప్రేరేపించడానికి అంతకంటె గొప్ప అవకాశం మరేదీ అవసరంలేదు."

అయినప్పటికీ భారతీయుల పెట్టుబడులకు నష్టం సంభవించే విధంగా ఇంగ్లీషు సార్వభౌమత్వాన్ని పునఃస్థాపించడానికీ, అదేసమయంలో, బ్రిటిష్ వాణిజ్యంకోసమే దేశీయుల నిధినిక్షేపాలు దొంకతిరుగుడు మార్గంలో తెరిచిపెట్టబడేందుకూ తయారుచేసిన పథకంయొక్క అందచందాలను భారతీయులు గ్రహించినట్టు కనబడ్డంలేదు. బ్రిటిష్ పరిపాలనపట్ల హిందూ దేశపు పెట్టుబడిదార్లు అత్యంతాభిమానం కలిగివున్నారని ఘంటా పథంగా ఉదాటించి తీరడం ఒక మతనియమంలాగు యధార్థమైన ప్రతి ఇంగ్లీషువాడూ నమ్మేటంత అభిమానం గనుక హిందూదేశపు పెట్టుబడిదార్లు కలిగేవుంటే, తమ భక్తివిశ్వాసాలను ప్రదర్శించి తమ వెండిని వదలుకోవడానికి ఇంతకంటే సదవకాశం వారికి లభించి ఉండేదికాదు. ఇండియన్ పెట్టుబడిదార్లు తమ నిధినిక్షేపాలను మూతపెట్టి ఉంచడంవల్ల, ఇండియాలో తిరుగుబాటు ఖర్చునంతమా దేశీయుల సహాయం ఏమాత్రమూ లభించకుండానే తానే భరించక విధి లేదనే భావం తనలో ప్రవేశించేందుకై జాన్ బుల్ తన మనోద్వారాలను తెరచుకొనే ఉంచాలి. ఇంతేకాకుండా ముందున్న ఈ రుణం ఒక ఆచారప్రమాణంగా కూడా ఏర్పడి, "ఆంగ్లో-ఇండియన్ స్వదేశ రుణం" అనే పేరుగల గ్రంథంలో ప్రథమ పత్రంగా వుండేటట్టుగానే కనబడుతూంది. ఈస్ట్ ఇండియా కంపెనీకి ఇప్పుడు అవసరమున్న మొత్తం ఎనభైలక్షలో, కోటో కాకుండా, ఏ రెండుకోట్ల ఏభైలక్షల పౌన్లవరకో, మూడుకోట్ల పౌన్లవరకో ఉంటుంది; ఇంతేకాకుండా ఇదైనా మొదటి వాయిదాయే; ఇది కూడా ముందుఖర్చులకోసం కాకుండా, ఇదివరకు చేసిన అప్పులు తీర్చడానికే. గత మూడు సంవత్సరాల్లోనూ రెవిన్యూలోటు 50 లక్షల పౌన్లవరకూ తేలింది; లోగడ అక్టోబరు 15వ తేదీవరకూ తిరుగుబాటుదార్లు దోచుకున్న ఖజానాధనం, ఇండియా ప్రభుత్వపు పత్రిక "Phoenix"[77] ప్రచురించిన ప్రకటన ప్రకారం కోటి పౌన్లు ఉంటుంది; తిరుగుబాటు కారణంగా పూర్వోత్తర రాష్ట్రాల్లో సంభవించిన రెవిన్యూనష్టం 50 లక్షల పౌన్లు; ఇక యుద్ధఖర్చు ఎంతలేదన్నా కనీసం కోటి పౌన్లైనా ఉంటుంది.

ఇండియన్ కంపెనీ ఒక రుణం తరువాత ఒక రుణంగా ఇలా వరుసగా రుణాలు చేసినట్టయితే, ఈ రుణాల ఫలితంగా లండన్ డబ్బు మార్కెట్టులో డబ్బువిలువ పెరిగి, అంతకంతకు అధికమౌతూన్న పెట్టుబడుల తరుగుదలను అరికట్టుతుందన్న విషయం, అనగా వడ్డీరేటు పడిపోవడానికి అంతరాయం కలుగుతుందన్న విషయం నిజమే; కాని బ్రిటిష్ పరిశ్రమా, బ్రిటిష్ వాణిజ్యమూ పునరుద్ధరింపబడాలంటే ఈ వడ్డీరేటు పడిపోవడమే ఎంతైనా అవసరం. డిస్కౌంటురేటు తగ్గుతూన్నప్పుడు అందుకు అడ్డంకులను కృత్రిమంగా కలిగించినట్టయితే, అది ఉత్పత్తి ఖర్చులా పరపతి షరతులా పెంచడంతో సమానమే అవుతుంది. ఇప్పుడున్న బలహీన స్థితిలో ఇంగ్లీషు వాణిజ్యానికి ఈ పెమ్పును భరించడం తనకు దుస్సాధ్యమే అనిపించుతుంది. ఇండియా రుణం ప్రకటించగానే సార్వత్రికంగా ఇంత

బాధాకరమైన గగ్గోలు మొదలవడానికి ఇదే కారణం. పార్లమెంటు అనుమతి లభించినంత మాత్రాన కంపెనీ చేస్తున్న ఈ రుణానికి సామ్రాజ్య మొత్తంగా ఎట్టి హామీగాని ఏర్పడడంలేదనే విషయం నిజమే అయినప్పటికీ, మరే ఇతర షరతులపైనా అప్పు పుట్టని పక్షంలో ఈ హామీని కూడా ఇవ్వవలసి వస్తుందన్న సంగతిని ఒప్పుకు తీరాలి; ఇక సూక్ష్మములైన వ్యత్యాసాల నెన్నింటిని చూపించినప్పటికీ, ఈస్ట్ ఇండియా కంపెనీని ఇప్పుడున్న స్థానం నుండి తప్పించి, ఆ స్థానం బ్రిటిష్ ప్రభుత్వం ఆక్రమించిన ఉత్తరక్షణంలో ఈ రుణం అంతా బ్రిటిష్ రుణంలో కలిసిపోయి తీరుతుంది. ఈ కారణాలనుబట్టి ఇప్పటికే అధికంగా వున్న జాతీయ రుణం ఇంకా మరికొంత అధికంకావడం ఇండియా తిరుగుబాటుయొక్క ప్రథమ ఆర్థిక ఫలితంగా కనబడుతూంది.

మార్క్స్‌చే 1858 జనవరి 23న
రచించబడింది

"New-York Daily Tribune"
1858 ఫిబ్రవరి 9వ తేదీన
5243వ సంచికలో
ప్రచురించబడింది

# ఎంగెల్స్

# విండ్‌హామ్ ఓటమి[78]

క్రైమియా యుద్ధం జరుగుతూన్నప్పుడు ఇంగ్లీషు సేనలను సంఘటితంచేసి వాటిని యుద్ధంలోకి నడిపించగలిగిన వ్యక్తికోసం యావత్తు ఇంగ్లండూ గోలపెడుతూండగా, రాగ్లన్, సింప్సన్, కాడ్రింగ్‌టన్‌లాంటి అసమర్థులు ముఖ్యపదవులను ఆక్రమించుకొనుండగా, జనరల్‌కి ఉండవలసిన లక్షణాలన్నిటినీ కలిగినట్టి సోల్జరు ఒకతను క్రైమియాలోనే యుద్ధం చేస్తూండడం తటస్థించింది. తన వృత్తిని గురుతర ప్రజ్ఞతో నిర్వహించడమేలాగో గుర్తెరిగినట్టు నేడు ఇండియాలో దినదినమూ చూపుతూన్న సర్ కోలిన్ కాంబెల్ గురించే మేమిప్పుడంటూన్నాం. క్రైమియాలో, బ్రిటిష్ సైన్యం అవలంబించినట్టి వెసులుబాటులేని శ్రేణీ విన్యాసాల కారణంగా తన సామర్థ్యం ప్రదర్శించడానికి అవకాశం లభించని ఆల్మావద్ద[79] యుద్ధంలోకి తన బ్రిగేడ్‌ను నడిపించడానికి అతనికి అవకాశం ఇచ్చిన తరువాత, అతను బాలక్లావాలోనే అంటిపెట్టుకుని కూచోవాల్సి వుండినందువల్ల, తదుపరి జరిగిన యుద్ధ చర్యలలో అతనికి ఒక్కసారైనా ప్రమేయం కలుగకుండా చేసేశారు. అయినప్పటికీ మార్ల్‌బరో తరువాత ఇంగ్లీషు సేనానులందరిలోనూ అత్యంత ప్రతిభాశాలైన సర్ చార్లెస్ జేమ్స్ నేపియర్ అంతటివాడే, చాలాకాలం కిందటే ఇండియాలో ఇతని సైనిక ప్రతిభను వేనోళ్ల పొగిడాడు. కాని నేపియర్ స్వతంత్ర భావాలను కలిగినట్టి, అల్పసంఖ్యాక పాలకవర్గానికి తల ఒగ్గడమంటే ఏమిటో ఎరగని ఆత్మాభిమానం గలిగినట్టి వ్యక్తి అవడంచేత, అతని సిఫార్సుల ఫలితంగా కాంబెల్‌మీద నిఘాపెట్టి అతనంటే విశ్వాసం చూపించడమే మానేశారు.

ఇదిలావుండగా యుద్ధంలో ఇతరులు గొప్ప కీర్తి సంపాదించుకుని ఉన్నత హోదాల్లోకి వచ్చారు. ఉదాహరణకు, సర్ విలియమ్ ఫెన్‌విక్ విలియమ్స్ ఆఫ్ కార్స్ ఉన్నాడు; జనరల్ క్మెటీకి న్యాయంగా రావలసిన కీర్తిని తులువతనంవల్లనూ, ఆత్మస్తుతివల్లనూ, తానే భుక్తం చేసుకొని సంపాదించుకున్న కీర్తి తృప్తిపొంది ఇక హాయిగా కూచోవడమే ఉత్తమమని ఎంచుకున్నాడాయన. ఇండియాకు వెళ్లి తన కీర్తికి ముప్పుతెచ్చుకోవడానికి, ఇప్పుడున్న

బారనెట్ బిరుదు, వెయ్యిపౌన్ల వార్షికం, పూలిడ్‌లో కడుపులో చల్లకదలని కుషీ ఉద్యోగం, పార్లమెంటులో సభ్యత్వం, ఇవి అడ్డంగా వచ్చాయి ఈయనకి. ఈయనలాగ కాకుండా, "రెడాన్ శూరుడు" జనరల్ విండ్‌హామ్ ఒక సైనిక డివిజన్ తీసుకొని సిపాయిలమీదకి బయలుదేరాడు; అతను తీసుకున్న మొట్టమొదటి యుద్ధచర్యే అతనిని మరెన్నడూ తలెత్తుకోనివ్వకుండా చేసేసింది. పలుకుబడిగల కుటుంబ సంబంధాలు కలిగి, సైన్యంలో ఏ మారుమూలో వెయ్యి కాకుల్లో ఒక కాకిగా కర్నల్ ఉద్యోగంచేస్తూండిన ఈ విండ్‌హామే, రెడాన్‌వద్ద జరిగిన దాడి[80]లో ఒక బ్రిగేడ్‌కు నాయకత్వం వహించి, ఈ సైనిక కార్యకలాపం నడిపించడంలో అత్యంత మందబుద్ధితో ప్రవర్తించి, చివరకు ఇక అదనపుబలాలు అందకపోవడంచూసి, అదనపుబలాలను గురించి వాకబుచేయడానికని, తన సైనికబలాలను మీ కర్మం మీరు చూసుకోండని యుద్ధభూమిలో వదిలేసి తానే స్వయంగా బయల్దేరి వెళ్లిపోయాడు. ఇటువంటి అభ్యంతరకరమైన ప్రవర్తన మరే ఇతర దేశంలోనైనా జరిగివుంటే ఇతన్ని తక్షణమే యుద్ధచట్టంకింద విచారణచేసి ఉండేవారు; అటువంటిదిపోయి ఈ అభ్యంతరకరమైన ప్రవర్తనకే ఇతనికి తక్షణమే జనరల్ హోదా ప్రదానంచేసి, కొద్దికాలానికే ఇతనిని చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా నియమించారు.

కోలిన్ కాంబెల్ లక్నోపై పురోగమించినప్పుడు గంగానదిపై వున్న వంతెననూ, కాన్పూర్ చుట్టూవున్న పాత కోటనూ, శిబిరాన్నీ, కాన్పూర్ నగరాన్నీ రక్షించుతూ ఉండవలసిందని చెప్పి, ఇందుకు అవసరమైన దళాన్ని జనరల్ విండ్‌హామ్‌కి ఒప్పజెప్పి తాను వెళ్లిపోయాడు. విండ్‌హామ్ చేతిలో, కొన్ని పూర్తిగానూ కొన్ని పాక్షికంగాను ఐదు కాల్బల రెజిమెంట్లూ, 10 సేనా ఫిరంగులు, రెండు నౌకా ఫిరంగులు, 100 మందిగల అశ్వికదళమూ ఉన్నాయి; అతనికిందవున్న మొత్తం సైనికబలం 2,000ల పైచిలుకు. కాంబెల్ లక్నోవద్ద యుద్ధం చేస్తూండగా, దోఆబ్ ప్రాంతంలో తచ్చాడుతూన్న తిరుగుబాటుదార్ల వేర్వేరు దళాలన్నీ కాన్పూర్‌మీద దాడిచేసే ఉద్దేశ్యంతో ఒకచోట చేరుకున్నాయి. తిరుగుబాటుచేసిన జమీందార్లు పోగుచేసినట్టి నానాగోత్రీకులూ చేరిన కూటవమూక అటుండగా, దాడికి బయలుదేరిన ఈ సైనికసమూహంలో శిక్షణ పొందిన (క్రమశిక్షణను అలవర్చుకున్నాయని చెప్పడానికి ఎంతమాత్రమూ వీలులేదు) సైనికబలాలు కొన్ని వున్నాయి; కడమవారిలో దీనాపూర్ సిపాయిలు కొందరూ, గ్వాలియర్ సంస్థానపు పటాలంలో ఒక భాగానికి చెందిన సిపాయిలూ ఉన్నారు. గ్వాలియర్ పటాలంలో ఇంచుమించు ఆఫీసర్లందరూ దేశీయులే అయివుండడంచేతనూ, ఈవిధంగా ఈ పటాలంలో సైనిక ఆఫీసర్లూ కెప్టెన్లూ ఉండడంచేతనూ, బెటాలియన్ల పరిమితిలో కూడా ఏదోకొంత ఆర్గనైజేషను అంటూ ఈ ఒక్క దళంలోనే ఇంకా మిగిలివుంది; కడమవారిలో కంపెనీలకు మించి ఆర్గనైజేషను అనేది అసలు శూన్యం. ఈ కారణంచేత దీనాపూర్, గ్వాలియర్ దళాలపట్ల బ్రిటిష్‌వారికి కొంత గౌరవం వుంది. ఏమైనా వరే

దెబ్బకాచుకోవలసిన చర్యలకు మాత్రమే పరిమితమై ఉండవలసిందనే విండ్‌హామ్‌కి కఠిన ఆజ్ఞ ఇచ్చాడు కాంబెల్. కాని కాంబెల్‌కి తాను రాసిన నివేదికలకు, రవాణామార్గాలు తెగిపోయివుండడం కారణంగా జవాబు రాకపోవడంవల్ల, తన సొంత బాధ్యత తీసుకోవడానికే విండ్‌హామ్ నిశ్చయించుకున్నాడు. కాన్పూర్‌పై పురోగమించుతూ వస్తూన్న తిరుగుబాటుదార్లను ఎదుర్కోడానికై, 1,200 పదాతిసైనికులనూ, 100 అశ్వసైనికులనూ, 8 ఫిరంగులనూ తీసుకుని నవంబరు 26న విండ్‌హామ్ తరలివెళ్ళాడు. తిరుగుబాటుదార్ల అగ్రగామిదళాలను విండ్‌హామ్ సులువుగానే ఓడించేసిన తరువాత, వారి ప్రధాన బలం సమీపించడం చూసి కాన్పూర్‌కు చేరువగా అతడు తిరోగమించాడు. ఇక్కడ నగరానికి ఎదురుగా, ఎడమవైపున 34వ రెజిమెంటులోనూ, కుడివైపున రైఫిల్‌సైనికులతోనూ (5 కంపెనీలు), 82వ రెజిమెంటుకు చెందిన రెండు కంపెనీలతోనూ తన స్థానం తీసుకున్నాడు. అతను తిరోగమించాలంటే పట్టణంలోనుండే వెళ్ళాలి; వెనుకతట్టు ఎడమవైపుగా కొన్ని ఇటుక ఆవములు ఉన్నాయి. యుద్ధశ్రేణికి నాల్గువందల గజాలు ఎదురుగానూ, పార్శ్వాలలో కొన్ని కొన్నిచోట్ల ఇంతకంటే దగ్గరగానూ చెట్టడవులూ అరణ్యమూ ఉన్నాయి. దాడిచేస్తూ పురోగమించుతూన్న శత్రువుకు వీటివల్ల చక్కని రక్షణ దొరుకుతూంది. వెల్లడిగా వున్న మైదానంమీద బ్రిటిష్‌వాళ్ళూ, చక్కని రక్షణస్థానాల చాటుగా మూడునాల్గువందల గజాల దూరంలో వీరికెదురుగా పురోగమించగలిగిన భారతీయులూ — వాస్తవానికి ఇంతకంటె పాడు స్థానం ఎంచుకోవడం కష్టమే! విండ్‌హామ్‌యొక్క "శౌర్యం" ఇంకా ఘనంగా ప్రదర్శించడానికి మరొక చక్కని స్థావరం వుంది; అదేమిటంటే, అక్కడ చేరువలోనే, ముందూ వెనుకా మైదానం, యుద్ధశ్రేణి ఎదుటే అడ్డుగా కాలవ ఒకటీ వున్నట్టి చక్కని అనువైన స్థానం; అయితేనేం, నాసిగావున్న స్థానమే ఎంచుకుని మొండిగా దానినే అంటిపెట్టుకుని ఉండడానికే నిశ్చయించేసుకున్నాడు విండ్‌హామ్. చెట్లవల్ల దొరికిన మాటును ఉపయోగించుకుని అడవి అంచువరకూ సాగివచ్చి, నవంబరు 27న శత్రువులు ఫిరంగికాల్పులు ప్రారంభించారు. ఊరుకుండవలసిన నిరాడంబరంతో విండ్‌హామ్ ఈ ఫిరంగికాల్పులకు "బొంబార్డుమెంటు" అని నామకరణంచేసి, దీనిని తన సైనికబలాలు ఐదు గంటలపాటు భరించాల్సి వచ్చిందని చెప్పుకున్నాడు; కాని దీని తరువాత ఏమి జరిగిందో ఆ ఘటనలను గురించి మాత్రం విండ్‌హామ్ గాని, అక్కడున్న వారెవరైనా గాని, ఇండియన్ పత్రికలు గాని, బ్రిటిష్ పత్రికలు గాని వల్లెత్తుమాటైనా చెప్ప సాహసించడంలేదు. ఫిరంగికాల్పులు యుద్ధంగా మారిన మరుక్షణంనుంచి, ప్రత్యక్ష సాక్ష్యానికి ఎట్టి ఆధారాలూ మనకి దొరకడంలేదు; జంకుగొంకులతో తడబడుతూ అనుమానాస్పదంగా అసంపూర్ణంగా మన ఎదుటవున్న సాక్ష్యంపైనే మనం ఆధారపడాల్సి వుంది. విండ్‌హామ్ ఆకును అందకుండా పోకను పొందకుండా వున్న ఈ-కింది కథనం చెబుతున్నాడు:

"శత్రువు భారీ బాంబార్డుమెంటు సాగించినప్పటికీ నా సైనిక బలాలు ఐదు గంటలపాటు ఈ దాడి [యుద్ధభూమిలో వున్న సైనిక బలంపై జరిగిన ఫిరంగి కాల్పులను దాడి అనడం ఇదే కొత్తగా వింటున్నాం] తట్టుకుని, తమ స్థానంనుండి కదల్లేదు; ఇంతలో 88వ రెజిమెంటు తమ సన్నీలతో పొడిచిచంపిన శత్రువుల సంఖ్యనుబట్టి, తిరుగుబాటుదార్లు నగరంలో పూర్తిగా చొరబడ్డారని తెలుసుకున్నాను; వారు కోటపై దాడిచేస్తున్నారని విన్న తర్వాత, వెనక్కిమళ్లాల్సిందని జనరల్ దుప్వ్యాయీని ఆజ్ఞాపించాను. యావత్తు సామగ్రితోనూ, ఫిరంగులతోనూ ఇక కొద్దిసేపట్లో చీకటిపడుతుందనగా సైనికబలం కోటలోకి చేరుకుంది. శిబిర పరివార జనం పారిపోవడంచేత మా శిబిర సరంజామూ, సామానులో కొంత భాగమూ మాతో తీసుకువెళ్లడానికి వీలుపడిందికాదు. నేను జారీచేసిన ఉత్తరవు నొకదానిని అందజేయడంలో పొరపాటొకటి జరగకపోయుండినట్టయితే, అధమం చీకటి పడే వరకైనా నా స్థానంలో నేను నిలబడివుండేవాడిననే నా అభిప్రాయం."

జనరల్ విండ్‌హామ్ వెనుక రెడాన్‌వద్ద ప్రదర్శించిన ఇంగితజ్ఞానంతోనే, స్థాయీసైన్యం ఉన్నచోటికి (నగరాన్ని ఆక్రమించుకున్న 88వ రెజిమెంటువద్దకు అని అనుకోవచ్చు) వెళ్లిపోయి, అక్కడ సజీవంగా వుండి యుద్ధంచేస్తున్న శత్రువునికాకుండా, 88వ రెజిమెంటువారి సన్నీలకు ఆహుతులైన అనేకమంది శత్రువుల శవాలను చూశాడు. ఈ వాస్తవ విషయాన్నిబట్టి శత్రువులు (చచ్చినవారో బతికున్నవారో అతను చెప్పడంలేదు) నగరంలో పూర్తిగా చొరబడ్డారని అతను పర్యవసానం తేల్చాడు! ఈ పర్యవసానం పాఠకునికే కాకుండా, అతనికి సహితమూ ఆందోళన కలిగించుతూండగా, మన శూరుడు ఇంతటితో ఆగలేదు. కోటపై దాడి జరుగుతూందని అతనితో ఎవరో చెప్పగా విన్నాడు. ఇదే మామూలు జనరల్ ఎవడైనా అయివుంటే ఈ వార్తలో వున్న నిజానిజాలను వాకబుచేసి తెలుసుకుని వుండేవాడు, ఈ వార్త సహజంగానే అబద్ధమని తేలిపోయింది. విండ్‌హామ్ అలా కాదు. తను జారీచేసిన ఉత్తరవును సైన్యానికి అందించడంలో కించిత్తు పొరపాటు జరగకపోయుంటే(!) అధమం చీకటి పడేవరకైనా అతని సేనలు ఆ స్థానంలోనే నిలబడి ఉండేవి. అయినా కూడా విండ్‌హామ్ తిరోగమించవలసిందిగా తన సైన్యానికి ఆజ్ఞజారీచేస్తాడు! ఈ విధంగా, చచ్చిన సిపాయిల సంఖ్య ఎక్కడైతే అధికంగా వుందో, బతికున్న సిపాయిల సంఖ్య అంతకంటె హెచ్చుండి తీరాలని విండ్‌హామ్ తేల్చిన సిరోచిత పర్యవసానం మొదట మనముందుంది; రెండవది, కోటమీద దాడి జరుగుతూందనేటట్టి అసత్యపు వార్త; ఇక మూడవది, ఉత్తరవులో ఒకటి అందివ్వడంలో పొరపాటు సంభవించడం; ఈ దుర్ఘటనలన్నీ ఒక్కమాటు కలియడం ఫలితంగా రెడాన్ శూరుడిని ఓడించడానికీ, అతని సైనికుల అజేయమైన బ్రిటిష్ ధైర్యాన్ని చిత్తుచేయడానికీ, అధికసంఖ్యలోవున్న దేశీయ కూటన మూకకు వీలు చిక్కింది.

మరొక విలేకరి, అక్కడ ప్రత్యక్షంగా ఉన్న ఆఫీసరొకడు, ఇలా అంటున్నాడు:

"ఈ రోజు మధ్యాహ్నం జరిగిన పోరాటాన్నిగాని, తిరోగమనాన్నిగాని సరిగ్గా వివరించి చెప్పగలిగినవారెవరైనా ఉన్నారని నేననుకోను. తిరోగమించాల్సిందని ఉత్తరవు జారీఅయింది. ఇటికావం వెనుకకు తిరోగమించవలసిందని రాణీగారి 34వ కాల్బల రెజిమెంటుకి ఉత్తరవు అందగా, ఆ ఆవం ఎక్కడుందో ఆఫీసర్లకి గాని, సైనికులకు గాని తెలియలేదు! మన సైన్యం ఓడిపోయిందనీ, తిరోగమించుతూందనీ వార్త కంటోన్మెంట్లలో శరవేగంతో వ్యాపించింది; దాంతో నయాగరా జలపాతంతో అప్రతిహతంగా కొట్టుకుపోతున్న జలరాశిలాగు జనం నగరంలోని కోటలోకి తిరగబడ్డారు. సైనికుల, నౌకాదళసైనికులూ, యూరపియన్లూ, దేశీయులూ, మగవాళ్లూ ఆడవాళ్లూ, పిల్లలూ, గుర్రాలూ, ఒంటెలూ, ఎద్లూ మధ్యాహ్నం రెండు గంటలనుండి ఆద్యంతాలులేని ప్రవాహంగా చొరుచుకురావడం మొదలైంది. రాత్రి పదేసరికి కోటంతా మనుష్యులతోనూ జంతువులతోనూ సామాన్లతోనూ కిటకిటలాడుతూ, సృష్ట్యాదికి ముందున్న సంకులకోలాహలానికి మించిపోయింది."

ఇక ఆఖరి విషయం: "Times" కలకత్తా విలేకరి రాస్తూ, 27వ తేదీన బ్రిటిష్ వారికి "ఇంచుమించు పరాభవంతో సమానమైన" ఘటనే తటస్థించిందన్న విషయం ప్రత్యక్షంగానే కనబడుతూందని అన్నాడు; కాని ఆంగ్లో-ఇండియన్ వార్తాపత్రికలన్నీ కూడా దేశభక్తిపూరితమైన ఉద్దేశాలతో ప్రేరేపితమై ఈ పరాభవం బైటపడకుండా ఔదార్యబుద్ధితో కప్పిపెట్టేశాయి. ఏమైనప్పటికీ, చాలవరకు రిక్రూట్లతో కూడిన రాణీగారి రెజిమెంటు ఒకటి, ఒకానొక క్షణంలో వరుసతప్పి చెదిరిందనీ, అయినప్పటికీ తన స్థానం వదలలేదనీ, కోటలో మాత్రం గందరగోళం విపరీతంగా ఉందనీ, 28వ తేదీన కాంబెల్ వచ్చేవరకూ కూడా విండ్హామ్కు తన మనుష్యులమీద అదుపాజ్ఞలు పూర్తిగా తప్పిపోయాయనీ, కాంబెల్ వచ్చినతరువాత అతడు "ముఖంవాచినట్టు చివాట్లుపెట్టగా" దానితో గందరగోళం తగ్గి, ఎవరి మటుకువారు సర్దుకున్నారనీ కూడా అవి ఒప్పుకున్నాయి.

గందరగోళంగానూ, పరస్పరమూ ఒకదానితో ఒకటి సరిపడకుండా సందేహాస్పదంగానూ వున్న ఈ కథనాలన్నింటిమండీ తేలిన సర్వసారం ఏమిటి? విండ్హామ్యొక్క చేతకాని నాయకత్వంకిందున్న బ్రిటిష్ సైనికబలం, అనవసరంగా సంపూర్ణ పరాజయం పొందిందనీ; తిరోగమనానికి ఉత్తరవునివ్వగా, 34వ రెజిమెంటు ఆఫీసర్లు తాము యుద్ధం చేస్తూన్న ప్రదేశంయొక్క నైసర్గిక స్వభావం తెల్సుకునే ప్రయత్నమైనా చేయలేదనీ, తత్ఫలితంగా తాము తిరోగమించ వలసిందిగా ఆజ్ఞాపించబడిన స్థలమెక్కడుందో కూడా వారికి తెలియ

లేదనీ; రెజిమెంటు గందరగోళంలో పడిపోయి, చివరకి పలాయనం చిత్తగించిందనీ; దీనివల్ల శిబిరంలో భయాందోళన చెలరేగి, తత్ఫలితంగా అన్ని హద్దులూ మీరిపోయినంతటి క్రమ శిక్షణారాహిత్యమూ నానాగందరగోళమూ ప్రబలిందనీ, దీనివల్ల శిబిరంయొక్క సరంజామూ, సామానుల్లో కొంతభాగమూ నష్టమైపోయాయనీ; చిట్టచివరకు సామగ్రి గురించి విండ్‌హామ్ ఏమి చెప్పినప్పటికీ కూడా 15,000 "మిన్యే" తూటాలు, సైనిక కోశాధికారి ఇనుప పెట్టెలూ, అనేక రెజిమెంట్లకొరకు ఉద్దేశింపబడిన జోళ్లూ దుస్తులూ, ఇవన్నీ శత్రువశం అయాయనీ స్పష్టమైన పర్యవసానం తేలుతూంది.

సంఘటితంగా వరుసతీరి ఉన్నప్పుడు గాని, క్రీడలో ఉన్నప్పుడు గాని ఇంగ్లీషు పదాతి సేనలు సాధారణంగా యుద్ధభూమినుండి పారిపోవు. రష్యన్‌లలాగా వీరికి కూడా రాటు తేరిన సైనికుల లక్షణమైన సహజ సంసక్తి వుంది; ఇరు దేశాల సైన్యంలోనూ రాటుతేరిన వారు హెచ్చుమంది ఉండడంవల్లనే కాకుండా, కొంతవరకూ జాతిస్వభావంపైన కూడా ఇది ఆధారపడివుంది. దీనికీ "ధైర్యానికీ" ఏమీ సంబంధంలేదు సరికదా, తద్వ్యతిరేకంగా స్వయంరక్షక ఇంగితజ్ఞానంయొక్క విశిష్టఫలితమై, ముఖ్యంగా దెబ్బకాచుకోవలసిన పరిస్థి తులలో నేటికి సహితమూ ఇది చక్కగా రాణించే గుణం. ఇంగ్లీషువాళ్లకున్న మందకొడి స్వభా వంతో ఈ గుణం మిళితమవడంవల్ల యిది వాళ్లలో భయాందోళన పుట్టకుండా చేస్తుంది; అయితే ఐరిష్ సైనికులు ఒక్కసారి కంగారుపడిపోయి, వరుసతప్పి, వారిలో భయాందోళన పుట్టిందంటే మాత్రం వారిని కూడదీయడం చాలా కష్టమైన పని నవంబరు 27న విండ్‌హామ్‌కి ఇదే సంభవించింది. తమ చేతికిందవున్న సేనలు పలాయనం చిత్తగించేటట్లు చేయడంలో విజయులై, అధికసంఖ్యలో కాకపోయినా అల్పసంఖ్యలోనే ఉన్నట్టి, ప్రతిభాశా లురైన ఇంగ్లీషు సేనానుల జాబితాలో నేటినుండి అతని పేరు కూడా శాశ్వతంగా నిలిచి వుండిపోతుంది.

28వ తేదీన గ్వాలియర్ సంస్థాన పటాలానికి బితూర్‌నుండి గణనీయమైన అదనపు బలాలు అందినమీదట, అది కందకాలలో స్థానాలు ఏర్పరచుకున్న బ్రిటిష్ కాకీదళాల స్థానాలకు నాలుగువందల గజాల దూరానికి చొరుచుకువచ్చింది. మరొకసారి యుద్ధం తటస్థించింది; కాని ఈసారి శత్రువు ఏమాత్రపు దృఢసంకల్పంతోనూ దాడి సాగించలేదు. ప్రసిద్ధిచెందిన బాలక్లావా దాడిలాగానే ఈ దాడి కూడా కేవలం మూర్ఖమైనదే అయినప్పటికీ, దీనిలో 64వ రెజిమెంటు ఆఫీసర్లూ సైనికులూ ప్రదర్శించిన వాస్తవమైన ధైర్యం గురించి వివరంగా చెప్పడానికి మాకెంతైనా సంతోషంగా వుంది. ఇందుకు బాధ్యత కూడా ఆ దాడిలోనే నేల కొరిగిన వ్యక్తి — ఆ రెజిమెంటుకు నాయకత్వం వహించిన కల్నల్ విల్సన్ — మీదే వెట్టేస్తు న్నారు. శత్రువు అధికసంఖ్యతో కాపాడుతూన్నట్టి నాలుగు ఫిరంగులపై దాడి చేయడానికని మాట ఎనభైమంది సైనికులతో విల్సన్ బయల్దేరినట్లు కనబడుతూంది. ఆ నాలుగు

ఫిరంగులనూ కాపాడుతూన్న శత్రుసైనికులెవరో మనకి సరిగ్గా తెలియడంలేదు; కాని ఫలితాన్నిబట్టి చూస్తే, వారు గ్వాలియర్ పటాలంవారే అయివుంటారని తేల్తూంది. ఒక్క సారిగా హఠాత్‌దాడిచేసి బ్రిటిష్‌వాళ్లు వశంచేసుకుని, వాటిలో మూడింటి మూతులలో క్రొరులు దిగ్గొట్టి, కొంతసేపక్కడ నిలదొక్కుకునే వున్నారు; కాని అదనపుబలాల సహాయం అందక పోవడం చూసి, హతులైన అరవైమంది సైనికులనూ, ఆఫీసర్లలో చాలామందినీ యుద్ధ భూమిమీదే వదిలిపెట్టేసి బ్రిటిష్‌వాళ్లు తిరోగమించారు; సంభవించిన నష్టంలోనే వుంది తీవ్రయుద్ధానికి రుజువు. అల్పసంఖ్యాక సైనికబలాన్ని అధికసంఖ్యలోవున్న శత్రువు తీవ్రంగా ఎదిరించినప్పటికీ, ఒక శత్రు బేటరీని వశపర్చుకుని, తమలో మూడవవంతు నేల కొరిగేవరకూ వారు బేటరీని కాపాడుకుంటూ వచ్చారు. వాస్తవమైన బాహాబాహీ యుద్ధమంటే ఇదే; తుపానుదాడిచేసి ఢిల్లీని వశపర్చుకొన్న తరువాత బాహాబాహీ యుద్ధం జరగడం ఇదే మొదటిసారి. ఏది ఏమైనప్పటికీ ఈ దాడిని ఆజ్ఞాపించిన వ్యక్తిని యుద్ధచట్టంకింద విచారణచేసి గుండేసి పేల్చేయవలసిందే. దీనికి విల్సనే బాధ్యుడంటాడు విండ్‌హామ్. విల్సన్ ఈ దాడిలో నేలకొరిగాడు; అందుచేత విల్సన్ జబాబు చెప్పుకోలేదు.

సాయంకాల మయేటప్పటికి కోటనిండా బ్రిటిష్ సైనికులు చేరి కోట కిటకిటలాడుతూ వావాగందరగోళంగానూ ఉంది, గంగానదిమీదవున్న వంతెన ప్రమాదస్థితిలో పడింది. కాని సరిగ్గా ఈ సమయానికే కాంబెల్ వచ్చాడు. అతను వచ్చి, పరిస్థితులను అదుపాజ్ఞల్లోకి తెచ్చి క్రమశిక్షణను పునఃస్థాపించి, ఉదయాన కొత్త సైనిక బలాలను సమీకరించి, వంతెనకూ కోటకూ శత్రుభయంలేకుండా వున్నంత దూరంవరకూ శత్రువును వెనక్కి తరిమేశాడు. తరువాత గాయాలు తగిలినవారినీ, స్త్రీలనూ పిల్లలనూ, సామాన్లనూ వంతెనమీదుగా ఆవలకు దాటించి, అలహాబాద్‌కు వెళ్లే రోడ్డుమీద కొంతదూరం వారు సాగివెళ్లే వ్యవధివరకూ రక్షణస్థానం తీసుకున్నాడు. ఇది అయిన తరువాత, 6వ తేదీని సిపాయిలను అతడు ఎదుర్కొని, వారిని ఓడించి, తన కేవెల్‌రీతోనూ, ఆర్టి లరీతోనూ పధ్నాల్గుమైళ్లవరకూ ఆనాడే వారిని వెంబడించాడు. కాంబెల్ నివేదికనుబట్టి శత్రువు ఏమంత ప్రతిఘటన చూపలేదనే తెలుస్తూంది; తన సైనికబలంయొక్క పురో గమనాన్ని అతడు వివరించుతూ, శత్రుప్రతిఘటన, శత్రువిన్యాసాలను పేర్కొనలేదు. శత్రువు ఎట్టి ఆటంకమూ కలిగించక పోవడంవల్ల, అది యుద్ధం కాదు; అది కేవలం ఒక **battue.*** తేలిక ఆయుధాలు కలిగిన లైట్ డివిజన్‌తో బ్రిగేడియర్ హోప్ గ్రాంట్ పలాయితులైన శత్రువును వెంబడించుతూ, వారు సది నౌకదానిని దాటుతూండగా 8వ తేదీ ఉదయాన వారితో తలపడ్డాడు; ఇక ఇరకాటంలో చిక్కుకొని చేసేదిలేక వారు వెనక్కి

---

* మూకుమ్మడి కసాయికోత. — సం.

తిరిగి యుద్ధంచేసి విశేష జననష్టం పొందారు. ఈ లక్నో, కాన్పూర్ ఉదంతంతో కాంబెల్ చేసిన మొదటి యుద్ధచర్య పూర్తి అయింది; నూతన యుద్ధచర్య పరంపర ఇక ప్రారంభం కాబోతూంది; దాని తొలి పరిణామాల గురించి వార్తలు ఇక పక్షం రోజుల్లోనో, మూడు వారాల్లోనో మనకు అందవచ్చు.

ఎంగెల్స్‌చే సుమారు 1858 ఫిబ్రవరి 2న
రచించబడింది

"New-York Daily Tribune"
1858 ఫిబ్రవరి 20 తేదీన
5253వ సంచికలో
ఒక సంపాదకీయ వ్యాసంగా
ప్రచురించబడింది

# ఎంగెల్స్

# లక్నో ఆక్రమణ[41]

ఇండియాలోని తిరుగుబాటులో ద్వితీయ విపత్కర కాలావధి సమాప్తిచెందింది. ప్రథమ కాలావధికి ఢిల్లీ కేంద్రమై, తుపానుదాడిచేసి ఆ పట్టణాన్ని పట్టుకోవడంతో అది పూర్తిఅయింది; ద్వితీయ కాలావధికి లక్నో కేంద్రమైంది. ఇప్పుడు ఆ నగరం కూడా లొంగిపోయింది. ఇంత వరకూ ప్రశాంతంగా వున్న స్థలాల్లో సరికొత్త ఆందోళనలు ప్రారంభమైతేనే తప్ప, తిరుగుబాటు ఇక సుదీర్ఘమైనట్టి కడపటి కాలావధిలోకి ప్రవేశించి, ఈ కడపటి కాలావధిలో తిరుగుబాటుదార్లు చివరకు బందిపోటు దొంగల స్వభావాన్నీ, దారిదోపిడిగాండ్ర స్వభావాన్నీ వహించి, బ్రిటిష్‌వాళ్ళ తమకు ఎంతటి శత్రువులో దేశప్రజలు కూడా తమకు అంతటి శత్రువులుగా తయారైనట్టు కనిపెట్టడంతో, తిరుగుబాటు క్రమేణా అణగారిపోవలసి వుంటుంది.

లక్నోపై జరిగిన తుపానుదాడి వివరాలు ఇంతవరకూ అందలేదు, కాని ప్రాథమిక చర్యలూ, అంతిమ యుద్ధాంగ రేఖాచిత్రమూ తెలియవచ్చాయి. లక్నో రెసిడెన్సీ విముక్తి చేయబడిన తర్వాత, ఆ నగరంలో వున్న సైనికస్థావరాన్ని జనరల్ కాంబెల్ మందుపెట్టి పేల్చేసినట్టూ, జనరల్ ఔట్రామ్‌కు సుమారు 5,000ల మందితో కూడిన సైన్యాన్నిచ్చి నగరానికి కొద్దిమైళ్ళ దూరంలో ఉన్నట్టి కందకస్థానమైన ఆలంబాగ్‌లో అతనిని ఉండ నియమించినట్టూ పాఠకులకు గుర్తుంటుంది. కాంబెల్ మట్టుకు తన కిందున్న మిగతా సైన్యంతో కాన్పూర్‌కు తరలి వెళ్ళాడు; ఇంతకు ముందుగానే కాన్పూర్ సమీపంలో తిరుగుబాటుదార్ల చేతిలో జనరల్ విండ్‌హామ్ ఓటమి తిన్నాడు. ఈ తిరుగుబాటుదార్ల సైన్యాన్ని జనరల్ కాంబెల్ పూర్తిగా ఓడించి, కాల్పివద్ద వారు యమున దాటేటట్టు తరిమేశాడు. తరువాత అతడు తిరిగి కాన్పూర్ చేరుకుని, అదనపు బలాలూ, భారీఫిరంగులూ తనకి అందేవరకూ అక్కడే ఆగి, తన దాడిపథకాలు పూర్తిచేసుకుని, అయోధ్యలోకి పురోగమించడానికై నియమించిన వివిధ శ్రేణుల కేంద్రీకరణకు అవసరమైన ఉత్తరవులిచ్చి, లక్నోపై యుద్ధచర్యలు సాగించ

డానికిగాను బలంలోనూ విస్తీర్ణంలోనూ కాన్పూర్ తక్షణ ప్రధాన స్థావరంగా ఉండేందుకై ఆ నగరాన్ని తగినంతగా ఒక బలవత్తరమైన దుర్గ రక్షిత శిబిరంగా నిర్మించాడు. ఈ బందోబస్తంతా పూర్తిచేసుకున్న తరువాత, అక్కడనుండి తరలివెళ్లడానికి క్షేమమని అనుకునే ముందు అతడు పూర్తిచేయవలసిన కార్యం మరొకటుండిపోయింది — ఇటువంటి కార్యం తలపెట్టడంలోనే ఇండియాలో ఇదివరకటి సేనానులకీ ఇతనికీగల వ్యత్యాసం స్పష్టంగా కనబడుతూంది. శిబిరంనిండా ఎక్కడచూసినా ఆడంగులు తచ్చాడుతూండడం అతనికేమీ మనస్కరించలేదు. లక్నోలోనూ, కాన్పూర్‌కు తరలివెళ్లేటప్పుడూ ఈ ''వీరాంగనలతో'' తాను పడిన బాధలు చాలుననిపించిపోయిందతనికి; ఇండియాలో ఇదివరకటినుండీ వస్తూన్న రివాజు ప్రకారమే, తమ సౌఖ్యానికీ తమ చిత్తాలకీ సరదాలకీ అడ్డంరాకుండా ఇప్పుడు కూడా సైన్యంయొక్క చర్యలన్నీ జరగడమే సబబూ సహజమూ అని ఈ ఆడంగులు అనుకునేవారు. కాన్పూర్ చేరీచేరడంతో ఆసక్తిదాయకమైనట్టే బాధాకరమైనట్టే ఈ పరివారాన్నంతటినీ తనకు చికాకు కలిగించకుండా ఉండేందుకై అలహాబాదుకు పంపించేశాడు; ఇక ఆగ్రాలో ఉన్న రెండవ ఆడంగులజట్టును కూడా కాన్పూర్‌కు రప్పించి, వారిని కూడా క్షేమంగా అలహాబాదుకు పంపించివేసిన తరువాతనే, తనకంటె ముందుగానే లక్నో వైపుగా పురోగమించుతూన్న తన సైన్యంతో తాను వెళ్లి కలుసుకున్నాడు.

ఈ అయోధ్య యుద్ధానికై జరిగిన బందోబస్తు ఇండియా చరిత్రలో ఇదివరకెన్నడూ కనీవిని ఎరుగనంత భారీస్థాయిలో జరిగింది. ఇండియాలో బ్రిటిష్‌వారు పూనుకొన్న యుద్ధ చర్య లన్నిటిలోనూ గొప్పదైన ఆఫ్ఘనిస్థాన్ దండయాత్రలో[82] సహితమూ, ఏకసమయంలో 20,000లకు మించిన సైన్యాన్నెప్పుడూ వినియోగించి ఉండలేదు; అదైనా ఈ 20,000 మందిలోనూ అత్యధికసంఖ్య దేశీయ సైనికులే. ఈ అయోధ్య యుద్ధంలో వినియోగించిన యూరపియన్ సైనికులసంఖ్య ఒక్కటే ఆఫ్ఘనిస్థాన్‌లోకి పంపించిన యావత్తు సైనికుల సంఖ్యకంటెనూ మించివుంది. సర్ కోలిన్ కాంబెల్ స్వయంగా నాయకత్వం వహించి యుద్ధంలోకి నడపిన ప్రధాన సేనలో మూడు ఇన్‌ఫెంట్రీ డివిజన్లూ, ఒక కేవెల్‌రీ డివిజనూ, ఒక ఆర్టిలరీ, ఇంజనీర్ల డివిజనూ ఉన్నాయి. వీటిలో ఔట్రామ్‌కింద వున్న మొదటి ఇన్‌ఫెంట్రీ డివిజను ఆలంబాగ్‌ను ఆక్రమించుకుని అక్కడ విడిసివుంది. ఈ డివిజనులో ఐదు యూరపియన్ రెజిమెంట్లూ, ఒక దేశీయ రెజిమెంటూ ఉన్నాయి. రెండవ డివిజనూ (నాల్గు యూరపియన్ రెజిమెంట్లూ, ఒక దేశీయ రెజిమెంటూ), మూడవ డివిజనూ (ఐదు యూరపియన్ రెజిమెంట్లూ, ఒక దేశీయ రెజిమెంటూ), సర్ హోప్ గ్రాంట్‌కింద వున్న (మూడు యూరపియన్ రెజిమెంట్లూ, నాల్గో ఐదో దేశీయ రెజిమెంట్లూ కూడిన) కేవెల్‌రీ డివిజనూ, ఆర్టిలరీ (నలభైయ్యెనిమిది సేనా ఫిరంగు గా, ముట్టడిఫిరంగి దళాలూ, ఇంజనీరు దళాలూ) ఉన్నాయి. ఇవన్నీ కలిపి ఏర్పడినట్టి ఈ క్రియాశీలమైన సేనతో కాంబెల్ కాన్పూర్

రోడ్డుమీదుగా తరలివెళ్లాడు. గోమతీ గంగా నదుల మధ్య, జౌన్‌పూర్ అజమ్‌ఘర్‌లవద్ద కేంద్రీకృతమై బ్రిగేడియర్ ఫ్రాంక్స్‌కింద సమీకరించబడిన ఒక బ్రిగేడ్ గోమతీతీరాన్నే అంటిపెట్టుకుని లక్నోపై పురోగమించేటట్లు ఏర్పాటుచేయబడింది. ఈ బ్రిగేడ్‌లో మూడు యూరపియన్ రెజిమెంట్లూ, రెండు శతఘ్ని బేటరీలూ, ఇవికాక మరికొన్ని దేశీయ సైనిక బలాలూ ఉన్నాయి; ఈ బ్రిగేడ్ కాంబెల్ కుడిపార్శ్వాన మోహరించాలి. ఈ బ్రిగేడ్‌తో కలుపుకుని కాంబెల్‌కింద వున్న మొత్తం సైనికబలమంతా ఈకింది విధంగా ఉంది:

| | ఇన్‌ఫెంట్రీ | కేవెల్‌రీ | ఆర్టిలరీ, ఇంజనీర్లు | మొత్తం |
|---|---|---|---|---|
| యూరపియన్లు . . . . . . | 15,000 | 2,000 | 3,000 | 20,000 |
| దేశీయులు . . . . . . . . | 5,000 | 3,000 | 2,000 | 10,000 |

అంతా కలిపి మొత్తం 30,000 మంది; ఈ సంఖ్యకి జంగ్ బహదూర్ నాయకత్వాన గోరఖ్‌పూర్‌నుండి సుల్తాన్‌పూర్‌పై పురోగమించుతూన్న 10,000 మంది నేపాల్ గూర్ఖాల సంఖ్య కలిపితే దండయాత్ర సైన్యం సంఖ్య 40,000 అవుతుంది; వీరిలో ఇంచుమించు అందరూ సుశిక్షితులైన సైనికులే. ఇంతటితో సరిపోలేదు. ఫ్రాంక్స్‌కిందనూ, కాంబెల్ కిందనూ వున్న రెండు శ్రేణుల మధ్యనుండీ తప్పించుకుని పారిపోగలిగిన శత్రువులను అడ్డం కొట్టేందుకుగాను కాన్పూర్‌కు దక్షిణంగా సాగర్‌నుండి కాల్పీపైనా, దక్షిణ యమునపైనా పురోగమించుతూన్న శ్రేణి ఒకటుంది; దీనికి సర్ హెచ్. రోజ్ నాయకుడు. పశ్చిమోత్తరాన బ్రిగేడియర్ చాంబర్లైన్‌కింద వున్న సైనిక బలాలు ఫిబ్రవరి ఆఖరి రోజులలో ఉత్తర గంగను దాటి, అయోధ్యకు ఉత్తర వాయవ్య దిశలో ఉన్నట్టే, సరిగ్గా మొదట అనుకున్నట్టుగానే తిరుగుబాటుదార్ల సైన్యంయొక్క ప్రధాన తిరోగమన మార్గ కేంద్రంగా తరువాత పరిణమించినట్టి రోహిల్‌ఖండ్‌లో ప్రవేశించాయి. అయోధ్య రాజ్యంపై దండయాత్రలో ప్రత్యక్షంగానో పరోక్షంగానో వినియోగించబడిన సైనికబలాల్లోనే, అయోధ్య చుట్టూ వున్న నగరాలలో ఉంచిన రక్షణసేనలను కూడా లెక్కవెయ్యాల్సి ఉంటుంది కాబట్టి, వీటిని కూడా కలిపితే మొత్తం సైన్యంలో కచ్చితంగా 70,000నుండి 80,000వరకూ యుద్ధ సైనికులుంటారు; వీరిలో అధమం 28,000 లైనా బ్రిటిష్‌వారున్నట్టుగా అధికారయుత ప్రకటనవల్ల తెలుస్తోంది. ఢిల్లీని ఆక్రమించి, ఆ నగరంలోనే ఉంటూ ఒక విధంగా పార్శ్వ స్థానంగా ఏర్పడుతూ, సర్ జాన్ లారెన్స్‌కింద ఢిల్లీ, మీరట్ నగరాల్లో ఉన్నట్టి 5,500

యూరపియన్లూ, ఏ 20 వేలో, 30 వేలో పంజాబ్‌దేశస్థులూ వున్న పెద్ద సైనిక సమూహాన్ని పై లెక్కలో కలపడమేలేదు.

బ్రహ్మాండమైన ఈ సైనిక కేంద్రీకరణ, కొంతవరకూ జనరల్ కాంబెల్ పథకం ఫలితంగానూ, హిందూస్థానం వివిధ భాగాల్లో తలెత్తిన తిరుగుబాటును అణచి వేయడం ఫలితంగా కూడా కొంతవరకూ జరిగింది; ఈ అణచివేతలో సేనలు సహజంగానే యుద్ధరంగంవైపు కేంద్రీకృతమయాయి. ఇంతకంటె చిన్న సైన్యంతోనే కాంబెల్ సాహసించి యుద్ధరంగంలోకి దిగివుండేవాడు; కాని అదనపు బలాలకోసం ఆగివుండగా, సందర్భానుబట్టి ఎన్నడూ అనుకోని అదనపు బలాలు కూడా అతని చేతికి చిక్కాయి; లక్నోవద్ద తాను ఎదుర్కోవలసి వున్న శత్రుసైన్యం ఎందుకూ కొరగానిదే అని అతను ఎరిగివున్నప్పటికీ, అదనపు బలాలు అతని చేతికి చిక్కినప్పుడు అవసరంలేదని వాటిని తిరస్కరించే మనిషి కాదు కాంబెల్. కాగా ఈ సైనిక బలాల సంఖ్య ఎంతో బ్రహ్మాండంగా ఉన్నట్టు కనబడినప్పటికీ, ఫ్రాన్సు దేశమంత విస్తీర్ణంగల భూభాగంపై ఇవి వ్యాపించివున్నాయన్న విషయమూ, అమీ తుమీ తేలిపోయే లక్నో యుద్ధరంగంలో సుమారు 20 వేల యూరపియన్లతోనూ, 10 వేల హిందూదేశస్థులతోనూ, 10 వేల గూర్ఖాలతోనూ మాత్రమే — దేశీయ ఆఫీసర్ల నాయకత్వాన వున్న ఈ గూర్ఖా సైన్యంయొక్క విలువ అధమపక్షం సందేహాస్పదంగానే కనబడుతూంది — అతడు దిగగల్గుతాడన్న విషయమూ మనం విస్మరించకూడదు. ఈ సైన్యంలో భాగాలైన యూరపియన్ సైనిక బలాలే సత్వర విజయం సుస్థిరంచేసేందుకు సరిపోయి వుండేవి; అయినప్పటికీ, ఈ సైన్యం నెరవేర్చవలసిన కార్యాన్నిబట్టి చూస్తే, అందుకు మరీ మితిమీరిన విస్తృతిలో లేదు; యూరపియన్లు దేశమందంతటా స్వల్పసంఖ్యలోనూ, చెల్లాచెదరుగానూ వుండటంపైనే తిరుగుబాటు ఆధారపడివుందన్న విషయాన్ని దృష్టిలో పెట్టుకొని, ఇండియాలో ఎవరూ ఎక్కడా చూడనంత మంది తెల్లవాళ్ల బలగాన్ని అయోధ్య వాసులకు ప్రదర్శించాలని కూడా కాంబెల్ భావించి యుండవచ్చు.

అయోధ్యలోని తిరుగుబాటుదార్లకున్న సైనిక బలాల్లో, పితూరీ చేసిన బెంగాల్ రెజిమెంటుల్లోని అవశేషాలూ, ఇవిగాక తిరుగుబాటుదార్లు దేశంలో పోగుచేసి తమ సైన్యంలోకి లాక్కొచ్చి చేర్చుకున్నవారూ వున్నారు. బెంగాల్ రెజిమెంటుకు చెందినవారి సంఖ్య ఎంత హెచ్చుగా లెక్కవేసుకున్నా 35 వేలూ 40 వేలకు మించడం కష్టం. మొదట్లో 80 వేలుగా వున్న ఈ సైన్యం శత్రు ఖడ్గానికి ఆహుతి అయినందువల్లనైతేనేమి, సైన్యంనుండి పరారీవల్ల ఐతే ఏమి, గుండె బేజారెత్తిపోవడంవల్ల ఐతే ఏమి, సగానికి సగమైపోయింది; ఇక ఇప్పుడు మిగిలిన సగంలో సంఘటన అనేది మృగ్యమై, అధైర్యం హెచ్చుపెరిగిపోయి, యుద్ధసామగ్రి కొరవడి, యుద్ధరంగంలోకి దిగేందుకు ఎట్టి సమర్థత సహితమూ లేని స్థితిలో వుంది. సైన్యంలోకి కొత్తగా బలవంతాన లాక్కొచ్చి చేర్పించినవారి సంఖ్య లక్ష,

లేక లక్ష ఏభై వేలవరకూ వుండొచ్చు; కాని వీరి సంఖ్య ఎంత వుండినప్పటికీ అందుకు ప్రాము ఖ్యత లేదు. వీరికున్న ఆయుధాల్లో అత్యధికభాగం కేవలం వకిలీ రకం తుపాకులు; వీరిలో చాలామందికి ముఖాముఖీ యుద్ధానికి ఉపయోగపడే ఆయుధాలు మాత్రమే వున్నాయి; ఇట్టి యుద్ధం జరిగే అవకాశం బహు తక్కువ. ఈ తిరుగుబాటుదార్ల సైనిక బలంలో అధికభాగం లక్నోలోనే వుండిపోయి, సర్ జె. హోటామ్ సైనిక బలాంతో తలపడుతూంది; కాని రెండు శ్రేణులు మాత్రం అలహాబాద్, జాన్‌పూర్ దిశగా యుద్ధచర్యలకు పూనుకున్నాయి.

లక్నోపై వన్నిన ఏకకేంద్రవృత్త పురోగమనం సుమారు ఫిబ్రవరి మధ్యలో మొదలైంది. ఫిబ్రవరి 15నుండి 26వరకూ సైన్యంలో ప్రధానభాగమూ, దానివెంట వస్తూన్న బలగమూ (ఒక్క శిబిర పరివారమే వుంది 60 వేలవరకూ) కాన్పూర్‌నుండి అయోధ్య ముఖ్యపట్నం దిశగా పురోగమించింది; దానికి దారిలో ఎట్టి ప్రతిఘటనా తటస్థపడలేదు. ఈలోపుగా ఫిబ్రవరి 21, 24 తేదీలలో శత్రువులు హోటామ్ ఆక్రమించుకున్న స్థానాన్ని ఎదుర్కొన్నారు, కాని వారికి విజయం సాధించే అవకాశమే లేకపోయింది. 19వ తేదీన ఫ్రాంక్స్ సుల్తాన్‌పూర్‌పై పురోగమించి, తిరుగుబాటుదార్ల ఈ రెండు శ్రేణులనూ ఒకేరోజున ఓడించి, తనకు అశ్వ సైనికులు లేకపోవడం కారణాన, ఎంతదూరంవరకూ వెంబడించడానికి వీలుంటుందో అంత దూరమూ వాటిని వెంబడించాడు. ఈ రెండు శ్రేణులూ ఒకదానితో ఒకటి కలుసుకున్నప్పటికీ, 23వ తేదీన ఫ్రాంక్స్ మళ్లీ మరొకసారి వాటిని మర్దించాడు; దీని ఫలితంగా అవి 20 ఫిరంగులనూ, శిబిరసరంజామూ సామానులను పూర్తిగానూ వస్తుపోయాయి. ఇంగ్లీషువారి ప్రధాన సైన్యపు పురోగామి రక్షకదళాన్ని నడిపిస్తూన్న జనరల్ హోప్ గ్రాంట్, కొంత బలగం తీసుకుని తన ప్రధాన సైన్యంనుండి విడిపోయి, అధికప్రయాసతో సత్వరంగా ఒక మజిలీ చేసి, ఎడమదిశగా మళ్లి, లక్నో రోహిల్‌ఖండ్ రోడ్డుపైనున్న రెండు దుర్గాలను 23, 24 తేదీలలో ధ్వంసంచేశాడు.

ఇంగ్లీషువారు తమ ప్రధాన సైన్యాన్ని మార్చి 2వ లక్నో దక్షిణ పార్శ్వం ఎదుట కేంద్రీకరించారు. పట్నంయొక్క ఈ భాగాన్ని రక్షిస్తూన్న కాలువ ఒకటుంది; వెనకటికి ఈ పట్నంపై కాంబెల్ చేసిన దాడిలో ఈ కాలువనే అతడు దాటాల్సి వచ్చింది; ఈ కాలువ వెనుకనే ఇంగ్లీషువారు బలమైన రక్షణకట్టడాలను తాత్కాలికంగా నిర్మించుకున్నారు. దిల్ కుషా పార్కుపై తుపాకుదాడితో వెనుకటి దాడి ఆరంభమైనట్టుగానే, మార్చి 3వ బ్రిటిష్‌వారు ఈ పార్కును ఆక్రమించుకోవడంతో దాడి ఆరంభమైంది. ప్రధాన సైన్యాన్ని 4వ తేదీన బ్రిగేడియర్ ఫ్రాంక్స్ కలుసుకోవడంతో, అతని సైన్యం ప్రధాన సైన్యానికి కుడి పార్శ్వంగా ఏర్పడింది. గోమతీనది తన కుడిచేతివైపున ఉండడంవల్ల ఇతనికి బలమైన రక్షణ లభించింది. ఈ లోపున, శత్రువు నిర్మించుకున్న రక్షణకట్టడాలను ధ్వంసంచేయడానికై ఇంగ్లీషువారు ఫిరంగి బేటరీలను అమర్చుకున్నారు; ఇవిగాక నగరానికి దిగువగా గోమతిపై పడవలవంతెనలు

రెండింటిని కూడా వారు నిర్మించుకున్నారు. ఇక అన్నీ సిద్ధంచేసుకున్న తరువాత, సర్ జే. ఔట్రామ్ 1,400 అశ్వికులూ, 30 ఫిరంగులూ గల తన డివిజనుని ఎడమవైపున, అనగా నది ఈశాన్యతీరాన్ని చేరి, అక్కడ తన స్థానం నిర్మించుకున్నాడు. ఈ స్థానంనుండి కాలువ వొడ్డంటేవున్న శత్రుశ్రేణీ పార్శ్వపు అధికభాగంపైనా, దాని వెనకతట్టునున్న శత్రు దుర్గరక్షిత స్థానాలలో చాలావాటిపైనా తన ఫిరంగులు ప్రయోగించడానికి అతనికి అవకాశం చిక్కింది; ఇంతేకాకుండా అయోధ్య ఈశాన్యభాగంతో తిరుగుబాటుదార్ల పైన్యానికున్న రాకపోక మార్గాలనన్నింటినీ అతడు తెగగొట్టేశాడు. 6వ తేదీన, 7వ తేదీన శత్రువు తీవ్రంగానే ప్రతిఘటించినప్పటికీ, అతడు శత్రువును తిప్పికొట్టి వారిని వెంబడించాడు. తిరిగి 8వ తేదీన శత్రువులు అతనిని ఎదుర్కొన్నారు, కాని ఈసారి కూడా వారికి విజయం లభించలేదు. ఇదీలా జరుగుతూండగా, నది కుడిగట్టున వున్న ఫిరంగి బేటరీలు కాల్పులు ప్రారంభించాయి; నదిగట్టునే వున్న ఔట్రామ్‌యొక్క బేటరీలు తిరుగుబాటుదార్లకు పార్శ్వంగానూ వెనుకతట్టుగానూ తమ స్థానాలు ఏర్పరచుకున్నాయి; 9వ తేదీని సర్ ఇ. లూగార్డ్ 2వ డివిజనుతో మార్టినేర్‌పై తుపానుదాడిచేసి దానిని ఆక్రమించుకున్నాడు; ఈ మార్టినేర్ ఒక పార్కు మధ్యనున్న భవనమనీ, కాలువ దక్షిణగట్టునా, కాలువ, కళాశాలల సంగమం దగ్గరా, దిల్ కుషాకి ఎదుటగానూ అది ఉందనీ పాఠకులకు బహుశా జ్ఞాపకం ఉండి ఉంటుంది. 10వ తేదీన బ్యాంకు భవనంలో గండి కొట్టబడి, దానిపై తుపానుదాడి జరిపి, అది ఆక్రమించుకోబడింది; తిరుగుబాటుదార్లు ఒకదానివెంట ఒకటిగా తీసుకున్న స్థానాలన్నింటిపైనా ఔట్రామ్ తన ఫిరంగులను ప్రయోగించుతూ నదికి ఇంకా ఎగువగా పురోగమించాడు. 11వ తేదీన రెండు స్కాట్లండ్ రెజిమెంట్లు (42వ, 93వ రెజిమెంట్లు) తుపానుదాడిచేసి రాణీగారి మందిరం ఆక్రమించుకున్నాయి; ఆ రోజునే ఔట్రామ్ కూడా నది ఎడమగట్టునుండి నగరంలోకి దారి తీస్తున్న రెండు రాతికట్టు వంతెనలపై దాడిచేసి వాటిని వశపరచుకున్నాడు. ఇది జరిగిన తరువాత ఈ వంతెనలపై ఔట్రామ్ తన బలాలతో నది దాటి, ఎదుటనున్న భవనంపై జరుగుతూన్న దాడిలో పాల్గొన్నాడు. మార్చి 13న, దుర్గరక్షితమైన ఇమాంబారా భవనంపై దాడి జరిగింది. ఈ దాడికై, తగిన మాటున్థలం చాటుగా బేటరీలను అమర్చుకోడానికి వీలుగా వుండేలాగున, సొరంగం తవ్వవలసివచ్చింది; మరుసటి రోజున ఈ భవనప్రాకారంలో గండి పేల్చడం పూర్తి అయాక, భవనంపై తుపానుదాడిచేసి దానిని స్వాధీనం చేసుకున్నారు. శత్రువులు ఈ భవనంనుండి పలాయితులై రాజుగారి మందిరమైన కెయిజర్‌బాగ్‌లో దూరగా, వారిని ఇంగ్లీషువారు ఎంత తీవ్రంగా వెంబడించారంటే శత్రువులు ఈ భవనంలో ప్రవేశించినప్పుడే వారిని వెన్నంటి వీరు కూడా ఆ భవనంలోకి ప్రవేశించారు. దీనితో భయంకరమైన బాహాబాహీ యుద్ధం సంభవించింది; కాని మధ్యాహ్నం 3 గంటలయేటప్పటికల్లా భవనం బ్రిటిష్‌వారి స్వాధీనంలోకి

వచ్చేసింది. దీనితో శత్రువు పరిస్థితి ఘోరమైన సంక్షోభంలో పడిపోయినట్టు కనబడుతూంది; కనీస పక్షాన ఇక శత్రు ప్రతిఘటనలో పస అంతా నీళ్ళకారిపోయినట్లు కనిపిస్తుంది; ఇక పారిపోతూన్న శత్రువులను వెంబడించి వారిని అడ్డంకొట్టడానికై కాంబెల్ తక్షణమే చర్యలు తీసుకున్నాడు. ఒక కేవెల్‌రీ బ్రిగేడ్‌నూ, కొంత అశ్విక ఆర్టిలరీనీ తీసుకుని బ్రిగేడియర్ కాంబెల్ వారిని వెంబడించగా, పలాయితులైన వారిని అడ్డుకోవడానికై రెండవ బ్రిగేడ్‌ను తీసుకొని గ్రాంట్ లక్నోనుండి రోహిల్‌ఖండ్‌కు వెళ్లే రోడ్డుపైనున్న సీతాపూర్‌కు చుట్టివెళ్లాడు. పలాయనమవుతూన్న లక్నో నగర రక్షక దళం పనిపట్టించడానికై ఈవిధంగా ఏర్పాట్లు జరిగిన తరువాత, ఇన్‌ఫెంట్రీ ఆర్టిలరీ పట్నంలోపల ప్రవేశించి, ఇంకా ప్రతిఘటన సాగించుతూన్న శత్రువులను పట్నంనుండి తరిమివేయడానికి పూనుకున్నాయి. 15, 19 తేదీలమధ్య జరిగిన యుద్ధమంతా, నదీతీరాన వరుసగా వున్న భవనాలనుండీ ఉద్యానవనాలనుండీ శత్రువును అదివరకే తరిమి వేసి వాటిని ఆక్రమించుకొని ఉండడంవల్ల, పట్నంలోని ఇరుకు వీధులకే పరిమితమై వుండి తీరాలి. కాని 19న నగరమంతా కాంబెల్ వశమైంది. సుమారు 50 వేలమంది తిరుగుబాటుదార్లు పలాయితులై ఉంటారనీ, వీరిలో కొందరు రోహిల్‌ఖండ్‌కూ, కొందరు దోఆబ్, బుందేల్‌ఖండ్‌లవైపూ పారిపోయారనీ అంటున్నారు. జనరల్ రోజ్ తన శ్రేణితో యమునకింకా అధమం అరవై మైళ్ల దూరంలో ఉండడంవల్లనూ, అతనికెదురుగా 30 వేలమంది తిరుగుబాటుదార్లున్నారని అనడంవల్లనూ, ఈవిధంగా శత్రువులకు తప్పించుకుపోవడానికి అవకాశం దొరికింది. రోహిల్‌ఖండ్ దిశగా తిరిగి కేంద్రీకరించగలిగేందుకు కూడా వారికి అవకాశం లభించింది; దీనికి కారణమేమంటే, వారిని త్వరత్వరగా వెంబడించడానికి కాంబెల్‌కి వీలుచిక్కదు; పైగా చాంబర్లెన్ ఎక్కడున్నదీ మనకేమీ ఖబురు తెలియదు; అంతే కాకుండా ప్రాంతం కూడా చాలా పెద్దదవడం కారణంగా తిరుగుబాటుదార్లకు స్వల్పకాలంవరకూ కావలసినంత శరణు దొరుకుతుంది. ఈ కారణాలచేత బుందేల్‌ఖండ్‌లో ఒక సైన్యమూ, రోహిల్‌ఖండ్‌లో ఒక సైన్యమూ, ఈవిధంగా తిరుగుబాటుదార్ల సైన్యాలు రెండు ఏర్పడడం బహుశా తిరుగుబాటుయొక్క తదుపరి లక్షణం కావచ్చు; అయితే లక్నోనుండీ ఢిల్లీనుండీ ఏకకేంద్రంగా జరిగే పురోగమనాల ఫలితంగా, ఈ రెండవ సైన్యాన్ని త్వరలో రూపుమాపడానికి వీలుంటుంది.

ఈ యుద్ధంలో సర్ సి. కాంబెల్ అవలంబించిన చర్యలు, మనమిప్పుడు పరిశీలించడానికి వీలున్నంతవరకూ, అతని సహజవివేకంతోనూ శక్తిసామర్థ్యాలతోనూ జరిపాడు. లక్నోపై జరిగిన ఏకకేంద్ర పురోగమనానికై అతడు చేసిన సైనిక బందోబస్తులన్నీ భేషుగ్గా ఉన్నాయి; సాతే దాడి జరపడానికై చేసిన ఏర్పాట్లన్నిటిలోనూ ప్రతి సందర్భాన్నీ అతడు లెక్కలోకి తీసుకున్నాడు. ఇందుకు భిన్నంగా, తిరుగుబాటుదార్ల సైనిక ప్రవర్తన, ఇదివరకే హీనంగా వుందనుకుంటే, అంతకంటే ఇప్పుడు మరీ హీనంగా దిగజారిపోయింది. ఎర్రకోట్లను తొడుక్కున్న

ఇంగ్లీషు సైనికులను చూసేటప్పటికల్లా తిరుగుబాటుదార్లు ఎక్కడికక్కడే భయాందోళన చెందిపోయారు. తనకంటె ఇరవైరెట్లున్న శత్రుసైన్యాన్ని ఫ్రాంక్స్‌కింద వున్న శ్రేణి ఇంచుమించు ఒక్క మనిషినైనా నష్టపోకుండా ఓడించేసింది. "బలమైన ప్రతిఘటన" అనీ, "తీవ్రమైన పోరాటం" అనీ టెలిగ్రాములు మామూలు ధోరణిలో ఘోషించుతూన్నప్పటికీ, బ్రిటిష్‌వాళ్లకి కలిగిన నష్టాలు గురించి అవి ఎప్పుడైనా వివరించడమంటూ జరిగితే మాత్రం, ఈ నష్టాలు హాస్యాస్పదమైన రీతిలో ఎంత స్వల్పంగా ఉన్నాయంటే, ఇదివరకు లక్నోను బ్రిటిష్‌వాళ్లు కాజేసినప్పుడు ఎంత శౌర్యం ప్రదర్శించడానికీ, ఎంత కీర్తి కూడ గట్టుకోవడానికీ అవసరం కలిగిందో, ఇప్పుడు అంతకంటె హెచ్చేమీ అవసరం కలగలేదనే మాకు తోస్తూంది.

ఎంగెల్స్‌చే 1858 ఏప్రిల్ 15న
రచించబడింది

"New-York Daily Tribune"
1858 ఏప్రిల్ 30 తేదీన
5312వ సంచికలో
ఒక సంపాదకీయ వ్యాసంగా
ప్రచురించబడింది

# ఎంగెల్స్

## *లక్నోపై జరిగిన దాడి వివరాలు

లక్నోపై జరిగిన దాడీ, లక్నో పతనమూ వీటి వివరమైన కథనాలు మనకిప్పుడు లభించాయి. సైనికశాస్త్రదృష్ట్యా ఈ భోగట్టాకి ప్రధానమైన మూలాధారాలైన సర్ కోలిన్ కాంబెల్ పంపే సమాచార లేఖలు ఇంతవరకూ ప్రచురించబడలేదు; అయినప్పటికీ దాడిసేనల కార్యకలాపాలను స్థూలంగా తెలుసుకోడానికి బ్రిటిష్ వార్తాపత్రికల్లో వెలువడిన లేఖలూ, అందులోనూ ముఖ్యంగా ఇదివరకే మేము మా పాఠకులకు అందిచ్చినట్టి లండన్ "Times"లో పడిన మిస్టర్ రస్సెల్ లేఖలూ, పూర్తిగా సరిపోతాయి.

టెలిగ్రాఫు సమాచారాలనుబట్టి లక్నో రక్షణలో ప్రదర్శించబడిన అజ్ఞానము, పిరికితనాలను గురించి మేము తేల్చిన పర్యవసానాలను ఇప్పుడందిన సవివరమైన వృత్తాంతాలు పూర్తిగా ధ్రువపరుస్తున్నాయి.* తమ దుర్గప్రాకారాలపైనా, తమ డాలులపైనా చైనా దేశపు "వీరులు" చిత్రించే నిప్పులు కక్కుతూన్న రాక్షసుల బొమ్మలకీ, భయంకరములైన కృత్రిమ ముఖాలకీ ఎంత ఉపయోగముంటుందో, బయటకు చూడడానికి ఎంతో బలీయంగా కనబడినప్పటికీ హిందూదేశస్థులు నిర్మించిన రక్షణకట్టడాలకు సహితమూ వాస్తవానికి అంతే ఉపయోగముంటుంది. హిందూదేశస్థులు నిర్మించిన రక్షణకట్టడాలలో ప్రతి ఒకటీ కూడా, ఫిరంగులనూ తుపాకులనూ పేల్చడానికి వీలుగా వుండేందుకై బురుజాలనూ సందులనూ రంధ్రాలనూ కలిగిన బలీయములైన గోడలనూ అడ్డగోడలనూ కలిగి, ఎవ్విధంగానూ చొరసాధ్యంకాకుండా అన్నిచోటలా ఫిరంగులతోనూ తుపాకులతోనూ ఖడ్గాలతోనూ మిలమిల్లాడుతూ అభేద్యంగా ఉన్నట్టే బయటికి కనబడ్డాయి. కాని వీటిలో ప్రతి నిర్మాణంయొక్క పృష్ఠ, పార్శ్వభాగాల రక్షణా సంపూర్ణంగా నిర్లక్ష్యపరచబడి, వివిధ రక్షణకట్టడాలయొక్క పరస్పరాశ్రిత సహాయం వూసే తలపెట్టకుండా, వివిధ రక్షణకట్టడాల నడుమనూ, వాటి

---

* ఈ సంకలనంలో 158–160వ పుటలు చూడండి. — సం.

కప్పైదుటమూ ఉన్న నేలను సహితమూ చెట్టూపుట్టా లేకుండా బాగుచెయ్యక అశ్రద్ధచేయడంవల్ల, రక్షణ ఏర్పాట్లకు సంబంధించిన సమాచారాన్ని గురించిన భోగట్టాను ఏవిధంగానూ ముందుగా తెలుసుకోవడం దుస్సాధ్యమై, ఎదుటిదాడినీ పార్శ్వదాడినీ సిద్ధపరచుకునేందుకు చక్కగా అనువై పూర్తి శరణు ఒసగే స్థానాలనుంచి అద్దగోడలనుండి కొద్ది గజాల ఎదుటివరకు శత్రు పురోగమనానికి ఎట్టి ఆటంకమూ లేకుండా పోయింది. తమ ఆఫీసర్లను కోల్పోయినట్టే, అజ్ఞానమూ శిక్షణారాహిత్యమూ రాజ్యంచేస్తున్న సేనలో కొలువు చేస్తూన్నట్టే సామాన్య సిపాయీల జట్టునుంచి ఆశించదగిన కందకాల కలగాపులగమే తప్ప మరేమీకాదు ఇదంతానూ. లక్నో కందక స్థావరాలన్నీ, కాల్చిన ఇటుక గోడల రూపంలోనూ, మట్టి అద్దగోడల రూపంలోనూ వున్నట్టి యావత్తు సిపాయి యుద్ధ విధానంయొక్క ప్రతిరూపమే తప్ప మరొకటికాదు. యూరపియన్ ఎత్తుగడలలోని యాంత్రిక భాగం వారి మనస్సుల్లో పాక్షికంగానే నాటుకొనడం జరిగింది; తుపాకులతో వ్యాయామాలూ, ప్లటూనుకవాతూ వాళ్లకి బాగానే అవగాహనైంది; బేటరీని అమర్చగలరు, గోడలలో విడుపుకోత బీటలు కట్టడమూ వారికి తెలును; కాని ఒక స్థావరాన్ని రక్షించుకోవడంలో, కంపెనీలయొక్క, బటాలియన్లయొక్క చలనాలను ఎలా మేళవించాలో, ప్రతిఘటన శీలమైన స్థావరం ఏర్పరచుకుందుకుగాను బేటరీలనూ విడుపుకోత బీటలున్న ఇళ్లనూ గోడలనూ ఎలా మిళితం చేయాలో — ఈ జ్ఞానం మాత్రం వాళ్లకి కేవలం పూజ్యం. గోడలకు విడుపుకోత బీటలు పెట్టేసి, ఈ బీటలనూ రంధ్రాలనూ వరుసలపై వరుసలుగా నిర్మించేసి, ఈ సౌధాల వరండాలపైనే అద్దగోడల రక్షణకల్గిన ఫిరంగి బేటరీలు అమర్చి, ఈవిధంగా ఆ సౌధాల రాతికట్టు నిద్దగోడలను బలహీన పరచేశారు; ఇదంతా నిరర్థకమే, ఎందుకంటే వీటన్నిటినీ అతిసులభంగా తప్పించేసుకుని శత్రువు పార్శ్వ, పృష్ఠభాగాలపైన దాడిచేయవచ్చు. ఇదే విధంగా ఎత్తుగడల దృష్ట్యా తమ బలహీనతను వారు తెలుసుకుని ఉండడం కారణంగా, దీనికి ప్రత్యామ్నాయంగా ఉండేందుకని చెప్పి ప్రతి స్థానాన్నీ మనుషులతో కుక్కేశారు; దీనితో బ్రిటిష్ ఆర్టిలరీకి వారు ఘోరంగా ఆహుతి అయిపోయి, వారు అనుకోని దిశనుండి దాడిచేస్తూ సైనిక శ్రేణులు ముక్కుడిమూకమీద పడేటప్పటికల్లా, నిర్మాణాత్మకమైనట్టి సుశిక్షణ కలిగినట్టి రక్షణవిధానానికి ఎట్టి ఆస్కారమూ లభించకపోవడమేతప్ప, మరొక ఫలితమేమీ కలుగకుండా పోయింది. కాగా ఏవో కొన్ని యాదృచ్ఛిక పరిస్థితుల కారణంగా విధిలేక బ్రిటిష్‌వారికి సిపాయిల బలోపేతమైన దుర్గరక్షిత నిర్మాణాల ఎదుటనే తలపడడం తటస్థించినప్పుడు సహితమూ, వీటి నిర్మాణం ఎంత లోపభూయిష్ఠంగా ఉందంటే, ఇంచుమించు ఎట్టి ప్రమాదమూ లేకుండానే వాటిని దగ్గరగా సమీపించి, వాటిలో గండికొట్టి, వాటిపై తుపానుదాడి చేసి, వాటిని వశపర్చుకోవడం జరిగింది. ఇమాంబారావద్ద సరిగ్గా ఇదే సంభవించింది. ఈ భవనానికి కొద్ది గజాలు ఎదురుగా పక్కాగోడ (సందు ఇటుకలతో కట్టినది) ఒకటుంది. ఈ గోడవరకూ బ్రిటిష్‌వారు ఒక చిన్న సొరంగం చేసి (ఇలా చేయ

గలగడంవల్లనే ఈ భవనపు ఊర్ధ్వభాగ కుడ్యాలలో చేసిన రంధ్రాలనుండీ, బీటలనుండీ వస్తూన్న ఫిరంగి కాల్పులకి భూమిలో చొచ్చుకొనిపోయే శక్తి ఏమాత్రముందో తెలిసిపోతూంది), ఈ గోడను భారతీయులే బ్రిటిష్‌వారికోసం నిర్మించారేమో అన్నట్టుగా, ఈ గోడనే బ్రిటిష్‌వారు గండికొట్టి తమ ఫిరంగి బేటరీకి ఉపయోగించుకోగల్గారు! ఈ గోడ చాటుగా బ్రిటిష్‌వారు 68-పౌన్ల (నౌకా) ఫిరంగులు రెండింటిని తీసుకొచ్చిపెట్టారు. బ్రిటిష్ సేన ఉపయోగించే 68-పౌన్ల ఫిరంగులలో అతితేలిక రకం సహితమూ శకటం లేకుండానే 87-హండ్రెడ్ వైట్లకి తక్కువ ఉండదు; ఫిరంగులు బోళాగుళ్ల ప్రయోగించే 8-అంగుళాల ఫిరంగినే ఉపయోగించారని అనుకున్నప్పటికీ, ఈ రకం ఫిరంగులన్నిటిలోకీ తేలికైనవి 50-హండ్రెడ్ వైట్లకి తక్కువుండవు; ఇక శకటాన్ని కూడా కలుపుతే అధమం మూడు టన్నులైనా ఉండితీరుతుంది. ఇట్టి ఫిరంగులను, అనేక అంతస్తులుండి, భవనం పైకప్పుపైన బేటరీ వున్న భవనానికి అంత చేరువగా తీసుకురాగలిగారంటే, ఎత్తుగా వున్న స్థలాలను ఉపయోగించుకోవడంలో, నాగరిక సైన్యంలో పనిచేస్తూన్న ఎంతటి సామాన్యపు సాప్పర్ సహితమూ చూపే శ్రద్ధా, మిలిటరీ ఇంజనీరింగు జ్ఞానమూ వారికి ఎంతగా లోపించాయో చక్కగా బయటపడుతూంది.

బ్రిటిష్‌వారు ఎదుర్కోవలసివచ్చిన శాస్త్రీయ పరిజ్ఞానం గురించి ఈ మాత్రం చెప్పితే సరిపోతుంది. ఇక రక్షణచర్యలలో శత్రువుల ధైర్యం పట్టుదలా కూడా మృగ్యంగానే ఉన్నాయి. మార్టిన్యేర్‌లోనేమి, మూసాబాగ్‌లోనేమి దేశీయులు ఒకేఒక విషయంలో ఏకత్వం ప్రదర్శించారు, అదేమిటంటే శత్రువు దాడి చేయగానే పలాయనం చేయడం. రెసిడెన్సీని కాంబెల్ విముక్తిచేయడంలో సికందర్‌బాగ్‌వద్ద చేసిన ఊచకోతలోనైనా (దానిని అసలు యుద్ధం అనడానికే వీల్లేదు) పోల్చడానికి వీలైనట్టిది ఈ సైనికచర్యల పరంపర అంతటిలోనూ ఒక్కటి కూడా లేదనే చెప్పాలి. దాడిచేసే ఉద్దేశ్యంతో శత్రుదళం పురోగమించేటప్పటికల్లా, దేశీయ సైనికులు వెనుకంజవేసి తమ శ్రేణుల పృష్ఠభాగానికి ఆదరాబాదరా పరుగెత్తి పారిపోవడమే; ఇక ఆ స్థలాన్నుండి నిర్గమించకుండా మందగా మూగి వున్న ఈ జనసందోహానికి అడ్డుగా ఇరుకైన ద్వారాలు ఏకొద్దిగానో ఉండేసరికల్లా, తమమీదకి పురోగమించుతూన్న బ్రిటిష్‌వారి తుపాకి బారులకూ సన్నీలకూ ఎట్టి ప్రతిఘటనా చూపకుండానే వారు ఒక్కుమ్మడిగా అక్కడికక్కడే నేలరాలిపోయేవారు. యూరప్‌లోనూ అమెరికాలోనూ ఇంగ్లీషు సేనలు చేసిన అన్ని యుద్ధాల్లోనూ కలిపి "బ్రిటిష్ సన్నీ" ఎంతమందిని బలిగొన్నదో, భయభ్రాంతులైనట్టి దేశీయులపై జరిగిన ఒక్కొక్క దాడిలోనే అంతమందిని బలిగొన్నది. ప్రాక్ప్రపంచంలో జరిగిన సంగ్రామాలన్నిటిలోనూ, ఒక పక్షం మాత్రమే క్రియాశీలంగా వుండి, రెండవ పక్షం కేవలం నిరాశానిస్పృహలతో స్తబ్ధుగా ప్రవర్తించేటట్టి ఈ రీతి సన్నీ యుద్ధాలు తరుచుగా సంభవిస్తూ ఉంటాయి; బర్మా యుద్ధంలో దుర్గ

రక్షిత స్థానాలలో[83] జరిగిన ప్రతి సంఘర్షణా యిందుకొక ఉదాహరణ. మిస్టర్ రస్సెల్ కథనాన్ని అనుసరించి, బ్రిటిష్‌వారికి కలిగిన నష్టమంతా ముఖ్యంగా ఇక తిరోగమించడానికి వీల్లేకుండా చిక్కుకొని భవనపు గదులలోనే ఉండిపోయి అడ్డంకులు నిర్మించుకుని, ఆ గదుల కిటికీలనుండి కిందను భవనప్రాంగణాలలోనూ, తోటల్లోనూ వున్న శత్రువుపైన భారతీయులు ప్రయోగించిన తుపాకుల కాల్పులవల్లనే సంభవించిందని తెలుస్తూంది.

ఇమాంబారా, కైసర్‌బాగ్‌లపై జరిగిన తుపానుదాడిలో భారతీయులు ఎంత త్వరగా పారిపోయారంటే, దాడిచేసి పట్టుకున్నారని చెప్పడం బదులు, ఈ భవనాల్లోకి ఇంగ్లీషువారు తమ సేనలను నడిపించుకునివెళ్లి ఆక్రమించుకున్నారని చెప్పడమే సముచితంగా ఉంటుంది. జరిగిన ఘటనంతటిలోనూ ఆసక్తిజనకమైన అసలు సంగతంతా ఇప్పుడే మొదలవుతోంది. ఎందుచేతంటే, మిస్టర్ రస్సెల్ చల్లగా తెలియజేసినట్టు, ఆ రోజునే కైసర్‌బాగ్ కూడా వశంగావడం ఎంతగా అనుకోకుండా తటస్థించిందంటే, పట్టపగ్గాలులేకుండా విచ్చలవిడిగా కొల్లగొట్టడం సంభవించకుండా ఉండేందుకై ఎట్టి రక్షణ బందోబస్తులు చేయడానికీ వ్యవధిలేకపోయింది. ఘనతవహించిన అయోధ్య నవాబుగారియొక్క ఆభరణాలనూ, అమూల్యములైన ఆయుధాలనూ, దుస్తులనూ, చీనిచీనాంబరాలనూ, తన బ్రిటిష్ యుద్ధ వీరులు ధారాళంగా అంకించుకొంటూన్నట్టి ఉల్లాసకరమైన దృశ్యం స్వేచ్ఛా ప్రియుడైనట్టి అచ్చమైన ఈ జాన్ బుల్‌గారికి ఎంతైనా హృద్యమంగా ఉండే వుండాలి. బ్రిటిష్ సైనికులు పెట్టిన ఈ వరవడినే అనుకరించడంలో సిక్కులూ, గూర్ఖాలూ, శిబిరపరివారమూ ఏమాత్రమూ వెనుకాడలేదు; కాగా తదుపరి జరిగిన కొల్లదోపిడీలను వర్ణించడం మిస్టర్ రస్సెల్‌యొక్క సామర్థ్యానికి సహితమూ అతీతంగా ఉన్నట్టు స్పష్టంగానే కనబడుతూంది. బ్రిటిష్ సేనలు ఒక్కొక్క అడుగు పురోగమించుతూంటే వారివెంటనే దోపిడీ, వినాశకార్యాలూ కొనసాగాయి. 14న కైసర్‌బాగ్ పతనం సంభవించింది; ఇంకో అరగంటకల్లా సైన్యంలో క్రమశిక్షణంతా గాలిలో కలిసిపోయింది; తమకింద వున్న సైనికులనే అదుపాజ్ఞలలో ఉంచుకోవడానికి ఇక ఆఫీసర్లకి శక్యంకాకపోయింది. ఈ కొల్లగొట్టడం ఎంతవరకూ మితిమీరిపోయిందంటే దీనిని అణచడానికని గస్తీదళాలను నియమించి, "ప్రస్తుతపు స్వైర విహారం ఆగిపోయే వరకూ" అన్ని ఇతర యుద్ధచర్యలకూ స్వస్తిచెపుతూ 17వ తేదీన ఉత్తరవు చేస్తేనేగాని జనరల్ కాంబెల్‌కు మరోమార్గం లేకపోయింది. సైనికులు పూర్తిగా హద్దుమీరి పోయినట్టే కనబడుతూంది. 18వ తేదీకల్లా మరీ హీనమైన దోపిడీచర్యలు కట్టిపోయినప్పటికీ విధ్వంస కార్యాలు మాత్రం ఇంకా యథేచ్ఛగా కొనసాగుతూన్నట్టే కనబడుతూంది. ఇళ్ల పైకప్పులనుండి దేశీయులు సాగిస్తూన్న కాల్పులు పట్నంలోపల పురోగమిస్తూన్న సైనికులు ఒక వైపునుండి ఇంకా ఎదుర్కొంటూండగానే, అదే సమయంలో వెనక వస్తూన్న సైన్యం మాత్రం తమ తనివితీర కొల్లగొట్టుతూ వినాశకర కృత్యాలను జరుపుతూనే ఉంది. దోపిడీ

చెయ్యకూడదనీ, ఇందుకై ప్రతి రెజిమెంటునుండీ కొన్ని బలమైన దళాలు బయలుదేరి పట్నంలో విహారం చేస్తూన్న తమ తోడిసైనికులను పట్టుకుని తోడ్తెచ్చి, తమ శిబిరపరివారాన్నందరినీ శిబిరంనుండి కదలకుండా బసలలో ఉండేటట్లు చూడాలనీ, డ్యూటీమీద ఉన్న వారుతప్ప, ఇతరులెవ్వరూ శిబిరం వదిలివెళ్లకూడదనీ, సాయంకాలానికి మరొక ఉత్తరవు జారీ అయింది. 20వ తేదీన ఈ ఉత్తరవులే మరొకసారి గుర్తుచెయ్యబడ్డాయి. ఆ రోజునే "ఆఫీసర్లూ, పెద్దమనుష్యులూ" అయిన ఇద్దరు బ్రిటిష్‌వాళ్లు, లెఫ్టినెంట్ కేవ్, లెఫ్టినెంట్ తాక్‌వెల్‌గార్లు, "పట్నంలోకి వెళ్లి లూటీ చేస్తూండగా ఒక ఇంట్లో హత్యచేయబడ్డారు;" కాగా 26వ తేదీన కూడా పరిస్థితులింకా ఎంత విషమంగా ఉండెనంటే దోపిడీలనూ అత్యాచారాలనూ అణచివేయడానికై అత్యంత కఠినమైన ఆజ్ఞలు జారీచేయవలసివచ్చింది; హాజరుపట్టీలను గంటకొకసారి పిలవడం ఆరంభించారు; సైనికులెవ్వరూ పట్నంలోకి వెళ్లకూడదని కఠినమైన ఆజ్ఞలు జారీ చేశారు; శిబిరపరివారంలోని వారెవరైనా సరే ఆయుధాలు ధరించి పట్నంలో తిరుగుతూండగా పట్టుబడినట్టయితే వారిని వెంటనే ఉరితీస్తామని తెలియజేశారు; డ్యూటీలో ఉన్నప్పుడు తప్ప మిగతా సమయాల్లో సైనికులెవ్వరూ ఆయుధాలు ధరించకూడదని నిషేధించారు; యుద్ధంలో పాల్గొనని వారందరూ నిరాయుధులు గావించబడాలని ఉత్తరవుచేశారు. ఈ ఆజ్ఞలు పకడ్బందీగా అమలు జరిపేందుకుగాను, కొరడాలతో శిక్షించడానికై "ఉచితమైన స్థలాల్లో" ముక్కోణపు చట్రాలను నిర్మించారు.

పంధొమ్మిదవ శతాబ్దిలో నాగరిక సైన్యంలో ఇలాంటి చర్యలు అవలంబించవలసి వచ్చిందంటే పరిస్థితులు నిజంగా ఎంతవరకూ దిగజారిపోయాయో తెలుస్తుంది; ప్రపంచంలో మరెక్కడైనాసరే మరేదేశపు సైన్యాలైనా ఈ అత్యాచారాలలో పదోవంతు జరిపి ఉండిన పక్షంలో బ్రిటిష్ పత్రికలు వాటిని ఎంత అపకీర్తిపాల్జేసి ఉండేవో కదా! ఇవన్నీ బ్రిటిష్ సైన్యమే కావించిన ఘనకార్యాలై ఉండడం కారణంగా, ఇవన్నీ యుద్ధం తరువాత స్వభావికంగా సంభవించే పర్యవసానాలేనని మనతో ఇప్పుడు చెబుతున్నారు. తాము ఘనకార్యాలు సాధించి కీర్తి సంపాదించే ప్రదేశపు దరిదాపుల చిన్నచిన్న వెండిచెమ్చాలుగాని, రత్నఖచితములైన కంకణాలుగాని, ఇలాంటివే ఏవో స్వల్పవిలువగల స్మృతిచిహ్నాలు కనబడితే, బ్రిటిష్ ఆఫీసర్లూ పెద్దమనుష్యులూ అయినవారు ఆ వస్తువులను స్వేచ్ఛగా జేబులోవేసుకున్నా ఏమీ తప్పులేదు; ఇక విచ్చలవిడిగా జరుగుతూన్న బందిపోట్లనూ అత్యాచారాలనూ అణచడానికని, యుద్ధం మధ్యలో తన సైన్యాన్నే నిరాయుధులను చేయక కాంబెల్‌కి తప్పిందికాదంటే, అందుకేవో తగిన మిలిటరీ కారణాలు తప్పకుండా ఉండేవుంటాయి; ఇకపోతే, ఎంతో శ్రమ అనుభవించి ఎన్నో కష్టాలకు లోనైన తరువాత పాపం ఈ దురదృష్టవంతులు ఒక వారం రోజులపాటు ఆటవిడుపు సంపాదించి, ఏదో కాస్త సరదాగా వినోదిస్తూంటే, వారిని ఎవ్వరూ తప్పుపట్టుకోరు.

అసలు విషయమేమిటంటే, ఇంత పశుప్రాయమైన సైన్యం ఒక్క బ్రిటన్‌లో తప్ప విడిచి యూరప్‌లోగాని అమెరికాలోగాని మరెక్కడా లేదు. దోపిడీ, అత్యాచారం, ఊచకోత — ఈ ఘోరాలు ఇతరత్రా పూర్తిగా వ్యస్తిచెప్పబడినప్పటికీ — ఇవి మాత్రం బ్రిటిష్ సైనికునికి అనుశ్రుతంగా సంక్రమించుతూన్న ప్రత్యేక సౌకర్యాలూ, సహజంగా వేళ్లు పాదుకున్నట్టి హక్కులే. ద్వీపకల్ప యుద్ధంలో బాడాహోస్, సాన్ సెబాస్టియన్‌లపై[84] తుపానుదాడి జరిపిన తరువాత రోజులతరబడి సాగించిన ఘోరాలతో సమానమైనవి ఫ్రెంచి విప్లవం తరువాత మరే ఇతర జాతి చరిత్రలోనూ జరిగివుండలేదు; ఇకపోతే మధ్యయుగాలనాటి అనువాయితీ ప్రకారం, దాడిచేసి స్వాధీనపరచుకున్న నగరాన్ని కొల్లగొట్టే హక్కు ఇతరత్రా అన్ని దేశాల్లోనూ నిషేధించబడినప్పటికీ, బ్రిటిష్ సైన్యంలో మాత్రం నేటికీ నియమం తప్ప కుండా యథావిధిగా అమలు జరుపబడుతూంది. ఢిల్లీలో మాత్రం అత్యవసరమైన మిలిటరీ పరిస్థితుల దృష్ట్యా, ఈ నియమానికి అంతరాయం కలుగక తప్పిందికాదు; కాగా, అదనపు వేతనమే ముట్టుతూన్నప్పటికీ సైనికులకు ఢిల్లీలో చేయిజారిపోయిన అవకాశాన్ని ఇప్పుడు లక్నోలో వడ్డీతో కూడా రాబట్టుకునే తరుణం దొరికింది. పన్నెండు దినాలు అహోరాత్రాలు లక్నోలో బ్రిటిష్ సైన్యమంటూ లేనేలేదు — అక్కడున్నదల్లా ఆ పట్నంనుండి తరిమి వేయబడిన సిపాయిలకంటె హద్దూపద్దూ మీరిపోవడంలోనూ, దౌర్జన్యంలోనూ, దురాశలోనూ ఎట్టి పోలికా లేకుండా మించిపోయి బందిపోటు ముఠాలకింద దిగజారిపోయి తప్పతాగి పశు ప్రాయంగా స్వైరవిహారం చేస్తూన్నట్టి అల్లరిమూకే. 1858లో లక్నోను కొల్లగొట్టిన ఘటన బ్రిటిష్ సైనికశాఖకంతటికీ శాశ్వత కళంకంగా కలకాలమూ చరిత్రలో నిలబడి పోతుంది.

ఇండియాలో నాగరికతనూ మానవత్వాన్నీ ఉద్ధరించేందుకై పురోగమించుతూ బరి తెగిపోయినట్టి సైనికులు, దేశీయులయొక్క చరాస్తులను మాత్రమే నిరాటంకంగా కాజేయగా, వీరి వెనువెంటనే బ్రిటిష్ ప్రభుత్వం రంగంలోకి ప్రవేశించి దేశీయులను నిలువునా దోచి చేసి వారి స్థిరాస్తులను కాజేస్తూంది. ప్రథమ ఫ్రెంచి విప్లవం కులీనప్రభువుల భూములనూ, చర్చి భూములనూ జప్తుచేసిందని రగడ లేవదీశారే! ఆర్లియన్స్ కుటుంబంవారి ఆస్తులను లూయీ నెపోలియన్ జప్తుచేశాడని రగడ లేవదీశారే! ఇక్కడో, బ్రిటిష్ కులీనవంశస్థుడైనట్టి, మాటల్లోనూ ప్రవర్తనలోనూ హావభావాల్లోనూ నవనీతంలాంటి సాధుస్వభావాన్ని ప్రద ర్శించుతూన్నట్టి, పెద్దమనిషి అయినట్టి లార్డ్ కానింగ్ రంగంమీదకి దయచేసి, తన పైఅధికారి అయిన వైకౌంట్ పామర్‌స్టన్ హుకుమ్ ప్రకారం ఏకంగా ఒక జాతికి చెందిన ప్రజలందరి భూములను, పదివేల చదరపుమైళ్ల విస్తీర్ణంలో వున్న ప్రతి ఎకరా, ప్రతి సెంటూ ప్రతి కుంటా జప్తుచేసి కాజేస్తున్నాడే.[85] అయితే ఏంగాక! జాన్ బుల్‌కి ఎంత చక్కని లూటీ దొరికిందిగా మరి! పోతే, కనీవిని ఎరుగని ఈ చర్యపట్ల కొత్తగా అధికారా

నికివచ్చిన ప్రభుత్వం పేరిట లార్డ్ ఎల్లెన్‌బరో తన ఆక్షేపణ తెలిపిన వెంటనే, "Times" పత్రికతోపాటుగా ఒక దండు దండూ చిన్న బ్రిటిష్ పత్రికలు ఒక్క పాళంగా లేచి పెద్ద గాలిదుమారం లేవనెత్తి, ఈ మొత్తం దోపిడీనంతనీ సమర్థించుతూ, తన మనసొచ్చిన ఆస్తిని జప్తుచేసి కాజేయడానికి జాన్ బుల్‌కి హక్కు ఉందంటూ జాన్ బుల్ కొమ్ముకాయడానికని వాదించడం మొదలెట్టాయి. అవును మరి, అనన్యసామాన్యుడైన వ్యక్తి కాదా జాన్? "Times" చెప్పినట్టు, ఇతగానికి సత్కీర్తిని ప్రసాదించే సుగుణాలే, ఇతరులకి అప్రతిష్ఠ ఆపాదించే దుర్గుణాలుగా మారిపోతాయి.

ఇదిలా ఉండగా — దోపిడి చేసుకోవడానికిగాను బ్రిటిష్ సైన్యం పూర్తి విచ్ఛిత్తి పుణ్యమా అంటూ — తిరుగుబాటుదార్లు నిరాఘాటంగా, తరమబడకుండా తప్పించుకుని వెల్లడిప్రాంతంలోకి పారిపోయారు. వారిప్పుడు రోహిల్‌ఖండ్‌లో కేంద్రీకృతమౌతున్నారు; కొందరు అయోధ్యలోనే ఇంకా చిల్లర యుద్ధాలు సాగిస్తున్నారు; పోతే తప్పించుకు పారిపోయిన వారిలో మరికొందరు బుందేల్‌ఖండ్ దిశగా పలాయితులైయారు. ఇక ఎండలూ వర్షాలూ రేపో మాపో ఆరంభించనున్నాయి; కిందటేడులాగా కాలమానం బ్రిటిష్ శరీరతత్వాలకు అత్యంతానుకూలంగా ఉండినట్టుగా ఈ ఏడుండేటట్టు కనబడ్డంలేదు; కిందటేడాది బ్రిటిష్ సైనికులందరూ శీతోష్ణ పరిస్థితులకి కొంతకాకపోతే కొంతవరకైనా అలవాటుపడ్డారు; ఈ ఏడాది అక్కడకు వెళ్లిన బ్రిటిష్ సైనికులలో చాలామంది కొత్తగా దిగినవాళ్లే. జూన్, జూలై, ఆగస్టులలో ప్రారంభంకాబోయే యుద్ధచర్య ఫలితంగా అనేక బ్రిటిష్ ప్రాణాలు ఆహుతి కానున్నాయనడంలో ఎట్టి సందేహమూ ఉండనక్కరలేదు; ఇక స్వాధీనపరచుకున్న ప్రతి పట్నంలోనూ కొన్ని రక్షణ దళాలను విధిగా ఉంచాల్సిన ఫలితంగా, క్రియాశీలమైన సైన్యం అతి త్వరగా కరిగిపోకతీరదు. నెలకి 1,000 చొప్పున కొత్త అదనపు బలాలు దిగినప్పటికీ సైన్యంలో యుద్ధసమర్థులైన సైనికుల సంఖ్యను నిలబెట్టడానికి ఇది ఏమాత్రమూ చాలదనే ఖబురు అప్పుడే మనకి వినబడుతూంది; ఇక దుర్గరక్షణ దళాలను గురించి చెప్పాల్సొస్తే, కేవలం ఒక్క లక్నోలోనే అధమం 8,000 మంది, అనగా కాంబెల్ సైన్యంలో మూడవవంతుకు పైగా, అవసరమౌతారు. రోహిల్‌ఖండ్‌లో యుద్ధచర్యలకై సన్నద్ధం చేయవలసిన సైనిక బలం లక్నోలో ఉంచవలసిన రక్షణదళంకంటె బలమైనదిగా ఉండడానికి ఏమాత్రమూ అవకాశం ఉన్నట్టు కనబడదు; ఇంతవరకూ యుద్ధాలతోనూ ముట్టడులతోనూ జరిగిన ఈ సంగ్రామంవల్ల బ్రిటిష్‌వారికి కలిగిన చికాకులకంటెనూ, ప్రాణనష్టంకంటెనూ, తిరుగుబాటుదార్లలో పెద్దపెద్దబలాలను చెదరగొట్టడంలో తప్పనిసరిగా విజయం సమకూర్చే గెరిల్లా యుద్ధంలోనే మరింతహెచ్చుగా చికాకులూ ప్రాణనష్టమూ సంభవించుతాయన్న అభిప్రాయం బ్రిటిష్ ఆఫీసర్లలో అంతకంతకు అధికంగా వ్యాపించుతూందని కూడా వార్తలు తెలుపుతూన్నాయి. ఇక తుది విషయమేమిటంటే, ఇంగ్లీషువారికి ఏవిధంగానూ శుభ

సూచకంగా ఉండని రీతిలో సిక్కులు మాట్లాడ్డం మొదలెడుతున్నారు. తమ సహాయంలేనిదే ఇండియాను నిలబెట్టుకోవడం బ్రిటిష్‌వారి తరంగాదనీ, తామే గనుక తిరుగుబాటులో చేరివుంటే, ఎల్లకాలం కాకపోయినా అధమం కొంతకాలం వరకైనా ఇండియాను నిలబెట్టుకోవడం ఇంగ్లీషువారికి కష్టమైపోయేదనీ వారిలో ఒక అభిప్రాయం ఏర్పడింది. దీనిని వారు మాట మిగల్చకుండా బాహాటంగానే చెబుతున్నారు; చెప్పడమే కాకుండా ప్రాగ్దేశస్థులకు సహజమైన ధోరణిలో అతిశయోక్తులతో చెబుతున్నారు. వెనుక ముడ్కీ, ఫెరోజిషా, అలివాల్[86] యుద్ధాలలో తమను ఓడించినట్టి శ్రేష్ఠ జాతివారు కారు ఇప్పటి ఇంగ్లీషువారు అనే ఒక నమ్మకం వారిలో కుదిరిపోయింది; ప్రాక్ జాతులలో ఇటువంటి అభిప్రాయం ఒకసారి గనుక ఏర్పడిందంటే, ఇక ఒక్క అడుగుదాటితే బహిరంగమైన యుద్ధమన్న మాటే; ఒక్క అగ్గిరవ్వ పడిందంటే బ్రహ్మాండమైన అగ్నిజ్వాల లేచిపోతుంది.

మొత్తంమీద చూస్తే, ఢిల్లీని పట్టుకున్నంత మాత్రాన ఇండియాలో తిరుగుబాటు ఎలా అంతంకాలేదో, లక్నోని పట్టుకున్న మాత్రాన కూడా అలాగే అంతంకాలేదు. ఈ ఎండా కాలంలో జరగబోయే యుద్ధం ఫలితంగా ఎట్టి ఘటనలు సంభవించవచ్చునంటే, ఆ యుద్ధ చర్యలనే బ్రిటిష్‌వారు చలికాలంలో ఇంచుమించు ప్రధానంగానైనా పునః ప్రారంభించవలసి వస్తుందేమో అని కూడా అనిపిస్తోంది; అంతేకాదు, పంజాబ్‌నే పునః జయించవలసివస్తుందేమో కూడా. పరిస్థితులు ఎంత అనుకూలంగా పరిణమించినప్పటికీ, సుదీర్ఘమైనట్టి, కష్టనష్టాలతో కూడుకున్నట్టి గెరిల్లా యుద్ధం వారు ముందుముందు ఎదుర్కోవాల్సి ఉంటుందన్న విషయం మాత్రం తథ్యం — ఇది ఇండియాలోని మండుటెండలో గడపవలసిన యూరపియన్లకెంతమాత్రమూ రుచించదనడంలో ఎట్టి సందేహమూ లేదు.

ఎంగెల్స్‌చే 1858 మే 8న
రచించబడింది

"New-York Daily Tribune"
1858 మే 25వ తేదీన
5333వ సంచికలో
ఒక సంపాదకీయ వ్యాసంగా
ప్రచురించబడింది

# మార్క్స్

## అయోధ్యను కలిపివేసుకోవడం[87]

ఒక రాజ్యం వేరొక రాజ్యంమీద యుద్ధం ప్రకటించకుండానే, లేదా ఆ రాజ్యంతో యుద్ధ పరిస్థితిని నెలకొల్పకుండానే, ఆ రాజ్యంలోని ఒక రాష్ట్రంపై భారీ ఎత్తున యుద్ధ చర్యలు సాగించవచ్చునని అంతర్జాతీయ న్యాయశాస్త్రంలో ఒక సరికొత్త సూత్రాన్ని సుమారు పద్దెనిమిది నెలల క్రితం కాన్‌టన్‌వద్ద బ్రిటిష్ ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ బ్రిటిష్ ప్రభుత్వమే ఈనాడు ఇండియా గవర్నర్ జనరల్, లార్డ్ కానింగ్ ద్వారా నేడు అమలులో వున్న అంతర్జాతీయ న్యాయశాస్త్రాన్ని తలకిందులు చేయడానికై మరొక అడుగు ముందుకు సాగింది. ఈ ప్రభుత్వం:

> "అయోధ్య రాష్ట్రంలో భూస్వామ్యపు హక్కును బ్రిటిష్ ప్రభుత్వం భుక్త పరచుకొని, ఈ హక్కును తనకు ఉచితమని తోచిన రీతిని వినియోగిస్తుంది,"[88]

అని ప్రకటించింది.

1831లో వార్సా పతనానంతరం,[89] పోలెండులోని అనేక కులీనవంశస్థుల స్వాధీనంలో వున్న "భూస్వామ్యపు హక్కు" రష్యా చక్రవర్తి* భుక్తపరచుకున్నప్పుడు, బ్రిటిష్ పత్రికలూ, పార్లమెంటూ ఏకగ్రీవంగా తమ కోపోద్రేకాన్ని పెద్ద పెట్టున ప్రకటించాయి. నొవారా యుద్ధానంతరం,[90] స్వాతంత్ర్య సమరంలో ప్రముఖ పాత్రను వహించిన కొంతమంది లొంబార్డీ కులీనవంశస్థుల ఎస్టేట్లను ఆస్ట్రియా ప్రభుత్వం సరాసరి భుక్తంచేసుకోకపోయినా, కేవలం తాత్కాలికంగా తన స్వాధీనంలోకి మాత్రమే తెచ్చుకొనేసరికల్లా, ఏకగ్రీవమైన ఆ బ్రిటిష్ కోపోద్రేకం పునరుక్తమైంది. పోతే, లూయీ ఫిలిప్ రాజ్యానికొచ్చినప్పుడు, ఏవో న్యాయశాస్త్ర సంబంధమైన మడతపేచీలు రాగా, సాధారణ ఫ్రెంచి న్యాయశాస్త్రం ప్రకారం

* మొదటి నికోలస్. — సం.

ప్రభుత్వ భూములకింద దఖలుపడకుండా ఉండిపోయినట్టి ఆర్లియన్స్ కుటుంబంవారి ఎస్టేట్లను 1851 డిసెంబరు 2న లూయీ నెపోలియన్ భుక్తంచేసుకునేసరికి, బ్రిటిష్ ఆగ్రహావేశాలకు మితిమేరా లేకపోగా, కేవలం ఈ ఒక్క చర్యవల్లనే సమాజ వ్యవస్థ అసలు పునాదులే తలకిందులైపోయాయనీ, పౌరసమాజంయొక్క మనుగడకే స్వస్తిజరిగిందనీ లండన్ "Times" పత్రిక రాసింది. ధర్మబద్ధమైన ఈ ఆగ్రహమంతా ఏమిటో నేడు వాస్తవంలో వెల్లడైంది. ఏ కొద్దిమంది కులీనవంశస్థుల జమీలో, ఏ రాజకుటుంబీకుల ఎస్టేట్లో కాకుండా, సుమారు ఐర్లండు విస్తీర్ణంతో సమానమైన ఒక రాజ్యంలో[1] ఈ మూలనుండి ఆ మూల వరకూ వున్న యావత్తు భూమినీ, లార్డ్ ఎల్లెన్‌బరో స్వయంగా అన్నట్టు "ఒక యావత్తు జాతి ప్రజల వారసత్వాన్నీ" ఒక్క కలంపోటుతో ఇంగ్లండు భుక్తంచేసుకుంది.

కనీవినీయెరుగనట్టి ఇట్టి చర్యను న్యాయమైనదేనని బ్రిటిష్ ప్రభుత్వం పేరిట సమర్థించడానికి లార్డ్ కానింగ్ చెప్పిన సాకులు — కారణాలని అనేందుకు మాకు నోరు రావడంలేదు — ఏమిటో విందాం: మొదటిది: "లక్నో పట్టణాన్ని సైన్యం ఆక్రమించుకుంది;" రెండవది: "తిరుగుబాటు చేసిన సైనికులచే ప్రారంభించబడిన ప్రతిఘటనకు పట్టణవాసుల సహాయమూ, మొత్తంమీద రాష్ట్రప్రజలందరి సహాయమూ లభించింది;" మూడవది: "వారు ఒక మహాపరాధం చేశారు; తత్కారణంగా ధర్మశాస్త్ర సమ్మతమైనట్టి శిక్షకు వారు అర్హులవుతున్నారు." దీనినే స్పష్టంగా చెప్పాలంటే: బ్రిటిష్ సైన్యం లక్నోను పట్టుకుంది గనుక, అయోధ్యలోని యావత్తు భూమినీ, మిగతా రాష్ట్రమంతా తమ స్వాధీనంలోకి యింకా రాకపోయినప్పటికిన్నీ, భుక్తంచేసుకొనే హక్కు ప్రభుత్వానికుందన్నమాట. బ్రిటిష్ వారి జీతభత్యాలను తింటూ అయోధ్యలో వున్న దేశీయ సైనికులు పితూరీ చేశారు గనుక బ్రిటిష్ పరిపాలన బలాత్కారంగా నెత్తిమీద రుద్దబడిన అయోధ్య పౌరులకు తమ జాతీయ స్వాతంత్ర్యానికై తిరుగుబాటు చేసేందుకు హక్కు లేదన్నమాట. ఇంకా క్లుప్తంగా చెప్పాలంటే, అయోధ్యలో న్యాయసమ్మతంగా ఏర్పడిన బ్రిటిష్ ప్రభుత్వాధికారంపై అయోధ్య ప్రజలు తిరుగబడ్డారు; గనుక వారి ఆస్తులను భుక్తంచేసుకోడానికి ఈ తిరుగుబాటు తగిన కారణంగా ఏర్పడుతూందని బ్రిటిష్ ప్రభుత్వం ఇప్పుడు ప్రకటించుతూందన్నమాట. లార్డ్ కానింగ్ మాటల్లో వున్న డొంకతిరుగుడు అంతా ఒక పక్కకు నెట్టివేసి చూస్తే, అయోధ్యలో బ్రిటిష్ పరిపాలన న్యాయసమ్మతంగా నెలకొల్పబడిందని లార్డ్ కానింగ్ భావిస్తున్నట్టుగా అసలు ప్రశ్న తేల్తూంది.

ఇక అయోధ్యలో బ్రిటిష్ పరిపాలన ఏవిధంగా నెలకొల్పబడిందో చూదాం: అయోధ్య మీద దెబ్బతీయడానికి తగిన తరుణం ఆసన్నమైందని 1856లో లార్డ్ డల్‌హౌసీ ఎప్పుడైతే నిశ్చయించుకున్నాడో, అప్పుడు వెంటనే కాన్పూర్‌లో ఒక సైన్యాన్ని కేంద్రీకరించి, ఈ సైన్యాన్ని నేపాల్ రాజాపై నిఘాపెట్టి ఉంచడానికోసం సమీకరించినట్టుగా అయోధ్య

రాజాకి తెలియజేశాడు. ఉన్నట్టేవుండి, హఠాత్తుగా ఈ సేన అయోధ్యపై దండయాత్ర సాగించి, లక్నోను స్వాధీనపర్చుకుని, రాజాను ఖైదుచేసింది. తన రాజ్యం బ్రిటిష్‌వారికి ధారాదత్తం చేసివేయమని అతనిపై ఒత్తిడి తెచ్చారు, కాని ఫలితం లేకపోయింది. దానితో అతన్ని కలకత్తాకు తీసుకుపోయి, అతని రాజ్యం ఈస్ట్ ఇండియా కంపెనీ భూభాగాలలో కలిపేసుకోబడింది. 1801లో లార్డ్ వెల్స్లీ అయోధ్యరాజాతో చేసుకున్న సంధి పత్రంలో* 6వ నిబంధనను పురస్కరించుకుని ఈ విశ్వాసఘాతుక దండయాత్ర జరిగింది. ఈ 1801 నాటి సంధి, 1798లో సర్ జాన్ షోర్ చేసుకున్న సంధియొక్క స్వభావసిద్ధమైన ఫలితమే తప్ప మరేమీకాదు. స్వదేశ సంస్థానాధీశులతో ఆ రోజుల్లో ఆంగ్లో-ఇండియన్ ప్రభుత్వం ఏర్పరచుకున్న సంబంధాలలో అవలంబించిన మామూలు విధానం అనుసరించి, ఈ మొదటి 1798వ సంధి ఇరుపక్షాల మధ్యా పరస్పర సైనిక సహకారానికి, అనగా ఇతరులమీద తమలో ఒకరు దాడిచేసినా, లేదా తమరిలో ఒకరిమీద ఇతరులు దాడిచేసినా ఉభయులూ ఒకరికొకరు సహాయంచేసుకోడానికై చేసుకున్న సంధి. ఈ సంధి ఫలితంగా ఈస్ట్ ఇండియా కంపెనీకి సాలీనా 76 లక్షల రూపాయిలు (38 లక్షల డాలర్లు) ధనసహాయం ముట్టింది; కాని సంధి పత్రంలోని 12వ, 13వ నిబంధనల ననుసరించి అయోధ్యరాజా తన దేశపు ప్రజలపై పన్నుల భారం తగ్గించాల్సొచ్చింది. నిజానికి కేవలం పరస్పరమూ వ్యతిరేకంగా ఉన్న ఈ రెండు షరతులనూ ఏకకాలంలో అమలుజరపడానికి అయోధ్యరాజాకి ఎంతమాత్రమూ సాధ్యంకాదు. ఇలాంటి విషమపరిస్థితులను సృష్టించడానికే ఈస్ట్ ఇండియా కంపెనీ వేసిన ఈ ఎత్తు ఫలితంగా, కొత్త చిక్కులు ఏర్పడి, వాటిని సర్దుకోడానికై 1801లో మరో సంధి జరిగింది; దీని ప్రకారం వెనుకటి సంధిలో ఏ షరతులైనా ఉల్లంఘింపబడినట్టు నేరారోపణ జరిగిన పక్షంలో అందుకు పరిహారంగా కొంత రాజ్యభాగాన్ని అయోధ్యరాజా ఇచ్చుకోవలసి ఉంటుంది; ఆవిధంగా భూభాగాన్ని దత్తముగా తీసుకోవడం నిలువునా బంది పోటుదొంగతనమేనని ఆ రోజుల్లో పార్లమెంటులో నిశితంగా ఖండించడంచేత, తన కుటుంబానికి రాజకీయంగా అప్పుడున్న పలుకుబడి ఫలితంగా లార్డ్ వెల్స్లీ తప్పించుకు బయటపడ్డాడేగాని, లేకుంటే విచారణ కమిటీముందు బోనులోకి ఎక్కి ఉండవలసిందే.

ఈ భూభాగాన్ని ఇచ్చినందుకు ప్రతిఫలంగా, సంధిపత్రంలోని 3వ నిబంధన ననుసరించి, మిగిలిన భూభాగాల్ని అంతశ్శత్రువులనుండీ, బాహ్య శత్రువులనుండీ రక్షించు తాననీ, వాటిపై, అయోధ్యరాజాకూ, ఆయన వారసులకూ, ఆయన తదనంతరం రాజ్యం అధిష్ఠించే వారికీ ఆచంద్రతారార్కం భుక్తాన్ని కంపెనీ హామీ ఇచ్చింది. కాని ఈ 6వ నిబంధనలోనే, రాజామెడకి గోతులు తీస్తూన్న మాట ఒక్కటుంది: అదేమిటంటే, తన ప్రజల యోగ

* సజీద్ అలీ షా. — సం.

క్షేమాదులకు దోహదకారిగా ఉండేటట్టే, తన ప్రజల ధనమానప్రాణాలకు భద్రత కల్గించడానికి అనుకూలమైనట్టే పరిపాలనా విధానం తన సొంత ఉద్యోగులద్వారా నిర్వహింపజేస్తానని ఆ నిబంధనలో రాజా పూచీపడ్డాడు. ఇలాంటి పరిస్థితుల్లో ఈ సంధినిబంధనలు అయోధ్యరాజు ఉల్లంఘించాడనే అనుకుందాం; సంధి ప్రకారం అతని ప్రభుత్వం తన ప్రజల ధనమాన ప్రాణాలకు ఎట్టి భద్రత కల్పించడంలేదనే (మాటవరసకు వాళ్లను ఫిరంగి మూతులకు కట్టి పేల్చేస్తున్నాడనీ, వారి ఆస్తిపాస్తులను లాక్కొంటున్నాడనీ) అనుకుందాం; అలాంటప్పుడు ఈస్ట్ ఇండియా కంపెనీకి పరిష్కారమార్గం ఏమైనా ఉందా? అయోధ్యరాజుతో సంధి చేసుకున్నారంటే అతను సర్వంసహాధికారాన్ని కలిగిన రాజనీ, అతడు స్వేచ్ఛగా వ్యవహరించగలిగే స్వతంత్ర వ్యక్తి అనీ, సంధికి ఒక పక్షంవాడనీ సంధిలో ఒప్పుకున్నట్టే గదా. సంధి ఉల్లంఘించబడినదనీ, తత్ఫలితంగా సంధి రద్దయిపోయిందనీ, ఈస్ట్ ఇండియా కంపెనీ ఎప్పుడైతే ప్రకటించిందో, అప్పుడు కంపెనీకి రెండేరెండు మార్గాలుంటాయి: రాయబారాలు సాగించి, రాయబారాలకి అదనంగా ఒత్తిడి తీసుకొచ్చి తత్ఫలితంగా కొత్త సంధినైనా కుదుర్చుకోవాలి; లేదా రాజామీద యుద్ధమైనా ప్రకటించాలి. అంతేగాని యుద్ధం ప్రకటించకుండానే ఆయన రాజ్యంమీద దండయాత్ర సాగించి, అకస్మాత్తుగా ఆయనను ఖైదుచేసి, ఆయనను రాజ్యభ్రష్టుని గావించి, ఆయన రాజ్యాన్ని లాక్కుని తమ రాజ్యంలో కలిపేసుకోవడము సంధిని ఉల్లంఘించడమే కాకుండా, అంతర్జాతీయ న్యాయశాస్త్రంలో ప్రతి సూత్రాన్నీ కాలరాయడమే అవుతుంది.

అయోధ్యని కలిపేసుకోవడం బ్రిటిష్ ప్రభుత్వానికి హఠాత్తుగా పుట్టిన బుద్ధేమీ కాదని ఒక చిత్రమైన ఘటనవల్ల రుజువవుతూంది. 1831లో లార్డ్ పామర్‌స్టన్ విదేశాంగమంత్రి అయిన ఉత్తరక్షణంలోనే అయోధ్యను కలిపేసుకోవలసిందని అప్పటి గవర్నర్ జనరల్‌కు* తాఖీదు పంపించాడు. కాని అప్పట్లో ఆ తాబేదారు ఆ పని చేయ నిరాకరించాడు. ఈ వ్యవహారమంతా ఎలాగో అయోధ్యరాజు** చెవిని పడింది; ఆయన ఏదో నెపంతో లండన్‌కు ఒక రాయబారం పంపాడు. ఈ రాయబారులు తమకు కలిగిన ఆటంకాలన్నిటినీ నిగ్రహంతో ఓర్చుకుని, ఎలాగైతేనేం చివరకి బ్రిటిష్ రాజు నాల్గవ విలియమ్‌తో భేటీచేసుకొని, తమ రాయబారం విన్నవించుకోగల్గారు. అంతవరకూ ఈ వ్యవహారం గురించి అసలే తెలియని నాల్గవ విలియమ్, అయోధ్యదేశాన్ని ఎదుర్కొంటూన్న ప్రమాదం గురించి అప్పుడు తెలుసుకున్నాడు. దీని ఫలితంగా నాల్గవ విలియమ్‌కీ పామర్‌స్టన్‌కీ ఘాటైన వాగ్వాదం జరిగి,

---

* విలియం బెంటింక్. — సం.

** నజీర్-ఎద్దీన్. — సం.

ఇక మీదట ఇటువంటి coups d'état* సాగించడానికి ఎంతమాత్రమూ వీల్లేదనీ, ఇటు వంటిది జరిగినట్టయితే వెంటనే బర్తరఫు చేస్తాననీ పామర్‌స్టన్‌కి రాజా గట్టిగా చెప్పాడు. అయోధ్యను కలిపేసుకోవడమూ, ఆ దేశంలో వున్న భూములన్నిటినీ భుక్తంచేసుకోవ డమూ పామర్‌స్టన్ తిరిగి అధికారానికి వచ్చిన తరువాతే జరిగిందన్న విషయం మనం ముఖ్యంగా జ్ఞాపకం తెచ్చుకోవాలి. 1831లో అయోధ్యను కలిపేసుకోవడానికి చేసిన ప్రథమ ప్రయ త్నాలకు సంబంధించిన కాగితాలు సభవారికి అందజేయాలని కొద్దివారాల క్రితం కామన్స్ సభలో ప్రతిపాదించబడగా, ఆ కాగితాలు గల్లంతైపోయాయని బోర్డ్ ఆఫ్ కంట్రోల్ కార్యదర్శి, మిస్టర్ బెయిలీ తెలియజేశాడు.

మళ్లీ 1837లో పామర్‌స్టన్ రెండవ దఫా విదేశాంగమంత్రి అయిన తరువాతనూ, లార్డ్ ఆక్‌లండ్ ఇండియా గవర్నర్ జనరల్‌గా ఉన్నప్పుడూ, అయోధ్యరాజా**కి ఈస్ట్ ఇండియా కంపెనీతో మరొక సంధి చేసుకోక తప్పిందికాదు. 1801 నాటి సంధిలోని 6వ నిబంధనను గూర్చి ప్రస్తావించుతూ, "ఆ నిబంధనలో వివరించిన బాధ్యతను" (దేశాన్ని బాగా పరిపాలించడం) "నెరవేర్చని పక్షంలో పరిహారం ఏమీ చెప్పబడలేదు" గనుక, కొత్త సంధి షరతుల్లో 7వ నిబంధనను చేర్చి, అందులో విశేషించి ప్రత్యేకంగా ఈకింది విధంగా వివరించడం జరిగింది:

"అయోధ్యరాజాగారు తన ప్రభుత్వంలోని పోలీసు, న్యాయపరిపాలనా, రెవిన్యూ శాఖలలో వున్న లోపాలు చక్కదిద్దేందుకై బ్రిటిష్ రెసిడెంటులో యోచించి సమర్థ వంతములైన పరిష్కార మార్గాలు వెంటనే ఆలోచించాలి; బ్రిటిష్ రెసిడెంటుయొక్క సలహాలనూ హితవులనూ అయోధ్యరాజాగారు నిర్లక్ష్యంచేసిన పక్షంలోనూ, అయోధ్య రాజ్యంలో ప్రజాశాంతికి తీరని ప్రమాదం కలుగజేసే విధంగా అదేపనిగా మితిమీరి నట్టి నిర్బంధవిధానం, అరాచకం, దుష్పరిపాలన కొనసాగి, దుష్పరిపాలన జరిగిన రాజ్యభాగంలో — ఆ భాగం చిన్నదైనా సరే పెద్దదైనా సరే — జరిగినప్పటికీ, అట్టి రాజ్యభాగంలో తన సొంత అధికార్లను నియమించి, ఎంతకాలమైతే తనకు అవస రమని తోస్తుందో అంతకాలమూ పరిపాలనను సాగించే హక్కు బ్రిటిష్ ప్రభుత్వానికి ఇందుమూలంగా సంక్రమించుతుంది; ఇట్టి సందర్భంలో, అన్ని ఖర్చులూ పోను మిగిలిన వసూలు మొత్తాన్ని రాజాగారికి ఖజానాలో చెల్లించి, సరైనట్టి వాస్తవమైనట్టి జమాఖర్చుల తప్పేర్లు ఘనతవహించిన రాజాగారికి ఒప్పచెప్పడమౌతుంది."

---

* రాజకీయ కుట్ర. — సం.

** మహమ్మద్ అలీ షా. — సం.

ఒప్పందపు 8వ నిబంధనలో ఇంకా ఈవిధంగా ఏర్పాటుచేయబడింది:

"7వ నిబంధన విధించుతూన్నట్టి బాధ్యతలను సలహాసంఘ సమేతుడైన ఇండియా గవర్నర్ జనరల్ నిర్వహించవలసివచ్చే పరిస్థితులలో, పరిపాలనా బాధ్యతను వహించి, పరిపాలనా బాధ్యత తీసుకోబడిన ఆయా రాజ్యభాగాలలో దేశీయ పరిపాలనాసంస్థలలోనూ, పరిపాలనా రూపాలలోనూ తమకు సాధ్యమైనంతవరకూ, వీలువడినట్టి అవసరమైన మార్పులు ప్రవేశపెట్టి, ఆ రాజ్యభాగాలను అయోధ్య సార్వభౌమునికి తిరిగి ఇచ్చివేసే సమయం వచ్చినప్పుడు, యీ రాజ్యభాగాలను తిరిగి ఇచ్చివేయడాన్ని సులభం చేసేటట్టుగా పరిపాలనను నిర్వహించేందుకు అతడు యత్నించుతాడు."

ఒక పక్షాన సలహాసంఘ సమేతుడైన బ్రిటిష్ ఇండియా గవర్నర్ జనరల్‌కీ, రెండవ పక్షాన అయోధ్యరాజుకీ ఈ సంధి జరిగినట్టు సంధే వివరించుతూంది. ఆవిధంగానే, సంధి పత్రంపై ఇరుపక్షాలూ సంతకాలు చేయడంద్వారా సంధి ఆమోదింపబడి, సంధి పత్రపు నకళ్ళ మార్చుకోవడం కూడా జరిగింది. కాని, ఈస్ట్ ఇండియా కంపెనీ తమ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ ముందు సంధి పత్రం నకలు సమర్పించేసరికి, అయోధ్యరాజుకూ కంపెనీకీ ఉన్న స్నేహ సంబంధాలకు ఇది ఆటంకం కలిగించి, దీనిద్వారా గవర్నర్ జనరల్‌నుండి ఆ రాజుయొక్క హక్కులకు భంగం కలుగుతూందన్న కారణంగా వారు సంధిని (1838 ఏప్రిల్ 10న) రద్దుచేసేశారు. ఇటువంటి సంధి చేసుకోడానికై కంపెనీ అనుమతిని పామర్‌స్టన్ కోరనూ లేదు; సంధిని రద్దుగావించినట్టు వారు చేసిన తీర్మానాన్ని అతను లెక్కచేయనూ లేదు. ఈ సంధి రద్దయిపోయిందన్న సంగతైనా అయోధ్యరాజుకు తెలియజేయలేదు. ఈ విషయం లార్డ్ డల్‌హౌసీయే స్వయంగా ఒప్పుకున్నాడు (1856 జనవరి 5వ తేదీ మినిట్స్):

"రాజుగారు రెసిడెంటుతో* చర్చలను సాగించేటప్పుడు, 1837లో తనకు ముందుండిన రాజుతో చేసుకున్న సంధి గురించి ఆయన మూడుసంతులు తప్పకుండా ప్రస్తావించి తీరుతాడు; ఇంగ్లండులో సంధిపత్రం అందిన వెంటనే బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ దానిని రద్దుచేశారనీ, తత్ఫలితంగా అది ఎన్నడూ అమలులోకే రాలేదనీ రెసిడెంటుకు తెలిసిన విషయమే. 1837లో జరిగిన సంధి షరతులలో సైనికబలం అధికంచేయవలసిందని విధించుతూ పెట్టిన కొన్ని కఠినషరతులు చాలా బాధాకరంగా

* జేమ్స్ ఔట్రామ్. – సం.

ఉండిన కారణంగా, ఆ షరతులు అమలు జరపబడవని అయోధ్యరాజాగారికి తెలియజేసినప్పటికీ, సంధి అంతా కూడా సంపూర్ణంగా రద్దు గావించబడిందని రాజాగారికి ఎన్నడూ తెలియపర్చి ఉండలేదన్న సంగతి కూడా రెసిడెంటుకు తెలిసిన విషయమే. ఈవిధంగా దాచిపెట్టి ఉంచడమూ, అన్ని సంగతులూ పూర్తిగా తెలియ పరచకుండా ఉంచడమూ ఈ రోజున అత్యంత యిబ్బందికరంగా పరిణమించింది. అంతటితో పరిపోకుండా, అధికారయుతంగా 1845లో ప్రభుత్వంచే ప్రచురింప బడిన సంధి పత్రాల సంపుటంలో రద్దుగావించబడిన ఈ సంధిపత్రం కూడా చేర్పడం మరింత యిబ్బందికరంగా పరిణమించింది.''

ఆ మినిట్స్‌లోనే 17వ విభాగంలో ఇలా వుంది:

''1837 సంధి గురించి రాజాగారు ప్రస్తావించి, అయోధ్య పరిపాలన విష యంలో వెనకటి సంధి ప్రకారమే బ్రిటిష్ ప్రభుత్వానికివ్వబడిన విస్తృతాధికారాలనే వారిప్పుడేల అమలుపర్చకూడదని ప్రశ్నించిన పక్షంలో, ఈ సంధిపత్రం బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లముందు ఉంచినప్పుడు వారు దానిని సంపూర్ణంగా రద్దు గావించిన కారణంగా దానికి అస్తిత్వమే లేకుండా పోయిందని రాజాగారికి తప్పకుండా తెలియజేసితీరాలి. అదనపు సైనిక బలాలను ఉంచినందుకు పరిహారంగా రాజాగారు ధనం చెల్లించాలంటూ రాజాగారిపై విధించిన 1817 సంధిలోని కొన్ని షర తులు రద్దుచేయబడుతున్నాయన్న విషయం లక్నోదర్బారుకు ఆ రోజుల్లోనే తెలియ జేయబడిందన్న సంగతి రాజాగారి జ్ఞప్తికి తీసుకురావాలి. వెంటనే అమలులోకి రాని మిగిలిన సంధి షరతులను గురించి ఘనతవహించిన రాజాగారికి ఏవిధంగానూ తెలియ పర్చడం అవసరం లేదనే అప్పట్లో భావించబడిందనీ, అశ్రద్ధకొద్దీ తరువాత తెలియపర్చడంలో లోపం జరిగిందనీ అనుకోవాలి.''

1845లో ప్రచురించబడిన అధికారయుతమైన సంధి పత్రాల సంపుటిలో ఈ సంధి పత్రం చేర్పడమే కాకుండా, 1839 జూలై 8వ తేదీన లార్డ్ ఆక్లండ్ అయోధ్య రాజాపేర పంపిన ప్రకటనలోనూ, అంతేకాకుండా 1847 నవంబరు 23వ ఆ రాజాపేర అప్పటి గవర్నర్ జనరల్ లార్డ్ హార్డింజ్ పంపిన అధిక్షేపణలేఖలోనూ, లక్నోలో రెసిడెంటుగా ఉండిన కల్నల్ స్లీమన్ 1851 డిసెంబరు 10వ లార్డ్ డల్‌హౌసీకి రాసిన ఉత్తరంలోనూ, ఈ సంధి సజీవంగా వుండి అమలులో ఉన్నట్టే అధికారపూర్వకంగా ఉద్ఘాటించబడింది. ఈవిధంగా తనకు ముందుండిన గవర్నరు జనరల్లూ, అంతేకాకుండా తన ప్రతినిధులు సహితమూ అయోధ్య

రాజాతో జరిపిన ఉత్తరాల్లో అమలులో ఉన్నట్టు ఒప్పుకుంటూన్న సంధే రద్దయి పోయిందని అనాలనే ఆదుర్దా లార్డ్ డల్‌హౌసీ ఎందుకు కలిగివుండాలి? ఈ సంధి ప్రకారం బ్రిటిష్‌వారికి ఔక్యంకలిగించుకోడానికి ఎట్టి సాకులు అయోధ్యరాజా కలిగించివుంటే కలిగించివుండినప్పటికీ, బ్రిటిష్ అధికార్లు అట్టి ఔక్యం పురస్కరించుకొని పాలనాధికారం వహించడం అయోధ్యరాజా పేరుమీదుగానే జరిగించి, ఆ మేరకే పరిమితమైవుండి, ఖర్చులు పోను మిగిలిన వసూలంతా ఆయనకి ఇచ్చివేయాల్సి ఉండడమే కేవలం ఇందుకు కారణం. ఈ లాగున ఇచ్చివేయకుండా, తద్వ్యతిరేకంగా దాన్ని తాము కాజేయడమే వారికి కావాల్సింది. ఎలాగో ఒకలాగున పూర్తిగా రాజ్యాన్ని కలిపేసుకోవడమే వారికి కావాలి; తలవెంట్రుకవాసి తగ్గినా కూడా లాభం ఉండదు వారికి. ఇరవైయేళ్ళగా ఆ రాజ్యంతో ఉండిన సంబంధాలకు పునాదిగా ఏర్పడిందని ఒప్పుకుంటూన్న సంధి షరతులు ఇప్పుడు చెల్లవని నిరాకరించడమూ, చెల్లుతున్నాయని తామే బహిరంగంగా ఒప్పుకుంటూన్న సంధి షరతులనే బాహాటంగా ఉల్లంఘించి స్వతంత్ర రాజ్యాలను బలాత్కారంగా కాజేయడమూ చిట్టచివరకి దేశంలో మొత్తం వున్న ప్రతి అంగుళం భూమినీ భుక్తం చేసుకోవడమూ; ఇండియా దేశీయులపట్ల బ్రిటిష్ వారు అనుసరిస్తూన్న ఈ ద్రోహపూరిత పాశవిక పద్ధతులయొక్క దుష్ఫలితపు పాపాలు పండిపోయి, నేడు ఇండియాలోనే కాకుండా ఇంగ్లండులో సహితమూ పగతీర్చుకుంటున్నాయి.

మార్క్స్‌చే 1858 మే 14న
రచించబడింది

"New-York Dai y Tribune"
1885 మే 28వ తేదీన
5336వ సంచికలో
ఒక సంపాదకీయ వ్యాసంగా
ప్రచురించబడింది

## మార్క్స

# *లార్డ్ కానింగ్ ప్రకటన, ఇండియాలో భూమి అనుభవం

అయోధ్య విషయంలో లార్డ్ కానింగ్ చేసిన ప్రకటన (దీనికి సంబంధించిన కొన్ని ముఖ్యమైన పత్రాలను శనివారం సంచికలోనే మేము ప్రచురించాం[93]) సందర్భంలో, ఇండియాలోని భూమి అనుభవ పద్ధతులను గురించి మళ్లీ మరొకసారి చర్చ ప్రారంభమైంది; ఈ విషయంపై గతకాలంలో బ్రహ్మాండమైన వాదోపవాదాలు జరిగి, పరస్పర భిన్నాభిప్రాయాలూ, పొరపాటు అవగాహనలూ వెలువడ్డాయి. వీటి కారణంగా, ఇండియాలో వేరుగా బ్రిటిష్ రాజ్యాధికారం కిందవున్న ప్రాంతాల[94] పరిపాలనలో అతి తీవ్రమైన పొరపాట్లు సంభవించాయని తలచబడింది. ఇండియా దేశపు ఆర్థిక వ్యవస్థలో జమీందార్లు, తాలుక్దార్లు, సర్దార్లు అని చెప్పబడేవారి యధార్థ స్థానమేమిటి? వీరిని భూస్వాములుగా పరిగణించాలా, లేక కేవలం శిస్తు వసూలుచేసే ఉద్యోగులుగా పరిగణించాలా?

ఆసియాలో చాలా దేశాలలోలాగానే ఇండియాలో కూడా అంతిమ భూస్వామ్యపు హక్కు ప్రభుత్వానికే చెందుతుందన్న విషయం అందరూ అంగీకరించినదే; కాని ప్రభుత్వాన్నే భూస్వామిగా పరిగణించి ప్రభుత్వమే భూమిని రైతులకు అమరకానికి ఇచ్చిందన్నట్టుగా మనం భావించితీరాలని ఈ వాదోపవాదంలో ఒక పక్షం ఉద్ఘాటిస్తూండగా, సర్వసాధారణంగా కడమ అన్ని దేశాల్లోనూ భూమి ఎలాగైతే వ్యక్తిగత ఆస్తిగా పరిగణింపబడుతూందో, అలాగే ఇండియాలో సహితమూ భూమి వాస్తవంగా వ్యక్తిగత ఆస్తిగానే పరిగణింపబడుతూందనీ, భూమిపై ప్రభుత్వానికి గలదని చెబుతూన్న భూస్వామ్యపు హక్కు కేవలం సార్వభౌమునికున్న అధికారస్వత్వపు హక్కునుండి సంక్రమించిన హక్కే తప్ప, అంతకుమించినదేమీ కాదనీ, ప్రభుత్వానికున్న ఈ హక్కును అమలు జరిపే పద్ధతి ఆయా దేశాలలో ఉండిన ఫ్యూడల్ న్యాయశాస్త్ర ప్రాతిపదికపై ఏర్పడి, ఆయా దేశాల ప్రభుత్వాలు భూమిపై పన్నులు విధించడంలో భూకామందుల సదుపాయాలతో కేవలం పరిపాలనా విధానానికి సంబంధించిన విషయంగానే తప్ప మరేవిధంగానూ నిమిత్తంలేకుండానే, ప్రభుత్వావసరాల మేరకు భూమిపై

పన్ను విధించడానికి ప్రభుత్వానికిగల హక్కును ఇంచుమించు సంపూర్ణంగా గుర్తించడంద్వారా, సిద్ధాంతరీత్యా అన్ని దేశాల్లోనూ అంగీకరించబడినదని రెండవ పక్షంవారు వాదిస్తున్నారు.

వ్యక్తులకు భూమిపై గల సొంత భూస్వామ్యపు హక్కుకు కడమ దేశాల్లో ఎంతటి న్యాయమైనట్టి బలమైనట్టి ఆధారాలున్నాయో ఇండియాలో కూడా భూములపై అంతటి న్యాయమైనట్టి బలమైనట్టి హక్కు ఉందని అంగీకరించినప్పటికీ, భూమికి యధార్థమైన సొంతదార్లుగా ఎవరిని పరిగణించాలి? ఈ హక్కు మాకే చెల్లుతుందంటే మాకే చెల్లుతుందని రెండు పక్షాలవారూ వాదిస్తున్నారు. జమీందార్లూ, తాలూక్దార్లూ అని చెప్పబడే వర్గానికి చెందినవారు ఒక పక్షంవారు. యూరప్‌లో భూములు గల కులీనవంశములూ పెద్దమనుషులూ ఆక్రమించుతూన్నట్టి స్థానమే ఇండియాలో వీరికి ఉందని కొందరి అభిప్రాయం. ప్రభుత్వానికి చెల్లించవలసిన నిర్ణీతమైన పన్ను మాత్రం వీరు చెల్లించాల్సి వుంటూ, వీరే భూమికి యధార్థమైన ఖామందులని, వీరే భూమికి యధార్థమైన ఖామందులవడంచేత తమ చిత్తాన్ననుసరించి భూమిని వాస్తవంగా సాగుచేస్తూన్న రైతులను తమ చిత్తం వచ్చినట్లుగా భూమినుండి తప్పించడానికి తమకు హక్కు ఉందనీ, తదనుగుణంగా జమీందారు తనకి ఉచితమని తోచి నిర్ణయించిన శిస్తును చెల్లించి తీరవలసినట్టి కౌలుదారు స్థితిలోనే ఈ రైతులున్నారని వీరి వాదన. సాంఘిక వ్యవస్థకు భూస్వామ్యకులీనవర్గం ప్రధానమైన మూలవిరాట్టు అని ఇంగ్లీషువారి అభిప్రాయమవడంచేత, ఆ అభిప్రాయంతో ఈ వాదన సహజంగానే సరిపడుతూన్నందున, ఇదే వారికి నచ్చి, డెబ్బై ఏళ్ల క్రితం లార్డ్ కారన్‌వాలిస్ గవర్నర్ జనరల్‌గా వున్న కాలంలో బెంగాల్‌లో భూమి అనుభవ పద్ధతి** పేరిట ప్రఖ్యాతివడసిన విధానానికి దీనినే పునాదిగా నిర్మించారు; ఈ భూమి అనుభవ పద్ధతే నేటికీ అమలులో వుంటూన్నప్పటికీ, దీనివల్ల ప్రభుత్వానికీ, భూమిని వాస్తవంగా సాగుచేస్తూన్న రైతులకూ చాలా అన్యాయం జరుగుతూందనే అనేకులు భావిస్తున్నారు. హిందూస్థానంలో వున్న ఆచారాలనూ, వీటితోపాటు బెంగాల్‌లో భూమి అనుభవ పద్ధతి ప్రవేశపెట్టడంవల్ల కలిగిన సామాజిక, రాజకీయ ఇబ్బందులనూ ఇంకా క్షుణ్ణంగా అధ్యయనంచేయడం ఫలితంగా, పురాతన హిందూ ఆచారాల ప్రకారం భూస్వామ్యపు హక్కు గ్రామసంఘాలకే ఉండేదనీ, ఏయే వ్యక్తులు ఎంతెంత భూమి సాగు చెయ్యాలో నిర్ణయించి భూమిని వ్యక్తులకు పంపిణీచేసే హక్కు వీటికే ఉండేదనీ; జమీందార్లూ, తాలుక్దార్లూ కేవలం ప్రభుత్వోద్యోగులేననీ, గ్రామంలోని భూముల సాగుబడిని అజమాయిషీచేసి, గ్రామం నుండి సంస్థానాధీశ్వరునికి రావలసిన శిస్తు వసూలుచేసి సంస్థానాధీశ్వరునికి చెల్లించే విధులు మాత్రమే వీరు నిర్వహించుతూండేవారని ఇప్పుడు భావించబడుతూంది.

హిందూదేశంలో ఇంగ్లీషువారు నేరుగా పరిపాలన సాగించుతూన్న రాష్ట్రాలలో ఇటీవలి సంవత్సరాలలో భూమి అనుభవ విధానమూ, భూమిశిస్తు ఆదాయ విధానమూ అవ

లంబించడంలో ఈ అభిప్రాయంయొక్క ప్రభావమే చాలావరకూ ప్రస్ఫుటమైంది. భూమిపై సర్వహక్కులూ ఇతరులకెవ్వరికీ లేకుండా తమకే, తమకొక్కరికే ఉన్నాయని జమీందార్లూ, తాలుకార్లూ చేసిన వాదనకు ప్రభుత్వమూ, రైతులూ, ఇద్దరికీ వుండిన హక్కులను సహితమూ వీరు హస్తగతం చేసుకోవడమే మూలాధారమని ఇప్పుడొక అభిప్రాయం ఏర్పడింది. ఈ అభిప్రాయ ఫలితంగా వాస్తవంగా భూమిని సాగుచేసే రైతులకూ, దేశంయొక్క సాధారణ పురోభివృద్ధికీ గుదిబండగా తయారైన వీరిని వదిలించుకోవడానికి సర్వప్రయత్నాలూ జరిగాయి. ఈ మధ్యవర్తుల హక్కులకు గల మూలాధారాలు ఏవైనప్పటికీ, ఇవి చిరకాల భుక్తంవల్ల ఏర్పడిన హక్కులని వారు చెప్పగలుగుతూన్న కారణంగా, ప్రజలపట్ల ఈ హక్కులు ఎంత బాధాకరంగానూ, నిరంకుశంగానూ, హింసాత్మకంగానూ ఉన్నప్పటికీ కూడా వీటిని సాంతమూ కొట్టిపారేయడానికి న్యాయశాస్త్రం ఒప్పుకోదు కాబట్టి, వీటిని కొంతవరకైనా గుర్తించక తప్పిందికాదు. అయోధ్యలో బలహీనులైన సంస్థానాధీశ్వరుల పరిపాలన ఫలితంగా, ఈ ఫ్యూడల్ భూస్వాములు ప్రభుత్వానికి చెందాల్సిన స్వామ్యాలకూ, రైతులకుండిన హక్కులకూ ఎసరు పెట్టి, వాటిని తమ గుప్పిట్లో అంకించుకున్నారు; పోతే దరిమిలా ఆ రాజ్యాన్ని కలిపేసుకోవడం జరిగిన తదుపరి, ఈ విషయం పరిశీలనకొచ్చినప్పుడు, కొత్త భూమి అనుభవ పద్ధతులను నిర్ణయించే వ్యవహారానికై నియమించబడిన కమీషనర్లకీ, యథార్థంగా తమకున్న హక్కుల పరిమితులను గురించి జమీందార్లూ తాలుక్దార్లకీ మధ్య విస్తృతమైన వివాదం చెలరేగింది. దీని ఫలితంగా వీరిలో తీవ్రమైన అసంతృప్తి ప్రబలి, తిరుగుబాటుచేసిన సిపాయిలతో వీరు చేతులు కలిపి ఏకమవడానికి కారణమైంది.

పైన సూచించిన విధానంపై — అనగా, గ్రామసంఘమే భూమిశిస్తును ఫైసలా చేసే విధానంపైనే మొగ్గుచూపేవారు — అనగా, భూమిపై వుండే భూస్వామ్యపు హక్కు భూమిని యథార్థంగా సాగుచేసే రైతులకే ఉందనీ, వీరి హక్కే, మధ్యదళారీల హక్కు కంటె శ్రేష్ఠమైనదనీ అభిప్రాయపడేవారు — లార్డ్ కానింగ్ చేసిన ప్రకటనను సమర్థించుతున్నారు. అయోధ్యలో వున్న ఈ జమీందార్లలోనూ, తాలుక్దార్లలోనూ బహుళసంఖ్యాక వర్గం చిక్కుకున్న దురవస్థను ప్రభుత్వం ఇప్పుడు వినియోగించుకుని, తత్ఫలితంగా విస్తృతమైన సంస్కరణలు ప్రవేశపెట్టడానికి అవకాశం దొరికిందనీ, లేకపోయినట్లయితే ఇట్టి అవకాశం మరొక విధంగా దొరికేదికాదనీ, ప్రకటన కారణంగా జప్తుచేయబడిన భూస్వామ్యపు హక్కు అంతా కేవలం జమీందారీ తాలుక్దారీ హక్కేననీ, ఇదైనా ప్రజలలో స్వల్పాతిస్వల్ప సంఖ్యలో ఉన్న భాగానికే సంబంధించినదనీ, ఈ భాగంలో భూమిని వాస్తవంగా సాగు చేస్తూన్న రైతులు ఎంత మాత్రమూ లేరనీ కూడా వీరు లార్డ్ కానింగ్ చేసిన ప్రకటనను సమర్థించుతున్నారు.

ఇదిలావుండగా, ధర్మమూ మానవత్వమూ మాట అటుంచి, లార్డ్ కానింగ్ చేసిన

ప్రకటనపట్ల డెర్బీ మంత్రిత్వం అవలంబించిన దృక్పథం, వేళ్లుపాదుకొన్న హక్కులను అనుభవించుతూన్న వర్గంయొక్క ప్రయోజనాలే పవిత్రమైనవిగా ఎంచి, భూస్వామ్య ప్రభు వర్గ ప్రయోజనాలను నిలబెట్టడంయొక్క ప్రాముఖ్యతను సమర్థించే టోరీ, లేక కన్సర్వేటివ్ పార్టీ, సామాన్య సూత్రాలతో సరిగ్గా అనుగుణంగానే ఉంటూంది. తమ స్వదేశంలోని భూస్వామ్య ప్రయోజనాలను పేర్కొనేటప్పుడల్లా, భూస్వాములను గురించే, శిస్తులను అనుభవించేవారి గురించే వారు చెబుతారు కాని, శిస్తులు చెల్లించేవారి గురించి కాని, భూమిని వాస్తవంగా సాగుచేసే రైతులను గురించి కాని వారు ఎత్తుకోనే ఎత్తుకోరు; అందుచేత జమీందార్ల, తాలుక్దార్ల సంఖ్య వాస్తవంగా ఎంత స్వల్పంగా ఉన్నప్పటికీ వారి ప్రయోజనాలనే వారు లెక్కలోకి తీసుకొని, వారి ప్రయోజనాలనే అత్యధిక సంఖ్యాకులైన ప్రజలయొక్క ప్రయోజనాలతో టోరీలు సమానంచెయ్యడంలో ఏమీ ఆశ్చర్యంలేదు.

ఇంగ్లండులో కూచుని ఇండియాను పరిపాలించడంలో వున్న గొప్ప ఇబ్బందులకు, ఇంగ్లీషు పరిస్థితులతో వాస్తవంగా ఏమాత్రమూ సంబంధంలేనట్టి సామాజిక పరిస్థితులతో కేవలం ఇంగ్లీషు పరిస్థితులను అన్వయింపచేయడంలో, ఇండియాలోని సమస్యలపై ఈ ఇంగ్లీషు దురభిప్రాయాలయొక్క, రాగద్వేషాలయొక్క ప్రభావం హెచ్చుగా ఉండడానికి ఇదొక దృష్టాంతం. తన ప్రకటనలో వివరించిన విధానంపై అయోధ్య కమీషనరైన సర్ జేమ్స్ ఔట్రామ్ తెలియపర్చిన అభ్యంతరాలకు సమాధానం చెబుతూ నేడు వెలువడిన తన నివేదికలో లార్డ్ కానింగ్ తన ప్రకటనపట్ల కావించిన సమర్థన, కమీషనర్ తెలియపర్చిన అభ్యర్థనలకు అతడు కొంతవరకూ లొంగిన ఫలితంగా, ఏ ప్రకటన ముసాయిదానైతే లార్డ్ ఎల్లెన్‌బరో తన నివేదికకు[96] ఆధారంగా చేసుకొన్నాడో అట్టి, మొదట్లో లార్డ్ కానింగ్ ఇంగ్లండుకు పంపినట్టి, ముసాయిదా ప్రకటనలో లేని ఒక దిద్దుబాటు వాక్యాన్ని లార్డ్ కానింగే ఇప్పుడు చేర్చాడని ఇక్కడ భావింపబడుతూన్నప్పటికీ, మొత్తంమీద చాలా సమంజసంగా ఉన్నట్టే కనబడుతూంది.

తిరుగుబాటులో చేరడంలో అయోధ్య భూస్వాములు వ్యక్తపరచిన ప్రవర్తనపట్ల అవలంబించవలసిన వైఖరిని గూర్చి సర్ జేమ్స్ ఔట్రామ్, లార్డ్ ఎల్లెన్‌బరోల అభిప్రాయాలనుండి లార్డ్ కానింగ్ అభిప్రాయాలు అట్టే భేదించుతూన్నట్లు కనబడదు. తిరుగుబాటు చేసిన సిపాయిలతోనే గాకుండా, సుదీర్ఘకాలం బ్రిటిష్ పరిపాలనను అనుభవించి నట్టి, తిరుగుబాటు చేసినట్టి జిల్లాల ప్రజలతో సహితమూ వీరిని పోల్చడానికి ఎంతమాత్రమూ వీల్లేదని లార్డ్ కానింగ్ వాదన. తాము అవలంబించిన ప్రవర్తనకు తగినంతగా ప్రేరక హేతువులున్న వ్యక్తులలాగునే తమను చూడాల్సిందని కోరడానికి వీరికి హక్కుందని ఆయన ఒప్పుకుంటున్నాడు; అయినప్పటికీ అదే సమయంలో, తిరుగుబాటులో చేరినందువల్ల కలిగే తీవ్రమైన ఫలితాలను తాము తప్పక అనుభవించాల్సి ఉంటుందనీ, వాటిని తప్పించుకోడానికి

ఎంత మాత్రమూ తమకి వీలుండదనీ వారిని గ్రహించేటట్లు చేయాల్సి ఉంటుందనీ ఆయన పట్టుపట్టుతున్నాడు. ఈ ప్రకటన ఫలితాలు ఏవిధంగా ఉన్నాయో, దాని ఫలితాలు ఇదమిద్ధంగా ఉంటాయని ముందుగానే ఊహించి చెప్పడంలో లార్డ్ కానింగ్ చెప్పినదే యధార్థమైందో, లేక సర్ జేమ్స్ ఔట్రామ్ చెప్పినదే యధార్థమైందో, మనకు త్వరలోనే తెలుస్తుంది.

మార్క్స్‌చే 1858 మే 25న
రచించబడింది

"New-York Daily Tribune"
1858 జూన్ 7వ తేదీన
5344వ సంచికలో
ఒక సంపాదకీయ వ్యాసంగా
ప్రచురించబడింది

# ఎంగెల్స్

## *ఇండియాలో తిరుగుబాటు

మొదట ఢిల్లీనీ, అటుతర్వాత లక్నోనూ — సిపాయి తిరుగుబాటుకు ఒకదాని తర్వాత ఒకటి ప్రధాన శిబిరాలైన నగరాలను పట్టుకోవడంలో ఇంగ్లీషువారు గొప్ప మిలిటరీ చర్యలనే జరిపినప్పటికీ, ఇండియాలో శాంతి భద్రతలను నెలకొల్పే కార్యం ఇంకా ఏమాత్రమూ సాధించబడలేదనే చెప్పాలి. నిజానికి, ఈ సందర్భంలో వున్న అసలు చిక్కు ఇప్పుడిప్పుడు మాత్రమే బయటపడనారంభిస్తున్నదనే చెప్పాల్సి వస్తుంది కూడానూ. తిరుగుబాటు చేసిన సిపాయిలు పెద్దపెద్ద సంఖ్యలలో సమీకృతమై ఉన్నంత కాలమూ, భారీస్థాయిలో ముట్టడులూ, సమరభూమిమీద సేనలను నిల్పి యుద్ధాలను సాగించవలసిన అవసరం ఏర్పడినంత కాలమూ, ఇటువంటి సైనిక చర్యలను జరపడంలో ఇంగ్లీషు సేనల అపార శ్రేష్ఠత కారణంగా ఇంగ్లీషువారిదే పైచేయి అయింది. కాని ఇప్పుడు యుద్ధం స్వభావమే మారిపోయి, యుద్ధం కొత్త విధంలో రూపొందుతున్న కారణంగా, ఇంతవరకూ వారికుండిన అనుకూల పరిస్థితులు ఇప్పుడు చాలావరకూ అదృశ్యం కావచ్చు. లక్నోను పట్టుకొన్నంత మాత్రాన అయోధ్యనంతనీ త్రాహిత్రాహి అనిపించే స్థితికి తీసుకురాగలగడం అసంభవం; ఒకవేళ అయోధ్యనంతనీ త్రాహిత్రాహి అనిపించే స్థితికి తీసుకురాగలిగినప్పటికీ, అయోధ్యతోపాటు ఇండియానంతనీ దాసోహం అనిపించే స్థితికి తీసుకొచ్చినట్టు అంతకంటెకాదు. అయోధ్య రాజ్యం సర్వత్రా ఎక్కడ చూసినా కొద్దిగానో గొప్పగానో బలమైన దుర్గాలతో నిండివుంది. వీటిలో బహుశా ఏ ఒక్క దుర్గమూ కూడా యధావిధిగా జరిపే దాడిని సుదీర్ఘకాలం ప్రతిఘటించ లేకపోయినప్పటికీ, ఈ దుర్గాలన్నిటినీ ఒక్కటొక్కటే స్వాధీనం చేసుకోవడమంటే, బహు కాలం తీసుకుని విసుగుపుట్టించే కార్యంగా పరిణమించడమేకాకుండా, పెద్ద నగరాలైనట్టి ఢిల్లీ లక్నోలపై జరిపిన చర్యలలోకంటె సాపేక్షంగా అత్యధికమైన నష్టాలతో కూడుకున్న కార్యంగానే పరిణమిస్తుంది కూడా.

జైత్రయాత్ర సాగించి శాంతి భద్రతలను నెలకొల్పవలసింది ఒక్క అయోధ్య రాజ్యంలోనే కాదు. భంగపాటుపొంది లక్నోనుండి వెళ్లగొట్టబడిన సిపాయిలు చెదిరిపోయి దేశంలో నాలుగు చెరగులా పారిపోయారు. ఉత్తరదిశగా వున్న రోహిల్‌ఖండ్‌లోని పర్వతప్రాంతపు జిల్లాలలోకి

సిపాయిల పెద్ద సంఖ్య ప్రవేశించి అక్కడ తలదాచుకుంది; రోహిల్‌ఖండ్ అంతా పొంతమూ ఇంకా తిరుగుబాటుదార్ల వశంలోనే ఉంది. మరికొంతమంది తూర్పుదిశగా గోరఖ్‌పూర్‌లోకి పారిపోయారు; లక్నోపై దాడిచేయడానికి తరలివెళ్లినప్పుడు ఇంగ్లీషువారు ఈ జిల్లాగుండానే ఈ చివరనుండి ఆ చివరవరకూ పురోగమించినప్పటికీ, ఇప్పుడు దీనినే తిరిగి మరోసారి స్వాధీనం చేసుకోవలసిన అవసరం కలుగుతూంది. పలాయితులలో చాలామంది దక్షిణదిశగా వున్న బుందేల్‌ఖండ్‌లోకి చొచ్చుకొనిపోగల్గారు.

ఇకమీదట అవలంబించాల్సిన ఉత్తమోత్తమ విధానం ఏమిటి అవీ, లక్నోవద్ద సమీకృతమైన ప్రధాన సిపాయి సమూహంపై యుద్ధచర్యలు నడిపించే ముందు, ఓడిపోయిన తరువాత సిపాయిలు తలదాచుకోడానికి వీలుగా వుంటూన్న చుట్టుపక్కల జిల్లాలన్నిటినీ ముందుగానే స్వాధీనంచేసుకొని, అటుతరువాతనే లక్నోపై దాడి చేయడం ఇంతకంటే మెరుగుగా వుండేదేమోననీ ఇప్పుడొక వాగ్యుద్ధం కూడా నిజంగా చెలరేగుతూన్నట్టే కనబడుతూంది. మిలిటరీవారు ఈ చర్యాపథకమే చేసుకొని ఈ విధానం అవలంబించడమే మంచిదని భావించినట్టుగా వినికిడి; కాని లక్నోనుండి తరిమివేయబడిన సిపాయిలు తిరిగి ఈ చుట్టుపక్కల జిల్లాలలో చొరబడకుండా ఉండేలాగున ఈ జిల్లాలను ఆక్రమించుకోవడమేకాకుండా, గోరఖ్‌పూర్ జిల్లాలో ఇప్పుడు తటస్థించినట్టుగా ఈ జిల్లాలను పునఃజయించడం, ఇంగ్లీషువారికున్న కొద్దిపాటి సైనిక బలంతోనూ ఎలా సాధ్యపడి ఉండేదో ఊహించుకోవడం కష్టమే.

లక్నోను పట్టుకొన్న దరిమిలా, తిరుగుబాటుదార్ల ప్రధాన బలాలు బరేలీకి తిరోగమించి అక్కడ స్థానం ఏర్పరచుకున్నట్టు కనబడుతూంది. నానా సాహెబ్ అక్కడున్నాడని కూడా అంటున్నారు. లక్నోకి పశ్చిమోత్తరంగా మారుమైళ్ల పైచిలుకు దూరంలో వున్న ఈ నగరంపైనా, ఈ జిల్లాపైనా జరపవలసివున్న యుద్ధచర్యను ఎండకాలానికి వాయిదావేయడం మంచిదని నిశ్చయించారు; కాగా సర్ కోలిన్ కాంబెలే స్వయంగా ఆ దిశగా తరలివెళ్లుతూన్నట్టు తాజా కథనాలంబట్టి తెలియవస్తోంది.

ఇదిలా ఉండగా, గెరిల్లా యుద్ధం వివిధ దిశలలో విస్తరించుతూన్నట్టు అగుపడుతూంది. ఇంగ్లీషు సైనికబలాలు ఉత్తరదిశగా తరలించబడుతూండే అదను చూసుకొని, చెదురుమదురుగా అక్కడక్కడున్న తిరుగుబాటు సైనిక దళాలు గంగను దాటి దోఆబ్ ప్రాంతంలోకి ప్రవేశించి, కలకత్తాతో వున్న రవాణామార్గాలను తెగ్గొట్టుతున్నాయి; అంతేకాకుండా ఈ దళాలు చేస్తూన్న దోపిడుల ఫలితంగా వ్యవసాయదార్లకు శిస్తులు చెల్లించడానికి వీల్లేకుండా పోతూండడం అటుండగా, చెల్లించకుండా ఎగవేసేందుకు అధమం వారికొక చక్కని మిష కూడా దొరుకుతూంది.

బరేలీని ఒకవేళ పట్టుకోగలిగినా, అంత మాత్రంతో ఈ చెరుపులన్నిటికీ స్వస్తి చెప్పడానికి వీలులేకపోవడమే కాకుండా, బహుశా ఈ చెరుపులను మరింత ఉధృతపరుస్తుందేమో

కూడా. ఇలాంటి ఎదురుఎదురు యుద్ధంలోనే సిపాయిలది పైచేయి అవుతుంది. యుద్ధంలో ఇంగ్లీషువారు సిపాయిలపై ఏలాగైతే దెబ్బకొట్టగలరో, అలాగే ఒకచోటనుండి ఇంకొక చోటకు తమ సేనలను నడిపించుకొని తీసుకుపోవడంలో ఇంగ్లీషువారిపై సిపాయిలు దెబ్బ కొట్టగలుగుతారు. రోజుకి ఇరవై మైళ్ల చొప్పున నడిచివెళ్లడం ఇంగ్లీషు శ్రేణి తరంగాదు; అలాంటిది సిపాయి దళం నలభై మైళ్లూ, అత్యవసర సందర్భాల్లో అరవై మైళ్లూ కూడా సాగిపోగలదు. ఇలా ఒకచోటనుండి ఒకచోటకు త్వరితగతిని సాగిపోగలగడమే సిపాయి సేనలకు ప్రధాన విలువను సమకూర్చుతూంది. దీనికితోడు, శీతోష్ణస్థితికి తట్టుకోగలగడంలో వారి కున్న శక్తితో వారికి భోజనపు ఏర్పాట్లను కలిగించడంలో సాపేక్షంగా వున్న సులువు కూడా చేర్చుతే, వీరు లేకపోతే ఇండియాలో యుద్ధం సాగించడం ఎలా కష్టసాధ్యమో స్పష్టంగా తెలుస్తూంది. యుద్ధచర్యలమీద ఉన్నప్పుడూ, అందులోనూ ముఖ్యంగా వేసంగిలో, ఇంగ్లీషు సైన్యానికి సంభవించే నష్టాలు బ్రహ్మాండంగా ఉంటాయి. ఇప్పటికప్పుడే సైనికుల కొరత బాగా తెలియవస్తూంది. పలాయనంచేస్తున్న తిరుగుబాటుదార్లను దేశంలో ఈ మూలనుండి ఆ మూలవరకూ తరమవలసిన అవసరం కలుగుతే కలగవచ్చు కూడా. ఈ పనికి యూరపియన్ సైనికులు ఎంతమాత్రమూ పనికిరారు; ఇంతవరకూ విశ్వాసపాత్రులుగానే వున్న బొంబాయి, మద్రాసు దేశీయ రెజిమెంట్లను ఇందుకు వినియోగించిన పక్షంలో, దేశంలో తిరుగుతూన్న తిరుగుబాటుదార్లతో వీరు తారసిల్లినట్టయితే, వారితో వీరు కూడా కలిసిపోయి కొత్త తిరుగుబాట్లు సహితమూ సంభవించవచ్చునేమో కూడా.

తిరుగుబాటులో సరికొత్తగా ఎవరూ చేరకపోయినా, ఇప్పుడు సాయుధులై యుద్ధరంగంలోకి దిగగల్గినట్టి సైనికులు ఎంతలేదన్నా లక్ష ఏభైవేలమందికి తక్కువ ఉండరు; దీనికితోడు నిరాయుధులైన ప్రజనుండి ఇంగ్లీషువారికి ఏవిధమైన సహాయంకాని, భోగట్టా కాని దొరకడం దుర్లభమే అవుతుంది.

ఇదిలా వుండగా, బెంగాల్లో వర్షాభావంవల్ల కరువు కాటకం — ఈ శతాబ్దిలో ఇంతవరకూ ఎరగనట్టి, వెనుకటి కాలంలోనూ, ఇంగ్లీషు ఆక్రమణ తర్వాత సహితమూ ఘోర బాధలకు మూలాధారమైనట్టి విపత్తు — సంభవించే ప్రమాదం ఎదురవుతూంది.

ఎంగెల్స్‌చే 1858 మే ఆఖరి రోజుల్లో
రచించబడింది

"New-York Daily Tribune"
1858 జూన్ 15 తేదీన
5351వ సంచికలో
ఒక సంపాదకీయ వ్యాసంగా
ప్రచురించబడింది

# ఎంగెల్స్

## *ఇండియాలో బ్రిటిష్ సైన్యం

లండన్ "Times"కు చెందినట్టి అవివేకియైన మన స్నేహితుడు మిస్టర్ విలియమ్ రస్సెల్ చిత్రోపమవర్ణనపట్ల తనకుండే ఆసక్తిని పురస్కరించుకుని సవివరములైన వర్ణనలతో లక్నో కొల్లను గూర్చి మళ్ళీ మరొకసారి తన పత్రికలో రాశాడు; కాని ఈ వర్ణనలు ఎంత విపులంగా ఉన్నాయంటే, ఇవి చదివిన తరువాత బ్రిటిష్ స్వభావంపట్ల ఇతరులకి ఏమంత శ్లాఘనీయమైన అభిప్రాయం మాత్రం కలగదు. ఈ కథనాన్నిబట్టి ఢిల్లీ నగరం కూడా తీవ్రంగా "లూటీ" అయినట్టు కనబడుతూంది; ఇంతేకాకుండా బ్రిటిష్ సైనికుడు లోగడ అనుభవించిన నికృష్టకష్టాలకూ అతడు చూపిన శౌర్యపరాక్రమాలకూ అతనికి న్యాదు ఉచితమైన బహూకరణలు అందజేయడంలో కెయిజర్‌బాగే కాకుండా, మొత్తంగా లక్నో నగరమే ఉపయోగపడినట్టు కనబడుతూంది. మిస్టర్ రస్సెల్ లేఖనుండి ఒక ఖండం ఈ దిగువను ఉల్లేఖిస్తున్నాం:

> "వేంకొద్దీ చిన్న విలువగల ఆభరణాలు తమవద్ద వున్నాయని గొప్ప చెప్పుకోగలిగిన సామాన్య సైనికులు గలిగిన సైనిక దళాలున్నాయి. 'కెప్టెన్ పదవిని కొనుక్కోడానికి మీకు ఎంత డబ్బు కావాలంటే అంత డబ్బూ నేను మీకు అప్పిస్తాను' అంటూ ధీమాగా ఒక ఆఫీసరుకు చెప్పిన ఒక సైనికుడిని గురించి నేను విన్నాను. ఇతర సైనికులు తమ స్నేహితులపేర పెద్దపెద్ద మొత్తాలనే పంపించారు. ఈ లేఖ ఇంగ్లండుకు చేరే లోపల కెయిజర్‌బాగ్ కొల్లను గూర్చి అనేక వజ్రవైఢూర్య మరకతాలూ అణిముత్యాలూ తమ కథలను ప్రశాంతంగానూ ఉల్లాసకరంగానూ వినిపించే ఉంటాయి. ధగధగమని మెరిసిపోతూన్న ఈ స్వల్ప ఆభరణాలు ఎలా సంపాదించినదీ ఆ విధమూ, ఎట్టి సందర్భాలలో అవి నిధినిక్షేపాలనుండి వెలికి తీయబడ్డాయో ఆ దృశ్యాలూ, వాటిని ధరించుతూన్నట్టి అందకత్తెలు... తమ కళ్లారా

చూడకపోవడమే మేలైంది.... ఈ ఆఫీసర్లలో కొందరు అక్షరాలా పెన్నిధులనే సంపాదించుకున్నారు.... సొట్లుపోయి లొత్తలు పడ్డ దుస్తులపెట్టెల్లో దాక్కొని ఉన్నాయి ముద్దొస్తూన్న చిన్నచిన్న పేటికలు; స్కాట్లండులోనూ ఐర్లండులోనూ వున్న ఎస్టేట్లూ, వేటజంతువుల మందలతోనూ సాల్మన్ చేపల మందలతోనూ కిటకిట లాడుతూన్నట్టి, ప్రపంచంలో సర్వత్రా ప్రఖ్యాతి వడసిన ప్రతి మారుమూల స్థలంలోనూ జంతువుల వేటకూ చేపలు పట్టుటకూ హాయిగా ఇమ్ముగా ఉన్న చిన్నచిన్న బంగాళాలూ ఈ పేటికల్లో ఇమిడున్నాయి.''

పై కథనాన్నిబట్టీ లక్నోని జయించిన తర్వాత బ్రిటిష్ సైన్యం స్తబ్ధుగా ఉండడానికి కారణం ఇప్పుడు మనకి తెలుస్తూందన్నమాట. దోపిడీ చేసుకోవడానికి ప్రత్యేకించిన పక్షం దినాలూ బహుచక్కగా ఉపయోగపడ్డాయి. పీకలమొయ్యా అప్పులలో మునిగి, దరిద్రంలో కొట్టుకుంటూన్న సైనికులూ, ఆఫీసర్లూ పట్నంలోకి వెళ్ళి, హఠాత్తుగా భోగభాగ్యాలతో తులతూగుతూ పట్నంలోనుండి బైటకొచ్చారు. వాళ్ళిప్పుడు వెనకటి మనుష్యులే కారు; అయినప్పటికీ మళ్ళీ వెనకటి మిలిటరీ డ్యూటీనే నెరవేరుస్తూండమనీ, అణగిమణగి ఉండమనీ, కిక్కురుమనకుండా వినయవిధేయతలతో ప్రవర్తించమనీ, శ్రమదమాదులు ఓర్చుకోమనీ, కాయకష్టం భరించమనీ, యుద్ధంలోకి దిగమనీ వారిని ఆజ్ఞాపించారు. కాని ఇది కేవలం దుస్సాధ్యం. కొల్లపెట్టుకోమనీ, దోపిడీ చేసుకోమనీ పట్టపగ్గాలులేకుండా ఒకసారి విడిచిపెట్టిన సైన్యం స్వభావం శాశ్వతంగా మారిపోయింది; ఎన్ని ఆజ్ఞలు జారీచేసినా సరే, ఆ సైన్యంయొక్క సేనాని పేరుప్రతిష్ఠలు ఎంత గొప్పవైనా సరే, ఇవన్నీ కూడా ఆ సైన్యాన్ని వెనకటి స్థితికి తీసుకురాలేవు. మిస్టర్ రస్సెల్ ఏమిటి చెబుతున్నాడో మళ్ళీ వినండి:

''డబ్బు జేబులో పడగానే జబ్బు కూడా వంట్లో ఎలా ప్రవేశిస్తుందో, లూటీ వాళ్ళో పడగానే మనిషిలో చిరాకు ఎలా పెరుగుతుందో, వాలుగు బొగ్గు వృటికాలు కారణంగా దారాపుత్రాదులలోనూ, బంధువర్గంలోనూ, అప్తులలోనూ ఎంతటి తీవ్రమైన విధ్వంసనలు జరగవచ్చునో చూస్తూంటే చిత్రంగానే ఉంటుంది.... సామాన్య సైనికుడి మొలమన్న పటకా, ఇప్పుడు రూపాయిలతోనూ, బంగారు మొహర్లతోనూ బరువెక్కి కిందకి లాగేస్తూంటే,'' [స్వదేశంలో హాయిగా కడుపులో చల్ల కదలకుండా స్వతంత్రంగా ఇంట్లో కూచోవచ్చుకదా అని ఇంటిని గురించి] ''తానిదివరకు కన్న కలలన్నీ యధార్థాలవుతాయనే ధైర్యం ఇప్పుడతనికి కలిగి మురిసిపోతూంటాడతడు; ఇలాంటి తరుణంలో, 'వరసలో నిలబడండి, ఇక వరసలో నిలబడండి!' అన్న ఉత్తరవు చెవిని పడేసరికి అతనికి ఎంతైనా చిరాకు కలుగుతుంది.... రెండు యుద్ధాలు, రెండు

పొర్లు కొల్లసొత్తులో వాటాలు, రెండు నగరాలను దోచుకోవడం, దీనికితోడు దోవలో చిల్లరమల్లరగా చేతికి దొరికినవన్నింటినీ అంకించుకోవడం — దీనితో మన సైనికులు భాగ్యవంతులైపోయి, ఇక తేలికగా సైనికజీవనం చెయ్యడానికి వాళ్ల వొళ్లు వంగడంలేదు."

దీని పర్యవసానంగా 150 పైచిలుకు ఆఫీసర్లు తమ రాజీనామాలను సర్ కోలిన్ కాంబెల్‌కు పంపించారని వింటున్నాం; కళ్ళెదుట శత్రువు నిలబడివుండగా ఇలాంటి వింత చర్య మరేదేశపు సైన్యంలోనైనా జరిగివుంటే, తక్షణమే వారిని బర్తరఫు చేయడమే కాకుండా కఠినాతికఠినమైన శిక్ష విధించి ఉండేవారు; కాని బ్రిటిష్ సైన్యంలో మాత్రం, హఠాత్తుగా ధనం సంపాదించుకున్న "ఆఫీసరుకీ, పెద్దమనిషికీ" ఇది పరమోచితమైన ప్రవర్తనకిందే పరిగణించబడుతూంది. ఇక సామాన్య సైనికుల విషయంలో అంటే, అది వేరే కథ. లూటీ డబ్బు ఒకసారి చేతిలో పడగానే ఇక లూటీపైన దురాశ హెచ్చుపెరిగిపోతుంది; అందుకు తగ్గట్టు ఇక ఇండియాదేశీయుల ఖజానాలు అందుబాటులో లేకపోయేసరికి, బ్రిటిష్ ప్రభుత్వపు ఖజానానే ఏల లూటీ చేయకూడదు? — అనే బుది బుర్రలోకి ప్రవేశిస్తుంది. పర్యవసానం ఎలా తేలిందో మిస్టర్ రస్సెల్ చెబుతున్నాడు:

> "యూరపియన్ రక్షక దళం కాపాడుతూ తీసుకువస్తూన్న రెండు ఖజానా పెట్టెలు ఉన్న బళ్ళ అనుమానాస్పదమైన సందర్భాల్లో బోల్తాపడ్డం జరిగి, వాటిలో రూపాయిలు కొద్దిగా కనబడకుండా పోయాయి; కాగా రక్షక దళాన్నిచ్చి ఖజానాను వెంట తీసుకు రావడమనే సున్నితమైన విధి నిర్వహణకు దేశీయసైనికులను నియమించడమే క్షేమకరమని సైనిక కోశాధికారులు అభిప్రాయపడుతున్నారు!"

ఆహాహ్, నిజంగా బహు భేషుగ్గా ఉంది కదండీ! యోధాగ్రేసరులలో అగ్రతాంబూలం అందుకోడానికి ఆదర్శపాత్రుడని చలామణీ అవుతూన్న బ్రిటిష్ సైనికుడిలోకంటె హిందూస్థానీయుడిలోనూ, సిక్కులోనూ క్రమశిక్షణ హెచ్చు, దొంగతనం తక్కువ! అయితే ఇంతవరకూ మనం బ్రిటిష్ సైనికుడు వ్యష్టిగా తస్కరణోద్యోగం చేస్తూండగా చూశాం. ఇక బ్రిటిష్ సైన్యం సమిష్టిగా "లూటీ" కార్యాన్ని ఎలా నిర్వహించిందో ఇప్పుడు చూద్దాం:

> "అధికారరీత్యా కొల్ల పెట్టబడిన సొత్తుమొత్తం రోజుకురోజూ పెరిగిపోతూంది; దీనినంతనీ అమ్మితే 6 లక్షల సొమ్ము సమూలవుతుందని అంచనా. కాన్పూర్‌లో ఎక్కడ చూసినా లక్నోలో దోచుకున్న సొత్తే కళ్ళబడుతూందని చెప్పుకుంటున్నారు;

ప్రజామందిరాలకూ, సొంత ఆస్తులకూ కలిగిన నష్టమూ, ఇళ్ల ధరలూ భూముల ధరలూ పడిపోవడంవల్లా, పట్నంలో జనం తగ్గిపోవడంవల్లా కలిగిన నష్టమూ, వీటిన్నిటినీ అంచనావేస్తే, అయోధ్య ముఖ్యపట్నానికి ఏభై, అరవై లక్షల పౌన్ల వరకూ నష్టం సంభవించి వుంటుందని తేల్తోంది."

క్రిస్టియన్ మతస్థులైయుండి నాగరికతచెంది ఔదార్యసాహసాది సుగుణాలుకల్గి సాధుస్వభావులైన ఈ బ్రిటిష్ సైనికుల మహమ్మారి నాశకంటె, మిడతల దండులాగు పట్నాలమీద పడి దారిలో కనబడిన దానినల్లా ఊడిచిపెట్టేసిన చెంగిజ్ ఖాన్, తైమూర్ల కాల్మీక్ మూకలే వెయ్యిరెట్లు క్షేమకరమని ఏ దేశానికైనా అనిపించి ఉంటుంది. చెంగిజ్ ఖాన్, తైమూర్ల దండులు తాత్కాలికంగా దేశంమీద పడి దోచుకుని, మరో దేశంమీద పడడానికని వాటి మానాన అవి ఎటు పడితే అటు పోయేవి; కాని అన్ని విషయాలనూ ఒక క్రమపద్ధతిలో యధావిధిగా జరిపించడమనేది ఒక స్వాభావిక గుణంగా కలిగిన ఇంగ్లీషువారు మాత్రం లూటీని ఒక విశిష్ట విధానంకింద రూపొందించి, లూటీ చేయబడిన చోరీ అస్తులను అందుకొని వెల యేర్పరచే ఏజెంట్లను తమ సైన్యంతో కూడా తీసుకొచ్చి, వీరిచేత లూటీ వస్తువును ప్రతిదానినీ చిఠ్ఠా పుస్తకాలలో నమోదుచేయించి, లూటీవస్తువులను వేలంవేయించి, బ్రిటిష్ సాహసపరాక్రమాలకు మొత్తంగా ముట్టవలసిన పారితోషికంలో ఎట్టి మోసమూ జరగకుండా ధర్మంగానూ న్యాయంగానూ అణాపైసలతోసహా ముట్టేటట్టు వెయ్యి కళ్లతో కనిపెడుతున్నారు. వేసవికాలంలో జరుగబోయే యుద్ధచర్యలు కల్గించే శ్రమదమాదులను ఓర్చుకోగల్గడానికి అవసరమైన కఠినాతికఠిన క్రమశిక్షణను పాటించాల్సిన తరుణంలో, మొత్తం పదిష్టి కొల్లదోపిడీలు సాగించిన ఫలితంగా క్రమశిక్షణ సడలిపోయిన ఈ సైన్యం యొక్క శక్తిసామర్థ్యాలు మీదటికి ఎట్లా వుంటాయో మనమెంతో ఆసక్తితో కనిపెడుతూ ఉంటాం.

ఏది ఏలాగున్నప్పటికీ, యధావిధిగా రణరంగంలో యుద్ధంచేయడానికి హిందూదేశీయ సైనికులు లక్నోవద్ద ఎట్టి విముఖత ప్రదర్శించారో, అంతకంటె ఎక్కువ విముఖతే ఇప్పుడు ప్రదర్శించేటట్టు కనబడుతూంది, కాని అసలు ప్రశ్న ఇది కాదు. తిరుగుబాటుదార్లు కొంత ప్రతిఘటన సాగించిన తర్వాత, ఇంతవరకూ ఏమాత్రమూ లొంగదీయబడని రాజపుత్రస్థానాన్నే గనక మాటవరుసకి యుద్ధరంగంగా మార్చుకుంటే, అప్పుడు ఏమిటనేదే ఇంతకంటే ముఖ్యమైన ప్రశ్న. అన్ని నగరాల్లోనూ రక్షక దళాలను ఉంచకతప్పదు సర్ కోలిన్ కాంబెల్‌కి; లక్నోపై దాడిచేయడానికని అతడు సమీకరించిన సైన్యంలో సగమైనాలేదు ఇప్పుడతని యుద్ధరంగపు సైన్యం. రోహిల్‌ఖండ్‌ను ఆక్రమించుకోవాలంటే యుద్ధరంగంలో నిలబెట్టడానికి అతనికిక ఏమాత్రపు సైన్యం మిగులుతుంది? ఎండకాలం రానేవచ్చింది;

ఇక జూన్‌లో వర్షాలు ఆరంభమయేసరికల్లా భారీస్థాయిలో జరపవలసిన యుద్ధచర్యలన్నిటికీ స్వస్తిచెప్పక తప్పదు; ఇందువల్ల తిరుగుబాటుదార్లకి ఊపిరి సలపడానికి కొంత వ్యవధి చిక్కక మానదు. ఏప్రిల్ నెల మధ్య తరువాత ఎండలు ముదిరిపోయి రోగాలు తిరగబెట్టడం ఫలితంగా యూరపియన్ సైనికులలో ఆ రోజుకారోజు జననష్టం అధికమౌతుంది; హిందూ దేశ పరిస్థితులకు రాటుతేరి హావ్‌లక్, నిల్సన్‌లకింద యుద్ధంచేసినట్టి ఆరితేరిన సైనికులలో గత వేసవిలో కలిగిన నష్టంకంటె, కిందటి చలికాలంలో మాత్రమే ఇండియాలో అడుగుపెట్టిన యువకులలో శీతోష్ణస్థితి దెబ్బకి నేలకొరిగేవారి సంఖ్య తప్పకుండా హెచ్చుగానే ఉంటుంది. ఢిల్లీ లక్నోలు ఏలాగైతే అమీ తుమీ తేల్చే స్థానాలు కాలేకపోయాయో, రోహిల్‌ఖండ్ కూడా అంతే. రణరంగంలో నిల్చి తుముల యుద్ధంచేసే శక్తిసామర్థ్యాలు తిరుగుబాటుకి చాలావరకూ సన్నగిల్లిపోయాయనేది నిశ్చయమే; అయినప్పటికీ ప్రస్తుతం చెదురు మదురు స్వభావాన్ని ధరించుతూన్న ఈ యుద్ధం మరింత ఉగ్ర స్వరూపాన్ని దాల్చి, స్థలాంతర గమనంవల్లనూ శీతోష్ణస్థితివల్ల తగిలే దెబ్బల ఫలితంగానూ, ఇంగ్లీషు వారు తమ సైన్యాన్ని తామే నాశనం గావించుకోక తప్పదు. కొత్తగా ఏర్పడిన పలు ప్రతిఘటనా కేంద్రాలను చూడండి. పాత సిపాయిల్లో మూకుమ్మడిగా సమీకృతమైన రోహిల్‌ఖండ్ ఒకటుంది; గోగ్రాకి ఆవలివైపున అయోధ్య దేశీయులు స్థానం ఏర్పరుచుకున్న పూర్వోత్తర అయోధ్య ఒకటుంది; బుందేల్‌ఖండ్ తిరుగుబాటుదార్ల కేంద్రీకరణకు తాత్కాలిక కేంద్ర స్థానంగా ఏర్పడిన కాల్పీ నగరం ఒకటుంది. బరేలీ, కాల్పీ నగరాలు రెండూ కూడా పతనం చెందాయనే వార్త కొద్ది వారాల్లోనో, ఇంకా అంతకు ముందుగానో కూడా మనం తప్పకుండా వింటామనే తోస్తుంది. మొదటి నగరం పతనానికి ప్రాముఖ్యతేమీ లేదు; ఎందుచేతనంటే ఈ నగరం పతనంచెందిన ఫలితంగా కాంబెల్‌కి తనవద్ద ఉపయోగించ వీలుగా వున్న సైన్యాన్నంతనీ, అంతాకాకపోతే అత్యధికభాగాన్నయినా, అక్కడ అట్టేపెట్టేయక తప్పదు. ఇక కాల్పీ విషయం: నాగపూర్‌నుండి బుందేల్‌ఖండ్‌లో వున్న బాందావరకూ తన శ్రేణిని తరలించుకొని వెళ్ళిన జనరల్ విట్‌లక్‌వల్లనూ, ఝాన్సీనుండి తరలివస్తూ మార్గమధ్యంలో ఎదురుపడిన కాల్పీ సైన్యపు అగ్రగామిదళాలను ఓడించిన జనరల్ రోజ్‌వల్లనూ కాల్పీకి ఇప్పుడు ప్రమాదం ఏర్పడింది. బరేలీ పతనంకంటె కాల్పీ పతనానికే అధికప్రాముఖ్యత ఉంటుంది; ఎందుచేతనంటే దీని పతనం ఫలితంగా కాంబెల్ యుద్ధచర్యలన్నింటికీ ప్రాతిపదికైన కాన్పూర్‌కు ఇప్పుడున్న ప్రమాదం ఒక్కటే దీనితో తీరిపోతుంది; తత్ఫలితంగా అచ్చటనుండి తరలించివేయడానికి ఇక వీలైన సైనిక బలాలనుండి కొందరు సైనికులను తన యుద్ధరంగపు సైనిక బలాలలోకి తీసుకోడానికి బహుశా కాంబెల్‌కి వీలు చిక్కుతుంది. కాని అయోధ్యనుండి శత్రువులను తరిమివేయడానికి తప్ప ఇతర కార్యాలకు అవసరమయే సైనిక బలం అతనికి లభించుతుందని ఆశ మాత్రం అత్యంత అనుమానాస్పదమే.

ఈవిధంగా ఇండియాలో ఏ ఒక్క కేంద్రంలోనూ ఇదివరకెన్నడూ ఇంగ్లండు కేంద్రీకరించని సైన్యం ఇప్పుడు కేంద్రీకరించబడినప్పటికీ, ఈ సైన్యమంతా మళ్లీ మరోసారి దేశం నాలుగు చెరగులా చెదిరిపోయి, దాని నియమిత కర్తవ్యం సరిగా నిర్వహించడానికే దానికి ఊపిరిసలపకుండా ఉంది. వేసవికాలపు ఎండలవల్ల, వర్షపాతాలవల్ల కలిగే విపరీత శీతోష్ణ పరిస్థితుల మూలాన సంభవించే రోగాల వాత పడేవారి సంఖ్య భయంకరంగా ఉంటుంది; పోతే నైతికంగా హిందూదేశస్థులకంటె యూరపియన్ల శ్రేష్ఠత మాట ఎలా వున్నా, ఇండియా దేశపు వేసవి ఉష్ణోగ్రతకూ కుంభవృష్టి వర్షానికీ తట్టుకోడంలో యూరపియన్లకంటె హిందూదేశస్థులకున్న శ్రేష్ఠతే ఇంగ్లీషు సైనికబలాల వినాశానికి తిరిగి ఇంకొకసారి కారణభూత మౌతుందనడంలో ఎట్టి సందేహమూ ఉన్నట్టు కనబడదు. ప్రస్తుతం ఇండియాకు బయలుదేరి తోవలో వున్న బ్రిటిష్ సైనిక బలాల సంఖ్య చాలా తక్కువే; పోతే జూలై ఆగస్టులముందు అదనపు బలాలను ఏమంత పెద్ద సంఖ్యలో పంపే ఉద్దేశ్యం కూడా లేదు. దీన్నిబట్టి చూస్తే, అక్టోబరు నవంబర్లవరకూ, దినదినమూ క్షీణించిపోతూ తనకు మిగిలినట్టి ఆ ఒక్క సైన్యంతోనే కాంబెల్ తన స్థానం పరిరక్షించుకుంటూ కాలక్షేపంచేయాల్సి ఉంటుంది. ఈలోపునే భారతదేశపు తిరుగుబాటుదార్లు రాజపుత్రస్థానంచేతా, మహారాష్ట్రంచేతా తిరుగుబాటు చేయించడంలో విజయంపొందుతే ఇకప్పుడు చేసేదేమిటి? బ్రిటిష్ సేనలో 80,000 మందివరకూ పనిచేస్తూ, బ్రిటిష్‌వారు ఇంతవరకూ సాధించిన యుద్ధ విజయాల కీర్తి అంతా తమకే చెందాలని బాహాటంగా చెబుతూ, తమ ప్రస్తుత మానసికస్థితిలో బ్రిటిష్‌వారికి ఏమాత్రమూ సుముఖంగాలేనట్టి సిక్కులు తిరుగుబాటుచేస్తే అప్పుడు చేసేదేమిటి?

మొత్తంగా అన్నీ కలిపిచూస్తే, ఇండియాలో వున్న బ్రిటిష్‌వారికి అధమం మరొక శీతాకాలపు యుద్ధం ముమ్మందు ఎదురై తీరేటట్లు కనిపిస్తోంది, ఇంగ్లండుమండి మరొక సైన్యం అదనంగా అందనిదే వారు ఈ యుద్ధం చెయ్యలేరు.

ఎంగెల్స్‌చే రమారమి 1858 జూన్ 4న
రచించబడింది

"New-York Daily Tribune"
1858 జూన్ 26వ తేదీన
5361వ సంచికలో
ఒక సంపాదకీయ వ్యాసంగా
ప్రచురించబడింది

# మార్క్స్

## *ఇండియాలో పన్నులు

లండన్ పత్రికల ప్రకారం, లండన్ మార్కెట్టులో ఇండియా స్టాక్ వాటాల, రైల్వే రుణపత్రాల ధరలు ఇటీవల బాగా తగ్గుముఖం పట్టడం చూస్తే, ఇండియాలో జరుగుతూన్న గెరిల్లా యుద్ధ పరిస్థితులన్నీ సంతృప్తికరంగానే ఉన్నాయనే తన దృఢ నమ్మకమైనట్టుగా జాన్ బుల్ బయటికి కనబర్చుతూన్న వైఖరిలో ఏమంత యధార్థత లేనట్టే ధ్రువపడుతూంది; పోతే ఏది ఏమైనప్పటికీ, ఇండియాయొక్క ఆర్థిక వనరుల పెరుగుదలపట్ల మొండి అపనమ్మకాన్నే ఈ ధరల తగ్గుదల సూచించుతూంది. ఈ రెండవ విషయం గురించి రెండు వ్యతిరేక అభిప్రాయాలు ప్రచారంలో ఉన్నాయి: ఇండియాలో ఉన్నంత దుర్భరంగానూ బాధాకరంగానూ పన్నుల భారం ప్రపంచంలో మరే దేశంలోనూ లేదనే నిశ్చయంగా చెప్పవచ్చుననీ, అన్ని రాష్ట్రాలలో ఇంచుమించు సర్వేసర్వత్రా, అందులోనూ ముఖ్యంగా బ్రిటిష్ పరిపాలనకింద అన్నిటికంటె హెచ్చు కాలం వున్న రాష్ట్రాలలోనూ, వ్యవసాయదార్లు, అనగా భారతదేశపు ప్రజాబాహుళ్యం కేవలం నికృష్ట దారిద్ర్యం అనుభవించుతూ, నిరాశా నిస్పృహజనక పరిస్థితులలో జీవిస్తున్నారనీ, తత్ఫలితంగా ఇండియా ఆదాయం ఇక ప్రస్తుత పరిమితి దాటి తలవెంట్రుక మేరకైనా పెంచడానికి వీల్లేదనీ, అందుచేత ఇండియా ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడం అసాధ్యమనీ ఒక అభిప్రాయం. మీదటికి కొన్ని సంవత్సరాలవరకూ ఇండియా అసాధారణ వ్యయం ఒక పద్దుకిందనే ఏటా 2 కోట్ల పౌన్లు ఖర్చుపెట్టాల్సి వస్తుందని మిస్టర్ గ్లాడ్‌స్టన్ చెప్పడం దృష్ట్యా, ఈ తరుణంలో ఈ అభిప్రాయం అపరిమితమైన ఆందోళనే కలిగించుతుంది. ఇక రెండవ వైపున, ప్రపంచంలో వున్న దేశాలన్నింటిలోనూ ఇండియాలోనే పన్నులు మిక్కిలి తక్కువనీ — ఈ వాదన బలపరచడానికి వేనవేల అంకెలు ఉదహరించుతూ — ఖర్చులు అధికమవుతూండగా అందుకు తగ్గట్టుగా ఆదాయం కూడా అధికంచేయవచ్చుననీ; భారతదేశస్థులు ఇక పన్నులభారం మోయలేరనే అభిప్రాయం కేవలం హేత్వాభాసమనీ రెండవ పక్షంవారు చెబుతున్నారు. "అసౌకర్యమైన" సిద్ధాంతం

వెలిబుచ్చుతున్న పక్షానికి అత్యంత శ్రమశీలమైనట్టి పలుకుబడిగలిగినట్టి ప్రతినిధిగా ఎంచ తగిన మిస్టర్ బ్రైట్, కొత్త ఇండియా పరిపాలన బిల్లు[97] ద్వితీయ పఠనమప్పుడు ఈ కింది అభిభాషణను కావించాడు:

"పన్నులు విధించడంలోకాని, పన్నులను వసూలుచేసే విధానంలోకాని ప్రభుత్వం ఏమాత్రపు న్యాయబుద్ధినీ ప్రదర్శించకుండానే, భారతదేశపు ప్రజలనుండి పన్నులు పిండి రాబట్టుతూన్నప్పటికీ, అంతకుమించే ఇండియా ప్రభుత్వం ఇండియాను పరిపాలించడంకోసం ఖర్చుచేయాల్సి వస్తూంది. ఇండియాను పరిపాలించడానికి 3 కోట్ల పౌన్లకంటె అధికంగానే వ్యయమౌతూంది; ఇండియా మొత్తం ఆదాయం ఈ మేరకు ఉన్నప్పటికీ, ఖర్చులు పోను తేలిన లోటు భర్తీచేయడానికై అధికవడ్డీకి ఋణాలు చేయక ఎప్పుడూ తప్పడంలేదు. ఈనాడు ఇండియా ఋణం 6 కోట్ల పౌన్లు ఉంది: ఇది ఇంతటితో ఆగక పెరుగుతూనే వుంది; కాని అదే సమయంలో, గతంలో ఒకటి రెండు సార్లు తమ ఋణదాతలపట్ల ప్రభుత్వం ఏమంత నిజాయితీతో ప్రవర్తించక పోవడం కారణంగానైతేనేమి, ఇండియాలో ఇటీవల సంభవించిన విపత్కర పరిస్థితుల కారణంగానైతేనేమి, ప్రభుత్వానికున్న పరపతి తగ్గిపోతూంది. ఆయన మొత్తం ఆదాయాన్ని పేర్కొన్నాడు; కాని ఈ మొత్తంలో నల్లమందు పన్ను కూడా ఉండడంవల్లనూ, ఇది భారతదేశపు ప్రజానీకమంతటిపైనా విధించబడిన పన్నుగా భావించడానికి వీల్లేని కారణంగానూ, ప్రజానీకమంతటిపైనా వాస్తవంగా పడుతున్న పన్నుభారం 2 కోట్ల 50 లక్షల పౌన్లు అని మనం భావించవచ్చు. అయితే, ఈ 2 కోట్ల 50 లక్షల పౌన్లనూ ఈ దేశంయొక్క 6 కోట్ల పౌన్ల పన్నుల ఆదాయంతో సరిపోల్చడానికి వీల్లేదు. ఇంగ్లండులో ఒక రోజు శ్రమకు ప్రతిఫలంగా ముట్టిన వెండిబంగారాలతో ఇండియాలో పన్నెండు రోజుల శ్రమను కొనవచ్చునన్న సంగతి ఈ సభ గుర్తుతెచ్చుకోవాల్సి వుంటుంది. ఈ 2 కోట్ల 50 లక్షల పౌన్లూ ఇండియాలో వెచ్చించి ఇండియాలో శ్రమను కొన్నట్టయితే, ఇంగ్లండులో 30 కోట్ల పౌన్ల పెట్టుబడితో ఎంత శ్రమను కొనగలమో అంత శ్రమను కొనగలుగుతాం అన్నమాట. భారతీయుని శ్రమఫలితంయొక్క విలువ ఎంత ఉంటుంది? — అని ఆయన్ని ప్రశ్నించవచ్చు. సరే, ఇక భారతీయుని రోజువారీ శ్రమ విలువ 2 పెన్నీలు మాత్రమే ఉన్నప్పుడు శ్రమ 2 షిల్లింగులకు సమానమైనట్లు పన్నులు భారతీయుడు చెల్లించగలడని మనం ఆశించగూడదు గదా. గ్రేట్ బ్రిటన్, ఐర్లండుల జనాభా 3 కోట్లు; ఇండియా జనాభా 15 కోట్లు. మన దేశంలో పన్నులవల్ల 6 కోట్ల పౌన్లు వసూలవుతున్నాయి; ఇండియాలో ప్రజల రోజుకూలి ననుసరించి

లెక్కకట్టిన పక్షంలో, 30 కోట్ల పౌన్ల ఆదాయం, అనగా మన దేశంలో వసూల వుతూన్న ఆదాయంకంటె ఐదింతల ఆదాయాన్ని మనం రాబట్టుతున్నామన్నమాట. బ్రిటిష్ సామ్రాజ్యంలో జనాభాకంటె ఇండియా జనాభా ఐదింతలు అధికమే కాబట్టి మనిషి ఒక్కంటికి పడే పన్ను ఇండియాలోనూ ఇంగ్లండులోనూ సమానంగానే ఉందనీ, అందుచేత ఇండియా ప్రజలకు పెద్దగా అన్యాయమేమీ జరగడంలేదనీ ఎవరైనా అనవచ్చు. అయితే యంత్రాలు, ఆవిరి, రవాణా సాధనాలు, ఇంతేకాకుండా పెట్టుబడి, మానవ ఆవిష్కరణల ఫలితంగా ప్రజయొక్క శ్రమశీలత ఇనుమడింప జేసే ప్రతి విషయంలోనూ అంతర్గర్భితమైవున్నట్టి అనూహ్యమైన శక్తి ఇంగ్లీషు ప్రజకి సహాయపడుతూంది. ఇండియాలో ఇటువంటిది కేవలం శూన్యం. భారత దేశం అంతటిలోనూ రోడ్డు అని చెప్పకోదగినది అసలు మృగ్యం."

అయితే ఇండియాలో వున్న పన్నులను ఇంగ్లండులోని పన్నులతో పరిపోల్చి చూచేందుకు అవలంబించిన ఈ విధానంలో ఎక్కడో పొరపాటుందని మాత్రం ఒప్పకోక తప్పదు. ఒక వైపున చూస్తే బ్రిటన్‌లో జనాభాకంటె ఐదింతల జనాభా వుంది ఇండియాలో; రెండో వైపున చూస్తే బ్రిటన్‌లో వున్న పన్నులకంటె సగమే ఉన్నాయి ఇండియాలో పన్నులు. కాని భారతీయుని శ్రమ బ్రిటన్ దేశస్థుని శ్రమలో మమారు పన్నెండోవంతుకి సమానమని మిస్టర్ బ్రైట్ అంటున్నాడు. ఈ హేతువాదాన్నిబట్టి ఇండియాలో వసూలయే 3 కోట్ల పౌన్ల పన్నులూ బ్రిటన్‌లో వాస్తవంగా పెంచబడిన 6 కోట్ల పౌన్లకి బదులు, 30 కోట్ల పౌన్లకి సమానమౌతుందన్నమాట. అయితే దీనిమండి అయన ఏట్టి పర్యవసానం తేల్చాల్సి వుంటుంది? ఇండియా ప్రజల సాపేక్ష పేదరికాన్ని గణనలోకి తీసుకొన్న పక్షంలో, బ్రిటిష్ ప్రజలు చెల్లించుతూన్నట్టి పన్నులతో సమానమైన పన్నులనే, తమ సంఖ్యకు అనుగుణంగా ఇండియా ప్రజలు చెల్లించుతున్నారనీ, కాబట్టి 3 కోట్ల బ్రిటన్లపై 6 కోట్ల పౌన్ల పన్నులు ఎంత భారంగా ఉన్నాయో, 15 కోట్ల భారతీయులపై 3 కోట్ల పౌన్ల పన్నులు సమానభారంగానే ఉన్నాయనీ ఆయన తేల్చుతున్నాడు. అయితే ఇలాటి ఊహ ఆయన ఊహించు కుంటూనే, ధనికులైన ప్రజ ఎంతటి పన్నులు చెల్లించుతున్నారో పేద ప్రజ అంతటి పన్నులూ చెల్లించలేరని ఎదురుతిరిగి చెప్పడం కేవలం మిథ్యాహేతువాదమనే చెప్పక తప్పదు; ఎందు చేతంటే బ్రిటిష్ ప్రజలు ఎంత చెల్లించుతున్నారో ఇండియా ప్రజలు కూడా అంతమటుకూ చెల్లించుతున్నారని చెప్పడంలో ఇండియా ప్రజలయొక్క సాపేక్ష పేదరికాన్ని అప్పడే లెక్క లోకి తీసుకోవడమైంది. వాస్తవంగా ఈ సందర్భంలో ఇంకొక ప్రశ్న కూడా లేవదీయవచ్చు. అదేమిటంటే: రోజుకి 12 డాలర్లు సంపాదించుకుంటూన్న మనిషిని ఒక డాలరు చెల్లించ మంటే అతనికి చెల్లించడానికి ఎంత మళువుగా ఉంటుందో, రోజుకి 12 సెంట్లు సంపా

దించుకుంటూన్న మనిషిని ఒక సెంటు చెల్లించమంటే చెల్లించడానికి అతనికి అంత సులువుగానూ ఉంటుందా? ఇద్దరూ కూడా వారివారి ఆదాయంలో సాపేక్షంగా సమానభాగమే చెల్లించుతూ వుంటారు. అయినప్పటికీ వారివారి అవసరాలనుబట్టి ఈ పన్నుభారం మాత్రం ఇద్దరికీ వేర్వేరుగానే ఉంటుంది. ఇదిలా ఉన్నప్పటికీ కూడా మిస్టర్ బ్రైట్ ఈ ప్రశ్న ఈ రూపంలో వేయడమే లేదు; ఈ రూపంలో ఈ ప్రశ్నను వేసివుండినట్టయితే, ఇండియాలో పన్నులకీ బ్రిటన్‌లో పన్నులకీ ఉన్న వ్యత్యాసంకంటె, ఒక్కవైపు బ్రిటిష్ వేతనపు కార్మికుడు చెల్లించుతున్న పన్నులకీ బ్రిటిష్ పెట్టుబడిదారు చెల్లించుతున్న పన్నులకీ ఉన్న వ్యత్యాసం కొట్టొచ్చినట్టు ఆయనకి కనబడి ఉండేది. కాగా ఇండియా ప్రజలు చెల్లించే 3 కోట్ల పౌన్ల పన్నులనుండి నల్లమందువల్ల లభించుతూన్న 50 లక్షల పౌన్ల ఆదాయము, చైనా వినిమయంపై విధించిన ఎగుమతి సుంకమే కాబట్టి, న్యాయంగా ఆలోచిస్తే, ఇది ఇండియా ప్రజలమీద మోపిన భారంనుంచి మినహాయించబడాలని ఆయనే ఒప్పుకొంటున్నాడు. ఆంగ్లో-ఇండియన్ దొరతనాన్ని సమర్థించేవారు మరొక విషయం గుర్తుకుతెస్తున్నారు; అదేమిటంటే, మొత్తం ఆదాయంలో 1 కోటి 60 లక్షల పౌన్లు భూమి ఆదాయం, అనగా భూమిశిస్తువల్ల లభించుతూందనీ, సార్వభౌమ భూస్వామి అయిన ప్రభుత్వానికే అనాదినుండీ భూమి చెందుతూందనీ, అది ఎన్నడూ కూడా వ్యవసాయదారుల సొంత ఆస్తికింద చెల్లలేదనీ, వాస్తవంగా బ్రిటిష్ వ్యవసాయదార్లు బ్రిటిష్ ప్రభువర్గానికి చెల్లించే శిస్తు ఏవిధంగానైతే బ్రిటిష్ పన్నుల విధానంలో ఒక భాగమని అనడానికి వీల్లేదో, అలాగే దీన్ని కూడా న్యాయంగా పన్ను అని అనడానికి వీల్లేదు అనీ వీరంటారు. ఈ దృక్పథం అనుసరించి ఇండియాలో పన్నుల స్వరూపం ఈవిధంగా ఉంటుందన్నమాట:

| | | | |
|---|---|---|---|
| మొత్తం వసూలు . . . . . . . . . . | పౌ. | 3,00,00,000 | |
| ఇందులోనుండి మినహాయింపులు: | | | |
| నల్లమందుపై ఆదాయం . . . . . . . | పౌ. | 50,00,000 | |
| భూమిశిస్తు . . . . . . . . . . | పౌ. | 1,60,00,000 | తగ్గిస్తే |
| కచ్చితమైన పన్ను . . . . . . . . . . | పౌ. | 90,00,000 | |

ఈ 90,00,000 పౌన్లలోనూ, పోస్టు, రిజిస్ట్రేషను స్టాంపులు, ఎగుమతి దిగుమతి సుంకాలు మొదలైన కొన్ని ముఖ్యమైన పద్దులకింద వచ్చే ఆదాయం మొత్తం ప్రజా సామాన్యంమీద అతిస్వల్పాతిస్వల్ప విస్తృతిలోనే పడుతూన్నాయనే మళ్లీ ఒప్పుకోవాల్సి ఉంటుంది. ఈవిధంగా, ఇండియాలో వసూలవుతూన్న ఆదాయంలో ఐదవ వంతుకు మించకుండా పన్నులవల్ల, అనగా ప్రజలయొక్క అసలు ఆదాయంనుండి వసూలవుతూందనీ,

కచ్చితంగా పన్నులు అని చెప్పబడే పద్దులనుండి వసూలు కాబడుతూన్నది బెంగాల్‌లో 27 శాతమేనని, పంజాబ్‌లో 23 శాతమేనని, మద్రాసులో 21 శాతమేనని, పశ్చిమోత్తర రాష్ట్రాలలో 17 శాతమేనని, ఇక బొంబాయిలో 16 శాతమేనని, పార్లమెంటు పత్రాల నుండీ, అధికారయుతంగా వెలువడిన ఇతర పత్రాలనుండీ లెక్కలు తీసి, మిస్టర్ హెండ్రిక్స్ బ్రిటిష్ గణాంక సమాజంవారికి ఒక నివేదిక సమర్పించాడు.

1855–1856 సంవత్సరాలలో ఇండియాలోనూ, యునైటెడ్ కింగ్‌డమ్‌లోనూ ప్రజలో సగటున ప్రతివారినుండీ వసూలుచేయబడుతూన్న పన్నుల మొత్తాన్ని సూచించుతూన్న ఈ దిగువ తారతమ్య పట్టిక మిస్టర్ హెండ్రిక్స్ నివేదికనుండి ఉటంకించబడింది:

| | | | | | |
|---|---|---|---|---|---|
| బెంగాల్‌లో తలసరి ఆదాయం: | షి. | 0.50 | కచ్చితమైన పన్నులు: | షి. | 0.14 |
| పశ్చిమోత్తర రాష్ట్రాలు . . . . | | 0.35 | " | | 0.07 |
| మద్రాసు . . . . . . . | | 0.47 | " | | 0.10 |
| బొంబాయి . . . . . . . | | 0.83 | " | | 0.14 |
| పంజాబ్ . . . . . . . | | 0.33 | " | | 0.09 |
| యునైటెడ్ కింగ్‌డమ్ . . . . | | — | " | | 1.100 |

ఇతర సంవత్సరాలను లెక్కలోకి తీసుకుని, సగటున ప్రతి వ్యక్తీ జాతీయాదాయానికి చెల్లించుతూన్న భాగం జనరల్ బ్రిగ్స్ ఈక్రింది విధంగా అంచనా వేస్తున్నాడు:

| | | |
|---|---|---|
| ఇంగ్లండులో 1852లో . . . . . . . . . . . . | షి. | 1.194 |
| ఫ్రాన్సులో . . . . . . . . . . . . . . . . | | 1.120 |
| ప్రష్యాలో . . . . . . . . . . . . . . . . | | 0.193 |
| ఇండియాలో 1854లో . . . . . . . . . . . . | | 0.3.8½ |

ఈ పట్టికలనుండి, సాపేక్షంగా వున్న ఇండియా పేదరికాన్ని లెక్కలోకి తీసుకున్నప్పటికీ కూడా, ఇండియాలో ప్రజలు చెల్లించుతూన్నంత తక్కువ పన్ను యూరప్‌లో ఏ దేశపు ప్రజలూ చెల్లించడంలేదని బ్రిటిష్ పరిపాలనను సమర్థించేవారు సారాంశం తేల్చుతున్నారు. ఈవిధంగా ఇండియాలో అమలులోవున్న పన్నుల విధానంపై అభిప్రాయభేదం ఉండడమేకాకుండా, వీటికి ఆధారాలుగా ఏర్పడుతూన్న వాస్తవాంశాలు సహితమూ పరస్పర విరుద్ధంగా ఉన్నాయి. అయినప్పటికీ, ఇండియాలో విధించబడుతూన్న నగదు పన్నుల మొత్తం సాపేక్షంగా అతిస్వల్పంగానే ఉందని ఒక వైపున ఒప్పుకునే తీరాలి; రెండవ వైపున, పైకి అతిస్వల్పంగానే కనబడుతూన్న ఈ పన్నుల భారం భారతదేశపు ప్రజానీకాన్ని అధఃపాతా

శానికి అణగదొక్కేస్తూందనీ, ఈ పన్నులు రాబట్టడానికే చిత్రహింసలవంటి అప్రతి ష్ఠాకరములైన విధానాలు చేపట్టవలసి వస్తూందనీ నిస్సందేహంగా రుజావు చేయడానికై పార్లమెంటు నివేదికలనుండీ, ఇండియా వ్యవహారాలపై అత్యున్నత ప్రామాణికులని అంగీ కరించబడుతూన్నవారి రచనలనుండీ కుప్పతెప్పలుగా సాక్ష్యం మనం చూపించవచ్చు. కాగా ఈ విషయం రుజావుచేయడానికై నిరంతరమూ ఆయేటికాయేడు అతిత్వరితగతిని పెరిగి పోతూన్న ఇండియా రుణమూ, ఇండియా ఆదాయంలో సంభవించుతూన్న లోటూ — ఈ సాక్ష్యంకంటె మరే సాక్ష్యం అవసరం? ప్రజలకున్న వనరులకు ఎక్కడ హాని కలుగుతుందో అనే భయంతో, వాటిని అంటకుండా ముట్టకుండా వుంటూ, అందుకు బదులు రుణాలు పెంచుకుంటూ ఆదాయపు లోట్లు భరించడమే ఉత్తమమార్గంగా ఇండియా ప్రభు త్వం ఎంచుతూందని ఒక్కనాటికి కూడా ఎవ్వరూ అనుకోరు. ఆదాయ వ్యయాలు సరి పెట్టుకోడానికి మరో మార్గమేమీ లేకే ఇండియా ప్రభుత్వం అప్పులు చేస్తూంది. 1805లో ఇండియా రుణం దాదాపు 2,56,26,631 పౌన్లుంది; 1829లో రమారమి 3,40,00,000 పౌన్లుంది; 1850లో 4,71,51,018 పౌన్లుంది; ఈనాడు సుమారు 6,00,00,000 పౌన్ల మొత్తానికి చేరుకుంటూంది. కాగా, ఇంగ్లండులో తెచ్చినట్టీ, ఈస్ట్ ఇండియా ఆదాయంనుండే తీర్చాల్సినట్టీ ఈస్ట్ ఇండియా కంపెనీ రుణం మనమీ లెక్కలోకి చేర్చడంలేదని సందర్భవశాత్తూ చెప్పాల్సివుంది.

1805లో దాదాపు 26 లక్షలవరకూ ఉండిన ఆదాయపు లోటు, లార్డ్ డల్‌హౌసీ పరిపాలన కాలంలో సంవత్సరానికి సగటున 50 లక్షలవరకూ పెరిగిపోయింది. ఆంగ్లో-ఇండియన్ పరిపాలనవైపే విశేషంగా మొగ్గు చూపే, బెంగాల్ సివిల్ సర్వీసు ఉద్యోగి అయిన మిస్టర్ జార్జి కాంబెల్‌కి 1852లో ఈకింది విధంగా ఒప్పుకోక తప్పిందికాదు:

> "ఇండియాపై మరే ఇతర ప్రాగ్దేశ విజేతలూ సాధించనంతటి సంపూర్ణాధి కారం మనం చలాయించుతూ, ఇంత నెమ్మదిగానూ, సార్వజనీనంగానూ, నిరాఘాటంగామా ఇండియా మన వశంలో వున్నప్పటికీ, వెనకటి ప్రాగ్దేశ విజేతలందరూ కూడా ఆ దేశంయొక్క ఆదాయంనుండి ధనం సంపాదించి భాగ్యవంతులయారు; అంతే కాకుండా వారిలో అనేకులు తమ సొంత ధనం వెచ్చించి ప్రజాహిత నిర్మాణాలు నెలకొల్పారు.... ఇట్టి పనులు చేయకూడదని మనమీద ఆంక్షలున్నాయి.... ఈ భారమంతా" [ఇంగ్లీషు పరిపాలనకింద] "ఏమాత్రమూ తగ్గించబడకపోయినప్పటికీ, ఆదా యంలో మాత్రం మనకేమీ మిగులు లేదు."

పన్నుల భారం అంచనా వేయడంలో, పన్నులయొక్క కేవలం నగదుమొత్తానికే హెచ్చు విలువ ఇవ్వకుండా, పన్నులు వసూలుచేసే విధానానికీ, వాటిని వినియోగించే రీతికీ

సమాన విలువ విప్వాల్సే ఉంటుంది. ఇండియాలో పన్నుల వసూలు విధానం అత్యంత ఏహ్యాకరంగా తయారైంది. ఉదాహరణకు, భూమిపన్ను విభాగంలో దాని ఫలసాయంకంటె బహుశా దుర్వ్యయమే అధికంగా వుండేమో. ఇక పన్నులు వినియోగించడం విషయంలో, ప్రపంచంలో ఇతరత్రాకంటె ఆసియా దేశాలలోనే అత్యావశ్యకమైనట్టి ప్రజాహితకార్యాల రూపంలో పన్నులలో కించిత్తు భాగమైనా ప్రజలకు తిరిగి ముట్టడంలేదనీ, మిస్టర్ బ్రైట్ న్యాయంగానే చెప్పినట్లు, పన్నులలో ఇంత అపరిమితమైన భాగం కేవలం ఒక్క పాలకవర్గంకోసమే కేటాయించబడడం ప్రపంచంలో మరెక్కడా జరగడంలేదనీ చెబితే సరిపోతుంది.

మార్క్సుచే 1858 జూన్ 29న
రచించబడింది

"New-York Daily Tribune"
1858 జూలై 23వ తేదీన
5383వ సంచికలో
ఒక సంపాదకీయ వ్యాసంగా
ప్రచురించబడింది

# ఎంగెల్స్

## ఇండియన్ సైన్యం[98]

ఇండియాలో ఇప్పుడు జరుగుతూన్న యుద్ధం క్రమేణా చెదురుచెదురు గెరిల్లా యుద్ధం కింద పరిణమించుతూంది; ఈ యుద్ధపరిణామంలో ఇదే రానున్న దశ అనీ, ఇది అత్యంత ప్రమాదగర్భితమైన దశ అనీ ఇదివరలో అనేకసార్లు మేము సూచించాము.* సమరభూమిలో నిలబడి చేసిన యుద్ధాలలోనూ, పట్టణాలనూ, దుర్గరక్షిత శిబిరాలనూ కాపాడుకోడానికై జరిగిన యుద్ధాలలోనూ ఒకదాని తరువాత ఒకటిగా ఓటమి అనుభవించిన తదుపరి, తిరుగుబాటు సైన్యాలు క్రమంగా రెండు వేలనుండి ఆరువేలు, ఎనిమిదివేలవరకూ సైనికులుగల చిన్న దళాలకింద చీలిపోయి, కొంతవరకూ వేటికవే స్వతంత్రంగా వ్యవహరించుతూనే, ఏదైనా బ్రిటిష్ పటాలం ఒక్కటే చుట్టుపక్కల ఉండడం తటస్థిస్తే, హుటాహుటిని దానిపైబడి చిన్న యుద్ధాలు చేయడంకోసం మాత్రం అన్నీ ఏకమవడానికి ఎప్పుడూ తయారుగా ఉండేటట్లు ఏర్పడ్డాయి. ఈ యుద్ధ పరిణామం దృష్ట్యా సర్ సి. కాంబెల్‌యొక్క క్రియాశీలమైన యుద్ధరంగపు సైన్యాన్ని లక్నోనుండి సుమారు ఎనభై మైళ్ల దూరంవరకూ రప్పించిన తర్వాత, ఒక్క గుండైనా పేల్చకుండానే బరేలీ నగరం వదిలిపెట్టేసి వెళ్లిపోవడం తిరుగుబాటుదార్ల ప్రధాన సైన్యానికి కీలకఘట్టంగా ఏర్పడింది; కాల్పీ నగరం వదలిపెట్టి వెళ్లిపోవడం తిరుగుబాటుదార్ల సైన్యంలో రెండవ పెద్ద భాగానికి కీలకఘట్టంగా ఏర్పడింది. రెండు సందర్భాల్లోనూ కూడా, యుద్ధచర్య ప్రాతిపదికల పరిరక్షణకు అనువుగా వున్న ఆఖరి కేంద్ర స్థానాన్ని వదులుకొని, తత్ఫలితంగా సైన్యాన్నంతటినీ ఏకంగా వినియోగించి యుద్ధం చేసే అవకాశం అంతరించిపోగానే, తిరుగుబాటుదార్లు చిన్నచిన్న సైనిక దళాలకింద విడిపోయి, కేంద్రచ్యుతిగా తిరోగమించారు. యుద్ధచర్యలు జరిపేందుకై కేంద్ర స్థానాలుగా ఈ చలనశీలములైన సైనిక శ్రేణులకు పెద్ద పట్టణాలేవీ అక్కరలేదు. ఏయే జిల్లాల్లోనైతే అవి

---

* ఈ సంకలనంలో 166–168, 182–184వ పుటలు చూడండి. – సం.

తిరుగుతూంటాయో ఆ జిల్లాలపైనే అవి తమ నిత్యభత్యాలకీ, పునరాయుధీకరణకూ, మాతన సైనికులను సమకూర్చుకోవడానికీ ఆధారపడగలవు; ఢిల్లీ, లక్నో, కాల్పీలవంటి నగరాలు పెద్ద సైన్యాల పునర్నిర్మాణానికై ఎంత విలువకలిగినవిగా ఉంటాయో, ఈ చిన్న శ్రేణులు ఒక్కొక్కదానికీ ఒక చిన్న పట్టణమైనా, ఒక పెద్ద గ్రామమైనా అంత విలువ కలిగినదిగా ఉంటుంది. యుద్ధం ఈవిధంగా పరిణమించడం ఫలితంగా, దానిలో ఇదివరకు వున్న ఆసక్తి ఇప్పుడు చాలావరకూ పోయూంది. తిరుగుబాటుదార్ల వివిధ శ్రేణుల గమనాలను సవివరంగా గుర్తుపట్టడానికి వీలులేక, యుద్ధసమాచారాలు కలగాపులగంగా వున్నట్టు ఉంటాయి; బ్రిటిష్ సేనాముల యుద్ధచర్యలు, వాటికి ఆధారాలైన పూర్వసిద్ధాంతాలను ఆవరించిన అనివార్యమగు అంధకారం కారణంగా చాలామటుకు, విమర్శనను తప్పించుకోగలుగుతున్నాయి; వాటిని విమర్శించడానికి జయాపజయాలే ఆధారాలుగా ఏర్పడుతున్నాయి; ఏదేలావున్నా అన్ని విమర్శనాధారాలకంటెమూ మోసమైనవి ఇవే.

దేశీయులు అవలంబించుతూన్న చలనాల విషయంలో వున్న సందిగ్ధత ఇప్పటికే చాలా హెచ్చుగా వుంది. బ్రిటిష్‌వారు లక్నోను పట్టుకున్న తరువాత, తిరుగుబాటుదార్లలో కొందరు ఆగ్నేయంగానూ, కొందరు ఈశాన్యంగానూ, కొందరు వాయవ్యంగానూ కేంద్ర చ్యుతిగా తిరోగమించారు. వాయవ్యంగా తిరోగమించిన సైనిక దళం కడమ అన్నిటికంటె బలమైనది; దీనిని కాంబెల్ రోహిల్‌ఖండ్‌వరకూ వెంబడించాడు. ఈ సైనిక దళం బరేలీ చేరుకుని, అక్కడ కేంద్రీకృతమై తిరిగి పునర్నిర్మితమైంది; కాని బ్రిటిష్ సేన అక్కడికి వచ్చేసరికల్లా, ఎలాటి ప్రతిఘటనా చేయకుండానే నగరం విడిచిపెట్టేసి వివిధ దిశలుగా తిరోగమించింది. ఈ వివిధ తిరోగమన మార్గాల వివరాలు మనకేమీ తెలియడంలేదు. ఈ సైనిక దళంలో కొంత భాగం నేపాల్ సరిహద్దున వున్న పర్వతాల దిశగా వెళ్లినట్టూ, కొన్ని శ్రేణులు – ఒకేఒక శ్రేణో, లేక అంతకన్న ఎక్కువో మనకు తెలియడంలేదు – తద్వ్యతిరేక దిశగా గంగానది, దోఆబ్ (గంగాయమునల మధ్యనున్న ప్రాంతం) వైపు వెళ్లినట్టు మాత్రమే మనకు తెలుస్తూంది. అయితే, కాంబెల్ బరేలీని ఆక్రమించుకున్న ఉత్తరక్షణంలోనే, తూర్పు దిశగా తిరోగమించిన తిరుగుబాటుదార్లు అయోధ్య సరిహద్దులో వున్న చిన్నచిన్న తిరుగుబాటు సైనిక దళాలను కలుపుకొని, షాజహాన్‌పూర్‌పై వచ్చారు; షాజహాన్‌పూర్‌లో చిన్న బ్రిటిష్ రక్షణ దళం మాత్రమే ఉంది; ఈ లోపున మరికొన్ని తిరుగుబాటుదార్ల సైనిక దళాలు ఈ పట్టణం దిశగానే త్వరత్వరగా పురోగమిస్తున్నాయి. ఈ పట్టణంలో వున్న బ్రిటిష్ రక్షక దళం అదృష్టంకొద్దీ, మే 11వ తేదీకే అదనపు బలాలతో బ్రిగేడియర్ జోన్స్ అక్కడకి వచ్చివుండడంచేత, తిరుగుబాటుదార్లను అతడు ఓడించేశాడు; కాని షాజహాన్‌పూర్ దిశగా సాంద్రీకరించుకుని వస్తూన్న తిరుగుబాటు దళాలు కూడా అదనంగా అక్కడకు వచ్చి చేరుకున్నాయి; ఇవన్నీ కలిసి 15వ తేదీన ఆ పట్టణాన్ని తిరిగి ముట్టడించాయి. ఆ రోజునే

బరేలీలో ఒక రక్షకబలాన్ని ఉంచేసి, షాజహాన్‌పూర్‌ను విముక్తిచేయడానికై కాంబెల్ బయలు దేరాడు. తిరుగుబాటుదార్లు పన్నిన ఈ ఎత్తుగడలో సహకరించిన వివిధ శ్రేణులపై దాడి చేసి, ఈ వివిధశ్రేణులను తరిమివేయడానికి కాంబెల్‌కి 24వ తేదీనగాని వీలైందికాదు. ఆ దళాలు తిరిగి వివిధ దిశలకు చెదిరిపోయాయి.

ఈవిధంగా రోహిల్‌ఖండ్ సరిహద్దు ప్రాంతాల్లో కాంబెల్ యుద్ధంచేస్తూండగా, జనరల్ సర్ హోప్ గ్రాంట్ తిరుగుబాటుదార్లను పట్టుకోడానికని తన సేనలను అయోధ్యలో ఈ కొసనుండి ఆ కొసకు ముందుకీ వెనక్కీ నడిపించాడు గాని, భారతదేశపు ఎండలకు అలిసిపోయి దెబ్బతిన్న తన సేనలకే నష్టంకల్గడం తప్ప మరే ఫలితమూ లేకపోయింది. అతనికంటె మంచి చురుకుగా తిరుగుబాటుదార్లు సంచరించగల్గారు. వారు అతనికి ఎక్కడ పడితే అక్కడే, వారికోసం తాను వెతుకుతూండిన చోట తప్ప, సర్వత్రా అగపడేవారు, తనకు ఎదురుగా వారు వుంటారు అని అతడు అనుకుని వుండగా, తన వెనుకభాగాన్ని వారు చాలాకాలం కిందనే చేరుకునేవారు. ఇలాంటి మరొక పీడను వెంబడించడంలో నిమగ్నుడై వుండెను జనరల్ లూగార్డ్. గంగానదిపై ఇంకా దక్షిణంగా దీనాపూర్, జగదీశపూర్, బక్సార్‌ల మధ్యనున్న జిల్లాలో అతనికి విశ్రాంతి అన్నది ఇవ్వకుండా తిరుగుబాటుదార్లు అతనిని నిరంతరమూ ఒకచోటనుండి ఒకచోటికి తిప్పుతూ, జగదీశపూర్‌నుండి చాలాదూరం వరకూ రప్పించి, హఠాత్తుగా ఆ పట్టణంలో వున్న రక్షక దళంపై పడ్డారు. లూగార్డ్ వెనక్కితిరిగి ఆ పట్టణంవైపు వెళ్లాడు; కాగా 26వ తేదీన అతడు తిరుగుబాటుదార్లపై విజయం సాధించాడని టెలిగ్రాములవల్ల తెలుస్తూంది. అయోధ్య, రోహిల్‌ఖండ్ తిరుగుబాటుదారులు అవలంబించిన ఎత్తుగడలూ, ఈ తిరుగుబాటుదార్లు అవలంబించిన ఎత్తుగడలూ సరిగ్గా ఒక్కటే అన్న విషయం స్పష్టం. అయినప్పటికీ, లూగార్డ్ సాధించిన విజయానికి పెద్ద ప్రాముఖ్యతేమీ ఉండదు. ఇలాంటి దెబ్బలను ఎన్ని తిన్నా ఇలాంటి దళాలు లక్ష్యం చేయవు; ఇలాంటి దెబ్బలు ఎన్నో తింటేనేగాని అవి బలహీనపడి నిస్పృహచెందవు.

ఈవిధంగా మే నెల మధ్యకల్లా, కాల్పీ సైన్యం ఒక్కటే తప్ప, ఉత్తర ఇండియాలో వున్న తిరుగుబాటుదార్ల సైన్యం యావత్తూ భారీస్థాయి యుద్ధానికి స్వస్తిచెప్పేసింది. కాల్పీ సైన్యం, సాపేక్షంగా కొద్ది వ్యవధిలోనే, ఆ నగరంలో వివిధ రకాల యుద్ధచర్యలకు అవసరమైన కేంద్రాన్ని నిర్మించుకుంది; ఆహారసంభారాలూ, మందుగుండూ, ఇతర సామగ్రీ వారికిక్కడ పుష్కలంగా దొరికాయి; ఫిరంగులూ సమృద్ధిగానే లభించాయి; అంతేకాకుండా కమ్మరం కార్ఖానాలూ, తుపాకుల కర్మాగారాలూ సహితం వారికిక్కడ వున్నాయి. కాన్పూర్‌కు కాల్పీ పాతికమైళ్ల దూరంలోనే వున్నా, వీరినేమీ చెయ్యకుండా అక్కడే ఉండనిచ్చాడు కాంబెల్; దోఆబ్ ప్రాంతంలో, అనగా యమునకు తూర్పువైపున, మాత్రం ఒక సైనిక దళాన్ని ఉంచి వీరి చర్యలు కనిపెట్టుతున్నాడు. చాలా దినాలకిందటే జనరల్ రోజ్, జనరల్

విట్‌లక్‌లు కాల్పీకి బయల్దేరారు; చివరకి రోజ్ అక్కడకు చేరుకుని, కాల్పీకి ఎదురుగానే వరుసగా జరిగిన అనేక సంఘర్షణలలో తిరుగుబాటుదార్లను ఓడించేశాడు. ఈలోపున యమున అవలి గట్టునున్న పర్యవేక్షక దళం కాల్పీనగరంపైనా, కోటపైనా ఫిరంగులు పేల్చడం మొదలుపెట్టింది; ఇది జరుగుతూండగానే ఓటాయిన తిరుగుబాటుదార్లు తమ చేతిలోవున్న ఆఖరి పెద్ద సైన్యాన్ని కూడా చిన్నచిన్న స్వతంత్ర దళాలకిందా విభజించేసి, కాల్పీనగరం, కాల్పీ కోట, రెండింటినీ ఖాళీచేసి వెళ్లిపోయారు. వారు ఏ మార్గంగుండా తిరోగమించుతున్నారో మనకందిన కథనాలనుబట్టి మనకేమీ తెలియడంలేదు; కొంతమంది దోఆబ్‌లో ప్రవేశించినట్టూ, కొందరు గ్వాలియర్ దిశగా వెళ్లిపోయినట్టూ మాత్రమే తెలుస్తూంది.

ఈవిధంగా, పన్నెండు నెలల యుద్ధంలో గడించిన అనుభవంవల్ల కొంతవరకూ సంఘటితులైన తిరుగుబాటు దళాలతోనూ, అనేకసార్లు ఓటమి పొందినప్పటికీ, ప్రతి ఓటమీ అనిశ్చితంగానే ఉండిపోయిన కారణంగానూ, బ్రిటిష్‌వారికి కల్గిన స్వల్పలాభాల కారణంగానూ, ప్రోత్సాహం లభించినట్టి క్రియాశీలమైన తిరుగుబాటు దళాలతోనూ, హిమాలయంనుండి బీహార్, వింధ్యపర్వతాలవరకూ, గ్వాలియర్ ఢిల్లీలనుండి గోరఖ్‌పూర్ దీనాపూర్లవరకూ ఉన్న ప్రాంతమంతా కిటకిటలాడిపోతూంది. తిరుగుబాటుదార్లకు ఇదివరకుండిన బలమైన దుర్గాలూ, యుద్ధచర్య కేంద్రాలూ అన్నీ కూడా వారినుండి వశపర్చుకొనబడిన మాట వాస్తవమే; వారికుండిన యుద్ధసామగ్రిలోనూ, శతఘ్నిబలంలోనూ అధికభాగాన్ని వారు నష్టపోవడమూ, ముఖ్యమైన పట్టణాలన్నీ శత్రువశమవడమూ వాస్తవమే; అయినప్పటికీ రెండవవైపున, బ్రహ్మాండమైన ఈ ప్రాంతమంతటిలోనూ పట్టణాలే తప్ప మరేమీ బ్రిటిష్‌వారికి స్వాధీనంకాలేదు; ఇక వెల్లడిగావున్న దేశమంతటిలోనూ ఆ నిమిషానికి వారి చలనశీలమైన శ్రేణులు నిలబడి వున్న స్థానం తప్ప మరేమీ వారి చేతుల్లో లేవు; అతిచురుకుగ్గా వున్న తమ శత్రువులను వెంబడించినప్పటికీ, వారు దొరుకుతారనే ఆశ లేదని తెలిసే, గత్యంతరంలేక వారిని వెంబడించాల్సి వస్తూంది; సంవత్సరమంతటిలోనూ మృత్యు సందర్శనతో సమానమైనట్టి రుతువులోనే ఈవిధమైన చికాకుకల్గించే యుద్ధంలోకి దిగక వారికి తప్పడం లేదు. ఈ వేసవి రోజుల్లో మిట్టమధ్యాన్నపు వడలో కూడా హిందూదేశస్థుడికి ఏమంత ఇబ్బంది అనిపించకుండా ఉండగా, తీక్షణమైన సూర్యకిరణాలు ఒక్కసారి తగిలేసరికే యూరపియన్లకి చావు ఎదురవుతూంది; ఇంత ఎండకాలంలోనూ కూడా హిందూదేశీయుడు నలభైమైళ్లు నడిచివెళ్లిపోగలుగుతూండగా, ఉత్తరదేశీయుడైన అతని శత్రువు పదిమైళ్లు నడిచివెళ్లేప్పటికే మీదిప్రాణాలు మీదికి ఎగిరిపోతున్నాయి; ఎండకాలపు వర్షాలకు గాని, చిత్తడి నేల అడవులకు గాని అతని ఆరోగ్యం చెక్కుచెదరకుండా ఉండగా, వేసవి వర్షాల్లోనూ, చిత్తడినేల ప్రాంతాలలోనూ యూరపియను ఏమాత్రం కాయకష్టం పడినా రక్తగ్రహణి, కలరా, చలిజ్వరం అతన్ని వెంటనే పట్టుకుని వేధించుతు

న్నాయి. బ్రిటిష్ సైన్యంలో పారిశుధ్యపు ఏర్పాట్ల గురించి సవివరమైన సమాచారం మనకేమీ తెలియడంలేదు; కాని జనరల్ రోజ్ సైన్యంలో వడదెబ్బ తగిలినవారి సంఖ్యకూ, శత్రువుల దెబ్బ తగిలినవారి సంఖ్యకూ ఉన్న తారతమ్యాన్నిబట్టీ, లక్నోలో వున్న రక్షక దళం జబ్బుతో పడివుందన్న వార్తనుబట్టీ, గత శరత్తులో ఇండియాలో దిగిన 38వ రెజిమెంటులో మొదట 1,000 ఉండగా, ఇప్పుడు 550 మందే ఉన్నారన్న వార్తనుబట్టీ, ఇంకా ఇతర సూచనలనుబట్టీ, కిందటి సంవత్సరం యుద్ధంలో పాల్గొని ఇండియా యుద్ధాలలో డక్కామొక్కీలు తిని ఎండకీ వానకీ రాటు తేరిన పాత సైనికులు స్వదేశానికి వెళ్లిపోగా, వారి స్థానే కొత్తగా దింపిన మనుషులమీదనూ కుర్రవాళ్లమీదనూ ఏప్రిల్ మే నెలల ఎండ తన దెబ్బ అప్పుడే తీసిందనే పర్యవసానానికి మనం రావచ్చు. హావ్‌లక్ చేసిన అధికప్రయాసపు ప్రయాణాలు గాని, ఢిల్లీ ఎదుట వర్షాకాలంలో జరిపిన ముట్టడివి గాని, తన చేతికింద ఇప్పుడున్న మనుష్యులతో చేయించడం కాంబెల్‌కి సాధ్యంకాదు. బ్రిటిష్ ప్రభుత్వం బలమైన అదనపు బలాలను మళ్లీ పంపించుతూన్నప్పటికీ, తనకు అత్యంత అనుకూలమైన పరిస్థితులలోనే తప్ప బ్రిటిష్‌వారితో పోరాడతిరస్కరించే శత్రువుపై ఈ ఎండకాలంలో జరిగిన యుద్ధంలో సైన్యాలకి సంభవించిన అరుగు తరుగుదలలను భర్తీచేయడానికి ఈ అదనపు బలాలు సరిపోతాయన్నది అనుమానాస్పదమే.

తిరుగుబాటుదార్ల యుద్ధం కూడా, ఫ్రెంచివారికి వ్యతిరేకంగా అల్జీరియాలో బెడోయిన్లు సాగించిన యుద్ధరూపాన్ని** తీసుకోవడం ఇప్పుడు మొదలవుతూంది. అయితే ఒక్క తేడా మాత్రం ఉంది; అదేమిటంటే, హిందూదేశస్థులు బెడోయిన్లంత తీవ్రమైన మతోన్మాదులు కారు, వారిది తురుపునవార్ల జాతి కాదు. విస్తృతమైదాన ప్రదేశంలో ఈ రెండవ విషయానికి చాలా ప్రాముఖ్యత ఉంది. తిరుగుబాటుదార్లలో, ఇర్రెగ్యులర్ కేవెల్‌రీ తయారు చేయడానికి పనికివచ్చే మహమ్మదీయులు చాలమందే ఉన్నారు; అయినప్పటికీ ఇండియాలో వున్న ప్రధాన అశ్వసైనిక జాతులేవీ ఇంతవరకు తిరుగుబాటులో చేరలేదు. తిరుగుబాటుదార్ల సైనికశక్తి అంతా వారి పదాతి దళంలోనే ఉంది; కాని యుద్ధభూమిలో ఇంగ్లీషువారితో తలపడడానికి ఈ అంగానికి తగిన శక్తిసామర్థ్యాలు కొరవడడంతో, మైదాన ప్రదేశాలలో గెరిల్లా యుద్ధం జరపడంలో ఇది వారికే ముందు కాళ్లకి బంధంగా తయారవుతుంది; ఇటువంటి ప్రదేశంలో వెదురుమదురు యుద్ధాన్ని సాగించేందుకు ఇర్రెగ్యులర్ కేవెల్‌రీకి మించినది మరొకటుండదు. ఇంగ్లీషువారు వర్షాకాలంలో నిర్బంధంగా తీసుకోవాల్సిన సెలవుల్లో, తిరుగుబాటుదార్లచే ఈ లోటు ఎంతవరకు భర్తీచేయబడుతుందో చూడాల్సి వుంది. కేవెల్‌రీని ఆర్గనైజుచేసుకోవడమే కాకుండా తమ సైనిక బలాలను పునస్సంఘటితం చేసుకోవడానికీ, రిక్రూటు చేసుకోవడానికీ దేశీయులకు పూర్తి అవకాశం వుంటుంది. అశ్విక దళాల సంఘటనకు తోడు ఇంకా మరి రెండు ముఖ్యమైన విషయాలు కూడా ఉన్నాయి.

చలికాలం ప్రవేశించగానే కేవలం గెరిల్లా యుద్ధం ఒక్కటే చాలదు. శీతాకాలం అయిపోయే వరకూ బ్రిటిష్‌వారికి చేతినిండా పని కల్పించేందుకు, యుద్ధచర్యా ప్రాతిపదిక కేంద్రాలూ, యుద్ధసామగ్రి, శతఘ్నులూ, దుర్గరక్షిత శిబిరాలు లేక పట్టణాలూ, ఇవన్నీ తిరుగుబాటుదార్లకు అవసరమవుతాయి; ఇవి లేకపోతే మళ్ళీ వేసవికాలం ప్రవేశించి గెరిల్లా యుద్ధానికి ప్రాణంపోసే లోపున ఇంగ్లీషువారు దానిని పొంతమూ అణచివేయవచ్చు. గ్వాలియర్‌ను గనుక తిరుగుబాటుదార్లు తమ వశం చేసుకోగల్గితే, ఆ నగరం కూడా ఇతర నగరాలతోపాటు మంచి అనుకూలమైన యుద్ధ కేంద్రంగా వారికి ఉపయోగపడే సూచనలున్నాయి. రెండవ విషయం: తిరుగుబాటుయొక్క భవితవ్యమంతా, అది విస్తరింపగలిగే సామర్థ్యంపైనే ఆధారపడివుంది. ఇప్పుడు దేశంలో విడివిడిగా వున్న తిరుగుబాటు దళాలు రోహిల్‌ఖండ్‌ను దాటి రాజపుత్రస్థానంలోకి, మహారాష్ట్రంలోకీ ప్రవేశించలేకపోయిన పక్షంలో, ఉద్యమం అంతా ఉత్తరాన వున్న మధ్యప్రాంతానికి మాత్రమే పరిమితమై ఉండిపోయే పక్షంలో, ఇప్పుడు విడివిడిగా వున్న దేశీయుల దళాలను రాబోయే శీతాకాలంలోనే చెదరగొట్టేసి, వారిని బందిపోటుదొంగలకిందకి దిగజార్చివేసి, దానితో తెల్ల ముఖాల దండయాత్రికులను దేశీయులు ఎంత తీవ్రంగా ద్వేషిస్తున్నారో అంతకంటె తీవ్రంగా వీరినే ద్వేషించే రోజులు త్వరలో సమీపించుతాయనడంలో ఎంత మాత్రమూ సందేహంలేదు.

ఎంగెల్స్‌చే 1858 జూలై 6న
రచించబడింది

"New-York Daily Tribune"
1858 జూలై 21 తేదీన
5381వ సంచికలో
ఒక సంపాదకీయ వ్యాసంగా
ప్రచురించబడింది

# మార్క్స

## ఇండియా బిల్లు[100]

ఇటీవల పార్లమెంటులో ప్రవేశపెట్టబడిన ఇండియా బిల్లు తృతీయ పఠనం కామన్స్ సభలో ఆమోదింపబడింది; ఇక పోతే, ప్రభువుల సభపై డెర్బీ పలుకుబడి పూర్తిగా ఉండడం ఫలితంగా, వారు బిల్లును ప్రతిఘటించే అవకాశం అతిస్వల్పమే; కాబట్టి ఈస్ట్ ఇండియా కంపెనీ రోజులు దగ్గిరపడడం ఖాయమనే మనం అనుకోవచ్చు. కంపెనీ మాత్రం తన ప్రాణం వదలుకుంటున్నా, పరాక్రమవంతంగా యుద్ధంచేసి వీరస్వర్గం మాత్రం అలంకరించడంలేదనే చెప్పాల్సి ఉంటుంది; వారు వ్యవహారస్థులుగానే, అడుగడుగునా బేరసారాలు చేసుకుంటూనే అధికారానికి ఎలాపాకివచ్చారో, అలాగే అడుగడుగునా లావాదేవీలు సాగించుకుంటూనే తమ అధికారం వదలుకున్నారు. నిజంగా చూస్తే వారి చరిత్ర అంతా కూడా కొనుగోలు చేయడమూ అమ్మకంచేయడమూనూ. సార్వభౌమాధిపత్యాన్ని ఖరీదుచేసి కొనుగోలు చేయడంతో వారు అసలు తమ మనుగడ ప్రారంభించారు; దానిని అమ్ముకోవడంతో తమ మనుగడకు స్వస్తిచెప్పుకున్నారు. వారు నేలకొరిగారు. నిజమే; కాని వారు నేలకొరిగింది రణరంగంలో కాదు; ఆమీనా వేలంలో పెద్ద పాట పాడినవాడి చేతుల్లో పడి ప్రాణాలొదులుకున్నారు వారు. డ్యూక్ ఆఫ్ లీడ్స్‌కి, ఇంకా ఇతర ప్రభుత్వోద్యోగస్థులకీ పెద్దపెద్ద మొత్తాలు లంచాలు తినిపించి, రాజాగారినుండి ఇరవైయొక్క సంవత్సరాలకు ఒక అనుజ్ఞాపత్రం 1693లో సంపాదించుకున్నారు. బ్రిటిష్ సామ్రాజ్యపు ఖజానాకు సాలీనా 4 లక్షల పౌన్లు చెల్లించుకుంటామనే ఒప్పందంమీద, 1767లో తమ అధికారపరిమితిని రెండేళ్లవరకూ పొడిగించుకున్నారు. 1769లో మళ్లీ ఇలాంటి బేరమే చేసి మరో ఐదేళ్లపాటు పొడిగించుకున్నారు; కాని ఇది జరిగిన కొద్ది సంవత్సరాలకే సాలీనా ఒప్పుకొన్న ఈ చెల్లింపును మాపుచేసి, 14 లక్షల పౌన్లు 4 శాతం వడ్డీకి ప్రభుత్వం అప్పుపెట్టే షరతుపైనా, తమ వంతుకు తాము గవర్నర్ జనరల్‌నూ, నలుగురి సలహా సభ్యులనూ నియమించడంలో పార్లమెంటు సూచనల ననుసరించే నియమించడానికీ, లార్డ్ ఛీఫ్ జస్టిస్‌నూ, అతనికి సహాయం చేసే

ముగ్గురు జడ్జీల నియామకాన్ని రాజుకే వదులుకుంటూ, ఇంతవరకు ప్రజాస్వామ్య సంస్థగా ఉండిన కోర్ట్ ఆఫ్ ప్రొప్రయిటర్స్‌ను ఇకనుండి అల్పసంఖ్యాక పాలకవర్గ సంస్థగా మార్చి వేయడానికి అంగీకరించుతూ, తమ సార్వభౌమత్వంలో కొన్ని భాగాలను ప్రభుత్వానికి అన్యాక్రాంతం చేసేశారు.[101] ఈస్ట్ ఇండియా కంపెనీకున్న పరిపాలనాధికారం రాజముకుటానికి అన్యాక్రాంతం చేయడమనే పరిస్థితే ఉత్తరోత్తరా ఏర్పడే సందర్భంలో, రాజ్యాంగచట్టబద్ధంగా తమకున్న అన్ని "పద్ధతులనూ" వినియోగించి ప్రతిఘటించుతామని కంపెనీ తమ కోర్ట్ ఆఫ్ ప్రొప్రయిటర్స్‌కు యథావిధిగా గంభీరమైన ప్రమాణం చేసిన తరువాత, 1858లో కంపెనీయే ఈ సూత్రం అంగీకరించి, తమకు కొంత డబ్బు ముట్టజెప్పి తమ డైరెక్టర్లలో ముఖ్యులకు ఉద్యోగాలు ఇప్పించే పద్ధతిలో, కంపెనీకి దండనప్రాయమైన బిల్లునే కంపెనీ ఒప్పుకుంది. వీరుని మరణమూ మూర్ఖుని అస్తమయమూ, రెండూ ఒక్కలాగే ఉంటాయని షిల్లర్ చెప్పిన వాక్యమే* నిజమైనట్టయితే, దివాలాకోరు తన అప్పులాళ్లతో కుదుర్చుకున్న రాజీలాగానే ఉంది ఈస్ట్ ఇండియా కంపెనీ నిష్క్రమణ.

ఈ బిల్లు ననుసరించి, సలహాసంఘసమన్వితుడైన గవర్నర్ జనరల్ ఎలాగైతే కలకత్తాలో వ్యవహారాలు చక్కబెడుతూంటాడో, సరిగా అదే విధంగా ప్రధాన పరిపాలనా విధులన్నీ సలహాసంఘసమన్వితుడైన సెక్రటరీ ఆఫ్ స్టేట్‌కి ఒప్పగించబడ్డాయి. అయితే ఈ ఇద్దరు అధికార్లూ కూడా — ఇంగ్లండులో వున్న సెక్రటరీ ఆఫ్ స్టేటూ, ఇండియాలో వున్న గవర్నర్ జనరలూ — తమ సలహాదార్ల సలహా పాటించ నవసరంలేకుండానే తమ విచక్షణను పయోగించి పరిపాలనా కార్యాలు నిర్వహించవచ్చు. ఈ కొత్త బిల్లును అనుసరించి, ఇప్పుడు రహస్య సంఘం పరంగా బోర్డ్ ఆఫ్ కంట్రోల్ ప్రెసిడెంటు నిర్వహించుతూన్న విధుల న్నిటినీ — అనగా అత్యవసర సందర్భాల్లో తన సలహాసంఘ సభ్యుల సలహాను కోరకుండానే తన ఉత్తరువులను ఇండియాకు పంపించే అధికారం — సెక్రటరీ ఆఫ్ స్టేట్‌కు దఖలుపడుతున్నాయి. ఏది ఎలావున్నప్పటికీ చిట్టచివరికి, ఆ సలహాసంఘం నియమించడంలో, రాజముకుటంచే నియామకాలు తప్ప, కడమ సలహాసంఘసభ్యుల నియామకంలో ఆచరణలో ఈస్ట్ ఇండియా కంపెనీపైనే ఇంతవరకూ ఆధారపడాల్సివచ్చింది. సెక్రటరీ ఆఫ్ స్టేట్‌యొక్క సలహాసంఘ సభ్యులలో ఎన్నుకోబడవలసిన వారిని ఈస్ట్ ఇండియా కంపెనీ డైరెక్టర్లు తమ డైరెక్టర్లలో వారినే ఎన్నుకుంటారు.

ఈవిధంగా చిట్టచివరకు ఎలాగైతేనేమి ఈస్ట్ ఇండియా కంపెనీ అధికారం ఎగిరిపోయినా, పేరు మాత్రం నిలబడింది. కోర్ట్ ఆఫ్ డైరెక్టర్స్ అనే ప్రతినిధిని కల్గినట్టి ఈస్ట్ ఇండియా కంపెనీని రద్దుచేస్తూన్న నిబంధన ఏదీ ఈ బిల్లులో లేదని, అయితే

* షిల్లర్, "బందిపోటు దొంగలు," IIIవ అంకం, 2వ రంగం. — సం.

ఇదివరలో ఈ కంపెనీ ఎలాగైతే వాటాదార్ల కంపెనీగా ఉండేదో, అలాగే ఇప్పుడూ ఉంది, పార్లమెంటుచే జారీ చేయబడిన వివిధ శాసనాల ననుసరించి కంపెనీకి చెల్లించడానికి ప్రభుత్వం పూచీపడినట్టి లాభాలను తన వాటాదార్లకు పంచిపెట్టే కంపెనీగా మాత్రమే ఉంటుందని డెర్బీ మంత్రిమండలి చిట్టచివరి నిమిషంలో ఒప్పుకుంది. పిట్ ప్రవేశపెట్టిన 1784వ బిల్లు ప్రకారం, ఆచరణలో కంపెనీకుండిన పరిపాలనాధికారం, బోర్డ్ ఆఫ్ కంట్రోల్‌ద్వారా మంత్రిమండలి పర్యవేక్షణకిందకి వచ్చింది. చైనా వర్తకంలో కంపెనీకున్న గుత్తాధిపత్యం ఒక్కటే తప్ప, కంపెనీకుండిన ఇతర వాణిజ్య గుత్తాధిపత్యమంతా 1813 శాసనంతో అంతరించిపోయింది. కంపెనీకుండిన వాణిజ్యపు స్వభావాన్నంతనీ 1834 నాటి శాసనం సంపూర్ణంగా రద్దుచేసింది; ఇకపోతే, ఇండియా పరిపాలనాధికారం ఒక్కటే తప్ప, కడమ అన్ని అధికారాలనూ 1854 నాటి శాసనం తుడిచిపెట్టేసింది. చరిత్ర పరిభ్రమణంలో, 1612లో వాటాదార్ల కంపెనీగా మారిన ఈస్ట్ ఇండియా కంపెనీ మళ్లీ తన తొల్లిటి స్వరూపమే ధరించుతూంది; ఎటుదిరిగీ, వర్తకంచేయని భాగస్వాముల వర్తక కంపెనీగామూ, స్థిరంగా నిర్ణయించబడిన డివిడెండ్లు మాత్రమే అనుభవించే హక్కును కలిగినట్టి నిధులు లేని వాటాదార్ల కంపెనీగామూ ఈనాడు రూపొందింది.

ఇండియా బిల్లు చరిత్రలో జరిగినన్ని నాటకీయములైన మార్పులు, ఆధునిక చరిత్రలో పార్లమెంటుచే జారీకాబడిన మరే శాసనంలోనూ జరగలేదు. సిపాయి తిరుగుబాటు ప్రజ్వరిల్లినప్పుడు, ఇండియాలో సంస్కరణలు అవసరమనే వివాదం బ్రిటిష్ సమాజంలోని అన్ని తరగతులలోనూ ప్రతిధ్వనించింది. చిత్రహింసల నివేదికలవల్ల ప్రజాభిప్రాయం అట్టుడికినట్టు ఉడికిపోయింది; దేశీయుల మతవ్యవహారాల్లో ప్రభుత్వం కలుగ జేసుకుంటూన్న జోక్యాన్ని ఇండియాలో సైన్యంలో చిరకాలంగా ఉద్యోగంచేసిన ఆఫీసర్లూ, ప్రముఖులైన ఉన్నత సివిలియన్లూ తీవ్రంగా ఖండించారు. డౌనింగ్ స్ట్రీట్ చేతిలో కీలుబొమ్మ అయిన లార్డ్ డల్‌హౌసీ అవలంబించిన దురాశాపూరితమైన ఆక్రమణ విధానమూ, ఆసియా ప్రజలలో తీవ్రమైన కలవరం ఏర్పడుతుందన్న విషయాన్నయినా ఈషణ్మాత్రం లెక్కచేయకుండా చైనా, పర్షియాలలో — పామర్‌స్టన్‌యొక్క వ్యక్తిగతమైన ఆజ్ఞలననుసరించే — ప్రారంభించి సాగించిన బందిపోటు యుద్ధాలూ; ఇండియాలో తిరుగుబాటు ఆరంభమైనప్పుడు సేనలను రవాణా చేయడానికై స్టీమర్లు బదులు తెరచాప నౌకలు ఉపయోగించడమూ, సూయజ్ భూసంధిమీదుగా గాక, గుడ్‌హోప్ అగ్రము చుట్టుతిరిగి సముద్రమార్గాన సేనలను పంపడమూ, ఈవిధమైన అసత్య చర్యలు అవలంబించడమూ — ఇవన్నీ ఏకమై ఇండియా సంస్కరణలు, కంపెనీయొక్క ఇండియా పరిపాలనలో సంస్కరణలు, ప్రభుత్వంయొక్క ఇండియన్ విధానంలో సంస్కరణలు జరిగి తీరాలని పెద్ద గొడవ లేవింది. ప్రజలలో లేచిన ఈ గొడవలో పామర్‌స్టన్ కూడా చేరి, దానిని మాత్రం కేవలం తనకి లాభంగా ఉండే

విధంగా తిప్పుకోడానికే నిశ్చయించుకున్నాడు. ప్రభుత్వమూ కంపెనీ, రెండూ కూడా తమ విధులను నెరవేర్చడంలో సంపూర్ణంగా విఫలమయ్యాయి కాబట్టి, అందుకు కంపెనీనే బలిపశువుగా సమర్పించేసి, ప్రభుత్వాన్ని సర్వశక్తివంతంగా చేసెయ్యాలి. పార్లమెంటుకు ప్రత్యర్థిగా వున్న రాజమకుటానికి తానే ప్రతినిధినని, రాజమకుటానికి ప్రత్యర్థిగా వున్న పార్లమెంటుకూ తానే ప్రతినిధినని నటిస్తూన్న ఆనాటి నియంతకే కంపెనీకున్న సర్వాధికారాలూ దఖలుపడి పోవాలి; దానితో ఇటువైపునుండీ అటువైపునుండీ కూడా సర్వాధికారాలూ తానొక్కడికే హస్తగతమౌతాయి. ఇండియా సేనను ఆసరాచేసుకుని, ఇండియా ఖజానాను తన గుప్పిట్లో ఉంచుకుని, ఇండియాలో ఉద్యోగ నియామకాధికారన్నంతటినీ తన జేబులో వేసుకుంటే, దానితో పామర్‌స్టన్ స్థానం అభేద్యమౌతుంది.

అతను ప్రవేశపెట్టిన బిల్లు ప్రథమ పఠనం దిగ్విజయంగా జరిగిపోయింది; కాని ప్రఖ్యాతిచెందిన కుట్ర బిల్లు[102] ప్రవేశపెట్టడంతోనూ, ఆతర్వాత టోరీలు అధికారానికి రావడంతోనూ అతని రాజకీయ జీవితానికే మార్కం తగిలింది.

టోరీలు అధికారానికి వచ్చిన తరువాత మొదటి పార్లమెంటు సమావేశంలోనే, కామన్స్ సభవారు నిష్కర్షగా తెలియపర్చిన నిశ్చితాభిప్రాయానికి ఔదలదాల్చి, ఇండియా ప్రభుత్వాన్ని కంపెనీ చేతిలోనుండి రాజమకుటానికి బదిలీచేయ సద్దేశించిన ప్రతిపాదనకు తమ ప్రతిఘటన విరమించుకొన దల్చుకున్నామని వారు ప్రకటించారు. లార్డ్ ఎలెన్‌బరో ప్రతిపాదించిన బిల్లుకు చేటుపెయ్యగతి పట్టడంతో,[103] పామర్‌స్టన్ తిరిగి అధికారానికి వచ్చే సూచనలు బలపడ్డాయి; కాని ఆ నియంతచేత రాజీమార్గాన్ని బలవంతంగా అవలంబింపజేయాలనే ఉద్దేశంతో, లార్డ్ జాన్ రస్సెల్ మధ్యలో కలుగజేసుకొని, ఇండియా బిల్లును ప్రభుత్వ బిల్లు రూపంలో కాకుండా, అందుకు బదులు పార్లమెంటరీ ప్రతిపాదన రూపంలో సభ ఎదుట తీసుకొస్తామని తెలియజేసి, ప్రభుత్వాన్ని గండంనుండి తప్పించాడు. అప్పుడు లార్డ్ ఎల్లెన్‌బరో అయోధ్య నివేదిక, అతని ఆకస్మిక రాజీనామా, తత్ఫలితంగా మంత్రివర్గ శిబిర విచ్ఛిత్తి, ఈ పరిణామాలన్నింటినీ పామర్‌స్టన్ అతి ఆత్రంతో వినియోగించుకున్నాడు. ఈస్ట్ ఇండియా కంపెనీ అధికారాన్ని అంతం చేసే ప్రయత్నాలపట్ల తమ పక్షంలోనే తలయెత్తిన ప్రతిఘటనను అణచివేయడానికై తమకుండిన ఆ రవంత అధికారాయుధమూ వినియోగించినప్పటికీ కూడా, టోరీలను తిరిగి నిరాశాజనకమైన ప్రతిపక్షశిబిర హిమశీతలచ్ఛాయల్లోకి తరిమేయడానికి చక్కని అవకాశం చిక్కుతుంది. ఇంత జాగ్రత్తగా వేసుకున్న ఇన్ని లెక్కలూ తోసి రాజు అయాయన్న సంగతి అందరకూ తెలిసినదే. ఈస్ట్ ఇండియా కంపెనీ శిథిలాలపై తాను సింహాసనం అధిష్ఠించే బదులు, పామర్‌స్టన్ ఆ శిథిలాలకింద పూడ్చబడ్డాడు. కామన్స్ సభలో ఇండియాపై జరిగిన చర్చలన్నిటిలోనూ "civis romanus"ను[104] అభాసు పాల్జేసి, ఒక చిత్రమైన రీతిలో తమ అభీష్టం తనివితీరా నెరవేర్చుకొనడంలో కామన్స్ సభవారు

పూర్తిగా కృతకృత్యులయారు. అతడు ప్రవేశపెట్టిన సవరణలు, స్వల్పమైనవీ, ముఖ్యమైనవీ కూడా అవమానకరంగా వీగిపోయాయి; ఆఫ్ఘన్ యుద్ధం గురించీ, పర్షియా యుద్ధం గురించీ, చైనా యుద్ధం గురించీ ఘాటైన ఉదాహరణలను తలవాచిపోయేటట్లు అతని ముఖాన విసిరారు; చివరికి అతడు ఎంత తీవ్రంగా విరోధించినప్పటికీ అతని ప్రతిఘటనను పెడచెవినిబెట్టి, ఇండియా సరిహద్దులను దాటి జరిగే యుద్ధాలు ప్రారంభించడానికి ఇండియా మంత్రికున్న అధికారం లాగివేయబడింది. పామర్స్టన్‌యొక్క వెనుకటి వైదేశిక విధానంపై ఒక సాధారణ అభిశంసన వోటుగా ఉద్దేశించబడిన మిస్టర్ గ్లాడ్స్టన్ ప్రతిపాదననే అతను తీవ్రంగా ప్రతిఘటించినప్పటికీ అత్యధికమైన మెజారిటీతో ఆమోదింపబడింది. ఇంత ఇలా జరిగి, ఈ వ్యక్తికి ఈవిధంగా తీరని భంగపాటు ప్రాప్తించినప్పటికీ, మొత్తంమీద అతని సూత్రమే అందరూ అంగీకరించారు. ఇండియాను లాంఛనప్రాయంగా బ్రిటిష్ పరిపాలనలో కలుపుకోవడం ఫలితంగా నిర్వాహకాధికారం ఎంత విస్తృత పరిమితులను చేరుకుంటూందంటే, వెనకటి బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్‌ను అంతంచేసినట్లు చెప్పినప్పటికీ, వారికే అత్యధిక వేతనాలను ముట్టచెప్పి, కొత్త పేరుతో పునఃప్రతిష్ఠించినట్టి బోర్డ్ ఆఫ్ కౌన్సిల్‌కు అడ్డుపుల్లలు వేయగలిగే లక్షణాలు కలిగించడంవల్ల ఈ అధికారాన్ని అదుపులో ఉంచడానికి కొంత అవకాశం కలుగుతూన్నప్పటికీ, సమతూకం కుదరడానికై ఈ అధికారానికి ప్రతిగా పార్లమెంటరీ త్రాసులో ప్రజాస్వామ్య భారం పడితీరాలి.

మార్క్స్‌చే 1858 జూలై 9న
రచింపబడింది

"New-York Daily Tribune"
1858 జూలై 24వ తేదీన
5384వ సంచికలో
ఒక సంపాదకీయ వ్యాసంగా
ప్రచురించబడింది

# ఎంగెల్స్

## *ఇండియాలో తిరుగుబాటు

వేసవిలోనూ, ఎండకాలపు వానలలోనూ ఇండియాలో యుద్ధచర్యలు ఇంచుమించు పూర్తిగా ఆగిపోయాయి. వేసవి ఆరంభంలోనే జరిపిన ప్రయత్నాల ఫలితంగా, అయోధ్యలోనూ, రోహిల్‌ఖండ్‌లోనూ వున్న ముఖ్యస్థానాలు అన్నింటినీ స్వాధీనపరచుకున్న తర్వాత, సర్ కోలిన్ కాంబెల్ మంచి తెలివిగా తన సైనిక బలాలకు విశ్రాంతి కలగడానికై వాటిని కంటోన్మెంటులలో ఉంచి, బయలుగా వున్న ప్రదేశాన్ని తిరుగుబాటుదార్లకు విడిచి పెట్టేసి, తన రవాణా మార్గాలను పరిరక్షించుకోవడం తప్ప, అంతకుమించి మరేమీ అధిక యత్నాలను పెట్టుకోలేదు. ఈ కాలంలో అయోధ్యలో ఆసక్తిదాయకమైన ఘటన ఒకే ఒకటి జరిగింది; మాన్ సింగ్ అనే సామంతరాజు రంగు ఫిరాయించి బ్రిటిష్‌వారి పక్షం వహించగా, అతని వెనుకటి స్వదేశీయస్నేహితులు అతని నగరాన్ని ముట్టడించారు. ఇతనిని ముట్టడినుండి విముక్తిచేయడానికై సర్ హోప్ గ్రాంట్ షాగంజ్‌కి తరలివెళ్లాడు. ఈ దండయాత్రలో వడదెబ్బ, కలరాలవల్ల బ్రిటిష్ సైనికులలో చాలా నష్టమే సంభవించి ఉండడం తథ్యమే అయివుంటుంది; అయినప్పటికీ అది కేవలం ఒక సైనిక వాహ్యాళిలాగే జరిగిపోయింది. యుద్ధంచెయ్యడానికి ఎట్టి ఆసక్తినీ చూపకుండానే, దేశీయులు చెదిరిపోయి అక్కడనుండి వెళ్లిపోయారు. మాన్ సింగ్ బ్రిటిష్‌వారి అండచేరాడు. ఈ దండయాత్రలో ఇంత అవలీలగా జయం లభించడం చూసి, అయోధ్యనంతటినీ ఇంత అవలీలగానూ స్వాధీనం చేసుకోడానికి ఇదొక సూచన అని మాత్రం అనుకోడానికి వీల్లేక పోయినప్పటికీ, తిరుగుబాటుదార్లు సంపూర్ణంగా నిరుత్సాహులైపోయారని మాత్రం యిది తెలియజేస్తుంది. వేసవికాలంలో విశ్రాంతిని అనుభవించుదామని బ్రిటిష్‌వారు ఎంత ఆశపెట్టుకొనున్నారో, వారికి అంత ప్రయాస కలుగజేదామని తిరుగుబాటుదార్లకుంది. కాని, క్రియాశీలమైన గెరిల్లా యుద్ధం ఆర్గనైజు చేసుకోవడమూ, శత్రువశంలో వున్నట్టి నగరాల మధ్యనున్న రహదారులను తెగగొట్టడమూ, చిన్నచిన్న శత్రుదళాలపై చాటుమాటున పొంచి వుండి తటాలున దాడి

చేయడమూ, భోజనసామగ్రులను సోగుచేసుకోడానికై బయలుదేరే శత్రుదళాలను హింసపెట్టడమూ, భోజన సంభారాలు పైచోట్లనుండి సరఫరాకానిదే బ్రిటిష్‌వారు నివసించుతూన్న ఏ పెద్ద నగరమూ మనలేదు కాబట్టి, అట్టి సరఫరాలు వారికి అందకుండా వాటిని అడ్డంకొట్టడమూ — ఈ చర్యలను సాగించడం బదులు, దేశంమీద రెవిన్యూ పన్నులు విధించి వాటిని వసూలుచేసుకుంటూ, శత్రువులవల్ల తమకు లభించిన విశ్రాంతిని హాయిగా అనుభవించుతూ దేశీయులు కాలక్షేపంచేశారు. అంతేకాకుండా, వారిలో వారు తగవులు పెట్టుకొని పోట్లాడుకుంటూన్నట్టు కూడా కనబడుతూంది. ఈ కొద్దివారాల విశ్రాంతి కాలాన్ని తెలివిగా వినియోగించుకుని, తమ సేనలను పునర్నిర్మించుకుని, తమ మందుగుండు సామగ్రి భర్తీచేసుకుని, తాము ఇదివరలో నష్టపోయిన శతఘ్నుల స్థానే కొత్త శతఘ్నులు సంపాదించుకోడానికి ప్రయత్నించారా అంటే, అదీ చేసినట్టు కనబడదు. షాగంజ్‌వద్ద వారు పలాయనం చిత్తగించడం చూస్తే, ఇంతకుముందు వారికి సంభవించిన ఏ ఓటమిలో సహితమూ వారు ప్రదర్శించనంతటి ఆత్మవిశ్వాసరాహిత్యాన్ని, తమ నాయకులపై విశ్వాస రాహిత్యాన్ని వారు ప్రదర్శించారు. ఇది ఇలా వుండగా, నాయకులలో అధికసంఖ్యాకులకూ బ్రిటిష్ ప్రభుత్వానికీ ఉత్తరప్రత్యుత్తరాలు రహస్యంగా నడుస్తూన్నాయి; అయోధ్యనంతనీ కబళించడం బ్రిటిష్ ప్రభుత్వానికి, ఇప్పుడు అనుభవించినదంతా అనుభవించాక ఇబ్బందికరంగానే ఉందని అనిపించి, అయోధ్య భూములను న్యాయమైన షరతులపైన వెనకటి భూకామందులకే తిరిగి ఇచ్చివేయడానికి వారూ తహతహపడుతూన్నట్టే కనబడుతూంది. ఈవిధంగా, బ్రిటిష్‌వారి అంతిమ విజయంపట్ల ఇక ఎట్టి సందేహమూ లేకుండా తథ్యమనే తేలిపోవడంతో, అయోధ్యలో తిరుగుబాటు కొంతకాలమైనా క్రియాశీలమైన గెరిల్లా యుద్ధాన్ని సాగించకుండానే అంతమయేటట్టుంది. బ్రిటిష్‌వారితో భూస్వాములలో అధిక సంఖ్యాకులకు రాజీ కుదిరిపోయిన ఉత్తరక్షణంలో, తిరుగుబాటుదార్ల దళాలు నాటంతటనే విచ్ఛిన్నమైపోతాయి; ఇక ఈ దళాల్లో ప్రభుత్వమంటే భయపడవలసిన వారెవరైతే ఉంటారో, అట్టివారు దొంగలుగా (బందిపోటు ముఠా దొంగలుగా) తయారవుతారు; వీరిని పట్టుకోవడంలో రైతాంగమే సంతోషంగా ప్రభుత్వానికి సహాయపడుతుంది.

ఇటువంటి బందిపోటు ముఠాలకు, అయోధ్యకు నైరుతిగా వున్న జగదీశపూర్ అడవులు అనుకూలమైన కేంద్రంగా ఏర్పడేటట్టున్నాయి. వెదురుడొంకలతోనూ చెట్లపొదలతోనూ చొరసాధ్యంగాని ఈ అరణ్యాలను అమర్ సింగ్ నాయకత్వాన వున్న తిరుగుబాటుదార్ల దండు ఒకటి వశపర్చుకుంది; కడమ తిరుగుబాటుదార్ల నాయకులందరికంటె గెరిల్లా యుద్ధమంటే ఇతనికే బాగా తెలిసి, ఇతనే చురుకుగా యుద్ధం చేస్తున్నాడు. ఏమైనప్పటికీ ఇతడు, బ్రిటిష్‌వారికోసం స్తబ్ధుగా కాచుకొని ఉండకుండా, తనకు వీలైనప్పుడల్లా వారిని అటకాయించుతున్నాడు. ఇతడి రక్షకస్థలంనుండి ఇతడిని తరిమివేయగల్గే లోపలనే, అయోధ్యలో

వున్న తిరుగుబాటుదార్లలో కొందరు ఇతనితో చేరుతే మాత్రం, ఇలాగు జరుగుతుందనే భయపడుతున్నారు కూడా, ఇటీవల బ్రిటిష్‌వారు ఎదుర్కొనిన దానికంటెనూ కష్టతరమైన కార్యాన్నే మీదటికి వారు బహుశా ఎదుర్కొనవలసి వస్తుందేమో. గత ఎనిమిది నెలలుగా ఈ అడవులే తిరుగుబాటుదార్ల దండులకు శరణ్యంగా ఏర్పడివున్న కారణంగా, బ్రిటిష్‌వారి ప్రధాన రవాణామార్గమైన కలకత్తానుండి అలహాబాదుకు వెళ్లే గ్రాండ్ ట్రంక్ రోడ్డుకు వీరు ఎట్టి భద్రతాలేకుండా చేయగల్గారు.

పడమటి ఇండియాలో, గ్వాలియర్ తిరుగుబాటుదార్లను జనరల్ రాబర్ట్సు, జనరల్ హోమ్సులు ఇంకా వెంటాడుతూనే వున్నారు. గ్వాలియర్‌ను స్వాధీనం చేసుకున్న సమయంలో తిరోగమించుతూన్న తిరుగుబాటు సైన్యం ఏ దిశగా మళ్లబోతుందనే ప్రశ్న అప్పట్లో చాలా ముఖ్యంగా కనబడింది. ఎందుచేతనంటే మొదటలో తిరుగుబాటుచేసిన స్థాయీ సైనిక పటాలాలు చెప్పుకోదగినంత బలంతో మహారాష్ట్రంలోకీ, రాజపుత్రస్థానంలోకీ ప్రవేశించగానే, ఈ పటాలాలను కేంద్రంగా చేసుకొని మహారాష్ట్రమంతానూ, రాజపుత్రస్థానంలో కొంత భాగమూ తిరుగుబాటుకు సిద్ధంగా ఉంటుందని అప్పట్లో భయం కలిగింది. గ్వాలియర్ సేన నైరుతిగా తిరోగమించిన పక్షంలో, ఈ వ్యూహం ఫలితంగా తిరుగుబాటుదార్ల అభీష్టం తప్పకుండా నెరవేరేటట్టే అగుపడింది. కాని వారు మరే కారణంచేతనో, ఇప్పుడు మనకందిన సమాచారాన్నిబట్టి ఆ కారణాలేమిటో మనకి స్పష్టంగా తెలియడంలేదు, వాయవ్యదిశగా తిరోగమించారు. వారు జయపూర్ వెళ్లి, అక్కడనుండి దక్షిణంగా ఉదయపూర్ దిశగా మళ్లి, అక్కడనుండి మహారాష్ట్రంలోకి ప్రవేశించే రోడ్డును అందుకోడానికై ప్రయత్నించారు. కాని ఈ చుట్టు తిరుగుడు మార్గాన్ని వారు చేపట్టడంచేత, వారిని ఎదుర్కోడానికి రాబర్ట్సుకి చక్కని అవకాశం చిక్కి, పెద్దగా శ్రమ లేకుండానే వారిని పూర్తిగా ఓడించేశాడు. యుద్ధంలో ఫిరంగులను కోల్పోయినట్టే, నిర్మాణరహితమైనట్టే, పేరెన్నికగన్న నాయకులు లేనట్టే సేనలో మిగిలిన ఈ దళాలు, ఇతరులచే కొత్త తిరుగుబాట్లను చేయించగలుగుతాయన్నది అసంభవం. తద్వ్యతిరేకంగా, వీరు తమతో తీసుకువెళ్లుతూన్నట్టి బ్రహ్మాండమైన కొల్లసొత్తు, వారి చలనానికి ప్రతిబంధకంగా ఏర్పడ్డమే కాకుండా, రైతాంగం కళ్లుకుట్టి దాని ఆశలు కూడా రేకెత్తించడానికి అప్పుడే కారణమైనట్టుగా అగుపడుతూంది. తన దళంనుండి వేరుపడిపోయి దారి తెలియక ఒంటరిగా తిరుగుతూన్న ప్రతి సిపాయీ హత్య చేయబడి అతని దగ్గర వున్న బంగారపు మొహర్ల మూట దొంగిలించబడింది. ఇంతదాకా ఎప్పుడైతే వచ్చిందో, అప్పుడిక ఈ సిపాయిల ముఠాలను విచ్ఛిన్నంగావించడానికి తానేమీ శ్రమ పడకుండానే, ఆ కార్యాన్ని ఏ చిక్కూ లేకుండా జనరల్ రాబర్ట్సు పల్లెపట్టు ప్రజకే విడిచిపెట్టేయవచ్చు. సింధ్యా దగ్గర పేరుకుపోయున్న నిధినిక్షేపాలను అతని సేనలే దోచుకోవడం ఫలితంగా, హిందూస్థానంలోకంటె మరింత ప్రమాదకరమైన ప్రదేశంలో తిరుగుబాటు

యొక్క పునరారంభంనుండి బ్రిటిష్‌వారికి రక్షణ కల్గుతూంది; ఎందుచేతంటే మహారాష్ట్రంలోనే గనుక తిరుగుబాటు జరిగిందంటే, బొంబాయి సేనకి అదొక అగ్నిపరీక్షగా తయారై తీరుతుంది.

గ్వాలియర్ సమీపంలో కొత్తగా ఒక తిరుగుబాటు జరిగింది. సింధ్యాకింద చిన్న సామంతుడుగా వున్న మాన్ సింగ్ (అయోధ్యకు చెందిన మాన్ సింగ్ కాదు, ఇతడు వేరు), తిరుగుబాటుదార్లతో చేరి, చిన్నదైన పవారీ కోటను వశపర్చుకున్నాడు. కాని బ్రిటిష్‌వారు ఈ కోటను అప్పుడే ముట్టడించారు; ఇక ఇది త్వరలోనే బ్రిటిష్‌వారి వశమైపోతుంది.

ఇదీలా వుండగా, బ్రిటిష్‌వారు జయించిన జిల్లాలన్నిటిలోనూ క్రమంగా శాంతి భద్రతలు నెలకొల్పబడ్డాయి. ఢిల్లీ చుట్టుపట్ల ప్రాంతాల్లో సర్ జె. లారెన్స్ ఎంతవరకూ శాంతిభద్రతలు పూర్తిగా పునస్థాపించగలిగాడంటే, ఆయుధాలు లేకుండానే, ఎట్టి సైనిక రక్షణ లేకుండానే, యూరపియన్లు ఒంటరిగా ఆ ప్రాంతాల్లో నిర్భయంగా తిరగడానికి వీలవుతూందని చెప్పుకుంటున్నారు. ఇందులో వున్న రహస్యమంతా ఏమిటంటే, అఘాయిత్యాలు ఏవి జరిగినా, అందుకు ఆ చుట్టుపక్కల గ్రామాలే జవాబ్దారీ వహించాలని అనడమూ, మిలిటరీ పోలీసును నెలకొల్పడమూ జరిగింది; అన్నిటికంటె ముఖ్యంగా, అదొక చిత్రమైన విధంగా, ప్రాగ్దేశీయుల మనసులకు నాటేటట్టి యుద్ధ న్యాయస్థానాల న్యాయం సర్వే సర్వత్రా యథేచ్ఛగా సాగుతూంది. అయితే ఈ ప్రాంతం మినహా మరెక్కడా ఈవిధమైన విజయం లభించినట్లు కనబడదు; ఎందుచేతంటే, ఇతర జిల్లాలనుండి ఇలాంటి వార్తలేవీ లేవు. రోహిల్‌ఖండ్ అయోధ్యలలోనూ, బుందేల్‌ఖండ్, ఇంకా ఇతర పెద్ద రాష్ట్రాల్లోనూ పూర్తిగా శాంతిని నెలకొల్పాలంటే, చాలా కాలమే అవసరమై బ్రిటిష్ సైనిక బలాలకీ, యుద్ధ న్యాయస్థానాలకీ కావలసినంత పని చేతినిండా కలుగుతుంది.

కాని హిందూస్థానంలో తిరుగుబాటు తగ్గిపోయి, సైనిక చర్యల దృష్ట్యా తిరుగుబాటులో ఇక ఆసక్తి పోయేటంతటి పరిమాణానికి క్షీణించిపోతూండగా, దూరాతిదూరంలో వున్న ఆఫ్ఘనిస్థాన్ సరిహద్దు చిట్టచివరనున్న ప్రాంతంలో, భవిష్యత్తులో అనేక ఇబ్బందులకు దారితీయగల ఘటన ఒకటి సంభవించింది. డేరా ఇస్మాయిల్ ఖాన్‌లో వున్న అనేక సిక్కు రెజిమెంట్లు తమ ఆఫీసర్లను హత్యచేయడానికీ, హత్యచేసిన తరువాత బ్రిటిష్‌వారిపై తిరగబడ్డానికీ ఒక కుట్ర పన్నుతూన్నట్టు బైటపడింది. ఈ కుట్ర ఎంత వరకూ అల్లుకుందో మనకు ఇంతవరకూ తెలియడంలేదు. సిక్కులలో ఉన్న ఒక తరగతి వారికే బహుశా ఇది కేవలం స్థానికంగా పరిమితమైనదే అయివుండొచ్చు; ఇదమిత్థమని చెప్పడానికి మాత్రం మనకిప్పట్లో తగిన ఆధారాలు లేవు. ఏది ఏలా వున్నా, ఇది అత్యంత ప్రమాద భరితమైన చిహ్నం. బ్రిటిష్ సేనలో రమారమి లక్షమంది సిక్కులున్నారు; వారు ఎంత దుస్సాహసికులైన మనుషులో వినే విన్నాం; ఈవేళైతే మేము బ్రిటిష్‌వారి పక్షమే యుద్ధం

చేస్తున్నాం, దైవాజ్ఞ అయితే రేపు బ్రిటిష్‌వారితోనే యుద్ధంచేస్తామేమో? — అని వారు అంటున్నారు. ధైర్యవంతులూ, ఉద్రిక్తులూ, చపలచిత్తులూ అయిన వీరు, కడమ అందరి ప్రాగ్దేశీయులకంటెనూ అతిత్వరగానూ హఠాత్తుగానూ తాత్కాలిక ఆవేశాలకు లోనై ఉగ్రులై పోతారు. వీరిలో గనుక నిశ్చయంగా తిరుగుబాటు ప్రజ్వరిల్లితే బ్రిటిష్‌వారికి తమ స్థానం నిలబెట్టుకోడమే నిజంగా ఎంతో కష్టమైపోతుంది. ఇండియాలో బ్రిటిష్‌వారిపట్ల వైరం వహించి పోరాడిన ప్రజలందరిలోనూ నిరంతరమూ ప్రచండ ప్రతిఘటన ప్రదర్శించి పోరాడినవారు సిక్కులే; సాపేక్షంగా శక్తివంతమైన సామ్రాజ్యాన్నే వారు స్థాపించుకున్నారు; బ్రాహ్మణమతంలో ఒక ప్రత్యేక పంథా అవలంబించుతూ వీరు హిందువులనూ మహమ్మదీయులనూ, ఇద్దరినీ ద్వేషించుతారు. బ్రిటిష్ "రాజ్యం" అత్యంత ప్రమాదస్థితిలో ఉండడం వీరు స్వయంగా చూశారు; దాని పునస్థాపనకు వారు ఇతోధికంగా సహాయంచేయడమే కాకుండా, ఈ పునస్థాపనకు తమ సహాయమే నిర్ణయాత్మకమైన కారణమని కూడా వీరు నమ్ముతున్నారు. పరిస్థితులన్నీ ఇలా ఉన్నప్పుడు, బ్రిటిష్ రాజ్య అవసానదశ ప్రాప్తించినదనీ, దాని స్థానే సిక్కు రాజ్యం స్థాపించడానికి సదవకాశం లభించిందనీ, ఢిల్లీనుండి గాని, లేక కలకత్తానుండి గాని సిక్కు చక్రవర్తి ఇండియాను పరిపాలించే శుభముహూర్తం ఆసన్నమైందనీ వీరు ఆశించడంలో ఆశ్చర్యమేముంది? ఈ అభిప్రాయం సిక్కు హృదయాల్లో ఇంకా పరిపక్వదశకు రాకపోయి ఉండవచ్చు; ఒకవేళ తిరుగుబాటు లేచిన పక్షంలో, దానిని మళువుగా అణచి వేయడానికి వీలుగా వుండేందుకై, చక్కని తెలివితేటలు ఉపయోగించి వీరిని దేశమందంతటా చెదురుగా యూరపియన్ రెజిమెంట్ల సరసనే ఉంచడం జరిగితే జరిగివుండవచ్చు కూడా; ఇది ఎలా వున్నప్పటికీ, ఇట్టి అభిప్రాయం వారి మనసులో ఉందన్న విషయం మాత్రం, ఢిల్లీ లక్నో ఉదంతాల తర్వాత సిక్కుల ప్రవర్తనను గూర్చిన కథనాలు చదివిన ప్రతివారికీ ప్రస్ఫుటంగానే కనబడుతూంది.

అయినప్పటికీ, ప్రస్తుతానికి బ్రిటిష్‌వారు ఇండియాను తిరిగి జయించారన్న విషయం వాస్తవం. బెంగాల్ సైన్యపు పితూరీతో ఆరంభమైనట్టి ఈ గొప్ప తిరుగుబాటు క్రమేణా దానంతటది అంతమైపోయినట్టే నిజంగా కనబడుతూంది. కాని ఇంగ్లండు ఇండియాను రెండవ సారి జయించడం ఫలితంగా ఇండియా ప్రజలలో ఇంగ్లండుపట్ల భక్తివిశ్వాసాలు ఎంతమాత్రమూ ఇనుమడించలేదు. దేశీయులు అఘాయిత్యాలు జరిపారని ఆపాదించుతూ, గోరంతలు కొండంతలుచేసి అతిశయోక్తులతో నిండినట్టి, కేవలం అభూతకల్పనలైన అసత్యాలతో నిండినట్టి నివేదికలు మనసులో పెట్టుకుని ఆ ఉక్రోషం కారణంగా బ్రిటిష్‌వారు దేశీయులపై విధించిన శిక్షలూ, అయోధ్య రాజ్యాన్నంతనీ ఏకమొత్తంగానూ చిల్లరచిల్లరగానూ స్వాధీనంచేసుకోవడానికి జరిగిన యత్నమూ, ఇవేవీ కూడా విజేతలపట్ల దేశీయులలో ఏమాత్రము ప్రేమనూ సృష్టించలేదు. తద్విరుద్ధంగా క్రిస్టియన్ మతావలంబులైన

దురాక్రమణదారులపట్ల హిందూ మహమ్మదీయ మతస్థులకు అనువంశికంగా ఉంటూన్న ద్వేషం, మొదట్లో ఎంత ఉగ్రంగా ఉండేదో, ఇప్పుడూ అంత ఉగ్రంగానే ఉందని విజేతలే ఒప్పుకుంటున్నారు. ప్రస్తుతానికి ఈ ద్వేషం ఎంత నిర్వీర్యంగా ఉన్నప్పటికీ, సిక్కు పంజాబ్‌పై ఆ భయానక మేఘం కమ్మినంత కాలమూ, ఈ ద్వేషంలో ప్రగాఢమైన ఆంతర్యమూ, తీవ్రమైన ప్రమాదమూ అంతర్గర్భితములయే ఉంటాయి. ఇంతటితో తీరిపోవడంలేదు. ఆసియాలో ప్రధాన రాజ్యాలైన రష్యా ఇంగ్లండులు రెండూ, ఈపాటికి సైబీరియా ఇండియాల మధ్యనున్న ఒక స్థానానికే వచ్చి చేరుకున్నాయి; ఈ ఉభయ దేశాల ప్రయోజనాలకూ ముఖాముఖీ సంఘర్షణ ఇక్కడ తప్పక ఏర్పడితీరుతుంది. ఆ స్థానం పెకింగ్. అక్కడనుండి అనతి కాలంలోనే పశ్చిమదిశగా ఆసియాఖండం ఈ వైపునుండి ఆ వైపువరకూ రేఖ ఒకటి గీయబడి, ఈ రేఖ పొడుగునా ప్రత్యర్థులుల ప్రయోజనాల రెండింటికీ నిరంతరమూ సంఘర్షణ సంభవించుతూనే ఉంటుంది. ఈవిధంగా ''ఆక్సస్‌నదీ మైదానాలపై సిపాయీ, కొస్సాక్కూ ఒకరికొకరు కలుసుకొనే'' తరుణం అనతి కాలంలోనే ఆసన్నము కావచ్చు; నిజంగా ఇది సంభవించే పక్షంలో, 1,50,000ల ఇండియా దేశీయుల బ్రిటిష్ ప్రతికూల భావాలను గూర్చి తీవ్రంగా ఆలోచించవలసే వుంటుంది.

ఎంగెల్స్‌చే సుమారు 1858 సెప్టెంబరు 17న
రచించబడింది

"New-York Daily Tribune"
1858 అక్టోబరు 1వ తేదీన
5443వ సంచికలో
ఒక సంపాదకీయ వ్యాసంగా
ప్రచురించబడింది

# మార్క్స

## "ఇండియా చరిత్రపై వివరణలు"నుండి

1856. నవాబు దుష్పరిపాలన కారణంమీద అయోధ్యను కలిపివేసుకోవడం.— పంజాబు దేశస్థుడైన మహారాజా దులీప్ సింగ్ క్రిస్టియన్ మతం స్వీకరించాడు. ప్రగల్భంతో నిండిన "సిడ్కాలు నివేదిక"ను వదలిపెట్టి డల్‌హౌసీ నిష్క్రమించాడు; మిగతా వాటితోపాటు, కాల్వలు, రైల్వేలు, విద్యుత్ టెలిగ్రాఫు నిర్మాణం; అయోధ్య కలిపివేసుకోవడం ఫలితంగా సంభవించే అధిక ఆదాయం లెక్కలోకి తీసుకోకుండానే ఆదాయంలో 40 లక్షల పౌన్ల పెరుగుదల; కలకత్తాకు వ్యాపారవాణిజ్యాలకోసమై వచ్చే వాకం టన్నేజిలో సుమారు రెండింతలు పెరుగుదల; వాస్తవంగా ప్రభుత్వ ఆదాయ వ్యయపట్టికలో ఆదాయంలో లోటు, కాని ఇందుకు కారణం ప్రజాహిత కార్యాలకై అధికవ్యయం.— ఈ ప్రగల్భ ప్రేలాపనకు జవాబు సిపాయి విప్లవం (1857–1859).

1857. సిపాయి తిరుగుబాటు. కొన్ని సంవత్సరాలుగా సిపాయి సైన్యంలో అర్గనైజేషను చాలా కొరవడివుండడం; అందులో వున్న 40,000ం అయోధ్య సిపాయిలు కులము, జాతీయతలవలన ఒక కట్టుగా ఉండడం; ఒక రెజిమెంటులో వున్న ఆఫీసర్లచేత ఆ రెజిమెంటుకు అవమానం జరిగిన పక్షంలో సైన్యమంతకూ అవమానం జరిగినట్టు ఉమ్మడి భావం సైన్య మంతటిలోనూ ఉండడం; ఆఫీసర్ల నిస్సహాయత; క్రమశిక్షణ సడలడం; బాహాటంగానే తిరుగుబాటు చర్యలు తరుచు జరుగుతూండడం, వీటిని అణచివేయడంలో కొద్దో గొప్పో కష్టమే కలగడం; రంగూన్‌పై దండయాత్ర సాగించడానికై సముద్రం దాటి వెళ్లడానికి బెంగాల్ సేన ససేమిరా నిరాకరించడం,[106] ఫలితంగా వీటి బదులు సిక్కు రెజిమెంట్లను పంపాల్సిన అవసరం

కలగడం (1852). (ఇదంతా 1849 పంజాబ్ కలిపివేసుకోవడం అనంతరం జరగడం, 1856 అయోధ్య కలిపివేసుకోవడం అనంతరం ఇదంతా మరింత ఉధృతమవడం.) నిరంకుశ చర్య ఒకదానిని జరుపుతూ లార్డ్ కానింగ్ తన పరిపాలన ప్రారంభించడం; ఇంతవరకూ మద్రాసు, బొంబాయి సిపాయిలు ప్రపంచంలో ఎక్కడైనా సరే సైన్యంలో నౌకరీ చేయడానికి సైన్యంలో చేర్చుకోబడ్డారు, ఒక్క బెంగాల్ సిపాయిలు మాత్రం ఇండియాలోనే సైన్యంలో నౌకరీకి ఒప్పుకుని సైన్యంలో చేరారు; బెంగాల్ సిపాయిలు సహితమూ "సర్వత్రా సైన్యంలో నౌకరీ చేసే షరతు"ను కానింగ్ బెంగాల్‌లో పద్ధతిగా చేశాడు. కుల వ్యవస్థ అంతంచేయడం, నగైరాలకు ఇది ఒక ప్రయత్నమని "ఫకీర్లు" దీనిని ఖండించడం.

<u>1857 మొదట్లో</u>, ("సామ్" మార్కు) తూటాలు, పంది, ఆవు కొవ్వుతో పూసినవి, ఇటీవల ఇచ్చారు; ప్రతి సిపాయినీ కులభ్రష్టుణ్ణి చెయ్యాలనే స్పష్టమైన ఉద్దేశంతోనే వీటిని ఇస్తున్నారని ఫకీర్లు చెబుతున్నారు. దీని ఫలితంగా బారక్‌పూర్‌లోనూ (కలకత్తా సమీపంలో), రాణీగంజ్‌లోనూ (బంకూరా సమీపంలో) సిపాయి తిరుగుబాటు చెలరేగింది.

<u>ఫిబ్రవరి 26</u>, బర్హంపూర్‌లో (మూర్షిదాబాద్‌కి దక్షిణంగా, హుగ్లీ తీరాన) సిపాయి తిరుగుబాటు; మార్చి నెలలో బారక్‌పూర్‌వద్ద సిపాయి తిరుగుబాటు; ఇవన్నీ బెంగాల్‌లోనే జరిగాయి (బలప్రయోగంతో అణచివేయబడ్డాయి).

<u>మార్చి, ఏప్రిల్</u>, అంబాలాలోనూ, మీరట్‌లోనూ సిపాయిలు తరుచుగానూ రహస్యంగానూ తమ బారకాసులను తగలబెట్టేస్తున్నారు; అయోధ్యలోనూ, పశ్చిమోత్తరానా వున్న జిల్లాలలో ఇంగ్లండుకు వ్యతిరేకంగా ఫకీర్లు ప్రజలను రెచ్చగొట్టారు. బిఠూర్ (గంగాతీరం) రాజైన నానా సాహెబ్, రష్యాతోనూ, పర్షియాతోనూ, ఢిల్లీ పాదుషా వంశీకులతోనూ, అయోధ్య మాజీ రాజాతోనూ కుట్ర పన్నాడు, కొవ్వుపూసిన తూటాలు ఇవ్వడం ఫలితంగా సిపాయిలలో జరిగిన అల్లర్లను అతడు ఉపయోగించుకున్నాడు.

<u>ఏప్రిల్ 24</u>, లక్నోలో 48వ బెంగాల్ (రెజిమెంటు), 3వ దేశీయ కేవెల్‌రీ, 7వ అయోధ్య ఇర్రెగ్యులర్ల తిరుగుబాటును సర్ హెన్రీ లారెన్స్ ఇంగ్లీషు సైనిక బలాలను ఉపయోగించి అణచేశాడు.

మీరట్‌లో (ఢిల్లీకి ఈశాన్యంగా), 11వ, 20వ దేశీయ ఇన్‌ఫెంట్రీ (రెజిమెంటు) ఇంగ్లీషువారిపై దాడి చేసి, తమ ఆఫీసర్లను తుపాకులతో

కాల్చివేసి, వూరు తగలబెట్టేసి, ఇంగ్లీషువారి ఆడవారినీ, పిల్లలనూ నరికేసి, ఢిల్లీకి తరలివెళ్లిపోయారు.

రాత్రి ఢిల్లీలో ఈ తిరుగుబాటు అశ్విక సిపాయిలు కొందరు ఢిల్లీకి దాడు తీశారు; ఢిల్లీలో సిపాయిలు (54వ, 74వ, 38వ దేశీయ ఇన్‌ఫెంట్రీ రెజిమెంట్లు) తిరుగుబాటుచేశారు; ఇంగ్లీషు కమీషనర్‌ని, మతబోధకుడినీ, ఆఫీసర్లని హత్యచేశారు; 9 మంది ఇంగ్లీషు ఆఫీసర్లు మందుకొట్టును రక్షించడానికి ప్రయత్నించి, దానిని పేల్చేశారు (ఇద్దరు మరణించారు); పట్నంలోవున్న కడమ ఇంగ్లీషువాళ్లు అడవుల్లోకి పారిపోయారు; వీరిలో చాలమందిని దేశీయులు హత్యచేశారు, కొందరు వాతావరణ పరిస్థితులను తట్టుకోలేక చనిపోయారు; కొందరు క్షేమంగా మీరట్ చేరుకున్నారు; ఆ నగరంలో సైనికులెవ్వరూ లేరు. కాని, ఢిల్లీ తిరుగుబాటుదార్ల వశమైంది.

ఫెరోజ్‌పూర్‌లో, 45వ, 57వ దేశీయ రెజిమెంట్లు కోటను పట్టుకోడానికి ప్రయత్నించగా, 61వ ఇంగ్లీషు రెజిమెంటు వారిని తరిమేసింది; కాని దేశీయులు వూరు కొల్లగొట్టి, తగలబెట్టేశారు; మరుచటి దినం వీరిని కోటలో ప్రవేశించకుండా అశ్వికసైనికులు తరిమేశారు.

మీరట్, ఢిల్లీల ఘటనల వార్తలు లాహోరు చేరగానే సిపాయిలను అందరినీ జనరల్ కార్బెట్ ఉత్తరవు ప్రకారం సాధారణ పెరేడ్‌కు ఆజ్ఞాపించి (వీరిచుట్టూ శతఘ్నులను కలిగిన ఇంగ్లీషు సైనిక బలాలను నిలబెట్టి), వీరిని నిరాయుధులను గావించారు.

మే 20. పెషావర్‌లో, 64వ, 55వ, 39వ దేశీయ ఇన్‌ఫెంట్రీ రెజిమెంటును (లాహోర్‌లోలాగానే) నిరాయుధులను చేశారు; అందుబాటులో వున్న కడమ ఇంగ్లీషువారూ, విశ్వసనీయులైన సిక్కులూ కలిసి, ముట్టడిలో వున్న నౌషహ్రా, మర్దాన్ స్థావరాలనూ, సమీపంలో వున్న స్థావరాల అనేక యూరపియన్ రెజిమెంట్ల తాలూకు సైనికులతో ఏర్పడిన రక్షక బలాలను గలిగిన అంబాలాలోని పెద్ద స్థావరాన్ని మే నెలాఖరున విముక్తిచేశారు; జనరల్ ఏన్‌సన్ నాయకత్వాన సైనిక కేంద్ర భాగం ఒకటి ఇక్కడ సమీకృతమైంది.... వేసవికాలం గడపడానికై వచ్చి అక్కడ నివసించుతూన్న ఇంగ్లీషు కుటుంబాలతో క్రిక్కిరిసివున్న సిమ్లా పర్వతస్థావరం దాడికి గురికాలేదు.

మే 25. తన చేతికింద వున్న చిన్న సేనతో జనరల్ ఏన్‌సన్ ఢిల్లీపై దాడిచేయ

దానికి తరలివెళ్లాడు; మే 27న అతడు మరణించాడు; అతని స్థానే సర్ హెన్రీ బార్నార్డ్ నియమించబడ్డాడు; జనరల్ విల్సన్ నాయకత్వాన వున్న ఇంగ్లిష్ సైనిక బలాలు (మీరట్‌నుండి వచ్చినవి; మార్గమధ్యంలో ఇవి సిపాయిలతో తలపడి యుద్ధం చేశాయి), జూన్ 7న బార్నార్డ్ సేనతో కలుసుకున్నాయి. తిరుగుబాటు హిందూస్థానం సర్వత్రా వ్యాపించింది; వేర్వేరుగా ఒకదానితో ఒకటి దూరంగా వున్న 20 స్థలాల్లో ఏకసమయంలో సిపాయిలు తిరగబడి ఇంగ్లిషువారిని హత్యచేశారు; తిరుగుబాటు ముఖ్యస్థలాలు: ఆగ్రా, బరేలీ, మురాదాబాద్. "ఇంగ్లిషు కుక్కల"పట్ల సింధ్యా విశ్వాసంగా ఉన్నాడు, అతని "సైనికులు" మాత్రం తద్వ్యతిరేకం; పాటియాల రాజా—సిగ్గుచేటు!—ఇంగ్లిషువాళ్ల సహాయార్థం పెద్ద సైనిక బలాన్ని పంపించాడు. మైన్‌పూరీవద్ద (పశ్చిమోత్తర రాష్ట్రంలో), కుర్రకక్కుగట్టు ఇంగ్లిష్ లెఫ్టినెంట్ డి కాంట్జో, ఖజానానూ, కోటనూ కాపాడాడు. కాన్పూర్‌లో, 1857 జూన్ 6న, నానా సాహెబ్, సర్ హ్యూ వీలర్‌ను ముట్టడించాడు [కాన్పూర్‌లో తిరుగుబాటు చేసిన 3 సిపాయి రెజిమెంట్లూ, 3 దేశీయ కేవల్‌రీ రెజిమెంట్లూ నానా సాహెబ్ నాయకత్వాన ఉన్నాయి; కాన్పూర్ సైనిక బలాల నాయకుడైన సర్ హ్యూ వీలర్ కింద (ఇంగ్లిష్) ఇన్‌ఫెంట్రీ బటాలియన్ ఒక్కటే ఉంది; ఇతనికి బైటనుండి కొద్దిపాటి అదనపు బలాలు మాత్రమే అందాయి; కోట, బారకాసులూ ఇతని స్వాధీనంలో ఉన్నాయి; పట్నంలో వున్న ఇంగ్లిషువాళ్లూ, స్త్రీలూ, పిల్లలూ అందరూ పారిపోయివచ్చి ఇక్కడ తలదాచుకున్నారు].

**జూన్ 26, 1857.** కాన్పూర్‌ను తన స్వాధీనం చేసిన పక్షంలో యూరపియన్లందరికీ శరణు ఇస్తానని నానా సాహెబ్ వాగ్దానం చేశాడు, జూన్ 27న (షరతులకు వీలర్ ఒప్పుకొనగా), ముట్టడిలో ఇంకా సజీవులైవున్న 400ల మందిని పడవల్లో ఎక్కి గంగానది దిగువగా వెళ్లనిచ్చారు; నానా రెండు వైపులనుండీ వారిపై కాల్పులు ప్రారంభించాడు; ఒక పడవ తప్పించుకోగా, నది దిగువ దానిపై దాడి చేసి దాన్ని ముంచేశారు, రక్షకసేనలో వారందరిలోనూ 4 మనుష్యులు మాత్రమే తప్పించుకొన్నారు. స్త్రీలతోనూ, పిల్లలతోనూ నిండి వున్న ఒక పడవ నదిలో ఇసక గట్టుకు తగులుకోగా, వారిని పట్టుకుని కాన్పూర్‌కు నడిపించి తీసుకుపోయి, వారిని ఖైదుచేసి కోటలో బంధించారు; 14 రోజుల తరువాత (జూలైలో) ఫతేఘర్ (ఫరుఖాబాద్‌కు 3 మైళ్ల దూరంలో వున్న సైనిక స్థావరం)నుండి తిరుగుబాటు సిపాయిలు మరికొంతమంది ఇంగ్లిష్ ఖైదీలను ఆ కోట్లోనే తొక్కేశారు.

కానింగ్ ఉత్తరువులను అనుసరించి, మద్రాసు, బొంబాయి, సింహళాలనుండి సైనిక బలాలను తరలించుతున్నారు. మే 23న, నీల్ నాయకత్వాన మద్రాసునుండి వచ్చిన అదనపు బలాలు దిగాయి, బొంబాయి సైనిక విభాగం ఇండస్ నది ఎగువదిక్కుగా లాహోర్‌కు వెళ్లింది.

జూన్ 17, సర్ పాట్రిక్ గ్రాంట్ (ఏన్సన్ తరువాత బెంగాల్‌లో సర్వసేనాని), అజుటంట్ జనరల్ జనరల్ హావ్‌లక్ కలకత్తా చేరి, అక్కడనుండి ఏకాయకీ బయల్దేరారు.

జూన్ 6, అలహాబాద్‌లో సిపాయిలు తిరుగుబాటు చేసి, (ఇంగ్లిష్) ఆఫీసర్లను, భార్యాబిడ్డలతోసహా కసాయికత్తికి బలిగావించి, కల్నల్ సింప్సన్ కాపాడుతున్న కోటను పట్టుకోవడానికి ప్రయత్నించారు; జూన్ 11న కలకత్తానుండి మద్రాస్ ఫ్యుసిలియర్స్‌తో వస్తూన్న కల్నల్ నీల్ నుండి ఇతనికి అదనపు బలాలు అందాయి; అతడు [నీల్] సిక్కులనందరినీ పంపించేసి, కోటను ఆక్రమించుకొని, కోట రక్షణార్థమై ఒక్క బ్రిటిష్ సైనికులనే ఉంచాడు (మార్గమధ్యంలో అతడు బెనారెస్‌ను ఆక్రమించుకుని, తిరుగుబాటు మొదటి దశలో వున్న 37వ దేశీయ ఇన్‌ఫెంట్రీ రెజిమెంటును ఓడించాడు; సిపాయిలు పారిపోయారు); (ఇంగ్లీషు) సైనిక బలాలు నాలుగు వైపులనుండీ అలహాబాదులోకి వెల్లువలా వచ్చాయి.

జూన్ 30. జనరల్ హావ్‌లక్ అలహాబాద్ చేరగానే నాయకత్వం వహించి, సుమారు 1,000 మంది బ్రిటిష్‌వారితో కాన్పూర్ మీదకి తరలివెళ్లాడు; జూలై 12న ఫతేపూర్ వద్ద సిపాయిలను తిప్పికొట్టడం, వగైరా కార్యాలు కావించాడు, మరికొన్ని సంఘర్షణలు కూడా జరిగాయి.

జూలై 16. హావ్‌లక్ సేన కాన్పూర్ శివార్లు చేరుకుంది; ఇండియన్లను ఓడించాడు, కాని అప్పటికే ఆలస్యంగా రావడం కారణంగా కోటలోకి ప్రవేశించలేకపోయాడు; ఖైదీలుగా పట్టుకున్న ఇంగ్లిష్ ఆఫీసర్లనూ, స్త్రీలనూ, పిల్లలనూ అందరినీ ఆ రాత్రి నానా ఊచకోత కోసేశాడు; తరువాత మందుగుండు కొట్టును పేల్చేసి, పట్నాన్ని వదిలిపెట్టి వెళ్లిపోయాడు.—జూలై 17, ఇంగ్లీషు సైనిక బలాలు పట్నంలో ప్రవేశించాయి.—నానా స్వస్థానమైన బిఠూర్ మీదకి హావ్‌లక్ దండెత్తి, ఎట్టి ప్రతిఘటన లేకుండానే ఆ వూరును పట్టుకుని, రాజప్రాసాదం ధ్వంసంచేసి, కోట పేల్చేసి, కాన్పూర్‌కి తిరిగి వెళ్లిపోయాడు; అక్కడ నగర రక్షక దళంతో స్థావరం కాపాడమని నీల్‌కు ఒప్పజెప్పి, హావ్‌లక్

లక్నోను విముక్తి చేయడానికై తరలివెళ్ళాడు; అక్కడ సర్ హెన్రీ లారెన్స్ ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ అవన్నీ విఫలంకాగా, ఒక్క రెసిడెన్సీ మినహా, నగరమంతా సాంతమూ తిరుగుబాటుదార్ల వశమైపోయింది.

జూన్ 30, నగర రక్షక దళమంతా ఒక్క సమూహంగా సమీపంలో వున్న తిరుగుబాటుదార్ల సైన్యంపై దాడిచేయడానికి తరలివెళ్ళింది; అపజయం పొందింది; తిరిగి రెసిడెన్సీలోనే తలదాచుకుంది; శత్రువులు ఈ భవనం ముట్టడించారు.

జూలై 4, సర్ హెన్రీ లారెన్స్ మరణం (జూలై 2న ఫిరంగిగుండు పేలి గాయం తగలడం కారణంగా); కల్నల్ ఇంగ్లిస్ నాయకత్వం వహించాడు; అప్పుడప్పుడు ముట్టడిదార్లపై ఉధృతగతిదాడులు చేస్తూ మూడు నెలలు నిలబడ్డారు. — హావ్‌లక్‌వే యుద్ధచర్యలు (పుట 271).[106] ఇతడు కాన్పూర్ తిరిగి చేరుకున్న తరువాత, పెద్ద సైనిక దళంతో సర్ జేమ్స్ ఔట్రామ్ ఇతనిని కలుసుకున్నాడు; వివిధ తిరుగుబాటు జిల్లాలలో చెదిరి వున్న అనేక రెజిమెంట్లతో ఏర్పడిన అదనపు బలాలను ఔట్రామ్ కూడా సమీకరించాడు.

సెప్టెంబరు 19, హావ్‌లక్, ఔట్రామ్, నీల్‌ల నాయకత్వంకింద ఈ సేన అంతా గంగానదిని దాటింది. 23న లక్నోకి 8 మైళ్ల దూరంలో వున్న అయోధ్య రాజుల వేసవికాల భవనం ఆలంబాగ్‌ను తుపానుదాడిచేసి వశపర్చుకున్నారు.

సెప్టెంబరు 25, లక్నోపై అంతిమ దాడి జరిపి, రెసిడెన్సీని చేరుకున్నారు; ఇక్కడ మరొక రెండు నెలలు తీవ్రమైన దిగ్బంధన పరిస్థితులలో వీరు గడపవలసి వచ్చింది. (పట్నంలో జరిగిన యుద్ధంలో జనరల్ నీల్ నేలకొరిగాడు; ఔట్రామ్ చేతికి తీవ్రమైన గాయం తగిలింది.)

సెప్టెంబరు 20, జనరల్ విల్సన్ నాయకత్వాన ఆరు రోజులు ప్రత్యక్ష యుద్ధం జరిగిన తదుపరి ఢిల్లీ పట్టుపడింది. (వివరాలకై చూ. పుటలు 272, 273.) తన అశ్విక దళాన్ని ముందుకు నడిపించుతూ హాడ్సన్ రాజప్రాసాదంలోకి చొరబడి ముసలి రాజునూ, రాణినీ (జీనత్ మహల్) పట్టుకున్నాడు; వారిని బందిఖానాలో తోసేసి, హాడ్సన్ తన చేతులతో రాజకుమారులను (తుపాకితో కాల్చి) చంపేశాడు. ఢిల్లీ నగరంలో రక్షక దళం ఏర్పాటై, శాంతి నెలకొల్పబడింది. తక్షణమే కల్నల్ గ్రేట్‌హెడ్ ఢిల్లీనుండి ఆగ్రాకు బయలుదేరి, ఆగ్రా సమీపంలో హోల్కార్ ముఖ్యపట్నమైన ఇందూర్‌నుంచి వచ్చిన బలమైన తిరుగుబాటుదార్ల సైనిక బలాన్ని ఓడించాడు.

అక్టోబరు 10, ఇతడు ఆగ్రాను వశపర్చుకుని, కాన్పూర్‌కు బయలుదేరి, అక్టోబరు 26న చేరుకున్నాడు; ఈలోపున కెప్టెన్ బోయిలూ, మేజర్ ఇంగ్లిష్, పీల్ షవర్స్‌లు తమ సేనలతో (పీల్‌కింద నావికా సైనికుల బ్రిగేడ్ ఉంది; అదికాక అదనంగా స్వదేశంనుండి వచ్చినట్టి, ప్రొబిన్, ఫేన్‌ల నాయకత్వాన వున్నట్టి అశ్విక దళాలు సంఘర్షణలో పాల్గొనడానికి సిద్ధంగా ఉన్నాయి; అదికాక స్వచ్ఛంద సైనిక పటాలాలు కూడా తయారయాయి) తిరుగుబాటుదార్లను అజమ్‌ఘర్, ఛత్రా (హజారీబాగ్ సమీపంలో), కద్వాం వద్దనూ, ఢిల్లీ సమీప ప్రాంతంలోనూ ఓడించారు. ఆగస్టు నెలలో కలకత్తాలో సర్ కోలిన్ కాంబెల్ కలకత్తా సర్వసేనాధిపత్యం వహించి, భారీ స్థాయిలో యుద్ధం సాగించడానికి సిద్ధంగా వున్నాడు.

నవంబరు 19, 1857, లక్నోవద్ద రెసిడెన్సీలో ముట్టడించబడి వున్న నగర రక్షక సైనిక బలాలను సర్ కోలిన్ కాంబెల్ విముక్తిచేశాడు (నవంబరు 24న సర్ హెన్రీ హావ్‌లక్ మరణించాడు); లక్నోనుండి—

నవంబరు 25, 1857, కోలిన్ కాంబెల్ కాన్పూర్ తరలివెళ్లాడు; ఈ పట్నం తిరిగి తిరుగుబాటుదార్ల వశమైంది.

డిసెంబరు 6, 1857, కాన్పూర్ ఎదుట జరిగిన యుద్ధంలో కోలిన్ కాంబెల్ విజయం సాధించాడు; తిరుగుబాటుదార్లు పట్నం వదిలిపెట్టేసి పారిపోయారు; సర్ హోప్ గ్రాంట్ వారి సేనలను వెన్నాడి, చెండాడాడు. కల్నల్ సీటన్ చేతిలో పాటియాలావద్దనూ, మేజర్ హోడ్సన్ చేతిలో మైన్‌పూరివద్దనూ తిరుగుబాటుదార్లు ఓడిపోయారు; ఇంకా అనేకచోట్ల కూడా ఓడిపోయారు.

జనవరి 27, 1858, డావ్ వగైరాకింద యుద్ధశాసన న్యాయస్థానంలో ఢిల్లీ పాదుషాను విచారణకు తీసుకొచ్చారు, "మామూలు నేరస్థుడు"గా అతనికి (1526 నుండి పరిపాలించుతూన్న మొగల్ వంశ ప్రతినిధికి!) ఉరిశిక్ష విధించారు; శిక్షను రంగూన్‌లో యావజ్జీవ దేశాంతర వాసశిక్షకింద తగ్గింపబడింది. సంవత్సరాంతంలో అక్కడకు పంపించేశారు.

1858లో సర్ కోలిన్ కాంబెల్ యుద్ధచర్యలు. జనవరి 2న ఫరుఖాబాద్, ఫతేఘర్‌లను ఇతడు స్వాధీనం చేసుకుని కాన్పూర్‌లో తన స్థానం ఏర్పరచుకున్నాడు; నలువక్కలనుండీ అందుబాటులో వున్న అన్ని సైనిక బలాలనూ, యుద్ధ సామగ్రినీ, ఫిరంగులనూ ఈ నగరానికి చేర్చవలసిందని ఉత్తరువుచేశాడు. —లక్నోవద్ద మోహరించి వున్న తిరుగుబాటుదార్లను ముందుకు

సాగనివ్వక వారిని సర్ జేమ్స్ ఔట్రామ్ అక్కడే నిలువరించి ఎదిరించాడు. – అనేక ఘటనలు జరిగిన తర్వాత (చూ. పుటలు 276, 277), మార్చి 15న (కోలిన్ కాంబెల్, సర్ జేమ్స్ ఔట్రామ్ వగైరాల నాయకత్వాన) లక్నో తిరిగి పట్టుకొనబడింది. ప్రాగ్దేశపు అమూల్య కళాఖండ సంచయములున్న ఈ పట్నాన్ని లూటీచేశారు; మార్చి 21కి పోరాటం ఆగిపోయింది; 23 నాటికి కడసారి ఫిరంగి కాల్పు. – ఫెరోజ్ రాజకుమారుడు (ఢిల్లీ పాదుషా కొడుకు), బిఠూర్ రాజా నానా సాహెబ్, ఫైజాబాద్ మౌల్వీ, అయోధ్య బేగమ్* హజ్రత్ మహల్ నాయకత్వాన తిరుగుబాటుదార్లు బరేలీకి పారిపోయారు.

ఏప్రిల్ 25, 1858. కాంబెల్ షజహాన్‌పూర్‌ను స్వాధీనపర్చుకున్నాడు; బరేలీ సమీపంలో తిరుగుబాటుదార్ల దాడిని మోగ్స్ తిప్పికొట్టాడు; మే 6న బరేలీపై ముట్టడి ఫిరంగులు కాల్పులు ప్రారంభించాయి; ఈ లోపున ముందుగా చేసుకున్న నిర్ణయం ప్రకారం, మురాదాబాద్‌ను పట్టుకొన్న తదుపరి జనరల్ జోన్స్ బరేలీకి వచ్చాడు; నానా, అతని అనుచరులూ పారిపోగా, ప్రతిఘటన లేకుండానే బరేలీ స్వాధీనమైపోయింది. ఈలోపుగా తిరుగుబాటుదార్లచే దట్టంగా ముట్టడించబడిన షజహాన్‌పూర్‌ను జనరల్ జోన్స్ విముక్తిచేశాడు; లక్నోనుండి తరలివస్తూన్న లూగార్డ్ నాయకత్వాన వున్న డివిజన్, కుఁవర్ సింగ్ నాయకత్వాన వున్న పితూరీదార్లను ఎదుర్కొని, అటకాయించగా ఈ డివిజన్ తీవ్రంగా దెబ్బతింది; సర్ హోప్ గ్రాంట్ బేగమ్‌ను ఓడించగా, కొత్త బలాలు సమీకరించుకొనేందుకై ఆమె గోగ్రా నది వైపుగా పారిపోయింది; ఇది జరిగిన కొద్ది రోజులకే ఫైజాబాద్ మౌల్వీ చంపబడ్డాడు.

జూన్ మధ్యరోజులు, 1858, అన్ని చోట్లా పితూరీదార్లు అపజయం పొందారు; సమన్వయ చర్యలు జరపడానికి వారికి శక్తి లేదు; బందిపోటు దొంగల ముఠాల కింద చీలిపోయారు; అనేక భాగాలుగా విడిపోయిన ఇంగ్లీషు సైనిక బలాలను తీవ్రంగా వేధించుతున్నారు. యుద్ధచర్యల కేంద్ర స్థానాలు: బేగమ్, ఢిల్లీ రాజకుమారుడు, నానా సాహెబ్‌ల పతాకలు. మధ్య ఇండియాలో సర్ హ్యూరోజ్ 2 నెలలుగా (మే, జూన్ నెలలలో) సాగించిన యుద్ధచర్యలతో తిరుగుబాటుపై ఆఖరిదెబ్బ.

---

* అయోధ్య రాణి. – సం.

జనవరి 1858, రోజ్ రాహట్‌ఘర్‌నూ, ఫిబ్రవరిలో సాగర్, గ్రా కోటలనూ వశపర్చుకొని, రాణీ* మోహరించివున్న ఝాన్సీ మీదకి పురోగమించాడు.

ఏప్రిల్ 1, 1858, ఝాన్సీని రక్షించడానికై నానా సాహెబ్ బంధువు తాంతియాతోపే కాల్పీనుండి పురోగమించి రాగా, అతనితో గొప్ప సంఘర్షణ జరిగింది; తాంతియా ఓడిపోయాడు.

ఏప్రిల్ 4, ఝాన్సీ పట్టుపడింది; రాణీ, తాంతియాతోపే తప్పించుకునిపోయి, ఇంగ్లీషువారికోసం కాల్పీ వద్ద కాచుకుని ఉన్నారు; ఆ దిశగా తరలివెళ్లుతూండగా —

మే 7, 1858 — కుంచ్ అనే పట్నం వద్ద బలమైన శత్రు దళం రోజ్‌ని అటకాయించింది; వారిని రోజ్ పూర్తిగా ఓడించేశాడు.

మే 16, 1858, కాల్పీకి కొద్ది మైళ్ల దూరంలో తిరుగుబాటుదార్ల సేనలు రోజ్ చుట్టుముట్టారు.

మే 22, 1858, కాల్పీనుండి తిరుగుబాటుదార్లు మొండి ధైర్యంతో ఉధృతగతి దాడి సాగించారు; అపజయం పొంది పారిపోయారు.

మే 23, 1858, కాల్పీని రోజ్ స్వాధీనపర్చుకొన్నాడు. తీవ్ర వేడికి [యుద్ధ చర్యల వలన] డస్సిపోయిన తన సైనికులకు విశ్రాంతి కలుగుజేయడానికై అక్కడ కొన్ని దినాలు ఆగాడు.

జూన్ 2, యువకుడైన సింధ్యా (ఇంగ్లీషువారి కావలికుక్క) తీవ్రమైన యుద్ధం జరిగిన తరువాత, తన సేనలచే గ్వాలియర్‌నుండి తరిమివేయబడి, ప్రాణం దక్కించుకోడానికై ఆగ్రాకు పారిపోయాడు. రోజ్ గ్వాలియర్‌పై దాడి వెడలాడు; తమ తిరుగుబాటుదార్ల సైన్యాంతో ఝాన్సీ రాణీ, తాంతియా తోపే, అతనితో —

జూన్ 19 — లోష్కార్ కొండ (గ్వాలియర్ ఎదురుగా) వద్ద యుద్ధం చేశారు; రాణీ యుద్ధంలో మరణించింది; చాలామంది శత్రు ఖడ్గానికి బలి అయిన తర్వాత ఆమె సైన్యం చెదిరిపోయింది. గ్వాలియర్ ఇంగ్లీషువారి వశమైంది.

జూలై, ఆగస్టు, సెప్టెంబరు 1858, ఈ నెలలో సర్ కోలిన్ కాంబెల్, సర్ హోప్ గ్రాంట్, జనరల్ వాల్‌పోల్‌లు తిరుగుబాటుదార్ల ముఖ్య నాయకులకోరకై వేట మొదలుపెట్టారు; ఇంకా శత్రువశంలో వుండి, లొంగని దుర్గాలన్నిటినీ స్వాధీనపర్చుకో నారంభించారు; ఆఖరిసారిగా బేగమ్ కొన్ని స్థలాలలో నిలదొక్కుకుని పోరాడింది, కాని ఓటమిపొంది, నానా సాహెబుతో కలిసి రాప్తీనది దాటి ఇంగ్లీషువారి కావలికుక్క అయిన నేపాల్

* లక్ష్మీబాయి. — సం.

రాణా జంగ్ బహదూర్ రాజ్యంలోకి పారిపోయారు; తన దేశంలోకి పారిపోయి వచ్చిన తిరుగుబాటుదార్లను వెన్నాడడానికి ఇంగ్లీషువారికి అతను అనుమతినిచ్చాడు; ఈవిధంగా ''దుస్సాహసికుల ఆఖరి ముఠాలు చెదిరిపోయాయి;'' నానా, బేగమ్ కొండల్లోకి పారిపోయారు, వారి అనుచరులు లొంగిపోయారు.

1859 తొలి నెలలు, తాంతియా తోపే యొక్క అజ్ఞాతవాసస్థలం పసికట్టి, అతనిని పట్టుకుని, విచారణచేసి, ఉరితీశారు. — నానా సాహెబ్ నేపాల్‌లో చనిపోయాడని ''తలచబడింది.'' బరేలీ ఖాన్‌ను పట్టుకుని కాల్చేశారు; లక్నోవాసుడైన మామూ ఖాన్‌కు యావజ్జీవ ఖైదు శిక్ష విధించారు; కడమవారిలో కొందరికి దేశాంతర వాస శిక్ష, కొందరికి వివిధ సంవత్సరాల ఖైదు శిక్ష విధించారు; తిరుగుబాటుదార్ల రెజిమెంట్లు రద్దుచేయబడగా, వారిలో అత్యధిక సంఖ్యాకులు ఆయుధాలు విసర్జించి, రైతులుగా మారిపోయారు. అయోధ్య బేగమ్ నేపాల్‌లో కట్మాండూలో నివసించింది.

అయోధ్య భూములు ఆంగ్లో-ఇండియన్ ప్రభుత్వానికి ఒప్పుకాబడి, ప్రభుత్వ ఆస్తిగా దఖలు పడ్డట్లు కానింగ్ ప్రకటన! సర్ జేమ్స్ ఔట్రామ్ స్థానే సర్ రాబర్ట్ మంట్గొమెరీ అయోధ్య ఛీఫ్ కమిషనర్‌గా నియమింపబడ్డాడు.

ఈస్ట్ ఇండియా కంపెనీ రద్దు. యుద్ధం ఇంకా ముగియకముందే కంపెనీ విచ్ఛిన్నమైపోయింది.

డిసెంబరు 1857, పామర్‌స్టన్ ఇండియా బిల్లు; 1858 ఫిబ్రవరిలో బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ తన నిరసన గంభీరంగా తెలియజేసినప్పటికీ మొదటి పఠనానికి అంగీకారం లభించింది, కాని లిబరల్ మంత్రివర్గం స్థానే టోరీ మంత్రివర్గం అధికారంలోకి వచ్చింది.

ఫిబ్రవరి 19, 1858, డిజ్రేలీ ప్రవేశపెట్టిన ఇండియా బిల్లు వీగిపోయింది (చూ. పుట 281).

ఆగస్టు 2, 1858, లార్డ్ స్టాన్లీ ప్రవేశపెట్టిన ఇండియా బిల్లు నెగ్గింది; దీనితో ఈస్ట్ ఇండియా కంపెనీకి స్వస్తి. ''ఘనత వహించిన'' విక్టోరియా సామ్రాజ్యంలో ఇండియా ఒక రాష్ట్రమైంది!

మార్క్స్ చే
1870 దశకంలో
రచించబడింది

లిఖిత ప్రతిననుసరించి
ముద్రించబడింది
జర్మన్ మాతృకకు అనువాదం

# ఉత్తరప్రత్యుత్తరాలు

## ఎంగెల్స్‌కి మార్క్స్

ఆగస్టు 15, 1857

...ఢిల్లీలో పరిస్థితులెలా వున్నాయంటే వర్షాలు బాగా పడడం మొదలుకాగానే ఇంగ్లీషు వారు తిరోగమనం ప్రారంభించబోతారని నాకు తోస్తూంది. నీ బదులు నేను తాత్కాలిక సైనిక విలేకరిగా "Tribune"లో రాయాల్సివచ్చింది కనుక, నా సొంత పూచీమీదనే, ఈవిధంగా జరుగుతుందని ధైర్యం చెబుతూ రాశాను.* ఈ తేదీవరకూ అందిన వార్తలు నిజమనుకునే షరతో....

ఢిల్లీ పడిపోయిందని అదేపనిగా వినవస్తూన్న వదంతులన్నిటినీ కలకత్తా ప్రభుత్వమే ప్రచారం చేస్తూంది; మద్రాసు, బొంబాయి రాష్ట్రాలలో క్రమపద్ధతిని నిలబెట్టేందుకు ఇవే ప్రధాన సాధనంగా ఉపయోగపడుతూన్నట్టు ఇండియన్ పత్రికలవల్ల నాకు అవుపడుతూంది. ఈ ఉత్తరంతో ఢిల్లీ ప్లాను నీకు పంపిస్తున్నాను. ఉబుసుపోయేందుకని దీనిని నీకు పంపించుతున్నాను; అయినా దీనిని నువ్వు చూసిన తర్వాత నాకు తిరిగి తప్పకుండా పంపించేయాలి....

* ఈ సంకలనంలో 60, 66, 69వ పుటలు చూడండి.—సం.

# మార్క్సుకి ఎంగెల్స్

Ryde, సెప్టెంబరు 24, 1857

...ఇండియాపై చర్చలు జరపడానికి కలిగిన కోర్కె, ఈ వ్యవహారం అంతటిని గురించి నా అభిప్రాయం తెలుసుకోవాలని నీకుంటుందనే నేనూ అనుకోవడమూ — ఈ రెండూ ఒక్క సారే తటస్థించాయి. సరిగ్గా ఈ సమయంలోనే, తాజా టపాలో వచ్చిన ముఖ్యమైన వార్తలను, మ్యాపులోసహా చూస్తూ చదవడానికి నాకు అవకాశం కూడా కల్గింది; voici ce qui en résulte*.

మిలిటరీ దృక్పథంనుండి మధ్య, ఎగువ గంగానదీప్రాంతాల్లో బ్రిటిష్ స్థానాలు ఎంత ఘోరంగా చెదిరిపోయి ఉన్నాయంటే, ఆ ప్రాంతాల్లో విడివిడిగానూ, ముట్టడిలోనూ వున్నట్టి రక్షక దళాలలో వీలైనవన్నిటినీ సమీకరించుకున్న తర్వాత, హేవ్‌లక్‌కింద వున్న సేనలూ, ఆగ్రాలో వున్న ఢిల్లీ విభాగమూ, ఈ రెండూ ఒక దానితో ఒకటి త్వరగా కలుసుకోవడమూ; ఆగ్రానూ, గంగకి దక్షిణంగా వున్న స్థానాలను మాత్రమేనూ, గ్వాలియర్‌నూ (మధ్య ఇండియాలో వున్న సంస్థానాధీశుల దృష్ట్యా), తమ చేతిలో నిలబెట్టుకోవడమూ; గంగమీదే దిగువగా వున్న అలహాబాద్, బెనారెస్, దీనాపూర్‌లాంటి స్థానాలను అక్కడ వున్న రక్షక దళాలతోనూ, కలకత్తానుండి వచ్చిన అదనపు దళాలతోనూ నిలబెట్టుకోవడమూ, ఈలోపుగా, సైనిక బలాలను పునః సమర్థవంతం చేయడానికీ, చలనశీలమైన దళాలను వినియోగించి పరిసరప్రాంతాలను అదుపులో ఉంచుకోడానికీ, సామగ్రులను కూడబెట్టుకోడానికీ వీలుగా ఉండేందుకుగాను స్త్రీలనూ, యుద్ధంలో పాల్గొననివారినీ ఈ స్థలాలనుండి ఖాళీ చేయించి, వారిని నదిదిగువగా పంపించివేయడమూ — ఇదొక్కటే సరైన మార్గం. ఆగ్రాను నిలబెట్టుకోడం సాధ్యంకాకపోతే కాన్పూర్‌కూ, ఇంకా అవసరమైతే అలహాబాద్‌కూ తిరోగమించ

* ఇదిగో దీని ఫలితం. — సం.

డమే ఉత్తమం; ఏమైనప్పటికీ ఈ చివరి స్థానం, గంగాయమునల మధ్యనున్న దేశానికంత టికీ కీలకమై ఉండడం కారణంగా, దీనిని మాత్రం చిట్టచివరివరకూ రక్షించుకునే తీరాలి.

ఆగ్రాను నిలబెట్టుకొంటూ, బొంబాయి సేనను ధారాళంగా ఉపయోగించుకోడానికి వీలుగా వుండే పక్షంలో, బొంబాయి, మద్రాసు సైన్యాలు అహమదాబాద్ కలకత్తా అక్షాంశ రేఖ వెంటే – ఇందూర్ గ్వాలియర్లమీదుగా ఆగ్రాకు బొంబాయి సైన్యమూ, సాగర్ గ్వాలియర్లమీదుగా ఆగ్రాకూ, జబ్బల్‌పూర్‌మీదుగా అలహాబాద్‌కూ మద్రాసు సైన్యమూ – ద్వీపకల్పాన్ని ఆక్రమించుకుని, ఉత్తరంతో సంబంధాలు స్థాపించుకోడానికై శ్రేణులను పంపాలి. పంజాబ్ నిలబడగలుగుతే పంజాబ్‌గుండానూ, కలకత్తానుండి దీనాపూర్, అలహాబాద్‌లమీదుగానూ ఆగ్రాకి ఇతర రవాణా మార్గాలున్నాయి. ఈవిధంగా నాలుగు రవాణా మార్గాలూ, పంజాబ్ మినహా కలకత్తా, బొంబాయి, మద్రాసులకు మూడు తిరోగమన మార్గాలూ వుంటాయి; దక్షిణంనుండి వచ్చిన సైనిక బలాలను ఆగ్రాలో కేంద్రీకరించడం మధ్య ఇండియాలో వున్న సంస్థానాధీశులను లొంగదీయడానికీ, పురోగమనమార్గ మంతటా వున్న తిరుగుబాటును అణచివేయడానికీ సహాయపడుతుంది.

ఆగ్రాను నిలబెట్టుకోడానికి వీలులేని పక్షమందు, అలహాబాద్‌తో శాశ్వతంగా రవాణా మార్గాలు స్థాపించుకున్న తరువాత, ఈలోపుగా బొంబాయి సైన్యం గ్వాలియర్‌కి తిరోగమించు తూండగా, అలహాబాద్‌లో వున్న సైనిక బలాలతోసహా ఆగ్రాకి మద్రాసు సైన్యం వైదొల గడం అన్నిటికంటె ముఖ్యమైన విషయం.

మద్రాసు సైన్యాన్ని చూస్తే, కేవలం ఆకతాయి జవాన్నే అందులో చేర్చుకున్నట్టు కనబడుతూంది; ఈ కారణంగా ఇటువంటి మనుషులమీద ఆధారపడ్డం ఎంతవరకు మంచిదో అంతవరకే ఆధారపడాలి. బొంబాయి సైన్యంలో బటాలియన్ ఒక్కంటికీ 150, అంతకు పైగా కూడా భారతీయులున్నారు; వీరు ప్రమాదకారులు. ఎందుచేతంటే కడమవారిని వీరు తిరుగుబాటుకు పురికొల్పగల్గుతారు. బొంబాయి సైన్యం గనుక తిరుగుబాటు చేసిందంటే, ఇక ప్రస్తుతానికి మిలిటరీ పోస్టులన్నిటినీ కట్టిపెట్టెయ్యాల్సే ఉంటుంది; అలాటి పరిస్థితుల్లో, కాశ్మీర్‌నుండి కన్యాకుమారివరకూ బ్రహ్మాండమైన ఊచకోత మాత్రం తథ్యం. బొంబాయిలోని పరిస్థితి తిరుగుబాటుదార్లపైన సైన్యాన్ని ఉపయోగించుకొనలేనట్టిదే గనుక అయితే, ఇక అట్టి సందర్భంలో అధమం నాగపూర్ దాటి పురోగమించినట్టి మద్రాసు శ్రేణులకు అదనపు బలాలు పంపించడమూ, వీలైనంత త్వరగా అలహాబాదుతో గాని, బెనారెస్‌తో గాని సంబంధాలు ఏర్పరచుకోవడమూ చాలా ముఖ్యం.

యధార్థమైనట్టి సార్వభౌమ నాయకత్వం లోపించడం కారణంగా యీనాటి బ్రిటిష్ విధానంలో ఏర్పడిన అసంబద్ధ పరిస్థితుల ఫలితాలు పరస్పరాధికం చేసుకొనే రెండు విషయాలలో బైటపడుతున్నాయి: మొదటిది, తమ సైనిక బలాలను విభజించుకోవడం ఫలితంగా

తమ సేనంతా చిన్నచిన్న విభాగాలైపోయి దూరందూరంగా చెదిరిపోయిన స్థానాల్లో కట్టుబడిపోయి వుండేటట్టుగా తమంతట తామే చేసుకుంటున్నారు: ఇక రెండవది, తమకున్న ఒకేఒక చలనశీలమైన శ్రేణివి ఢిల్లీ దగ్గర స్థిరంగా అట్టేపెట్టేయడంవల్ల అక్కడ అది ఏ కార్యమూ సాధించలేకుండా నిరర్థకంగా ఉండిపోవడమే కాకుండా, విపత్కర పరిస్థితుల్లో సహితం చిక్కుకుంది. ఢిల్లీమీదకి సైన్యాలను పంపించిన ఇంగ్లీషు జనరల్‌ని సైనికశాసనం కింద విచారణచేసి ఉరితీసినా పాపంలేదు; ఎందుచేతంటే, ఇటీవల మాత్రమే మన కందరికీ తెలిసిన విషయం అతడు తప్పకుండా తెలిసికొనే వుండాల్సింది. అదేమిటంటే, యథావిధిగా ముట్టడి జరిపి నగరం స్వాధీనం చేసుకోవాలంటే అధమం ఏ 15 వేల, 20 వేల సైన్యమో ఉంటేనే కాని వీలువడనట్టుగానూ, లేదా దుర్గం ఉచితరీతిని రక్షించబడిన పక్షంలో ఇంతకు మించిన సైనిక బలాన్ని ఉపయోగించుతేనేగాని నగరాన్ని ముట్టడిసైన్యాలు స్వాధీనం చేసుకోడానికి వీలులేనట్టుగా, నగరంయొక్క పాత దుర్గరక్షణ నిర్మాణాలను బ్రిటిష్‌వారే పటిష్ఠం చేశారనే విషయం — అతనికి తప్పకుండా తెలిసే వుండాలి. ఇక ఇప్పుడు వారక్కడ ఉన్నారు గనుక, రాజకీయ కారణాల దృష్ట్యా, వారక్కడే అంటిపెట్టుకుని ఉండిపోవలసిన స్థితిలో పడ్డారు; అక్కడనుండి ఉపసంహరణ అపజయంతో సమానమే; అయినప్పటికీ, ఉపసంహారణను వారు తప్పించుకోవడం వారికి బహుశా సాధ్యంకాదు.

హావ్‌లక్ సేనలు చాలా కార్యాలు సాధించాయి. అటువంటి శీతోష్ణ పరిస్థితుల్లో, అందులోనూ అటువంటి కాలమానంలో, ఎనిమిది రోజుల్లో 126 మైళ్లు తరలిరావడం, అదే సమయంలో ఆరో ఎనిమిదో యుద్ధాలుచేయడం మనుష్యమాత్రుడికి దుస్సాధ్యం. కాని అతని సేనలు ఇప్పుడు బాగా అలసటపడి ఉన్నాయి; అందుచేత కాన్పూర్ చుట్టుపట్ల కొద్దికొద్ది దూరాల్లో దాడులు చేయడానికి వీటిని బయల్దేరించాడంటే, మిగిలిన శక్తి సహితమూ కోల్పోయి, ఇక ఇవి పూర్తిగా విచ్ఛిన్నమైపోయి, తనే దిగ్బంధంలో చిక్కుకుంటాడు; లేదా అంటే అతడు అలహాబాద్‌కే తిరిగి వెళ్లాల్సిన వస్తుంది.

పునః దిగ్విజయయాత్ర సాగించడానికై అవలంబించాల్సిన పథం నిజంగా గంగానది ఎగువలోయవెంట ఉంటుంది; కేవలం బెంగాల్ రాష్ట్రం ఒక్కటే చేతిలో వుంచుకోవడంలో పెద్ద కష్టమేమీ లేదు, ఎందుకంటే అక్కడి ప్రజ బాగా దిగజారిపోయి ఉన్నారు; చిక్కు అంతా దీనాపూర్ ప్రాంతమండే ప్రారంభమౌతూంది. ఇందుచేతే దీనాపూర్, బెనారెస్, మీర్జాపూర్, అందులోనూ మరీ ప్రధానంగా అలహాబాద్ అత్యంత ముఖ్యమైనవి. ఇంగ్లీష్‌వారు అలహాబాద్‌నుండి బయలుదేరి మొదట దోఆబ్‌నూ (గంగాయమునల మధ్య ప్రదేశం), రెండు నదుల తీరాల్లో వున్న నగరాలనూ, తర్వాత అయోధ్యనూ, ఆటుతర్వాత కడమ ప్రదేశాన్నీ జయించుకోగలరు. అలాంటప్పుడు మద్రాసునుండీ, బొంబాయినుండీ

అలహాబాదుకూ, ఆగ్రాకూ వెళ్ళే మార్గాలు కేవలం అప్రధాన సైనికచర్యా మార్గాలుగానే ఉండగల్గుతాయి.

ఎప్పుడూ ఉన్నట్టుగానే ఇప్పుడు కూడా, కేంద్రీకరణే అతిముఖ్యమైన విషయం. గంగ ఎగువగా పంపించిన అదనపు బలాలన్నీ పూర్తిగా చెదిరిపోయున్నాయి. ఇంతవరకు ఒక్క సైనికుడైనా అలహాబాద్ చేరుకోలేదు. ఈ స్థానాలను బలపర్చుకోవాలంటే ఇది అనివార్యమే కావచ్చు; అయినా కాకపోవచ్చు కూడా. ఏది ఏలా వున్నప్పటికీ, రక్షించుకోవాల్సిన స్థానాల సంఖ్యను ఎంతవరకూ తగ్గించుకోడానికి వీలవుతుందో, అంతవరకూ తగ్గించుకునే తీరాలి; ఎందుచేతంటే, యుద్ధభూమిమీద జరపాల్సిన చర్యలకోసం సైనిక బలాలను సాంద్రీకరించుకోవడం అత్యంత అవసరం. సి. [కోలిన్] కాంబెల్‌కు, ఇతడు ధైర్యసాహసాలుగల వ్యక్తి అనే తప్ప, అంతకంటె ఇతని గురించి అధికం మనకేమీ తెలియదు, గొప్ప జనరల్‌గా కీర్తిని నిజంగా సంపాదించుకోవాలనే కోర్కె ఉంటే, coûte que coûte* ఢిల్లీని వదలుకున్నా సరే వదలుకోకపోయినా సరే, చలనశీలమైన సైన్యాన్ని అతడు నిర్మించుకుని తీరాలి. ఇకపోతే, 25,000నుండి 30,000వరకూ యూరపియన్ సైనికులు ఎక్కడున్నా సరే, తమకు కలిగే నష్టాలను ఇతర స్థలాల రక్షక దళాలనుండి భర్తీచేసుకుంటూ, ఇతరచోట్లకు తరలివెళ్ళేందుకై అధమం 5,000 మందినైనా సమీకరించలేనంతటి నిరాశాజనకమైన దుస్థితిలో అతడు ఉండనే వుండడు. తను ఎక్కడున్నాడో తన ముందున్న శత్రువు ఎలాటివాడో, అప్పుడు మాత్రమే కాంబెల్ తెలుసుకోగల్గుతాడు. అతను ira se blottir devant Delhi like a fool** తన వాళ్ళు at the rate of 100 a day*** హతులైపోతూన్నా సరే చూస్తూ, అందరూ చచ్చినా సరే ఉన్నచోటునుండి కదలకుండా ఉండడమే అన్నిటికంటె మరింతగా "క్షాత్రధర్మమని" పరిగణిస్తున్నాడు. అయితే వాస్తవాలు యివి కాగా, సర్వాక్రమసహితమైన బుద్ధిమాంద్యమే ఈనాటికీ ఘనతగా చలామణీ అవుతూంది.

క్షేత్రయుద్ధానికై బలాలను ఉత్తరాన కేంద్రీకరించుకోవడమూ, మద్రాసునుండి, వీలైతే బొంబాయినుండి కూడా, శక్తివంతమైన సహాయమూ — కావలసిందంతా యిదే. నర్మదాతీరానున్న మహారాష్ట్ర సంస్థానాధీశులు ఒకవేళ జారుకున్నా కూడా, వాళ్ళ సేనలు ఎలాగా అప్పుడే తిరుగుబాటుదార్లతోనే చేరిపోయాయి. కాబట్టి దానికి పెద్దగా ప్రాధాన్యమేమీ వుండదు. ఏది ఎలా వున్నా అక్టోబరు ఆఖరుకి యూరప్‌నుండి అదనపు బలాలు వచ్చి చేరేవరకూ, ఇప్పుడున్న స్థానాలను వదలుకోకుండా నిలబెట్టుకోడమే మహాఘన కార్యం.

కాని, మరో రెండు బొంబాయి రెజిమెంట్లు తిరుగుబాటు చేశాయంటే మాత్రం, దాంతో అసలు వ్యవహారమంతా అమీ తుమీ తేలిపోతుంది; ఎందుచేతంటే, ఎత్తుగడలకీ, వ్యూహానికీ అప్పుడిక తావే ఉండదు...

---

* ఎంత మూల్యం చెల్లించి ఐనా సరే. — సం.

** ఢిల్లీముందు వెర్రివెంగళాయలాగు పిచ్చి యుద్ధంచేస్తూ. — సం.

*** రోజుకి 100 మంది చొప్పున. — సం.

# మార్క్సుకి ఎంగెల్స్

3, Edward Place, Jersey, అక్టోబరు 29, 1857

...ఢిల్లీ enceinte*ను సిపాయిలు వాసిగా రక్షించుకొని ఉండే ఉండాలి; కీలకం అంతా వీధుల్లో జరిగిన సంఘర్షణల్లోనే ఉంది. ఈ సంఘర్షణల్లో దేశీయ సైనిక బలాల ముందుకు పంపబడినట్లు కనబడుతూంది. అసలు ముట్టడంతా ఈవిధంగా 5నుం 14వరకూ జరిగింది; తరువాత జరిగినది ఇక ముట్టడే కాదు. రక్షణ లేకుండా వున్న కోటగోడల్లో, 5వ లేక 6వ తేదీనాటికే తీసుకొచ్చిన భారీ నౌకాఫిరంగులతో 300–400 గజాల దూరంనుండి గండికొట్టడానికి ఈ వ్యవధే కావలసినంతగా సరిపోయింది. కోటగోడ మీద వున్న ఫిరంగులు ఏమంత బాగా ఉపయోగించబడినట్లు అవుపడదు, లేకుంటే అంత త్వరగా కోటగోడలను సమీపించడానికి ఇంగ్లీష్‌వారికి వీలై వుండేదికాదు....

---

* కోటగోడలు. – సం.

# మార్క్సుకి ఎంగెల్స్

డిసెంబరు 31, 1857

ప్రియమైన మూర్,

ఇండియానుండి వార్తలున్న పత్రికలకోసమని పూరంతా గాలించాను; నా "Guardians" నీకు మొన్ననే పంపించేశాను. "Guardian"లోగాని, "Examiner"[107]లోగాని "Times" కార్యాలయంలో కూడా ఆ సంచికలు దొరకలేదు; బెల్‌ఫీల్డ్ దగ్గర ఉన్న పత్రికలన్నీ అమ్ముడు పోయాయి. నువ్వు మంగళవారమే యీ వ్యాసం పూర్తి చేశావనే అనుకున్నాను. ఈ సందర్భాల్లో, ఈ వ్యాసం రాయడానికి నాకు సాధ్యపడదు; అందులోనూ, అవసరమైన వ్యవహారాలను వెనకపెట్టకుండా, గత నాలుగు వారాలనుండీ ఈ వ్యాసం రాయడానికి నాకు ఈ మధ్యాహ్నమే మొదటి అవకాశం ఉండి ఉండీ కూడా రాయలేకపోవడం నాకు విచారం కలిగిస్తోంది. మిలిటరీ వ్యాసాల విషయమై నీ ఉద్దేశ్యాలేమిటో భవిష్యత్తులో సాధ్యమైనంత ముందుగా నాకు తెలియజేస్తూండు. సరిగ్గా ఇప్పుడు ఇరవైనాలుగు గంటలంటే ఎంతో కాలంలా ఉంది నాకు.

ఏది ఎలా వున్నా, సమాచారమే మహా తక్కువగా వుంది. ఇక ప్రతిదీ కూడా, కాన్పూర్ నుండి కలకత్తాకు పంపించిన టెలిగ్రాఫ్‌వార్తలమీదే ఆధారపడి ఉండడంచేత, వాటిని వ్యాఖ్యానించేందుకు ఇంచుమించు ఏమాత్రమూ సాధ్యంకాకుండా వుంది. ముఖ్యమైన విషయాలన్నీ వివరిస్తున్నా: కాన్పూర్‌నుండి లక్నోకి (అలంబాగ్‌కి) 40 మైళ్ళు. హావ్‌లక్ చేసిన అధిక ప్రయాస మజిలీలనుబట్టి చూస్తే, ఇండియా పరిస్థితుల్లో 15 మైళ్ల మజిలీ ఎక్కువ కాలం పట్టే పెద్ద మజిలీగా కనిపిస్తోంది. ఈవిధంగా, కోలిన్‌కి* రెండు, మూడు మజిలీలు చేయడమే అవసరమై ఉండడంచేత, ఏది ఏమైనప్పటికీ, కాన్పూర్‌నుండి బయలుదేరిన మూడవనాటికల్లా, అలంబాగ్ చేరుకుని, ఇంకా పొద్దు బాగానే ఉన్న కారణంగా వెంటనే దాడి చెయ్యడానికి అతనికి వీలుండే ఉంటుంది. దీన్నిబట్టే కోలిన్‌యొక్క పురోగమనాన్ని విలువకట్టాల్సి ఉంటుంది; నాకు తేదీలు జ్ఞాపకం లేవు. రెండవది, అతడివెంట 7,000

* కాంబెల్. — సం.

మంది ఉన్నారు (ఇంతకు మించే ఉంటారని తలచబడింది, కాని కలకత్తానుండి కాన్పూర్‌కు తరలిరావడం అత్యంత ప్రయాసకరంగా ఉండి, అనేకమంది చనిపోయి ఉండాలి); పోతే (అలంబాగ్, లక్నోల నగర రక్షక దళాలను కలుపుకుని), 7,000 మందితోనే అతడు అయోధ్యావాసులను ఓడించగల్గాడంటే, అందులో పెద్ద ప్రజ్ఞ ఏమీ లేదు. 5,000నుండి 7,000వరకూ ఇంగ్లీష్ సైనికులతో కూడిన సైన్యముంటే ఇండియాలోని వెల్లడి ప్రదేశంలో ఎక్కడకు పడితే అక్కడికి వెళ్లి, ఎటువంటి కార్యమైనా సాధించుకు రావడానికి పూర్తిగా సరిపడుతుందనే సర్వసాధారణంగా అందరూ నమ్ముతారు. ఇది శత్రువుని వెంటనే అణచిపారవేస్తుంది. గంగానది లోయలో నివసించుతూన్న జాతులవారందరిలోనూ, అయోధ్యా వాసులే హెచ్చు ధైర్యసాహసాలను కలిగినవారైనప్పటికీ, యూరపియన్ అర్గనైజేషనుకింద సరాసరి వారెప్పుడూ రాకపోవడం కారణంగా, క్రమశిక్షణా, సంఘటిత స్వభావమూ, ఆయుధాలలో సిపాయిలకంటే బాగా తీసికట్టనే విషయాన్ని ఈ సందర్భంలో చెప్పాల్సి వుంది. కాబట్టి, ప్రధాన యుద్ధమంతా తరిమివేత పోరాట రూపంలోనే, అనగా అయోధ్యావాసులను ఒక స్థానాన్నుండి మరొక స్థానానికి వరసగా తరిమివేస్తూండగా జరిగిన ఘర్షణ పోరాటంగానే జరిగింది. యూరప్ అంతటిలోనూ బ్రిటిష్, రష్యన్ తేలిక ఇన్‌ఫెంట్రీలే అన్నిటికంటే అత్యంత అధ్వానం అన్న విషయం నిజమే; కాని క్రైమియాలో కొన్ని గుణపాఠాలు వారు నేర్చుకున్నారు; ఏమైనప్పటికీ, బ్రిటిష్ శ్రేణులకు సరిగ్గానూ, వరుస క్రమంలోనూ గస్తీదళాల సహాయమూ, బారులుతీర్చిన సైనికసంక్తుం ఆసరా లభించి, సైన్యమంతా ఏకైక నాయకత్వంకింద ఉండి, ఒకేఒక లక్ష్యసాధనకై అందరూ సహకరించడంవల్ల, అయోధ్యావాసులపై వీరిదే పైచేయి అవడానికి గొప్ప అవకాశం లభించింది. మామూలు ఆసియాపద్ధతిలో అయోధ్యావాసులు చెదురుమదురు గుంపులుగా విడిపోయి, అందరూ ఒక్కుమ్మడిగా ముందుకు తోసుకుంటూండడంచేత, షణ్ముఖ లక్ష్యాన్ని బ్రిటిష్‌వారికి కల్పిస్తూ, అదనపు శ్రేణులు గాని, సహాయశ్రేణులు గాని లేకుండా, ఏ గుంపుకాగుంపు తన సొంత తెగ పెద్ద నాయకత్వాన, కడమ గుంపులతో సంబంధం లేకుండా స్వతంత్రంగా పోరాడాయి. ఇండియాలో ఇంతవరకూ వున్న ఏ తిరుగుబాటుదార్ల సైన్యమూ కూడా పేరుపొందిన నాయకునికింద సరైన విధంలో నిర్మాణయుతంగా ఏర్పడినట్టు ఒక్క దృష్టాంతమైనా మనమింతవరకూ వినివుండలేదని మనం మళ్లీ మరొకసారి చెప్పాల్సి వుంది. సమాచార వార్తలు ఈ యుద్ధస్వభావాన్ని గురించి పై విషయాలు తప్ప మరే వివరాలూ ఇవ్వలేదు. ఇంతేకాకుండా, యుద్ధభూమియొక్క నైసర్గిక స్వభావం గురించి ఎట్టి వర్ణన గాని, సైనిక బలాలను ఉపయోగించిన విధానం గురించి వివరాలు గాని వార్తల్లో ఏమీ లేకపోవడంవల్ల ఇంతకంటె మరేమి (అందులోనూ జ్ఞాపకాన్నిబట్టి) చెప్పడానికి నాకు బొత్తిగా మరేమీ లేదు....

# ఎంగెల్స్‌కి మార్క్స్

జనవరి 14, 1858

...నీ వ్యాసం శైలిలోనూ రీతిలోనూ భేషుగ్గా వుంది, కాగా "Neue Rheinische Zeitung"[108] రోజులన్నిటిలోనూ మంచి రోజులను జ్ఞాపకం తెచ్చింది. విండ్‌హామ్ గురించి చెప్పాలంటే, అతడు కేవలం చేతకాని జనరలే కావచ్చు; అయినా ఈ మాటు మాత్రం అతని దురదృష్టం కొద్దీ — రెడాన్ దగ్గిర అతని అదృష్టం మాదిరిగా — సరికొత్త సైనికులను అతను యుద్ధంలోకి నడిపించాల్సి వచ్చింది. ఇంగ్లీష్‌వాళ్లు ఇండియా దేశస్థులకి సమర్పించిన రెండో సైన్యం — దీనిలో ఒక్కడు కూడా ప్రాణాలతో బైటపడడమకో — ఇంచుమించు పూర్తిగా తుడిచిపెట్టుకుపోయిన మొదటి సైన్యంతో, ధైర్యంలో కాని, ఆత్మ విశ్వాసంలో కాని, స్థైర్యంలో కాని పోల్చడానికే ఎక్కడా వీల్లేదనే మొత్తంమీద నా అభిప్రాయం. సైనిక బలాలపై శీతోష్ణస్థితికి గల ప్రభావం మాటకొస్తే, నేను రాసిన వివిధ వ్యాసాల్లో — సైనిక విభాగాన్ని నేను తాత్కాలికంగా నడిపిన రోజుల్లో — సరైన లెక్కలు చూపుతూ, ఇంగ్లీష్‌వారు తమ నివేదికల్లో అధికారయుతంగా తెలిపినదానికంటె మరణసంఖ్య చాలా హెచ్చుగా ఉందని నిరూపించాను. జనం, డబ్బూ ప్రవాహంగా తరలిపోవడంవల్ల ఇంగ్లీష్‌వాళ్లకి కలిగిన విపరీత నష్టం దృష్ట్యా, ఇండియాయే అన్ని దేశాల్లోనూ మనకిప్పుడు ముఖ్యమైన మిత్రదేశమైంది....

# ఎంగెల్స్‌కి మార్క్స్

ఏప్రిల్ 9, 1859

...ఇండియా ఆర్థిక అస్తవ్యస్త స్థితి ఇండియాలో తిరుగుబాటుయొక్క వాస్తవ ఫలితమనే ఎంచాల్సి వుంది. ఇంతవరకూ ఇంగ్లండుయొక్క స్థిరమైన సహాయకులుగా వున్న వర్గాలపైనే ఇప్పుడు పన్నులు విధించుతేనే తప్ప, సార్వత్రిక విచ్ఛిన్నం అనివార్యంగా కన బడుతూంది. ఇలా పన్నులు విధించినప్పటికీ, ఇదేమంతగా సహాయపడేట్టు కనబడ్డంలేదు. అసలు విషయం ఏమిటంటే, ఈ యంత్రాన్ని చలనంలో ఉంచేందుకై సాలీనా 40, 50 లక్షల పౌన్ల చొప్పున జాన్ బుల్ ఇండియాలో నగదు చెల్లించుకుంటూనే, ఈ ముచ్చటైన డొంకతిరుగుడు మార్గంలో తన జాతీయరుణాన్ని కూడా తదనుగుణంగా నిరవధికంగా అధికమయే విస్తృతిలో అతడు పెంచుకోవాల్సి వుంటుంది. ఇండియా మార్కెట్టులో మాంచెస్టర్ నూలు వస్త్రాలు దారుణమైన అధికధరలకే అమ్మి డబ్బు పిండుతున్నారని తప్పనిసరిగా ఒప్పుకునే తీరాలి. మిలిటరీ కమీషన్ నివేదికనుబట్టి, ఇండియాలో అనేక సంవత్సరాలవరకూ, 2 లక్షలనుండి 2 లక్షల 60 వేలవరకూ దేశీయులతోపాటు, 80,000 యూరపియన్లను కూడా ఉంచాల్సి వుంటుంది. దీనివల్ల సుమారు 2 కోట్ల పౌన్లు ఖర్చు పెట్టాల్సి ఉండగా, నికరాదాయం కేవలం ఏ 2.5 కోట్ల పౌన్లో మాత్రమే ఉంటుంది. ఇంతేకాకుండా, తిరుగుబాటు ఫలితంగా శాశ్వత రుణం 5 కోట్ల పౌన్లు అధికమైంది; లేక విల్సన్ అంచనా ప్రకారం, సాలీనా వస్తూన్న లోటు 30 లక్షలు అధికమౌతుందన్నమాట. దీనికితోడు రైల్వేలలో హామీకోసం సాలీనా 20 లక్షల పౌన్లు చెల్లింపూ, ఒక వేళ వాటివల్ల వచ్చే నికరాదాయం 5 శాతానికి మించనట్టయితే శాశ్వతంగా ఇంతకంటె తక్కువ మొత్తం చెల్లింపూ, ఉండనేవుంది. ఈ వ్యవహారంలో ఇంగ్లీషు పెట్టుబడిదార్లకు వారి పెట్టుబడి మీద 5 శాతం వడ్డీ చెల్లించుకునే భాగ్యం తప్ప, కాసింతమేర తయారైన రైల్వే మినహా, ఇండియాకు మరే ప్రతిఫలమూ ఇంతవరకు ముట్టలేదు. అయితే జాన్ బుల్ తనకి తానే టోపీ వేసుకున్నాడు; సరిగ్గా చెప్పాలంటే, అతని పెట్టుబడిదార్లే అతన్ని టోపీ వేశారు. దీని

ఇండియా నామకః మాత్రమే చెల్లిస్తుంది; యథార్థంగా చెల్లించేది జాన్ బుల్. ఉదాహరణకు నిర్మాణానికే తామింకా శ్రీకారం చుట్టనట్టి రైల్వేలకుగాను పెట్టుబడిదార్లకు 5 శాతం వడ్డీలు చెల్లించడానికే స్టాన్లీ చేసిన ఋణంలో కేవలం అధికభాగం ఉద్దేశించబడింది. చిట్టచివరకి, ఇంతవరకూ నల్లమందు పన్నువల్ల సాలీనా వసూలవుతూన్న 40 లక్షల పౌన్ల ఆదాయానికి, చైనాతో చేసుకున్న సంధి[109]వల్ల, గొప్ప ప్రమాదం ఏర్పడుతూంది. ఏమైనప్పటికీ, ఈ గుత్తవ్యాపారం బోల్తాకొట్టడం మాత్రం తప్పదు; చైనాలోనే నల్లమందు పంట త్వరలో అభివృద్ధి కాబోతోంది. నిషేధించబడిన ఎగుమతుల జాబితాలో నల్లమందు కూడా ఒక పద్దుగా చేర్చబడడమే కేవలం ఈ నల్లమందు ఆదాయానికి కారణం. ఇండియా యుద్ధంకంటె నేటి ఆర్థిక విపత్తే, మరింత భయానకమైన వ్యవహారమని నా అభిప్రాయం....

# వివరణలు

1 ఈస్ట్ ఇండియా కంపెనీ అనుజ్ఞాపత్రం పొడిగించే సందర్భంలో కామన్స్ సభలో జరిగిన చర్చలను పురస్కరించుకుని మార్క్స్ "ఇండియాలో బ్రిటిష్ పరిపాలన" అనే వ్యాసం రాశాడు. ఈ వ్యాసం "New-York Daily Tribune" అనే అమెరికన్ పత్రికలో ప్రచురించబడింది.

"New-York Daily Tribune" 1841నుండి 1924వరకూ వెలువడింది. ప్రముఖ అమెరికన్ పత్రికారచయిత, రాజకీయవేత్త అయిన హోరెస్ గ్రీ చేత స్థాపించబడి, ఈ పత్రిక పద్దెనిమిది వందల యాభై దశకపు సంవత్సరాల వరకూ అమెరికన్ విగ్గులయొక్క వామపక్షపు పత్రికగా వుండి, తరువాత రిపబ్లికన్ పార్టీ పత్రిక అయింది. పద్దెనిమిదివందల నలభైలలోనూ, యాభైలలోనూ ఈ పత్రిక అభ్యుదయకరమైన అభిప్రాయాలు కలిగివుండి, బానిసవ్యవస్థపట్ల తీవ్రమైన ప్రతిఘటనావైఖరిని అవలంబించింది. ఈ పత్రికతో ప్రముఖ అమెరికన్ రచయితల లోనూ, పత్రికారచయితలలోనూ అనేకమందికి దగ్గరసంబంధాలుండేవి. పద్దెనిమిది వందల నలభైల చివరి సంవత్సరాలలో పత్రిక సంపాదకులలో చార్లెస్ డానా ఒకడు. ఇతనిపై ఊహాజనిత సోషలిజం భావాల ప్రభావం చాలా బలంగా ఉండేది. ఈ పత్రికతో మార్క్స్‌కు 1851 ఆగస్టులో మొదటి సారిగా ఏర్పడిన సంబంధం, మార్చి 1862వరకూ, పది సంవత్సరాలకుపైగా సాగింది. మార్క్స్ కోరికపైని ఎంగెల్స్ ఈ పత్రికకు అనేక వ్యాసాలు రాశాడు. అంతర్జాతీయ, దేశీయ విధానాలకు సంబంధించిన కీలక సమస్యలను గురించి, కార్మికోద్యమం, యూరపియన్ దేశాల ఆర్థికాభివృద్ధి, వలసవిధాన విస్తరణ, పీడిత, పరాధీన దేశాల జాతీయ విముక్తి ఉద్యమాలు వగైరా సమస్యలను గురించి మార్క్స్, ఎంగెల్స్‌లు తమ వ్యాసాలలో చర్చించారు. యూరప్‌లో అభివృద్ధినిరోధక కాలంలో, పెట్టుబడిదారీ సమాజంయొక్క వెడుగులనూ, పరిష్కార

సాధ్యంకాని వైరుధ్యాలనూ, బూర్జువా ప్రజాస్వామ్య పరిమితులనూ నిర్దిష్టమైన సమాచారసామగ్రి ఆధారంగా బట్టబయలుచేయడానికి అత్యధిక సంఖ్య పాఠకులు కలిగిన ఈ పత్రికను చక్కగా ఉపయోగించుకున్నారు.

మార్క్స్, ఎంగెల్సులు రాసి పంపించిన వ్యాసాలు కొన్నింటిలో "New-York Daily Tribune" సంపాదకులు స్వతంత్రించి అనేక మార్పులను చేసి, అనేక వ్యాసాలను సంతకాలు లేని సంపాదకీయ వ్యాసాలుగానూ ప్రచురించారు. వ్యాసవాచకాలలో మార్పులుచేసి, తమ ఇష్టానుసారంగా వ్యాసాల తేదీలను మార్పులు చేసిన ఉదాహరణలు కూడా ఉన్నాయి. దీని గురించి మార్క్స్ పదేపదే తన తీవ్ర ఆక్షేపణ తెలియజేశాడు. అమెరికాలో సంయుక్త రాష్ట్రాల్లో సంభవించిన ఆర్థిక సంక్షోభం ఫలితంగా పత్రికయొక్క ఆర్థికపరిస్థితులు దెబ్బతినడంవల్ల, 1857 శరత్తులో తాను పంపే వ్యాసాల సంఖ్యను మార్క్స్ తగ్గించుకొనక తప్పిందికాదు. అమెరికా అంతర్యుద్ధం ప్రజ్వరిల్లిన మొదటిరోజుల్లో "New-York Daily Tribune"తో తనకున్న సంబంధాన్ని మార్క్స్ పూర్తిగా తెగతెంపులు చేసుకున్నాడు. బానిసయజమానులను కలిగినట్టి దక్షిణంతో రాజీని సమర్థించేవారు పత్రికా నిర్వహణలో పైచేయి సంపాదించుకోవడమూ, వీరి ప్రాబల్యం అధికమవడంతో తాను వెనుక తీసుకున్న అభ్యుదయకరమైన వైఖరులకు పత్రిక స్వస్తిచెప్పడమూ ఇందుకు ప్రధానకారణం. – 14.

[2] టర్కీ సమస్య అని పేర్కొనడంలో ఆటోమన్ సామ్రాజ్యంపైన, అందులోనూ ప్రధానంగా దాని బాల్కన్ రాజ్యాంపైన, పలుకుబడిని సంపాదించడానికై పోటీ పడుతూన్న అగ్రరాజ్యాల మధ్య సుదూర ప్రాచ్యంలో సంభవించిన అంతర్జాతీయ స్పర్థలు అని మార్క్స్ ఉద్దేశ్యం. ఈ స్పర్థలు చిట్టచివరకు, ఒక పక్షంగా రష్యాకూ, ప్రత్యర్థి పక్షంగా బ్రిటన్, ఫ్రాన్స్, టర్కీ, సార్డినియాలకూ 1853–1856లో జరిగిన ప్రాచ్య, లేక క్రైమియా యుద్ధానికి దారితీశాయి. సెవస్తొపోల్ ముట్టడి క్రైమియా యుద్ధానికి కీలకంగా పరిణమించింది; రష్యన్ సైనిక నౌకా స్థావరమైన సెవస్తొపోల్ నల్లసముద్ర తీరానవుంది; సెవస్తొపోల్ ముట్టడి పదకొండు నెలలపాటు సాగి, చివరకు ఆ పట్నం లొంగిపోవడంతో అంతమైంది. కాని సెవస్తొపోల్ నగర రక్షక దళం సాగించిన దృఢమైన ప్రతిఘటన ఫలితంగా బ్రిటిష్-ఫ్రెంచి-టర్కీ సేనలు బలహీనపడ్డాయి. ఎదురుదెబ్బ తీయడానికి వాటికి మరి శక్తి లేకపోయింది. 1856 పారిస్ శాంతి సంధిపై సంతకాలు జరగడంతో యుద్ధం అంతమైంది.

లొంబార్డీ (అప్పట్లో ఆస్ట్రియాకింద వుంది)నుండి వలస పోయి, 1848–1849 జాతీయ విముక్తి ఉద్యమంలో పాల్గొన్నవారికీ, 1853 ఫిబ్రవరి 6న జరి

గిన మిలాన్ తిరుగుబాటుకు కారకులైన వారికి ప్యేమాంట్ (సార్డీనియా) శరణు ఇవ్వడం కారణంగానూ, ప్యేమాంట్‌తో ఆస్ట్రియా దౌత్యసంబంధాలు తెగతెంపుచేసు కోడం ఫలితంగా *సార్డీనియా సమస్య* 1853లో తలయెత్తింది.

ఇటలీ జాతీయ విముక్తి ఉద్యమంలో పాల్గొని ఆనాడు ఆస్ట్రియా పరిపాలన కిందవుండిన ఇటలీలోని జిల్లాలనుండీ, ప్రత్యేకంగా లొంబార్డీనుండీ వలసపోయినవారూ, అందులోనూ ముఖ్యంగా, విఫలమైనట్టి 1853 ఫిబ్రవరి 6 తిరుగుబాటులో పాలొన్నవారూ, స్విట్జర్లండ్ కాంటాన్ అయిన టెస్సిన్‌లో నివాసం ఏర్పరచుకుని ఉండడం కారణంగా, 1853లో ఆస్ట్రియా, స్విట్జర్లండ్‌ల మధ్య ఏర్పడ్డ తగాదానే మార్క్స్ *స్విట్జర్లండ్ సమస్య* అని పేర్కొన్నాడు. — 14.

ఈస్ట్ ఇండియా కంపెనీయొక్క 1833 అనుజ్ఞాపత్ర కాలం అంతమైపోవడం వల్ల, వారికి తిరిగి కొత్త అనుజ్ఞాపత్రం జారీచేసే చట్టం గూర్చి కామన్స్ సభలో జరిగిన చర్చకు ఇది ప్రస్తావన. 1600లో స్థాపితమైన బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ, ఇండియాలో బ్రిటిష్ వలస విధానంయొక్క పనిముట్టుగా ఏర్ప డింది. మొదటినుండి ఇండియా, చైనాలతో వర్తకంలో గుత్తాధిపత్యం కలిగిన కంపెనీ పేరిట బ్రిటిష్ పెట్టుబడిదార్లు సాగించిన ఇండియా దిగ్విజయం 19వ శతాబ్ది మధ్యలో పూర్తి అయింది. జయించిన భూభాగాలను కంపెనీ అదుపాజ్ఞల్లోకి తెచ్చుకొని, వాటిని పరిపాలించి, సివిల్ ఉద్యోగులను నియమించి, పన్నులు వసూలు చేస్తూండేది. నియమితకాలాల్లో పార్లమెంటుచే పొడిగించబడుతూండిన అనుజ్ఞాపత్రాల్లో కంపెనీ కుండిన వాణిజ్య, పరిపాలనాధికారాలు నిర్వచించబడుతూండేవి. 19వ శతాబ్దిలో కంపెనీ వర్తకంయొక్క ప్రాముఖ్యత క్రమేణా క్షీణించిపోయింది. 1813లో జరిగిన పార్లమెంటు చట్టం కంపెనీకుండిన ఇండియా వర్తక గుత్తాధిపత్యాన్ని రద్దుచేసింది, తేయాకు వర్తకంలోనూ, చైనా వర్తకంలోనూ కంపెనీకుండిన గుత్తాధిపత్యాన్ని మాత్రమే నిలబెట్టింది. 1833 అనుజ్ఞాపత్రంతో కంపెనీకుండిన అన్ని వాణిజ్యపు విశేషాధికారాలూ రద్దుకాబడి, 1853 అనుజ్ఞాపత్రంతో ఇండియా పరిపాలనలో కంపెనీకుండిన గుత్తాధికారం కూడా కొంతవరకు తగ్గించబడింది. ఈస్ట్ ఇండియా కంపెనీ బ్రిటిష్ రాజమకుటంయొక్క మరింత ఎక్కువ అదుపుకింద ఉంచబడింది. ఉద్యోగుల నియామకంలో కంపెనీ డైరెక్టర్లకుండిన అధికారం అంతమైపోయింది. డైరెక్టర్ల సంఖ్య 24నుండి 18కి తగ్గించబడి, వీరిలో ఆర్గురిని రాజమకుటం పేరిట ప్రభుత్వమే నియమించుతూండేది. బోర్డ్ ఆఫ్ కంట్రోల్ ప్రెసిడెంట్‌యొక్క హోదా సెక్రటరీ ఆఫ్ స్టేట్ ఫర్ ఇండియా హోదాతో సమానంచేయబడింది. ఇండియాలో

వున్న బ్రిటిష్ రాజ్య భూభాగాలపై కంపెనీకుండిన పలుకుబడి అధికారం 1858 వరకూ నిలిచివుంది; కాని చిట్టచివరకు 1858లో ఇది కూడా రద్దు అయిపోయి, ఇండియా పరిపాలన నరాసరి బ్రిటిష్ రాజ్యాధికారంకిందకు వచ్చేసింది. – 14.

బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ – ఈస్ట్ ఇండియా కంపెనీయొక్క పాలకవర్గం. కంపెనీ వాటాదార్లలో 2,000 షిన్ల వాటాలకు తక్కువ కాకుండా వాటాలను కలిగి మంచి పలుకుబడిగల వారినుండీ, ఇండియాలో బ్రిటిష్ ప్రభుత్వ పత్యులనుండీ ఏటా దీనిని ఎన్నుకోవడం జరిగేది. బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ కార్యస్థానం లండన్‌లో ఉండేది; కంపెనీ వాటాదార్ల సర్వసభ్య సమావేశంలో (బోర్డ్ ఆఫ్ ప్రొప్రైటర్స్) డైరెక్టర్ల ఎన్నిక జరిగేది; ఈ సమావేశంలో 1,000 షిన్ల వాటాలకంటె తక్కువకాకుండా వున్న వాటాలు కలిగివుండిన వాటాదార్లకే ఎన్నికలో వోటింగు అర్హత ఉండేది. 1853 వరకూ కోర్ట్ ఆఫ్ డైరెక్టర్స్‌కు ఇండియాలో విస్తృతాధికారాలుండేవి. 1858లో ఈస్ట్ ఇండియా కంపెనీ రద్దై పోవడంతో ఇది కూడా రద్దు అయిపోయింది. – 14.

1853 జూన్‌లో ఈస్ట్ ఇండియా కంపెనీ కొత్త అనుజ్ఞాపత్రంపై జరిగిన పార్లమెంటు చర్చలో, బోర్డ్ ఆఫ్ కంట్రోల్ ప్రెసిడెంటు అయిన చార్లెస్ వుడ్, ఇండియా అభివృద్ధిచెందుతూందని ఉద్ఘాటించాడు. తాను చెప్పినది నిజమని రూఢిపర్చడానికి, 1739లో పర్షియాదేశపు విజేత నాదిర్ షా (కులీ ఖాన్) ఢిల్లీని కొల్లగొట్టి నాశనం చేసిన కాలంలో ఆ పట్నపు స్థితినీ, ఆ పట్నంయొక్క సమకాలీనస్థితినీ పరిపోల్చాడు. – 15.

సప్తరాజ్యకూటం (ఏడుగురు రాజుల పరిపాలన) – మధ్యయుగపు తొలి సంవత్సరాలలో ఇంగ్లండుదేశం ఏడు ఆంగ్లో-సాక్సన్ రాజ్యాలుగా (6వ శతాబ్దినుండి 8వ శతాబ్ది వరకూ) చీలివుండిన ఇంగ్లండు రాజకీయ వ్యవస్థకు ఇంగ్లీషు చరిత్రకారులు ఇచ్చిన పేరు; మహమ్మదీయులచే దక్కన్ జయించబడిన కాలానికిముందు, దీని ఫ్యూడల్ విభజనస్థితిని సాదృశ్యంగా నిరూపించడానికై మార్క్స్ ఈ పదాన్ని వాడాడు. – 15.

Laissez faire, laissez aller (అలా ఉండనిమ్ము, నిర్నిబంధమగు స్వేచ్ఛ) – స్వేచ్ఛావ్యాపారాన్నీ, ఆర్థిక సంబంధాలలో ప్రభుత్వం జోక్యం కలుగజేసుకోనగూడదనీ సమర్థించే బూర్జువా స్వేచ్ఛావ్యాపార ఆర్థికశాస్త్రవేత్తల సాంకేతికం. – 17.

1812లో ప్రచురించబడిన కామన్స్ సభ అధికారయుత నివేదికనుండి మార్క్స్

ఉల్లేఖించుతున్నాడు; G. Campbell, "*Modern India: A Sketch of the System of Civil Government,*" London, 1852, pp. 84–85 (జి. కాంబెల్ "ఆధునిక ఇండియా: సివిల్ ప్రభుత్వ చిత్రణ," లండన్, 1852, పుటలు 84–85) అనే గ్రంథంనుండి ఉల్లేఖన. – 20.

9 "మహత్తరమైన విప్లవం" – 1688 రాజకీయ కుట్రకు ఇంగ్లీషు బూర్జువా చరిత్రకారులు వాడిన పేరు. దీని ఫలితంగా అభివృద్ధినిరోధక భూస్వామ్యవర్గంయొక్క సహాయంతో పరిపాలించిన రెండవ జేమ్సును కూలదోసి, ఆరెంజ్ ప్రభువైన మూడవ విలియమ్సు సింహాసనమెక్కించారు. బడా భూస్వాములు, వ్యాపారస్తులు అగ్రవాణిజ్య వేత్తల ప్రయోజనాలతోనూ మూడవ విలియమ్‌కు సంబంధాలుండేవి. 1688 రాజకీయ కుట్ర ఫలితంగా పార్లమెంటుకున్న అధికారాలు విస్తృతమై, క్రమేణా దేశపరిపాలనలో సార్వభౌమాధికార పాలక సంస్థగా పార్లమెంటు రూపొందింది. – 24.

10 సప్తవర్ష సంగ్రామం (1756–1763) – యూరప్‌లోని రెండు మిత్రమండలులకు – ఆంగ్లో-ప్రష్యన్, ఫ్రెంచి-రష్యన్-ఆస్ట్రియన్ – జరిగిన యుద్ధం. ఇంగ్లండుకీ ఫ్రాన్సుకీ మధ్య వలసరాజ్య, వాణిజ్య స్పర్థలే ఈ యుద్ధానికిగల ముఖ్యకారణాల్లో ఒకటి. నౌకాయుద్ధాల మాట అటుండగా, ఉభయ రాజ్యాలకూ అమెరికా ఆసియా ఖండాలలో వున్న వలసరాజ్యాలలోనే ప్రధానంగా యుద్ధం జరిగింది. ప్రాచ్యంలో ఇండియా ప్రధాన యుద్ధరంగంగా ఏర్పడింది; ఇక్కడ ఫ్రాన్సు, ఫ్రాన్సుకింద సామంతులుగా వున్న స్వదేశ సంస్థానాధిపతులకూ, ఈస్ట్ ఇండియా కంపెనీకీ యుద్ధం జరిగింది. ఈస్ట్ ఇండియా కంపెనీ తన సైనికబలాలను గణనీయంగా వృద్ధిచేసుకుని, యుద్ధాన్ని అవకాశంగా తీసుకుని ఇండియాలోని అనేక ప్రాంతాలను కాజేసింది. సప్తవర్ష సంగ్రామ ఫలితంగా, ఇండియాలో తనకున్న ప్రదేశాలలో ఇంచుమించు అన్నింటినీ (తీరప్రాంత నగరాలు ఐదు మినహా, కాని వీటి దుర్గరక్షణ నిర్మాణాలను నాశనంచేయక ఫ్రాన్సుకు తప్పిందికాదు) ఫ్రాన్సు కోల్పోయింది; ఇంగ్లండుయొక్క వలసరాజ్య శక్తి విస్తారంగా బలపడింది. – 25.

11 J. Mill, "The History of the British India" (జె. మిల్ "బ్రిటిష్ ఇండియా చరిత్ర"). ఈ గ్రంథం మొదటి కూర్పు 1818లో వెలువడింది. ఇక్కడ ఉల్లేఖించబడిన ఖండం ఈ గ్రంథం 1858 కూర్పు, 5వ సంపుటం, 6వ భాగం, పుటలు 60, 65నుండి సంగ్రహించబడింది; బోర్డ్ ఆఫ్ కంట్రోల్‌యొక్క విధు

అనుగూర్పి రాసినది కూడా మిల్ గ్రంథంనుండే (1858 కూర్పు, 4వ సంపుటం, 5వ భాగం, పుట 359) ఉల్లేఖించబడింది. – 26.

[12] జాకొబిన్ వ్యతిరేక యుద్ధం – 1793లో విప్లవ ఫ్రాన్సుకు వ్యతిరేకంగా ఇంగ్లండు ప్రారంభించిన యుద్ధం; యుద్ధం జరిగిన కాలంలో విప్లవాత్మక ప్రజాతంత్ర పక్షం వారైన జాకొబిన్‌లు ఫ్రాన్సులో అధికారంలో వున్నారు. జాకొబిన్‌లపై ఇంగ్లండు ప్రారంభించిన ఈ యుద్ధం నెపోలియన్ సామ్రాజ్యంపైన కూడా సాగింది. – 27.

[13] సంస్కరణ బిల్లు కామన్స్ సభకు సభ్యులను పంపే విధాన్ని మార్పుచేసింది; 1832 జూన్‌లో చట్టం కావించబడింది. సంస్కరణ చట్టంయొక్క లక్ష్యం ఆర్థికంగా బలం కల్గివుండిన భూస్వామ్య, ధనిక ప్రభువర్గంయొక్క రాజకీయ గుత్తాధిపత్యంపై దెబ్బతీయడం; కాగా ఇది పారిశ్రామిక బూర్జువావర్గానికి పార్లమెంటులో ప్రవేశం కల్గించింది. సంస్కరణకోసం పోరాటాన్ని సాగించడంలో అత్యంతప్రముఖ పాత్రను వహించినట్టి శ్రామిక, పెటీబూర్జువావర్గాలను లిబరల్ బూర్జువావర్గం మోస గించింది; ఫలితంగా శ్రామిక, పెటీబూర్జువావర్గాలకు ఏవిధమైన ఎన్నిక హక్కులూ లభించలేదు. – 27.

[14] ఇండియాలోని భూభాగాలను చేజిక్కించుకొని, తనతో పోటీచేస్తూన్న ఫ్రెంచి ఈస్ట్ ఇండియా కంపెనీని నాశనంచేసే ఉద్దేశంతో ఈస్ట్ ఇండియా కంపెనీ చేసిన పలు రాజ్యవిస్తరణ యుద్ధాల జాబితాను మార్క్స్ పేర్కొంటున్నాడు.

కర్నాటక యుద్ధాలు 1746నుండి 1763వరకూ అప్పటప్పట జరిగాయి. కర్నాటక రాజ సింహాసనానికై స్థానికంగా వున్న వివిధవారసుల పక్షం వహించి వారిని బలపరచడమనే మిషపై యుద్ధంలో ప్రత్యర్థులైన ఉభయపక్షాలూ – బ్రిటిష్, ఫ్రెంచి వలస రాజ్యాలవారు – కర్నాటకాన్ని తమ అధీనంలోకి తెచ్చుకొనడానికి ఈ యుద్ధాన్ని సాగించారు. ఫ్రెంచి అధీనంలో వున్న ప్రాంతాలన్నిటికీ ముఖ్యమైన పుదుచ్చేరినగ రాన్ని 1761 జనవరిలో ఆక్రమించుకున్న బ్రిటిష్‌వారు చిట్టచివరకు ఫ్రెంచివారిని పూర్తిగా ఓడించారు.

1756లో, బ్రిటిష్‌వారు సాగిస్తున్న దండయాత్రను నివారించడానికై, బెంగాల్ నవాబు బ్రిటిష్‌వారిపై యుద్ధం ప్రారంభించి, బ్రిటిష్‌వారి అధీనంలోవున్న ఈశాన్య ప్రాంతాలకు ప్రాతిపదిక స్థానమైన కలకత్తాను పట్టుకున్నాడు. కాని క్లైవ్ నాయకత్వాన వున్న ఈస్ట్ ఇండియా కంపెనీ సైనిక బలాలు కలకత్తాను తిరిగి

పట్టుకొని, బెంగాల్‌లో ఫ్రెంచివారు కట్టిన కోటలను ధ్వంసంచేసి, 1757 జూన్ 23న ప్లాసీయుద్ధంలో నవాబును ఓడించారు. కంపెనీవారు తమ సామంత రాజ్యంగా చేసుకున్న బెంగాల్‌లో 1763లో తిరుగుబాటు జరుగగా, కంపెనీవారు దానిని అణచివేశారు. బెంగాల్‌తోపాటుగా, బెంగాల్ నవాబు పరిపాలనకింద వున్న బీహార్‌ను కూడా ఇంగ్లీష్‌వారు ఆక్రమించుకున్నారు. అదివరకే తమ లోబరచుకొన్న స్థానిక ఫ్యూడల్ సంస్థానాలు అనేకంగా వున్నట్టి ఒరిస్సా రాష్ట్రాన్ని 1803లో కంపెనీ పూర్తిగా జయించివేసింది.

వెనుక మైసూర్‌లో బ్రిటిష్‌వారికి వ్యతిరేకంగా జరిగిన యుద్ధాల్లో వారికి వ్యతిరేకంగా యుద్ధం చేసినట్టి, బ్రిటిష్ వలసవిధానానికి గర్భశత్రువు అయినట్టి టిప్పు సాహెబు రాజ్యమైన మైసూర్‌పై 1790–1792లోనూ, 1799లోనూ ఈస్ట్ ఇండియా కంపెనీ యుద్ధం చేసింది. మొదటి యుద్ధంలో కంపెనీ, కంపెనీయొక్క మిత్రులైన ఫ్యూడల్ సంస్థానాధీశులూ మైసూర్ రాజ్యంలో సగం భాగాన్ని తమ వశంచేసుకోవడంవల్ల మైసూరు తన రాజ్యంలో అర్ధభాగం కోల్పోయింది. రెండవ యుద్ధంలో మైసూరుకి పూర్తిగా ఓటమి సంభవించి, యుద్ధంలో టిప్పు మరణించడంతో ఆ యుద్ధం ముగిసింది. మైసూర్ ఒక సామంత రాజ్యమైపోయింది.

సైన్యసహకార విధానం (subsidiary system), లేక సహకార ఒప్పందాలు అనబడే విధానం – ఇండియాలో వున్న స్వతంత్ర సంస్థానాధీశులను ఈస్ట్ ఇండియా కంపెనీకింద సామంతులనుగా మార్చివేయడానికై అవలంబించబడిన ఒక విధానం. ఈ ఒప్పందాలలో అత్యంత విస్తృతములైనవి, సంస్థానాధీశులు తమ రాజ్యాలలో కంపెనీయొక్క సైన్యాలను ఉంచుకొని వాటికయే ఖర్చులను భరించడానికి (ముజరా ఇవ్వడానికి) షరతులు కల్గిన ఒప్పందాలూ, బాధాకరములైన నిబంధనలకింద అప్పులను సంస్థానాధీశులపై రుద్దిన ఒప్పందాలూనూ. ఈ ఒప్పందాలను నెరవేర్చడంలో వైఫల్యం, సంస్థానాధీశుల రాజ్యాలను కంపెనీ జప్తుచేసి భుక్తంచేసుకోడానికి దారితీసింది. – 27.

15 ఆఫ్ఘనిస్థాన్‌ని ఆక్రమించుకునే ఉద్దేశ్యంతో బ్రిటిష్‌వారిచే ప్రారంభించబడినట్టి 1838–1842 మొదటి ఆంగ్లో-ఆఫ్ఘన్ యుద్ధం బ్రిటిష్ వలసవాదుల పూర్తి విఫలతతో అంతమైంది.

1843లో బ్రిటిష్ వలసవాదులు సింధు రాష్ట్రాన్ని ఆక్రమించుకున్నారు. 1838–1842 ఆంగ్లో-ఆఫ్ఘన్ యుద్ధకాలంలో, సింధు రాష్ట్ర ఫ్యూడల్ పరిపాలకులపై తమ తమ రాష్ట్రంగుండా బ్రిటిష్ సైనిక బలాలను వెళ్లనివ్వవలసిన

దిగా అనుమతించవలసిందని ఈస్ట్ ఇండియా కంపెనీ బెదరింపులకూ, బలాత్కారానికీ దిగింది. దీనిని సాకుగా తీసుకుని, స్థానిక ఫ్యూడల్ ప్రభువులు కంపెనీకింద సామంతులుగా ఉండేందుకు అంగీకరించుతూ ప్రకటించాలని వారిని 1843లో కంపెనీ నిర్బంధంగా కోరింది. తిరుగుబాటు చేసిన బలూచీ తెగలను అణచివేసిన తరువాత ఈ ప్రాంతమంతా బ్రిటిష్ ఇండియాలో కలిపివేయబడినట్టు కంపెనీ ప్రకటించింది.

1845–1846, 1848–1849లలో బ్రిటిష్‌వారు సిక్కులపై జరిపిన యుద్ధాలలో, బ్రిటిష్‌వారు పంజాబ్‌ను జయించారు. ఇండియాదేశపు ఫ్యూడల్ సంస్థానాధిపతులకూ, ఆఫ్ఘన్ దురాక్రమణదారులకూ వ్యతిరేకంగా 17వ శతాబ్దాంతంలో తలయెత్తిన రైతు ఉద్యమానికి, సిక్కుమతం బోధించే సమానత్వం (సనాతన హిందూ, మహమ్మదీయ మతాలు రెండింటినీ సమన్వయపరచడానికి వారు చేసిన యత్నం) భావజాలంగా ఏర్పడింది. కాలక్రమేణా, సిక్కులలోనుండి ఫ్యూడల్ బృందం ఒకటి వేరుపడి, ఈ బృందంయొక్క ప్రతినిధులు సిక్కు రాజ్యాధినేతలయారు. 19వ శతాబ్ది తొలియేళ్లలో, సిక్కు రాజ్యం పంజాబ్ అంతటిపైనా, ఇరుగుపొరుగునున్న అనేక ప్రాంతాలపైనా విస్తరించింది. 1845లో, సిక్కులతో తగవు పెంచుకొనేందుకై సిక్కు అగ్రవర్గాలవారిలో వున్న దేశద్రోహుల సహాయాన్ని బ్రిటిష్ వలసవాదులు సంపాదించుకుని, ఫలితంగా 1846లో సిక్కు రాజ్యాన్ని తమకింద సామంత రాజ్యంగా చేసుకోగల్గారు. 1848లో సిక్కులు తిరుగుబాటు చేశారు, కాని 1849లో బ్రిటిష్‌వారు సిక్కులను పూర్తిగా లొంగదీసారు. పంజాబ్‌ను జయించివేయడంతో ఇండియా యావత్తూ బ్రిటిష్ వలసరాజ్యంగా మారిపోయింది. – 28.

16 T. M.[un], "A Discourse of Trade, from England into the East-Indies: Answering to Diverse Objections Which Are Usually Made Against the Same," London, 1621. (టి. ఎమ్. [మన్], "ఇంగ్లండు ఈస్ట్ ఇండియాల మధ్య జరుగుతూన్న వర్తకంపై ఒక ప్రసంగం: దీనికి వ్యతిరేకంగా మామూలుగా చెప్పబడుతూన్న అభ్యంతరాలకు సమాధానాలు," లండన్, 1621.) – 29.

17 Josiah Child, "A Treatise Wherein Is Demonstrated I. That the East-India Trade Is the Most National of All Foreign Trades," London, 1681. ([జోసియా చైల్డ్], "విదేశ వర్తకాలన్నిటికంటె ఈస్ట్ ఇండియా వర్తకమే అత్యంత జాతీయమైనదనే విషయాన్ని నిరూపించుతూన్న ఒక

గ్రంథం," లండన్, 1681.) రచయిత φιλόπατρις (దేశభక్తుడు) అనే మారుపేరుతో పుస్తకాన్ని ప్రచురించాడు. – 29.

18 John Pollexfen, "England and East-India Inconsistent in Their Manufactures. Being an Answer to a Treatise, entitled, An Essay on the East-India Trade," London, 1697. (జాన్ పొల్లెక్స్‌ఫెన్, "ఇంగ్లండు ఇండియాల పరిశ్రమలలో ఉన్న అసంగతం. ఈస్ట్ ఇండియా వర్తకం అనే పేరుగల ఒక గ్రంథానికి సమాధానం," లండన్, 1697.) – 29.

19 బ్రిటిష్ వలసపాలకులు బర్మాను జయించడానికి 19వ శతాబ్ది ప్రారంభంలో మొదలు పెట్టారు. 1824–1826లో జరిగిన మొదటి బర్మా యుద్ధంలో ఈస్ట్ ఇండియా కంపెనీయొక్క సైనికబలాలు బెంగాల్ సరిహద్దునమున్న అస్సాం రాష్ట్రాన్ని, తీరప్రాంత జిల్లాలు అరకాన్, టెన్నాసెరిమ్‌లనూ ఆక్రమించుకున్నాయి. పెగూ రాష్ట్రం ఆక్రమించుకోడంతో రెండవ బర్మా యుద్ధం (1852) అంతమైంది. రెండవ బర్మా యుద్ధం అంతమయేసరికి సంధి ఏదీ జరగకపోవడంవల్లనూ, 1853 ఫిబ్రవరిలో రాజ్యానికొచ్చిన కొత్త బర్మారాజు పెగూ రాష్ట్ర ఆక్రమణను గుర్తింప నిరాకరించినందువల్లనూ 1853లో తిరిగి యుద్ధం ప్రారంభమవుతుందనే అనుకున్నారు. – 33.

20 J. Dickinson, "The Government of India under a Bureaucracy," London-Manchester, 1853, p. 50. (జె. డికిన్సన్, "ఉద్యోగివర్గ పరిపాలనకింద ఇండియా ప్రభుత్వం," లండన్-మాంచెస్టర్, 1853, పుట 50.) ఇండియా సంస్కరణ సమాజంవారి ప్రచురణ (India Reform), సంపుటి VI. – 33.

21 17వ శతాబ్ది మధ్యలో విదేశీయులైన మొగల్ ఫ్యూడల్ భూస్వామ్య ప్రభువుల ప్రాబల్యంపై మహారాష్ట్రులు సాయుధ పోరాటం సాగించి మొగల్ సామ్రాజ్యంపై గొప్ప దెబ్బ తీశారు; ఈ దెబ్బే సామ్రాజ్యపు పతనానికి దారితీసింది. ఈ పోరాటం ఫలితంగా స్వతంత్ర మహారాష్ట్ర రాజ్యం అవతరించి, ఈ రాజ్యానికి చెందిన ఫ్యూడల్ ప్రభువులు రాజ్యవిస్తరణ యుద్ధాలు చేయడం మొదలుపెట్టారు. ఫ్యూడల్ అంతఃకలహాల ఫలితంగా 17వ శతాబ్దాంతంలో మహారాష్ట్ర రాజ్యం బలహీనపడింది; కాని 18 శతాబ్ది ప్రారంభంలో పీష్వా ఆధిపత్యాన బలోపేతమైన మహారాష్ట్ర సంస్థానాల సమాఖ్య ఒకటి రూపొందింది. ఇండియాలో సార్వభౌమాధిపత్యానికై ఆఫ్ఘన్‌లతో మహా

రాష్ట్రాలు పోటీపడ్డారు; 1661లో మహారాష్ట్రులు స్వతంత్రరాజ్యం పొందారు. ఇండియాలో ప్రాబల్యానికై జరిపిన పోరాటాలవల్లనూ, ఫ్యూడల్ ప్రభువుల అంతఃకలహాలవల్లనూ మహారాష్ట్ర సంస్థానాలు విశేషంగా బలహీనపడిపోయిన ఫలితంగా, ఈస్ట్ ఇండియా కంపెనీ విజృంభణకు వారు నిలబడలేకపోయారు; 1803–1805లో జరిగిన ఆంగ్లో మహారాష్ట్ర యుద్ధంలో వీరిని కంపెనీ ఓడించి లొంగదీసేసుకుంది. – 34.

[22] జమీందారీ, రైత్వారీ పద్ధతులు – 18వ శతాబ్దాంతంలోనూ, 19వ శతాబ్దారంభంలోనూ బ్రిటిష్ అధికారులు ఇండియాలో ప్రవేశపెట్టిన పద్ధతులు. మొగల్ పాదుషాల కింద, పీడితులైన రైతాంగంనుండి తాను వసూలు చేసిన శిస్తులలో కొంత నిర్ణీత భాగాన్ని ప్రభుత్వానికి చెల్లించివేస్తున్నంత కాలమూ వంశపారంపర్య భూస్వామ్యపు హక్కును అనుభవించుతూన్న జమీందారునే, 1793 శాశ్వత జమీందారీ శాసనం భూశామందుగా చేసింది; దీని ఫలితంగా జమీందారులు బ్రిటిష్ వలసాధికారుల వర్గసహాయకులుగా తయారయారు. బ్రిటిష్‌వారు ఇండియాలో తమ పరిపాలనను విస్తరించినకొద్దీ, జమీందారీ విధానాన్ని కొద్ది మార్పులతో బెంగాల్, బీహార్, ఒరిస్సాలకేకాకుండా, సంయుక్త, మధ్య రాష్ట్రాలకూ, మద్రాసు రాష్ట్రంలో ఒక భాగానికీ వర్తింపజేశారు. ఈ పద్ధతిని ప్రవేశపెట్టిన ప్రాంతాల్లో, ఇంతవరకూ గ్రామ సంఘంలో సమాన ప్రతిపత్తిని గలిగిన రైతులు ఇప్పుడు జమీందారుకింద కౌలుదార్లుగా మారిపోయారు. 19వ శతాబ్దారంభంలో మద్రాసు, బొంబాయి రాష్ట్రాలలో ప్రవేశపెట్టిన రైత్వారీ పద్ధతిననుసరించి, రైతులు ప్రభుత్వ భూమిని సాగుచేసే పట్టాదార్లుగా చేయబడి, బ్రిటిషు పరిపాలనాధికారులచే నిరంకుశంగా నిర్ణయించబడిన శిస్తునన్నును తాము సాగుచేస్తూన్న భూములపై చెల్లించాల్సినవారయారు. అదేసమయంలో, రైతులు తాము కౌలుకుతీసుకున్న భూములకు సొంతదార్లని ప్రకటించబడ్డారు. న్యాయశాస్త్ర దృష్ట్యా పరస్పర విరుద్ధంగా వున్న ఈ భూమి పన్ను పద్ధతి ఫలితంగా, భూమి పన్ను ఎంత అధికంగా హెచ్చించబడిందంటే, ఇక రైతులు చెల్లించుకోలేని స్థితిలో పడిపోయారు. ఇందువల్ల రైతులు బకాయిలు పడిపోగా, వారి భూములు అధికలాభాలు సంపాదించేవారి చేతుల్లోకీ, అధికవడ్డీ వ్యాపారుల చేతుల్లోకీ క్రమేణా వెళ్లిపోయాయి. – 35.

[23] J. Chapman, "The Cotton and Commerce of India, Considered in Relation to the Interests of Great Britain; with Remarks on

Railway Communication in the Bombay Presidency," London, 1951 p. 91. (జె. చాప్‌మన్, "ఇండియా పత్తి, వాణిజ్యం; గ్రేట్ బ్రిటన్ ప్రయోజనాల దృష్ట్యా వీటి పరిగణన, దీనితోపాటు బొంబాయి ప్రాన్తంలో రైల్వే రవాణ మార్గంపై వ్యాఖ్యలు," లండన్, 1851, పుట 91.) – 38.

24 G. Campbell, "Modern India: A Sketch of the System of Civil Government," London, 1852, pp. 59—60. (జి. కాంబెల్, "ఆధునిక ఇండియా: సివిల్ పరిపాలనావిధాన సంగ్రహచిత్రణ," లండన్, 1852, పుటలు 59–60.) – 39.

25 1857లో మార్క్స్ తన నోటుబుక్కులో రాసుకున్నదానిని అనుసరించేవుంది ఈ శీర్షిక. – 42.

26 ఆనాటికి అమలులోవున్న ఒడంబడికలను ఉల్లంఘించుతూ, 1856లో బ్రిటిష్ అధికార్లు అయోధ్య రాజును సింహాసనచ్యుతుని చేసి, అయోధ్యను ఈస్ట్ ఇండియా కంపెనీ రాజ్యంలో కలిపివేసిన విషయానికి ఇక్కడ ప్రస్తావన. (చూ. ఈ సంకలనంలో పుటలు 169–176.) – 42.

27 19వ శతాబ్ది మధ్యకాలంలో బ్రిటన్ ఆసియాలో అవలంబించిన దురాక్రమణ వలసవిధానంలో ఒక ప్రధానాంశంగా ఏర్పడిన 1856–1857 ఆంగ్లో-పర్షియా యుద్ధానికి ప్రస్తావనిది. హీరట్ సంస్థానాన్ని పట్టుకోడానికి పర్షియా పాలకులు చేసిన ప్రయత్నం ఈ యుద్ధానికి సాకుగా ఏర్పడింది. దీనికి ముఖ్యసట్నమైన హీరట్ వాణిజ్య వ్యాపారాలకి కూడలిస్థానమై, యుద్ధవ్యూహాలదృష్ట్యా కీలకస్థానం వహించుతూండిన కారణంగా, 19వ శతాబ్ది మధ్యకాలంనుండి ఈ నగరం, రష్యా సహాయాన్ని పొందిన పర్షియాకూ, ఇంగ్లీష్‌వారిచే పురికొల్పబడిన ఆఫ్ఘనిస్థాన్‌కీ వివాదకారణమైంది. 1856 అక్టోబరులో పర్షియా సైనికబలాలు హీరట్‌ను పట్టుకోవడంలో, ఆఫ్ఘని స్థాన్ పర్షియాలు రెండింటినీ లొంగదీసుకోడానికి దీనిని చక్కని మిషగా ఉపయోగించుకుని, బ్రిటిష్ వలసవాదులు సాయుధ జోక్యంకలిగించుకున్నారు. పర్షియాపై యుద్ధాన్ని ప్రకటించి, బ్రిటిష్‌వారు తమ సైన్యాన్ని హీరట్‌కి పంపించారు. కాని, ఈ కాలంలోనే ప్రజ్వరిల్లిన 1857–1859 జాతీయ విముక్తి తిరుగుబాటువల్ల, బ్రిటిష్‌వారికి తొందర తొందరగా సంధి చేసుకోక తప్పిందికాదు. 1857 మార్చిలో,

పారిస్‌లో జరిగిన సంధి ప్రకారం హీరట్‌పై అన్ని హక్కులనూ వదులుకున్నట్టు పర్షియా ప్రకటించింది. 1863లో ఆఫ్ఘన్ అమీర్ రాజ్యంలో ఒక భాగంగా హీరట్ కలిపివేయబడింది. — 43.

28 1857–1859 తిరుగుబాటు — బ్రిటిష్ పరిపాలనపై ఇండియా ప్రజలు లేవదీసిన ప్రధాన జాతీయ విముక్తి తిరుగుబాటు. ఈ తిరుగుబాటు ప్రారంభమయేముందు బ్రిటిష్ వలసవాదులతో అనేక సాయుధ సంఘర్షణలు జరగగా, పాశవికమైన వలస పరిపాలనా పీడన విధానాల ఫలితంగా — భారతదేశపు రైతాంగాన్ని నిలువునా దోపిడీ చేయడంతో, అందుకు ఏమాత్రమూ తీసిపోని అత్యధికమైన శిస్తు భారాన్ని రైతాంగంపై విధించడమూ, ఫ్యూడల్ ప్రభువులలో కొన్ని తరగతుల ఆస్తి హక్కులను భుక్తం చేసుకోవడమూ; స్వతంత్ర సంస్థానాలలో ఇంకా మిగిలిపోయినవాటిని కలిపేసుకునే విధానమూ; పన్నులను బలవంతంగా వసూలుచేయడంలో అవలంబించబడిన చిత్రహింసల విధానమూ, వలసవిధాన హింసాకాండా; అనుశ్రుతంగా వస్తూ ప్రజలచే మన్నింపబడుతూన్న సంప్రదాయాలనూ, ఆచారాలనూ వలసవాదులు నిర్లక్ష్యంచేసి కాలరాయడమూ — కారణంగా ఇండియా ప్రజలలో అన్ని తరగతులవారిలోనూ సర్వ సామాన్యంగా ఆగ్రహావేశాలు రగుల్కొవడంవల్ల ఈ తిరుగుబాటు ప్రజ్వరిల్లింది. ఉత్తర ఇండియాలో ఉంచబడిన బెంగాల్ సైన్యం సిపాయి రెజిమెంట్లలో 1857 వసంతకాలంలో (తిరుగుబాటుకు సన్నాహాలు 1856 శీతాకాలంలోనే ప్రారంభమయాయి) తిరుగుబాటు తలయెత్తింది. (18వ శతాబ్ది మధ్యనుండి దేశీయ ప్రజలనుండి ఆంగ్లో-ఇండియన్ సైన్యంలో చేర్చుకోబడిన కిరాయి సైనికులను సిపాయిలంటారు. ఇండియాను జయించడానికీ, జయించిన రాష్ట్రాలలో తమ అధికారాన్ని నిలబెట్టుకోడానికీ, ఇంగ్లీషు దండయాత్రికులు వీరిని ఉపయోగించుకున్నారు.) ఈ ప్రాంతంలోవున్న కీలకస్థానాలు సిపాయిల చేతులలో వుండి, శతఘ్నులలో విశేషభాగం వారి ఖాయిదాకిందనే వుండేవి. ఈ కారణంవల్ల, తిరుగుబాటుకు సైనికంగా వీరు మూలకందమయ్యారు. ప్రధానంగా హిందూ అగ్రవర్ణాలనుండీ (బ్రాహ్మణులు, రాజపుత్రులు వగైరా), మహమ్మదీయులనుండీ ఈ సిపాయి సేవభర్తీ అయినందువల్ల, ఇండియా రైతాంగంలోనూ — సాధారణ సిపాయిలలో అత్యధిక భాగం రైతాంగానికి చెందినవారే — సిపాయి ఆఫీసర్లతో దగ్గర సంబంధాలు కల్గివున్న ఉత్తర ఇండియా (ముఖ్యంగా అయోధ్య) ఫ్యూడల్ కులీనవంశస్థులలోనూ ప్రబలివున్న అసంతృప్తిని ఇది ప్రతిబింబించింది. విదేశీయ పరిపాలనను కూలదోసే లక్ష్యాన్ని కలిగిన ఈ ప్రజాతిరుగుబాటు ఉత్తర, మధ్య ఇండియాలో విస్తృత ప్రాంతాలకు — ముఖ్యంగా ఢిల్లీ,

లక్నో, కాన్పూర్, రోహిల్‌ఖండ్, మధ్య ఇండియా, బుందేల్‌ఖండ్‌లకు — వ్యాపించింది. ఈ తిరుగుబాటుకు, రైతాంగమూ, పట్నాలలో చేతివృత్తులను అవలంబించుతూన్న పేదప్రజే ప్రధాన చోదక శక్తి, కాని నాయకత్వం మాత్రం ఫ్యూడల్ ప్రభువుల చేతిలోనే వుంది; 1858లో వీరి ఆస్తులను పూర్తిగా వాపసు ఇచ్చేస్తామని వలస పరిపాలనాధికారులు వాగ్దానం చేసేసరికి, వీరిలో అందరూ ప్రజా తిరుగుబాటుకు ద్రోహం చేసి శత్రుపక్షం చేరిపోయారు. తిరుగుబాటు ఓటమికి ఇండియాయొక్క ఫ్యూడల్ అనైక్యత, ఇండియాలోవున్న జాతి వ్యత్యాసాలు, జనాభాలో సంఘీభావం లేకపోవడం, ఇండియాలో కులమత భేదాలవల్ల ఏర్పడిన ఏకైక నాయకత్వరాహిత్యమూ, ఏకైక యుద్ధవ్యూహ పథక లోపమూ, ఇవే ప్రధానకారణాలు. ఈ పరిస్థితులను ఇంగ్లీషు వారు పూర్తిగా ఉపయోగించుకున్నారు. ఇంతేకాకుండా, తిరుగుబాటును అణచివేయడంలో ఇండియా ఫ్యూడల్ సంస్థానాధీశులలో అత్యధికభాగంయొక్క సహాయం కూడా ఇంగ్లీషు వారికి లభించింది. ఇంగ్లీషువారికున్న గణనీయమైన సైనిక సాంకేతిక ఆధిక్యత మరొక ప్రబలకారణమైంది. ఈ తిరుగుబాటు ఇండియాలో కొన్ని భాగాలకు నేరుగా వ్యాపించనప్పటికీ (పంజాబ్, బెంగాల్, దక్షిణ ఇండియాలకు తిరుగుబాటు వ్యాపించకుండా ఇంగ్లీషువారు చూసుకున్నారు), మొత్తం ఇండియా అంతటిపైనా దాని ప్రభావం వ్యాపించి, బ్రిటిష్‌వారికి దేశపరిపాలనా విధానంలో సంస్కరణలను ప్రవేశపెట్టక తప్పింది కాదు. ఇతర ఆసియా దేశాలలో వున్న జాతీయ విముక్తి ఉద్యమంతో సన్నిహితసంబంధాలను కలిగివుండిన ఇండియా తిరుగుబాటు, ఇంగ్లీష్ వలసవాదుల స్థానాలను బలహీనపరచింది. ప్రత్యేకించి, ఆఫ్ఘనిస్థాన్, పర్షియా, ఇంకా ఇతర ఆసియా దేశాలపట్ల తాము వేసుకున్న దురాక్రమణ పథకాలను వారు కొన్ని దశాబ్దాలవరకూ ఆచరణలో పెట్టకుండా ఉండేందుకు ఈ తిరుగుబాటు కారణమైంది. — 43.

20 1856–1858లో చైనాతో జరిగిన రెండవ నల్లమందు యుద్ధమనబడే దాన్ని గురించి రచయిత ప్రస్తావిస్తున్నారు. 1856 అక్టోబరులో బ్రిటిష్‌వారు కాన్‌టన్‌లో చైనా అధికార్లతో మిథ్యాకారణాన్ని సృష్టించి కవ్వింపు చర్యనొకదానిని జరిపి, దీనిని యుద్ధానికి సాకుగా తీసుకున్నారు. నల్లమందును దొంగతనంగా ఎక్కించుకుని బ్రిటిష్ జెండాతో ప్రయాణంచేస్తూన్న "ఏరో" అనే పేరుగల చైనా నౌక సిబ్బందిని చైనా అధికార్లు అరెస్టుచేయడం ఈ యుద్ధానికి కారణమైంది. 1858 జూన్‌వరకూ అప్పటప్పట చైనాలో సంఘర్షణలు జరిగి, దురాక్రమణ పూరితమైన టియంట్సిన్ సంధితో ఈ యుద్ధం అంతమైంది. — 43.

30 సెయింట్ విలియమ్ కోట – 1696లో కలకత్తాలో ఇంగ్లీషువారు నిర్మించిన కోట. అప్పటి ఇంగ్లండు రాజా అయిన మూడవ విలియమ్, ప్రిన్స్ ఆఫ్ ఆరెంజ్ పేరును బట్టి దానికి ఆ పేరు వచ్చింది. 1757లో ఇంగ్లీషువాళ్లు బెంగాల్ రాష్ట్రాన్ని ఆక్రమించుకున్న తర్వాత ఈ కోటలో ప్రభుత్వ భవనాలు వుండేవి. "బెంగాల్ రాష్ట్ర ప్రభుత్వానికీ," ఆ తర్వాత "ఇండియాలో ఇంగ్లీషు ప్రభుత్వానికీ" ఈ కోట పర్యాయ పదం అయింది. – 45.

31 "The Times" – ఇంగ్లీషు కన్సర్వేటివ్ దినపత్రికలన్నిటిలోనూ ఒక పెద్ద పత్రిక. లండన్‌లో 1785లో స్థాపించబడింది. – 49.

32 ద్వీపకల్ప యుద్ధం 1808–1814లో ఐబీరియన్ ద్వీపకల్పంలోని స్పెయిన్, పోర్చుగల్ దేశాలలో బ్రిటన్ ఫ్రాన్సుల మధ్య జరిగింది. అదే సమయంలో ద్వీపకల్పం అంతటిలోనూ తమ స్వతంత్రం కోసమై స్పెయిన్, పోర్చుగల్ దేశస్థులు ఫ్రెంచి ఆక్రమణదారులతో యుద్ధంచేశారు. నెపోలియన్ వేసుకున్న రాజకీయ, సైనిక పథకాలు వమ్ముపోవడానికి స్పానిష్ ప్రజల పోరాటం చాలా సహాయపడింది; 1812లో తన సేన రష్యాలో నాశనమవడంతో నెపోలియన్‌కి తన సైనికబలాలను స్పెయిన్‌నుండి వెనకకు మళ్లించక తప్పిందికాదు. – 50.

33 పార్లమెంటు ఎండాకాలం సమావేశంలో బ్రిటిష్ కామన్స్ సభ సభ్యులు తమ పార్లమెంటు విధులను నెరవేర్చడానికి బదులు సాధారణంగా తమ సొంత పనులు చూసుకుంటూనో క్రీడావినోదాలకోసమో తమ కాలం గడుపుతూంటారనే విషయాన్ని రచయిత గుర్తుచేస్తున్నాడనడం స్పష్టం. ఈ కారణంచేత వక్తలు తరుచు ఇంచుమించు ఖాళీ సభా మందిరంలో ఉపన్యసించాల్సివస్తూండేది. – 52.

34 Montesquieu, "Considérations sur les causes de la grandeur der Romains et de leur décadence" (మంటెస్క్యూ, "రోమ్ ఔన్నత్యానికీ, పతనానికీగల కారణాలను గురించి పర్యాలోచనలు") గూర్చి (దీని మొదటి కూర్పు గ్రంథకర్త పేరులేకుండా ఆమ్‌స్టర్‌డామ్‌లో 1734లో ప్రచురించబడింది), Gibbon, "The History of the Decline and Fall of the Roman Empire" (గిబ్బన్, "రోమను సామ్రాజ్య పతనాస్తమయాల చరిత్ర") గూర్చి (దీని మొదటి

కూర్పు లండన్‌లో 1776–1788లో ప్రచురించబడింది) రచయిత చెబుతున్నాడు. – 53.

35 ఇంగ్లండులో పెద్ద భూస్వామ్య, ఫైనాన్‌షియల్ ప్రభువర్గ పక్షమైన టోరీల గురించి రచయిత ప్రస్తావిస్తున్నాడు. 17వ శతాబ్దిలో స్థాపితమైన టోరీ పార్టీ, అభివృద్ధి నిరోధకమైన ఆంతరంగిక విధానాలను ఎల్లప్పుడూ సమర్థించుతూ, బ్రిటనుయొక్క పరిపాలనా విధానంలో కాలంచెల్లిన అన్ని సనాతన సంస్థలనూ వెనుకవేసుకొచ్చింది, ప్రజాస్వామిక మార్పుల నన్నింటినీ ప్రతిఘటించింది. ఇంగ్లండులో పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి కావడంతో, వెనుక తమకుండిన రాజకీయ ప్రభావాన్నీ, పార్లమెంటులో తమకుండిన గుత్తాధిపత్యాన్నీ టోరీలు కోల్పోయారు. పారిశ్రామిక బూర్జువావర్గ ప్రతినిధులు పార్లమెంటులో ప్రవేశించేందుకు మార్గాన్ని సుగమంచేసిన 1832 సంస్కరణ ఈ గుత్తాధిపత్యంపై మొదటి దెబ్బ తీసింది. భూస్వాములకు లాభకరంగా వుండినట్టి "కారన్ లాస్" ("ధాన్యవ్యాపారంపై చట్టాలు") రద్దుచెయ్యబడడంతో, పురాతన ఇంగ్లీషు భూస్వామ్య ప్రభువర్గం ఆర్థికంగా బలహీనపడి, పార్టీలో చీలిక ఏర్పడింది. 1850ల మధ్యసంవత్సరాలలో టోరీ పార్టీ క్షీణించడం ఆరంభించింది. ఈ పార్టీయొక్క వర్గసంపుటి మారిపోయి, పెట్టుబడిదారీ ప్రముఖులతో భూస్వామ్య ప్రభువర్గ సమ్మేళనాన్ని ప్రతిబింబించింది. ఈవిధంగా 1850 చివరి, 1860 తొలిసంవత్సరాలలో పాత టోరీ పార్టీనుండి ఇంగ్లీషు కన్సర్వేటివ్ పార్టీ ప్రాదుర్భవించింది. – 54.

36 1773వరకూ ఇండియాలో ఈస్ట్ ఇండియా కంపెనీకి ముగ్గురు గవర్నర్లు – కలకత్తాలో (బెంగాల్), మద్రాసు, బొంబాయిలలో – ఉంటూండేవారు. ప్రతి గవర్నరుకూ కంపెనీ సీనియర్ ఉద్యోగులతో ఏర్పడిన కౌన్సిలు ఒకటి ఉండేది. 1773 రెగ్యులేటింగ్ శాసనాన్ని అనుసరించి, కలకత్తా గవర్నర్‌కింద, ఇతనికి బెంగాల్ గవర్నర్ జనరల్ అనే బిరుదు ఇవ్వబడింది, నలుగురు సభ్యులుగల కౌన్సిల్ ఏర్పాటు చేశారు. గవర్నర్ జనరల్‌నీ, అతని కౌన్సిల్ సభ్యులనూ వెనకటిలాగు కంపెనీ నియమించకుండా, ఇక మీదటనుండి విధిగా బ్రిటిష్ ప్రభుత్వమే ఐదు సంవత్సరాల కాలపరిమితికి నియమించి, కంపెనీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ రాజాకి విజ్ఞప్తిచేసినపైనే, ఐదేళ్లకాలం పూర్తికాకముందు బర్తరఫుచేయడానికి రాజాకు అధికారం కలిగింది. అత్యధికసంఖ్యాకవర్గంయొక్క అభిప్రాయాన్ని కౌన్సిల్ విధిగా పాటించాల్సి వుండేది. అభిప్రాయాలు సమానంగా వున్నప్పుడు గవర్నర్ జనరల్ అభిప్రాయమే నెగ్గేది. బెంగాల్, బీహార్, ఒరిస్సాలయొక్క

సివిల్, మిలిటరీ పరిపాలనా, యుద్ధము శాంతి విషయాలలో తనకు లోబడివున్న మద్రాసు, బొంబాయి రాష్ట్రాలపై సంపూర్ణమైన అజమాయిషీ అధికారమూ, గవర్నర్ జనరల్‌యొక్క విధులు. కొన్ని ప్రత్యేక పరిస్థితులలోనే మద్రాసు, బొంబాయి గవర్నర్లకు తమ సొంత పూచీపై వ్యవహరించగలిగే అధికారం ఉండేది. 1784 శాసనాన్ననుసరించి బెంగాల్ కౌన్సిలులో సభ్యుల సంఖ్య మూడింటికి తగ్గించేయబడి, ఈ ముగ్గురిలోనూ సర్వసేనాధిపతి ఒకడుగా ఉండాలని నియమించబడింది. 1786 అనుబంధశాసనాన్ని అనుసరించి కొన్ని అత్యవసర పరిస్థితులలో కౌన్సిలు ప్రసక్తి లేకుండానే వ్యవహరించగలిగే హక్కు, సర్వసేనాధిపతి విధులను నిర్వహించే హక్కు గవర్నర్ జనరల్‌కు సంక్రమించాయి. 1833 శాసనం ప్రకారం బెంగాల్ గవర్నర్ జనరల్‌ని ఇండియా గవర్నర్ జనరల్‌గా నియమించారు; వెనకటి బెంగాల్ గవర్నర్ పదవి మాత్రం అతను నిర్వహించవలసే ఉండేది. కౌన్సిల్ సభ్యుల సంఖ్య తిరిగి నాల్గుకు హెచ్చించబడి, సర్వసేనాధిపతి ఐదవ సభ్యుడుగా ఉండే అవకాశం కూడా సృష్టించబడింది. బ్రిటిష్ ఇండియా అంతటికీ శాసనాలు చేసే అధికారం గవర్నర్ జనరల్‌కీ, అతని కౌన్సిలుకీ సంక్రమించింది. శాసనాలు చేయడంలో బొంబాయి, మద్రాసు ప్రభుత్వాలకు ఇదివరకు ఉండిన అధికారం ఇప్పుడు పోయింది. వీరి కౌన్సిలులో సభ్యులు ఇద్దరు. 1853 శాసనాన్ననుసరించి, కార్యనిర్వాహకవర్గ విధులను కలిగిన నాల్గురు సభ్యులున్న కౌన్సిలుకు అదనంగా సహాయం చేసేందుకై గవర్నర్ జనరల్, సర్వసేనాధిపతి, లార్డ్ చీఫ్ జస్టిస్ ఆఫ్ బెంగాల్, అతని కిందవున్న ముగ్గురు జడ్జీలలో ఒకరు, వీరందరూ కలిసి ఏర్పడిన కౌన్సిల్ ఒకటి నియమించబడింది. గవర్నర్ జనరల్ కౌన్సిల్లో చేసిన ఈ శాసనం 1858వరకు అమలులో వుంది.

ఇక్కడ పేర్కొనబడినది గవర్నర్ జనరల్ లార్డ్ డల్‌హౌసీ కిందవున్న సలహా సంఘం. — 55.

37 1857లో మార్క్స్ తన నోటుబుక్కులో రాసుకున్నదాని ననుసరించే వుంది ఈ శీర్షిక. — 59.

38 ఈస్ట్ ఇండియా కంపెనీ, బ్రిటన్‌కి ఇండియాలో వున్న రాజ్యాలనూ మరింత చక్కగా పరిపాలించేందుకై చేయబడిన 1784 శాసనంకింద "<u>బోర్డ్ ఆఫ్ కంట్రోల్</u>" నియమించబడింది. ప్రీవీ కౌన్సిల్ సభ్యులలోనుండి రాజాగారిచే నియమించబడిన ఆర్గురు సభ్యులు కలిసి ఈ బోర్డ్ ఆఫ్ కంట్రోల్ ఏర్పడింది. బోర్డ్ ఆఫ్ కంట్రోల్ అధ్యక్షుడు మంత్రి మండలిలో సభ్యుడుగా ఉండి, వాస్తవంగా సెక్రటరీ ఆఫ్ స్టేట్

నర్ ఇండియాగానూ, ఇండియా సార్వభౌమ పరిపాలకుడుగానూ వ్యవహరించేవాడు. లండన్‌లో సమావేశమయే బోర్డ్ ఆఫ్ కంట్రోల్ చేసే తీర్మానాలన్నీ, ఈస్ట్ ఇండియా కంపెనీ డైరెక్టర్లలో ముగ్గురితో ఏర్పాటు కాబడిన సీక్రెట్ కమిటీ [రహస్య సమితి] ద్వారా ఇండియాకు పంపబడేవి. ఈవిధంగా 1784 శాసనం ఇండియా పరిపాలనలో ఒక ద్వంద్వ ప్రభుత్వాన్ని – బోర్డ్ ఆఫ్ కంట్రోల్ (బ్రిటిష్ ప్రభుత్వం), బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ (ఈస్ట్ ఇండియా కంపెనీ) – స్థాపించింది. 1858లో బోర్డ్ ఆఫ్ కంట్రోల్ రద్దయిపోయింది. – 59.

39 1854 అక్టోబరు మొదటి రోజుల్లో సెవస్తొపోల్‌ను మిత్రరాజ్యాలవారు పట్టుకున్నారని పారిస్‌లో పుకార్లు లేవదీశారు. ఫ్రాన్సు, బ్రిటన్, బెల్జియమ్, జర్మనీలలోని అధికార వార్తాపత్రికలు ఈ దొంగఖబురును ప్రచురించాయి. కాని కొద్దిరోజుల తరువాత ఈ వార్త అసత్యమని వాటికి ఒప్పుకోక తప్పిందికాదు. – 63.

40 "The Bombay Times" – 1838లో బొంబాయిలో స్థాపించబడిన ఇంగ్లీషు వార్తాపత్రిక. – 63.

41 "The Press" – 1853నుండి 1866వరకూ లండన్‌లో ప్రచురించబడిన టోరీ వార్తా పత్రిక. – 65.

42 "Le Pays" – 1849లో పారిస్‌లో స్థాపించబడిన ఫ్రెంచి దినపత్రిక. రెండవ సామ్రాజ్య కాలంలో (1852–1870), మూడవ నెపోలియన్ ప్రభుత్వంయొక్క అనధికారపత్రికగా ఉండేది; ఈ పత్రికకు "Journal de L'Empire" ("సామ్రాజ్య పత్రిక") అనే ఉపశీర్షిక కూడా ఉండేది. – 65.

43 "The Morning Post" – 1772–1937లో లండన్‌లో ప్రచురించబడిన ఇంగ్లీషు కన్సర్వేటివ్ దినపత్రిక. 19వ శతాబ్ది మధ్యసంవత్సరాలలో పామర్‌స్టన్ అనుయాయులైన కుడిపక్షపు విగ్గు సభ్యుల పత్రికగా ఇది ఉంటూండేది. – 70.

44 సారగోస్సా – స్పెయిన్‌లో ఎబ్రో నదీతీరాన వున్న నగరం. ద్వీపకల్పపు యుద్ధంలో, 1808–1809లో ఫ్రెంచి సేనలు ఈ నగరాన్ని ముట్టడించగా, ఈ నగరం వీరోచితంగా ప్రతిఘటించింది. (చూ. 32వ వివరణ.) – 75.

[45] డాన్యూబ్ తగాదా అంటే, 1856 పారిస్ కాంగ్రెస్‌లో జరిగిన దౌత్యవర్గపు ఘర్షణ, ఇక ఆటుతర్వాత, అప్పట్లో టర్కీ పరిపాలన కింద వున్న డాన్యూబ్ రాష్ట్రాలైన మోల్దావియా, వల్లాషియాల విలీనీకరణ సమస్యపై జరిగిన ఘర్షణ అని మార్క్స్ ఉద్దేశ్యం. వీటికి రాజులుగా బోనపార్ట్ వంశంవారిని నియమించడానికి వీలుంటుందనే ఆశతో, యూరప్‌ను పరిపాలించుతూన్న రాజవంశాలలోని వారినెవరినైనా రాజుగా ఏర్పరచి, అతనికింద వీటిని రుమేనియా రాజ్యంగా విలీనీకరణచేయవచ్చునని ఫ్రాన్సు సూచించింది. ఫ్రాన్సును రష్యా, ప్రష్యా, సార్డీనియాలు బలపర్చాయి. రుమేనియా రాజ్యం ఆటోమన్ సామ్రాజ్యాధిపత్యాన్ని ధిక్కరించి ఎక్కడ స్వతంత్రమైపోతుందోనన్న భయంతో, టర్కీ ఈ విలీనీకరణను వ్యతిరేకించింది. టర్కీని ఆస్ట్రియా, బ్రిటన్‌లు బలపర్చాయి. చివరకు స్థానిక శాసనసభలైన "దివాన్"లకు ఎన్నికలు జరపడంద్వారా రుమేనియన్ ప్రజాభిప్రాయాన్ని తెలుసుకోడం అవసరమని కాంగ్రెస్ అంగీకరించింది. ఎన్నికలు జరిగాయి; కాని కొన్ని అసత్యాలను ప్రచారంచేయడంవల్ల మోల్దావియా దివాన్‌కు జరిగిన ఎన్నికలలో విలీనీకరణ వ్యతిరేకులకే విజయం లభించింది. దీనిపట్ల ఫ్రాన్సు, రష్యా, ప్రష్యా, సార్డీనియాలు తమ ఆక్షేపణ తెలియజేసి, ఎన్నికలను రద్దుపరచాలని డిమాండు చేశాయి. టర్కీ తన ప్రత్యుత్తరం ఇవ్వడంలో జాప్యంచేసింది; అందుపైన ఈ రాజ్యాలన్నీ 1857 ఆగస్టులో టర్కీతో తమ దౌత్యసంబంధాలను తెగతెంపులు చేసుకున్నాయి. మూడవ నెపోలియన్ మధ్యవర్తిత్వం వహించి, ఈ ఫ్రెంచి పథకంవల్ల, ఫ్రాన్సు బ్రిటన్లు రెంటికీ లాభంకలుగుతుందని బ్రిటిష్ ప్రభుత్వాన్ని ఒప్పించడం మూలంగా ఈ తగాదా పరిష్కారమైంది. ఆ రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికలను రద్దు చేశారే గాని, కొత్త ఎన్నికలవల్ల తగాదా పరిష్కారంకాలేదు. రెండు రాష్ట్రాలనూ ఐక్యంచేయడమనే సమస్యను రుమేనియా ప్రజలు తమంతట తామే 1859లో పరిష్కరించుకోడంతో ఈ తగాదా పరిష్కారమైంది. — 76.

[46] జర్మన్ డచీలైన ష్లెస్విగ్, హోల్‌స్టయిన్‌లు కొన్ని శతాబ్దాలుగా డెన్మార్క్ రాజు పరిపాలనకింద ఉండేవి. డెన్మార్క్ రాచరికానికి ఎట్టి భంగమూ వాటిల్లకుండా హామీ నిస్తూ జరిగిన లండన్ సంధి పత్రంపై 1852 మే 8న రష్యా, ఆస్ట్రియా, బ్రిటన్, ఫ్రాన్సు, ప్రష్యా, స్వీడన్‌ల ప్రతినిధులూ, వీరితోపాటు డెన్మార్క్ ప్రతినిధులూ సంతకంచేశారు; ఈ రెండు డచీలకూ స్వయం పరిపాలన హక్కును ఈ సంధి గుర్తించింది కాని, అదే సమయంలో ఈ రెండు డచీలపై డెన్మార్క్ రాజుయొక్క సార్వభౌమత్వాన్ని మాత్రం పరిరక్షించింది. అయినప్పటికీ, ఈ సంధి షరతులకు విరుద్ధంగా, డెన్మార్క్ పరిపాలనకింద వున్న ఈ జర్మన్ డచీలకున్న స్వాతంత్ర్యాన్నీ, స్వయంపరిపాలన హక్కునూ

రద్దుచేస్తూ ఒక రాజ్యాంగచట్టాన్ని డెన్మార్క్ ప్రభుత్వం 1855లో ప్రకటించింది. దీనికి ప్రతీకారచర్యగా, ఈ డచీలో రాజ్యాంగచట్టాన్ని అమలుజరపడంవల్ల తన అధిక్షేపణ తెలియజేస్తూ జర్మనీ పార్లమెంటు 1857 ఫిబ్రవరిలో ఒక ఉత్తరువును ప్రకటించింది; కాని పొరపాటువల్ల ఆ ఉత్తరువులో ఒక్క హోల్‌స్టయిన్, లావెన్‌బుర్గ్ (డెన్మార్క్ పరిపాలనకింద వున్న మూడవ జర్మన్ డచీ) పేర్లనే పేర్కొని, ష్లెస్‌విగ్ పేరును పేర్కొనడం మర్చిపోయింది. ఈ పొరపాటును సాకుగా తీసుకొని ష్లెస్‌విగ్‌ను తన రాజ్యంలో కలిపేసుకోవడానికి డెన్మార్క్ చర్యలను తీసుకోవడం ఆరంభించింది. దీనితో హోల్‌స్టయిన్‌తో విడిపోడానికి ఇష్టంలేని ష్లెస్‌విగ్ ప్రజలే కాకుండా, ప్రష్యా, ఆస్ట్రియా, బ్రిటన్‌లు కూడా, డెన్మార్క్‌యొక్క చర్య లండన్ సంధి షరతులకు వ్యతిరేకమని, అధిక్షేపించాయి. – 77.

[47] మార్క్స్ తన 1857లో నోటుబుక్కులో రాసుకొన్నదాని ప్రకారం, "ఇండియాలో జరిగిన చిత్రహింసలపై దర్యాప్తు" అనే వ్యాసం, ఆగస్టు 28న రాయబడింది; కాని మరే కారణంచేతనో, "New-York Daily Tribune" పత్రికా సంపాదకులు ఇందులో ఉదాహరించినట్లు, మార్క్స్ సెప్టెంబరు 4వ తేదీనే రాసినట్టి "ఇండియాలో తిరుగుబాటు" అనే వ్యాసం (చూ. ఈ సంకలనం పుటలు 100–104) తరువాతనే ఈ వ్యాసాన్ని ప్రచురించారు. – 78.

[48] <u>బ్లూ బుక్కు</u> (Blue Books) – బ్రిటిష్ పార్లమెంటూ, విదేశాంగ మంత్రిత్వ కార్యాలయమూ ప్రచురించే ఫోగట్టా విషయాలకూ పత్రాలకూ మామూలుగా ఇచ్చే పేరు. ఈ పుస్తకాలపైన నీలిరంగు కాగితం అట్టవేసివుండడాన్నిబట్టి వీటికి "నీలిరంగు పుస్తకాల"నే పేరు వచ్చింది. ఈ పుస్తకాలు 17వ శతాబ్దినుండీ ప్రచురింపబడుతూ, ఇంగ్లండుయొక్క ఆర్థిక, రాజకీయ చరిత్రకు అధికారయుతమైన ప్రధాన మూలాధార గ్రంథాలు. ఇక్కడ రచయిత "East India (Torture)," London, 1855–1857 ["ఈస్ట్ ఇండియా (చిత్రహింస)," లండన్, 1855–1857] అనే "బ్లూ బుక్కు"ను ఉదాహరించుతున్నారు. – 78.

[49] "Report of the Commission for the Investigation of Alleged Cases of Torture at Madras," London, 1855 ("మద్రాసులో చిత్రహింసలు జరిగినట్లు చెప్పబడిన ఉదంతాలపై దర్యాప్తు జరిపిన కమీషనుయొక్క నివేదిక," లండన్, 1855). – 78.

50 అగ్రమాంటె — అరియోస్టో రచించిన "Orlando Furioso" ("ఆగ్రహావరుడైన ఓర్లాండో") అనే పద్యకావ్యంలో మూర్‌దేశపు రాజు. చార్లెస్ మాగ్నతో జరిగిన యుద్ధంలో ఇతడు పారిస్ నగరం ముట్టడించి, తన సేనలో అత్యధిక భాగాన్ని పారిస్ కోటగోడల ఎదుట సమీకరించాడు. "Orlando Furioso" కావ్యంలో వున్న "అగ్రమాంటె శిబిరంలో ముసలం పుట్టింది" అనే పంక్తిని సాధారణంగా కలహాన్ని సూచించడానికి ఉపయోగించుతారు. ప్రసిద్ధి వడసిన ఈ పంక్తినే మార్క్స్ ఇక్కడ సూచించుతున్నాడు. — 88.

51 "The Daily News" — బ్రిటిష్ ఉదారవాద వార్తాపత్రిక; పారిశ్రామిక బూర్జువా వర్గ పత్రిక. — 88.

52 "The Moffussilite" — 1845నుండి, ఇండియాలో మొదట మీరట్‌లో, తర్వాత, ఆగ్రా అంబాలాలలో ఇంగ్లీషు భాషలో వెలువడిన బ్రిటిష్ ఉదారవాద వార్తాపత్రిక. — 91.

53 ఈస్ట్ ఇండియా కంపెనీకి ఇచ్చిన 1853 అనుజ్ఞాపత్రం గురించి రచయిత ఇక్కడ ప్రస్తావిస్తున్నాడు (చూ. 3వ వివరణ). — 96.

54 వెండెయిలో (పశ్చిమ ఫ్రాన్సులో ఇదొక ప్రాంతం), 1793లో విప్లవ ప్రతిఘాతక తిరుగుబాటు కావించేటట్లుగా అక్కడ నివసించుతూన్నట్టి వెనుకబడిన రైతాంగాన్ని ఫ్రెంచి రాజరికవాదులు ఉపయోగించుకున్నారు. ఈ తిరుగుబాటును రిపబ్లికన్ సైన్యం అణచివేసింది. ఈ సైన్యంలో వున్న సైనికులను "నీలిరంగు యూనిఫారాలు" ("బ్లూస్") అనేవారు.

స్పానిష్ గెరిల్లాలు — 1808–1814లో ఫ్రెంచి దురాక్రమణదార్లపై స్పెయిన్ దేశస్థులు సాగించిన జాతీయ విముక్తి పోరాట కాలంలో గెరిల్లా యుద్ధంలో పాల్గొన్నవారు. విజేతలను మొండిగా ప్రతిఘటించిన రైతాంగం గెరిల్లాలవెనుక ప్రధాన చోదకశక్తిగా పనిచేసింది.

1848–1849లో జరిగిన ఆస్ట్రియా, హంగేరి విప్లవోద్యమాన్ని అణచివేయడానికై సాగించిన చర్యలో సెర్బియన్, క్రోఅట్ సైనిక దళాలు పాల్గొన్నాయి. దేశపు అభివృద్ధి విరోధకులు తమ స్వప్రయోజనాలను పరిరక్షించుకోవేందుకై, బుడాపెస్ట్, వియన్నాలలోని తిరుగుబాటును అణచివేయడానికి సెర్బియన్, క్రోఅట్ సైనికులను ఉపయోగించారు.

గార్డ్ మొబిల్ అనే రక్షకదళం 1848 ఫిబ్రవరి 25న ఫ్రెంచి ప్రభుత్వం ఉత్తరువు ననుసరించి, విప్లవ ప్రజలను అణచివేయడానికై స్థాపించబడింది. ఈ దళాలలో ప్రధానంగా వర్గభ్రష్టులైన వ్యక్తులు చేరారు. వాటిని 1848 జూన్‌లో పారిస్ కార్మికుల తిరుగుబాటును అణచివేయడానికి ఉపయోగించారు. యుద్ధమంత్రిగా వున్న జనరల్ కవైన్యాక్, కార్మికుల ఊచకోతకు తానే స్వయంగా ఆజ్ఞ ఇచ్చాడు.

డిసెంబ్రిస్టులు – 1849లో స్థాపించబడిన బోనపార్ట్ పక్షంవారి రహస్య సంఘం. దీనిలో ప్రధానంగా వర్గభ్రష్టులైన వ్యక్తులు, రాజకీయ దుస్సాహసికులు, సైనిక తత్వవాదులు వగైరాలు చేరారు. 1848 డిసెంబరు 10న జరిగిన ఎన్నికలలో (ఇందు వల్లనే వీరికి యీ పేరు వచ్చింది) ఫ్రెంచి రిపబ్లిక్ అధ్యక్షుడుగా లూయీ బోనపార్ట్ ఎన్నిక అవడానికి దాని సభ్యులు చాలా సహాయపడ్డారు. 1851 డిసెంబరు 2న రాజకీయ కుట్రలో వీరు పాల్గొన్నారు. దీని ఫలితంగా 1852లో లూయీ బోనపార్ట్, మూడవ నెపోలియన్ అనే పేరుతో ఫ్రెంచి చక్రవర్తిగా ప్రకటించబడ్డాడు. రిపబ్లికన్లను, అందులో ముఖ్యంగా 1848 విప్లవంలో పాల్గొన్న వారిని మూకుమ్మడిగా అణచి వెయ్యడంలో వీరు చురుకుగా పనిచేశారు. – 100.

55 మొదటి "నల్లమందు" యుద్ధానికి (1839–1842) ఇది ప్రస్తావన. చైనాను అర్ధవలసరాజ్య ప్రతిపత్తికిందకు దిగజార్చే ప్రయత్నంలో బ్రిటిష్‌వారు సాగించిన ఈ దురాక్రమణ యుద్ధం మొదటి మెట్టు. కాన్‌టన్ పట్నంలో విదేశవర్తకులకు చెందిన నల్లమందు నిల్వలను చైనా అధికార్లు నాశనంచెయ్యడాన్ని సాకుగా తీసుకుని ఈ యుద్ధం ప్రారంభమైంది. వెనకబడి వున్న ఫ్యూడల్ చైనా ఈ యుద్ధంలో పొందిన ఓటమిని అదనుగా ఉపయోగించుకుని, బ్రిటిష్ వలసవాదులు చైనా నెత్తిపై కొల్లగొట్టే నాన్‌కింగ్ సంధిని (1842 ఆగస్టు 29) రుద్దారు. దీని ననుసరించి, చైనాలో ఐదు రేవు పట్నాలు (కాన్‌టన్, అమోయ్, ఫూచౌ, నింగ్‌పొ, షాంగ్‌హై) బ్రిటిష్ వర్తకానికి తెరవబడ్డాయి, హాంకాంగ్ ద్వీపం బ్రిటిష్‌వారికి "శాశ్వత అధీన ప్రాంతం" చేయబడింది, యుద్ధఖర్చులకై బ్రహ్మాండమైన మొత్తాన్ని చైనాపై పరిహారంగా విధించారు. 1843 నాటి అనుబంధ ఒడంబడిక ప్రకారం విదేశీయులకు ప్రాంతీయేతర అధికారాలను చైనా ఇవ్వవలసి వచ్చింది. – 101.

56 కాన్‌టన్ నగరంపై బ్రిటిష్‌వారు చేసిన అమానుషమైన ఫిరంగిదాడిని గురించి రచయిత చెబుతున్నాడు. చైనాలో బ్రిటిష్ సూపరింటెండెంటుగా వున్న జాన్ బౌరింగ్ ఉత్తరువుపై జరిగిన ఈ దాడిలో నగర శివార్లలోని సుమారు 5,000 ఇళ్ళు నాశన

మైపోయాయి. చైనాతో రెండవ "నల్లమందు" యుద్ధానికి (1856-1858) ఇది నాందీవాక్యం. (చూ. 29వ వివరణ.)

శాంతి సంఘం – 1816లో లండన్‌లో క్వేకర్లు స్థాపించిన బూర్జువా యుద్ధ వ్యతిరేక సంస్థ. శాంతి పరిస్థితులు ఏర్పడినట్టయితే, స్వేచ్ఛావ్యాపార విధానంద్వారా తన పారిశ్రామిక శ్రేష్ఠతను బ్రిటన్ మరింత చక్కగా ఉపయోగించుకుని, ఈవిధంగా ఆర్థిక, రాజకీయ ప్రాబల్యాన్ని సాధించుకోగల్గుతుందని తలచినట్టి స్వేచ్ఛావ్యాపార వాదుల శక్తివంతమైన వత్తాసు ఈ సంఘానికి లభించింది.

1845లో ఆల్జీరియాలో జరిగిన తిరుగుబాటు అణచివేతలో – కొండ గుహల్లో దాగున్న ఒక వెయ్యిమంది అరబ్బు తిరుగుబాటుదార్లను పొగపెట్టి ఉక్కిరిబిక్కిరి చేసేయవలసిందని జనరల్ పెలిస్సియే – ఇతడు తరువాత ఫ్రాన్సుదేశపు మార్షల్ అయాడు – ఆజ్ఞజారీచేశాడు. – 103.

57 గయస్ జూలియస్ సీజర్ రచించిన "Commentarii de bello Gallico" ("గాల్లియా దేశంపై జరిగిన యుద్ధంపై వ్యాఖ్యానం") గ్రంథం గురించి రచయిత చెబుతున్నాడు. ఇక్కడ పేర్కొన్న విషయం, గాల్లిక్ యుద్ధంపై సీజర్ వివరణను పూర్తిచేసినట్టి సీజర్ స్నేహితుడూ, ఒకప్పుడు అతని ప్రతివిధి అయిన ఎ. హిర్షియస్ రాసిన పుస్తకంలో 8వ అధ్యాయంలో చెప్పబడింది. – 103.

58 1532లో రేగెన్స్‌బుర్గ్‌లో జరిగిన రైహ్‌స్టాగ్‌లో అంగీకరించబడినట్టి ఐదవ చార్లెస్ రచించిన క్రిమినల్ శాసనం ("Constitutio criminalis Carolina") గురించి మార్క్స్ చెబుతున్నాడు. ఈ శాసనం అత్యంత కఠిన శిక్షలను విధించినందుకు పేరుపొందింది. – 103.

59 W. Blackstone, "Commentaries on the Laws of England," Vol. I – IV. First Edition, London, 1765–1769. (డబ్లియు. బ్లాక్‌స్టన్, "ఇంగ్లండు దేశంయొక్క శాసనాలపై వ్యాఖ్యానాలు," సంపుటాలు I–IV. మొదటి కూర్పు, లండన్, 1765–1769.) – 103.

60 మోత్సార్ట్ రచించిన సంగీతనాటకం "Die Entführung aus dem Serail" ("అంతఃపురంనుండి అపహరణ") ఆస్మిన్ పాడిన గీతం. – 104.

[61] బైబిల్‌లో చెప్పిన కథనాన్ననుసరించి, ఇజ్రాయెల్ దేశస్థులు తమ బాకాలతో ఒక్కసారే వూదేసరికి ఆ గాలి జోరుకి జెరికో గోడలు కూలిపోయాయుట. – 104.

[62] 1848 విప్లవం ఓటమిచెందిన తరువాత, హంగేరీనుండి వలసపోయిన హంగేరియన్ రచయిత, పత్రికారచయిత అయిన తమ సిబ్బంది విలేకరి ఫెరెన్జ్ పుల్జ్‌స్కీని గురించిన ఈ వాక్యాన్ని "New-York Daily Tribune" సంపాదకులు ఇక్కడ దూర్చారు. పుల్జ్‌స్కీ ప్రధానంగా అంతర్జాతీయ విషయాలను సమీక్షచేస్తూ రాసేవాడు. – 105.

[63] 1784నుండి బెంగాల్లో వెలువడిన ఇంగ్లీష్ పత్రిక "The Calcutta Gazette"ని గురించి మార్క్స్ చెబుతూన్నట్టు కనబడుతుంది. ఇది ఇండియాలోని బ్రిటిష్ ప్రభుత్వపు అధికారయుత పత్రిక. – 107.

[64] 1838–1842 మొదటి ఆంగ్ల-ఆఫ్ఘన్ యుద్ధాన్ని గురించి రచయిత చెబుతున్నాడు ఆఫ్ఘనిస్థానాన్ని లొంగదీసుకొనే ఉద్దేశ్యంతో బ్రిటిష్‌వారు ఈ యుద్ధం ప్రారంభించారు. 1839 ఆగస్టులో బ్రిటిష్‌వారు కాబూల్‌ను వశపర్చుకున్నప్పటికీ, 1841 నవంబరులో ప్రజ్వరిల్లిన తిరుగుబాటువల్ల, 1842 జనవరిలో వారు ఆ నగరంనుండి వైదొలగాల్సి వచ్చింది. వారు ఇండియా దిశగా మళ్లినప్పుడు, ఆ తిరోగమనం భయాందోళనలతో కూడిన పలాయనంగా పరిణమించింది. ఇంగ్లీషు సైనికులు 4,500 మందిలోనూ, శిబిర పరివారం 12,000 మందిలోనూ ఒకే ఒక్కడు ప్రాణాలతో బైటపడి ఇండియా సరిహద్దు చేరుకోగల్గాడు. – 110.

[65] నెపోలియన్ పరిపాలనకింద వున్న ఫ్రాన్సుపై జరిగిన యుద్ధంలో 1809లో షెల్డె నదీ ముఖానికి పంపబడిన బ్రిటిష్ నౌకాదళ దండయాత్ర గురించి రచయిత చెబుతున్నాడు. వాల్‌ఖెరెన్ ద్వీపాన్ని బ్రిటిష్‌వారు ఆక్రమించుకున్న తర్వాత, తమ సైనిక చర్యలను పూర్తిగా కొనసాగించలేకపోవడం ఫలితంగా, బ్రిటిష్‌వారికి ఆ ద్వీపాన్ని ఆక్రమించుకున్నప్పుడు ఉండిన 40,000 మంది సైనికులలోనూ, ఆకలివల్లా, రోగంవల్లా సుమారు 10,000 మందిని కోల్పోయిన తర్వాత వారు వైదొలగాల్సి వచ్చింది. – 111.

[66] "The Morning Advertiser" – 1794లో లండన్‌లో స్థాపించబడిన ఇంగ్లీష్ దినపత్రిక; 1850లలో అది రాడికల్ బూర్జువావర్గపు పత్రికగా ఉండేది. – 120.

67 "The Friend of India" – 1818లో సెరాంపూర్‌లో స్థాపించబడిన ఇంగ్లీష్ వార్తాపత్రిక; 1850లలో వారపత్రికగా వెలువడిన యీ పత్రిక, బూర్జువా లిబరల్ ధోరణి కలిగివుండేది. – 123.

68 "The Military Spectator" – 1857నుండి 1858వరకు లండన్‌నుండి వెలువడిన బ్రిటిష్ వార్తాపత్రిక. – 123.

69 "The Bombay Courier" – బ్రిటిష్ ప్రభుత్వ వార్తాపత్రిక; ఈస్ట్ ఇండియా కంపెనీ అధికారయుత పత్రిక. 1790లో స్థాపించబడింది. – 125.

70 పూర్బీయులు ("పూర్బీయ" అనగా "తూర్పు" అనే బెంగాలీ మాటనుండి ఈ పేరు వచ్చింది) – తూర్పు బెంగాల్‌లోని సైనికబలాల సైనికులు. – 130.

71 మార్క్స్‌చే సంగ్రహించబడినట్టి ఈ పట్టిక, తన వ్యాసంతోపాటు న్యూయార్క్‌కు పంపబడినప్పటికీ, పత్రికాసంపాదకులు దీనిని అదే సంచికలో 6వ పుటలో వేరుగా ప్రచురించారు. – 131.

72 రచయిత క్రైమియా యుద్ధాన్ని గురించి చెబుతున్నారు. సెవస్తొపోల్‌పై దాడిచేయడానికి బ్రిటిష్, ఫ్రెంచి, టర్కీ సేనలు సిద్ధపడుతూండగా, ఆ దాడి జరగకుండా చేయడానికై వాటిపై రష్యన్ సేనలు ఇంకెర్మన్‌వద్ద 1854 నవంబరు 5న ఎదురుదాడి సాగించాయి. రష్యన్ సైనికబలాలు ధైర్యసాహసాలతో పోరాడినప్పటికీ, బ్రిటిష్, ఫ్రెంచి, టర్కీ సైనికబలాలకే ఆ యుద్ధంలో విజయం లభించింది. – 132.

73 1854 అక్టోబరు 25న రష్యన్ సేనలకూ మిత్రరాజ్యాల సైనికబలాలకీ బాలక్లావాలో జరిగిన యుద్ధంలో, మిత్రరాజ్యాలు అనుకూల పరిస్థితిలోనే ఉండినప్పటికీ, బ్రిటిష్, ఫ్రెంచి సేనలకి విపరీతమైన నష్టాలు సంభవించాయి. ఇంగ్లీషు సేనాధిపత్యం కావించిన పొరపాట్ల ఫలితంగా ఒక ఇంగ్లీష్ లైట్ కేవెల్‌రీ బ్రిగేడ్ నష్టమైపోయింది. – 133.

74 "The Bombay Gazette" – 1791లో ఇండియాలో స్థాపించబడిన ఇంగ్లీషు వార్తాపత్రిక. – 134.

[75] "G obe" – 1803నుండి లండన్‌నుండి వెలువడిన ఇంగ్లీషు దినపత్రిక "The G obe and Trave er"యొక్క సంగ్రహనామం. విగ్‌పక్షపు పత్రిక; విగ్‌పక్షంవారు ప్రభుత్వానికి వచ్చినప్పుడల్లా ఇది ప్రభుత్వ పత్రికగా ఉండేది. 1866నుండి కన్సర్వేటివ్‌ల పత్రికగా ఉంది. – 141.

[76] ఈస్ట్ ఇండియా కంపెనీకి చైనా వర్తకంలో వుండిన గుత్తాధిపత్యాన్నీ, కంపెనీయొక్క వ్యాపార సంస్థ హోదానూ రద్దుచేసినట్టి 1833 పార్లమెంటు శాసనాన్ని గురించి రచయిత చెబుతున్నాడు. కంపెనీకున్న పరిపాలనా విధులను మాత్రమే ఈ శాసనం నిలబెట్టి, కంపెనీ అనుజ్ఞాపత్రాన్ని 1853వరకూ పొడిగించింది. – 141.

[77] "The Phoenix" – ఇండియాలో ఇంగ్లీషు ప్రభుత్వ పత్రిక; 1856నుండి 1861వరకు కలకత్తానుండి ప్రచురించబడింది. – 143.

[78] మార్క్స్‌యొక్క 1858 నాటి నోటుబుక్కులో వున్న కొన్ని వాక్యాలను అనుసరించి ఈ వ్యాసానికి ఈ శీర్షిక ఇవ్వబడింది. – 145.

[79] 1853–1856 క్రైమియా యుద్ధాన్ని గురించి చెబుతున్నాడు రచయిత. 1854 సెప్టెంబరు 20న ఆల్మావద్ద యుద్ధం జరిగింది; దానిలో మిత్రరాజ్య సేనకి విజయం లభించింది. – 145.

[80] 1853–1856 క్రైమియా యుద్ధానికి ఇది ప్రస్తావన. 1855 జూన్ 18న సెవస్తోపోల్ దుర్గం మూడవ బురుజుపై (ఈ బురుజునే "పెద్ద రెడాన్" అని పిలిచేవారు) మిత్రరాజ్య సేనలు విఫలమైన దాడిచేసిన సమయంలో, ఆ బ్రిగేడ్ విండ్‌హామ్ నాయకత్వంకిందనే వుంది. – 146.

[81] 1858లో మార్క్స్ తన నోటుబుక్కులో రాసుకున్న దానితో సరిపోతూంది ఈ శీర్షిక. – 153.

[82] 1838–1842 మొదటి ఆంగ్ల-ఆఫ్ఘన్ యుద్ధానికి ఇది ప్రస్తావన. (మా. 64వ వివరణ.) – 154.

83 బర్మాలో పట్టణాల చుట్టూ, శిబిరాల చుట్టూ పూర్వకాలపు దుర్గరక్షణ ననుసరించి నిర్మించే కోటగోడల నమూనాలను గురించి ఎంగెల్స్ చెబుతున్నాడు. – 164.

84 స్పానిష్ దుర్గమైన బాడాహోస్ ఫ్రెంచివారి అధీనంలో వుంది. దీనిని 1812 ఏప్రిల్ 6న వెల్లింగ్టన్‌కింద వున్న బ్రిటిష్ సైన్యం పట్టుకుంది.

ఫ్రెంచివారు వశపర్చుకున్న సాన్ సెబాస్టియన్ దుర్గంపై 1813 ఆగస్టు 31న దాడి జరిగింది. – 166.

85 ఇండియా గవర్నర్ జనరల్ అయిన లార్డ్ కానింగ్ 1858 మార్చి 3న చేసిన ప్రకటనకు ఇది ప్రస్తావన. ఈ ప్రకటన ప్రకారం, తిరుగుబాటులో చేరిన బడా ఫ్యూడల్ భూస్వాములైన తాలుక్దార్ల భూములతోసహా అయోధ్య రాజ్యానికి చెందిన ప్రాంతాలన్నీ బ్రిటిష్ అధికారులచే జప్తుచేయబడ్డాయి. అయినప్పటికీ, తాలుక్దార్లను తన పక్షం తిప్పుకోడానికి ప్రయత్నించిన బ్రిటిష్ ప్రభుత్వం, కానింగ్ ప్రకటన అర్థాన్ని మార్చింది. తాలుక్దార్ల ఆస్తులకు ఎట్టి భంగమూ కలగదని వారికి వాగ్దానం చేసిన తర్వాత, వారు తిరుగుబాటుయెడల ద్రోహంగావించి, బ్రిటిష్‌వారి పక్షం చేరిపోయారు.

"అయోధ్యను కలిపివేసుకోవడం," "లార్డ్ కానింగ్ ప్రకటన, ఇండియాలో భూమి అనుభవం" అనే వ్యాసాలలో మార్క్స్ లార్డ్ కానింగ్ చేసిన ప్రకటనను విమర్శనాత్మకంగా విశ్లేషించాడు. (చూ. ఈ సంకలనంలో పుటలు: 169–176, 177–181.) – 168.

86 బ్రిటిష్‌వారికి వ్యతిరేకంగా గొప్ప ధైర్య స్థైర్యాలతోనూ, మంచి ఆర్గనైజేషనుతోనూ సిక్కు సైన్యం పోరాడినప్పటికీ, 1845 డిసెంబరు 18న ముడ్కి గ్రామం (ఫిరోజ్‌పూర్ సమీపంలో)వద్దనూ, 1845 డిసెంబరు 21న ఫిరోజ్‌షావద్దనూ, 1846 జనవరి 28న లూధియానా సమీపంలో వున్న ఆలివాల్ గ్రామంవద్దనూ జరిగిన యుద్ధాల్లో సిక్కులు ఓడిపోయారు. ఈ ఓటమి ఫలితంగా, 1845–1846 మొదటి ఆంగ్లో-సిక్కు యుద్ధంలో సిక్కులకు అపజయం లభించింది. తమ సర్వసేనా నాయకత్వంయొక్క ద్రోహమే సిక్కుల ఓటమికి ప్రధాన కారణం. – 168.

87 మార్క్స్‌యొక్క 1858 నాటి నోటుబుక్కులో వున్న వాక్యాలను అనుసరించి ఈ వ్యాసానికి ఈ శీర్షిక ఇవ్వబడింది. – 169.

[88] 1858 మే 8 తేదీ "Times" సంచికలో ప్రచురింపబడినట్టే, అయోధ్య విష యమై గవర్నర్ జనరల్ లార్డ్ కానింగ్ చేసిన ప్రకటనను (చూ. 85వ వివరణ) మార్క్స్ ఉల్లేఖిస్తున్నాడు. – 169.

[89] రష్యన్ అభివృద్ధినిరోధకులచేత రష్యా సామ్రాజ్యంలో భాగమైన పోలెండ్ రాజ్యంలో జరిగిన 1830–1831 తిరుగుబాటు అణచివేతకు ఇది ప్రస్తావన. – 169.

[90] 1848–1849లో ఆస్ట్రియా ఇటలీల మధ్య జరిగిన యుద్ధం గురించి రచయిత చెబుతున్నాడు; ఈ యుద్ధంలో, 1849 మార్చి 23వ జరిగిన నొవారా (ఉత్తర ఇటలీ) యుద్ధంలో సార్డీనియా రాజు చార్లెస్ అల్బర్ట్ సేన తీవ్రనష్టంతో ఓడి పోయింది. – 169.

[91] అయోధ్య మొగల్ సామ్రాజ్యంలో భాగంగానే ఉండేది; కాని 18వ శతాబ్ది మధ్యలో అయోధ్యను పాలించుతూన్న మొగల్ రాజప్రతినిధి వాస్తవానికి స్వతంత్ర రాజుగానే ఉండేవాడు. 1765లో ఇంగ్లీషువారు అయోధ్యను సైనికసహకార సంధికింద బ్రిటిష్ సామంత రాజ్యంగా చేసేశారు. రాజకీయ అధికారం యధార్థంగా బ్రిటిష్ రెసి డెంటు చేతిలోకి వెళ్లిపోయింది. ఈ యధార్థ పరిస్థితులను మసిపూసి మారేడుకాయ చేయడానికని అయోధ్య పాలకుణ్ణి అయోధ్య రాజు అని అంటూండేవారు. – 170.

[92] 1801లో ఈస్ట్ ఇండియా కంపెనీకీ అయోధ్య నవాబుకీ జరిగిన సంధి షరతుల నను సరించి, అయోధ్య నవాబు అప్పులు తీర్చలేదనే నెపంమీద నవాబు రాజ్యంలో సంగోరు భాగాన్ని గవర్నర్ జనరల్ వెల్స్లీ, కంపెనీ రాజ్యంలో కలిపేసుకున్నాడు. గోరఖ్‌పూర్, రోహిల్‌ఖండ్, గంగాయమునల మధ్యనున్న ప్రదేశంలో కొంత భాగమూ ఇలాగు కలిపేసుకున్న సంగోరు భాగంలో ఉన్నాయి. – 171.

[93] ఈ వాక్యాన్ని "New-York Daily Tribune" పత్రికాసంపాదకులు మార్క్స్ వ్యాసంలో చొప్పించారు; అయోధ్య విషయమై లార్డ్ కానింగ్ చేసిన ప్రకటన (చూ. 85వ వివరణ) సందర్భంలో, గవర్నర్ జనరల్ లార్డ్ కానింగ్‌కీ, అయోధ్య చీఫ్ కమీషనరు ఔట్రామ్‌కీ జరిగిన ఉత్తరప్రత్యుత్తరాలకు ఈ వాక్యం వర్తించుతూంది; ఈ ఉత్తరప్రత్యుత్తరాలను 1858 జూన్ 5వ తేదీ సంచికలో పత్రిక ప్రచురించింది. – 177.

[94] 19వ శతాబ్ది మధ్యకాలానికి ఇంచుమించుగా ఇండియా అంతా కూడా బ్రిటిష్ పరిపాలనకిందకి వచ్చేసింది. కాశ్మీర్, రాజపుత్రస్థానం, హైదరాబాద్‌లో కొంత భాగం, మైసూర్, ఇంకా మరికొన్ని చిన్న సంస్థానాలు ఈస్ట్ ఇండియా కంపెనీకింద సామంతరాజ్యాలుగా ఉండేవి. – 177.

[95] ఇండియా గవర్నర్ జనరల్ లార్డ్ కారన్‌వాలిస్ మంజూరు చేసిన 1793 నాటి శాశ్వత జమీందారీ శాసనానికి ఇది వర్తిస్తుంది. (చూ. 22వ వివరణ.) – 178.

[96] అయోధ్య విషయమై లార్డ్ కానింగ్ చేసిన ప్రకటనను (చూ. 85వ వివరణ) విమర్శించుతూ, 1858 ఏప్రిల్ 19వ బోర్డ్ ఆఫ్ కంట్రోల్ అధ్యక్షుడు లార్డ్ ఎల్లెన్‌బరో తన నివేదికలో ఈ ప్రకటనను పేర్కొన్నాడు. బ్రిటిష్ రాజకీయ వర్గాలలో లార్డ్ ఎల్లెన్‌బరో నివేదికపట్ల అసమ్మతి వెల్లడవడం కారణంగా, లార్డ్ ఎల్లెన్‌బరో తన పదవికి రాజీనామా ఇవ్వాల్సివచ్చింది. – 180.

[97] పార్లమెంటులో డెర్బీ మంత్రివర్గం ప్రవేశపెట్టినట్టి, 1858 జూలైలో పార్లమెంటుచే అంగీకరించబడినట్టి బిల్లును గురించి ఇది చెబుతూంది. "ఇండియాను మరింత చక్కగా పరిపాలించడానికై చేసిన శాసనం" అనే పేరుతో ఈ బిల్లు చట్టమైంది. ఈ చట్టంకింద ఇండియా పూర్తిగా బ్రిటిష్ రాజముకుటంకిందకి వచ్చేసింది; పోతే, ఈస్ట్ ఇండియా కంపెనీ వాటాదార్లకు 30 లక్షల పౌన్ల పరిహారం చెల్లించి కంపెనీని రద్దుపరచడం జరిగింది. బోర్డ్ ఆఫ్ కంట్రోల్‌ను ఎత్తివేసి, దాని అధ్యక్షుని స్థానే సెక్రటరీ ఆఫ్ స్టేట్ ఫర్ ఇండియాను, అతని సలహాసంఘం – ఇండియా కౌన్సిల్‌నూ నియమించడమైంది. ఇండియా గవర్నర్ జనరల్‌ని వైస్‌రాయి అన్నారు; ఆచరణలో లండన్‌లో వున్న సెక్రటరీ ఫర్ ఇండియాయొక్క అభీష్టాన్ని అమలుపరచేటట్టి కార్యాచరణోద్యోగిగా వైస్‌రాయి పనిచేస్తూంటాడు.

"ఇండియా బిల్లు" అనే వ్యాసంలో ఈ శాసనాన్ని మార్క్స్ విమర్శాత్మకంగా విశ్లేషించాడు (ఈ సంకలనంలో 204–208వ పుటలు చూడండి). – 192.

[98] మార్క్స్‌యొక్క 1858 నాటి నోటుబుక్కులో వున్న వాక్యాన్ని అనుసరించి ఈ వ్యాసానికి ఈ శీర్షిక ఇవ్వబడింది. – 198.

[99] అల్జీరియాను జయించడానికై 19వ శతాబ్ది 30–70 మధ్య సంవత్సరాలలో ఆ దేశంలో

ఫ్రెంచి వలసవాదులు జరిపినట్టి వలసరాజ్య విస్తరణ యుద్ధాలకు ఇది అన్వయిస్తూంది. ఫ్రెంచివారు కావించిన అల్జీరియా దండయాత్రను అరబ్బులు సుదీర్ఘకాలం అతి పట్టుదలతో ప్రతిఘటించారు. ఫ్రెంచివారు అత్యంత క్రూరవిధానాలను అవలంబించి ఈ యుద్ధం సాగించారు. 1847లో అల్జీరియా ఆక్రమణ మొత్తంమీద పూర్తి అయినప్పటికీ, తమ స్వాతంత్ర్యానికై అల్జీరియా ప్రజలు సలిపే పోరాటం యథార్థంగా సమాప్తిచెందనే లేదు. — 202.

100 మార్క్స్ యొక్క 1858 నాటి నోటుబుక్కులో వున్న కొన్ని వాక్యాలను అనుసరించి ఈ వ్యాసానికి ఈ శీర్షిక ఇవ్వబడింది. — 204.

101 1773 నాటి రెగ్యులేటింగ్ శాసనాన్ని గూర్చి రచయిత చెబుతున్నాడు. కంపెనీ వ్యవహారాల్లో పాల్గొనడానికి అర్హత గలిగినట్టి, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్‌ను ఎన్నుకోడానికి అర్హత గలిగినట్టి వాటాదార్ల సంఖ్యను ఈ శాసనం తగ్గించేసింది. ఈ శాసనంకింద, 1,000 పౌన్లకు తక్కువగాని వాటాలు గల వాటాదార్లకు మాత్రమే వాటాదార్ల సమావేశాల్లో వోటు చేసే హక్కు వుంది. మొట్టమొదటి సారిగా ఇండియా గవర్నర్ జనరల్, అతని కౌన్సిల్ సభ్యులూ ఒక్కొక్కరే వ్యక్తిగా ఐదు సంవత్సరాల కాలపరిమితికి నియమించబడ్డారు; కంపెనీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ రాజుకి అభ్యర్థనచేసిన యెడలనే రాజుకి ఉచితమని తోచినయెడలనే వారిని బర్తరఫుచేయడానికి రాజుకే అధికారముంది. దరిమిలా గవర్నర్ జనరల్‌నీ, అతని కౌన్సిల్ సభ్యులనీ కంపెనీ నియమించడానికి అవకాశం కల్పించబడింది. 1773 నాటి శాసనంకింద లార్డ్ చీఫ్ జస్టిస్, మరి ముగ్గురు జడ్జీలతో కూడిన సుప్రీమ్ కోర్టు కలకత్తాలో స్థాపించబడింది. — 205.

102 ఫ్రెంచి ప్రభుత్వం ఒత్తిడిపైన విదేశీయులపై బిల్లు (లేక కుట్ర బిల్లు) అను పేరిట ఒక బిల్లును కామన్స్ సభలో 1858 ఫిబ్రవరి 8న లార్డ్ పామర్‌స్టన్ ప్రవేశపెట్టాడు (ఈ బిల్లును ప్రవేశపెట్టే ఉద్దేశ్యాన్ని పామర్‌స్టన్ ఫిబ్రవరి 5న తెలియపర్చాడు). ఈ బిల్లునమసరించి, యునైటెడ్ కింగ్‌డమ్‌లో నివసిస్తూన్న వ్యక్తిపై, అతను బ్రిటిష్ పౌరుడైనా సరే, విదేశస్థుడైనా సరే, బ్రిటన్‌లో కాని, మరే ఇతర దేశంలో కాని ఎవరినైనా హత్యచేయడానికై కుట్రలో పాల్గొన్నట్టుగా గాని, అట్టి కుట్రను పన్నినట్టుగాని నేరం మోపబడినయెడల, అట్టి వ్యక్తిని కోర్టు ఎదుట విచారణకు పెట్టి, కోర్టు దోషిగా నిర్ణయించిన పక్షమందు కోర్టు అతనిపై

కఠినమైన శిక్షను విధించవచ్చు. బిల్లుకు నిరసన తెలుపుతూ ప్రజాభిప్రాయం ఒక ఉద్యమ రూపంలో వెల్లువికిన ఫలితంగా, కామన్స్ సభ ఈ బిల్లును తోసివేసింది; ఇందువల్ల పామర్స్టన్ రాజీనామా చేయాల్సి వచ్చింది. – 207.

103 డెర్బీ మంత్రివర్గం అధికారానికి వచ్చిన తరువాత, ఇండియా పరిపాలనను మెరుగు పర్చడానికై ఒక సంస్కరణ బిల్లును తయారుచేయమని మంత్రివర్గం బోర్డ్ ఆఫ్ కంట్రోల్ అధ్యక్షుడైన లార్డ్ ఎల్లెన్‌బరోకి అధికారమిచ్చింది. కాని అతను తయారు చేసిన బిల్లుతో ప్రభుత్వం తృప్తిపడలేదు; ఇండియా కౌన్సిల్‌ను ఎన్ను కోవడంలో బిల్లులోని నిబంధనలు చాలా క్లిష్టంగా వుండడమే ఇందుకు కారణం. ఈ బిల్లు తీవ్రమైన ప్రతిఘటనను ఎదుర్కొని, తోసివేయబడింది. – 207.

104 "Civis Romanus sum" ("నేను రోమన్ పౌరుడను") – పసిఫికో అనే వర్తకుని సందర్భంలో జరిగిన ఘటనను గురించి పామర్స్టన్ 1850లో జూన్ 25న కామన్స్ సభలో ఉపన్యసించిన తరువాత పామర్స్టన్‌కి ఎగతాళిగా పెట్టిన పేరు. డాన్ పసిఫికో అనే పేరుగల పార్చుగీసు వంశస్థుడైన ఒక బ్రిటిష్ పౌరుని రక్షణకై (ఏథెన్స్‌లో ఇతని ఇల్లు కాల్చేశారు) గ్రీసుకు పంపిన బ్రిటిష్ యుద్ధ నావల చర్యలను సమర్థించుతూ, పురాతన రోమ్ నిర్వచించినట్టి "civis Romanus sum" అనే రోమన్ పౌరసత్వపు సూత్రం పురాతనకాలపు రోము పౌరులకు సర్వే సర్వత్రా ఎట్టి గౌరవాన్ని సంపాదించి పెట్టిందో, అలాగే బ్రిటిష్ పౌరులు ఎక్కడున్నప్పటికీ బ్రిటిష్ పౌరసత్వం కూడా అట్టి గౌరవాన్నే సంపాదించిపెట్టడం సమంజసమని పామర్స్టన్ ఉద్ఘాటించాడు. పామర్స్టన్ చేసిన జాతీయ దురహంకారపూరితమైన ఉపన్యాసంపట్ల ఇంగ్లీషు బూర్జువావర్గంవారు తమ ఉత్సాహపూరితమైన హర్షం ప్రకటించారు. – 207.

105 1852 ఆంగ్లో-బర్మా యుద్ధానికి ఇది ప్రస్తావన (చూ. 19వ వివరణ). – 215.

106 ఈ పుట సంఖ్య, మార్క్స్ తన వివరణల వాచకంలో సందర్భానుసారంగా పేర్కొన్న పుటల సంఖ్యలూ Robert Sewell, "The Analytical History of India from the Earliest Times to the Abolition of the Honourable East India Company in 1858," London, 1870 (రాబర్ట్ సివెల్, "ఆదికాలంనుండి, 1858లో గౌరవనీయ ఈస్ట్ ఇండియా కంపెనీ రద్దు చేయబడిన వరకూ

విశ్లేషణాత్మకమైన ఇండియాదేశ చరిత్ర," లండన్, 1870) అనే గ్రంథానికి చెందినవి. – 220.

107 "The Examiner" – లండన్‌లో 1808–1881 సంవత్సరాలలో వెలువడిన ఇంగ్లీషు బూర్జువా లిబరల్ వారపత్రిక. – 231.

108 "Neue Rheinische Zeitung Organ der Demokratie" – 1848 జూన్ 1నుండి 1849 మే 19వరకూ కొలోన్ పట్నంనుండి వెలువడిన దినపత్రిక. మార్క్సు దీని సంపాదకుడు. ఎంగెల్సు సంపాదకవర్గంలో సభ్యుడు. ఈ పత్రిక ప్రజాస్వామ్యోద్యమంలో శ్రామికవర్గ పక్షంయొక్క సమరశీల పత్రికగా ఉండి, ప్రజానీకాన్ని ప్రబుద్ధంచేసి, విప్లవప్రతిఘాతంపై పోరాటానికి వారిని సమీకరించుతూండేది. జర్మనీలోనూ, యూరప్‌లోనూ విప్లవాలకు సంబంధించిన కీలక అంశాలపట్ల పత్రికయొక్క దృక్పథాన్ని ప్రతిబింబించుతూ వుండిన సంపాదకీయ వ్యాసాలను తప్పనిసరిగా మార్క్సు, ఎంగెల్సులే రాసేవారు. పోలీసుల హింసాకాండకు గురైనప్పటికీ, పత్రిక వాటిని లక్ష్యంచేయకుండానే, విప్లవాత్మక ప్రజాస్వామ్యవాదులయొక్క, శ్రామికవర్గంయొక్క ప్రయోజనాల తరపున నిలబడుతూ ధైర్యమైన స్థానం తీసుకుంది. మార్క్సును ప్రవాసం పంపించివేయడంవల్లనూ, "Neue Rheinische Zeitung"యొక్క ఇతర సంపాదకులపై విధింపబడిన నిర్బంధాల ఫలితంగానూ పత్రికను మూసివేయాల్సి వచ్చింది. – 233.

109 1858 జూన్‌లో బ్రిటన్‌కీ చైనాకీ జరిగిన అసమాన షరతులను కలిగిన టియంట్సిన్ సంధి గురించి రచయిత చెబుతున్నాడు. ఈ సంధితో 1856–1858లో చైనాతో జరిగిన రెండవ "నల్లమందు" యుద్ధం అంతమైంది. ఈ సంధివల్ల మంచూరియాలో యాంగ్‌ట్సి నదీతీరామన్న కొత్త రేవు పట్టణాలూ, తైవాన్, హైనాన్ ద్వీపాలూ, టియంట్సిన్ రేవు పట్టణమూ విదేశవర్తకానికి తెరవబడ్డాయి. విదేశ ప్రభుత్వాలయొక్క శాశ్వతమైన దౌత్యప్రతినిధులకు పెకింగ్‌లో ప్రవేశం కలిగింది. విదేశీయులకు దేశంలో స్వేచ్ఛగా ప్రయాణంచేసే హక్కూ, సముద్ర, నదీ నౌకలద్వారా వ్యాపారం చేసే హక్కూ లభించాయి. మిషనరీలకు రక్షణహామీలు కల్పించబడ్డాయి. – 235.

# పేర్ల సూచి

అక్బర్, రెండవ – హిందూస్థాన్‌యొక్క గొప్ప మొగల్ చక్రవర్తి (1806–1837). –44.

అప్పా సాహెబ్ – సతారా స్వదేశసంస్థానానికి రాజా (1839–1848). – 55.

అమర్ సింగ్ – కువర్ సింగ్ సోదరుడు; అతను చనిపోయిన తరువాత (ఏప్రిల్ 1858) అయోధ్యలో తిరుగుబాటుదార్లకు నాయకత్వం వహించాడు. – 210.

ఆక్‌లండ్ (Auckland), జార్జి ఈడెన్, ఎర్ల్ (1784–1849) – ఇంగ్లీషు రాజనీతిజ్ఞుడు, విగ్గు, ఇండియా గవర్నర్ జనరల్ (1836–42). – 175.

అరిస్టాటిల్ (Aristotle) (384–322 క్రీ. పూ.) – పురాతన గ్రీసుదేశపు గొప్ప తత్వవేత్త. – 53.

ఆర్లియన్స్ (Orleans) – ఫ్రెంచి రాజవంశం (1830–1848). – 166, 170.

ఇంగ్లిష్ (English), ఫ్రెడరిక్ (1816–1878) – ఇంగ్లీషు ఆఫీసరు, తరువాత జనరల్, 1857–59 ఇండియా జాతీయ విముక్తి తిరుగుబాటు కాలంలో లక్నో ముట్టడిలోనూ, లక్నోని పట్టుకోవడంలోనూ పాల్గొన్నాడు. – 221.

ఇంగ్లిస్ (Inglis), జాన్ ఎర్డ్లి డి విల్‌మట్ (1814–1862) – బ్రిటిష్ కల్నల్, 1857నుండి జనరల్, 1857–59 ఇండియా జాతీయ విముక్తి తిరుగుబాటును అణచివేయడంలో పాల్గొన్నాడు; 1857 జూలై–సెప్టెంబరులో లక్నోలో వున్న ఇంగ్లీషు సైనిక బలాల నాయకుడు. – 220.

ఇవన్స్ (Evans), జార్జి డి లాసీ (1787–1870) – బ్రిటిష్ జనరల్, క్రైమియా యుద్ధంలో పోరాడాడు, లిబరల్ పక్షపు రాజకీయవేత్త, పార్లమెంటు సభ్యుడు. – 68, 73, 74.

ఎలిజబెత్, మొదటి (Elizabeth I) (1533–1603) – ఇంగ్లండు రాణి (1558–1603). – 23, 29.

ఎల్జిన్ (Elgin), జేమ్స్ బ్రూస్, ఎర్ల్ (1811–1863) – బ్రిటిష్ దౌత్యనీతిజ్ఞుడు; రెండవ "నల్లమందు" యుద్ధ కాలంలో ప్రత్యేక రాయబారిగా చైనాకు పంపబడ్డాడు (1857–58, 1860–61), ఇండియా వైస్‌రాయి (1862–63). – 45.

ఎల్లెన్‌బరో (Ellenborough), ఎడ్వర్డ్ లా, ఎర్ల్ (1790–1871) – బ్రిటిష్ రాజనీతిజ్ఞుడు, టోరీ, పార్లమెంటు సభ్యుడు, ఇండియా గవర్నర్ జనరల్ (1842–44), ఫస్ట్ లార్డ్ ఆఫ్ ఎడ్మిరాల్టీ (1846), ఇండియా బోర్డ్ ఆఫ్ కంట్రోల్ అధ్యక్షుడు (1858). – 67, 167, 170, 180, 207

ఏన్సన్ (Anson), జార్జి (1797–1857) – బ్రిటిష్ జనరల్, ఇండియాలోని ఇంగ్లీషు సైనిక బలాల సర్వసేనాధిపతి (1856–57). – 48, 217, 219.

ఏష్‌బర్న్‌హామ్ (Ashburnham), థామస్ (1807–1872) – ఇంగ్లీషు జనరల్. 1857లో చైనాకు పంపించిన దండయాత్ర సైనిక బలాలకు నాయకుడుగా నియమింపబడ్డాడు, కాని ఇండియాలో జాతీయ విముక్తి తిరుగుబాటు ప్రారంభ సందర్భంలో ఇండియాకు తిరిగి రప్పించబడ్డాడు. – 45.

ఒస్కార్, మొదటి (Oscar I) (1799–1859) – నార్వే, స్వీడన్ దేశాల రాజు. – 76.

ఔట్రామ్ (Outram), జేమ్స్ (1803–1863) – ఇంగ్లీషు జనరల్, లక్నోలో రెసిడెంటు (1854–56), 1857లో ఆంగ్లో-పర్షియా యుద్ధంలో ఇంగ్లీషు సైనిక బలాల నాయకుడు, అయోధ్య చీఫ్ కమీషనరు (1857–58), 1857–59 ఇండియా జాతీయ విముక్తి తిరుగుబాటును అణచివేయడంలో పాల్గొన్నాడు. – 120, 153, 154, 157, 158, 174, 180, 181, 220, 222, 224

ఔరంగజేబ్ (1618–1707) – హిందూస్థానం పరిపాలించినట్టి ప్రసిద్ధిచెందిన గొప్ప మొగల్ చక్రవర్తి (1658–1707). – 15.

కవేన్యాక్ (Cavaignac), లూయీ ఎజేన్ (1802–1857) – ఫ్రెంచి జనరల్, రాజకీయవేత్త, అల్జీరియాను జయించడంలో పాల్గొన్నాడు (1831–48). పాశవిక చర్యలకు పేరుపడ్డాడు; 1848 జూన్‌లో యుద్ధమంత్రిగా వుండి పారిస్ కార్మికుల తిరుగుబాటును పశుప్రాయంగా అణచివేశాడు. – 100.

కాంబెల్ (Campbell) – ఇంగ్లీషు ఆఫీసరు, ఇండియా జాతీయ విముక్తి తిరుగుబాటును అణచివేయడంలో పాల్గొన్నాడు. – 159.

కాంబెల్ (Campbell), కోలిన్, బెరన్ క్లైడ్ (1792–1863) – బ్రిటిష్ జనరల్, తరువాత ఫీల్డ్‌మార్షల్, రెండవ ఆంగ్ల-సిక్కు యుద్ధంలో (1848–49), క్రైమియా యుద్ధంలో (1854–55) పాల్గొన్నాడు, ఇండియా జాతీయ విముక్తి తిరుగుబాటులో ఇండియాలోని ఇంగ్లీషు సైనిక బలాల సర్వసేనాధిపతి. – 122, 145–47, 149, 151–57, 159, 161, 163, 164, 167, 169, 188–90, 198–200, 202, 209, 221–23, 229, 231.

కాంబెల్ (Campbell), జార్జి (1824–1892) – ఇండియాలో ఇంగ్లీషు వలస ఉద్యోగి (1843–74లో వేర్వేరు కాలాలలో), తరువాత పార్లమెంటు సభ్యుడు (1875–92), లిబరల్ పార్టీ సభ్యుడు; ఇండియా విషయాలపై గ్రంథకర్త. – 39, 196.

కాడింగ్‌టన్ (Codrington), విలియమ్ జాన్ (1804–1884) – ఇంగ్లీషు జనరల్, క్రైమియాలో ఇంగ్లీషు సైన్య సర్వసేనానాయకుడు (1855–56). – 145.

కానింగ్ (Canning), చార్లెస్ జాన్, ఎర్ల్ (1812–1862) – ఇంగ్లీషు రాజనీతివేత్త, టోరీ, ఇండియా గవర్నర్ జనరల్ (1856–62), 1857–59 ఇండియా జాతీయ విముక్తి తిరుగుబాటు అణచివేతకు అధినేత. – 108, 166, 170, 177, 179, 180, 216, 219, 224.

కాబెట్ (Cobbett), విలియమ్ (1762–1835) – ఇంగ్లీషు రాజకీయవేత్త, పత్రికా రచయిత, పెటీబూర్జువా రాడికలిజంను ప్రచారం చేసినవారిలో ప్రముఖుడు, ఇంగ్లీషు రాజకీయ వ్యవస్థను ప్రజాస్వామికం చేయడానికి పాటుపడ్డాడు; 1802లో "Cobbett's Weekly Political Register" అనే వారపత్రికను ప్రారంభించాడు. – 24, 104.

కారన్‌వాలిస్ (Cornwallis), చార్లెస్, మార్క్విస్ (1738–1805) – బ్రిటిష్ అభివృద్ధినిరోధక రాజకీయవేత్త, ఇండియా గవర్నర్ జనరల్ (1786–93), ఐర్లండ్‌లో వైస్‌రాయిగా ఉన్నప్పుడు (1798–1801, 1805) ఆ దేశంలోని తిరుగుబాటును క్రూరంగా అణచివేశాడు (1798). – 178.

కార్బెట్ (Corbett), స్టూవర్ట్ (?–1865) – ఇంగ్లీషు జనరల్, 1857–59 ఇండియా జాతీయ విముక్తి తిరుగుబాటును అణచివేయడంలో పాల్గొన్నాడు. – 217.

కులీ ఖాన్ – చూ. నాదిర్ షా.

కువర్ సింగ్ (?–1858) – 1857–59లో ఇండియాలో జరిగిన జాతీయ విముక్తి తిరుగుబాటులో అయోధ్య తిరుగుబాటుదార్ల నాయకుడు. – 130, 222.

క్మెటీ (Kmety), ద్యోర్ద్ (1810–1865) – టర్కీ జనరల్, పుట్టుక రీత్యా హంగేరియన్; క్రైమియా యుద్ధంలో డాన్యూబ్ నది ప్రాంతంలోవున్న టర్కిష్ సైనిక బలాల సేనాని (1853–54), తరువాత కాకసస్‌లో సైనిక నాయకుడు (1854–55). – 145.

క్రామ్‌వెల్ (Cromwell), ఆలివర్ (1599–1658) – 17వ శతాబ్దిలో ఇంగ్లీషు బూర్జువా విప్లవంలో బూర్జువావర్గానికీ, బూర్జువాగా మారిపోయిన ప్రభువర్గానికీ నాయకుడు. 1653నుండి "లార్డ్ ప్రొటెక్టర్ ఆఫ్ ది కామన్‌వెల్త్." – 23.

క్లైవ్ (Clive), రాబర్ట్ (1725–1774) – బెంగాల్ గవర్నర్ (1757–60, 1765–67), ఇండియాను ఇంగ్లీషువారు జయించిన కాలంలో పాశవిక చర్యలను అవలంబించిన వలసవాదులలో పేరుమోసిన వాడు. – 26, 40.

గర్న్యే-పాజేస్ (Garnier-Pagès), ఎటియేన్ జోసెఫ్ లూయీ (1801–1841) – ఫ్రెంచి రాజకీయవేత్త, బూర్జువా ప్రజాస్వామ్యవాది, 1830 నాటి విప్లవం తరువాత రిపబ్లికన్ ప్రతిపక్షానికి నాయకత్వం వహించాడు. ఫ్రెంచి చేంబర్ ఆఫ్ డిప్యూటీస్ (పార్లమెంటు) సభ్యుడు (1831–34, 1835–41). – 53.

గర్న్యే-పాజేస్ (Garnier-Pagès), లూయీ అంటువాన్ (1803–1878) – ఫ్రెంచి రాజకీయవేత్త, మితవాద రిపబ్లికన్, 1848లో తాత్కాలిక ప్రభుత్వ సభ్యుడు, పారిస్ మేయరు. – 53.

గిబ్బన్ (Gibbon), ఎడ్వర్డ్ (1737–1794) – ఇంగ్లీషు బూర్జువా చరిత్రకారుడు, "రోమను సామ్రాజ్య పతనాస్తమయాల చరిత్ర" గ్రంథకర్త. – 53.

గ్యోతె (Goethe), యోహాన్ వోల్ఫ్‌గాంగ్ (1749–1832) – జర్మన్ మహాకవి, భావుకుడు. – 21–22.

గ్రన్‌విల్ (Granville), జార్జి లెవెసన్-గవర్, ఎర్ల్ (1815–1891) – ఇంగ్లీషు రాజనీతిజ్ఞుడు, విగ్గు, విదేశాంగ మంత్రి (1851–52, 1870–74, 1880–85), ప్రీవీ కౌన్సిల్ అధ్యక్షుడు (1852–54, 1855–58, 1859–66), వలసరాజ్యశాఖా మంత్రి (1868–70, 1886). – 51.

గ్రాంట్ (Grant), జేమ్స్ హోప్ (1808–1875) – బ్రిటిష్ జనరల్; చైనాతో జరిగిన మొదటి, రెండవ "నల్లమందు" యుద్ధాలలోనూ (1840–42, 1860–61), ఇండియాలో లేచిన జాతీయ విముక్తి తిరుగుబాటును అణచివేయడంలోనూ పాల్గొన్నాడు. – 151, 154, 157, 159, 200, 209, 221–23.

గ్రాంట్ (Grant), ప్యాట్రిక్ (1804–1895) – బ్రిటిష్ జనరల్, తరువాత ఫీల్డ్ మార్షల్, మద్రాసు సైన్య సర్వసేనానాయకుడు (1856–61), ఇండియాలో

లేచిన జాతీయ విముక్తి తిరుగుబాటును అణచివేయడంలో పాల్గొన్నాడు; 1857 మే నుండి ఆగస్టు వరకు ఇండియాలో సర్వసేనానాయకుడు. – 219.

గ్రేట్‌హెడ్ (Greathead), విలియమ్ విల్బర్‌ఫోర్స్ హారిస్ (1826–1878) – ఇంగ్లీషు ఆఫీసరు, ఇంజనీరు, ఇండియా జాతీయ విముక్తి తిరుగుబాటును అణచివేయడంలో పాల్గొన్నాడు. – 220.

గ్లాడ్‌స్టన్ (Gladstone), విలియం ఎవర్ట్ (1809–1898) – ఇంగ్లీషు రాజనీతిజ్ఞుడు, టోరీ, లిబరల్ పార్టీ నాయకుడు; కోశాధ్యక్షుడు (1852–55, 1859–66); ప్రధానమంత్రి (1868–74, 1880–85, 1886, 1892–94). – 190, 208

చాంబర్లెన్ (Chamberlain), నెవిల్ బోల్స్ (1820–1902) – బ్రిటిష్ జనరల్, తరువాత ఫీల్డ్‌మార్షల్, మొదటి ఆంగ్ల-అఫ్ఘన్ యుద్ధంలోనూ (1838–42), రెండవ ఆంగ్ల-సిక్కు యుద్ధంలోనూ (1848–49) పాల్గొన్నాడు, ఇండియాలో 1857–59 జాతీయ విముక్తి తిరుగుబాటు అణచివేతలో పాల్గొన్నాడు. – 88, 118, 155, 159.

చాప్‌మన్ (Chapman), జాన్ (1801–1854) – ఇంగ్లీషు పత్రికారచయిత, బూర్జువా రాడికల్, ఇండియాలో సంస్కరణలను బలపర్చాడు. – 38.

చార్లెస్, మొదటి (Charles I) (1600–1649) – ఇంగ్లండు రాజు (1625–49), 17వ శతాబ్దపు ఇంగ్లీషు బూర్జువా విప్లవంలో ఉరితీయబడ్డాడు. – 23.

చార్లెస్, ఐదవ (Charles V) (1500–1558) – స్పెయిన్ రాజు (1516–56), పవిత్ర రోమన్ చక్రవర్తి (1519–56). – 103.

చార్లెస్, పదవ (Charles X) (1757–1836) – ఫ్రాన్సు రాజు (1824–30). – 77.

చార్లెస్ (Charles), లుడ్విగ్ ఒయ్‌గెన్ (1826–1872) – స్వీడన్ యువరాజు, తరువాత 15వ చార్లెస్‌గా స్వీడన్ రాజు (1859–72). – 76.

చెంగిజ్ ఖాన్ (1155? –1227) – సుప్రసిద్ధ మంగోల్ విజేత, మంగోల్ సామ్రాజ్య స్థాపకుడు. – 188.

చైల్డ్ (Child), జోసియా (1630–1699) – ఇంగ్లీషు అర్థశాస్త్రవేత్త, వడ్డీ వ్యాపారస్థుడు, వర్తకుడు; వ్యాపారవాది; 1681–83, 1686–88లో ఈస్ట్ ఇండియా కంపెనీయొక్క బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ అధ్యక్షుడు. – 29.

జాకబ్ (Jacob), జార్జి లి గ్రాండ్ (1805–1881) – ఇంగ్లీషు కల్నల్, తరువాత జనరల్, 1857లో ఆంగ్లో-పర్షియా యుద్ధంలోనూ, ఇండియాలో 1857–59లో లేచిన జాతీయ విముక్తి తిరుగుబాటును అణచివేయడంలోనూ పాల్గొన్నాడు. – 73.

జార్జి, మొదటి (George I) (1660–1727) – గ్రేట్ బ్రిటన్ రాజు (1714–27). – 30.

జార్జి, రెండవ (George II) (1683–1760) – గ్రేట్ బ్రిటన్ రాజు (1727–60). – 30.

జార్జి, మూడవ (George III) (1738–1820) – గ్రేట్ బ్రిటన్ రాజు (1760–1820). – 25, 30.

జీనత్ మహల్ – ఆఖరి మొగల్ పాదుషా రెండవ బహదూర్ షా భార్య. – 220.

జోన్స్ (Jones), జాన్ (1811–1878) – ఇంగ్లీషు ఆఫీసరు, ఇండియాలో జాతీయ విముక్తి తిరుగుబాటు కాలంలో (1857–59) ఒక బ్రిగేడ్ నాయకుడు. – 199, 222.

టిప్పు సాహెబు (దాదాపు 1750–1799) – మైసూర్ సుల్తాన్ (1782–99), 1880, 90 దశకాల్లో ఇండియాలో ఇంగ్లీషు రాజ్యవిస్తరణము ప్రతిఘటించుచూ అనేక యుద్ధాలు చేశాడు. – 26, 84.

టోట్‌లేబెన్, ఇ. ఐ. (Totleben) (1818–1884) – రష్యన్ మిలిటరీ ఇంజనీరు, జనరల్, 1854–55 సెవస్తోపోల్ రక్షణ ఆర్గనైజర్లలో ఒకడు. – 132.

డల్‌హౌసీ (Dalhousie), జేమ్స్ ఆంద్రూ బ్రౌన్-రామ్సే, మార్క్విస్ (1812–1860) – బ్రిటిష్ రాజనీతివేత్త, ఇండియా గవర్నర్ జనరల్ (1848–56), వలసరాజ్య జైత్రయాత్ర విధానాన్ని నెరవేర్చాడు. – 57, 80, 84, 170, 174, 176, 196, 206, 215.

డాన్నర్ (Danner), లూయిసా క్రిస్టీనా, కౌంటెస్ (1815–1874) – డెన్మార్క్ రాజు ఏడవ ఫ్రెడరిక్ అనులోమ వివాహ భార్య. – 77.

డాస్ (Dawes) – ఇంగ్లీషు ఆఫీసరు. ఇతని అధ్యక్షతన న్యాయస్థానంలో రెండవ బహదూర్ షా విచారణ జరిగింది (1858). – 221.

డి కాంట్జో (De Kantzow) – ఇంగ్లీషు ఆఫీసరు, ఇండియాలో లేచిన జాతీయ విముక్తి తిరుగుబాటును అణచివేయడంలో పాల్గొన్నాడు. – 218.

డికిన్‌సన్ (Dickinson), జాన్ (1815–1876) – ఇంగ్లీషు పత్రికారచయిత, స్వేచ్ఛా వ్యాపారవాది, ఇండియాపై అనేక పుస్తకాలను రచించాడు. ఇండియా సంస్కరణ సంఘం స్థాపకులలో ఒకడు. – 33.

డిజ్రేలీ (Disraeli), బెంజమిన్, ఎర్ల్ ఆఫ్ బీకన్స్‌ఫీల్డ్ (1804–1881) – బ్రిటిష్ రాజనీతిజ్ఞుడు, రచయిత, టోరీ నాయకులలో ఒకడు, కోశాధ్యక్షుడు (1852, 1858–59, 1866–68), ప్రధాన మంత్రి (1868, 1874–80). – 52–55, 57, 58, 75, 224.

డెర్బీ (Derby), ఎడ్వర్డ్ జార్జి జ్యోఫ్రీ స్మిత్ స్టాన్లీ, ఎర్ల్ (1799–1869) – ఇంగ్లీషు రాజనీతిజ్ఞుడు, రాజకీయవేత్త, టోరీ నాయకుడు, ప్రధాన మంత్రి (1852, 1858–59, 1866–68). – 180, 204, 206.

తాంతియా తోపే (జననం 1814?–1859) – మహారాష్ట్ర సేనానాయకుడు. ఇండియాలో లేచిన జాతీయ విముక్తి తిరుగుబాటు నాయకులలో ఒకడు, కాన్పూర్, కాల్పీ,

గ్వాలియర్ ప్రాంతాల్లో తిరుగుబాటు దళాలకు నాయకత్వం వహించాడు; 1859లో తన సహచరుని నమ్మకద్రోహం ఫలితంగా పట్టుకోబడి ఇంగ్లీషువారిచేత ఉరితీయ బడ్డాడు. – 223, 224.

తైమూర్ (1336–1405) – మధ్య ఆసియా సేనానాయకుడు, విజేత. – 188.

దులీప్ సింగ్ (1837–1893) – పంజాబ్ మహారాజా (1843–49), రంజిత్ సింగ్ చిన్నకొడుకు; 1854నుండి ఇంగ్లండులో నివసించాడు. – 215.

నజీర్-ఎ-ద్దీన్ (?–1837) – అయోధ్య రాజా (1827–37). – 172.

నసర్-ఎ-ద్దీన్ (1831–1896) – పర్షియా దేశపు షా (1848–96). – 50.

నాదిర్ షా (కులీ ఖాన్) (1688–1747) – పర్షియా దేశపు షా (1736–47); 1738–39లో ఇండియాపై దిగ్విజయయాత్ర సాగించాడు. – 15.

నానా సాహెబ్ (1824?–?) – ఇండియాలో ఫ్యూడల్ సంస్థానాధిపతి, ఇండియాలో లేచిన జాతీయ విముక్తి తిరుగుబాటు నాయకులలో ఒకడు. – 92–94, 120, 183, 216, 218, 222–224.

నార్త్ (North), ఫ్రెడరిక్ (1732–1792) – ఇంగ్లీషు రాజనీతిజ్ఞుడు, టోరీ, కోశాధ్యక్షుడు (1767), ప్రధాన మంత్రి (1770–82); 1783లో మిశ్రమ మంత్రిమండలిలో అంతరంగిక శాఖా మంత్రి. – 25.

నికల్సన్ (Nicholson), జాన్ (1821–1857) – ఇంగ్లీషు జనరల్, మొదటి ఆంగ్ల-ఆఫ్ఘన్ యుద్ధంలోనూ (1842), రెండవ ఆంగ్ల-సిక్కు యుద్ధంలోనూ (1848–49) పాల్గొన్నాడు; ఇండియాలో లేచిన జాతీయ విముక్తి తిరుగుబాటు కాలంలో ఢిల్లీపై దాడిలో ఒక ఇంగ్లీషు దళానికి నాయకత్వం వహించాడు (1857). – 112, 117, 123.

నికోలస్, మొదటి (Nicholas I) (1796–1855) – రష్యా చక్రవర్తి (1825–55). – 169.

నీల్ (Nei ), జేమ్స్ జార్జి స్మిత్ (1810–1857) – ఇంగ్లీషు జనరల్, క్రైమియా యుద్ధంలో పాల్గొన్నాడు; ఇండియాలో లేచిన జాతీయ విముక్తి తిరుగుబాటును అణచి వేయడంలో కాన్పూర్‌వద్ద అతికఠినంగా ప్రవర్తించాడు. – 121, 219, 220.

నెపోలియన్, మొదటి (Napoleon I), బోనపార్ట్ (1769–1821) – ఫ్రెంచి చక్రవర్తి (1804–14, 1815). – 103, 111, 112.

నెపోలియన్, మూడవ (Napoleon III), (లూయీ నెపోలియన్ బోనపార్ట్) (1808–1873) – మొదటి నెపోలియన్ సోదరుని కుమారుడు, రెండవ ఫ్రెంచి రిపబ్లిక్ ప్రెసిడెంట్ (1848–51), ఫ్రాన్సు చక్రవర్తి (1852–70). – 65, 76, 100, 103, 111, 112, 166, 170.

నేపియర్ (Napier), చార్లెస్ జేమ్స్ (1782–1853) – బ్రిటిష్ జనరల్, మొదటి నెపోలియన్‌కి వ్యతిరేకంగా జరిగిన యుద్ధాల్లో పాల్గొన్నాడు; 1842–43లో ఇండియాలో సింధు రాష్ట్రాన్ని జయించిన యుద్ధంలో సైనిక బలాల సేనాని; 1843–47లో సింధు రాష్ట్రాన్ని పరిపాలించాడు. – 60, 69, 145.

పామర్‌స్టన్ (Palmerston), హెన్రి జాన్ టెంపిల్, వైకౌంట్ (1784–1865) – బ్రిటిష్ రాజనీతిజ్ఞుడు. తన రాజకీయ జీవితం మొదటి సంవత్సరాలలో ఇతడు టోరీ, 1830నుండి విగ్గు పార్టీలో కుడిపక్షం సహాయాన్ని పొందిన నాయకుల్లో ఒకడు, విదేశాంగ మంత్రి (1830–34, 1835–41, 1846–51), స్వదేశ వ్యవహారాల మంత్రి (1852–55), ప్రధాన మంత్రి (1855–58, 1859–65). – 52, 70–76, 166, 172, 173, 206–208, 224.

పిట్ (Pitt), విలియమ్ జూనియర్ (1759–1806) – ఇంగ్లీషు రాజనీతిజ్ఞుడు, టోరీ పార్టీ నాయకుల్లో ఒకడు, ప్రధాన మంత్రి (1783–1801, 1804–06). – 26, 206.

పీల్ (Peel), విలియమ్ (1824–1858) – ఇంగ్లీషు ఆఫీసరు, ఇండియాలో లేచిన జాతీయ విముక్తి తిరుగుబాటును అణచివేయడంలో ఒక నావికాదళపు బ్రిగేడ్ నాయకుడుగా పాల్గొన్నాడు. – 221.

పురందర్ సింగ్ – హిందూస్థానంలో ఒక రాజు. – 126.

పేటన్ (Paton), జాన్ స్టువర్ట్ (1821–1889) – ఇంగ్లీషు ఆఫీసరు, తరువాత జనరల్, మొదటి, రెండవ ఆంగ్ల-సిక్కు యుద్ధాల్లోనూ (1845–46, 1848–49), ఇండియాలో లేచిన జాతీయ విముక్తి తిరుగుబాటును అణచివేయడంలోనూ పాల్గొన్నాడు. – 118.

పొల్లెక్స్‌ఫెన్ (Pol exfen), జాన్ – ఇంగ్లీషు వర్తకుడు, ఆర్థిక సమస్యలపై రచయిత, ఈస్ట్ ఇండియా కంపెనీ గుత్తాధిపత్యాన్ని రద్దుచేయవలసిందని వాదించాడు. – 29.

ప్రోబిన్ (Probyn), డైటన్ మక్-వాటన్ (1833–?) – ఇంగ్లీషు ఆఫీసరు, తరువాత జనరల్, ఇండియాలో లేచిన జాతీయ విముక్తి తిరుగుబాటును అణచివేయడంలో పాల్గొన్నాడు, పంజాబ్ అశ్విక దళానికి నాయకత్వం వహించాడు. – 221.

ఫాక్స్ (Fox), చార్లెస్ జేమ్స్ (1749–1806) – ఇంగ్లీషు రాజనీతిజ్ఞుడు, విగ్గు నాయకుడు, విదేశాంగ మంత్రి (1782, 1783, 1806). – 25, 26.

ఫెర్డినాండ్ (Ferdinand), ప్రిన్స్ – చూ. ఫ్రెడరిక్-ఫెర్డినాండ్.

ఫెరోజ్ షా – రెండవ బహదూర్ షా బంధువు, ఇండియాలో లేచిన జాతీయ విముక్తి తిరుగుబాటు నాయకులలో ఒకడు, మాల్వా అయోధ్యలోని తిరుగుబాటుదార్లకు నాయకత్వం వహించాడు. – 222.

ఫేన్ (Fane), వాల్టర్ (1828–1885) – ఇంగ్లీషు ఆఫీసరు, తర్వాత జనరల్, పంజాబ్ అశ్విక దళంలో పనిచేశాడు (1849–57), ఇండియాలో లేచిన జాతీయ విముక్తి తిరుగుబాటును అణచివేయడంలో పాల్గొన్నాడు. – 221.

ఫ్రాంక్స్ (Franks), థామస్ హార్ట్ (1808–1862) – ఇంగ్లీషు జనరల్, రెండవ ఆంగ్ల-సిక్కు యుద్ధం (1848–49)లోనూ, ఇండియాలో లేచిన జాతీయ విముక్తి తిరుగుబాటును అణచివేయడంలోనూ పాల్గొన్నాడు. – 155, 157, 160.

ఫ్రెడరిక్, ఏడవ (Frederick VII) (1808–1863) – డెన్మార్క్ రాజు (1848–63). – 77.

ఫ్రెడరిక్-ఫెర్డినాండ్ (Frederick-Ferdinand) (1792–1863) – డెన్మార్క్ యువరాజు. – 77.

బహదూర్, జంగ్ (1816–1877) – భారతీయ సంస్థానాధీశుడు, 1846నుండి నేపాల్ రాణా; ఇండియాలో లేచిన జాతీయ విముక్తి తిరుగుబాటు కాలంలో (1857–59) ఇంగ్లీషువారి పక్షం వహించాడు. – 50, 106, 155, 224.

బహదూర్ షా, రెండవ (1767–1862) – మొగల్ చక్రవర్తులలో కడపటివాడు (1837–58); ఇంగ్లీషువారు ఇతనిని రాజ్యభ్రష్టుని కావించారు, కాని 1857లో తిరుగుబాటుదార్లు ఇతనిని చక్రవర్తిగా ప్రకటించారు. 1857 సెప్టెంబరులో ఢిల్లీ పట్టుపడిన తర్వాత, ఇంగ్లీషువారు ఇతనిని ఖైదీగా పట్టుకుని బర్మాకు ప్రవాసం పంపించేశారు (1858). – 43, 47, 84.

బార్నార్డ్ (Barnard), హెన్రీ విలియమ్ (1799–1857) – ఇంగ్లీషు జనరల్, 1854–55లో క్రైమియా యుద్ధంలో పాల్గొన్నాడు; 1857లో ఢిల్లీని ముట్టడించిన ఇంగ్లీషు సైనిక దళానికి నాయకుడుగా వున్నాడు. – 59, 63, 64, 65, 67–69, 71, 86, 88, 89, 118, 218.

బెంటింక్ (Bentinck), విలియమ్ (1774–1839) – ఇంగ్లీషు వలసరాజ్య పరిపాలనాధికారి, ఇండియా గవర్నర్ జనరల్ (1828–35). – 172.

బెయిలీ (Baillie), హెన్రీ జేమ్స్ – ఇంగ్లీషు ప్రభుత్వోద్యోగి, బోర్డ్ ఆఫ్ కంట్రోల్ సెక్రటరీ. – 173.

బెల్‌ఫీల్డ్ (Be field), జేమ్స్ – మాంచెస్టర్‌లో నివసించిన ఎంగెల్స్ స్నేహితుడు. – 231.

బోయిలూ (Boileau) – బ్రిటిష్ ఆఫీసరు. ఇండియాలో లేచిన జాతీయ విముక్తి తిరుగుబాటును అణచివేయడంలో పాల్గొన్నాడు. – 221.

బౌరింగ్ (Bowring), జాన్ (1792–1872) – ఇంగ్లీషు రాజకీయ ప్రముఖుడు; బెంతమ్ అనుచరుడు, స్వేచ్ఛా వ్యాపారవాది, వలసరాజ్య ఉద్యోగులలో ప్రముఖుడు, కాన్‌టన్‌లో కాన్సల్ (1847–52), హాంకాంగ్ గవర్నర్, హాంకాంగ్ సర్వసైన్యాధిపతి, వైస్

అడ్మిరల్ (1854–57) దౌత్యవ్యవహర్త చైనాతో వర్తకంపై అజమాయిషీ చేశాడు చైనాతో జరిగిన రెండవ నల్లమందు యుద్ధాన్ని (1856–58) ప్రజ్వ లింపజేయడంలో సహాయపడ్డాడు – 103

బౌర్‌షియర్ (Bourch er) జార్జి (1821–1898) – బ్రిటిష్ ఆఫీసరు ఇండియా జాతీయ విముక్తి తిరుగుబాటును అణచివేయడంలో పాల్గొన్నాడు – 116.

బ్రిగ్స్ (Br ggs) జాన్ (1785–1875) – ఇంగ్లీషు జనరల్ 1801నుండి 1835 వరకూ ఈస్ట్ ఇండియా కంపెనీలో బోర్డ్ ఆఫ్ ప్రొప్రయిటర్స్‌లో సభ్యుడు, స్వేచ్ఛావ్యాపారవాది, ఇండియా పర్షియాలపై అనేక పుస్తకాలు రాసి అనేక గ్రంథాలు అనువదించాడు – 195

బ్రెరెటన్ (Brereton) – ఇండియాలో ఇంగ్లీషు ఉద్యోగి పంజాబులో లూధియానా జిల్లాకు కమీషనర్ (1855) – 83 84

బ్రైట్ (Br ght) జాన్ (1811–1889) – ఇంగ్లీషు కార్ఖానా అధిపతి రాజకీయ ప్రముఖుడు స్వేచ్ఛావ్యాపారవాదుల నాయకుడు ఆంటీ-కారన్ లా లీగ్ స్థాపకుడు, పద్దెనిమిది వందల అరవైల తొలి సంవత్సరాలనుండి వామపక్ష లిబరల్ పార్టీ నాయకుడు, లిబరల్ పార్టీ ప్రభుత్వ మంత్రిమండలులలో మంత్రి పదవులను ఆక్రమించాడు. – 192–94, 197

బ్లాకెట్ (B ackett), జాన్ (1821–1856) – ఇంగ్లీషు పార్లమెంటులో సభ్యుడు – 14

బ్లాక్‌స్టన్ (B ackstone) విలియం (1723–1780) – ఇంగ్లీషు న్యాయశాస్త్ర వేత్త, ఇంగ్లీషు రాజ్యాంగచట్టబద్ధమైన రాచరిక వ్యవస్థను సమర్థించేవాడు – 103

మంటెస్క్యూ (Montesqu eu), షార్ల్ లూయీ (1689–1755) – ఫ్రెంచి సాంఘిక శాస్త్రవేత్త, అర్థశాస్త్రజ్ఞుడు రచయిత, రాజ్యాంగచట్టబద్ధమైన రాచరిక ప్రభుత్వ విధాన సిద్ధాంతకర్త. – 11.

మంట్గొమెరి (Montgomery), రాబర్ట్ (1809–1887) – ఇంగ్లీషు ఉద్యోగి, 1858లో అయోధ్య చీఫ్ కమీషనరు 1859–65లో పంజాబ్ గవర్నర్. – 224.

మన్ (Mun) థామస్ (1571–1641) – ఇంగ్లీషు వర్తకుడు అర్థశాస్త్రవేత్త వ్యాపారవాది 1615నుండి ఈస్ట్ ఇండియా కంపెనీలో ఒక డైరెక్టరు – 29.

ముర్రే (Murray) చార్లెస్ (1806–1895) – ఇంగ్లీషు దౌత్యనీతిజ్ఞుడు ఈజిప్టులో కాన్సల్ జనరల్ (1846–53) టెహరాన్‌లో రాయబారి (1854–59) – 73

మహమ్మద్ అలీ షా – అయోధ్య రాజు (1837–1842) – 173

మాన్ సింగ్ – ఇండియాలో ఒక రాజు 1858 ఆగస్టులో తిరుగుబాటుదార్లతో చేరాడు, గాని 1859 ఆరంభంలో జాతీయ విముక్తి తిరుగుబాటుకు ప్రముఖ నాయకుడైన తాంతియా తోపే యెడ ద్రోహం చేసి అతనిని శత్రువుకు ఒప్పజెప్పాడు – 212

మాన్ సింగ్ – అయోధ్య రాజ్యంలో ఒడా ఫ్యూడల్ భూస్వామి ఇండియాలో లేచిన జాతీయ విముక్తి తిరుగుబాటులో ఇంగ్లీషు వలసవాదుల పక్షం వహించాడు – 209

మామూ ఖాన్ – ఇండియాలో జరిగిన జాతీయ విముక్తి తిరుగుబాటులో లక్నో ప్రాంతంలో వున్న అయోధ్య తిరుగుబాటుదారకు నాయకత్వం వహించాడు – 224

మార్ల్‌బరో (Mar borough) జాన్ చర్చిల్ డ్యూక్ (1650–1722) – ఇంగ్లీషు జనరల్ 1702–11లో స్పానిష్ వారసత్వపు యుద్ధంలో బ్రిటిష్ సైన్యాలపై సర్వసేనాధిపత్యం వహించాడు – 145

మిన్యే (M n e) క్లాడ్ ఎటియేన్ (1804–1879) – ఫ్రెంచి సైన్యంలో ఆఫీసరు, మిలిటరీ ఆవిష్కర్త, కొత్త తరహా రైఫిల్‌ను ఆవిష్కరించాడు – 150

మిల్ (Mı ), జేమ్సు (1773–1836) – బ్రిటిష్ బూర్జువా ఆర్థికశాస్త్రవేత్త, తత్వశాస్త్రజ్ఞుడు, 'బ్రిటిష్ ఇండియా చరిత్ర గ్రంథకర్త – 26

మేసన్ (Mason), జార్జి హెన్రీ మంక్ (1825–1857) – ఇంగ్లీషు ఆఫీసరు, జోధ్‌పూర్‌లో రెసిడెంటు, ఇండియాలో లేచిన జాతీయ విముక్తి తిరుగుబాటులో హతుడయాడు. – 126.

మొగల్ పాదుషాలు — ఇండియాను పరిపాలించిన చక్రవర్తుల వంశం (1526–1858) — 34 35 44 47, 221

మొల్యేర్ (Mo ere) జాన్ బాప్టిస్ట్ (పొక్లెన్) (1622–1673) ప్రఖ్యాతి వడసిన ఫ్రెంచి నాటకరచయిత — 104

మోగ్స్ (Mogs) — ఇంగ్లీషు ఆఫీసరు, ఇండియాలో లేచిన జాతీయ విముక్తి తిరుగుబాటును అణచివేయడంలో పాల్గొన్నాడు. — 222

మోజర్ట్ (Mozart), వాల్ఫ్గాంగ్ అమాడేయుస్ (1756–1791) — ప్రఖ్యాతి వడసిన ఆస్ట్రియన్ వాగ్గేయకారుడు — 103, 123, 257

మౌల్వీ అహమద్ షా (?–1858) — ఇండియాలో లేచిన జాతీయ విముక్తి తిరుగుబాటు ప్రముఖ నాయకులలో ఒకడు ప్రజలకు ప్రాతినిధ్యం వహించి ప్రజల యోగక్షేమాలకై కృషిసల్పాడు అయోధ్యలో తిరుగుబాటును నడిపించాడు లక్నో రక్షణలో ధైర్యసాహసాలు ప్రదర్శించి తిరుగుబాటుపట్ల అచంచలదీక్షతో నిలబడ్డాడు విశ్వాసఘాత ఫలితంగా 1858లో హత్య గావింపబడ్డాడు — 222

రణబీర్ సింగ్ — హిందూస్థానంలో కాశ్మీర్ రాజా ఇండియాలో లేచిన జాతీయ విముక్తి తిరుగుబాటులో ఇంగ్లీషువారి పక్షం వహించాడు — 123

రస్సెల్ (Russe ) జాన్ (1792–1878) — ఇంగ్లీషు రాజనీతిజ్ఞుడు, విగ్ నాయకుడు, ప్రధాన మంత్రి (1846–52 1865–66) విదేశాంగ మంత్రి (1852–53, 1859–65) ప్రీవీ కౌన్సిల్ సభాపతి (1854–55) — 207

రస్సెల్ (Russe ), విలియమ్ హోవర్డ్ (1820–1907) — బ్రిటిష్ పత్రికారచయిత Times" పత్రిక యుద్ధ విలేకరి. — 161, 164 185–87

రాగ్లన్ (Rag an), ఫిట్జ్‌రాయ్ జేమ్స్ హెన్రీ సోమర్సెట్, బేరన్ (1788–1855) — ఇంగ్లీషు ఫీల్డ్‌మార్షల్, 1854–55లో క్రైమియాలో సర్వసేనాధిపతి — 145

రాఫిల్స్ (Raff es), థామస్ స్టాంఫర్డ్ (1781–1826) — ఇంగ్లీష్ వలసరాజ్య పరిపాలనాధికారి 1811–16లో జావాలో లెఫ్టినెంట్ గవర్నర్, 'జావా చరిత్ర" గ్రంథకర్త. — 15

రాబర్ట్సు (Roberts) హెన్రి (1800–1860) – ఇంగ్లీషు జనరల్ ఇండియాలో లేచిన జాతీయ విముక్తి తిరుగుబాటును అణచివేయడంలో పాల్గొన్నాడు – 221

రీడ్ (Reed) థామస్ (1796–1883) – ఇంగ్లీషు జనరల్, ఇండియాలో లేచిన జాతీయ విముక్తి తిరుగుబాటును అణచివేయడంలో పాల్గొన్నాడు – 88 118

రెనాడ్ (Renaud) (?–1857) – ఇంగ్లీషు ఆఫీసరు, 1857–59లో ఇండియాలో లేచిన జాతీయ విముక్తి తిరుగుబాటును అణచివేయడంలో పాల్గొన్నాడు – 93

రోజ్ (Rose) హ్యూ హెన్రి (1801–1885) – ఇంగ్లీషు జనరల్, తరువాత ఫీల్డ్‌మార్షల్ క్రైమియా యుద్ధంలో (1854–56) పాల్గొన్నాడు 1857–59లో ఇండియాలో లేచిన జాతీయ విముక్తి తిరుగుబాటును అణచివేసిన ముఖ్యులలో ఒకడు – 155 159 189 200 202, 222, 223.

లక్ష్మీబాయి (1835–1858) – భారతజాతి పూజలను గొన్న వీరనారీరత్నం, 1857–59లో జాతీయ విముక్తి తిరుగుబాటు నాయకులలో ఈమె ఒకరు, తిరుగుబాటుదార్ల దళాలకు నాయకత్వం వహించి రణరంగంలో మరణించింది – 223

లారెన్సు (Lawrence) – ఇండియాలో ఇంగ్లీషు ఆఫీసరు – 63.

లారెన్సు (Lawrence), జాన్ లైర్డ్ మెయిర్ (1806–1857) – బ్రిటిష్ వలస రాజ్య పాలనలో ఉన్నతోద్యోగి పంజాబ్ ఛీఫ్ కమీషనరు (1853–57) ఇండియా వైస్రాయి (1864–69). – 83 102 118 119, 155

లారెన్సు (Lawrence) జార్జి సెంట్ పాట్రిక్ (1804–1884) – ఇంగ్లీషు జనరల్. 1857–59లో ఇండియాలో లేచిన జాతీయ విముక్తి తిరుగుబాటును అణచివేయడంలో పాల్గొన్నాడు రాజపుత్రస్థానంలో రెసిడెంటు (1857–64). – 130, 212.

లారెన్సు (Lawrence), హెన్రి మంట్గొమెరి (1806–1857) – బ్రిటిష్ జనరల్, నేపాలులో రెసిడెంటు (1843–46), అయోధ్యలో ఛీఫ్ కమీషనరు (1857), 1857–59లో ఇండియాలో లేచిన జాతీయ విముక్తి తిరుగుబాటు కాలంలో లక్నోలో వున్న బ్రిటిష్ సైన్యానికి సేనానాయకుడు. – 44, 62, 93, 114, 220.

లాసీ ఇవన్స్ (Lacy Evans) – చూ. ఇవన్స్, జార్జి డి లాసీ.

లీడ్స్ (Leeds), థామస్ ఆస్బోర్న్ (1631–1712) – ఇంగ్లీషు రాజనీతిజ్ఞుడు, టోరీ, ప్రధాన మంత్రి (1674–79, 1690–95); లంచం పుచ్చుకున్నట్టు ఇతనిపై 1695లో పార్లమెంటు నేరం మోపింది. – 204.

లూగార్డ్ (Lugard), ఎడ్వర్డ్ (1810–1898) – ఇంగ్లీషు జనరల్, ఆంగ్ల-పర్షియా యుద్ధం (1856–57)లోనూ, 1857–59లో ఇండియాలో లేచిన జాతీయ విముక్తి తిరుగుబాటును అణచివేయడంలోనూ పాల్గొన్నాడు. – 158, 200, 222.

లూయీ నెపోలియన్ (Louis Napoleon) – చూ. నెపోలియన్, మూడవ.

లూయీ ఫిలిప్ (Louis Philippe) (1773–1850) – డ్యూక్ అఫ్ ఆర్లియన్స్, ఫ్రాన్సు రాజు (1830–48) – 23, 24, 53, 169.

వజీద్ అలీ షా – అయోధ్య రాజు (1847–1856). – 61, 171.

వాన్ కోర్ట్లాండ్ (Van Cortlandt), హెన్రీ చార్లెస్ (1815–1888) ఇంగ్లీషు జనరల్; 1832–39లో సిక్కు ప్రభుత్వంకింద మిలిటరీ ఉద్యోగం చేశాడు, మొదటి, రెండవ ఆంగ్ల-సిక్కు యుద్ధాల్లో (1845–46, 1848–49) ఇంగ్లీషువారి పక్షాన యుద్ధం చేశాడు; ఇండియాలో లేచిన జాతీయ విముక్తి తిరుగుబాటును అణచివేయడంలో పాల్గొన్నాడు. – 91, 106, 120.

వాన్ (Vaughan), జాన్ లూథర్ – ఇంగ్లీషు జనరల్, ఇండియాలో జాతీయ విముక్తి తిరుగుబాటును అణచివేయడంలో పాల్గొన్నాడు. – 62.

వారెన్ (Warren), చార్లెస్ (1798–1866) – ఇంగ్లీషు ఆఫీసరు, 1858లో జనరల్ అయాడు; 1816–19లోనూ, 1830–38లోనూ ఇండియాలో సైన్యంలో పనిచేశాడు, క్రైమియా యుద్ధంలో పాల్గొన్నాడు. – 37.

వాల్‌పోల్ (Walpole), రాబర్ట్ (1808–1876) – ఇంగ్లీషు ఆఫీసరు, తర్వాత జనరల్, కార్ఫ్యూ ద్వీపంలో కొలువుచేశాడు (1847–56). ఇండియాలో లేచిన

జాతీయ విముక్తి తిరుగుబాటును అణచివేయడంలో ఒక బ్రిటిష్ బ్రిగేడ్‌కు నాయకత్వం వహించాడు. – 223.

విండ్‌హామ్ (Windham), చార్లెస్ ఏష్ (1810–1870) – ఇంగ్లీషు జనరల్, 1854–56 క్రైమియా యుద్ధంలో పాల్గొన్నాడు, లాహోర్‌లో వున్న ఇంగ్లీషు సైనిక బలాలకు నాయకత్వం వహించాడు (1857–61). – 145, 147–51, 153, 233.

విక్టోరియా (Victoria) (1819–1901) – గ్రేట్ బ్రిటన్ రాణి (1837–1901) – 224.

విట్‌లక్ (Whitlock), జార్జి కార్నిష్ (1798–1868) – ఇంగ్లీషు జనరల్. 1818లో ఈస్ట్ ఇండియా కంపెనీ ఉద్యోగంలో ప్రవేశించి, 1857–59లో ఇండియాలో లేచిన జాతీయ విముక్తి తిరుగుబాటును అణచివేయడంలో పాల్గొన్నాడు. – 189, 201.

విలియమ్, మూడవ (William III), ప్రిన్స్ ఆఫ్ ఆరంజ్ (1650–1702) – నెదర్లాండ్స్ పాలకుడు (1672–1702), ఇంగ్లండు రాజు (1689–1702). – 23, 24, 29.

విలియమ్, నాల్గవ (William IV) (1765–1837) – గ్రేట్ బ్రిటన్ రాజు (1830–37). – 172.

విలియమ్స్ (Williams), విలియమ్ ఫెన్‌విక్, బారనెట్ కార్స్ (1800–1883) – ఇంగ్లీషు జనరల్, 1855లో క్రైమియా యుద్ధంలో కార్స్ రక్షణకు నాయకత్వం వహించాడు, పార్లమెంటు సభ్యుడు (1856–59), వూలిచ్ నగర రక్షక దళానికి నాయకుడు. – 145.

విల్సన్ (Wilson), ఆర్చ్‌డేల్ (1803–1874) – ఇంగ్లీషు జనరల్, ఇండియాలో లేచిన జాతీయ విముక్తి తిరుగుబాటులో ఢిల్లీని ముట్టడించి, తుపానుదాడిచేసి పట్టుకున్న (1857) సేనలకూ, లక్నోని ముట్టడించినప్పుడు (1858) శతఘ్ని దళానికీ నాయకత్వం వహించాడు. – 118, 150, 151, 189, 218, 220.

విల్సన్ (Wilson), ఎస్. (?–1857) – ఇంగ్లీషు కల్నల్, 1857–59లో ఇండియాలో లేచిన జాతీయ విముక్తి తిరుగుబాటును అణచివేయడంలో పాల్గొన్నాడు. – 150.

విల్సన్ (Wilson), జేమ్స్ (1805–1860) – ఇంగ్లీషు బూర్జువా అర్థశాస్త్రవేత్త, రాజకీయవేత్త, స్వేచ్ఛావ్యాపారవాది, "Economist" పత్రికా స్థాపకుడూ సంపాదకుడూ, పార్లమెంటు సభ్యుడు, ట్రెజరీ ఫైనాన్షియల్ సెక్రటరీ (1853–58). – 111, 134, 138.

వీలర్ (Wheeler), హ్యూ మాసీ (1789–1857) – ఇంగ్లీషు జనరల్, 1838–39లో ఆంగ్ల-అఫ్ఘన్ యుద్ధంలోనూ, ఆంగ్ల-సిక్కు యుద్ధాల్లోనూ (1845–46, 1848–49) పాల్గొన్నాడు, కాన్పూర్ నగర రక్షక దళాల నాయకుడు (1856–57), ఇండియాలో 1857–59లో లేచిన జాతీయ విముక్తి తిరుగుబాటును అణచివేయడంలో పాల్గొన్నాడు. – 92, 114, 218

వుడ్ (Wood), చార్లెస్ (1800–1885) – ఇంగ్లీషు రాజనీతిజ్ఞుడు, విగ్గు, కోశాధ్యక్షుడు (1846–52), బోర్డ్ ఆఫ్ కంట్రోల్ అధ్యక్షుడు (1852–55), ఫస్ట్ లార్డ్ ఆఫ్ ది ఎడ్మిరాల్టీ (1855–58), ఇండియా సెక్రటరీ (1859–66), లార్డ్ ప్రివీసీల్ (1870–74). – 14, 15.

వుడ్‌బర్న్ (Woodburn) – ఇంగ్లీషు జనరల్, ఇండియాలో లేచిన జాతీయ విముక్తి తిరుగుబాటును అణచివేయడంలో పాల్గొన్నాడు. – 61.

వెల్లస్లీ (We lesley), రిచర్డ్ కోలీ, మార్క్విస్ (1760–1842) – బ్రిటిష్ పార్లమెంటు సభ్యుడు; ఇండియా గవర్నర్ జనరల్, విదేశాంగ మంత్రి (1809–12). – 171.

వోల్టేర్ (Voltaire), ఫ్రాన్సువా మరీ (అరుయే) (1694–1778) – ఫ్రెంచి తత్వవేత్త, రచయిత, చరిత్రకారుడు; నిరంకుశత్వానికి వ్యతిరేకంగానూ, కాథలిక్ మతానికి వ్యతిరేకంగానూ పోరాడాడు. – 52.

షవర్స్ (Showers) – ఇంగ్లీషు ఆఫీసరు, ఇండియాలో లేచిన జాతీయ విముక్తి తిరుగు

బాటును అణచివేయడంలో ఒక బ్రిగేడ్‌కు నాయకుడుగానూ, ఢిల్లీ, ఆగ్రా యుద్ధ చర్యలలోనూ పాల్గొన్నాడు. – 221.

షిల్లర్ (Schiller), ఫ్రీడ్రిక్ (1759–1805) – జర్మన్ మహా కవి, నాటక రచయిత. – 205.

షోర్ (Shore), జాన్ టెయిన్‌మత్ (1751–1834) – బ్రిటిష్ వలసరాజ్యోద్యోగి, ఇండియా గవర్నర్ జనరల్ (1793–98). – 171.

సల్తికోవ్, ఎ. డి. (Saltykov) ప్రిన్స్ (1806–1859) – రష్యన్ పర్యాటకుడు, రచయిత, కళాకారుడు, 1841–43లోనూ, 1845–46లోనూ ఇండియాలో పర్యటించాడు. – 40.

సింధ్యా, ఆలీ జా జై జీ (భగీరథ రావు) (1835?–?) – గ్వాలియర్ సంస్థానాన్ని పాలించిన మరాఠా రాజు; జాతీయ విముక్తి తిరుగుబాటులో ఇంగ్లీషువారి పక్షం వహించాడు. – 50, 109, 211, 212, 218, 223.

సింప్సన్ (Simpson) – ఇంగ్లీషు కల్నల్, ఇండియాలో లేచిన జాతీయ విముక్తి తిరుగుబాటును అణచివేయడంలో పాల్గొన్నాడు, అలహాబాదులో వున్న సైనిక బలాలకు నాయకత్వం వహించాడు. – 219.

సింప్సన్ (Simpson), జేమ్స్ (1792–1868) – ఇంగ్లీషు జనరల్, 1855 స్టాఫ్ కమాండర్ (మార్చి–జూన్), తర్వాత క్రైమియాలో సర్వసేనాధిపతి (జూన్–నవంబరు). – 145.

సీజర్ (Caesar), గయస్ జూలియస్ (100–44 క్రీ. పూ.) – సుప్రసిద్ధ రోమన్ సేనాధిపతి, రాజనీతిజ్ఞుడు. – 103.

సీటన్ (Seaton), థామస్ (1806–1876) – ఇంగ్లీషు కల్నల్, తర్వాత జనరల్, 1822 నుండి ఈస్ట్ ఇండియా కంపెనీలో ఉద్యోగి, ఇండియాలో లేచిన జాతీయ విముక్తి తిరుగుబాటును అణచివేయడంలో పాల్గొన్నాడు. – 221.

స్టాన్లీ (Stanley), ఎడ్వర్డ్ హెన్రీ, ఎర్ల్ ఆఫ్ డెర్బీ (1826–1893) – ఇంగ్లీషు రాజనీతిజ్ఞుడు, టోరీ, లిబరల్, వలసరాజ్య వ్యవహార మంత్రి (1858, 1882–85), ఇండియా సెక్రటరీ (1858–59), విదేశాంగ మంత్రి (1866–68, 1874–78). – 23, 224.

స్ట్యువర్ట్ (Stewart) డోనల్డ్ మార్టిన్ (1824–1900) – బ్రిటిష్ ఆఫీసరు, తర్వాత ఫీల్డ్‌మార్షల్, 1857–59లో ఇండియాలో లేచిన జాతీయ విముక్తి తిరుగుబాటును అణచివేయడంలో పాల్గొన్నాడు. – 108, 109.

స్మిత్ (Smith), జాన్ మార్క్ ఫ్రెడరిక్ (1790–1874) – ఇంగ్లీషు జనరల్, మిలిటరీ ఇంజనీరు, పార్లమెంటు సభ్యుడు. – 76.

స్మిత్ (Smith), రాబర్ట్ వెర్నన్ (1800–1873) – ఇంగ్లీషు రాజనీతిజ్ఞుడు, విగ్గు, పార్లమెంటు సభ్యుడు, బోర్డ్ ఆఫ్ కంట్రోల్ సభాపతి (1855–58). – 59, 61.

స్లీమన్ (Sleeman), విలియమ్ హెన్రీ (1788–1856) – ఇంగ్లీషు వలసరాజ్యోద్యోగి, ఆఫీసరు, తర్వాత జనరల్, గ్వాలియర్‌లోనూ (1843–49), లక్నోలోనూ (1849–54) రెసిడెంటు – 175.

హజ్రత్ మహల్ – అయోధ్య రాణి, 1857–59లో ఇండియాలో లేచిన జాతీయ విముక్తి తిరుగుబాటులో అయోధ్య తిరుగుబాటుదార్లకు నాయకత్వం వహించింది. – 222, 224.

హాగ్ (Hogg), జేమ్స్ వియర్ (1790–1876) – ఇంగ్లీషు రాజకీయవేత్త, పార్లమెంటు సభ్యుడు, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ సభాపతి (1846–47, 1852–53), ఇండియా కౌన్సిల్ సభ్యుడు (1858–72). – 14.

హాడ్సన్ (Hodson), విలియమ్ స్టీఫెన్ రెయిక్స్ (1821–1858) – ఇంగ్లీషు ఆఫీసరు, 1845నుండి ఈస్ట్ ఇండియా కంపెనీలో పనిచేశాడు; ఇండియాలో లేచిన జాతీయ విముక్తి తిరుగుబాటులో ఇర్రెగ్యులర్ కేవల్రీ రెజిమెంటుకు నాయకత్వం వహించాడు, ఢిల్లీని, లక్నోనూ పట్టుకోవడంలో పాల్గొన్నాడు, పాశవిక చర్యలకు పేరుపడ్డాడు. – 220, 221.

హార్డింజ్ (Hardinge), హెన్రీ (1785–1856) – ఇంగ్లిషు ఫీల్డ్‌మార్షల్, రాజనీతిజ్ఞుడు, టోరీ, ఇండియా గవర్నర్ జనరల్ (1844–48). – 175.

హావ్‌లక్ (Havelock), హెన్రీ (1795–1857) – బ్రిటిష్ జనరల్, ఇండియాలో లేచిన జాతీయ విముక్తి తిరుగుబాటును అణచివేయడంలో పాల్గొన్నాడు. – 93, 94, 106, 111, 114, 115, 120, 133, 189, 202, 219–21, 228, 231.

హెవిట్ (Hewitt) – ఇంగ్లిషు జనరల్, ఇండియాలో లేచిన జాతీయ విముక్తి తిరుగుబాటు సమయంలో 1857లో మీరట్ నగర రక్షక దళానికి నాయకత్వం వహించాడు. – 112.

హోమ్స్ (Holmes), జాన్ (1808–1878) – ఇంగ్లిషు కల్నల్, తర్వాత జనరల్, మొదటి ఆంగ్ల-అఫ్ఘన్ యుద్ధంలోనూ (1838–42), ఇండియాలో లేచిన జాతీయ విముక్తి తిరుగుబాటును అణచివేయడంలోనూ పాల్గొన్నాడు. – 211.

హోల్కార్ తుకాజీ, రెండవ (1836?–?) – ఇందూర్ సంస్థానపు మరాఠా ప్రభువు, ఇండియాలో లేచిన జాతీయ విముక్తి తిరుగుబాటు సమయంలో ఇంగ్లిషువారి పక్షం వహించాడు. – 109, 220.

హ్యూమ్ (Hume), జోసెఫ్ (1777–1855) – ఇంగ్లిషు రాజకీయవేత్త, బూర్జువా రాడికల్ నాయకుల్లో ఒకడు, పార్లమెంటు సభ్యుడు. – 14.

# భౌగోళిక పేర్ల సూచి


అంబాలా – 44, 48, 67, 86, 216.

అజమ్‌ఘర్ – 155, 221.

అయోధ్య – 75, 106, 114, 155–58, 164, 167–69, 171–77, 179, 180, 182, 188, 189, 199, 200, 207, 208, 210, 212, 213, 215, 216, 220, 222, 224, 228, 232.

అలంబాగ్ – 153, 154, 220, 231, 232.

అలహాబాదు – 44, 115, 120, 121, 151, 154, 157, 211, 219, 225, 227–29.

అలివాల్ – 168.

అహమదాబాద్ – 227.

ఆగ్రా – 44, 63, 91, 92, 105, 106, 108, 114, 121, 154, 218, 221, 225, 227, 229.

ఆరా – 107.

ఆర్వా – 130.

అలీపూర్ – 89.

ఇందూర్ – 71, 91, 108, 121, 220, 227.

ఉదయపూర్ – 211.

ఒరిస్సా – 26, 40.

ఔరంగాబాద్ – 61, 71, 108, 109.

కద్వా – 221.

కట్మాండూ – 223.

కవరా – 84.

కమములు – 14, 36.

కన్యాకుమారి – 122, 227.

కరాచీ – 128, 131.

కర్ణాటకము – 27.

కర్నాల్ – 89, 90.

కలకత్తా – 27, 36, 39, 45, 49,

60, 65, 71, 72, 98, 99, 107, 108, 115, 120, 121, 128, 130, 142, 149, 183, 205, 211, 213, 215, 216, 219, 221, 226, 227, 231.
కసౌలి – 86.
కాన్పూర్ – 75, 91–94, 106, 107, 114, 115, 120, 146, 147, 152, 155, 157, 170, 187, 200, 218–21, 225–28, 231.
కాల్పి – 153, 155, 189, 198–201, 221, 223.
కాశ్మీర్ – 69, 122, 125, 136, 137, 227.
కుంచ్ – 223.
కొల్హాపూర్ – 108.
కొలెరూన్ – 82.

ఖాన్‌దేష్ – 36, 109.

గంగ – 90, 93, 106–08, 115, 120, 151, 155, 183, 199, 200, 216, 226, 229, 232.
గ్రాకోట – 223.
గ్వాలియర్ – 50, 75, 120, 121, 130, 146, 150, 151, 201, 202, 211, 212, 223, 226, 227.
గుజరాత్ – 28, 94.
గోగ్రా – 189, 222.
గోమతి – 155, 157.
గోరఖ్‌పూర్ – 155, 183, 201.

ఘాజీపూర్ – 107.

చంబల్ – 130.

ఛత్రా – 221.

జగదీశపూర్ – 200, 210.
జబ్బల్‌పూర్ – 130.
జయపూర్ – 211.
జలంధర్ – 86, 87.
జాన్‌పూర్ – 155, 157.
జీలమ్ – 94.

ఝాన్సీ – 71, 189, 223.

డక్కన్ – 109.
డక్కన్ పర్వతపంక్తి – 94.
డగ్‌షేర్ – 86.
డేరా ఇస్మాయిల్ ఖాన్ – 212.

ఢాక్కా – 18, 112, 202.
ఢిల్లీ – 44–48, 58, 60, 63–68, 70, 71, 75, 86, 88–92, 109, 111–16, 118–20, 122–25, 130–35, 151, 155, 159, 166, 168, 182, 189, 194,

201, 202, 212, 213, 217, 220, 221, 225, 227, 229, 230.

దీనాపూర్ – 94, 107, 120, 121, 126, 146, 200, 201, 226–28.
దోఆబ్ – 90, 121, 146, 159, 183, 199, 200, 201, 228.

ధోల్‌పూర్ – 130.

నర్మద – 229.
నసీరాబాద్ – 91, 130.
నాగపూర్ – 94, 108, 109, 189, 227.
నాగోడ్ – 130.
నీమచ్ – 91.
నేపాల్ – 115, 155, 170, 199, 223.
నామ్రహ్ – 217.

పంజాబ్ – 28, 49, 67, 71, 83, 87–89, 91, 94, 116–19, 121, 125, 131, 168, 195, 214, 216, 227.
పండర్‌పూర్ – 94.
పూరి – 212.
పశ్చిమోత్తర రాష్ట్రాలు – 51, 91, 123.
పాట్నా – 94.
పాటియాలా – 218, 221.
పిండి (రావల్‌పిండి) – 111.
పూనా – 36.
పెషావర్ – 50, 71, 94, 101, 117, 217.

ఫతేఘర్ – 218, 221.
ఫతేపూర్ – 93, 106, 119, 120.
ఫత్తెహాబాద్ – 91.
ఫరుఖాబాద్ – 218, 221.
ఫిరోజ్‌పూర్ – 45, 62, 116, 217.
ఫిల్లవుర్ – 48, 86.
ఫెరోజిషా – 168.
ఫైజాబాద్ – 120, 222.

బంకూరా – 216.
బక్సార్ – 200.
బర్హంపూర్ – 43, 107, 216.
బరేలీ – 90, 183, 189, 198–200, 218, 222, 224.
బస్తీ – 89.
బాందా – 126, 189.
బారక్‌పూర్ – 216.
బిఠూర్ – 92, 93, 106, 120, 150, 216, 219.
బీహార్ – 27, 106, 107, 121, 201.
బుందేల్‌ఖండ్ – 75, 159, 167, 183, 189, 212.
బుష్హైర్ – 45, 73.
బెంగాల్ – 14, 20, 27, 40, 43,

44, 47–50, 60–62, 65, 71, 87, 92, 94, 97, 107, 108, 121, 130, 156, 178, 184, 195, 196, 216, 219, 228.
బెంగుళూర్ – 102.
బెనారెస్ – 60, 93, 94, 106, 107, 121, 219, 225, 227, 228.
బేరార్ – 56.
బీహార్ – 130.
బొంబాయి – 27, 40, 44, 45, 51, 58, 61, 67, 87, 88, 91, 97–99, 125, 128, 228, 229.
బొంబాయి రాష్ట్రం – 50, 71, 94, 108, 121, 122, 184, 195, 212, 216, 219, 226, 227.

భరత్‌పూర్ – 92.

మథుర – 120.
మద్రాసు – 27, 40, 44, 61, 63, 67, 93, 97–99, 128, 228, 229.
మద్రాసు రాష్ట్రం –50, 71, 78, 80, 94, 109, 121, 184, 195, 216, 219, 225, 227.
మర్దాన్ – 217.
మలబారు కోస్తా (తీరం) – 84.
మహౌ – 71, 91, 108, 109.
మాల్వా – 109.
మీరట్ – 45, 65, 67, 86, 87, 90, 102, 112, 155, 216–18.
మీర్జాపూర్ – 94, 107, 121, 228.
ముడ్కి – 168.
మురాదాబాద్ – 90, 218, 222.
ముల్తాన్ – 131.
మూర్షిదాబాద్ – 216.
మైన్‌పూరి – 218, 221.
మైనూర్ – 94.

యమునా – 67, 91, 108, 118, 120, 124, 153, 155, 159.

రంగూన్ – 215, 221.
రంగ్‌పూర్ – 126.
రాజపుత్రస్థానం (రాజపుటానా) – 48, 188, 190, 211.
రాణీగంజ్ – 216.
రాస్త్రి – 223.
రావల్‌పిండి (పిండి) – 102.
రాహట్‌ఘర్ – 223.
రేవా – 130.
రోహిల్‌ఖండ్ – 75, 87, 91, 118, 155, 157, 159, 167, 182, 183, 188, 189,

199, 201, 203, 208, 212.

లక్నో – 44, 49, 62, 91, 93, 106, 111, 114, 115, 120, 146, 152–57, 159–62, 166–68, 170, 171, 175, 182, 183, 185–89, 198, 199, 216, 220, 222, 224, 231, 232.
లాహోర్ – 45, 63, 90, 125, 131, 217, 220.
లూధియానా – 83, 86, 91.

వింధ్య – 91, 201.
వూలిచ్ (ఇంగ్లండు) – 146.

షహాబాద్ – 107.
షిగంజ్ – 209, 210.
షజహాన్‌పూర్ – 199, 200, 222.
షికార్‌పూర్ – 90, 131.

సట్లెజ్ – 48.
సతారా – 55, 56, 94.
సాగర్ – 71, 94, 121, 155, 223.
సింధు రాష్ట్రం – 28, 101, 130.
సింహళం – 128.
సిమ్లా – 217.
సియాల్‌కోట్ – 94.
సిర్సా – 71, 91.
సీతాపూర్ – 159.
సుబాతూ – 86.
సుల్తాన్‌పూర్ – 155, 157.
సుప్రియా – 91.
సోన్ – 107.

హజారీబాగ్ – 221.
హరిద్వార్ – 39.
హిమాలయ పర్వతాలు – 14, 201.
హిస్సార్ – 91, 120.
హీరట్ – 50, 73.
హుగ్లీ – 216.
హోల్కార్ – 109, 220.
హైదరాబాద్ నగరం (సింధు రాష్ట్రం) – 61, 108.
హైదరాబాద్ పట్నం – 109, 131.
హైద్రాబాద్ రాజ్యం – 94

పాఠకులకు మనవి

ఈ పుస్తకం అనువాదాన్ని గురించీ, కూర్పును గురించీ మీ అభిప్రాయాలను "ప్రగతి" ప్రచురణాలయానికి తెలుపండి.

మీ అభిప్రాయాలను ఈకింది చిరునామాకు పంపండి:

Progress Publishers
17, Zubovsky Boulevard
Moscow, USSR

మా ప్రచురణలు దొరికే చోట్లు:

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
చంద్రం బిల్డింగ్స్
విజయవాడ – 520 004

విశాలాంధ్ర బుక్ హౌస్
ఏలూరు రోడ్డు
విజయవాడ – 520 002

విశాలాంధ్ర బుక్ హౌస్
బాంక్ రోడ్డు
హైదరాబాదు – 500 001

విశాలాంధ్ర బుక్ హౌస్
కాలేజి రోడ్డు
అనంతపురం – 515 004

విశాలాంధ్ర బుక్ హౌస్
11–1–37 గాంధీ రోడ్డు
తిరుపతి – 517 501

విశాలాంధ్ర బుక్ హౌస్
సూపర్ బజారు ఎదుట
మెయిన్ రోడ్డు
విశాఖపట్నం – 530 002

విశాలాంధ్ర బుక్ హౌస్
మెయిన్ రోడ్డు
హనుమకొండ
వరంగల్ 506 011

విశాలాంధ్ర బుక్ హౌస్
మెయిన్ రోడ్డు
అరండల్ పేట
గుంటూరు – 522 002

500 044.